UNIVERSAL
LIBRARY
OU_204030
UNIVERSAL
LIBRARY

P.—730—28-4-81—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY P.G. 12828

Call No. 7920 B91N Accession No.

Author బమ్మ రామచంద్ర శర్మ.

Title నవనాథ చరిత్రము. 1923.

This book should be returned on or before the date last marked below

శ్రీ [illegible],
బుక్సెల్లర్స్ అండ్ పబ్లిషర్స్
సికింద్రాబాదు (దక్షిణ)

శ్రీరస్తు.

శ్రీగురుదత్తాత్రేయాయనమః.

భక్తిసార

నవనాథచరిత్రము

అను

మహాసిద్ధజనకథామృతంబు

నైజాం యిలాఖా సదాశివపేట వాస్తవ్యుండగు

బచ్చురామన్నగుప్తచే రచియింపఁబడి

శికింద్రాబాద్. (దక్కన్)

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారిచేఁ

ప్రకటితము.

1923.

All Rights Reserved.

Printed
at the "VAVILLA" Press,
Madras.—1923.

విషయసూచిక.

అధ్యాయము.			పుట.
౧	శ్రీకృష్ణుండు కలియుగజనోద్ధారముకై యోచించుట	...	9
,,	శ్రీకృష్ణుండు నవనారాయణులను జన్మంబులు గైకొనుతెఱంగెఱింగించుట	...	10
,,	మత్స్యేంద్రనాథ జన్మచరిత్ర ప్రారంభము	...	13
౨	మత్స్యేంద్రునకు దత్తాత్రేయులవా రనుగ్రహం బొసంగుట	...	16
,,	మత్స్యేంద్రనాథుండు తపంబుచే నంబికాప్రత్యక్షంబు వడసి శాబరీమంత్రశాస్త్రరచనానుకూలక్రమం బెఱుంగుట	...	18
,,	మత్స్యేంద్రనాథుం డంబికచే ననుజ్ఞాతుండై మార్తాండమహాగ్రహంబునకేగి నాగాశ్వత్థవృక్షస్థ నిఖిలదేవతా ప్రత్యక్షంబు వడసి వరంబులు గొనుట.	...	19
,,	మత్స్యేంద్రనాథుండు చంద్రగిరిగ్రామంబున సరస్వతీదేవికి సంతానంబుకై భస్మప్రసాదం బిడుట	...	,,
౩	మత్స్యేంద్రనాథుండు రామేశ్వరంబున కరిగి యాంజనేయునితో యుద్ధంబొనర్చి జయంబు గొనుట	...	21
,,	హనుమంతుండు మత్స్యేంద్రనాథునకు స్త్రీరాజ్యాధిపత్యంబున కొడంబఱచుట	...	23
౪	మత్స్యేంద్రనాథుండు భైరవాదులజయించి హింగళాదేవినిదర్శించుట.		25
౫	మత్స్యేంద్రనాథుం డష్టభేతాలాదులతో యుద్ధంబొనర్చుట	...	29
౬	మత్స్యేంద్రనాథుండు మహాకాళిచే యుద్ధంబొనర్చుట	...	33
౭	మత్స్యేంద్రనాథుండు వీరభద్రునిచే యుద్ధంబొనర్చి జయంబుగొనుట.		37
,,	మత్స్యేంద్రనాథుండు వజ్రభగవతీదేవిని సంతుష్టపఱచుట	...	41
౮	మత్స్యేంద్రనాథుం డయోధ్యానగరంబున పాశుపతనామపృథ్వీశునకై సూర్యునిచే యుద్ధంబొనర్చి శ్రీరామచంద్రుని ప్రత్యక్షం బొనర్చుట	...	42
౯	మత్స్యేంద్రనాథుండు చంద్రగిరిగ్రామంబున గర్తంబునుండి గోరక్షనాథుని దీయుట	...	47
,,	మత్స్యేంద్రనాథుండు గోరక్షనాథసహితుండై కనకగిరికేగుట	...	49
౧౦	గోరక్షనాథుండు సంజీవినీమంత్రయోగంబున మృత్పుత్తలిచే గహినీనాథునిజన్మం బొనర్చుట	...	52

అధ్యాయము.		పుట.
౧౧	మత్స్యేంద్రనాథుండు బదరికాశ్రమంబున గోరక్షనాథుని తపంబునకై నియమించి యరుగుట ...	56
,,	మత్స్యేంద్రనాథుండు రామేశ్వరంబునకేగి మారుతాత్మజానిసమేతుండై మైనాకినీరాణిం జేరంజనుట ...	57
,,	జాలంధరనాథజన్మకథాప్రారంభము ...	59
౧౨	జాలంధరనాథుండు దత్తానుగ్రహంబుచే మంత్రార్థంబు లెఱింగి తపం బొనరించుట ...	62
,,	కానీఫనాథజన్మకథాప్రారంభము ...	64
,,	జాలంధరనాథుండు కానీఫనాథున కనుగ్రహం బొసఁగి యక్కానీఫునికి నిర్జరులచే వరంబు లిప్పించుట ...	66
౧౩	జాలంధరకానీఫనాథులు శివునియనుమతిచే శాబరీమంత్రశాస్త్రంబు కల్పించి కానీఫనాథుండు తపంబాచరించుచుండ జాలంధరనాథుండు తీర్థయాత్రోన్ముఖుండై వెడలుట ...	68
,,	జాలంధరనాథుండు హేలాపట్టణంబు ప్రవేశించి మైనావతీరాణి కనుగ్రహంబొసఁగుట ...	70
౧౪	జాలంధరనాథుండు మైనావతీరాణికతంబున గోపీచందమహారాజుచే కూపంబున బడియుండుట ...	77
౧౫	గోరక్షనాథుండు గురువును వెదకుచు దేశంబులఁ గ్రుమ్మరుట ...	79
,,	కానీఫనాథుండు దేశంబులు గ్రుమ్మరుచు స్త్రీరాజ్యంబున కేగు నెడ మారుతాత్మజుం డిడుములబడి సఖ్యం బొనగూర్చుకొనుట ...	81
౧౬	కానీఫనాథుండు శృంగమురుడీనగరంబు ప్రవేశించి మత్స్యేంద్రనాథునిచే నాతిథ్యంబుగొని చనుచు గోరక్షనాథునిచే దనగురువుజాడ లెఱింగి హేలాపట్టణంబు ప్రవేశించుట ...	86
౧౭	గోపీచందుండు కానీఫనాథునిసహాయంబుచే కూపస్థితజాలంధరనాథుని పైకిదీసి యనుగ్రహంబు వడసి తపంబునకై చనుట ...	93
౧౮	గోపీచందనృపుండు హేలాపట్టణంబు ప్రవేశించి దనకై గలతించినచంపావతీదేవిని బ్రతికించుట ...	100
౧౯	గోరక్షనాథుండు శృంగమురుడీనగరంబున కేగు నెడ నాంజనేయుండు కష్టంబుల బడి శ్రీరామచంద్రసహితుండై గోరక్షుని జేరంబోవుట.	107
౨౦	శృంగమురుడీనగరాధిపతియగు మైనాకినీరాణి పూర్వచరిత్ర ...	113
,,	గోరక్షుండు శృంగమురుడీనగరంబు ప్రవేశించి మత్స్యేంద్రనాథుని హెచ్చరించుట ...	116
౨౧	గోరక్షుండు మత్స్యేంద్రనాథుని వెంటగొని చనుట ...	121
౨౨	మైనాకినీరాణి సింహళద్వీపంబు ప్రవేశించుట ...	129
,,	గోరక్షనాథుండు మీననాథునిప్రాణంబు లపహరించి పునరుత్థితుం జేయుట.	130

అధ్యాయము.		పుట.
23	గోరక్షుండు స్వర్ణశిష్టికల పారవైచి యొకకొండను స్వర్ణంబుగా నొనర్చి దేవతలకు విందొనర్చుట ...	136
,,	మత్స్యేంద్రనాథుండు గహినీనాథునకు మంత్రార్థంబు లుపదేశించుట.	142
24	భర్తరీనాథుని జన్మచరిత్రము ...	143
,,	భర్తరీనాథుండు జయసింగభాటునివెంట కాశీక్షేత్రంబు బ్రవేశించుట	145
25	భర్తరీనాథుం డవంతికాపురంబున కేగుట ...	149
,,	సురోచనగంధర్వునిచరిత్రము ...	150
26	విక్రమార్కుని జన్మవృత్తాంతము ...	156
,,	విక్రమభర్తరీనాథులకు భ్రాతృభావసఖ్యం బొనగూడుట ...	161
27	విక్రమార్కుండు శుభవిక్రమనృపాలుని కూతును వివాహంబాడి తద్రాజ్యపట్టాభిషిక్తుం డగుటయు నద్దభర్తరీనాథుండు సుమంతికనామసచివోత్తముకూతును వివాహంబాడి యువరాజ్యపట్టాభిషిక్తుం డగుట ...	163
,,	భర్తరీనాథుండు వేటకై యరణ్యంబునకేగి భ్రమియించునెడ శ్రీగురుదత్తాత్రేయసందర్శనం బగుట ...	169
28	భర్తరీనాథుండు పురంబు ప్రవేశించి పింగళాదేవితో పణంబొనర్చి యరణ్యంబునకేగి భర్తరీనాథుండు మృతుండయ్యెనని వార్తనంపనప్పింగళాదేవిప్రాణంబులం బాయుట తదుపరి భర్తరీనాథుండు పింగళావియోగదుఃఖంబుచే శ్మశానంబున నివసించి దుఃఖించుట.	172
29	గోరక్షనాథుండు శ్రీగురుదత్తాత్రేయానుమతిచే భర్తరీనాథునకు వైరాగ్యంబు గల్పించి వెంటగొని చనుట ...	179
30	భర్తరీనాథుండు దత్తానుగ్రహంబుచే బదరికాశ్రమంబున తపం బొనరించుట ...	186
,,	గోరక్షుండు మత్స్యేంద్రనాథుని దోడ్కొని శ్రీదత్తాత్రేయసన్నిధి కేగుచుండుట ...	187
,,	శశాంగనృపపుత్రుండగు కృష్ణాగర (సారంగధర) చరిత్ర ప్రారంభము.	188
31	కరపాదఖండితుండగు కృష్ణాగరుని మత్స్యేంద్రగోరక్షనాథులు గొనిపోయి తపంబునకై నియమించుట ...	193
32	మత్స్యేంద్రగోరక్షనాథులు దత్తానుమతిచే నానాతీర్థంబులు గ్రుమ్మరుచుండ మత్స్యేంద్రనాథుండు త్రివిక్రమనృపకళేబరంబున పరకాయయోగంబున ప్రవేశించి రాజ్యం బేలునెడ నమ్మత్స్యేంద్రకళేబరంబు రేవతీదేవిచే శిథిలం బొనర్పబడుట ...	200
33	గోరక్షుండు సేద్యకారునకు వైరాగ్యంబు గల్పించి జని చౌరంగనాథుని వెంటగొని వీరభద్రునితో మహాయుద్ధం బొనర్చి ప్రాణంబు లపహరించుట ...	207

అధ్యాయము.			పుట.
౩౪	గోరక్షనాథుండు వీరభద్రుని పునరుత్థితుంజేసి గురుకళేబరంబుగొని ధర్మనాథునకు పట్టాభిషేకంబొనర్చి యేగుచు మాణిభద్రున కనుగ్రహం బొసఁగి వెంటగొని పునఃప్రయాగానగరంబునకేతెంచి ధర్మనాథున కనుగ్రహం బొసంగుట	...	217
,,	రేవణసిద్ధజన్మకథాప్రారంభము	...	222
౩౫	రేవణసిద్ధుఁడు దత్తానుగ్రహంబుచే మహామాసిద్ధకౌతుకంబులు జూపి పిదప సిద్ధుండై తీర్థంబులు గ్రుమ్మరుచు సారస్వతనామవిప్రునికై కైలాసంబున కేగుట	...	224
౩౬	రేవణసిద్ధుఁడు శివునిచే బోరి సారస్వతవిప్రుని పుత్రషట్కంబును గొని తెచ్చుట	...	234
,,	నటసిద్ధ నాగనాథ జన్మకథాప్రారంభము	...	237
,,	నాగనాథుఁడు శ్రీగురుదర్శనార్థంబై కొల్హాపురంబున కౌతుకంబులు జేయుట	...	242
౩౭	నాగనాథుఁడు మత్స్యేంద్రనాథునితో యుద్ధంబొనర్చుట	...	243
౩౮	చర్పటనాథుని జన్మచరిత్రము	...	250
౩౯	చర్పటనాథుని మహాయుద్ధము	...	259
౪౦	దేవేంద్రుఁడు హవనంబొనర్చి నాథునిచే శాపంబు నొందుట	...	268
,,	చత్వారింశత్యధ్యాయంబుల ఫలశ్రుతి	...	272

శుద్ధపత్రిక.

పేజి.	పఙ్క్తి.	తప్పు.	ఒప్పు.
5	13	బచ్చురామన్నగుప్త	బచ్చురామన్నగుప్త సదాశివపేట
7	22	సుఖదమగురో	సుఖదమగుయో
9	3	గోచరంబగు	గోచరంబులగు
18	17	బోవవీరులు	బావనవీరులు
25	8	కలువలిచూచి	కలువలిచూలి
25	11	మానినాథుడు	మీననాథుడు
33	24	మూర్ఖా	మూర్ఖా
41	15	ఆపోస్త్రము	ఆబస్త్రము
67	29	విపరీతక్షుణతంబెవ	విపరీతక్షోభంబెవ
90	3	ఱ	బు
94	18	దర్శననాపేక్ష	దర్శనాపేక్ష
97	27	భవదా్రయ	భవదాశ్రయ
110	13	పరితపించు	పరితపించుచు
114	18	దుష్టే	దుష్టై
117	3	సంచ్ఛార్య	సచ్ఛార్య
118	1	వగజగి	వగజిగి
,,	18	కత్ృ	కృత
126	11	పూరీత	పూరిత
127	5	సాయకేక్షణకుచధర	సాయకేక్షణాకుచకుధర
,,	27	సుగుణజలధుండగు	సుగుణజలధియగు
145	4	హరిగణంబేకతంబున	హరిణంబేకతంబున
161	2	నివసియించి	నివసించి
162	15	బంధులమని	బంధువులమని
164	2	కరికంభంబులపై	కరికుంభంబులపై
167	26	జేరెన్వు	జేరెను
,,	27	జేరఅచి	జేర్పఆచి
168	15	మూక్తికులై	మూక్తికుడై
181	19	నన్నిశంబు	నన్నునిశంబు

శుద్ధపత్రిక.

పేజీ.	పఙ్క్తి.	తప్పు.	ఒప్పు.
191	7	జన్మ్రి	జన్మ
197	5	మంత్రమత్రార్థ	మంత్రమంత్రార్థ
206	4	బౌర్చెను	బౌనర్చెను
210	1	మంత్రాదిదేవత	మంత్రాధిదేవత
212	29	శరీంబు	శరీరంబు
214	14	శత్రుకులమర్థను	శత్రుకులమర్దను
,,	15	కృతాంతుల	కృతాంతుని
,,	25	బాణాసనాధ్యాయు	బాణాసనాద్యాయు
215	19	పిశితాశుల	పిశితాశనుల
,,	25	నివహంబు	నివహంబులు
229	15	దత్తద్దర్శనో	దత్తదర్శనో
237	25	ఋతిక్సమూ	ఋత్విక్సమూ
242	24	ననుభుజియింప	నన్నుభుజియింప
245	4	ధాన్యభిక్షుం	ధాన్యభిక్షుం
,,	22	నిగమనుతపదముల	నిగమనుతపదకముల
246	24	గరినారపర్వతము	గిరినారపర్వతము
250	8	సహిగర్భోద్భవుని	నహిగర్భోద్భవుని
251	1	మండసిక	మండపిక
252	26	గురిపించిరి	గురిపించెను
253	21	ప్రసన్నులై	ప్రసన్నంబై
,,	22	యొసంగిరి	యొసంగెను
254	2	నుపేక్షిం	నపేక్షిం
263	12	యిలంబడుదురే	యిలంబడునే
,,	19	భవద్వాజాస్త్ర	భవద్వజ్రాస్త్ర
265	17	రుధిరవక్త్రులై	రుధిరనిర్గతవక్త్రులై
267	11	కెఱింగించి	కెఱంగించి
271	4	రంధంబున	రంధ్రంబున
274	30	కాథాభాగంబు	కథాభాగంబు
275	12	లభియింతు	లభియించు

ఉపోద్ఘాతము.

సుధీమణులారా! నిఖిలచరాచరప్రపంచం బెవ్వనిచే నెవ్విధమున సృజియింపంబడియెనో తత్ప్రపంచాంతర్గత నరమృగపశు పక్షికీటకాద్యనేక ప్రాణిసముదయంబు లేకతంబున సుఖదుఃఖాస్పదంబులయ్యెనో యందు మనుజులకు బధిరత్వ అంధత్వ మూకత్వ పంగుత్వాది నానావిధ వికలాంగధర్మంబులును రక్తశ్వేత కృష్ణాదిరూపభేదంబులు నుచ్చనీచాదిదశాభేదంబులు నేకతంబున గలిగెనో తత్తత్కారణంబులు మనోగోచరంబులుగాక కొందఱు ప్రకృతిజన్యంబులనియు, నొకకొందఱు పరమేశ్వరలీలావినోదంబు లనియు, మఱికొందఱు పురాకృతకర్మజనితఫలంబు లనియు, మఱియు భగవంతుండు సగుణుండు ప్రకృతిసహితుం డనియు, దృశ్యమానప్రపంచంబీశ్వరకల్పితంబనియు, జీవులందఱు భగవద్గుణవర్ణనచే సామీప్యసాలోక్య సారూప్య ముక్తిత్రయమును క్రమముగా పొందుదు రనియు, మఱికొందఱు ప్రకృతికల్పితం బనియు, బ్రహ్మవస్తువు నిర్గుణము నిరహంకారము కాలత్రయాబాధ్యము సమస్తదేశసంగతము కంఠగతచామీకరంబుగ ప్రాప్య మనియు పెక్కుభంగుల నిరూపించుచు పరతత్వావిర్భాత నిగమంబులనే ప్రమాణంబులుగా గొని నిగమవేత్తలగు ననేకమహర్షు లనేకభిన్నాభిప్రాయంబులు నిగమవిరుద్ధములు గాకుండ వెల్లడిపఱచినారు. ఇటుల భిన్నాభిప్రాయంబులుండినను యన్నియు స్వేశ్వరవాదములేగాన స్థూలారుంధతిన్యాయంబున ప్రాప్యవస్తువ యొక్కటియేగాన వారు శిష్యబుద్ధ్యనుసారముగా నాయాయభిప్రాయానుసారిమతంబుల నిరూపణజేసిరి. ఈయభిప్రాయమే మహిమ్నస్తోత్రమందు-శ్లో. "త్రయీసాంఖ్యం యోగః పశుపతిమతం వైష్ణవమితి, ప్రభిన్నే ప్రస్థానే పరమిద మదః పథ్యమితిచ, రుచీనాం వైచిత్ర్యా దృజుకుటిలనానాపదజుషాం, నృణా మేకోగమ్య స్త్వమసి పయసా మర్ణవఇవ" అను పుష్ప

దంతుఁడు నిరూపించిన యభిప్రాయమును వ్యాఖ్యాతయగు మధుసూదన సరస్వతీస్వాములవారు వ్యాఖ్యానమందు సర్వప్రస్థానములను అద్వైతబ్రహ్మమందు సాక్షాత్పరంపరగా తాత్పర్యమును విస్తరించి నిరూపించినారు. ఇటులుండ నంతకంతకు విపరీతార్థంబు లధికంబై కొందఱు నిరీశ్వరవాదులు నొకకొందఱు దేహాత్మవాదులు మఱికొందఱు నంతఃకరణాత్మవాదులునై జగత్తు స్వభావజమనియు దేహమె ఆత్మయనియు బుద్ధియె దైవంబనియు పలు తెఱంగుల పలవించుచు శ్రుతిస్మృతులకు తత్తదనుకూలముగా నర్థములు గల్పించుచుండ నయ్యవి శాఖోపశాఖలై మిన్నంది నిఖిలప్రపంచవ్యాపకంబులై ధర్మవిరుద్ధము లగుచుండ నప్పుడప్పు డప్పరాత్పరుండగు శ్రీమన్నారాయణుండు శ్లో. "పరిత్రాణాయ సాధూనాం వినాశాయచదుష్కృతాం, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" అను వచనానుసారంబుగ వ్యాసాద్యనేకయవతారంబుల నవతరించి వేదవిరుద్ధమతంబుల ఖండించియు తనవి సనక లీలామానుషవిగ్రహంబున శ్రీకృష్ణరూపంబున ద్వాపరాంతంబున నవతరించి దుష్టులను శిక్షించి శిష్టులను రక్షించుచు నర్జునోపదేశవ్యాజంబున నద్వైతంబును సర్వజనులకు బాహాటంబుగా తెలియజేసి తదుపరి-శ్లో. "జితోధర్మో హ్యధర్మేణ సత్యంచైవానృతేనచ, జితాశ్చోరైస్తు రాజానః స్త్రీభిశ్చ పురుషాః కలౌ, సీదంతి చాగ్నిహోత్రాణి గురుపూజా ప్రణశ్యతి, కుమార్యశ్చ ప్రసూయంతే తస్మిన్ కలి
2 గే సతి" అనునట్లు అధర్మానృత చోరవ్యాప్తి గురుపూజాగ్నిహో
26 నాశరూపములు మొదలగు భావికాలకలియుగపాపకృత్యంబులచే
తిమతభేదంబు లెఱుంగక నిషిద్ధపదార్థంబుల పరిగ్రహించుచు నొకనొకరు నిందించుకొనుచు యుక్తాయుక్తవివేకశూన్యులై పరమేశ్వరతత్త్వజ్ఞానం బెఱుంగక ననేక నరకంబులపాలగుదురని యెదనెంచి పతితపావనుండను తనబిరుదును సార్థకపఱచదలంచి వ్యాసవాల్మీకిశుకముఖ్యమహర్షులతో నాలోచించి మీర లయ్యుగంబున పుణ్యప్రదేశంబులనవతరించి యనేక వేదార్థరహస్యంబుల వెల్లడిపఱచి మాయామయసంసారబద్ధబుద్ధులగు దుర్జనుల నుద్ధరింపుఁడని యనుజ్ఞనొసఁగి యాపిదప నిజాంశజాతులగు నవనారాయణుల నుద్దేశించి వ్యాసాదిమహర్షులజన్మంబుల తెఱంగెఱుంగించి మీరున్ను ఆయా పుణ్యప్రదేశంబుల జన్మం

బులు గైకొని భక్తిజ్ఞానవైరాగ్యపరిపూర్ణులై నానా దేశంబుల సంచరించుచు-శ్లో. "కృతే త్వస్థిగతాః ప్రాణాః త్రేతాయాం మాంసమాశ్రితాః, ద్వాపరేరుధిరంచైవ కలౌత్వన్నంసమాశ్రితాః" అనునట్లు కలియుగమానవులు జపతపాదిసాధనంబుల ముక్తింగాంచుట దుర్లభంబుగాన సులభాత్మానాత్మవిచారంబుచే మోక్షంబు గాంచుటకై యుష్మదజ్ఞానసూర్యోదయంబున మూఢజనాజ్ఞానతిమిరంబు బాఁదోలి తత్తచ్ఛిష్యబుద్ధ్యనుసారంబుగ భక్తిజ్ఞానవైరాగ్యంబుల నెలకొల్పుఁడని యాజ్ఞనొసగ నమ్మహామహులత్యంతకుతుకంబున వల్లెయని కలిగతాబ్దంబులు రెండువేల యేడునూర్లు మొదలుకొని మూఁడువేలసంవత్సరంబులవరకుజన్మంబులు గైకొని నిఖిలలోకగీయమాన ఘనయోగపరిపూర్ణమహాసిద్ధులై సంచరించుచు జన్మస్థలంబులు వేరైనను గురుతపస్థానంబు లొకటిగా నొనర్చుకొని నిజనారాయణాంశజత్వముజనులకువ్యక్తపఱచుచుశిష్యజనవిశ్వాసముకొఱకైయణిమాద్యష్టైశ్వర్యంబులను వాతాకర్షణాద్యనేకమహదస్త్రవిద్యలును మృతసంజీవిని మొదలగు మహామంత్రంబులును ప్రత్యక్షానుభవంబుగ సమయానుకూలంబుల బ్రకటించి తపోబలగుణాతిశయంబులు వెల్లడి యొనర్చుచును పూర్వకాలవైదిక మహామంత్రంబులు శాపహతంబులనియు తచ్ఛాపమోచనాదివిధు లీకలియుగజనులచే నాచరింపఁబడుట దుస్తరంబని యూహించి సర్వతంత్రస్వతంత్రులుగాన దయామయహృదయులై దమతమతపోయోగంబున నిఖిలమంత్రాధిదేవతల ప్రత్యక్షంబు బడసి స్వకల్పితమంత్రకోటి పఠనమాత్రంబున ఫలప్రదము లగునట్లు వరంబులు గ్రహించి యప్రతిహతశాబరీమంత్రరాజంబులు కలియుగజనానుకూలంబుగ గల్పించి సంసారార్ణవనిమగ్నుల నుద్ధరించుచు నిటుల సంప్రజ్ఞాతాసంప్రజ్ఞాత సమాధిద్వయవిశిష్టయోగాభ్యాస మహిమచే యోగీశ్వరేశ్వరులై విలసిల్లు వీరిజననాదిచరిత్రము పురుషార్థచతుష్టయప్రదమనుటకు సందియము లేదు. ఏమహామహుల పరిపూర్ణవైరాగ్యతపోబలాతిశయంబులు హరిహరబ్రహ్మేంద్రాగ్నియమవరుణకుబేరాది బృందారకబృందంబులు బొగడుచుండునో, ఏయోగి సార్వభౌముల కృపాకటాక్షవీక్షణంబులచే తక్షణంబు న మర్త్యులమర్త్యులై విలసిల్లెదరో అయ్యతులాత్ముల జననాదిపవిత్రచరి

త్ర పారాయణంబుచే శతృకృతవశ్యాకర్షణప్రముఖషట్ప్రయోగంబులును భూతప్రేతపిశాచశాకినీడాకినీబ్రహ్మగ్రహాది నానావిధగ్రహణోపద్రవంబులును సర్పవృశ్చిక చోరాగ్నిభయంబులును బ్రహ్మహత్యాది మహాపాతకంబులును వాతహతజీమూతంబుపగిది దొలంగి పుత్రపౌత్ర ధనధాన్యసంపత్సమృద్ధు లయ్యెదరనుట కొకవింత యగునే. పెక్కులేల? భవిష్యత్పురాణద్వితీయతృతీయఖండంబులలో జయదేవ నామదేవ కబీరదాసాది భక్తాగ్రేసరుల జన్మచరిత్రంబులును, శంకరాచార్య మధ్వాచార్య రామానుజాచార్య దుండిరాజ కాళిదాసప్రముఖ జ్ఞానఘనుల చరిత్రంబులును, మత్స్యేంద్రనాథ గోరక్షనాథ భర్తరీనాథాదిమహాసిద్ధుల జన్మచరిత్రంబులును, పిదప శంకరాచార్యగోరక్షనాథులకు వాగ్వివాదము జరిగి తుదకు మత్రైక్యము గలిగినటులున్న వ్యాసమహర్షిచే నభివర్ణింపఁబడియె. అట్లు శంకరాచార్యులచే గొనియాడఁబడు గోరక్షసిద్ధుండీగ్రంథరాజంబు తొల్లి కీమ్యాగరభాషచే రచియించె ననంతరంబ దుండిరాజకుమారుండగు మాలూపండితుఁడు మహారాష్ట్రంబున నోవీబద్ధముగ విరచించి తద్భాషాభిజ్ఞుల యుల్లంబులు పల్లవింపం జేసెం గాని యింతవఱకీనవరసపూరితంబగు చరిత్ర శ్రేష్ఠంబు మనయాంధ్ర దేశంబున మాతృభాషను లేమిం జేసి యాంధ్ర భాషాభిజ్ఞు లీ యనుపమాన మహాసిద్ధుల యద్భుతకథామృతంబు గ్రోలకుండుట కడుంగొఱత యని దలంచి యీయాదృఙ్మహానుభావచరిత్ర రచనచే మజ్జన్మంబు పవిత్రంబగునని యోచించి యియ్యది యసాధ్యకార్యమైనను-శ్లో. "గురూణాం చరణద్వంద్వ స్మృతిలేఖకరూపిణం, మాం కృత్వావ్యచినోద్గ్రంథం నాహ మత్ర ప్రభుస్మృతః" అనునట్లు శ్రీసీతా రామచంద్రస్వరూపులగు నవనాథుల చరణసరసీరుహంబు లెద నమ్మి నిఖిలజనసాధారణంబుగ వచనశైలిని రచియింపనయ్యె తప్ప నాయం దెట్టిసమర్థత్వంబును లేదు. ఈచత్వారింశత్యధ్యాయంబులు సక్రమంబుగ పారాయణం బొనర్చినను, భక్తిసహితులై శ్రవణం బొనర్చినను, లేక పఠనాశక్తులు దృఢమనస్కులై ఏతద్గ్రంథం బనుదినంబు మత్స్యేంద్రనాథ గోరక్షనాథ గహినీనాథ జాలంధరనాథ కానీపనాథ

భర్తరీనాథ వటసిద్ధనాగనాథ రేవణసిద్ధనాథ చర్పటనాథాభిధానంబులు ధ్యానింపుచు బూజించినను చత్వారింశత్యధ్యాయంబున నిగ్రహానుగ్రహసమర్థుండగు గోరక్షమహాసిద్ధునిచే లిఖియింపంబడిన తత్తత్ఫలప్రాప్తు లగుట నిస్సంశయంబు గాన ఆర్యవర్యు లీగ్రంథస్థకథావిశేషంబులు పఠియించి సంతసించెదరని ప్రార్థించెదను. మఱియు నీగ్రంథము భక్తియేప్రధానంబుగా గొని రచియించి పండితోత్తములచేఁ బరిష్కరింపఁబడియె. పదలాలిత్యము శబ్దసౌష్ఠవంబు అర్థగాంభీర్యంబులు కొఱవలై యున్నను గుణగ్రహణపారీణులు క్షీరనీరంబులకరణి భక్తిరసపూరితంబులగు కథాభిప్రాయంబులు గ్రహించెదరని కొనియాడెదను. హస్తదోషాదితప్పులుండిన నాయందనుగ్రహించి తెలియపఱచెదరేని ద్వితీయముద్రణంబున సవరించగలను. ఇంతియ నాప్రార్థన.

ఇట్లు బుధజనకృపాభిలాషి

బచ్చు రామన్నగుప్త.

శ్రీ గురువిఠ్ఠలాయ నమః.

శా. శ్రీశుండై మరి శ్రీకళాహ్వయుఁడునై శ్రీవాణిజీవేశుఁడై
కౌశల్యంబున సర్వభూతములఁ దాఁ గల్పించి రక్షించులో
కేశుండై ఘనలీలదోఁప మనుజాధీశత్వముఁ బూని మా
నీశానీకము నేలినట్టి క్షితిజానిఁ గొల్తు శ్రీరామునిన్.

చ. జలనిధి గోష్పదంబనుచు చయ్యనదాఁటి మహోన్నతాఖిలా
చలములు కందుకంబు లనఁజాలెడి లీల నటింపఁజేయుచుఁ
ఖలులగు సోకుమూకల నఖండపరాక్రమధుర్యుఁడై వడిఁ
వలగొని మన్నిగొన్నవరవాయుసుతుఁ భజియించి మ్రొక్కెదన్.

క. ముజ్జగముల బొగడొందిను,హృజ్జనతాపత్రయాపహృతి జేయతగఁ
వెజ్జుండై విహరించిన, సజ్జనగణ రామదాసుస్వామిని దలఁతున్.

గురుపరంపరాభివర్ణన.

సీ. హంసరూపంబున నాదినారాయణుం
డజునకుఁ బరతత్వ మమర దెల్పె
బ్రహ్మ దెల్ప వసిష్ఠు పరమమౌనీంద్రుఁడై
దశరథాత్మజునకు విశదపఱచె
రామునిచే కపిధాముండు పూర్ణుఁడై
రామదాసుకు దెల్పె ప్రేమమీఱ
రామదాసుఁడు మేటిరాజయోగీశుఁడై
దేవదాసునకు దా దేటపఱచె

తే. దేవదాసుండు రఘునాథధీయుతునకు
నాత్మవిజ్ఞాన మొసఁగెంచె సతఁ డసంత

రాయునకు నయ్యనంతుఁడు రామచంద్రు
నకు నతండు వరుస కృష్ణునకును దెల్పె.

క. వరకృష్ణాహ్వయుకృపచే, పరతత్త్వవివేక మెఱిఁగి పరిపూర్ణయశః
కరుఁడై నాగాఖ్యుఁడు మద్గురువిఠ్ఠలరాయఘనునకును బోధించెన్.

క. శ్రీగురువిఠ్ఠలరాయుని, యాగమనుతపదసరోజు నత్యంతదయా
సాగరుని మదీయహృదయ, భాగంబున నిల్పిగొల్తు భవ్యచరిత్రున్.

గ్రంథాధినాయకవర్ణన.

మ. త్రిగుణంబుల్ కమలాసనాచ్యుతకపర్దిస్వాకృతుల్బూనిము
జ్జగముల్ సృష్టినొనర్చ నేల లయముల్ సల్పంగ బల్ డస్సిమేఁ
నగమై సాగరశాయియై స్వనితయై సౌఖ్యంబు జింతించి ము
మ్మొగముల్ దాల్చి మెలంగునట్టి నిఖిలాత్ముఁ గొల్తు దత్తాహ్వయున్.

క. సురనరగరుడోరగకి, న్నరవరనుత విమలచరణనలినయుగళుఁడై
గిరినారకుధరమున సుస్థిరముగ నివసించు దత్తదేవుని దలఁతున్.

సీ. మత్స్యేంద్రగోరక్షమానినాథులగొల్చి జాలంధరాఖ్యుని లీలబొగడి
కానీఫభర్తరీ జ్ఞానుల వినుతించి గహినినాథుని మహాఘనత దలఁచి
రేవణసిద్ధప్రభావంబు గొనియాడి నాగనాథునకును నతి యొనర్చి
చర్పటనాథునిచరితంబుశ్లాఘించిహరభంగచౌరంగయతుల కెఱగి

తే. మీననాథాది మునిసంఘమునకు మ్రొక్కి
ముక్తిదాయక మగునట్టి భక్తిసార
గ్రంథరాజంబు రచియింతు నాంధ్రభాష
గద్యఫణితి నఖిలజన వేద్యముగను.

క. నిరవధికసుఖదమగు యో, పరమాద్భుతనాథచరిత ప్రాశస్త్యముమున్
వరకీర్వాణగరభాషఁ, స్థిరమతిగోరక్షనాథసిద్ధుఁడు వ్రాసెన్.

క. దుండీసుతుఁడగు మాలూ, పండితుఁడు జగత్ప్రసిద్ధప్రాకృతమున బ్ర
హ్మాండోద్ధారకసిద్ధుల, దండిచరిత్రంబు పిదప దనరగ వ్రాసెన్.

క. కావున నక్కథలాంధ్రమ
హావిజ్ఞులు దెలసి మిగుల హర్షింపఁగ మ
ద్భావంబున దలఁచి దెనుఁగు
గా విరచించెదను వచనకావ్యముసరణిన్.

క. గజవదను సదయునిర్మలు
త్రిజగన్నుతపాదకమలు త్రిపురారిసుతున్
భుజగవిభూషణుని స్మృది
భజియించెద నిష్టసిద్ధి బడయుటకెపుడున్.

ఇట్లు వైశ్యకుల బచ్చువంశసంజాతుండగు యల్లయాహ్వయు
ప్రపౌత్రుండును శివలింగయాభిధానుని పౌత్రుండును
క్రిష్టయాఖ్యునిపుత్రుండును నగు రామన్ననాముడు
యిష్టదేవతావందనంబు లాచరించి
యీగ్రంథరాజంబు
ప్రారంభించెను.

శ్రీ విఠ్ఠలాయ గురవే నమః.

భక్తిసార

నవనాథచరిత్రము

ప్రథమాధ్యాయము.

శ్రీకృష్ణుండు కలియుగజనోద్ధారమునకై యోచించుట.

శ్రీకాంతామణి హృత్కమల విహారుండగు పుండరీకాక్షుండు ద్వాపరంబున శ్రీకృష్ణుండై యవాఙ్మానసగోచరంబగు లీలావినోదంబులు సల్పుచు శిష్టజనసంరక్షణార్థంబై పెక్కుభంగుల నుక్కలుల యుక్కడంచి ముదాన్వితహృదయుండై మెలంగుచు తద్యుగాంతంబున భవిష్యత్కలికాలపామరజనోద్ధరణంబుకై "ధర్మసంస్థాపనార్థాయ సంభవామియుగేయుగే" అను గీతావచనానుసారంబుగ యోచించి యయ్యఖిలాండకోటిబ్రహ్మాండనాయకుండు కలియుగంబున జ్ఞానదేవావతార మెత్తం దలంచి నిజాంశజాతులగు నవనారాయణు లచ్చటచ్చట నవతరించెదరేని విశేషం బగునని మది వితర్కించి యొకానొకసమయంబున నుద్ధవాదిభక్తాగ్రేసరసమూహపరివృతుండై నవనారాయణుల స్మరియించినంత కవినారాయణ హరినారాయణ అంతరిక్షనారాయణ ప్రబుద్ధనారాయణ పిప్పలాయననారాయణ అవిర్హోత్రనారాయణ ద్రుమిళనారాయణ చమసనారాయణ కరభంజననారాయణు లరుదెంచిన నమ్మధుసూదనుం డెదుర్కొని హిరణ్మయసింహాసనాసీనులంగావించి గొనియాడుచుండ నయ్యమలాత్ములు పరమానందభరితస్వాంతులై మమ్మేల దలంచితిరని విచారింప నగ్గోవిందుండు 'త్రిజగద్వంద్యులారా! రాగలిగినకలికాలంబున మూఢజనదురితక్షయార్థంబై యే నవతరించం దలంచితిని. తద్వత్తత్తత్ప్రదేశంబుల జగదుద్ధరణార్థంబై తా మవతరించి దుర్భరమోహాగ్రస్తజనాళిని యుష్మత్కీర్తనీయవైరాగ్యమార్గంబుచే గడతేర్తురని దలంచెద' నన నమ్మహామహులు హర్షించి 'హేకృష్ణా! మీ మీ స్థలంబున నేనామలక్షణంబులచే జగద్విఖ్యాతి

—శ్రీకృష్ణుండు నవనారాయణులకు జన్మంబులు గైకొను తెఱంగెఱింగించుట.—

నొందవలయునో దెలుపవే' యన నమ్మురాంతకుండు 'కవినారాయణుండు మత్స్యేంద్రనాథనామంబున దేజరిల్లవలయును. తదుపరి హరినారాయణుండు గోరక్షనాథనామంబున మత్స్యేంద్రనాథప్రియశిష్యుండై విలసిల్లు నాపై యంతరిక్షనారాయణుండు జాలంధరనాథనామంబున బ్రకాశించుచుండ ప్రబుద్ధనారాయణుం డాతనిశిష్యుండై కానీపనాథనామంబున విరాజమానుండగు ననంతరంబ పిప్పలాయననారాయణుండు చర్పటనాథనామంబున యవిర్హోత్రనారాయణుండు, నాగేశనాథనామంబున ద్రుమిలనారాయణుండు, భర్తరీనాథనామంబున చమసనారాయణుండు, రేవణనాథనామంబునను మఱియు కరభాజననారాయణుండు గహినీనాథనామంబున జగత్ప్రసిద్ధి నొందవలయును. పిదప ననేకులు మదాజ్ఞానుసారులై యవతరించెదరు. కవిశిరోమణియగు వాల్మీకుండు తులసీదాసనామంబునను యోగాధిష్ఠానపరుండగు శుకమహర్షి కబీరదాసనామధేయంబున సాత్యవతేయుండు జయదేవాహ్వయంబున బుద్ధిదక్షుండగు యుద్ధవుండు నామదేవాభిధానంబున భక్తాగ్రేసరుండగు జాంబవంతుండు నరహరినామంబున బొగడొందెదరు. మద్భ్రాతృండగు బలదేవుండు పుండరీకుండై కీర్తిం జెందు నేజ్ఞానదేవుండనై విలసిల్లెదను. గిరిజాధవుండు నివృత్తినాథుండగును. చతురాననుండు సోపానదేవుండగు. జగన్మోహనాకారియగు యోగమాయ ముక్తాబాయిగను జ్ఞానపూర్ణుండగు హనుమంతుండు రాజయోగీశ్వరుండగు రామదాసాహ్వయంబున మఱియు కుబ్జాదాసి జనాబాయి పేరం బెంపొందు నివ్విధంబున జన్మంబులు గైకొని భవపాశనిబద్ధపామరులను భక్తిశ్రద్ధావహబోధప్రబోధలచే విముక్తులం జేయవలయు' నన నిగ్రహానుగ్రహసమర్థులగు నవనారాయణులు వ్యాసదేవునితో తత్ప్రకారంబు విశదీకరింపుమని విచారించిన శ్రీకృష్ణుండు పూర్వంబున పరాశరాత్మజుండగు వ్యాసుండు భవిష్యత్పురాణంబున భావికాలమహాపురుషులచరిత్రంబులు బ్రకటించినవిధం బెఱింగించెద వినుమని యిట్లనియె.

౧. ఒకనాఁ డూర్వశీ దృక్కీక్షణత్వంబున నుపరిచరవసుపుంగవుండు పంచశరశిలీముఖభిన్నహృదయుండై చలించిన నయ్యమలాత్ముని వీర్యంబు గళితంబై తెల్లునంబడి ముత్తునియలై భాగద్వయంబు

యమునానదీతటస్థ ద్రోణంబునం బడి యందు ద్రోణుండు జన్మించెను. తదితరభాగంబు తన్నదీప్రవాహతోయంబులం బడ నొకమత్స్యంబు గ్రసించెఁ గావున నమ్మత్స్యోదర వీర్యంబునఁ గవినారాయణుండు జన్మించి మత్స్యేంద్రనాథనామంబున జగత్ప్రతీతుండై దేజరిల్లవలయును.

౨. అనంతరంబ సర్వేశ్వరుండగు రుద్రుం డుగ్రుండై తృతీయనేత్రాగ్నిచే భావజుని భస్మంబుజేయ నయ్యనంగవీర్యంబు ద్విమూర్ధుండు నిజకుక్షిని ధరించియుండ భారతీయుండగు బృహద్రథుండు మహీతల క్షేమంబుకై జన్మంబు జేయందలంచి యప్పావకు నావాహనం బొనర్చిన నాద్విమూర్ధుండు యజ్ఞసంపూర్తి నల్పి స్వగర్భస్థకామవీర్యంబు తత్కుండంబునం బడవైచును గావున నందంతరిక్ష నారాయణుండు జన్మించి జాలంధరనాథుండై ప్రకాశింపవలయును.

3. తొల్లి పరమేష్ఠివీర్యంబుచే నెనుబదివేలఋషులు జన్మింప తద్వీర్యశేషంబు రేవానదీతీరసైకతంబునంబడి సజీవంబై యున్నది గాన నందు చమసనారాయణుండు జన్మించి రేవణసిద్ధనామంబున జగద్విఖ్యాతి నొందవలయును.

౪. పై నుదహరించిన పరమేష్ఠివీర్యశేషభాగం బొకటి యహికులాగ్రగణ్యుండగు తక్షకునిదుహిత భక్షించియుండ జనమేజయకృత సర్పయాగంబున యాస్తికనామఋషివర్యుం డయ్యహిగర్భస్థవీర్య మాహాత్మ్యంబు గ్రహించి స్వాహాకారంబు మానుకొన నప్పన్నగాంగనామణి యొకవటవృక్షకోటరంబున నివసించి యందొక యండంబుంచి నిజేచ్ఛంజను నందవిర్హోత్రనారాయణుండు జన్మించి వటసిద్ధనాగనాథనామంబున విరాజిల్లవలయును.

౫. తదుపరి తపోఘనుండగు మత్స్యేంద్రనాథుండు నానాదేశపర్యటనంబు జేయుచు నొకయన్నునకు సంతానంబుకై జగముకన్ను నుద్దేశించి భస్మప్రసాదం బొసంగిన నయ్యువిద ప్రమాదంబున తద్భస్మంబు కసువున వైచు నందు మత్స్యేంద్రనాథతపఃప్రభావావిర్భూత మిత్రవీర్యంబుననే హరినారాయణుండు జన్మించి గోరక్షనాథుండై కీర్తింజెంపవలయును.

౬. మఱియు పూర్వంబునఁ బర్వతరాట్పుత్రికల్యాణనిమిత్తంబై బ్రహ్మేంద్రాదిబృందారకులు దక్షసదనంబునకు విచ్చేసి యౌవనమోహనాంగి రూపలావణ్యసౌందర్యం బాలోకించుచుండ పితామహుండు కామాతిశయానల దహ్యమానమానసుండై చలించిన నింద్రియంబు గళితంబై భూస్థలిం బడ నచ్చతురాననుం డత్యంతలజ్జాయమానవదనుండై బుడమిం బడినవీర్యంబు నిజపాదాంగుష్ఠంబున నలిపిన తద్వీర్యం బఱువదివేల రేణువులై ప్రకాశించుచుండ నందు వాలఖిల్యాది మహర్షు లుదయించిరి. అంత నొకపనికత్తియ లాజాహోమశుభస్నసహితంబుగ నచ్చటికనుపున తద్వీర్యశేషభాగంబుగొని భాగీరథీజలంబులం బడవైవ నయ్యమోఘవీర్యంబు శరస్తంభాశ్రయంబై ప్రభాసిల్లుచున్నది గావున నందు పిప్పలాయననారాయణుండు జన్మంబు గైకొని చర్పటనాథనామంబునఁ బొగడొందవలయును.

౭. మున్ను పంచశరు శరభగ్నహృదయుండగు నభోమణివీర్యంబు గళితంబై యొకభాగం బొకకుంభంబునం బడి యగస్త్యుం డుద్భవించెను. తద్ద్వితీయభాగంబు శైలికమహాముని కుటీరనైకటిక భర్తరీనామ భిక్షాపాత్రంబునం బడి యప్రతిహతప్రకాశంబుచే వెలుంగుచుండ నమ్మునిముఖ్యుండు భిక్షార్థంబై సమీపజనపదంబుల కేగం దలంచి జగచ్చక్షువీర్యపూరితపాత్రను వీక్షించి యియ్యది మహామహుండగు దివాకరునివీర్యంబు నిందొకసిద్ధుం డుదయించగలండని తన తపోయోగంబున గ్రహించి భద్రపఱిచెం గావున నందు ద్రుమిలనారాయణుండు భర్తరీనాథనామంబున నవతరింపవలయును.

౮. ఒకానొకసమయంబున వాగ్దేవి వయోరూపలావణ్యాతిశయంబులు విలోకించి తమ్మిచూలి కామపీడితహృదయుండై చలించినంత భవిష్యత్కాలహేతుభూతంబున వీర్యంబు చ్యుతంబై హిమవత్పర్వతప్రాంతంబున శయనించుమహాదిగ్గజకర్ణంబునంబడి బిందురూపంబు జెందెది కొంతిభాగంబు బుడమింబడ నొకవ్యాఘ్రపాదఘట్టనంబుచే నవ్వీర్యంబున తపఃపూర్ణుండగు యత్రిమహర్షి జన్మించెను తద్దిగ్గజకర్ణస్థ బిందురూప వీర్యంబున ప్రబుద్ధనారాయణుం డవతరించి కానీపనాథనామంబున ఖ్యాతిం జెందవలయును.

౯. పిదప నొకానొకసమయంబున గోరక్షుండు వినోదార్థంబుగ మృత్తికచే నొకపుత్తళిం జేయుచు నందు నిజతపఃప్రభావంబున శ్రీమహావిష్ణువీర్య మావాహనంబు జేయునట్టియెడ కరభంజననారాయణుండు తత్పుత్రికం బ్రవేశించి గహినీనాథనామంబున విభ్రాజమానుండై విలసిల్లవలయును.

ఇప్పగిది రమాధవుండు మృదుమధురసంభాషణంబుల నవనారాయణులకు దేటపఱిచిన నమ్మహానుభావులు వల్లెయని పరస్పరాలింగనంబులు జరుపుకొని సెలవునొంది సుందరాచలంబున కరిగి యోగనిష్ఠాగరిష్ఠుండగు శ్రీశుకుండు కబీరుదాసుగా జన్మించందలంచి తన స్థూలశరీరం బగ్గిరిగుహయందుంచినది గనుంగొని తద్వృత్తనుతమ స్థూలశరీరంబులు మేరుభూధరగుహయందుంచి నాథజన్మంబు లెత్తుచుండిరి.

అట్టిసమయంబున బదరికాశ్రమంబున సోమబ్రాహ్మణుండు రంభోద్దేశ్యంబుచే స్ఖలితవీర్యుం డయ్యె తద్వీర్యంబున కబీరదాసుండు జన్మించె నిట్టి కబీం జయదేవ తులసీదాసాది భక్తాగ్రేసరుల చరిత్రంబులు జగన్నాథపండితులచే భక్తవిజయగ్రంథరాజంబున వర్ణింపం బడియెం గావున నిందు విస్తరింప నవసరంబు లేదు.

మత్స్యేంద్రనాథజన్మచరిత్ర ప్రారంభము.

ఒకానొకసమయంబున నుపరిచరవసువును సుపర్వలోకాంగనామణియగు యూర్వశి వీక్షింప నక్కుటిలాక్షీకటాక్షధనుర్ముక్త తీక్ష్ణతర దృక్శరక్షతంబున వసుపుంగవువీర్యంబు చ్యుతంబై జగచ్ఛ్రుతుదు హితృప్రవాహంబునం బడిన తద్వీర్యంబు నొకఝషంబు గ్రసించి యుండె నందు కవినారాయణుండు ప్రవేశించి యండరూపంబున వర్ధిల్లుచుండ నామత్స్యం బండం బుంచగలందు కొక స్థలనిర్దేశంబు జేయుందలంచి యయ్యమునానదీప్రవాహంబున గ్రుస్సుచుండుతఱి కైలాసంబున పర్వతరాట్పుత్రియగు శర్వాణి శివునితో "హేప్రభో! మీ రెల్లప్పుడే మంత్రరాజంబు జపియించెదరో తన్మంత్రార్థరహస్యంబులు కృపామతిచే నా కనుగ్రహింపవలయు" నన సర్వేశ్వరుండు సంతుష్టహృదయుండై "యో దేవీ! నీవడిగిన పరమరహస్యం బేకాంత

స్థలంబున దెలుపందగు ర”మ్మని రయమ్మున వృషభవాహనారూఢుఁడై
యమునానది జేరం జని తత్తటంబున వృషభేశ్వరునుంచి యొకరహస్య
స్థలంబున కరిగి పరమేశ్వరుండు పార్వతికి మంత్రమంత్రార్థరహస్యంబు
లుపదేశించుచుండ సమీపప్రవాహంబున విహరించుచున్న మత్స్యగ
ర్భస్థ కవినారాయణుం డాకర్ణించి నిత్యానిత్యవస్తువివేకజ్ఞానపూర్ణత్వం
బున బ్రహ్మానందాబ్ధినిమగ్నుండై యుండునెడ మృడుండు మృడాని ను
ద్దేశించి "నీవు మంత్రార్థరహస్యోపదేశంబున జ్ఞానపరిపూర్తి జెందితివే"
యని ప్రశ్నింప నద్దేవిప్రత్యుత్తరాత్పూర్వం బస్మానోదరాంతరకవినా
రాయణుండు "చరాచరాంతర్వ్యాప్తపరమేశ్వరతత్వం బొకటేయనిజ్ఞానో
దయం బయ్యె" నన శర్వుండు "యెవ్వరీ ప్రత్యుత్తరం బొసంగి" రని
యచ్చెరువొంది జలంబులం జూచి మత్స్యోదరంబున కవినారాయణుండు
గలండనియూహించి "కవినారాయణా! నీకొక కారణంబున సద్బోధలు
ఘటియించె నీవు జన్మించిన పిదప పరతత్వస్వరూపుండగు దత్తాత్రేయులచే
ననేకమంత్రార్థరహస్యంబు లుపదేశింపఁబడియెదవు. శీఘ్రంబున బదరి
కాశ్రమంబునకు విచ్చేయు” మని యాజ్ఞాపించి శివుం డుమాసమేతుం
డై నిజనివాసంబున కరిగె నపు డామత్స్యంబు నవమాససంపూర్తి
యైనకతంబున నంతం బత్తీరంబున నుంచి నిజేచ్ఛం జనియె. పిమ్మట
నచ్చో నొకబకపక్షిసమూహంబు మీనంబునకై ప్రవేశించి యం
డంబు గని తనముఖ్యాహారంబని దలంచి ముక్కులం బొడువ నయ్యది
రెండుశకలంబులయ్యె నందునయు కాలోష్ణాంశుపగిది ప్రభాసిల్లెడు
డింభకుం డావిర్భవించి రోదనంబు జేయుచుండ నప్పటికి విధిప్రేరితం
బుగ కామికనామధీవరుం డరుదెంచి బాలార్కబింబంబుభంగి దేజ
రిల్లెడు బాలు నత్యంతాశ్చర్యంబుచే జూచుచుండ నంతరిక్షంబునుండి
కుసుమంబులు వ్రాల్చుచు నభోవాణి "యోకామికా! ఈసుకుమా
రుండు కవినారాయణుం డితండు జగదుద్ధారనిమిత్తంబై యవత
రించెను. నీవు సంతానహీనుండవు కరుణారసం బుప్పతిల్ల నిబ్బా
లుం గొనిపోయి మత్స్యోదరశుక్తిముక్తుండుగాన మత్స్యేంద్రుండని
నామకరణంబు జేసి పోషింపు మీతనిచే నీజన్మంబు పావనంబె గాక
నీవంశోద్ధారం బగు” నని పలుక దరిద్రునకు పరుసంబు దొరకినభంగి
మిత్రోదయంబున కుశేశయానందంబుపగిది మృత్యుభీతునకు పీయూ

షంబు లభించినవిధంబున తులితానందమయుండై యబ్బాలుంగొని నిజసదనంబున కరిగి ప్రియురాలగు శారదవతికి నప్పగించి మిన్ను మ్రోసిన వృత్తాంతంబంతయు తేటపఱచి యీశ్వరదత్తప్రసాదంబని జెప్ప నాయువతి సూర్యపుత్త్రుండు రాధాతనయుండై కీర్తిజెందిన విధంబు కాబోలు నని దలంచి తేజోమయుండగు బాలుం జూచి మితిలేనిసంతసంబున బుచ్చుకొని వక్షంబున కదుముకొన సోమోదయంబున సోమకాంతంబులు ద్రవించుకైవడి మత్స్యేంద్రదర్శనంబున వక్షోజంబున క్షీరంబు లూరెను. తత్క్షీరంబుల కుక్షినింపుచు ప్రతిదినం బుష్ణోదకంబుల స్నానంబు లాడించుచు నఖండానందంబున బెంచుచుండ దినదినప్రవర్ధమానుండై బాలుండుపంచాబ్దంబుల పరిపూర్తిజెందిప్రకాశించుచుండె నొకనాఁడా కామికుండను బాలుండగుమత్స్యేంద్రుని వెంటగొని మీనంబులకై కృతాంతభగినీతీరంబునకుపోయి తటంబున బాలునునిచి తా జలంబులం దిగి మత్స్యంబులంబట్టి పైకివైచుచు కుమారుని బిలిచి యివియన్నియు నసుగూర్చి బుట్టను బెట్టుమనుచుండ బాలుండిది యెంతటిఘోరకృత్యంబు మాతృవంశఘాతకపాతకంబని దలంచి యామత్స్యంబులం బట్టి నదీజలంబులం బడవేయుచుండ కామికుండాగ్రహంబున "నోరా మత్స్యేంద్రా నే నతిప్రయాసంబున మీనంబులం దీయుచుండ నీ విట్టికపటంబులు చేయుచుంటివి యికముందేరీతి జీవించెదవో భిక్షమెత్తెదవో" యని కరపుటంబున ముఖతాడనంబు జేయ బాలుండగు నాథుం డిది మహాప్రసాదవాక్యంబు. భిక్షాన్నంబు పవిత్రంబని మదిం దలంచుచు కామికుండు తిరిగి వాలుగంబులకై వారిం దిగి వెదకుచున్నతఱి యచ్చోటుబాసి భ్రమియించుచు ద్వైతవనంబు జేరి యచ్చట తపోయోగ్యంబగు స్థలంబుగానక యుత్తరదిశంజని బదరికాశ్రమంబు జేరి యొకస్థలనిర్దేశం బొనర్చుకొని లోహకంటకంబుల పాదంబులు నిలిపి యూర్ధ్వబాహూర్ధ్వముఖుండై ద్వితీయభూతంబునుభక్షింపుచు తనుమనోధనంబులీశ్వరార్పితంబు జేసి మహాకారణనిక్షిప్తమానసుండై ద్వాదశవర్షంబులు ఘోరతరంబగు తపం బాచరింప స్థూలశరీరంబు తపోగ్ని వేడిమిచే మాంసరహితంబై యస్థియుతచర్మంబు శుష్కకాష్ఠంబుపగిది భాసమానం బగుచుండు సమయంబున ముమ్మొగంబులదేవర వనంబు సంచరించుచు శివాల

యంబుజేరి ముక్కంటిని దర్శించి హే త్రిపురదహనా! మన్మథహరణా! పరమదయాకరా! గౌరీమనోహరా! యని పలువిధంబుల బ్రస్తుతింప నప్పరమేశ్వరుండు ప్రసన్నుండై పరస్పరాలింగనంబుల సంతుష్టుఁజేసి మునిరాట్సుతుని యోగక్షేమంబులు విచారింప నతండు ప్రత్యుత్తరం బిచ్చి హరునుద్దేశించి "హే శంభో! నేనిపు డీబదరికాశ్రమకాననావలోకనార్థంబై చనుదెంచితి గావున నిందలిస్థానవిశేషంబులు జూపవే" యన హరుండు హర్షించి తన్ముని దత్తాత్రేయుని వెంటగొని పాదచారియై చనుచు నచ్చటచ్చట వనవినోదంబులు చిత్రతరలతావితానంబులు నానావిధపక్షిసమూహాకీర్ణవిశాలశాఖోపశాఖ పరిశోభిత వృక్షరాజి విశేషంబులు దెలుపుచుం జనచన నికటంబున మహోత్తుంగతరంగయుత మణికర్ణికాప్రవాహతోయంబు లగుపడ న త్తీరమార్గంబున నేగి మత్స్యేంద్రనాథుని భాగ్యోదయకారణంబుచే నమ్మహారణ్యంబున విహరింపుచుండిరి.

ఇతి భక్తిసారనవనాథచరిత్రంబున మత్స్యేంద్రనాథ జన్మకథా విశేషంబు ప్రథమాధ్యాయము సంపూర్ణము.

ద్వితీయాధ్యాయము.

మత్స్యేంద్రునకు దత్తాత్రేయులవా రనుగ్రహం బొసంగుట

ఇవ్విధంబున వలిమల్లుం డనసూయాసుతుని దోడ్కొని భాగీరథీతటద్రుమ శృంగారంబులు జూపుచుండ సమీపంబున లోహాకంటకంబులపై శుష్కపటంబువగిది నగుపడుచున్న మత్స్యేంద్రుని పలలరహిత శరీరంబు గాంచి యోహో యిదియేమి యెవ్వరికాసనంబున విశ్వామిత్రునిభంగి తపం బాచరించెన దిక్కలికాలంబున నీపూర్వవయస్సున ఘోరంబగు తపోగ్నిం గ్రాగుట మహాకష్టతరంబు వీరికాకామ్యం బేమైయుండునో యని సంభాషింపుచు దత్తాత్రేయునితో "హే అత్రిపుత్రా! నేనిచ్చో నిలిచెదను నీ వాతపోధనుని కడ్డం జేరి వారేకతంబున తపం బాచరించెదరో విచారింపు" మన దత్తుం డట్ల కాక యని నాథుని జేరంజని "హే తపోనిధే! ఇట్టిఘోరతరతపం బేల సల్పెదవు? నీయభిమతం బెయ్యదియో దెలుపు" మన నాథుం డాశ

బ్దంబు లాకర్ణించి యున్మీలితలోచనుండై భ్రూసంకేతంబున నమస్కారంబులు సల్పి "పరమేశ్వరదర్శనంబునకై గ్రాగుచున్నా"నని దెలుపుచు "నేటికి ద్వాదశాబ్దంబులయ్యె నిమ్మహాదరణ్యంబున మానవుల గానలేనైతి దయాఘనా భవన్నామధేయం బెఱింగింపు"మన నతండు "నే ననసూయాపుత్రుండను నీయభీష్టంబు తేటతెల్లంబుగ బలుకులం దెలుపు"మన మత్స్యేంద్రుండు దత్తాత్రేయుని పదకంజంబుల వ్రాలి తన యభిమతంబంతయు తేటపఱచుచు 'హేకరుణానిధే! ప్రత్యక్ష త్రిమూర్తిస్వరూపంబున సర్వవ్యాపకుండవై నన్నింతవర కుపేక్షించుట ధర్మంబగునే యోదీనశరణ్యా" యని మొఱలిడుచుండ దత్తుండు కరుణాంతరంగహృదయుండై మత్స్యేంద్రుని శిరంబున శయకుశేశయంబుంచి మంత్రమంత్రార్థరహస్యంబు లుపదేశింప నాథుండు జ్ఞానసూర్యోదయంబున నజ్ఞానతిమిరంబు బాసి దృశ్యమానప్రపంచం బీశ్వరతత్వంబు తనయందు సర్వభూతంబులు కలవు తా సర్వభూతంబుల గలనని ద్వైతభావంబు వదలి యద్వితీయపరబ్రహ్మంబు తానై వెలుంగుచున్నతఱి యత్రిసూనుండు నాథుం దోడ్కొని శూలికడ కరుదెంచిన హరుం డీతండు కవినారాయణుండని గ్రహించి సదయహృదయుండై కనుంగొనుచుండుసమయంబున హరి విరించి ప్రభృతి నిఖిలదేవతానీకం బచ్చటికిం జేర పంచాననుండు త్రిమూర్తు నుద్దేశించి యీతండు భవత్ప్రియశిష్యుం డని తలంచి వేదసారంబులగు సకలమంత్రంబులు లోకోపకారనిమిత్తంబుగ జారణమారణస్తంభనమోహనోచ్చాటనాది రహస్యంబులు శస్త్రాస్త్రాదిప్రయోగోపసంహారవిధానంబులు నణిమాద్యష్టవిధసిద్ధులం దెలిపి ప్రసిద్ధుం జేయుమనుచుండు నెడ బ్రహ్మవిష్ణువరుణేంద్రాదిత్యాది సకలదేవతలు తమతమ యస్త్రశస్త్రమహాశక్తిమంత్రరహస్యంబు లవ్వసుపుత్రున కుపదేశించి చనిరి. యాపిదప దత్తుండు ఐంద్రాస్త్ర వాయవ్యాస్త్ర కాలదండ నాగాస్త్ర గారుడాస్త్ర సమ్మోహనాస్త్రాది నానావిధమహదస్త్రంబుల తెఱం గెఱింగించి శైలీ సింగి యను పరికరంబుల నొసంగి కర్ణంబు జించి యద్యాది యిది యొక నాథపంథనూతన సాంప్రదాయకంబై త్రిజగత్ప్రకాశితం బగునని మత్స్యేంద్రునకు సెలవొసంగి భూతేశునిసహితుండై నిజేచ్ఛం జనియెను.

మత్స్యేంద్రనాథుండు తపంబుచే నంబికాప్రత్యక్షంబు వడసి శాబరీమంత్రశాస్త్రరచనానుకూలక్రమంబెఱుంగుట.

మత్స్యేంద్రనాథుం డచ్చోటుబాసి నానాతీర్థంబులు సేవించుచు సప్తశృంగపర్వతంబు జేరి యందుగల జగన్మాతయగు యంబికా దర్శనంబుగొని యద్దేవి ననేకవిధంబుల స్తోత్రంబులు జేయుచు కవిత్వ రచనాకుతూహలుండై కవిత్వంబు లోకోపకారి యై యుండవలయును. లేకున్న నిరర్థకంబని దలపోసి శాబరి యను నొకవిద్యను కల్పింపందలంచి యయ్యది యిద్దేవి ప్రసాదంబున సులభసిద్ధి యగునని దృఢీకృతమనస్కుండై యచ్చట నొకసప్తకం బనుష్ఠానంబు జేయ నమ్మహిషాసురమర్దని ప్రత్యక్షంబై "సమర్థా! నీ వేకారణంబున నన్నారాధించితి" వని యడుగ సిద్ధుండు "యోజగజ్జననీ! నేను శాబరీవిద్య జేయందలంచితి నయ్యది సిద్ధించుసదుపాయంబు సెలవొసంగు" మన నద్దేవి హర్షించి రమ్మని సిద్ధుని కేలూని మార్తాండపర్వతాగ్రంబుపై గొనిపోయి యచ్చట నాగాశ్వత్థవృక్షంబును జూప యది సిద్ధునకు దృశ్యాదృశ్యం బై యున్న తచ్ఛాంతికై హవనంబొసర్చి కనుపఱచి "యిమ్మహావృక్షంబు శాఖోపశాఖంబుల మిన్నంది యున్నది. యిది దేవవృక్షంబ దీనివిశాలతరశాఖలపై బోవ వీరులును జోటింగ మహామద వీరభద్ర కాళికా భేతాళ చండికా మారుతీ అయోధ్యాధీశ ద్వాదశాదిత్యులు అష్టభైరవులు జలదేవతలు చండ చాముండాది మహాశక్తులు ఏకాదశరుద్రులు శాకినీ ఢాకినీ యక్షిణీ ప్రముఖ ద్వాదశమహాభూతంబులు అణిమాద్యష్టసిద్ధులు సర్వదేవతలు మూర్తివంతంబు లయ్యుండు గనుంగొను"మని చూపి "మత్స్యేంద్రా! నీకొక సదుపాయం బెఱింగింతు విను"మని యిట్లనియె.

"ఋషిముఖపర్వతనైకటిక బ్రహ్మగిరిసమీపంబున నంజనపర్వతంబను నొకభూధరంబు గలదు. దానికి దక్షిణంబున నొకనదీప్రవాహంబు గల దట్టిస్థానంబున మహాకాళీదేవత నివసించి యుండు నద్దేవికి నమస్కరించి దక్షిణమార్గంబున జనుచుండ నచ్చట హస్తిపదసమానంబగు శ్వేతకుండంబుల శ్రేణిశతంబుగా తోయపూరితంబులై యుండు నందొక్కొక్కకుండంబున శుష్కవల్లిం బడవైచుచుం జని తిరిగి జూచుచుఱాగా నేకుండంబున శుష్కవల్లి సజీవంబై యుండునో

యందలిజలంబులు పానంబు జేయుము. నీ వపుడు మూర్ఛం జెందె దవు. తత్సమయంబున నాదిత్యద్వాదశనామంబులు జపియించిన తమోంతకుండు ప్రసన్నుండై మూర్ఛం దొలంగించును. పిదప తత్తో యంబు లోకకుప్పికచే గైకొని యానాగాశ్వత్థవృక్షమూలంబున బోయుచు నచ్చట ననుష్ఠానంబు జేసిన వృక్షస్థసర్వదేవతలు ప్రత్య క్షంబై నీమనోభీష్టపరిపూర్తిం జేసెద"రని చెప్పి యద్దేవి నిజనివాసం బున కేగెను.

{ మత్స్యేంద్రనాథుం డంబికచే ననుజ్ఞాతుండై మార్తాండ మహీధరంబునకేగి నాగాశ్వత్థవృక్షస్థనిఖిలదేవతా ప్రత్యక్షంబు వడసి వరంబులు గొనుట. }

అమ్మత్స్యేంద్రనాథుం డంజనాచలంబు జేరి యమ్మహాకాళికి నమ స్కరించి శుష్కవల్లిని తోయంబులవైచుచు కుండంబుల పరీక్షిం పుచుండ నం దాదిత్యకుండంబున శుష్కవల్లి సజీవంబయ్యుండుట బొడగాంచి యందలిజలంబుల స్నానంబులాడి పానంబుజేయ మూర్ఛాగతుండై యాదిత్యనామద్వాదశకంబు జపియింపుచుండ ప్రభాకరుండు ప్రత్యక్షంబై హస్తస్పర్శంబున మూర్ఛం దేల్చి మస్తకంబున నభయహస్తంబుంచి నీకోర్కులు ఫలియించునని పలికి యంతర్ధానంబు నొందెను. మత్స్యేంద్రుం డాకకుప్పికచే తజ్జీ వనంబుల గైకొని మార్తాండమహీధరంబు జేరి యశ్వత్థరాజంబునకుం బోయ నాదిత్యుండు పునఃప్రసన్నుండై వరంబు వేడుమన సిద్ధుండు "నే శాబరీమంత్రవిద్య జేయందలంచితి నే నేమంత్రంబున నిష్ఠదై వతగా దలంచెదనో యామంత్రార్థంబు సిద్ధించగోరెద" నన తమోభం జనుం డవశ్యంబని వరంబొసంగి యంతర్ధానంబు నొందెను.

{ మత్స్యేంద్రనాథుండు చంద్రగిరిగ్రామంబున సరస్వతీ దేవికి సంతానంబునకై భస్మప్రసాదం బిడుట. }

ఇత్తెఱంగున మానసస్థకంబు క్రమక్రమంబుగా వృక్షస్థసర్వ దేవతలప్రత్యక్షం బొనర్చుకొని వరంబులుగొని పరిపూర్ణకాముండై శాబరీమంత్రగ్రంథంబు నిర్మించి బంగాళదేశపర్యటనంబు జేయుచు హేలాసముద్రప్రాంతంబున నరసింహామూర్తి జన్మప్రదేశంబగు చంద్ర గిరిగ్రామంబుజేరి భిక్షార్థంబై సర్వధర్మవిదుండగు సర్వోపదయాళుం

డను గౌడబ్రాహ్మణుని గృహంబున కేగి యాతని భార్య సరస్వతి యను
చిన్నది రూపయౌవనలావణ్యాతిశయంబుల తిరస్కృతరంభయై శీల
గుణసంపన్నత్వంబులచే బెంపొందియు నయ్యింతి సంతానంబు లేమిం
జేసి నానా దేవతల గొలిచి యనేకాయాసంబులం బడినను ఫలంబుగా
నక దీపంబులేని శూన్యగృహంబుపగిది వృక్షంబులులేని కాననంబు
భంగి నాశికంబులేని వదనంబురీతి తోయంబులేని తటాకంబుకైవడి
బాలురు లేని భవనంబు భవనంబా వనంబని తలపోయుచు నిస్పృహం
జెందియుండు సమయంబున నాథుండు అలఖ్ నిరంజన భిక్షాప్రశ్న
జేయుచుండ నాయువతి దిగ్గన లేచి యోగపూర్ణుండగు మత్స్యేంద్రుని
పాదంబులకెఱంగి యుచితాసనం బొసంగి ముకుళితహస్తయై హృదయ
తాపంబు వెల్లడి జేయందలంచి పునఃపునః పాదకమలంబుల వ్రాలి నేత్ర
బాష్పంబుల నడుగులం దడుపుచుండ నాథుండు ప్రేమపూరితుండై
నీకోరిక దెలుపుమన నప్పడంతి కొడుకులు లేని కడుదుఃఖంబు స్పష్టపఱ
చెను. సిద్ధుండు ప్రసన్నహృదయుండై చిటికెడు భస్మంబు తత్కాంతకు
ను ద్దేశించి యభిమంత్రించి యాసతీతిలకంబున కొసంగి "యోశుభా
ననీ! యీభస్మంబు కేవలభస్మంబుగా దలంపకుము. ఇయ్యది జగచ్చ
క్షుని స్వరూపంబని తలంచి నిశాసమయంబున శయనించుతఱి మహా
ప్రసాదంబని పుచ్చుకొనిన దివాకరాంశంబున తేజోమయుండగు కుమా
రుండు గలుగు నాపిదప నే నబ్బాలునకనేకమంత్రార్థరహస్యంబు లుప
దేశించెద నయ్యమలుండు సర్వసిద్ధులం బడసి ముల్లోకంబుల కీర్తనీయ
గుణసమాజుండై నక్షత్రమండలంబున క్షపాకరునిభంగి స్వప్రతాపం
బున ప్రకాశిల్లును. సంశయంబు మాని భస్మంబు సేవింపు"మని యాజ్ఞా
పించి భిక్షను గొని జనుచుండ యానారీమణి "సమర్థా! యుష్మత్పునరా
గమనం బెన్న"డని విచారింప నతండు "ద్వాదశాబ్దంబులకే నేతెం
చెద" నని ప్రత్యుత్తరం బొసంగుచు తీర్థయాత్రోన్ముఖుండై గమనం
బొనర్చెను.

తదుపరి యామందయాన మితిలేని యానందంబున పెల్లుబ్బి పొరు
గింటి కరిగి యచ్చటియన్నులతో తనహృద్గతంబు తేటపఱచ దలంచి
"యోసఖీమణులారా! నేడు మత్సదనంబున కొకకర్ణచ్ఛేది యతీంద్రుం
డరుదెంచి నాయం దత్యంతకృపాకటాక్షంబు గలవాఁడై సంతానా

ర్థంబై చిటికెడుభస్మం బభిమంత్రించి యనుగ్రహించు" నని విన్నవింప నాశారాన్యజ్ఞానసుందరీమణులు "అయ్యయ్యో! యిదియేమిచిత్రం బది యెట్టిభస్మంబు నీవేల భ్రమజెందితివి. కర్ణచ్ఛేదిబైరాగు లసాధ్యులు. వారికాపట్యంబు లీవెఱుంగుదువే మే మేమని నుడువుదుము? వారివ్విధంబున ననయానవనాంగనామణులకు భస్మం బొసంగి నిజమంత్రప్రతాపంబుచే దివంబున శ్వానంబుల జేయుచు వెంటగొని గ్రుమ్మరుచు నిశాసమయంబున నిజరూపంబు గల్పించి భోగంబు లనుభవించెద" రని చెప్ప నగ్గజగామిని భయభ్రాంతచిత్తయై నిజసదనంబునకేతెంచుచు శాటీబద్ధభస్మంబు విడిచి నిజభవనసమీపగర్తంబున బడవైవ నయ్యది సద్గురుప్రసాదంబుగాన నందు హరినారాయణుండు దేజరిల్లుచుండె నయ్యువతి మందభాగ్యయై యెప్పటియట్ల సంసారకృత్యంబుల కాలంబు గడుపుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్రనాథచరిత్ర
ద్వితీయాధ్యాయము సంపూర్ణము.

తృతీయాధ్యాయము.

{ మత్స్యేంద్రనాథుండు రామేశ్వరంబున కరిగి యాంజనేయులతో యుద్ధం బొనర్చి జయంబుగొనుట }

అపుడా సరస్వతి యను బ్రాహ్మణవనిత చేసోకిన తలపుమిన్నంబౌఅవైచినచందంబున పీయూషంబు ఘటింప విషంబని త్యజించిన భంగి గృహంబు జొచ్చిన వేల్పుగిడ్డిని వెడలగొట్టినక్రియ దైవహతబుద్ధిచే నుండుసమయంబున మత్స్యేంద్రనాథుండు తీర్థయాత్రాపరతంత్రుండై విహరించుచు పూర్వసముద్రప్రాంతంబున జగన్నాయకుల సేవించి పిదప రామేశ్వరంబు జేరి రామలింగస్వామిని దర్శించి సేతుబంధస్థలంబున స్నానంబుజేయుచుండ వర్షంబు గురియుచుండె నచ్చట ధీమంతుండగు హనుమంతుండు వయోవృద్ధుండై నకతంబున వర్షబాధ

కోర్వలేమిం జేసి కొన్ని పాషాణంబులచే నొకగృహనిర్మాణంబు జేయుచుండ నది జూచి నాథుండు "యేమి యీవింత సదనంబున కనలం బంటినపుడు కూపఖననం బొనర్తురే యీమహావర్షంబున నీవృద్ధాప్యంబున గృహప్రయత్నం బూనుట కెట్టిమూర్ఖమో కావుననే మర్కటగుణం బనియెద" రన విని వాయునందనుండు "మహాచతురోక్తులాడెదవు నీవెవ్వండ"వని యడిగెను. నాథుండు "నన్ను మత్స్యేంద్రజతి యనియెద" రన ననిలసూనుం "డోరీ! నీకీ లోకంబున జతి యను నామం బేలగలిగె దెలుపు" మన మత్స్యేంద్రుండు "మద్గురుప్రతాపశక్తివల్ల గలిగె"నని ప్రత్యుత్తరం బొసంగ వాయుసుతుండు "జతియను నామం బాంజనేయునకు దప్ప నితరుల కెట్లుచెల్లు నీయం దట్టిసామర్థ్యంబులు గలిగెనేని నిలువుము. నేజేయుపరాక్రమంబున కోర్వు"మని పలుక సిద్ధుండు నిర్భయహృదయుండై "ఔనౌను పూర్వంబునరఘుపుంగవుం డరణ్యంబున శయనించుటగాంచి గంధవహసుతుండు స్వపరాక్రమంబు జూపందలంచి యొకకొన్నిపర్వతంబులు వృక్షంబులు బెకలి యాతనిపై వైచుచుండ జానకీధవుండు తా శయనించియుండియు చాపాగ్రంబున నెగురగొట్టినక్రియ మద్గురుకటాక్షంబున నీయట్టి యఃకశ్చిన్మర్కటచేష్ట లననేల నీబ్రహ్మాండంబు కొనగోట మీటుదు" నన కేసరీపుత్రుండు రోషావేశుండై యట్టహాసంబుచేసి యొకకొన్నిపర్వతంబుల బెకలించి వియన్మార్గంబున నాథునిపై బడ వేయుచుండ యోగపూర్ణుండగు నాథుం డవిచూచి నిలునిలు మని యంతరిక్షంబున నిలిపెను. ఇవ్విధంబున శతానుశతంబులగు భూధరంబు లంతరిక్షంబున కందుకంబులకరణి నిల్చియున్న సమీరనందనుండు బొడగాంచి ప్రళయకాలకృశానునిపగిది క్రోధపూర్ణుండై యొక్కమహానగంబు శిరంబుపై నొకకొన్ని మహీధరంబులు హస్తద్వయంబునంబూని తీవ్రగమనుండై వచ్చుచున్న నన్నాథుండు వాతాకర్షణమహామంత్రప్రయోగంబున వాయుసూనుని హస్తపాదాద్యంగంబుల చలనవలనాదులు స్తంభనంబు జేయ సోకుదయ్యాముకొమరుం డపగతధైర్యుండై చిత్తరువుబొమ్మవలె నిలువంబడి తండ్రిని స్మరియింప నగ్గగనసూనుండు ప్రత్యక్షంబై విడు విడు మని నాథునితో బలుక నాథుం డుపసంహారంబు చేసెను హరిసూనుండు పర్వతంబులం బడద్రోసి నాథునిసమీపంబు జేరి "మత్స్యేంద్ర

నాథా! ధన్యుండ"వని బలుకుచుండ ననిలుండు కుమారునితో "పుత్రా! యనేకమంత్రమంత్రార్థరహస్యంబు లెఱింగిన ఇస్మహాసిద్ధుండు నిజభక్తి గురుశక్తి ఈశ్వరీవాచా యని ప్రతాపంబు జూపుచుండ దేవదానవులు దాసులై సంచరింపుచుండెదరు. నన్ను బంధించు మహామహుండు నిన్నేల సరకుగొను"నని చెప్పుచున్నతఱి నాథుం డయ్యిరువురిపాదంబులకు నమస్కరించి 'క్షమియించి సఖ్యంబొసంగు'మని వేఁడుకొన నమ్మహాత్ములు "దానవులకై యుశనుండు, నలుమొగంబులవేల్పుకై నారాయణుండు సహాయంబైనట్లు భవత్కార్యార్థంబై మానిజశక్తినొసంగెద"మని వరంబొసంగిన మత్స్యేంద్రుండు వాయునందనునితో "నీవు సర్వజ్ఞమూర్తివై నన్నేల పరీక్షించితివి. నాగాశ్వత్థవృక్షంబున నాకు ప్రసన్నుండవై శాబరీవిద్యాపరిపూర్తికై వరం బనుగ్రహించితి" వన హనుమంతుండు "మత్స్యేంద్రా! నీవు ప్రత్యక్ష కవినారాయణుండవు. నేను నీ కశ్వత్థంబున ప్రసన్నంబై వరంబొసంగినది నిజంబు. నీవిద్యాప్రభావంబు చూడందలంచి నీవు సేతుస్నానంబు జేయుచుండ నచ్చటికరుదెంచితిని. నీవు సమర్థుండవైతివి. నీ విటనుండి స్త్రీరాజ్యంబునకరుగవలయు నచ్చట నాకొకకార్యభారంబు గల దయ్యది నీ వుద్ధరించెద" వన విని నాథుం డదియేమి యనిప్రశ్నింప నంజనీసూనుండు తనపూర్వచరిత్రంబు సిద్ధునితోఁ జెప్ప నారంభించెను.

హనుమంతుండు మత్స్యేంద్రనాథునకు స్త్రీరాజ్యాధిపత్యంబున కొడంబఱచుట.

"యోగిశ్రేష్ఠా! నేను పూర్వంబున రఘుకులోత్తముని దాస్యంబుజేయుచుండి రామునిసమేతంబుగ లంకానగరంబు జేరి రావణాదుల బరిమార్చి జగజ్జననియగు సీతంగొని యయోధ్యానగరంబు జేరితిని. పిదప మద్దాస్యత్వంబున కానందించి జానకీదేవి తనహృదయంబున నాకు వివాహంబొనర్చి సంసారసుఖభోగంబుల దేల్చందలంచియు నిగ్గాలిచూలి బ్రహ్మచర్యంబున ప్రకాశించుచుండును. మద్వచనం బంగీకరించునో లేదో యను సంశయంబుచే నన్నొకనాఁ డేకాంతంబునకు బిలిచి 'పుత్రా! ఆంజనేయా! నాకొకకోరికగల దయ్యది నీ వంగీకరించితేని జెప్పెద'నన్న నే నాతల్లిహృద్గతం బెఱుంగక 'భవచ్చరణార్పితప్రాణుండగు దాసుండు జేయనొల్లనిపని యొకటికలదే' యన నద్దేవి బాసగొని

'యోగసమీరనందనా! సతీసమేతుండవై గృహస్థాశ్రమధర్మంబున సుఖంబు లనుభవింపు'మని చెప్పెను. నే నత్యంతకష్టంబని తలంచి నిరుత్తరుండనై రామభద్రునిపజ్జంజేరి విషణ్ణవదనుండనై కూర్చుండ రామచంద్రుండు విలోకించి నన్ను డగ్గరంజీరి 'పుత్రా! నీముఖం బేలగుందిన' దని విచారించెను. నే నపారదుఃఖావేశుండనై త్రిలోకజననిచే నిర్దిష్టంబగు సంగతిం దెలుప రఘుపుంగవుండు ఘనకరుణాన్వితుండై 'వాయుపుత్రా! స్త్రీరాజ్యనారీసంఘంబు యుష్మజ్జాయాసముదయంబని దలంపుమిప్పుడననేల నేటి కిట్టిచతుర్యుగకల్పంబు లేకోనశతంబయ్యె. ప్రతికల్పంబున నేను రాముండనై నీ వాంజనేయుండవై జన్మించి ప్రతికల్పంబున రావణాదుల వధియించి యయోధ్యానగరప్రవేశానంతరంబున నీవా స్త్రీరాజ్యంబు ప్రవేశించినది నిజంబుగాన నీవిపుడా శైల్యదేశంబుజేరి సకౌపీనజన్ముండవై యూర్ధ్వరేతస్కుండవైన కతంబున భుభుఃకారనినదం బొనర్పుము. భవన్ముఖమారుతజన్యవీర్యంబున నచ్చటి మచ్చెకంటులు గర్భంబులు ధరియించి సంతానంబు బడయుదు' రని యాజ్ఞాపించెను. తదాది నే నాదేశంబున నివసించితిని. మత్కృతభుభుఃకారంబున స్త్రీసమూహంబులు గర్భంబులు ధరియించి సంతానవంతులైరి కాని రతిసుఖం బెఱుంగరు. అంత నద్దేశాధిపతియగు మైనాకినీనామమహారాణి మనోజభవసుఖంబుల నపేక్షించియుపాయంబుగానక ద్వాదశాబ్దంబులు మదర్పితచిత్తయై ఘోరంబగుతపం బాచరించుచు స్వశరీరమాంసఖండంబులచే హవనంబుజేయ నేను ప్రత్యక్షుండనై భవదీప్సితంబు దెలుపుమని విచారించితి నప్పు డాసుందరీమణి 'స్వామీ! మీభుభుఃకారమారుతంబున నేతద్రాజ్యస్త్రీసమూహంబులు సంతానంబు వడసెంగాని కామసుఖం బెఱుంగరైరి. నీవు మాప్రాణప్రియుండవు గావున నన్ను భావభవపుష్పభల్లంబులతాపంబు బాపి కడతేర్చు'మన నేను 'సకౌపీనజన్ముండ నూర్ధ్వరేతస్కుండను నావలన నీకోర్కె లెట్లీడేరు నిక ముందు ప్రత్యక్షకవినారాయణుండు మత్స్యేంద్రనాథనామంబున దేజరిల్లుచు నిచ్చటికేతెంచు నతనిచే నీమనోరథంబు చేకూరు'నని వరంబొసంగితిని. మత్స్యేంద్రా! నీవచ్చటికరిగి యాసుందరాంగిని కందర్పకదనంబున కడతేర్చి నాభారంబు దీర్పు"మని చెప్ప యోగపూర్ణుండగు నాథుండు "ఈమితిలేని పాతకం

బే నేవిధంబున సహింతు. నేను బ్రహ్మచర్యవ్రతస్థుండను. తపోభంగానుకూలదుష్కృతంబులు నరకపురముఖంబులు గావే. మున్ననేకు లన్నులకారణంబున పదచ్యుతులు కారే. సీతకై రావణుండు నశించఁడే. గురుసతీగమనంబున కలాధరుండు కళంకిగాఁడే. క్షణమాత్రంబున నారదుం డఱువదిపుత్త్రులం గని కష్టంబులం బడఁడే. తపోధనుండగు విశ్వామిత్త్రుండు మేనకచే భంగంబునొందఁడే. ఇట్టి నింద్యకార్యంబుచే నాథపథంబు ధిక్కృతంబుకాదే. ముందు గలుగబోయెడునాథులు నన్ను బహిష్కృతుం జేయరే" యనిన కఱువలిచూలి "నాథా! నీవు సిద్ధుండవు. నీకీ పాపం బాపాదించనేర దిది విధినిర్మితకార్యంబు ప్రతికల్పంబున నీవవతరించి యివ్విధంబున జరిపినవిషయంబే నిజంబు సంశయంబు దొలంగుము. నీకు మీననాథుండను కుమారుండు గలిగి ప్రతాపవంతుండై ప్రకాశించు" నని చెప్పి మత్స్యేంద్రుని సమాధానపఱచి యన్యోన్యవందనంబు లాచరించుకొని యంజనీసూనుం డంతర్ధానంబు నొందెను. నాథుం డచ్చోటుబాసి యనేకదేశంబు లతిక్రమించి హింగళాదేవి దర్శనకుతూహలుండై చనిచని ప్రతిధ్వనులు బల్కు నిర్మనుష్యసంచారంబగు మహాదరణ్యంబున కృతాంతుని తిరస్కరించు భయంకరాకారంబుల భాసమానులగు భైరవవర్గంబు భండనోద్దండపరాక్రమాతిశయంబుల విలసిల్లు చండ చాముండాది మహాశక్తిశతంబు నజాండం బప్పళించు శాకినీ ఢాకిన్యాది మహాభూతసంఘంబు ద్వారరక్షకులై యుండి భువనభయదాట్టహాసంబు జేయుచుండు హింగళాదేవ్యాలయసమీపంబు జేరెను

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్రవాయుసుత సందర్శన కథావిశేషంబు తృతీయాధ్యాయము సంపూర్ణము.

చతుర్థాధ్యాయము.

మత్స్యేంద్రనాథుండు భైరవాదులజయించి హింగళాదేవినిదర్శించుట

ఇవ్విధంబున హింగళాదేవి సార్ధశతబాహుపరిమితౌన్నత్యంబగు మహాద్వారసమీపంబుజేరి చూచుచుండ నచ్చటిభైరవాదు లీసి

ద్ధుండు శాబరీవిద్యార్థియైనా గాశ్వత్థవృక్షంబున నస్మత్ప్రత్యక్షంబుబడ సె. వీనిబరీక్షించి తీరవలయునని తలంచి సన్న్యాసవేషంబులచే సాక్షాత్కరించి 'యోగిపురుషా! నీవెక్కడికరిగెద'వని మందలించిరి. నాథుండు 'నే నంబాదర్శనార్థంబై పోయెద'నన భైరవులు "జన్మప్రభృతి భవదాచరిత సుకృతంబు లెయ్యవియో దెలుపుము. పుణ్యవిశేషంబుచే నిద్దేవి దర్శనంబగును. మే మిచ్చటిద్వారపాలకులము. మాకీ పుణ్యరహస్యంబు దెలుపకున్న మార్గావరోధనంబు జేయుదు" మన నాథుండు "నేజేయు పాపపుణ్యంబులు పరమేశ్వరార్పితంబులై యుండును. నాయందే విశేషంబులే" దని ప్రత్యుత్తరం బొసంగెను. భైరవులు "ఏమియీచమత్కారసంభాషణంబులు. పురుషుండు జన్మించిన పిదప సుకృతదుష్కృతకార్యంబు లేలజేయఁడు. చేసిన తత్ఫలం బేల ననుభవింపఁడు. చాలు నీకృత్రిమప్రసంగంబులు. నీవు దర్శనార్హుండవు కావు శీఘ్రంబున జనుము లేకున్న శిక్షించెద" మన యోగిశ్రేష్ఠుండు "ద్వారికులారా! మీకింతటి ధైర్యసాహసంబు లేలగలిగె? కృతాంతుని లెక్కింపనివాఁడు మీబోటిమశకప్రాయుల గణుతించునే" యన వా రత్యంతక్రోధావేశులై తమతమ గదాఖడ్గపరశు త్రిశూలాది పరికరంబులు హస్తంబుల ధరియించి యుద్ధసన్నద్ధులైన నాథుండు చిటికెడు భస్మం బభిమంత్రించి దశదిగ్బంధనం బాచరించి శ్రీగురుదత్తాత్రేయాయనమః యని గురువందనంబు సల్పి మహాయుద్ధంబు జరుగబోవునని సర్వదేవతల నావాహనంబు జేసి వజ్రపంజరకవచంబు నిర్మించి స్వస్థచిత్తుండై భీకరాకారులగు భైరవులదెసం జూచి తడవేల మీమీనిజశక్తిం జూపుమన భైరవవర్గం బేకీభవించి హుంకరించుచు తమతమ ఖడ్గ త్రిశూల పరశు ముసల భిండివాల చక్రాద్యాయుధంబులు సిద్ధునిపై వైవ మహానగంబుపైఁ బడిన వర్షంబుక్రియ నిష్ఫలంబైన ప్రళయకాల హుతాశనునిపగిది ప్రకాశించుచు గాండీవంబుల జ్యాఘోషంబు జేయుచు వాతాస్త్ర కామాస్త్ర వాసవాస్త్ర నాగాస్త్ర బ్రహ్మాస్త్ర రుద్రాస్త్ర దానవాస్త్ర కృతాంతాస్త్రంబులు నారిం జేర్చి ముల్లోకంబు లేకముహూర్తంబున భస్మంబు జేయువిధంబున ప్రయోగంబులు జేయ నయ్యవి ప్రళయసమయంబని దేవదానవులు దలంచు

చుండ దిగ్గజంబులు గడగడవడంక శేషుండు శోషింప భూమి కంపింప నక్షత్రంబులు డుల్ల నవగ్రహంబులు గతులువప్ప నభోమండలం బాక్రమించి నాథునిపై జనుదెంచుచుండ సిద్ధుండు గెరలి వాతాస్త్రంబునకు పర్వతాస్త్రంబు, కామాస్త్రంబునకు విరక్తాస్త్రంబు, వాసవాస్త్రంబునకు మోహనాస్త్రంబు, నాగాస్త్రంబునకు ఖగేంద్రాస్త్రంబు బ్రహ్మాస్త్రంబును శాంతివరుణసూక్తాశీర్వచనంబులచే సంతోషపఱచుచు రుద్రాస్త్రంబునకు కార్తికాస్త్రంబు, దానవాస్త్రంబునకు దేవాస్త్రంబు, కాలాస్త్రంబునకు సంజీవన్యస్త్రంబు భస్మం బభిమంత్రించి తపోబలంబున నన్నింటి నన్నిరూపంబుల నుపసంహరించి వాసవశక్తి సంపుటియొనర్చి వాతాకర్షణ దివ్యాస్త్రప్రయోగంబు జేయ నష్టభైరవులు చేష్టలుడిగి కష్టంబులం బడుచుండ సిద్ధనిర్ముక్త వాసవశక్తికృత ప్రళయకాల మహానినదంబు దిక్కుటలం బిక్కటిల్లి త్రిలోకజననియగు జ్వాలాముఖి శ్రోత్రంబుల సోకి యాకసంబు బగిలెనో సోకుమూకలు బలసిరో యేమి యీచిత్రంబు గనుంగొనుమని యాజ్ఞాపింప రయంబున శంఖినీ ఢంకినీ యోగినీ చండా చాముండా మండా వండాది మహాశక్తిసముదయసహస్రంబు లేతెంచి నాథునిపై తీవ్రతరశస్త్రాస్త్రంబులు బఱపిన, యోగిముఖ్యుండు లీలావినోదంబు జేయందలంచి సమ్మోహనాస్త్రంబు ప్రయోగింప నమ్మహాశక్తి మహాభూతగణంబులు చిత్తవిభ్రాంతినొంది కొందఱు కరతాళంబులు వాయించుచు నొకకొందఱు పాటలు బాడుచు మఱికొందఱు రోదనంబు జేయుచు కొందఱు నవ్వుచు కొందఱు నేలపై వ్రాలి పొర్లుచు నొకకొంద ఱన్యోన్యకలహంబులు జేయుచు కొందఱు విగతవస్త్రులై నటియించుచు నానావిధవికారంబులు జేయుచుండ సర్వకళావిశారదుండగు సిద్ధుండు తనవిద్యాప్రభావంబున నమ్మహాశక్తుల వస్త్రంబు లపహరించి మాయాస్త్రంబున ననేకపురుషోత్పత్తి గలిగించి యమ్మహాశక్తుల మధ్యప్రదేశంబున ప్రవేశింపంజేసి మోహనాస్త్రం బుపసంహరింప దేహభ్రాంతులు గలిగి యొకరినొకరు జూచుకొనుచు నగ్నలైన కతంబున పరపురుషావలోకనంబుచే పరమలజ్జాయమానులై పరుగులిడుచు మార్గమధ్యంబున కంఠగతప్రాణులై పడియున్న భైరవుల విలోకింపుచు దేవికడ కరిగిన నద్దేవి

విగతవస్త్రలగు మానినీనివహంబుజూచి యమితాశ్చర్యంబుచే నిది యేమికారణంబని విచారింప నమ్మహాశక్తులు భయభ్రాంతచిత్తలై "తల్లీ! యొకమహాసిద్ధుం డెచ్చటినుండియో భవదాలయద్వారసమీపంబు జేరి ముహూర్తమాత్రంబున ముల్లోకంబుల జయించు భైరవుల గీటడంచి మమ్మనేకవిధంబుల భంగపఱచి పెక్కుమాయ లొనర్చెను. నిన్నేల సరకుగొనును. నీదురవస్థ నీకు లభియించును. మన మిందుండ తగదు తగ" దని నొక్కి వక్కాణించుచుండ నమ్మహాభగవతి యోగమార్గంబున నింతటితపోధనుం డెవఁడు కాబోలును? కవినారాయణుండు వసువీర్యంబున జన్మించి మత్స్యేంద్రనాథనామంబున సంచరింపుచున్నవాఁడని గ్రహించి శక్తికోటికి వస్త్రంబు లొసంగి నాథుని జేరంజని 'వత్సా! ధన్యుండ' వని బొగడుచుండ సిద్ధుండు లోకమాతకు వందనం బాచరించెను. దేవియు నాథుని కేలుబట్టి తనయంకంబున నుంచుకొని 'యోగిపురుషా! భైరవులదెసం జూడుము రక్షింపు' మని పలికిన మహాప్రసాదం బని వాతాకర్షణమంత్రోపసంహారంబు జేయ నాభైరవులు చలనవలనాదులు గలిగి నలుదిక్కుల నిరీక్షించి భవానీయంకస్థ మత్స్యేంద్రునికడ కేగుదెంచి నాథుని గొనియాడి నాగాశ్వత్థంబున జరిగినచరిత్రంబు ముల్లోకజననికి దెల్లంబుజేయ యుల్లంబున సంతసిల్లి నమ్మహాదేవి, 'మత్స్యేంద్రా! యుష్మత్ప్రతాపబలశౌర్యంబులచే నిప్ప ర్వతశ్రేష్ఠంబు నభోమండలంబున భ్రమ్మరి పునస్స్వస్థానంబున విలసిల్లనొనర్చిన వేయన సమర్థుండు వల్లెయని చిటికెడుభస్మం బభిమంత్రించి మహావాతాస్త్రంబు ప్రయోగించి తత్సహాయంబుగ శేషాస్త్రంబు జేర్చిన నమ్మహానగం బంతరిక్షంబున కులాలచక్రంబు పగిది దిరుగుచుండ నద్దేవి నిజశక్తిచే పర్వతశ్రేష్ఠంబును బడవేయదలంచి యశేషబలసంపన్నుండగు పన్నగేంద్రుని సహాయత్వంబున బడలేకపోయిన నచ్చెరుగుపొంది పొగడతరముగాని సిద్ధునిచరిత్రంబు శ్లాఘించి యెప్పటియట్ల నగంబు స్వస్థానంబు జేర్చుమన సిద్ధుం డట్లజేసి పిదప నజ్జగదంబాలయంబున త్రిరాత్రంబులు నివాసంబు సల్పి యనుజ్ఞ వేడ నమ్మహాదేవి సంతుష్టాంతరంగహృదయయై స్పర్శాస్త్రం బొకటి యస్త్రాభిమానాస్త్రం బొకటి రెండస్త్రంబు లుపదేశించి యాశీర్వదించెను. వసుధ

త్రుం డనుజ్ఞ గొని స్వేచ్ఛావిహారంబున ద్వాదశమల్లారదేశంబు ప్రవేశించెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్రహింగళాదేవి సందర్శన కథావిశేషంబు చతుర్థాధ్యాయము.

పంచమాధ్యాయము.

మత్స్యేంద్రనాథుం డష్టభేతాళాదులతో యుద్ధంబొనర్చుట.

మత్స్యేంద్రనాథుండు ద్వాదశమల్లారకాననంబున సంచరించుచు నొకనాఁ డొకగ్రామసమీపదేవాలయంబున నివసించి యారాత్రి గడుపుచుండ నడిరేయిసమయంబున కొఱవిదయ్యంబుల సముదాయం బొకటి యక్కాననంబున నలుదెసల దిరుగుచుండం గని వీటిని స్వాధీనపఱచుకొన్న మేలౌనని తలంచి యంబికాదత్తస్పర్శాస్త్రంబు ప్రయోగింప నవియన్నియు భారతరంగమధ్యస్థ నూతనూనుస్యందనంబుపగిది పుడమి గఱచుకొని నిలువంబడియె. ప్రతిదినం బీ భూతగణంబులు నిశాకాలంబున భేతాళునిదర్శనార్థంబై జనుచుండి యానాఁ డీదురవస్థ ఘటియించినకతంబున నరుగ లేవయ్యెను. అన్యదేశంబుల భూతసంఘంబులు భూతాధిపతియగు భేతాళుని దర్శనార్థం బరుదెంచిన భేతాళుండు తద్భూతగణంబును నిరీక్షించి శరభతీరభూతంబులు రాకున్నకారణంబేమి వారేలరారైరి? విచారించి రమ్మని నొకకొందఱిని బంప వారు శీఘ్రగమనంబున మల్లారదేశంబుజేరి పాదపంబులపగిది పదచలనంబు లేక నిలుచున్నవారలం జూచి యాశ్చర్యంబుచే నేతత్కారణం బెయ్యదియని విచారింప వారలు మేము భేతాళునిసన్నిధి కేతెంచుచుండ నెవ్వఁడో యొకమాంత్రికుండు మమ్మీకష్టంబుల బడవైచె నని విన్నవించిరి. యానూతనాగతభూతంబులు వాఁ డెట్టిసమర్థుండు కానోపునని యటునిటు వెదకుచు గ్రామసమీపదేవాలయంబున నుదయార్కబింబంబుబోలు శరీరకాంతిచే వటదుగ్ధసిక్తజటా

జూటంబుచే ఫాలంబున బాలచంద్రునిగేరు రక్తచందనతిలకంబుచే తోయజంబులనేలు నయనంబులకల్మిచే భస్మలేపితసర్వాంగుండై శైలీ సింగీ యనునాథపంథీచిహ్నంబులు ధరియించి వీరాసనంబున విరాజమానుండై యున్న యోగధూర్జటిని గనుంగొని యొక్కభూతంబు 'మహాత్మా! నిరపరాధంబగు భూతగణంబు నేల నంటించితి రేల? విముక్తుం జేయు' మని వినయోక్తులు బలుక సిద్ధుండు 'మత్కృత ప్రయోగంబునకు మీ రేల బద్ధులుగాకుండితి రని విచారించెను. తద్భూతంబులు 'భేతాళుండు శరభతీరభూతనివహంబు నిత్యనియమప్రకారంబున రాకున్న కారణంబు గనుంగొని రమ్మని మమ్మంపెను గావున భవత్ప్రతాపమహిమాతిశయంబుదలంచి గొనియాడంబూని జనుదెంచితిమి రయంబున విముక్తిజేయుము. లేకున్న కడుకష్టంబులనుభవించెదవు త్రిలోకవిదితుండగు భేతాళుని నిరుపమానపరాక్రమంబు లభివర్ణింపనేల? దేవదానవగరుడగంధర్వకిన్నరకింపురుషాదులైన నోర్వగల రే? మిమ్మేల సరకుగొనును? బలవద్విరోధంబు పనికిరా' దని నుడువు మండ బుద్ధిదత్తుండగు సిద్ధుండు 'నుద్దులేల జెప్పెదరు. భేతాళుని రమ్మని యానతిచ్చెను వారతివేగంబున భేతాళునిసన్నిధి కేగి పాదంబులకెఱఁగి మత్స్యేంద్రునిచరిత్రంబు దేటపఱచిన నప్పిశాచరాట్టు క్రోధపూరితుండై నేత్రంబుల విస్ఫులింగంబులు రాల్చుచు కర్ణాట మరాట కైకాడ బంగాళ మళయాళ కుడ్డాళ నానాదేశస్థ యష్టకోటిమహాభూతంబులను, తద్భూతనాయకులగు జోటింగ్ బాబర్ నరసింగ్ మహామర మహావీర మహాభద్రాది వీరాగ్రేసరుల కాజ్ఞాపింప వారు తమతమసైన్యంబులతో భేతాళుని కలియంజేరి వందనంబు లాచరించి విశేషం బేమి యని విచారింప భేతాళుండు గతవృత్తాంతంబు దేటపఱచి యేకముఖంబున నభోమండలం బాక్రమించు భూతమండలంబు దోడ్కొని శరభతీరంబు ప్రవేశించి ధారాధరంబులపగిది మహాధ్వానంబు జేయుచుండ నయ్యోగీంద్రుండు భస్మం బభిమంత్రించి దశదిగ్బంధనం బొనర్చి వజ్రపంజరంబు నిర్మించి సుస్థిరుండై యున్నసమయంబున నసురకోవిదులగు పిశాచనాయకులు సిద్ధునిపై పర్జన్యునిచందంబున శరవర్షంబు గురిపించుచుండ నవియన్నియు పర్వతాగ్రంబున వ్రాలిన పర్ణంబులవిధంబు నిష్ఫలంబైనం గనుంగొని యష్టనా

యకు లట్టహాసంబు జేసి భయంకరంబులగు వికృతాకారంబులు ధరియించి సిద్ధుని మస్తకంబుపై నానాభూజంబులు శుష్కతృణకాష్ఠంబులు బడవైచి యనలంబు సోకించిన నదియు నింగిముట్టి పెనుమంటలెగయుచుండెను. వసుపుత్రుండు జలదాస్త్రప్రయోగంబుచే ననలంబు రూపడంచి యాగ్నేయాస్త్రప్రయోగంబు గావించిన భూతసమూహంబులు దృశ్యాదృశ్యంబులై మెలంగుచుండెను. నాథుం డిదితగదని హుతాశను నుపసంహరించి భూతకోటిపై స్పర్శాస్త్రంబు వేయ నష్టకోటిభూతంబులు పూర్వపిశాచంబులక్రియ నేలం గఱచుకొని నిశ్చేష్టితులై నిలువంబడెను. మహాబలసంపన్నులగు పిశాచాధిపతు లీయస్త్రంబుచే బద్ధులుగాక సిద్ధనిర్మితదశదిగ్బంధనవజ్రాస్త్రం బాక్రమించి నాథుని గబళింపవలంచి సమీపించిన సాహసుండగు సిద్ధుం డచ్చెరువొంది వానవాస్త్రంబు విడచిన నయ్యది భేతాళుని ముట్టడించెను. భేతాళుండు నిర్భయహృదయుండై నయ్యస్త్రరాజంబుతో పెనఁగుచున్నతఱి యుభయయుద్ధవిశారదత్వంబున పృథివి గంపింప శేషుండు శోషింప నక్షత్రంబులు లతాంతంబులభంగి గళితంబు లౌచుండ తక్కినభూతాధినాయకసప్తకంబు నాథునిపై గవిసి చరణతలంబులు బట్టి బుడమిపై బొదువం దలంచెను. మత్స్యేంద్రుండు దృఢమనస్కుండై పునర్వజ్రాస్త్రంబున దశదిగ్బంధనం బాచరించి దానవాస్త్రంబున మధు కుంభక మరు మాలీమల ముచుకుంద త్రిపుర బలుండను సప్తదానవుల కల్పించిన జోటింగునితో మధుండు బాబరునితో కుంభకుండు మహామదునితో మరుండు ముంజునితో మాలీమలుండు మహిషాసురునితో బలుండు పెనంగి యన్యోన్యవిజయాపేక్షలచే ద్వంద్వయుద్ధంబు జరుపుచు హుంకరించి సింహనాదంబులు జేసి యొకరినొకరు బొడుచుచు నఱుకుచు మొత్తుచు నొంచుచుండ సిద్ధనిర్మిత నిశాచరముష్టిప్రహారంబుల పిశాచనాయకులు డస్సి వికలాంగులై మూర్ఛిల్లినం జూచి దానవాస్త్రం బదృశ్యంబయ్యె. తత్సమయంబున వానవాస్త్రంబు భేతాళుని మూర్ఛిల్లం జేసి యంతర్ధానంబునొందె. తదుపరి మత్స్యోదరశుక్తిముక్తుండు వాతాకర్షణమంత్రప్రయోగంబున నయ్యష్టనాయకుల చలనవలనాదులు బంధించెను. వారలు నిర్విణ్ణులై బ్రతుకలేమని నిశ్చయించి సదుపాయంబు గానక నాథుని యపారపరాక్రమంబు లుగ్గడించి రావ

ణానుజుండగు విభీషణునికై నడి భక్తాగ్రేసరుండగు ప్రహ్లాదునికితి శర ణు వేఁడిన క్షమియించునని తలంచి "హేతపోనిధే! జ్ఞానమూర్తీ! నీవు కేవలనారాయణుండవు. ఎదురెఱుంగని కలహంబు బూనితి మిక క్షణ మాత్రంబుపేక్షించిన ప్రాణంబులు నిలువవు. సకలేంద్రియవ్యాపారంబు లుడిగెను నన్నురక్షించి తేని భూతగణసమేతంబుగ దండధరునిదూతల చందంబున భవద్దాసులమై మెలంగెద"మని యనేకవిధంబుల స్తోత్రం బులు జేయు సిద్ధుండు "నే జేయు శాబరీవిద్యయం దేసమయంబున మి మ్మధిదైవతలగా దలంచెదనో తత్తత్సమయంబుల కార్యానుకూలురై వర్తింపవలయు"ననిన వారలు హర్షించి "భవదాజ్ఞానుసారులమయ్యెద" మని యొప్పుకొనిరి. నాథముఖ్యుండు కృపాకటాక్షంబుచే విభక్తాస్త్రం బున భూతకోటిని విముక్తిం జేసి భూతనాయకులబాధలం దొలంగించి రక్షించెను. వారు సిద్ధునిసమీపంబున బద్ధాంజలులై బొగడుచుండ నక్షత్రమండలంబున క్షపాకరునిభంగి నిర్జరసమాజంబున నాకాధిపతి చందంబున ప్రకాశమానుండై వెలుంగుచున్నపరమయోగీశ్వరుని భూత గణంబులు జయజయశబ్దంబుల పాణివాదంబులు జేయుచు శ్లాఘించు చున్నవయోగినాయకుండు లోకోపకారనిమిత్తంబై "భూతగణంబు లారా! భేతాళప్రముఖనాయకముఖ్యులారా! ఇమ్మహాయుద్ధకథావిశేషం బెవ్వరేని పఠియించిన లిఖియించిననేగాక నీపుస్తకం బేగృహంబున గౌరవంబుగ నుంచఁబడునో యట్టిగృహస్థులభాద్రపదశుక్లచతుర్థీచంద్రు ని జనులు జూడనొప్పనివిధంబున మీరలుజూడనేరక దూరస్థులై జనవ లయు నియ్యది శాసనవాక్యం బని డెందంబున దలంచి దొలంగవల యు" నని చెప్పిన నప్పిశాచంబు లవశ్యంబని వసుకుమారునిపాదకమలం బుల కెఱఁగి యనుమతి గొని తనుతమనిజనివాసంబుల కరిగెను. అనం తరం బా మత్స్యేంద్రనాథుండు తన్మల్హారదేశంబున కాళికాభవానీ యాలయంబు జేరెను. తత్కథాసారంబు వినిన శ్రోత లత్యంతానం దంబు నొందగలరు. శ్రోతలారా! ఈగ్రంథరాజమహిమాతిశయం బభివర్ణింప నలువకైన నలవియగునే? ప్రథమాధ్యాయపఠనంబు సర్వ రోగనివారకంబు, ద్వితీయాధ్యాయధ్యానంబు విద్యాభివృద్ధికరంబు, తృతీయాధ్యాయకథనంబున నంజనీసూనుప్రసన్నత్వంబు, చతుర్థాధ్యా యపారాయణంబు సర్వసంకటనివారకంబు, పంచమాధ్యాయఫలం

బు మహాభూతాది భయనివారకంబు గావున భక్తియుక్తులై పఠియింపవలయును.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్ర భేతాళాదిసందర్శనకథావిశేషంబు పంచమాధ్యాయము సంపూర్ణము.

షష్ఠాధ్యాయము.

మత్స్యేంద్రుండు మహాకాళిచే యుద్ధం బొనర్చుట.

మత్స్యేంద్రనాథుండు ద్వాదశమల్హార దేశ కోకణస్థానంబున కుమారస్వామిని సేవించి నానాతీర్థంబుల గ్రుంకులిడుచు కడ్డాల దేశ ప్రాంతంబున నమాళిగ్రామబాహ్యదుర్గాలయంబు జేరి పూర్వంబున గరళకంఠుండు సోకుమూకల గీటడంచం దలంచి కాళికాస్త్రంబు నిర్మించి సురారుల చీకాకుపఱచి యొకసమయంబున ముదితాత్ముండై స్వనిర్మితకాళికం జూచి వరంబు వేఁడు మన నద్దేవి బద్ధాంజలియై "నే నసురులం ద్రుంచి ప్రయాసబహుళంబుచే డస్సితి నిక నన్ను గటాక్షించి క్షితిపై స్థాపింపు" మని వేఁడుకొన నుమాధవునిచే నద్దేవి యా యాలయంబున ప్రతిష్ఠింపఁబడి రౌద్రరసం బుప్పతిల్లుచుండుటఁ గాంచి నమస్కరించి యనేకవిధంబుల గొనియాడి "యో త్రిలోకజననీ! మత్కృతశాబరీకవిత్వరచనల వశ్యాకర్షణ ద్వేషణ మారణోచ్చాటనాది సహాయంబొసంగ కరుణింపు"మని ప్రస్తుతించిన నమ్మహాదేవి సిద్ధుని జూచి "యరారా! బహుకాలం బీశ్వరకరకమలపీడితయై బడలిక జెంది విశ్రాంతిం బొందుచుండిన నన్ను నీహస్తంబున ప్రకాశించు మని వేఁడెదవు. జ్ఞానశూన్యా! నీకింతటి పొగరేల గలిగె నిద్రించుచున్నముచికుందుని కాలయవనుండు భంగపఱచి తత్ఫలం బనుభవించినచందం బీవెఱుంగవే" యనుచు బడబానలంబుమాడ్కి క్రోధపూరితహృదయయై "మూర్ఖా! వాయసంబునకు హంసంబు దాసురా లగునే? ధరాధిపుండు

దరిద్రుని గొల్చునే? పండితుండు మూర్ఖుని బొగడునే? వినతాసుతుండు గృధ్రంబును సేవించునే? దక్షాధ్వరధ్వంసి పాణితలంబున ప్రకాశించి తునకు నీవశంబై యుండుట చిత్రంబుకాదె? భ్రష్టాత్మా! నీకు విచారం బులేదే? తిరిగిపొమ్ము శాసించెద" నన మత్స్యేంద్రుండు "యోదేవీ! నీకీ గర్వంబేల మత్ప్రతాపమిత్రోదయంబున నీయజ్ఞానతమంబు బాపి వశ పఱచుకొనియెద జూడుము. పాండుసుతమధ్యముండు స్వప్రతాపంబున మారుతాత్మజుని రథధ్వజంబుపై నివసింపఁజేయుటెఱుంగవే?నన్నుదత్త శిష్యుండని దలంపవే"యని పరుషోక్తులు బలుక నమ్మహాశక్తి "మత్స్యేంద్రా! నీవు మత్స్యోదరంబున జన్మించి ధీవరునిచే రక్షింపఁబడి యోగివేషధారివై హస్తంబుల వీరకంకణంబులు ధరియించి ఫాలభాగంబున రక్తచందనతిలకంబు దిద్ది విఱ్ఱవీగుచు నాపై నస్త్రనైపుణ్యంబు జూప దలంచెదవో, భూతవ్రాతంబున ఖ్యాతిం జెందితి నని యహంకారంబుచే ప్రతాపంబు జూడు మనియెదవో, భ్రుకుటికుటిలవీక్షణంబున భువనబ్రహ్మాండంబు భస్మంబు జేయఁజాలిన మత్సమీపంబున నీయట్టిమశకప్రాయుల ప్రశంసంబేల బుద్ధిహీనా! నన్నెఱుంగవా" యనుచుండ యోగపూర్ణుండు కుపితమనస్కుండై "నీ వంబికారమణునికరంబున విలసిల్లి నిర్జరారాతుల నిర్జించితి నని దురభిమానంబు లేలబల్కెదవు? మిన్నందిన భూరుహంబు మారుతంబున పతనంబుగాదే" యని వైరారోహ వాక్యంబులు బలుకు సిద్ధునిజూచి భద్రకాళి సింహనాదంబుచేసి యుప్పరవీధి కెగసి యశనిపాతంబులభంగి పెడబొబ్బ లిడుచుండ దిగ్గజంబులు దిగులుపడియె. భూతపంచకంబు భీతిల్లె. పాతాళాదిలోకంబులు ప్రళయసమయంబని భ్రమజెందె. గిరులు గూలె. వృక్షంబులు వ్రాలె. దిశలు బగిలె. సురాసురులసమరంబో యని లోకాధిపతు లంతరిక్షంబున విమానారూఢులై జూచుచుండ నమ్మహాకాళి "యోరా మత్స్యేంద్రా! నీప్రాణంబులు రక్షించుకొనుము. వ్యర్థకలహం బేలజేసితివి? నీగురువును ధ్యానించుకొనుము. నిన్ను దండించెద ఖండించెద శిక్షించెద భక్షించెద"నని బలుకుచుండ ధైర్యధుర్యుండగు నాథుండు వాచాశూరత్వం బేలనని కించిద్భస్మం బభిమంత్రించి వాసవాస్త్రంబు ప్రయోగింప నయ్యది సహస్రార్కతేజంబై కాళికానాసుతిమిరభంగంబుజేయం దలంచి జలధు లీదు్చ బడబాగ్నిచందంబున వ్యోమమార్గంబునం జని

కాళికాభవానిం దాఁకిన నయ్యిరువురు హరిహరులంబోలి మేరుమందరంబులకై వడి భీమజరాసంధులపగిది యన్యోన్యజయకాంక్షలచే పోరుచు మహారవంబు జేయుతద్రవజన్యసాధ్వసంబునవియచ్చరమూకలువిచ్చలవిడి పరుగెత్తుచుండుతఱి సిద్ధనిర్మితవాసవాస్త్రంబును కాళికాభవాని గ్రసించి మహాక్రూరరూపంబు దాల్చి నాథుని గబళింప జనుదెంచుచున్న నయ్యోగిసార్వభౌముండు భస్మయోగంబున నేకాదశమహారుద్రాస్త్రంబు కల్పించి ప్రయోగింప నద్దేవి యప్రతిహతంబని దలంచి రుద్రసూక్తంబులం బ్రస్తుతించిన నమ్మహాస్త్రం బంతర్ధానంబు నొందె. నాథుం డదిచూచి వజ్రాస్త్రప్రేరితంబు జేసి తత్సహాయంబున ధూమ్రాస్త్రంబు ప్రయోగించిన నద్ధూమ్రం బంబరంబు గప్పి ఘోరాంధకారంబు గ్రమ్ముచుండ వజ్రాస్త్రం బంబికను ముట్టడించెను. దేవియు వజ్రాస్త్రంబును నరకుగొనక పాదంబుల నదిమి పర్వతాగ్రంబుపైఁ బడవైచెను. (అమ్మహీధరంబు శిథిలంబై సహ్యపర్వతనామంబుచే ఘూర్జరదేశంబునం దిప్పటికి ప్రకాశించుచున్నది) ఇత్తెఱంగున ప్రతిలేని పరాక్రమాతిశయంబు జూప నత్తపోధనుండు పశుపతి పాశుపతంబు కరణి చక్రి చక్రాయుధంబుమాడ్కి వజ్రి వజ్రాయుధంబురీతి శ్రీగురుదత్తాత్రేయు దత్తవాతాకర్షణమంత్రప్రయోగంబు సల్పిన నయ్యది యంబికాహృదయగతంబై పంచప్రాణవాయువులు తావుల్ దప్పించి నిజశక్తి జూపిన నమ్మహాదేవి చేతనంబు దప్పి కంఠగతప్రాణయై గతిదొలంగి భూతలంబుపైఁ బడ తద్దేహభారతాడనంబున భూధరంబులు నుగ్గై వ్రాలుచుండ సకలేంద్రియవ్యాపారంబు లుడిగి పరమేశ్వరార్పితచిత్తయై యఱువదిమోములవేల్పు నుద్దేశించి "కరుణాసింధో! దీనశరణ్యా!" యని స్మరియించెను. త్రినయనుండు స్వనిర్మితకాళికాస్త్రప్రాణభంగసమయంబు మత్స్యేంద్రనాథకృతపరాక్రమంబు దలంచి వృషభారూఢుండై జనుదెంచుచుండ సిద్ధుం డెదురేగి త్రిపురారి పాదకమలంబుల వ్రాలి నమస్కరించిన నప్పరమేశ్వరుండు ప్రసన్నహృదయుండై వృషభంబు డిగ్గి దశహస్తంబుల ననుపుత్రు లేవనెత్తి ప్రేమాలింగనం బొనంగి "వత్సా! నుత్కరంబున విరాజమానంబై నిశాచరమూకల రూపుమాపిన కాళికాస్త్రంబు నేఁడు నీచే నోటుబ

డియె. నీయవక్రపరాక్రమం బమితంబయ్యె” ననిన సిద్ధుండు “హేదయాపరమూర్తీ! బదరికాశ్రమంబున భవత్కటాక్షంబుచే త్రిమూర్తుం డనేకమంత్రరహస్యంబు లుపదేశించిన దీవెఱుంగవే అయ్యది నీయనుమతి గాదే” యని బొగడుచుండ హరుండు “నాథా! మంత్రోపసంహారంబున కాళికం గావు” మని యాజ్ఞాపించెను. యోగిముఖ్యుండు “దేవా! భవత్కరకమలంబున దేజరిల్లిన కాళికాస్త్రంబు నేజేయు శాబరీవిద్యకు సహాయంబై కార్యానుకూలసమయంబున నన్మనుఖంబున మంత్రరూపంబున నివసింపం జేయవే” యని ప్రార్థింప హరుండు హర్షించి కాళికను రక్షింపు మని జెప్ప నంత సిద్ధుండు పినాకిపాదంబులకు ప్రణమిల్లి భస్మం బభిమంత్రించి యుపసంహారంబు జేయ నద్దేవి తేలికగలిగి దననికటంబున సంకటహరుండగు శంకరుండు ప్రసన్నుండై యున్నంగాంచి యగ్గరళకంఠుని పదసరోజంబులమీఁద వ్రాలి “సర్వేశా! ప్రహ్లాదునికై పంకజాక్షుండు నృసింహుండై రక్షించినక్రియ సుమిత్రాసుతునికై యంజనీసూనుండు సంజీవిం దెచ్చి బ్రతికించినపగిది మీరు నాపాలిదైవం బై నకతంబున రక్షించితి” రని పొగడుచుండ నగ్గిరివరనిలయుండు “యో దేవీ! మద్వచనం బాకర్ణించి మత్స్యేంద్రనాథకృతశాబరీవిద్యకై సహాయంబగుము. నిన్నేమంత్రంబున దేనికై నుచ్చరించునో తత్కార్యపరిపూర్తి జేయకోరెద” నని విచారింప నజ్జగదంబ పరమేశ్వరాజ్ఞ పరిపాలించ నిశ్చయించి నాథుని బిలిచి “సిద్ధముఖ్యా! నీమనోరథం బీడేరె. నీ వేసమయంబున నేమంత్రంబున నన్ను దలంచెదవో తత్క్షణంబ భవత్సంకల్పసిద్ధి జేయుదు” నని కరతలంబున కరతలంబిడి సమాధానపఱచె ననంతరంబ యద్దేవి నిలయంబున శివుండు సిద్ధుండు త్రిరాత్రంబులు సుఖగోష్ఠిం గడపి కపాలి కైలాసంబు జేరె. మత్స్యేంద్రనాథుండు త్రరమార్గంబున గమనంబు జేయుచు గదాతీర్థంబున స్నానంబులాడి హరేశ్వరదర్శనార్థంబై జనుదెంచుచుండ ప్రతాపరుద్రుండగు వీరభద్రుండు యోగప్రముఖుండగు మత్స్యేంద్రునితో యుద్ధవిశారదత్వంబు జూపిన కథావిశేషంబు ముందటియధ్యాయంబున జెప్పంబడు గాన శ్రోతలారా! ఈసప్తమాధ్యాయ శ్రవణఫలంబున వశ్యాకర్షణద్వేషణమారణాదిప్రయోగంబులు వాతాహతజీమూతంబుపగిది దొలంగునని క్షీమ్యాగర

గ్రంథరాజంబున గోరక్షునిశాసనవాక్యంబులు గలవు గావున శ్రద్ధాత్ములై వినదలంచెదరుగాక.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్రనాథ కాళికాదేవి యుద్ధవిషయకథావిశేష షష్ఠాధ్యాయము సంపూర్ణము.

సప్తమాధ్యాయము.

మత్స్యేంద్రనాథుండు వీరభద్రునితో యుద్ధంబొనర్చి జయంబుగొనుట.

సచ్చరిత్రుండగు మత్స్యేంద్రనాథుండు గిదాతీర్థంబున స్నానంబులాడి మహేశ్వరదర్శనకుతూహలుండై చనుదెంచుచున్న సమయంబున ప్రతాపముఖ్యుండగు వీరభద్రుం డేతత్తీర్థరాజస్నాననిమిత్తం బరుగుచు మార్గమధ్యంబున నన్యోన్యదర్శనంబు ఘటియించినంత పరస్పరవందనంబు లాచరించుకొన్న పిదప వీరభద్రుండు మత్స్యేంద్రునితో "యోగిపురుషా! నీనామంబేమి నీయోగమార్గం బెయ్యది. నీచిహ్నంబులు దెల్పు"మని విచారింప నయ్యోగిపుంగవుండు "నానామంబు మత్స్యేంద్రుఁడందురు. నాయోగంబు నాథపంథీయోగం బనియెదరు. శైలీసింగి కంథా శ్రీగురుదత్తచిహ్నంబు"లని దెలియఁజెప్ప శివకుమారుండు వసుకుమారునితో "నీకు కర్ణఛేదనం బేలగలిగె" ననిన సిద్ధుం "డియ్యది మద్గురునిర్మిత నాథపంథీచిహ్నం" బని చెప్పెను. వీరభద్రుండు "శాస్త్రానుకూలంబగు చిహ్నంబు లనేకంబులుండ నిట్టి వేదవిరుద్ధ నూతననాథపంథీయోగం బెవఁడు కల్పించెనో నీగురు వెట్టి మూర్ఖుండో కర్ణఛేదనమార్గం బేశాస్త్రంబో యోగ్యాయోగ్యం బెఱుంగని మూఢమతులు నూతనమతంబుల గల్పించెదరు గాన నీ పీచిహ్నంబులు విడువుము. లేకున్న శిక్షించెద" ననవిని సిద్ధపురుషుండు తొకద్రొక్కిన త్రాచుచందంబున మండిపడి నిండుకోపంబుతో "శతమూర్ఖా! భావంబున సర్వసమత్వంబు లేక బరుల నిందించిన నీకు పాపం బాపాదించదే! నీగుణదోషం బీ వెఱుంగక మద్గురుమూర్తిని దిరస్క

రించెదవు. పాపాత్మా! నీముఖావలోకనపాపం • బేదివ్యతీర్థస్నానంబున బాయునో భ్రష్టా నష్టా దుష్టా నీవు కేవల శిశ్నోదరుండ" వని పలికిన నవ్వీరభద్రుండు ప్రచండకోపోద్దీపితమానసుండై మహోద్దండకోదండం బెత్తి యర్ధచంద్రసాయకంబు బూని జ్యాఘోషంబుజేసి "ప్రాణంబులు దీయుదు" ననుచుండ సిద్ధుండు వీరభద్రునితో "జ్ఞానహీనా! అజాగళస్తనంబులభంగి వృథాసల్లాపంబు లేల సలిపెదవు? బహురూపుల వేషభయంబు ఖండనంబున కనుకూలంబో నీబోటిశూరుల నెందరినో జూచితి" ననిన వీరుండు "మత్స్యేంద్రా! మత్కరవిముక్తసాయకంబుల ప్రాణంబుల బాయుదువు నీకాలంబు సమకూరె. నీగురువును స్మరియించుకొను" మన నాథుండు "మశకంబునకై హొన్నుముల గనలునే! సురాసుర నరోరగాది వందితపదారవిందుండగు మద్గురుమూర్తి నీకేల ఖరకరుండు ఖద్యోతంబులపై నిజశక్తి జూపునే! నీగర్వనిర్వాపణంబు మత్స్యేంద్రుండు జేయంజాలండే" యని కఠినోక్తు లాడుచుండ శూలితనయుండు "దురాత్మా! నీమస్తకంబు భూస్థలిం బడవేయుదు. రామమంత్రంబు దలంపు" మని పలికిన నయ్యోగిశేఖరుం "డౌరా! రామమంత్రం బనుంగళకరంబే? గరళకంఠుండు నిరతంబుస్మరియించండే? త్రిలోకపావనంబగు రామమంత్రంబు నన్నుద్ధరింపదే? గనుంగొను" మని భస్మం బభిమంత్రించి దశదిగ్బంధనం బాచరించి వజ్రపంజరకవచధారకుండైన, భద్రుం శోకనిర్వాణశరంబు సిద్ధునిపైఁ బఱపిన, నాథుండు తృణతుల్యం బని దలంచుచుండ నయ్యది వ్యోమమార్గంబున జనుదెంచి నాథనిర్మితవజ్రపంజరంబుచే భంగపడిన, వీరుండు క్షోభించి మహాశక్తిసాయకంబు బ్రయోగించి తత్సహాయంబుగ నాగాస్త్రం బడరించిన నయ్యవి గగనంబున కెగసి చరియించుచుండ నందు మహాశక్తికృత కోలాహలధ్వానంబుచే నుడుగణంబులగతులుదప్ప దిశాధిపతు లాశ లుడుగ దిగ్గజంబులు కంపింపఁ గువలయంబు చలింప నహికులాగ్రగణ్యుండు దిగులుజెంద మహాప్రళయసమయంబని బృందారకు లరిపార ననేకార్కసంకాశంబై సిద్ధనిర్మితవజ్రకవచంబు భేదించి నాథునిప్రాణహరణార్థంబై జనుదెంచిన నయ్యోగిధూర్జటి రుద్రాస్త్ర గారుడాస్త్రంబులు వఱపిన, తద్రుద్రా

స్త్రంబున నేకాదశరుద్రులుదయించి మహాశక్తినిముట్టడించిన నదిక్షీణించి మాయంబైన, రుద్రాస్త్రం బంతర్ధానంబునొందె. ఖగేంద్రాస్త్రంబు నాగాస్త్రంబును భక్షించి యదృశ్యంబయ్యె. రుద్రనందనుం డదిచూచి వాతాస్త్రంబు ప్రేరించెను. వసునందనుండు పర్వతాస్త్రంబు నేసె. శంభుసుతుండు వజ్రాస్త్రంబున పర్వతాస్త్రరూపంబు మాపి యాగ్నేయాస్త్రంబు బ్రయోగింప సిద్ధుండు జలదాస్త్రంబున జల్లార్చెను. వీరుండు కామాస్త్ర దానవాస్త్రంబులు బఱపిన, నాథుండు రత్యస్త్ర దేవాస్త్రంబులచే యుద్ధకౌశలంబు జూపుచుండ వీరముఖ్యుండు “మత్స్యేంద్రా! మత్సమక్షంబున యుద్ధదక్షుండగు శూరుండు గలఁడే? భవద్గురుప్రాజ్ఞత్వంబు యుష్మద్వైజ్ఞానికత్వం బమోఘం” బనిన మత్స్యేంద్రనాథుం “డియ్యది మద్గురుకటాక్షవీక్షణఫలితం” బనుచు సరసోక్తులు బలుకుచుండ భద్రుండు బ్రహ్మాస్త్రంబు ప్రయోగించెను. తపోధనుండు తత్ప్రతిహతం బొందులేమిం జేసి బ్రహ్మాస్త్రంబు బ్రహ్మాస్త్రంబున నుపశమనం బొనర్చె ముక్కంటిబిడ్డఁడు జెల్లుచూలోకల నేయ నజ్జడదారి పడతుల తూపు బఱపి రూపడంచినం గని వీరరసోద్రేకముద్రితుండగు వీరభద్రుండు కృతాంతాస్త్రంబు వేయ సిద్ధముఖ్యుండు ప్రళయకాలమాయాస్త్రంబు ప్రతిఘటింపం జేసిన నది కాలాస్త్రంబును గబళించి యాకసంబున పరిభ్రమించుచుండ జగంబులు మడియునని తలంచి త్రిదివేశులు నుపశమింపుమని సిద్ధుని గొనియాడుచుండ సమయంబున నంచగరుడిగిబ్బరౌతులు వేల్పుమూకలగొని యబ్బురంబున నచ్చోటికరుగుదెంచి ‘మత్స్యేంద్రా! మన్నింపు’మన్న నతం డమ్మహామాయాస్త్రంబుపసంహరించెను రుద్రుండు భద్రునిబిలిచి మత్స్యేంద్రుండు కవినారాయణుండని యతనిచరిత్రంబు దెల్పి సఖ్యంబు గూర్చిన, వీరభద్రుండు సంతుష్టుండై “నాథా! అపారబలసంపన్నులగు సురాసురులు మద్బలపరాక్రమాతిశయంబుచే నోటుబడరే? యుద్ధవిశారదుండగు కల్పాంతకభైరవుండు మత్కరవిముక్తసాయకంబుల గ్రాఁగఁడే? నీయట్టి ధైర్యధుర్యుని గాననైతి. నీయభీష్టంబు వేఁడు” మని యడుగ నయ్యోగిశేఖరుండు “వీరమూర్తీ! సర్వజనోపకారంబగు నాచే రచియింపఁబడు శాబరీమంత్రకల్పంబున కనుకూలుండవై నిన్ను స్మరియించినమాత్రంబున సమయోచితకార్యంబులు జక్కం జేయగల

వని కోరెద" నన వీరభద్రుం డియ్యకొని కరతలం బొడ్డెను. నిఖిలసుర గణంబులు సిద్ధునకు వందనంబు లాచరించి తత్తన్నియమంబుల భవదా జ్ఞాధారకులమయ్యెద మనుచుండ శ్రీమన్నారాయణుండు నిర్వక్రవి క్రమంబున ధరణీచక్రంబుం గబళించు దనచేతి చక్రంబు, ఫాలనే త్రుండు ప్రళయకాలబడబానలంబుమాడ్కి ప్రజ్వరిల్లుచుండు తనచేతి త్రిశూలంబు నద్భుతచరిత్రుండగు "మత్స్యేంద్రున కొసంగ నవ్విశ్వ ధూవల్లభుండు "సిద్ధా! మదీయవరప్రభావవిశేషంబున నీవు శాపా నుగ్రహసమర్థుండ వయ్యెదవు. నీవాక్యంబులు వేదవాక్యంబులం బోలు" నని యానతిచ్చెను. తాపసోత్తముండు హరిహరబ్రహ్మల పదసరోజంబుల కెఱఁగిన, వా రత్యంతప్రేమపూరితులై హృదయా లింగనంబు లొసంగి దీవించినంత నింద్రాగ్నియమ వరుణప్రముఖాఖిల దిశాధిపతులు తమతమ దివ్యాస్త్రంబులు ప్రయోగోపసంహారంబుల దెలిపి యనుగ్రహించి నిజనివాసంబుల కరుగుచుండ సిద్ధుండు వైకుంఠ నాయకునితో 'దయాసముద్రా! వైకుంఠమణికర్ణికాస్నానాపేక్ష గల'దని విన్నవించిన, భగవంతుండు హర్షించి దనవిమానంబుపై సమీచీనాసనం బున సుఖాసీనుం జేసి వైకుంఠంబు జేరి నాథునిమణికర్ణికాస్నానంబులాడించి షడ్రసోపేతభోజనంబుల స్వపఙ్క్తిఁ దృప్తుని జేయుచుండ మత్స్యేంద్రుం డొకనాఁడు "కమలాక్షా! కృపాఘనా! మత్పూర్వశరీరంబు పర్వతరాడ్గు హాయం దుంచఁబడియుండెఁ గాన నే నద్దేహంబు జూడందలంచెద" నని కోర, నారాయణుండు వల్లె యని యోగిముఖ్యుని వెంటఁగొని యుదిరిమలగుహ జేరి యందు నవనారాయణుల తొమ్మిది స్థూలకా యంబులు వాసుదేవుని శరీరం బొకటి సమాధింబొందియుండుట గను పఱచి పునర్వైకుంఠనగరంబు ప్రవేశించి యొకవర్షం బచ్చట గడపి నంత మహాత్ముండు యోగిచంద్రుని కైలాసంబునకు దోడ్కొని పోయి సుఖగోష్ఠి నుండె. నొకనాఁ డమరాధిపుండు వెలితిప్ప కరిగి మిత్తిగొంగపాదంబుల కెఱఁగి యమ్మేటితపసిని దోడ్కొని యమరావతీన గరంబు ప్రవేశించెను. మత్స్యేంద్రుండు తత్పురంబున మాసత్రయంబు నివసించియుండ బ్రహ్మపంపున నారివేరపు దపసి యరుదెంచి యతీం ద్రుని దోడ్కొని సత్యలోకంబున కేగిన నప్పరమేష్ఠిసదనంబున షణ్మా సంబులు గడపి గరుడగంధర్వకిన్నరకింపురుషాదుల సంతుష్టపఱచి దేవ

విమానారూఢుండై యమృతాంధసులఁగూడుకొని మర్త్యలోకంబు ప్రవే
శించెను. పిదప సిద్ధుని యనుమతి బడసి సురలు నిజపురంబులకరిగిరి.

మత్స్యేంద్రనాథుండు వజ్రభగవతీదేవిని సంతుష్టఁజేయుట.

మత్స్యేంద్రుండు తీర్థయాత్రాపరతంత్రంబున నానాదేశంబులు సేవించుచు కైకాడ దేశాంతర్గత పశ్చిమదేశంబున వజ్రవనంబుఁజేరి యచ్చట వజ్రభగవతిని దర్శించి తద్దేవ్యాలయనికటంబున మున్నూటఱువదికుండంబు లుష్ణోదకపూరితంబులై యున్న నాథుండాశ్చర్యహృదయుండై యన్నిట స్నానం బాచరించి యుష్ణతోయంబుల కారణంబు విచారించి నూతనకుండం బొకటి నిర్మింపవలయు నని దేవళంబు జేరి యర్చకుల నడిగిన వారలు "పూర్వంబున తాపసోత్తముండగు వసిష్ఠుండు జన్నంబు చేయుచుండ తత్క్రతుసమారంభమునకై యరుదెంచిన సుపర్వులకొఱకు ఉష్ణోదకపూరితకుండంబులు కల్పించె. నందు సుపర్వాణులు స్నానంబు లాడుచు క్రతుసమాప్తిని తత్కుండంబులకు తమతమనామంబు లిడి యరిగి" రనిన విని మత్స్యేంద్రుం డొకపవిత్రస్థలంబు గాంచి యాపోస్త్రంబు ప్రయోగించి వరుణమంత్రంబు జపియించిన తత్సమయంబున పాతాళభోగవతీనదీజలంబు పైకరుదెంచిన, శూలిదత్త త్రిశూలంబుచే కుండంబు నిర్మించి తత్తోయంబులు కుండంబున పూరితంబుజేసి యాగ్నేయాస్త్రంబున తప్తంబు కావించి యోగివరిష్ఠుం డాజీవనంబుల స్నానంబులాడి యద్దేవి కభిషేకించిన నమ్మహాదేవి ప్రత్యక్షంబై "యోగీంద్రా! భోగవతీతోయంబుల స్నానం బాడించితివి. నీయట్టి సమర్థుండు గలఁడే? నీ విచ్చట నొకమాసంబు నివసించు" మన సిద్ధుం డట్లజేయ నద్దేవి నాథుని సుభాషితంబులచే తోషింపుచుండ నొకనాఁడా మత్స్యేంద్రుండు "యోజననీ! నీకు వజ్రభగవతీ యనునామం బేలగలిగె" నని విచారింప నమ్మహాభగవతి "తపోధనా! పూర్వకాలంబున వసిష్ఠుండు హవనంబుజేయుసమయంబున మహర్షులు సభదీరి కూర్చున్నస్థలంబున కమరేంద్రుం డరుదెంచి యాహ్వానంబు లేదని సక్రోధుండై వజ్రాస్త్రంబు ప్రయోగించెను. శ్రీరామచంద్రుండు కనలి తృణంబున నను గల్పించి యడరించిన నేనా వజ్రాస్త్రంబును గబళించితి నమరనాయకుండు హతగర్వుండై రఘుపుంగవుని గొనియాడి వజ్రాయుధంబు దయచేయు మన నద్దయాసము

ద్రుండగు రామభద్రుండు నాచే గ్రసితంబగు దివ్యాయుధం బిప్పించి క్షమించి యనంతరంబ నన్ను 'వజ్రభగవతీ' యనునామం బిడి యిచ్చట స్వీకరకనులంబున స్థాపించెను. తదాది నన్ను వజ్రభగవతీ యని పూజించెద రనియు, అయ్యా నీచే భోగవతీతోయంబుల స్నానం బాడి సంతసించితి నియ్యది నీపుణ్యవిశేషంబునకాదే" యని పొగడుచుండ మాసనంపూర్తి జెందినకతంబున నాథుం డద్దేవిచే ననుజ్ఞఁగొని యుత్తరదేశంబునకేగి ద్వారకను సేవించి యయోధ్యానగరంబు ప్రవేశించెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్ర వీరభద్ర యుద్ధకథావిశేష సప్తమాధ్యాయము సంపూర్ణము.

అష్టమాధ్యాయము.

{ మత్స్యేంద్రనాథుం డయోధ్యానగరంబున పాశుపతనామ పృథ్వీశునికై సూర్యునితో యుద్ధంబొనర్చి శ్రీరామచంద్రుని ప్రత్యక్షం బొనర్చుట. }

మత్స్యేంద్రనాథుండు గోముఖితీర్థంబుల స్నానంబాడి ద్వారకాధీశుని దర్శించి గమనంబు జేయుచు నయోధ్యానగరంబు ప్రవేశించి సరయూతీరంబున గ్రుంకులిడి యాశ్రితజనామరమహీరుహుండగు శ్రీరామభద్రునిదర్శనార్థంబై జనుచుండె నట్టియెడ దాశరథి వంశజాతుండగు పాశుపతనామంబున బ్రకాశించు ధరాధిపుండు నుచ్చైశ్శ్రవంబుల దిరస్కరించు హయసహస్రంబులతో దిగ్గజంబుల తృణీకరించు మత్తమాతంగవ్రాతంబుతో హాటకాచలగంభీరులగు దళసముదాయంబుతో వేత్రపాణులుస్తోత్రంబులుజేయ వందిమాగధులుబొగడుచుండ దండధరు లిరుపార్శ్వంబుల నుపరక్షకులై యుండ దివ్యాంబరంబులు ధరియించి మణిఖచితహిరణ్మయాభరణంబు లవయవంబులలంకరింప పూర్వపశ్చిమభాగంబుల భటకోటి నడుమ దివాకరవర్గం

బున దేజరిల్లెడు పాకారిభంగి వినోదవైభవంబులతో రథారూఢుండై యోగిజనహృదయకుశేశయాభిరాముండగు మేఘశ్యాముని దర్శనార్థంబై జనుదెంచి తదాలయంబు జేరినంత దండధరులు ద్వారరక్షకులై నిలుచున్నసమయంబుననగణితగుణవిశేషుండగు యోగిశ్రేష్ఠుండు ద్వారసమీపంబు జేరి లోపలికిం బోదలంచిన, సప్తజన్మంబుల తస్కరులై బ్రహ్మహత్యాద్యనేకపాతకంబులచే శునకంబులక్రియ ప్రతీహారులై యుచ్చనీచంబు లెఱుంగని మందమతులు సురలోకనందితుండగు నాథుని నిందించుచు "నోరా! భిక్షుకుండవై భూవిభుఁ డున్న సమయం బెఱుంగక లోపలికిం బోయెదవే జ్ఞానహీనా! విచారంబు లేదే" యని మెడ నెట్టి ద్రోసిన సిద్ధుండు క్షోభించియు పాశుపతాజ్ఞానుసారప్రవర్తకులగు సేవకులపై కోపంబేల నని తలంచి సతులు దమ పతులకు వశులగుపగిది స్వతంత్రహీనులగు సేవకులు నిపరాధులు..వీరి ననవేల? పుడమిపతి చిత్తోద్రేకం బడంచిన భటులు దడబడుదురని భస్మంబు గొని స్పర్శాస్త్రంబుబ్రేరించిననయ్యది యానరనాయకుండు దశరథాత్మజుని చరణారవిందంబుల కెఱుంగ ధరణిపై దండంబుకై వడి బడియున్న సమయంబున ముట్టడించెను. నృపుం డపుడు లేవఁ దలంచి యయ్యస్త్రరాజమహిమాతిశయంబుచే నేలం గఱచుకొని ఖిన్నుండై యుచితాలోచనపరుండగు సచివుని బిలిచి వృత్తాంతంబు దెలుప మంత్రిశేఖరుండు తనమంతనంబున సిద్ధపురుషుల మంత్రప్రయోగంబు గాఁబోలును. మూఢమతులగు భటు లేమహాత్ముని నిందించిరో లేకున్న నీదురవస్థ లేల ఘటియించును? భక్తాగ్రేసరుండగు ప్రహ్లాదునికై నక్తంచరుండు మడియఁడే? దూర్వాసుండు దురాగ్రహంబున నంబరీషునిచే భంగపడఁడే? దాసాభిమానియగు కేశవుండు ద్విరదంబుకై నక్రంబును చక్రంబున దునుమఁడే? యని దలంచుచు ద్వారసమీపంబు జేరి రక్షకులచే గతవృత్తాంతంబు దెలుసుకొని నలుదిశలు నిరీక్షించి యొక్కచో నిక్కమగు యోగిమూర్తిని గనుంగొని "సమర్థా! కామక్రోధాదిషట్కంబు కడకు ద్రోసి శాంతశమదమాదిగుణంబుల కాటపట్టై మాయట్టిభవసాగరనిమగ్నుల కడ తేర్చం దలంచి లీలామానుషవేషంబున మెలంగెడు దయాఘనుండవు గావున పుడమీశుని

రక్షింపు" మని వేడుకొన నాథుండు ప్రసన్నుండై భస్మం బభిమం
త్రించి విభక్తాస్త్రంబు బఱపిన భూనాయకుండు విముక్తుండై విశ్రమించి
సుఖసమాచారంబు దూతచే సఖుండగు మంత్రిముఖ్యునికి దెలుప ప్రధా
నిశేఖరుండు సంతసిల్లి మత్స్యేంద్రుని హస్తంబు గొని శ్రీరామచంద్రాలయం
బు జేరి మునుముందుగా నిరుపమానంబగు సిద్ధుని చరితంబు దేటపఱచిన
నప్పాశుపతుండు భీతహృదయుండై యమ్మునిముఖ్యుని చరణకంజంబు
ల శిరంబు మోపి "దయాపరమూర్తీ! తమనామధేయంబు దెలుపు"
మని విచారించె నవ్వసుపుత్రుండు కనికరంబు బూని "రాజోత్తమా! నన్ను
మత్స్యేంద్రుం డనియెద" రని పలికిన నద్భుతచరిత్రుండగు సిద్ధముఖ్యుని
సుద్దులంతకుమున్నె ఱింగిన కతంబున నేడు నేత్రంబులం జూడనయ్యెనని
పరమానందభరితుండై సచ్చరిత్రుని సుగుణరాజిని బొగడుచు నిజనికేత
నంబునకు దోడ్కొని చని సభాస్థానంబున రత్నమయసింహాసనంబుపై
యలంకృతుం జేసి షోడశోపచారంబుల బూజలు సలిపి తనుమనోధ
నంబు లర్పించి భక్తియుక్తుండై శయనభోజనాదుల నెడతెగక సేవ
లొనర్చుచుండ నాథుం డక్కరచే "పాశుపతా! నీమనోభీష్టంబు
దెలుపు" మన నరాధిపుండు నమ్రుండై "హే కరుణామయా! సచ్చిదా
నంద పరబ్రహ్మమూర్తియగు శ్రీరామచంద్రుని దర్శనంబు జేయింపు"
మని విన్నవించెను. నాథుం డంగీకరించి నరపాలుని దోడ్కొని కొలు
వుకూటంబు గడచి యొక్కచో నిలువంబడి ధూమాస్త్రంబు కల్పించి
పాశుపతవంశనాయకుండగు వేలుపుల యిక్కపై నిగుడించిన నయ్యది
చదలుముట్టి మబ్బులం గప్పి యద్దినేశుని శతాంగంబు జుట్టుకొని వెతలం
బెట్టుచుండ చండాంశుండు మత్స్యేంద్రునికృతంబని యెఱుంగక నొక
క్షితీశుని ప్రయోగనైపుణ్యం బని తలంచి మహావాతాస్త్రంబు బఱ
పిన నది ప్రళయకాలఝంఝానిలంబుపగిది భాసిల్లి దిక్కులం బిక్కటి
ల్లిన నగంబులు కందుకంబులకరిణి నెగయుచుండ వృక్షంబులు సమూ
లంబులై పక్షుల పగిది యంతరిక్షంబున గ్రుమ్మరుచుండ నపగతధూ
మ్రజీమూతుండై వెలుంగుచున్న కమలమిత్రుని జూచి సిద్ధుండు పర్వ
తాస్త్రంబుచే మార్గంబును బంధించి తే రరికట్టెను. సహస్రకరుండు
వజ్రాస్త్రప్రయోగంబున భూధరంబుల బొడిసేయ యోగిపుంగవుండు
భ్రమణాస్త్రం బసరించిన ప్రభాకరుని స్యందనంబు కులాలచక్రంబు

పగిది భ్రమణంబు జేయుచున్నంత నాశ్చర్యంబున తమోంతకుండు
ష్ణాస్త్రప్రయోగంబుచే తచ్ఛ్రీమణిశరభంజనంబు గావించి నభోమా
ర్గంబున నేగుచుండ నమరలోకవందితుండగు మత్స్యేంద్రుండు వాతా
కర్షణమంత్రప్రయోగంబుచే ఖద్యోతుని చేతనంబు దప్పించి రథహ
యంబులగతి యడంచి దశవాయువుల నాకర్షింప స్యందనంబు విష్ణుప
దంబు దొలంగి యుర్విపైఁ బడ తపనుని కిరణజ్వాలానలంబుచే ధరణి
దహించుచుండుతఱి యయ్యనఘుండు జలదాస్త్రంబుచే శాంతపఱ
చిన నాదిత్యుండు నిశ్చేష్టితుండై పడియుండెను. తత్సమయంబున
హరిహరబ్రహ్మేంద్రాగ్నియమవరుణకుబేరప్రముఖ నిఖిలామరులు నత
లవితలసుతలాది లోకనాయకులు వృక్షశాఖాగ్రంబులపై బక్షిసమా
జంబు ప్రవేశించుచందంబున మత్స్యేంద్రునిసన్నిధికి విచ్చేసిరి. రమా
ధవుండు "మత్స్యేంద్రా! నైర్ఘృణ్యంబున సుధాకరమిత్రునిచే వృధా
ప్రధనం బొనర్చుట తగునే" యన నాథుండు కమలాక్షుని చరణకమ
లంబులకు బ్రణమిల్లి "దామోదరా! ఇనవంశజాతుండగు పాశుపతుని
యోగక్షేమలాభంబులు వంశనాయకుండగు దినేశుండు విచారింపఁ
గూడదే? సేవకుని గాపాడనిస్వామి స్వామియౌనే? బాలకుల బోషింపని
తల్లి తల్లియౌనే" యని పలుకుచు "వైకుంఠనాయకా! మత్కృతశాబరీ
విద్యకై యీవేయి చేతులదిట్ట సహాయంబొనగూర్చి యిప్పాశుపతనామ
పృథ్వీశునకు దివ్యమంగళవిగ్రహుండగు శ్రీరామచంద్రునిదర్శనం
బొసంగవే" యని ప్రార్థింప లక్ష్మీనాయకుండు "సిద్ధముఖ్యా! నీమనోర
థంబు లీడేరు. నీవాక్స్థానంబున త్రిలోకపావనుండగు భాస్కరుండు
ప్రత్యక్షంబై నిలుచు. మున్నునాగాశ్వత్థవృక్షంబున నాదిత్యాది దేవతలు
ప్రసన్నులై వరంబు లొసంగిన దెఱంగ మో శీఘ్రంబున తపనునితాపోప
శమనంబు జేయుఁ"మనుచు పాశుపతపృథివీశునకై విశ్వోద్భవస్థితిలయాది
హేతుభూతుండగు రామభద్రుని దర్శనంబు జేయించిన శివుండు హర్షిం
చుచుండ పాశుపతుండు ముదాన్వితహృదయపంకేరుహుండై తాపత్ర
యోపశమనుండగు శ్రీరాముని పదకమలంబులపై విన్యస్తమస్తకుం
డయ్యెను. రఘుపుంగవుండు పాశుపతుని దనహస్తంబుల నెత్తి "పాశు
పతా! వంశపావనచరిత్రుండవైతి" వని పలుకుచుండ మత్స్యేంద్రుం
డయ్యినకులాబ్ధిచంద్రుండగు జానకీపతిచరణసరోజంబుల కెఱఁగి

కృతాంజలిపుటుండై వికసితోత్పలదళశ్యామ త్రిలోకాభిరామా! యని యనేకవిధంబుల స్తోత్రంబులు జేయుచుండ పరంధాముండు వసుకుమారు నెద నదుముకొని "నాథా! వరంబు వేఁడు" మనెను. సిద్ధుండు "నీయనంతనామంబులలో నక్షత్రమండలంబున సుధాకరు నిభంగి బ్రకాశించెడు త్రిలోకపావనంబగు రామనామంబు మన్నిర్మిత శాబరీకల్పంబున కల్పద్రుమంబుకైవడి కామ్యపరిపూర్తి జేయం దలంచెద" నని కొనియాడ రాముండు "సిద్ధముఖ్యా! బ్రహ్మవిష్ణు మహేశ్వరస్వరూపుండగు దత్తాత్రేయుని వరదహస్తంబు నీమస్తకంబుపై యుండ నృసింహాదులు సహాయంబై వరంబు లొసంగ నేను నీమనోభీష్టంబు దీర్పకుందునే? నానామం బేమంత్రంబున స్మరియించెదో అయ్యది కార్యానుకూలం బగును. నీవు కేవల కవినారాయణుండవు మనయుభయులకు భేదం బేల? నాదిత్యుండు నభంబున లేమిం జేసి యంధకారబంధురంబగు వసుంధరను జూడుము. జగద్వ్యాపారంబు లుడిగెను. తడవేల నుపశమింపు" మని చెప్ప యోగిసార్వభౌముండు వాతాకర్షణం బుపసంహరించిన నద్దివాకరుండు లేచి చూచుచుండ సురసముదాయంబు వందనంబు లాచరించినం గైకొని నికటంబున నిల్చియున్న హరిహరబ్రహ్మలం గని "న న్నేక్షత్రియుండు పరిభవించె నింతటిమహాశూరుం డెవఁడు కాఁబోలును? శ్యామకర్ణహరణార్థంబై పరాక్రమంబు గనబఱచెనో మీర లేగుదెంచునంతటికార్యం బెవఁడు దలపెట్టెనో యట్టి దుర్జయపరాక్రముని జూపు" మన్నంత శ్రీమన్నారాయణుండు కరం బెత్తి మత్స్యేంద్రుని బిలువ నాప్రాజ్ఞుండు చంద్రాస్త్ర జలదాస్త్రంబుల నుష్ణాంశునికిరణజ్వాల లడంచి సమీపంబు జేరి నమస్కారంబు గావించిన నక్కమలాప్తుండు సురసంఘంబు బొగడుచుండ సిద్ధుని యపారనైపుణ్యం బుగ్గడించి "యోగిపురుషా! నీనామధేయంబు దెల్పు" మన విష్ణుండు నాథుని జన్మవృత్తాంతచరిత్రం బెఱింగించి "యీతనినామంబు మత్స్యేంద్రనాథుం డనియెదరు. కవినారాయణుం" డని తెలియబలికెను. మిత్రుండు మున్నీసిద్ధుని యెఱుంగుదు ననుచు సంతసిల్లి "మత్స్యేంద్రా! నీయభీష్టంబు వేఁడు" మని పలికిన నతండు "మత్కృతశాబరీవిద్యసహాయం బొసంగుము. ఏమంత్రంబున నీనామం బుచ్చరించెదనో ప్రత్యక్షరూపుండవై కోరికల నెరవేర్చెద" వని విన్న

వింప ఛాయానాయకుం డౌనని పూర్వవరను గ్రహించి పిమ్మట పాశు
పతుని మనోరథంబు లీడేర్చి నిజస్యందనారూఢుండై గగనంబున కెగసి
కాలనియమ ప్రకారం బరుగుచుండ శివ కేశవాది సకల దేవతలు తమ
తమ విమానంబులపై నుపవేశించి నిజనివాసంబుల కరిగిరి. రఘువల్ల
భుండు పాశుపతుని కోరికలు దీర్చి నవంతరంబ మత్స్యేంద్రనాథుండు
పాశుపతభూవల్లభుని దీవించి యనుమతింగొని తీర్థయాత్రోన్ముఖుండై
జనుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున పాశుపతనిమిత్త మత్స్యేం
ద్రభాస్కర యుద్ధకథావిశేషం బష్టమాధ్యాయము సంపూర్ణము.

నవమాధ్యాయము.

మత్స్యేంద్రనాథుండు చంద్రగిరిగ్రామంబున గర్తంబునుండి గోరక్షనాథునిదీయుట.

తపోధనుండగు మత్స్యేంద్రనాథుండు మోక్షదాయకంబులగు
యయోధ్యా మథురా మాయా కాశీ కాంచీ యవంతికా ద్వారావతీ
తీర్థంబులు సేవించి గయాప్రయాగాదుల దర్శనంబు లాచరించి
బంగాళ దేశంబున చంద్రగిరనగరంబు జేరి భిక్షార్థంబై గ్రామంబున
జరించుచు నొక వేదవిద్వాంబ్రాహ్మణుని సదనంబున కేతెంచి యయ్యది
సర్వోపదయాళుని భవనంబు ము న్నీతనికాంతయగు సరస్వతీ దేవికి
పుత్రునికై మిత్రు నుద్దేశించి భస్మప్రసాదంబిడి ద్వాదశవర్షంబులపై
విచ్చేయుదు నని పలికితి నని తలంచి తత్పుత్రుని నేత్రోత్సవంబుగ
జూచుటకై గృహంబు ప్రవేశించి సరస్వతీ దేవీ! యని విప్రకాంతను
బిలువ నాశుభాంగి మత్స్యేంద్రుం డని యెఱుంగక నొకభిక్షుకుం
డని యూహించి పదార్థంబు దోసిటం గొని యోగిముఖ్యుని సమీ
పించె నతం "డో మందయానా! నీప్రాణనాయకుని నామంబు కులంబు
దెలుపు" మన నమ్ముగువ "మత్స్యేశ్వరుని నామంబు సర్వోపదయా
ళుండు. గౌడబ్రాహ్మణకులం" బన విని నిస్సంశయుండై "నీపుత్రుం

డెక్కడ జూపు" మన నాద్విరదగామిని "నేను సంతానవతిని గా" నని పలికెను. నాథుండు బుడిబుల్లువోవుచు "నీకు పుత్రుండు లేఁడా! మున్ను పుత్రునికై భస్మప్రసాదం బేనిడలేదా? అయ్యది మిత్రమంత్ర ప్రభావ యోగంబున ప్రభాకరునిభంగి భాసిల్లెడుపుత్రుని నిర్మింపకుండునె? యజరామరుండగు తనయుని నాకేల జూప" వని యడిగిన నచ్చేడియ మున్ను భస్మం బిడిన జడదారి యని దిగులుజెంది గడగడ వడంకుచు తనడెందంబున సిద్ధుండు శపియించునో భస్మంబు బాఱవైచితి నన్ను భస్మంబుజేయునో మూఢులగు పడఁతులచే మోసపోయితి నని మదిఁ గుందుచు తన్ను తా నిందించుకొనుచు తబ్బిబ్బుబడుచుండ యోగపూర్ణుండు "ఓజననీ! సుతుని గనబఱచు మన్న మతిదొలంగి వెతలం జెందుటేల" నన నాసతీతిలకంబు యతులితభయభ్రాంత చిత్తయై పలుకకున్న నలుగునని శంకించి సత్యంబు నిత్యంబని మత్స్యోదరసంభవుని పాదపద్మంబులపై వ్రాలి నేత్రబాష్పంబుల దడుపుచు "దయాఘనా! క్షమాశీలా! భవత్ప్రసాదభస్మంబు పరమాహ్లాదంబున గైకొని భక్షించందలంచియు మందమతులగు మత్సఖీమణులు 'భస్మంబున బాలురౌదురే విచారంబులేదే యుపాయంబు బోసంగు' నని పలువిధంబుల బోధింప దైవహతబుద్ధినై భయంబుజెంది తద్భస్మంబు కసువునం బడవైచితి" నని శోకించుచున్న తన్విం జూచి యోగీంద్రుండు హితాహితం బెఱుంగని సతీమణులు ప్రసాదార్హలగుదురే? చపలాత్ములకు స్థిరచిత్తంబు లుండునే? సర్వమాయాకరండులగు స్త్రీలు పాపజాతులు గారె? గతకార్యంబునకు విలపింపనేల? విధికృతం బని తలపోసి "సూర్యమంత్రంబుచే వీర్యవంతంబగు భస్మంబు సంజీవినీయోగంబున సజీవంబై విలసిల్లుంగాక. పాఱవైచినస్థలంబు జూపు" మని విచారింప నమ్మేటిపడఁతి తాపసోత్తముని దోడ్కొని గృహానైకటికగర్తంబు కనుబఱచిన నయ్యది గోమయంబుచే పర్వతాకారసన్నిభంబై యున్నం గనుంగొని ద్వాదశవర్షంబుల బాలుండు హరినారాయణాంశంబున నిందు గలండని నాథుండు నిశ్చయించి గోమయాంతర్గతుండై ప్రకాశించుచున్నకతంబున గోరక్షనాథా! యని సంబోధించి పైకిరమ్మని పిలిచిన గోరక్షుండు "గోమయభారాతిశయంబుచే బడియున్నా" నని ప్రత్యుత్తరంబిచ్చెను. తత్క్షణంబ సిద్ధుండు

ఖనిత్రంబులచే ఖననంబు జేయించి గోరక్షుని పైకిదీయ దీర్ఘబాహువిశాలవక్షంబుతో కమలాక్షుం డనజాలి సుందరతరతనుకాంతి తపనుని దిరస్కరించుచుండ ముఖచిహ్నంబున ప్రపంచనిస్పృహత్వంబు వాటిల్ల తోయపూరితకుంభంబుపగిది నిశ్చలుండై మూర్తివంతంబగు నిష్కళంకవైరాగ్యంబో యన పురోభాగంబున రూపసౌందర్యంబులచే ప్రకాశించుచున్న గోరక్షుని జూచి సరస్వతీదేవి "హా! ఈసుకుమారుండు మద్గర్భంబున యర్భకుండై యుద్భవింపం బడుచుండెను. సిద్ధుని యద్భుతచరిత్రం బెఱుంగనైతిని. మద్భాగ్యం బెంతని కృష్టంబు దుర్భరంబగు దుఃఖం బేవిధి సహింతు" నని వెల్లేడ్చుచున్న పల్లవాధరిని ముల్లోకపూజ్యుండగు మత్స్యేంద్రుం డాగ్రహించి చనుచనుమని శాపం బిడదలంచిన నక్కిసలయోష్ఠి భయవిహ్వలాంగియై నిజభవనంబున కరిగెను. తదుపరి మత్స్యేంద్రుండు గోరక్షునిమస్తకంబున వరదహస్తంబుంచి స్వస్వరూపజ్ఞానం బుపదేశింప తద్బోధామృతపానవిశేషంబున గోరక్షుండు నిత్యానిత్యవస్తువివేకజ్ఞానసంపన్నుండై దృశ్యమానప్రపంచంబు మాయంబౌ నని తృణతుల్యంబుగా దలంచుచు నిరస్తమోహుండై సకలచరాచరభూతాంతర్యామి యగు శ్రీమన్నారాయణస్వరూపుండు తానే యని హరినారాయణుండగు గోరక్షుండు వెలుంగుచుండ మత్స్యేంద్రనాథుండు "గోరక్షా! తీర్థసేవార్థంబై చనవలయు ర" మ్మన గోరక్షుండు గురుమూర్తిపదపద్మంబులకు

మత్స్యేంద్రనాథుండు గోరక్షనాథసహితుండై కనకగిరి కేగుట.

నమస్కరించి వెంటనంటి జనుచుండెను. మత్స్యేంద్రుండు శిష్యసమేతుండై చంద్రగిరిస్థానంబు విసర్జించి జగన్నాథంబునకు గమనంబు జేయుచుండ మార్గమధ్యంబున శృంగారంబుచే పొంగారుచున్న కనకగిరిగ్రామంబు గాంచి నాథుండు క్షుధాతురుండై "గోరక్షా! గ్రామసంచారంబు గావించి భోజనపదార్థంబులు దె" మ్మని కక్షపాల నొసంగి యాజ్ఞాపింప నవశ్యం బని గ్రామంబు ప్రవేశించి భిక్షార్థంబై దిరుగుచు నొకభూసురుని సదనంబున కరుగ నానాఁ డామహీసురుని భవనంబున పితృకార్యం బున్నకతంబున నిమంత్రణబ్రాహ్మణభోజనానంతరం బాగృహాధిపతి భోజనము జేయందలంచు సమయంబున గోరక్షుం డలక్

భిక్షాప్రశ్న యొనర్చె నంత రూపలావణ్యగుణజాలంబుల పెంపెక్కిన గృహకాంత బాలుండగు గోరక్షుని తనువిలాసంబు జూచి "యిబ్బాలుండు బాలార్కతేజుండై ప్రకాశించుట కేమిహేతువో నరుండో నరవేషధారియగు వియచ్చరుండో" యని మనంబున నభివర్ణించుచు భక్ష్యభోజ్యలేహ్యచోష్యాదులు నానావిధశ్రీఖండపాయసాది మధురపదార్థంబులు వడాదితైలపక్వ ఘృతపక్వఖాద్యంబులు విచిత్రతర చిత్రాన్నంబులు బాలుని ముందట నిడిన నబ్బాలుం డెన్నడెఱుంగని కారణంబున నాయన్నువ కుశలత్వ దయాపరత్వ గుణంబులు పదార్థవైచిత్ర్యంబులు మనంబున ఘనంబు జేయుచు బుచ్చుకొని ముదంబున మందయానను దీవించి శీఘ్రగమనంబున విడిదికిం జేరి గురుసమక్షంబున సమర్పించె నయ్యోగిముఖ్యుండు పరిమళవంతంబులై నేత్రోత్సవంబు జేయుచున్న బహువిధపదార్థంబులు భుజియించుచు పక్వశాకచక్యంబులు బొగడుచు వడలయం దపేక్ష బహుళంబు గలవాఁడై దనివితీరక శిష్యుండగు గోరక్షునివదనం బాలోకింపుచుండ నబ్బాలుకుండు "తపోధనా! భవదీప్సితంబులు విశదపఱుతు" రని నమ్రుండై విచారించెను. మత్స్యేంద్రుండు "గోరక్షా! ఈరుచికరంబులగు వడలు దెచ్చెదవా" యన శిష్యుం డవశ్యంబని తద్బ్రాహ్మణి భవనంబునకు పునరాగతుండై "యోజననీ! మద్గుర్వీప్సితంబు వడలయం దమితంబై యున్నది. కటాక్షించి కామ్యపరిపూర్తి జేయు" మని వేఁడుకొనిన నాలోలాక్షి "యౌనౌను. నే నెఱుంగుదును. కుక్షింభరత్వంబుకై గురునెపం బెలదెలిపెద వయ్యవిరక్తవాక్యంబులచే లభియించునే" యన గోరక్షుండు "తల్లీ! యింతటికై యనృతంబు లాడుదునే? నానృతాత్పరం పాపంబని యెఱుంగనే? నీకెయ్యది యభీష్టంబో కోరు" మన నాశుభాంగి "నీవు గురుభక్తిపరాయణుండవు నిక్కమేని నీనేత్రంబులిచ్చి పదార్థంబులు గొనిపొ" మ్మనెను. తక్షణంబ గోరక్షుండు చక్షులందీసి యక్కుటిలాక్షిసమక్షంబున నుంచ ధారాధర జలధారలపగిది రుధిరంబుగారుచు వసుంధర నలంకరింపుచుండ గనుంగొని యాకలభగామిని కడుభయంబుచే హాహాకారంబు జేయుచు లోపలికిం జని "నాయట్టిదురాత్మలు గలరే? బాలుని నిరర్గళధైర్యసాహసంబు లెఱుంగక కర్ణకఠోరంబగు ప్రశ్న జేసితిని. దృఢభక్తివిశేషుండగు నచ్చి

ష్యం డని దలంపనైతి. మూఢమతి" నని తన్నుతా నీసడించుకొనుచు నాబడుచువానికి కడువడిం దడబడుచు వడలిడి "సమర్థా! నాదుడుకుతనంబులు మన్నింపు" మని దుఃఖించుచు పలువిధంబుల బ్రస్తుతించి చక్షులు దీసుకొమ్మనెను. విరజ స్తముండగు గోరక్షుండు "అమ్మా! భీతిల్లనేల? నీకతంబున మద్గురుమూర్తి తృప్తింబొందు తత్ఫలం బపరిమితంబై యుండు వెఱవకు" మని యాదరించి పటబద్ధాక్షుండై వామహస్తంబున చక్షులం ధరియించి వేగంబున యోగిముఖ్యుని జేరం జని వడలు సమర్పించెను. మత్స్యేంద్రుండు "పత్సా! నయనంబులపై వసనం బేలగట్టితి" వని విచారింప శిష్యుండు ప్రకటించిన భుజయించునో లేదో యని మనంబున సంశయంబు గలిగి "భోజనానంతరంబున దెలియపఱచెద" నన సిద్ధుం డనుమానించి "గోరక్షా! నీముఖవిలాసంబు గుందినది. నీపరితాపంబు తేటబఱుపుము. లేకున్న నే భుజయింతునే? ఈపదార్థంబు గోమాంసతుల్యం బని దలంచెద" నని నిగ్రహించి పలికెను. శిష్యుండు "నాథా! తమయభీష్టంబు దీర్పందలంచి వడలకై యరిగినంత నావిప్రకాంత గురుభక్తిపరాయణుండ వేని నీచక్షులుదీయు మని ప్రశ్నింప కార్యసాధనపరుండనై కరాంగుళీయోగంబున నయనంబులు దీసితి" నని విన్నవించెను. సిద్ధుండు గోరక్షుని గురుభక్తికి సంతసిల్లి నిజహస్తంబుల బద్ధపటంబు విడిచి యాచక్షులు తనతపోయోగప్రభావంబున స్వస్థానంబున నిలిపి శిష్యసమేతుండై భోజనంబు సల్పి పిదప తనయంకంబుపై నుంచుకొని "గోరక్షా! కృతకార్యుండవైతి" వని ప్రేమాతిశయంబుచే దత్తాత్రేయానుగ్రహమంత్రరహస్యంబు లన్నియు నొకమాసం బచ్చో నివసించి దేటపఱచి శాబరీవిద్యాకవిత్వరచనాసమర్థత్వం బుపదేశించెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్ర గోరక్షనాథ కథావిశేషంబు నవమాధ్యాయము సంపూర్ణము.

దశమాధ్యాయము.

{ గోరక్షనాథుండు సంజీవినీమంత్రయోగంబున మృత్పుత్తలిచే గహినీనాథునిజన్మం బొనర్చుట. }

గోరక్షుం డధ్యాత్మవిద్యాప్రభావయోగంబున నిత్యానిత్యవస్తువివేకజ్ఞానంబుచే సచ్చిదానందపరబ్రహ్మస్వరూపుండై వెలుగొందుచుండెను మత్స్యేంద్రనాథుండు గోరక్షునకు వేదశాస్త్రపురాణేతిహాసంబులు నృత్తగీతవాద్యభేదంబులు స్వరశాస్త్రరసాయనశాస్త్రంబులు హ్రస్వదీర్ఘాది గణవిశేషంబులు నవరసాలంకారకవిత్వ రచనాకుశలత్వంబులు నానామంత్రప్రయోగోపసంహార సహితంబగు ధనుర్విద్యావిశారదత్వంబుగఱపి బ్రహ్మాస్త్ర మారుతాస్త్ర జలదాస్త్రాది మహాదస్త్రంబు లొసంగి చండ చాముండాది మహాశక్తిసంఘంబును కాలసిద్ధ బాల వీరప్రముఖ భైరవవర్గంబును నృసింహ జోటింగ బావనవీరాద్యుగ్రదేవతలను వీరాగ్రేసరులగు వీరభద్రమారుతులను ఇంద్రాగ్నియమవరుణకుబేరప్రముఖదిశాధినాయకుల నణిమాద్యష్టసిద్ధులను జలదేవత స్థలదేవతాది నానాదేవతలను ప్రత్యక్షంబు జేసి గోరక్షున కాశీర్వదించి వరంబు లొసంగుమని వేడిన నమ్మహాఘనులు గోరక్షుండు హరినారాయణుం డని తలంచి యబ్బాలుని శిరంబున వరదహస్తంబుంచి గాఁగిటం జేర్చి దీవించి యోగివర్యుండగు మత్స్యేంద్రునితో 'నిబ్బాలుండు తపం బాచరించెనేని నిరుపమానతేజోవంతుండై ప్రకాశించు' నని చెప్పి యంతర్ధానంబు నొందిరి. పిదప నొకానొక దివసంబున గోరక్షుండు సంజీవినిమంత్రజపధ్యానతత్పరుండై రహస్యంబున నుపవేశించి యుండునెడ గ్రామబాలురు శైశవక్రీడావినోదంబుచే మృత్తిక చేతం బూని మత్స్యేంద్రనాథుండు లేమింజేసి గోరక్షుని సమీపించి "తమ ఖేలనంబునకై కర్దమంబుతో శకటంబు జేయు"మని విచారించుచుండ నాథసుతుండు "శకటరూపం బే నెఱుంగను. మీరలే జేయు" మని జెప్పిన నబ్బాలు రొకశకటంబు జేసి సారథియైన బాగుండునని తలంచి

గోరక్షునితో "శకటంబు మాచే నిర్మింపఁబడియె. సారథిని జేయువిధం బే మెఱుంగము. నీవు జ్యేష్ఠుండవు గావున జేయు" మని పలుక గోరక్షుండు భవిష్యత్కారణహేతుఖ్యాతహృదయుండై మృత్పిండంబును గైకొని సంజీవినీమంత్రంబు జపియించుచు పుత్తలిం జేయుచున్న తత్పుత్తలి యవయవంబు లేర్పడి శిరాస్థిమాంసచర్మాదులు గలిగి సజీవంబై రోదనంబు జేయుచుండ బాలు రదిజూచి భూతంబని భావించి "మనల భక్షించును. గోరక్షుని గబళించును. తడవేల" నని బరుగులిడుచుండ మార్గమధ్యంబున మత్స్యేంద్రనాథుండు భయభ్రాంతులై ప్రధావించుచున్న బడుచువారలం జూచి "బాలులారా! మీరేల పరుగెత్తుచున్నా" రని విచారింప నబ్బాలురు తద్వృత్తాంతంబు దేటపఱచుచు "గోరక్షుండు గబళింపంబడి యుండనోపును. మీరేల యరిగెదరు. మిమ్మైనను మ్రింగు"నని బలుకుచున్న బిన్నవారిమాటల కచ్చెరువొంది మత్స్యేంద్రుండు "నాకాభూతంబును జూపుడి నేనుండ మీకు భయంబేల" నని చెప్పుచు గొండికవారిం దోడ్కొని యరిగిన వారలదిగో భూతంబని జారచోరులు పారిపునిజూచి భయస్థులగుభంగి రామమంత్రధ్యానతత్పరునకు భీతిల్లిన భూతంబులకైవడి దూరస్థులై గనుబఱచుసమయంబున గోరక్షుండు భూతంబు భూతంబని బాలురు పరుగెత్తినది చూచి భీతచిత్తుండై తచ్ఛిశువును బాఱవైచి యొకగృహంబు జేరియుండె నపుడా మత్స్యేంద్రనాథుండు బాలార్కతేజుండగు డింభకుండు కరభంజననారాయణుండని గ్రహించి హస్తంబుల నెత్తుకొని గోరక్షుం గానక ప్రతిగృహసమీపంబు జేరి "గోరక్షా" యని కేకలిడుచుండ బాలురందరు నాథుండు మాపై భూతంబు విడుచునని యల్లరిజేయుచు కంపాయమానశరీరులై పరుగెత్తుచుండి రంత నవ్వ లవ్వసుకుమారునితో "నాథా! మా బాలుర కేమిభయంబు జూపితిరి. యీశిశువెక్కడిది" యని విచారింప "గోరక్షుం డగుపడినపిమ్మట దెలిపెద" నని పలుకుచు గోరక్షా! గోరక్షా! యని బిలచిన నతం డది నిజగురుశబ్దంబని తలంచి యొకగృహంబు వెలువడి మత్స్యేంద్రునిహస్తకమలంబుల తేజోవంతుండగు యర్భకునిజూచి భూతం బని భ్రమియించి తొలంగిపోయెను. నాథుండు గ్రామబాలుర పగిది గోరక్షుండు భీతిల్లెనని యుద్దేశించి శిశువు నచ్చోటడించి యొక

వస్త్రంబు గప్పి గోరక్షుని వెంబడించి భయపడకుమని కౌఁగిటం జేర్చి "వత్సా! భూతంబుగాదు. మనుష్యశరీరధారియగు కరభంజననారాయణుండు యీపాపం డెవ్విధి జన్మించెనో దెల్పు" మన గోరక్షుండు "గురుసమర్థా! సంజీవినీమంత్రజపంబుచే బాలుర శైశవవినోదంబుకై మృత్పుత్తలిం జేయుచుండ నయ్యది సజీవంబై మృణ్మయాకారంబు వదలి రుధిరాస్థిమాంసచర్మయుతంబై ద్యుతిబూని రోదనంబు ప్రారంభించిన నబ్బాలురు భూతంబని విచ్చలవిడి నటమరించిరి. నిజంబ కాబోలునని తలంచి భీతిల్లితిని. మీరేల గొనితెచ్చితిరి. భూతంబు నన్నేమిజేయునో" యన నాథుండు బాలుండగు గోరక్షుని ముఖకమలచుంబనంబు గ్గైకొని "పుత్రా! వెఱవనేల? మిత్రప్రభావయోగంబున నీవుద్భవించిన దీ వెఱుంగవే? సంజీవినీమంత్రరాజజపధ్యానతత్పరత్వంబున పుత్తలిం జేయుకతంబున కరభంజననామనారాయణుం డందు బ్రవేశించి శిశురూపంబున బ్రవర్తిల్లె" నని దేటపఱచెను. గోరక్షుండు విగతభయుండై నాథునివెంటనంటి యాకుట్టని జూచుచుండ మత్స్యేంద్రుండు చిఱుతని తనకరంబుల నెత్తుకొని కుటీరంబున కేగి గోదుగ్ధంబుల దృప్తుంజేసి వస్త్రడోలికయందుంచి సాకుచుండునంత తత్పురవాసులు సిద్ధునిదర్శనార్థంబై చనుదెంచి జోహారులిడి యప్పాపని వృత్తాంతంబు విచారింప యోగద్రుముండు గతంబెల్ల దెల్లంబు జేసెను. వార లసదృశగుణవిశేషుండగు మత్స్యేంద్రుని గొనియాడుచు "నుశనుండు సంజీవినీమంత్రయోగంబున శవాకారులగు పిశితాశనులం బ్రతికించెనుగాని కర్దమనిర్మితంబగు పుత్తళియందు ప్రాణంబులుంచెనే? మాణవకుండగు గోరక్షుని మహిమాతిశయంబు భోగికులాగ్రగణ్యుండైన బొగడునే? పితామహుండు నిజశక్తి ప్రతాపంబుచే ప్రజలనిర్మించుంగాని మత్స్యేంద్రయోగివర్యుండు శిష్యకృతమంత్రపునశ్చరణయోగంబుచే మృత్ప్రతిమను సజీవంబై వెలుంగంజేసె నిక్కలికాలంబున ప్రత్యక్షపరమేష్ఠియనందగు మత్స్యేంద్రయోగివర్యుని గొలువ నలువకైన యలవియగునే" యని యన్యోన్యసంభాషణంబులు జేయుచు (నాథునితో) "తాపసోత్తమా! పురుషులు శిశుపోషణం బెఱుంగరు. చేడియలచెయ్వులు చేడియ లెఱుంగుదురు. మాతృహీనంబగు శిశుపోషణం బతికష్టం" బని విన్నవింప నిక్కంబని

దలంచి మత్స్యేంద్రుండు "శాబకుని బోషించువా రెవరైన నిప్పురంబున గలరా" యన నప్పురవాసులు "సిద్ధముఖ్యా! ఏతద్గ్రామంబున మధునాముండగు నొకమహీసురుండు గలఁ డప్పురుషుని వేల్పుఁబ్రోయాలు గంగాదేవి యనునది రూపలావణ్య విశేషంబుల బెంపొంది యతులితపతిభక్తిగలిగి సుతులు లేనికతంబున ననేకవ్రతంబులు నలిపి తత్ఫలంబు గానక వ్యర్థజీవనంబని నిస్పృహాత్వంబుచే విలపించుచున్న" దని మధువిప్రునిభాగ్యోదయకారణంబున బలుక నాథుం డాసతీతిలకంబునకు పాప నివ్వం దలంచి పతిసమేతంబుగ బిలిపింప నతిముదంబున నేగుదెంచిన నయ్యతివకు నర్భకు నర్పించి "యోజననీ! ఇబ్బాలుండు వరదాయకుండగు కరభంజననారాయణుండు సురలోకవంద్యుండగు దేవకీనందనుని చందంబున జగత్ప్రకాశకిరణుండగు ప్రభాకరునిపగిది వెలుంగుచు నంబరకేశుని ప్రత్యక్షంబు బడయు నయోనిసంభవుండై మహాగహనంబగు చరిత్రంబుగలిగి దేజరిల్లుచు గహినీనాథనామంబున జగద్విఖ్యాతి నొందును. మేమిపుడు తీర్థయాత్రోన్ముఖులమై జని యెదము. ద్వాదశవర్షంబులకు గోరక్షనాథుం డిచ్చోటి కరుదెంచి యనేకమంత్రరహస్యంబులు గహినీనాథున కుపదేశించి పరిపూర్ణపరబ్రహ్మస్వరూపుని జేయు" నన నాయన్నుల మిన్న "యోగిశ్రేష్ఠా! నాకొకసంశయం బుదయించెను. ద్వాదశవర్షంబులపై గోరక్షుండు విచ్చేసి గహినీనాథుని దోడ్కొని జనునో బాలుండు పుత్రరూపంబున నుండునో లేదో భవదనుగ్రహపుత్రుండగు గహినీనాథుని బాయుదునో నాకెఱింగింపవే" యని వేఁడుకొన మత్స్యేంద్రుం డమ్మృగాక్షితో "తల్లీ! నీకీసంశయంబేల! నీయర్భకుండు నీసుతుండై ప్రకాశించును. మే మిబ్బాలుని మఱువలేము. గోరక్షుండు మంత్రరహస్యంబు లుపదేశించి చనును. నీపుత్రుండు చిరంజీవుండై నీనికటంబుననే యుండు" నని పలుకుచు నక్కాంతామణిపై మోహనాస్త్రప్రయోగంబు జేసి పాపనియం దపారమోహంబు కల్పించి వక్షోజంబుల క్షీరంబు లూరించిన నప్పద్మాక్షి నిజసదనంబున కేగి డింభకుని డోలికయందుంచి తోటిపడఁతుల బిలచి 'గహినీనాథుం' డని నామకరణంబు జేసెను. తదుపరి మత్స్యేంద్రనాథుం డప్పురంబున కొన్ని దినసంబులు గడపి గ్రామస్థులచే ననుమతిగొని గోరక్షసమేతుండై తీర్థయాత్రాభిలాషంబున జనుచు మార్గమధ్యంబున గోరక్షుని మంత్ర

శక్తి బరీక్షింపుచు ప్రయోగోపసంహారంబులు సులభంబులై గాన రామింజేసి తపఃప్రభావంబున మనోదృఢం బేర్పడునని తలంచి కేదారేశ్వరుని స్వాధీనపఱచి తపఃప్రారంభంబు గావింపవలయునని హిమాచల మార్గంబున బదరికాశ్రమంబు జేరంజనెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్ర గోరక్ష గహినీనాథ కథావిశేషంబులుగల దశమాధ్యాయము సంపూర్ణము.

ఏకాదశాధ్యాయము.

మత్స్యేంద్రనాథుండు బదరికాశ్రమంబున గోరక్షనాథుని తపంబునకై నియమించి యరుగుట.

ఇవ్విధంబున మత్స్యేంద్ర గోరక్షులు బదరికాశ్రమంబు జేరి కేదారేశ్వరుని దర్శించి ముకుళితకరకమలులై "యోగదయాపరమూర్తీ! ఆశ్రితజనసంరక్షకగుణజాలుండవగు నీమహిమాతిశయంబులు బొగడ బ్రహ్మేంద్రాదులకైన తరంబగునే? హరా! త్రిపురహరా! భువనబ్రహ్మాండంబులకు కర్తవై భర్తవై హర్తవై వెలుంగు నవాఙ్మానసగోచరంబగు నీసచ్చిదానంద విగ్రహంబు సామాన్యులకు గోచరంబగునే? ఓయనాదినిధనా! కందర్పదర్పదమనా!" యనుచు నీశుని యపారగుణరాశిం బొగడుచుండ భక్తజనానుగ్రహసమగ్రుండగు భర్గుండు ప్రత్యక్షంబై సచ్చరిత్రుండగు మత్స్యేంద్రుని కౌఁగిటంజేర్చి నికటంబున నధిష్ఠింప నియమించి యోగక్షేమంబులు విచారింపుచు గోరక్షుని దనకరాబ్జంబులచే నిజాంకంబుపై నుంచుకొని మూర్ధంబు బునుకుచు "మత్స్యేంద్రా! ఇబ్బాలుండు బ్రహ్మాండతారకుండగు హరినారాయణుండు కనకగిరినగరంబున నాదిత్యాద్యక్షుల దేవతలు నీచే బ్రస్తుతింపంబడి ప్రసన్నులై యిగ్గోరక్షుని దీవించి వరంబు లొసంగిన దేనెఱుంగుదు. నీవనేకవిద్య లుపదేశించినను నీరంబులు లేని తీరంబులకరణి నాసికంబు లేని ముఖంబుపగిది భూరుహంబులు లేని పురంబుభంగి తపోబలంబు లేని మంత్రంబు లపార తేజోవంతంబులై శోభిల్లునే? కావున నిబ్బాలుని మదీయాశ్రమంబున తపంబొనరించుటకు నియమింపుము. జీవనంబులచే

వృక్షంబు లభివృద్ధి జెందినక్రియ తపఃప్రభావంబున మంత్రంబులు మూర్తివంతంబులై దేజరిల్లు" నని చెప్ప మత్స్యేంద్రనాథుండు "దయాఘనా! నీలకంఠా! చిఱుతప్రాయముగలగోరక్షుం డోఘనో లేదో" యని పలికెను. విశాలాక్షుండు "మత్స్యేంద్రా! నీహస్తకమలంబు గోరక్షుని మస్తకంబున నుంచితివి తత్కారణంబున నిబ్బాలుండు నిర్భయుండై తపంబొనరించును. నే నప్పుడప్పుడు వీరియోగక్షేమంబులు విచారించెద" నన్న మత్స్యేంద్రుండు జన్మాంధుండు చక్షురింద్రియోద్భవంబున సంతోషించినకైవడి తపఃఫలదాయకుండగు శూలికి నిర్మలచిత్తుండగు గోరక్షు నర్పించిన సుమారవాణుండు తపోయోగ్యంబగు మాసపక్షతిథివారనక్షత్రశుభలగ్నం బేర్పడం జెప్ప ధైర్యధుర్యుండగు గోరక్షుండు లోహకంటకంబుల నంగుష్ఠంబులుంచి మారుతాశనుండై సవితృమండలమధ్యంబున దృష్టినిలిపి తపంబు ప్రారంభించిన, మత్స్యేంద్రుండు గనుంగొని పరమానందభరితుండై "గోరక్షా! నేను మహాతీర్థంబుల సేవించి ద్వాదశాబ్దంబుల కరుదెంచెద" నని చెప్పి పుష్కరకేశుని యనుమతిగొని పనివినియెను. తదుపరి భక్తరక్షణపరాయణుండగు హరుం డహర్నిశంబులు గోరక్షుని రక్షించుచుండెను. ఇట మత్స్యేంద్రయోగివర్యుండు మహాకాళేశ్వర సోమనాథ బ్రహ్మగిరి త్ర్యంబకేశ్వర ఘృష్ణేశ్వర భీమేశ్వర నాగనాథ ప్ర

{ మత్స్యేంద్రనాథుండు రామేశ్వరంబునకరిగి మారుతాత్మజుని సమేతుండై మైనాకినరాణిం జేరంజనుట. }

ముఖ చతుర్దశపీఠంబులు దర్శించి పండరీనాథుని సేవించి నానాతీర్థంబుల గ్రుంకులిడుచు సేతుబంధరామేశ్వరంబు జేరి రామలింగేశ్వరుని గొనియాడి సముద్రస్నానం బాచరించి వాయునందనుని దర్శింప హరిసూనుండు పరమాహ్లాదంబున ప్రసన్నుండై హృదయాలింగనం బొసంగి "యోగద్రుమా! చతుర్వింశద్వర్షంబులకు నీపునర్దర్శనం బయ్యె. నే నహర్నిశంబులు భవదాగమననిరీక్షకుండనై నేడు తృప్తిం జెందితి. నాథముఖ్యా! స్త్రీరాజ్యంబునకేగి మదీయకోరిక లీడేర్చితివో ప్రపంచనిస్పృహత్వంబున నాకభయంబొసంగనది నుఱచితివో యికనైన మైనాకినీహృదయతాపంబు బాపుదువే? నే నాచపలాక్షికి తపోధనుండగు మత్స్యేంద్రుండు విచ్చేసి పచ్చగుత్తాలవజీరుని రచ్చం దేల్చునని

పలికిన పలుకులు చులుకం జేయక నిలుపు" మన నాథుం డవశ్యంబని త్రిరాత్రంబు లచ్చో గడపి యంజనీసూనుసహితుండై చనుచు మార్గమధ్యంబున నానాతీర్థంబు లాడుచు గౌడబంగాళదేశం బతిక్రమించి శృంగముకుడీనగరంబు జేరి యత్యున్నతంబులగు చంద్రకాంతప్రాకారంబులు మిన్నందిన హర్మ్యసౌధంబులు చూపందని రత్నమయగోపురంబులు జలధరంబుల నదల్చు హనుమద్ధ్వజంబులు మనోహరంబులై విలసిల్లుచుండ నచ్చటచ్చట రథగజతురగసమూహంబుల రవంబు లేకముఖంబై ఘనగర్జితంబున వీనుల విందు సేయ బుద్ధిస్ఫుటతరులగు భటకోటిమార్గరక్షకత్వంబున వీథులం దిరుగుచుండ ననేకవైభవవిలాసంబులతో నమరావతినగరంబున కెనయై ప్రకాశించు నయ్యోణాక్షుల పురవరంబు జూచుచు హరిహరసన్నిభులగు మత్స్యేంద్రకపీంద్రు లప్పురాధిపతియగు మైనాకినీభవనంబు ప్రవేశింప నంత నమ్మానినీమణి రయమ్మున హిరణ్మయసింహాసనంబులపై ప్రతాపముఖ్యుల నలంకృతులం జేసి యర్ఘ్యపాద్యాదివిధులచే బూజలుసల్పి బద్ధాంజలియై నికటంబున నిలచి "వాయునందనా! భవత్సమీపంబున విరాజమానుండగు మహానుభావుని నామధేయంబు దెలుపు" మన్న నంజనీసుతుండు "యోకలభగామినీ! మున్ను నీనిగ్రహాతపంబునకు నే ననుగ్రహించి మత్స్యేంద్రనాథయోగిశ్రేష్ఠుండువిచ్చేసి నీమనోభవతాపంబు బాపునని నిరూపించితి గాన నిమ్మహాతపోధనుండు మత్స్యేంద్రుండు. ఫాలాక్షుండు విశాలాక్షిని గూడినపగిది యీబుద్ధిదక్షుండగు సిద్ధుండు సహస్రాక్షునిబోలి నిన్నేలు" నని చెప్పి మిన్నుచూలితనయుం డాయన్నుమందిరంబున మూన్నాళ్లుండి వెడలెను. తదనంతరం బా మీనోదరసంభవుండు మణిమయభూషణాలంకృతుండై యమోఘదివ్యాంబరంబు లంగంబుల ధరియించి హేమనిర్మితసింహాసనాసీనుండై వేత్రపాణులు స్తోత్రంబులు జేయుచుండ వందిమాగధులు బొగడుచుండ నటవిటగాయకులు సుస్వరంబుల బాడుచుండ నుడుగణంబున భాసిల్లెడి సుధాకరునిభంగి యవ్వనమహాక్షుల మండలంబున కడుముదంబుచే వెలుంగుచు మైనాకినిం జూచి దనమనంబున నీద్విరదగామినిముఖకాంతి శీతమయూఖుని మీఱు నెరికురులు బంభరంబుల బాఱు భ్రూయుగంబు కోదండంబుల దూఱు శ్రోత్రంబులు శ్రీకారం

బల సౌరు నయనంబులచెల్మి బిసరుహంబులు గోరు నాసికంబు తిలకు సుమంబుల బోరు బింబం బధరంబు జూచిన జాలు రదనంబులు కుందంబుల హోరు గళసౌందర్యంబు జలజంబు తీరు బాహువులు విద్యుల్లతలన దనరారు చనుదోయి గనకకలశంబుల గేలు నసితనాగం బనజాలిన నూగారు మధ్యంబు హరిమధ్యంబును గేరు శ్రోణులు గిరికార్ముకుని తేరు యూరులు రంభాభంబుల బీరు జంఘులు తూణీరంబులకు మాఱు పదంబులు పద్మంబుల జిరు నఖాగ్రంబులు నక్షత్రంబుల చేరు నని సర్వావయవంబు లభివర్ణించుచు సిద్ధుండు సర్వకళావిశారదత్వంబున శృంగార వీర కరుణాద్భుత హాస్య భయ బీభత్స రౌద్ర శాంతరసంబు లప్పుడప్పుడు గనబఱచుచుండ నచ్చేడియ జవ్వనంపుక్రొవ్వున హావభావవిలాసవిభ్రమాదుల మత్స్యేంద్రుని దృప్తి పఱచుచుండ నవ్వసితాధీనుండగు వసుకుమారుం డానందపరవశత్వంబున సౌఖ్యావహంబగు లీలావినోదంబు సలుపుచు నానాబంధంబుల మందయానను బొందుచుండ నాశుభాంగి గర్భంబు ధరియించి నవమాసపరిపూర్తి జెంది యుదయార్కనిభుండగు బాలుని గనె నప్పుడా మత్స్యేంద్రయోగీంద్రుం డనూనముదంబుతో గోభూహిరణ్యదానంబుల విప్రులం దృప్తి జేసి ద్వాదశదివసంబున యర్భకునకు మీననాథుండను నామకరణం బొనర్చి రాజ్యభోగంబు లనుభవించుచుండెను.

జాలంధరనాథజన్మము.

ఇక్కలికాలప్రారంభ ప్రభృతి ద్విసహస్రసప్తశతవర్షంబులు గడచినపిమ్మట భరతవంశసంజాత జనమేజయునకు సప్తమపురుషుండగు బృహద్రథుండు పట్టాభిషిక్తుండై రాజ్యపరిపాలనంబు జేయుచు నొక జన్నంబుప్రారంభించి వేదవిద్యాబ్రాహ్మణులచే దాహకునినాహుతుల సంతుష్టపఱచినంత నప్పావకుండు మున్ను ముక్కంటికంటిమంట వాడిసిన చెఱకువింటి మొనగానివీర్యంబు దనకుక్షియం దున్నకతంబున నయ్యాది యాగసమాప్తిని కుండరబునం బడవైవ నందంతరిక్షనారాయణుండు ప్రవేశించెను. పిదప నబ్భూసురులు భూనాథునికై యజ్ఞప్రసాదంబు దీయందలంచి కుండంబున హస్తంబు లుంచు నెడ సుకుమారతనువిలాసుండగు బాలుం డగుపడి రోదనంబు జేయుచుండ నత్యంతాశ్చర్యం

బుచే శౌబకుని పైకిదీసి "రాజోత్తమా! యజ్ఞకుండంబున తేజోమ యుండగు డింభకుం డుద్భవించెను గాను" మని యర్పించిన జలార్ణవోద్భవచతుర్దశరత్నంబులచే సురవరులు సంతోషించినవిధి శ్రీరామచంద్రునిజన్మంబున దశరథుండు సంభ్రమించినతీరు బృహద్రథుండు ముదంబున మహాప్రసాదంబని దనకరాబ్జంబులబుచ్చుకొని కనికరంబున చుబుకంబు చుంబించుచు బిసరుహాక్షుల నేచు కుసుమశరుండో మూర్తివంతంబగు విద్యుత్పుంజంబో యనుచు సతిశీఘ్రంబున నంతఃపురంబు బ్రవేశించిన నశేషరూపగుణలావణ్యంబులచే రమామణిని సరకుగొనని సార్థకనామధేయంబుగల సులోచనియను రాజకాంత "నృపోత్తమా! భవత్కరకమలంబుల భానుంబోలి బ్రకాశించెడు బాలుం డెవరి బాలుం" డని విచారింప భూకాంతుండు "ఓకాంతామణీ! హవనంబుచే హుతాశనుండు హర్షించి శిశుప్రసాదం బొసంగెను గావున మన మీనకేతననామ్నాసుతాసహజన్ముండై ప్రవర్ధనుండగుచు వంశోద్ధారంబు జేయు" నని వాక్రుచ్చి శిశువు నప్పగించిన నమ్మరాళగామిని యురోజమ్ముల పయంబులూఱ పాపని దృష్టిపఱచి ద్వాదశదినంబులకు నామకరణంబుకై తోటిచేడియల బిలచిన వారిబ్బాలుం డయోనిసంభవుండని తలంచి దహనుని జ్వాలయం దుద్భవించినకతంబున జాలంధరుండని నామంబిడిరి. మహీరమణుండు మహీసురుల కనేక ఫలదంబులగు దానంబు లొసంగె. నంత శుక్లపక్షక్షపాకరునికైవడి బాలుండు దినదినప్రవర్ధమానుండై పంచవర్షంబులు నిండిన నుపనయనాది సంస్కారంబులు గావించి సకలవిద్యాభ్యాసంబు జేయించుచు ద్వాదశవత్సరంబులకు సర్వజనాశ్రయంబగు గృహస్థాశ్రమం బేర్పఱచదలంచి చతురవచనరచనాధురీణులగు సచివసహిత పురోహితులనుబిలచి మత్సుతునకునతులితగుణవతియగుసతీమణిని దెమ్మనియానతిచ్చిన వా రనేక దేశంబులు గ్రుమ్మరుచుండిరి. ఇట నొకనాడు జాలంధరుండు నిజజనన్యంకంబునలంకరించి "యోజననీ! నిర్మలచిత్తుండగు ధుర్మిణమంత్రిపుంగవుం డెందుబోయె" నని విచారించిన నత్తలోదరి "పుత్రా! భవత్పితృవాక్యధారకుండగు మంత్రిశేఖరుండు పురోహితసమేతుండై నీకొకలోలాక్షిని దే నరిగె" ననిన బాలుండు "తల్లీ! అయ్యది యెట్లుండు" నని యడుగ "వత్సా! యప్పడఁతిమిన్న నాయట్టిదై యుండు" నని నుడివె నంత నవ్వా

క్యంబులు మనంబున నిడుకొని యాటలకై బడుచువారిం జేరంజని యుండుచు "సఖులారా! మజ్జనకుండు నాకొక స్త్రీని జేయునట తత్కారణం బేమిగాబోలు" నని యడుగ వారలు "జాలంధరా! సంసారవిషయసుఖంబులకై సారసాక్షిని బెండ్లియాడెద" రనుచు దుడుకుతనంబున స్త్రీపురుషసురతలక్షణంబులు దేటతెల్లంబుగ దెలియంజెప్పిన జాలంధరుండు విచారగ్రస్తుండై "యహో! సంసారం బతిదుర్గమం బపరిమితవిగీతంబు. పడంతిమిన్న నాయట్టిదై యుండునని మజ్జననీవాక్యంబు గలదు. మాతృసమానయగు యువతి సతియానే? యిట్టినింద్యకార్యంబే నంగీకరింతునే? మహాపాపం" బని తాపం బొందుచు కానసంబున కేగందలంచి పరుగెత్తెను. బాలుండు రాచకుమారుండని గ్రామరక్షకులు మందలించక తొందరచే నరపాలునకెఱింగించిన నక్షితీశుండు తక్షణంబున సపరివారుండై పరుగెత్తుచున్న సమయంబున జాలంధరుండు తన మనంబునన న్నెవరైన గనుంగొనియెద రని మార్గంబు విడచి విపినంబు ప్రవేశించి దృష్టి దప్పించి తీవ్రగమనంబున నానామహీధరంబులమధ్య మార్గప్రదేశంబు ననుసరించి జనుచుండెను. నృపుండు భటసమూహంబుచే నానాదిశలు శోధించి తనయుం డమావాస్యచంద్రుని పగిది గానరామిం జేసి బహువిధవిలాపంబులు జేయుచు నిరాశుండై గ్రామంబు ప్రవేశించి యపారదుఃఖాంబుధినిమగ్నుండగుచు బాలుండగు జాలంధరుని శైశవక్రీడావినోదంబు లభివర్ణించుచు "నాయట్టి దౌర్భాగ్యులు గలరే? హుతాశనుని ప్రసాదంబని దలంచిన సుతుండు మత్కర్మయోగంబున బాసెనుగా పుత్రా! నీరూపలావణ్యంబు లేరీతి మఱతు" నని సులోచనీసమేతంబుగ నేడ్చుచున్నంత సేనానాయకుండు "ప్రభో! బాలుం డయోనిజుండు. చిరంజీవుండై యుండును. చతుస్సముద్రముద్రితంబగు భూవలయంబెల్ల శోధించి తెచ్చెద" నని పెక్కుభంగుల సమాధానపఱచెను.

ఇట జాలంధరుండు విపినమార్గంబున జనుచు సూర్యాస్తమయానంతరం బొకపర్వతసమీపంబున వైశ్వానరుం డరణ్యంబు దహించుచుండం గని మార్గంబు గానక తత్సమీపభూధరంబుచెంత నత్తమిల్లెను. జ్వలనుండు నిజజ్వాలలచే శుష్కతృణకాష్ఠంబులు దహించుచు శయనించియుండు బాలునింజూచి స్వగర్భభ్రష్టకానువిరోధ్యద్భవుండని

గ్రహించి శాంతిం బొంది మూర్తివంతుండై విస్మితుండగుచు వాత్సల్యంబున బాలుని చేరందీసి నిజాంకంబుపై నుంచుకొని శరీరంబు నివురుచు "పుత్రా! నీ వెందుం డిచ్చటి కరుదెంచితి వేతత్కారణం బేమి" యని విచారించిన నప్పుడుచువాఁడు "మీరెవ"రని ధనంజయుని నడుగ నవ్వీతిహోత్రుండు "వత్సా! భవత్పుత్రుండ" నని కామదహనాది చరిత్రంబెల్ల దేటపఱచెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్రకపీంద్రులు స్త్రీరాజ్యంబు ప్రవేశించుటయును మీననాథ జాలంధరనాథ జన్మకథా విశేషంబును గల ఏకాదశాధ్యాయము సంపూర్ణము.

ద్వాదశాధ్యాయము.

జాలంధరనాథుండు దత్తానుగ్రహంబుచే మంత్రార్థంబు లెఱింగి తపం బొనరించుట.

జ్వలనుండు జాలంధరునకు జన్మవృత్తాంతం బెఱింగించి "పుత్రా! భవదీప్సితంబు దెలుపు" మని యడిగిన జాలంధరుండు "జనకా! మచ్చిత్తంబు నిష్కామ్యంబుచే పరమేశ్వరాయత్తంబై యున్నది. నిస్సారంబగు సంసారసుఖంబు లేనొల్లను. ధనీషణాదిత్రయంబు మదిం దలంచను. రాజ్యభాగ్యభోగంబు లపేక్షించను. నరదేహధారియగు పురుషుం డస్థిరసంపదల కాశించి భ్రష్టుండగుం గాన నిర్మలజ్ఞానోపదేశంబుచే శాశ్వతుండనై నిత్యుండనై వెలుంగవలయు నను కుతూహలంబు గల" దని విన్నవింప బాలుండగు జాలంధరుని గుణజాలంబులకు జాతవేదుండు ప్రీతుండై నిజభుజాగ్రంబులపై బాలు నిడుకొని యతిశీఘ్రంబున నత్రిసూనుం జేరంజనిన నా త్రిమూర్ధుండు ద్విమూర్ధు నెదుర్కొని యాలింగనం బొసంగి "భవదాగమనకారణంబు దయజేయు" మని విచారించుచు "నీ బాలుం డెవరినందనుం"డని మందలించిన నవ్వాయుసఖుండు "అత్రినందనా! దురితహారుండగు హరుండు మదనసహాసం బొనర్ప దివ్యతరంబగు నమ్మునివీర్యంబు మత్కుక్షి

యందుండెడి నయ్యది బృహద్రథుని యాగకుండంబున బడవైవ నిబ్బాలుం డుదయించె. ఖండపరశుచండతరక్రోధానలదహ్యమానకం దర్పవీర్యం బగుటయేగాక మద్గర్భంబున ధరియించిన కారణంబుచే పీయూషపానమునకు సంజీవిని లభించినచందంబు బొనగూడె. తదుపరి యంతరిక్షనారాయణు బ్రవేశవిశేషంబు బొగడ ద్విసహస్రజిహ్వానికైన వశంబె గావున సువర్ణంబుపై మరకతంబులు గూర్చినవిధంబు భవత్కరకుశేశయం బిబ్బాలుని శిరంబుపై నిడి యజరామరమూర్తిని జేయవే" యని ప్రార్థించిన ననసూయాసుతుండు హర్షించి యంకంబుపై నుంచుకొని బాలుని మస్తకంబున వరదహస్తంబుంచి యాత్మానాత్మవిచారం బుపదేశించి జ్ఞానసూర్యోదయంబుచే నజ్ఞానతిమిరంబు బాపిన నబ్బాలుండు బ్రహ్మానుభవంబున భూమానందుండై వెలుంగుచుండ దత్తాత్రేయుండు "హుతాశనా! జాలంధరుండు మన్నికటంబున ద్వాదశవర్షంబు లుండవలయు" నని నుడివిన నతండు చేతోముదంబున నంగీకరించి యంతర్ధానంబు నొందెను.

అనంతరం బా దత్తాత్రేయుండు ప్రియశిష్యుండగు జాలంధరుని వెంబడిగొని నానాపర్వతశృంగారంబులు జూపుచు వినోదార్థంబున దృశ్యాదృశ్యంబను విద్యాభ్యాసంబు జేయించి ప్రతిదినంబు భాగీరథీ వనంబుల స్నానంబు లాడించుచు నుమారమణుని దర్శనంబు గావించి కోల్హాపురనగరంబున భిక్షాన్నంబుచే భోజనంబుచేయించుచు ద్వాదశ వర్షంబులు గడపి శిష్యుని దాస్యత్వంబున కపరిమితసంతుష్టుండై జాలంధరుని దగ్గరం జీరి వాతాస్త్ర జలదాస్త్రాగ్నేయాస్త్ర పర్వతాస్త్ర కామాస్త్ర వజ్రాస్త్ర బ్రహ్మాస్త్ర వాతాకర్షణ ప్రముఖ నిఖిల మహాదస్త్రంబుల ప్రయోగోపసంహారంబులు దెలిపి ఋగ్యజుస్సామాధర్వణ వేదంబులు శిక్షావ్యాకరణాది షడంగంబులు నానానాటకాలంకారంబులు నృత్తగీతవాద్యచమత్కారంబులు ప్రబంధరచనాకవిత్వ నైపుణ్యంబులు గఱపిన, జాలంధరుండు నిజజనకుండగు ధనంజయుని మనంబున స్మరియింప నప్పావకుండు ప్రత్యక్షం బైనంత కుమారుం డనేక విద్యాకుశలత్వంబు గనుబఱచిన ననలుండు సంతుష్టాంతరంగుండై యనసూయాసుతుని పెక్కుభంగుల గొనియాడుచుండ నత్రిసుతుండు "హుతాశనా! శీలగుణసంపన్నుండగు జాలంధరుండు మంత్రతంత్రార్థ

రహస్యంబులచే సర్వతంత్రస్వతంత్రుండై ప్రకాశించె. నీ వీ పుత్రుని దోడ్కొని మంత్రాధిదేవతల ప్రత్యక్షదర్శనంబులు జేయించు" మని వాక్రుచ్చిన నతం డవశ్యంబని కుమారు నెత్తుకొని నానా దేవతలదర్శనం బొక్కచో ఘటియించుననని తలంచి నాగాశ్వత్థ భూజంబు జేరంజని మున్ను సచ్చరిత్రుం డగు మత్స్యేంద్రుం డాచరించినక్రైవడి మార్తాండకుండంబుల స్నానంబు లాడించి వృక్షస్థసకల దేవతల ప్రత్యక్షంబు గావించిన నమ్మహానుభావు లా జాలంధరునకు వరంబు లొసంగి "స్థిరమతివై తపం బాచరించు" మని యాజ్ఞాపింప జాలంధరుండు జ్వాలుని వెంటనంటి బదరికాశ్రమంబు జేరి ముక్కంటియాశ్రమం బాశ్రయించి శోచిష్కేశుని యనుమతి వడసి లోహకంటకంబులపై శరీరంబు నిలిపి వాతాశనుండై జగదుద్ధారకంబగు తారకంబు జపియించుచు ద్వాదశవర్షంబులు తపం బాచరించినంత హరిహరబ్రహ్మాదినమస్త దేవతలు ప్రసన్నులై తపశ్శాంతి యొనర్చి యరిగినపిమ్మట బదరికేశ్వరుండు జాలంధరుని వీతిహోత్రుని సహితము దననికటంబున త్రిరాత్రంబు లుంచుకొని "వత్సా! నీకొకచిత్రంబగు చరిత్రంబు దెలిపెద" నని జాలంధరునితో నిట్లనియె.

కానీఫనాథ జన్మకథాప్రారంభము

"తొల్లి సత్యలోకాధిపతి యగు పితామహుండు లీలావినోదంబుచే నొకలోలాక్షిని గల్పించి యానవయౌవనాంగిం జూచి ముఖంబిందుబింబంబో తనుకాంతి విద్యుత్పుంజంబో ముఖనయనగళకరచరణకటి యురోజంబులు వనజంబుల గేలిసేయు నని నవ్వులుకుల జవరాలి వలపుగులుకులు యలరువిలుకాని లేయలుగుల ములుకులన నులికిపడిన నన్నలువమొగంబుల దేవర వీర్యం బొలికి యనిలుని బలమున వలినులనికటంబున శయనించు దిగ్గజకర్ణరంధ్రంబునం బడి చతుర్యుగంబు లయ్యెనయ్యది మహామహుని వీర్యంబైనకతంబుచే బిందురూపంబున సజీవంబై యుండ నందు ప్రబుద్ధనారాయణుండు ప్రవేశించి శిశురూపంబున బ్రకాశించుచుండు గాన నో జాలంధర! గనుంగొన జనవలయు" నన నతండు హర్షించి "నీలకంఠా! తద్దిగ్గజంబును మఱితద్దిగ్గజకర్ణరంధ్రస్థబాలుని విలోకించదలంచెదం జూపవే" యనిన విశాలాక్షుం డనలుని

సహితుండై జాలంధరుని దోడ్కొని హిమవత్పర్వతంబు జేరి స్థూలోన్నతవిశాలంబులచే నగంబుకై వడి నేలంబడియున్న మహానాగంబును జూపి "జాలంధరా! యీదిగ్గజం బగ్గలంబగు కోపంబున మనల నుగ్గడంచు. దగ్గరం జేరంజనుట కష్టం" బనిన నయ్యగ్గికొడుకు "మచ్చిరంబున త్రిలోకనందితుండగు యత్రినందనుని వరదకరంబుండ నిగ్గజగర్వంబు మాఁగించుట దుస్తరంబే? మద్గురుప్రభావంబున కృతాంతుని క్రోధం బుపశమింపదే! వాతగతిజరించెడు నభోమణిస్యందనంబు స్తంభించదే? చూడు" మని కక్షపాలాంతరభస్మంబు దీసి మోహనాస్త్రంబు జపియించి స్పర్శాస్త్రసంపుటీమార్గంబున బ్రయోగింప నగ్గజంబు కీలూడినబొమ్మ యన కరచరణంబుల కదలికలేక బడియుండ జాలంధరుండు మృత్యుంజయ ధనంజయుల నచ్చో నిలువ నియమించి తద్గజకర్ణసమీపంబుజేరి "గజోత్తమా! నీకర్ణేంద్రియంబున ప్రబుద్ధనారాయణుం డవతరించి యున్నాఁడు. నీవు శాంతిం బొందు" మనుచు "ప్రబుద్ధనారాయణా! సర్వసమర్థత్వంబున కానీపనామంబుచే లోకప్రసిద్ధి జెందెదవు తడవేల? బహిర్గతుండవు కమ్మా" యని కేకవేయ భాస్కరసన్నిభుండగు షోడశాబ్దంబుల బాలుండు కర్ణద్వారంబు వెలువడి జాలంధరునకు కరంబులెత్తి నమస్కారంబు జేసి దిశలు రోయు ఛవిగలిగి నిలుచున్న, జాలంధరుండు నిజభుజాగ్రంబులపై కానీపు నుంచుకొని విరూపాక్షుని సమక్షంబున డించి "కానీపా! లోకశంకరుండగు శంకరునకు వందనం బాచరించి పిదప మజ్జనకుండగు హుతాశనునకు నమస్కరించి యశోవంతుండవై యుండు"మన నక్కానీపుండు భోగిరాట్భూషణుని చరణాంభోరుహంబుల కెఱఁగి పిదప పావకునకు నమస్కరించి ముదంబున జాలంధరునిపదంబుల వ్రాలినంత చంద్రచూడుండు సాంద్రప్రేమాతిశయంబున నిజాంకంబుపై బాలునుంచి దనకరంబునశిరంబుబుచుకుచు "జాలంధరా! భవత్కరకమలంబీకర్ణకానీపునిశిరంబున కనికరంబుచే నిడి యర్కోదయంబున తిమిరజాలంబుదొలంగుకై వడిజ్ఞానోదయంబునమాయంబాయు సిద్ధుని జేయు"మని నుడివిన జాలంధరుండు దనహృత్పంకజంబున నత్రిసూనుచరణకంజంబులు ధ్యానింపుచు కానీపునిమస్తకంబున హస్తంబుంచి కర్ణేంద్రియంబున గురుమంత్రం బుపదేశించి మహావాక్యచతుష్కంబుచే లక్ష్యార్థంబు దెలిపి

దృక్సంయోగవివరంబున నఖండలుండై వెలుంగంజేయ కానీపుండమితానందుండయ్యె త్రిపురదహనుండు దహనదహనసుతవిధిసుతుల సమేతుండై బదరికాశ్రమంబున కేగెను. హవ్యవాహనుండు "జాలంధరా! శ్రీగురుదత్తాత్రేయదత్తసకలమంత్రంబులు కానీపునకు దెలుపుమని వాక్రుచ్చి యదృశ్యుండయ్యె.

జాలంధరనాథుండు కానీపనాథున కనుగ్రహం బొసఁగి యక్కానీపునికి నిర్జరులచే వరంబు లిప్పించుట.

అనంతరం బా జాలంధరుం డుమారమణుని నికటంబున షణ్మాసంబులలో ననేకవిద్య లుపదేశించి నానాస్త్రంబుల ప్రయోగోపసంహారంబులుబోధించి జ్ఞానఘనుని జేసి కానీపుండు గజకర్ణోద్భవుండు భరించునో భరించఁడో యనుసంశయంబున వాతాకర్షణ సంజీవినీయోగంబులు దెలుపఁడయ్యె. ముల్లోకనాథుండగు నీలకంఠుండు "జాలంధరా! కానీపునకు సకలమంత్రాధిదేవతలందర్శనంబు గావించి వరంబు లిప్పించు" మన జాలంధరుండు స్తవనాస్త్రయోగంబున తత్తద్దేవతల ప్రత్యక్షంబు గావించి స్తోత్రంబులచే సర్వదేవతలం దృప్తిపఱచి "దయాసముద్రులారా! కానీపుండు నిఖిలమంత్రంబుల సిద్ధిబడసె; గావున తా మనుగ్రహించి వరంబు లొసంగెదరని వేఁడెద" నన్న నాహూయమాన మహామహులు "జాలంధరా! నీవు హుతాశనుని సుతుండవై యనసూయాపుత్రునకు ప్రియశిష్యుండవైనకతంబున నీ కనేకవరంబు లొసంగితిమిగాని నీ వొకశిష్యుని జేసి తచ్ఛిష్యునికై వరంబు లిమ్మనుట యుచితంబే? యిట్లనేకశిష్యులం జేయుచు ననేకుల కీవిధి విద్యలం గఱపుచు మమ్మేచుట విశేషంబే? సరిగా" దని నిఖిలదేవతాకదంబంబులు విమానారూఢులై జనుచుండ నగ్నిసుతుండుక్రుద్ధుండై నన్నంత నీచుండని దలంచితిరే? మత్ప్రతాపంబు జూడుండని రోషతామ్రాక్షుండై వాతాస్త్రంబు జపియించి ప్రయోగించిన నయ్యది గగనమార్గంబున జని విమానంబుల ముట్టడించ సర్వవిమానంబులు కులాలచక్రంబులపగిది దిర్దిరందిరుగుచుండ దేవలోకంబు క్షోభించి తమతమకోదండంబుల నారింబోసి జాలంధరునిపై గంధర్వుండు పర్వతాస్త్రం బమరనాయకుండు వజ్రాస్త్రంబు యక్షుం డాగ్నే

యాస్త్రంబు వరుణుండు జలదాస్త్రం బశ్వినీదేవతలు ధూమాస్త్రంబు నాగాస్త్రంబు లనేకు లనేకాస్త్రంబులు బ్రయోగించుచుండ శివకేశవు లీమహాచిత్రంబు జూచుచుండిరి. తత్సమయంబున వైశ్వానరసుతుం డాగతాస్త్రంబులపై మోహనాస్త్రంబు వఱపిన నయ్యస్త్రరాజి దమతమ చెయువు లెఱుంగక మతిభ్రష్టమై జాలంధరునకు వందనంబు లాచరించి యంతర్ధానంబు నొందెను. పర్వతాస్త్రంబుచే సిద్ధనిర్మిత మారుతాస్త్రవేగం బడంగినంత తక్షణం బా సురసముదాయంబు విమానంబులతో నిజనివాసంబుల కరిగి నునయస్త్రంబులు నిష్ఫలంబులయ్యె. ముం దేమిజరుగబోవునో నున ముపేక్షించుట కర్జంబుగాదు. సకల శస్త్రాస్త్రపరికరంబులు బూని జాలంధరుని ప్రాణంబులు గొనవలయునని నిశ్చయించి విమానారూఢులై ముసల ముద్గర ఖడ్గ పరశు త్రిశూల తోమ రాంకుశ గదా చక్ర ప్రముఖ శస్త్రంబులు ధరియించి యుద్ధవిడి నేతెంచుచున్న యమరకోటిని జూచి యవ్యాహతధైర్యధుర్యుండగు జాలంధరుండు కామిన్యాస్త్రంబు సంధించి తత్సహాయంబుగ కామాస్త్రంబు గూర్చి యడరించిన కామిన్యాస్త్రంబుచే ననేకనారీమణు లుద్భవించి రంభోర్వసుల దిరస్కరించు రూపలావణ్యంబులు గలిగి విహరించుచుండ కామాస్త్రయోగంబున గీర్వాణాదు లోర్వలేని తమకంబున హరిణాక్షులవృక్షరవ్రాతంబులచేబద్ధులై బుద్ధితప్పి యమ్ముద్దియుల వెంట నంటి బదరికాశ్రమవనంబున నానామహీరుహంబుల మధ్యప్రదేశంబున నటమరించుచు నిజకరంబుల కలభగామినుల నొడిసిపట్టి విశాల వృక్షంబులపై జేరినంత మహాకుశలుండగు హుతాశనసుతుండు స్పర్శాస్త్రంబు వఱపి సుపర్వులపాదంబులు బంధించిన పల్లవాధరులు పట్టు దప్పించుక పరువులిడిరి. సురలోకంబు నారీమణులంజూచి "హా! తలోదరులారా! పోయెదరే" యని చిత్తజు శరవేదన జ్వరపిత్తంబుచే యున్మత్తులై చేతులెత్తిన స్పర్శాస్త్రనైపుణ్యంబునసధోముఖులై పాదంబులు పాదపాగ్రశాఖంబుల నంటుగొని వ్రేలాడుచుండ మకుటంబులు మహింబడ భూషణంబులు వ్రాలుచుండ నినోదయసమయంబున తరుశాఖాగ్రంబులు ప్రభాసిల్లెడుచందంబున నగపడుచుండ సురసంఘంబులం జూచి హరిహరులు విస్మితాననులై మున్నిట్టి విపరీత ఘూణాతం బెవరొనర్చిరని జాలంధరుని గుణంబు లుగ్గడించుచుండ సిద్ధనిర్మితసుం

దరీమణులు వియచ్చరుల వలువలను వదల్చి నగ్నులంజేసి వసనంబులు హస్తంబుల ధరియించి యోగధూర్జటియగు జాలంధరు నికటంబున నిడుచుండ జాలంధరుండు కానీపునకు వస్త్రచిహ్నంబుల దేవతానామంబులు దెలుపుచు గోప్యంబున "కానీపా! సురలు నగ్నులైరి. నీవరిగి వారివారివస్త్రంబులు వారివారికింగట్టించు" మని జెప్పినం గానీపుండు వస్త్రభూషణంబులు గొని ముదంబున నరిగి వసనంబులు గట్టుచుండ దేవత లనేకవిధంబుల బొగడుచు "కానీపా! నీగురుప్రతాపంబు జెప్పనలవియగునే" యనుచుండ కానీపుండు వందనంబు లాచరించుచుండెను. సురసంఘంబు తమలో తాము "యీ కానీపునకు వరంబు లొసంగనిది జాలంధరుండు వదలునే" యని నిశ్చయించి "జాలంధరా! కానీపుని మనోభీష్టంబు దీర్చెదము. నమ్ము స్మరియించినమాత్రంబున బ్రత్యక్షంబై బనులు సలిపెదము. నిశ్చయము. నిశ్చయం" బని పలుకుచున్న దివిషద్వర్గంబును జూచి పావకాత్మజుండు విభక్తాస్త్రంబుచే స్పర్శాస్త్రం బుపసంహరింప సకలదేవతలు జాలంధరుని సమీపించి గుణరాశిం బొగడుచుండ జాలంధరుం "డోదయాఘనులారా! ముందు నేరచించెడు శాబరీవిద్యకై సహాయు లౌదురని కోరెద" ననవారది యంగీకరించి తమతమనిజనికేతనంబుల కరిగిరి. యాపై నుమా రమావరులు జాలంధర కానీపులసమేతంబుగ బదరికాశ్రమంబున త్రిరాత్రంబులు గడపిరి.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున జాలంధర కానీపనాథచరిత్రంబును గల ద్వాదశాధ్యాయము సంపూర్ణము.

త్రయోదశాధ్యాయము.

జాలంధర కానీపనాథులు శివుని యనుమతిచే శాబరీమంత్రశాస్త్రంబు కల్పించి కానీపనాథుండు తపం బాచరించుచుండె జాలంధర నాథుండు తీర్థయాత్రోన్ముఖుండై నడచెను.

ఉమా రమావరులు కానీపజాలంధరసహితులై బదరికాశ్రమంబున నివసించి బృందారకులు పరాభవంబుచే ప్రసన్నులై వరంబు

లొసంగుట కెంతవిచారహీనులని దలంచుచు ము న్ననేకమారు లసురులతో నోటుబడి యి ట్లుపహాస్యంబు నొందిరే బుద్ధిహీనులగు సిద్ధుల చరిత్రంబు లెఱుంగలేరై రనుచు హాస్యరససల్లాపంబు లాడుచుండి గిరిజాధవుండు "జాలంధరా! నాగాశ్వత్థవృక్షనికటంబున పూర్ణాహుతు లొసంగి శాబరీమంత్రశాస్త్రంబు రచియించి పిమ్మట తత్తద్దేవతల వరంబులు బొందెదవేని నీమంత్రంబులు వేదమంత్రంబులు బోలంజాలును కలికాలమందనుజులు శక్తిహీనులై నకతంబున వేదమంత్రంబులు సిద్ధించక కడుకష్టంబు లనుభవించెదరు గావున మంత్రసిద్ధిం బడసి యుష్మచ్ఛిష్యుండగు కానీపునకు బోధింపుము. కానీపుం డుదారశక్తి యుక్తుండై కార్యానుకూలంబున మెలంగుచు ననేకశిష్యులం జేసి మంత్రంబులు లోకప్రసిద్ధి జేయును. తొల్లి శాబరీబుషివర్యుం డొక కొన్నిమంత్రంబు గల్పించె నవి యసంపూర్తిచే జగద్విఖ్యాతి నొందలేవు. మీ నవనాథ సిద్ధుల మంత్రంబు లేక శతకోటిసంఖ్యాపరిమితి గలిగి మూర్తివంతంబులై విస్తరించవలయు నందు ముప్పదిమూడు కోట్ల తొంబదియైదులక్షలమంత్రంబులు మత్స్యేంద్రనాథుండు కల్పించెను. గోరక్షుండు పండ్రెండుకోట్ల తొమ్మిదిలక్షలు జేయును. మీననాథుం డొకకోటి లక్ష చర్పటనాథుండు తొమ్మిదికోట్ల యేడులక్షలు భర్తరీనాథుండేడుకోట్ల నాలుగులక్షలు రేవణనాథుండు రెండుకోట్ల మూడులక్షలు వటసిద్ధనాథుం డొకకోటి యొకలక్ష చేయుదురు. నీవు ముప్పదినాలుగుకోట్ల పండ్రెండులక్ష లొనర్పు మూరుకోట్ల యెనిమిదిలక్షలమంత్రంబు లీకానీపుండు జేయు నీమహాప్రయోగంబులు గోరక్షుని పురస్సరంబున ప్రపంచంబున వెల్లడి జేయంబడు. నిక ముందు మంత్రకల్పంబులు జేయుమహాత్ములు గలుగబోరు. ఈసిద్ధనిర్మిత మంత్రరాజంబులు ప్రసిద్ధిబొంది యాధ్యాత్మికాధిభౌతికాధిదైవికాదిబాధలం దొలంగించు నివ్విధంబున ప్రతికలియుగంబున జరిగిన విషయంబేగదా త్రికాలవేత్తలగు సిద్ధులు మీరెఱుంగరే సకలదేవతావాహనం బొనర్చి కానీపునకు వరంబు లొసంగు మనుట భవిష్యచ్చరిత్రం బెఱింగియే కదా తషవేల? మీకవిత్వవైజ్ఞానికత్వంబున మంత్రకోటిని గల్పింపుమిక్కానీపునిచే తపం బాచరింపించు" మనుచుండునంత మధుసూదనుండు కానీప జాలంధరులకు వరంబు లొసంగి వైకుంఠంబున కరిగెను.

ఈయుభయసిద్ధులు నలుబదికోట్ల యిరువదిలక్షల మంత్రగ్రంథంబు రచియించి బదరికేశ్వరునకు జూపఁ నయ్యనలాత్ముండు సంతసిల్లి "జాలంధరా! నాగాశ్వత్థవృక్షస్థ సమస్తదేవతల వరంబులు గొను" మని యానతిచ్చిన హుతాశనసుతుండు కానీఫునిసహిత మాతరుగాజనికటంబున కేగి సూర్యకుండతోయంబులు వృక్షమూలంబునం బోయుచు పూర్ణాహుతు లొసంగి బావన్నవీరప్రముఖ సమస్తదేవతల వరంబులు గొని కానీఫుని దోడ్కొని బదరికాశ్రమంబునకు పునరాగమనంబు జేసి గోరక్షుండు తపం బాచరించు స్థలసమీపంబున లోహకంటకంబుల తపంబుకై కానీఫుని నియమించి మృడుని యనుమతిగొని జాలంధరుండు తీర్థయాత్రోన్ముఖుండై యరుగుచు నరణ్యంబున తృణంబు జతగూర్చి క్షేత్రశోధనంబుకై భారంబుగట్టి నిజశిరంబుపై నిడుకొని ప్రతిక్షేత్రంబునకు దర్శనార్థంబై ప్రయాణంబు జేయుచుండ మిన్నుచూలి జాలంధరుండు దనపౌత్రుండని తలంచి శిరోభారంబును లేవనెత్తుకొని యవ్వీతిహోత్రనందనుని వెనువెంటం జనుచుండెను ఇప్పగిది ప్రతిక్షేత్రంబునంగల గోవ్రజంబును దృప్తిపఱచుచు నచ్చటచ్చటిమూర్తుల దర్శనంబులు గొని తీర్థంబుల స్నానంబు లాడుచు గౌడబంగాళదేశస్థ హేలాపట్టణంబు బ్రవేశించి జనుచుండ శిరోగ్రభాగంబున నిరాధారంబై నడచుచున్న తృణ్యంబును పురవాసులు గనుంగొని యత్యంతాశ్చర్యంబుచే నోహో! ఇమ్మహానుభావుం డెవరుకాబోలు? నపారచరిత్రుండగు సిద్ధుండో ప్రచ్ఛన్నవేషంబున మెలంగెడి సురుండో లేకున్న తృణ్యంబు దనంతట తా నడచునె యనుచు నలుదిశల గుమిగూడి జూచుచుండ జాలంధరుం డొక్కచో గోసంచయంబు గని తృణ్యంబు డించి విడదీసి బడవైచిన నానావీథుల దిరుగు గోసముదాయం బచ్చోటి కరుదెంచి తృప్తిం బొందుచుండెను. ప్రతిదినం బీప్రకారంబున గోసముదాయంబును దృప్తిపఱచుచు స్వయంభిక్షాన్నం బాహారంబు గొని నచ్చో కొన్నిదినంబులు గడుపుచుండెను.

{ జాలంధరనాథుండు హేలాపట్టణంబు ప్రవేశించి మైనావతిరాణి కనుగ్రహం బొసంగుట. }

అప్పట్టణంబున సులోచనమహారాజసుతుండు నానారత్నమయహాటకభూషణాలంకారంబులచే సువైచిత్ర్యవంబుల సరకుగొననిద్వాదశ

లక్షఘోటకంబులును యువతీజనకుచరదనోరుయానంబులదిరస్కరించు గనునశుండదంతకుంభంబుల కలిమిచే నంజనాచలంబు లనంబరఁగు వేదండతండంబులునాలంబున కాలు నిగణుతింపని కాల్బలంబులు లక్షశతంబులు పొంగుచుండ ముక్కంటిచెలికాని లెక్కంగొనని పెక్కైశ్వర్యంబుల పెంపెక్క షోడశశతసంఖ్య జలజాయతాక్షులు పడఁతులు గలిగి మీనుమొసలిసిడెంబులమేటినీటగు సోయగంబునం ద్రిభువనభర్త యనందగు గోపీచందమహీపాలుని జననియగు మైనావతీదేవి యొకానొకసమయంబున సౌధాగ్రభాగంబున దిశావలోకనంబు జేయుచు స్వేచ్ఛావిహారంబు సల్పుచు నద్దుగ మొగంబుల వెల్వపట్టి నిత్యనియమప్రకారంబున గోసమూహంబుకై తృణ్యంబు శిరోపరిభాగంబుపై దనంతటతా నడున జనుదెంచుట గనుంగొని "యేమి యీచిత్రం బితండు మానవుండొనె గరుడగంధర్వాదులకైన నిట్టిసామర్థ్యంబు గలదే? లీలాగతి మొంగఁదలంచిన జలజాక్షుండో గాకున్న నీతృణ్యంబు నిరాధారంబున నడుచునే యిమ్మహామహుని కటాక్షవీక్షణంబున మర్త్యులమర్త్యులై ప్రకాశించరే? దృఢభక్తి యోగంబున నియ్యోగివర్యునారాధించి స్థిరపదవి బొందెద" నని నిశ్చయించి యొకసఖీమణిని బిలచి "ప్రియురాలా! నీకొకరహస్యంబగు కార్యంబు దెలిపెద వెల్లడిజేయవలదు కార్యసాధనపరత్వంబున కుశలమతివై వర్తింపవలయుంగాన నదుగో యోగీంద్రుని జూచితివే" యని కనుబఱచినంత నచ్చేడియ యచ్చెరువొంది "యితండు ప్రచ్ఛన్నంబున జరియించెడి లక్ష్మీరమణుండో హరుండో యన్యులకీ యసదృశప్రభావం బుండునే? ప్రభాకరకరనికరద్యుతి నణంచెడు దేహకాంతి స్వర్గమర్త్య పాతాళవాసులలో నెవరికైనం గలదే? ఇతండనుగ్రహించిన శాశ్వత పదంబు ధ్రువునికైనడి లభించకుండునే" యనుచున్న సఖీమణిం జూచి మైనావతీదేవి "యోశుభాననా! యిమ్మహామహుండీనగరంబున నెచ్చో నివసించియుండునో కనుంగొని వేగమ్మున రమ్మా" యన నవశ్యం బని యమ్మగువ జాలంధరుని వెనువెంటం జనుచుండ నయ్యోగిముఖ్యుం డొక్కచో గోధనంబునకు తృణంబు వేసి వేగంబున నొకజీర్ణవీథియం దొరులెఱుంగకుండ గూర్చుండంగని యమ్ముదిత యతిశీఘ్రంబున రాజమాతకడ కరుదెంచి "యోతల్లీ! యోగిపురుషుం డన్యాలోకనభయం

కరంబగు నొకయేకాంతస్థలంబున పిశాచంబువగిది నివసించె నచ్చట శ్వానసూకరంబులైన దిరుగంజాల" వని నుడివిన రాజమాత మంచి దని హర్షించి యనేకపక్వాన్నంబులు చేతంబూని నడిరేయిసమయంబున కంబళం బాచ్ఛాదించుకొని గోప్యంబున నక్షణంబ దోడ్కొని నిర్దిష్టస్థలంబునకు జేరి యోగద్రుముండు రాజయోగసంధానంబున బరబ్రహ్మస్వరూపుండై ప్రకాశించుచుండం గని పాదంబులపై దండంబుకై వడి బ్రణమిల్లి యుభయు లస్మహాసిద్ధుని సమ్ముఖంబున బద్ధాంజలులై "దయాఘనా! దీనవత్సలా! తాపత్రయదావానిలదగ్ధులమగు నమ్ము భవత్కరుణాకటాక్షజలధరంబున నుద్ధరింపవే" యని వేడుచుండ నాథునిమనంబున నతిముదం బావహించి బహిర్గతంబు జేయక మైనావతీ మనోదృఢం బెఱుంగందలంచి కృత్రిమంబున పిశాచచేష్టలవలంబించి యౌదార్యగుణసంపన్నుండగు మేఘుండు పాషాణంబులు గురిపించినచందంబున కఠినోచ్చారణంబులు జేసిన రాజమాత యతిధైర్యంబున నిమ్మహానుభావునిచే మృత్యువైనను మోక్షంబు గలదని ధారాధరజలధారలకు చలింపని భూధరంబుకరణి ధైర్యంబు బూని సమక్షంబున నిశ్చలమతియై యుండ జాలంధరుండు తాలు ఉవ్వచు "నీవెవతివి! నే నిమ్మహాదుర్గంధమిళితంబగు వీథియందు పిశాచరూపంబున నివసించియుండ నాకడ కరుదెంచుట కారణంబేమి? దుర్మతిచే మత్తపోభంగంబు గావించితివి. శీఘ్రంబున నీనామరూపంబులు దెలియంబలుకు" మని నలుకవోడమ బలికిన నాశుభాంగి "కరుణామయా! నాపేరు మైనావతి యందురు. నే సులోచనపృథ్వీశుని ధర్మపత్నిని. మత్పతి కాలగతి నొందెను. తచ్ఛవమ్మచ్ఛరీరంబు కాలుసిచే వృథా యపహరింపంబడునని జన్మసార్థకంబుకై భవచ్చరణాంభోరుహంబుల నాశ్రయింపం దలంచితి" నన యోగిపుంగవుండు "మైనావతీ! నీ విపు డెవరి పోష్యంబున నుండెద" వని యడిగిన నమ్మానినీమణి "ప్రభో! నా కొక కుమారుండు గలండు. ఈగౌడబంగాళదేశాధిపత్యంబు వహించి భవద్దాసుండై గోపీచందనామంబున బ్రకాశించును. నా కావైభవంబు లేల? కృతాంతపాశబంధంబుల దొలగించి కడ తేర్పవే" యనిబతిమాలినంత సిద్ధుండు "మైనావతీ! నాయట్టిపిశాచరూపునిచే కృతాంతభయం బేవిధి దీరును? వ్యర్థకాలహరణం బేలచేసెదవు? చనుచను. నీకుమారున కీ

విషయంబు దెలిసిన నవర్థంబు ఘటియించు" ననుచుండ నరుణోదయస మయం బేర్పడిన సులోచనురాణి వేగంబున నిజభవనంబున కేగి జాలంధరునిచరణకంజంబులు మనంబున నిడుకొని దినం బెల్ల గడిపి నిశాసమయంబున పరిచారికను వెంటనిడుకొని యోగనిష్ఠాగరిష్ఠుండగు జడదారికడ కరుగుదెంచి పాదకమలంబుల కెఱఁగి మహాభక్తివిశేషంబులచే నడుగులొత్తుచు పునఃపునర్వందనంబు లాచరించి సూర్యోదయాత్పూర్వం బింటికి జనుదెంచె నిప్పగిది ప్రతిదినంబు నిజసదనంబున గృహకృత్యంబులు జరుపుచు రాత్రికాలంబున సిద్ధుని పాదసేవ లొనర్చుచు షణ్మాసంబులు గడప నొకానొకసమయంబున జాలంధరుండు లోలాక్షి బుద్ధిదార్ఢ్యంబు లక్షింపఁదలంచి మైనావతీదేవ్యంకస్థలంబుపై నిజమూర్ధంబుంచి తదంకంబున కధరభాగంబున నొకభ్రమరంబును గల్పించి సుఖనిద్రం జెందుచుండె నంత నత్తేటి యయ్యువతి దొడయడుగున గాయంబు గావించిన రుధిరం బపరిమితంబై గాఱుచుండ గురునిద్రాభంగంబౌ నని దేహాభిమానంబు వదలి దృఢచిత్తంబున నుత్తమాంగనయగు మైనావతీదేవి చలింపక గూర్చున్నం గని సిద్ధుండు మేల్కాంచి గురుభక్తిపరాయణురాలగు మగువం జూచి యత్యంతానందంబున శిరంబున వరదకరంబుంచి కర్ణంబున తారకం బుపదేశించె నమ్మహారాణి యవాఙ్మానసగోచరంబగు పరబ్రహ్మంబుదానై వెలుంగుచు విశ్వమయత్వంబున పశుపక్షిమృగప్రముఖ నానాచరాచరంబులు దనకన్యంబులు గావని యద్వితీయంబై ప్రకాశించుచుండ సిద్ధముఖ్యుండు సంజీవినీ మంత్రంబు కర్ణద్వారంబునం బ్రవేశింపంజేయ శ్రీరామభద్రుండు నక్తంచరాధిపుండగు రావణానుజుని చిరంజీవి చేసినచందంబున మైనావతీదేవి యమరాంగనయై దేజరిల్లుచుండ నాథుండు భ్రమరకృతక్షతంబు క్షణమాత్రంబున మాన్పిన నద్దేవి పరమానందంబున యోగిపుంగవుని సుగుణనికరంబున కచ్చెరువొంది దనమనంబున మత్సుతుండగు గోపీచందుం డమరుండైన బాగుండునని దలంచుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున జాలంధర మైనావతీకథా విశేషంబు గల త్రయోదశాధ్యాయము సంపూర్ణము.

చతుర్దశాధ్యాయము.

మైనావతీదేవి గురుకరుణాకటాక్షంబున బ్రహ్మానుభవజ్ఞానంబు గలిగి తనమనంబున భోగభాగ్యరూపయౌవనంబుల పెంపెక్కిన సుతుండగు గోపీచంద్రమహారాజుం దలంచి యతులితవైభవోన్నతుండగు మద్భర్త స్థిరంబవని నేలంపక కాలగతి నొందె. సుకుమారతను విలాసుండగు మత్పుత్రుండు తద్వత్కాలగతి నొందును. విపినంబు దహించు వీతిహోత్రుండు రమ్యతరలతావితానంబుల నుపేక్షించనిచందంబున నసదృశకుసుమశరసముండగు మత్పుత్రుని కృతాంతుండు సదయుండై రక్షించునే నేనేమిచేయుదు నని యమృతంబుకై కద్రువ విలపించిన కైవడి రాజ్యభోగసుఖసంపత్సమృద్ధుండగు పుత్రునికై కాలచక్రంబు నుద్దేశించి తపించుచు నొకానొకసమయంబున మాఘమాసదినోదయ శీతబాధ దొలంగుటకై యుష్ణాంశుకిరణంబుల కాశించి సౌధాగ్రంబున పరిచారికాసహితంబై కూర్చున్నంత గోపీచందుండు తద్రమ్యతర హర్మ్యనికటంబున స్నానంబునకై రత్నమయపీఠం బలంకరింప తేజోవంతంబులగు దివ్యాంబరమణిమయస్వర్ణాభరణంబులు విడదీసి నవయౌవనాంగనామణులు ప్రియం బిగురొత్త మౌక్తికహారంబులు గురుకుచోపరిభాగంబున నాట్యంబులాడ కరంబుల రత్నమయకంకణంబులు ఘల్లుమని మ్రోయ సుగంధపరిమళద్రవ్యంబులు శరీరంబున లేపనంబు జేయుచు మృగమదచందనాగరుమిళితోష్ణోదకంబుల స్నానంబు లాడించుచుండ నక్షత్రమధ్యంబున బ్రకాశించెడు నిశాకరునిభంగి యపరిమితదేహకాంతి నలుదిక్కులు గ్రోయుచుండ మైనావతీదేవి గనుంగొని శోకభరితహృదయయై చక్షురింద్రియబాష్పంబులు రాల్చిన నవి భూవల్లభుని శరీరంబుపై సంజీవినీజీవనంబులపగిది పతనంబయ్యె. నృపుం డిది యేమిచిత్రంబు తోయబిందువు లాకసంబునుండి బడియెనోయనుచు ఘనమండలంబు నిరీక్షింపుచు సౌధాగ్రంబున నధిష్ఠించియున్న నిజమాతృముఖావలోకనంబు జేయుచు నశ్రుపూరితనయనంబులు గనుంగొని వేవేగంబున రత్నమయపీఠంబు డిగ్గి జననీసమక్షంబున కరిగి పాదంబుల వ్రాలి "తల్లీ! నీదుఃఖకారణం బేమి? నాయట్టి

పూర్ణప్రతాపవంతుండగు పుత్త్రుండుగలుగ నిర్భయహృదయులై నిన్నె వరేమనిరి? తత్క్షణంబున నాదుర్మార్గుల దంష్ట్రల్ వేయుదు జెప్పవే? యఘటితకార్యంబని శంకింపవలదు. నీమనోభీష్టంబు దీర్పని మనుజన్మంబు శ్వానసూకరజన్మంబులకంటె నింద్యంబుగాదే? మాతృదుఃఖకారకుండగు పుత్త్రుండు శత్రుండుగాక మిత్త్రుండే? జననీజనకులదుఃఖంబు దీర్పని తనయుండు భూభారుండు గాడే? 'నమాతుఃపరదైవతం' బనుధర్మం బేమెఱుంగనే? మాతాపితృతాపం బెఱుంగక కాంతాధీనుండగు సుతునికై భూదేవి శోకింపదే? దుఃఖం బుడుపకున్న మత్ప్రాణంబులు నిలుచునే" యనుచున్న సుతునిజూచి సులోచనురాణి "వత్సా! మద్గర్భంబున రూపలావణ్యవిశేషుండవై జన్మించి స్వప్రతాపంబున నిఖిలరాజలోకంబున కొడయుండవై దేజరిల్లుచుండ మృగరాజును ద్విరదంబు మార్కొనునట్లు న న్నవరేమనియెదరు? పుత్త్రా! భవజ్జనకుండు నీయట్టినవమన్మథస్వరూపంబుచే విశాలకీర్తివంతుండై తుదకు కాలగతి దప్పింపలేక ప్రాణంబులు బాసి దేహంబు దాహకునిపాలొనర్చె. మూషకంబుకై మార్జాలంబుపగిది గోసంచయంబుకై వ్యాఘ్రంబుకరణి దయాహీనుండగు కృతాంతుండు నీమోహనాకారంబున కాశించును గావున సారాసారవిచారుండగు విభీషణుండు రఘుపుంగవుని యనుగ్రహంబున చిరంజీవుండు గాడే! విష్ణునారాధించిన నారదునిచే వ్యాసమహర్షికుమారుండగు శుకమహాయోగీంద్రుండు సర్వమయత్వంబు నొందడే? శుకయోగీంద్రునిచే కృష్ణయాజ్ఞవల్క్యుండు, కృష్ణయాజ్ఞవల్క్యునిచే రామానుజుండు శాశ్వతపదంబు నొందడే? ఈసాంప్రదాయం బభివృద్ధిజెంది రామానుజునిచే ముకుందరాజప్రముఖులగు మహాత్ములు విలసిల్లిరి. తద్వచ్చైతన్య సాంప్రదాయకంబున కపిలచైతన్యుండు రాఘవచైతన్యుండు బ్రహ్మచైతన్యుండు కేశవచైతన్యుండు మొదలగు మహానుభావులు ప్రకాశించిరి. తదనంతరం బమోఘంబగు స్వరూపసాంప్రదాయకంబున హంసస్వరూపుండగు భగవంతుండు బ్రహ్మకుపదేశింప నాబ్రహ్మచే నత్రిమహర్షి తత్వజ్ఞానంబు గ్రహించి దత్తాత్రేయుల కుపదేశించె. దత్తునిచే సిద్ధనాథులు విరాజమానులైరి యాపై చతుర్థసాంప్రదాయంబు నందసాంప్రదాయనామంబుచే వికసించి సూర్యునిచే యాజ్ఞవల్క్యుండు,

యాజ్ఞవల్క్యునిచే సహజానందుండు, సహజానందునిచే బ్రహ్మా
నందుండు, యోగానందుండు, చిదానందుండు పరిపూర్ణబ్రహ్మస్వరూ
పులై దేజరిల్లిరి. పుత్రా! గోపీచందా! నీ వప్పగిది నిశ్చలనిర్గుణుండవై
యజరామరస్వరూపంబునొందిన విశేషం బగునని తలంచి దుఃఖించితి
గాని యన్యంబేమియు లే" దన గోపీచందుండు "జననీ! యుష్మద్వా
క్యంబు లమృతతుల్యంబులు నిజంబే ప్రస్తుతం బట్టియమరత్వంబొసంగు
తపోఘను లెవరు కల" రని విచారించ నమ్మైనావతీదేవి "వత్సా! ప్రకృతం
బీనగరంబున జాలంధరనాథుండను పరమయోగీంద్రుండు స్వరూప
సాంప్రదాయాబ్ధిచంద్రుండై విలసిల్లు. త్రికరణశుద్ధిచే నీవా యోగ
మూర్తికి తనుమనోధనంబు లర్పించి శరణువేఁడిన నిన్నతండు సనాతన
పరబ్రహ్మస్వరూపుంజేసి యమరత్వంబొసంగును. ప్రపంచభోగంబులు
నిత్యంబులుగావని తలంపు" మనివాక్రుచ్చిన, సులోచనసుతుండు "తల్లీ!
దారాసుతాదిబంధువర్గభారం బతిశయించి యుండ సుఖసంపదలఁ
బరిత్యజించి యోగమార్గం బాశ్రయించుట మహాకష్టతరంబుగాదే?
ద్వాదశవర్షంబు లీ భోగంబు లనుభవించి యాపిదప యోగధారణ
పరుండనై యుత్తానపాదునికైవడి బ్రకాశించెద" నని నుడివిన నమ్మై
నావతీదేవి "పుత్రా! ద్వాదశవత్సరంబు లననేల; ద్వాదశనిమిషంబు
లైన స్థిరంబులుగాని భోగంబుల కాశించెదవే? క్షణభంగురంబులగు
చిత్త విత్త జీవితంబులు శాశ్వతంబులని దలంచుట వేదుఱుగాదే?
తృషార్తుండు మృగజలంబుల నపేక్షించిన నేమిలాభంబు? బుద్బుదతు
ల్యంబులగు సంసారసుఖంబులు వంధ్యాపుత్రునిచందం బనఁదగదే?
స్వప్నగోచరేంద్రభోగంబులు భోగంబులగునే? శుక కపిల దత్తాత్రేయ
వ్యాస ప్రహ్లాదాది చరిత్రంబులెఱుంగవే? కాలవ్యాపనంబు దలంపక
సమయనిరీక్షకుండగు శమనున కవశుండవగుము తండ్రీ!" యని బోధ
ప్రబోధ జేయుచుండ నుమావతియను రాజకాంత తద్వాక్యంబులు గో
ప్యంబున నాకర్ణించి "యహహా! రాజ్యభోగంబులు బరిత్యజించి విరా
గుండై సంచరించుమనుట వొల్లి శ్రీరామచంద్రునినరణ్యంబునకంపిన
కైకయీచందంబుగాదె? తనయునివైభవంబు లరణ్యంబుల పాలు
జేయు తల్లి తల్లియే? దుర్బోధంబులు సుబోధంబులని బలుకుచు
శత్రురూపంబున విపన్మార్గప్రదర్శనంబు జేయు పరమపాపిష్ఠి దుర్వచ

నంబు లేమనిదలంపుదును? మ మ్మెగతి జేయునో నృపుం డేయాపద నొందునో రాజ్యంబున కనర్థం బేమిసంభవించునో దాసదాసీజనం బులు వికటప్రత్యుత్తరంబు లొసంగుట సత్యం బనృతంబై దోఁచుట క్రూరస్వప్నంబులు గలుగుట భూనిక్షిప్తధనం బంతరించుట దనశత్రుం డు బలిష్ఠుండౌట నుపకారంబులు విపరీతార్థంబులై దోఁచుట భూపతికి వైరాగ్యంబు గలుగుట పరమేశ్వరుం డలిగె నని నిశ్చయింపవలయు. తల్లియే సుతునకు ప్రపంచం బెడబాయుచునుట రాజ్యపదచ్యుతికి చోద్యంబౌ"యని విలపించుచు నంతఃపురంబు ప్రవేశించె నట గోపీచం దమహారాజు తల్లివచనంబుల కుల్లసిల్లి "యోతల్లీ! జాలంధరనాథుని నాకన్నుల కగుపఱచుము. నేనామహామహుని గుణజాలంబులు గనుం గొని తనుమనోధనంబులర్పించి సుఖియించెదను. నీవ్యసనంబు మాను" మని దుఃఖోపశమనంబు జేసి స్నానంబుకై చనెను

{ జాలంధరనాథుండు మైనావతీరాణికతంబున గోపీచంద మహారాజుచే పాతింపఁబడియుండుట. }

తదుపరి యంతఃపురంబున పట్టరాణియగు లుమావతీదేవి పరితప్తహృదయయై భూకాంతుని ముఖ్యకాంతలను బిలుచుకొని సత్కారంబులు సలిపి "సఖులారా! రాజమాతయగు మైనావతి విపరీతచరిత్రంబు వింటిరే? ఇప్పురంబున కెవఁడో యతీశ్వరుండు పాడయ్యెనట. వానిపేరు జాలంధరనాథుండట వానిచే రాజునకు దా నిర్వాణదీక్ష లిప్పించునట! రాజ్యభోగంబుల కగ్గి ముట్టించునో నృపుని తాపసుని జేసి గోచిపెట్టించునో మనగతు లేమిచేయునో మనరాజ్యంబు పరులచే నపహరింపఁబడునో మన ముపేక్షించుట మహాహానికరంబౌను. మనయుక్తిచే వారిదురాలోచనలు భంగపఱచవలయు. లేకున్న స్తంభంబుబడిన గృహంబు గూలుట నిశ్చయంబు. యగ్నికణం బెంచుకైనను గుణంబు కొఱవౌనె?" యనుచు నొకరితో నొక రనేకయుక్తిప్రయుక్తంబులగు సంభాషణంబులు జేయుచుండ కుశలమతియగు లుమావతీదేవి యొకకుటిలంబు దలంచి "సవతులారా! మనపురంబున నివసించెడు జాలంధరనాథునిపై మైనావతీ భక్తిదృఢత్వం బమితంబై విలసిల్లె. మనమా యోగీంద్రునిపై విషయ లోలత్వంబున మైనావతి

శోధించం జనియె. తద్వ్యగ్రజకర్ణోద్భవకానీపుండు గురుచరణావలోకన
కుతూహలుండై పయనం బొనర్చె. గోరక్షుండు మాతృవిహీనశిశుచం
దంబున నహర్నిశం బన్నపానాదులు వర్జించి నిజగురుపదపంకజార్పిత
చిత్తుండై నానారణ్యంబులు గ్రుమ్మరుచు నాథా! మత్స్యేంద్రసమర్థా!
యని కేకలిడుచు తటస్థజనులను విచారించుచు గౌడబంగాళదేశస్థ
గ్రామగ్రామంబు గవేషించుచు నపరిమితచింతాభరంబున శుష్కీభూత
శరీరుండై హేలాపట్టణగ్రామద్వారసమీపంబున కేగి గోరక్షుండు ద్వార
పాలురను గని "దౌవారికులారా! ఈపురంబున తపోధనుండగు
మత్స్యేంద్రనాథుండు గలండా" యని విచారించిన, వారలు మత్స్యేం
ద్రనాథనామయతీంద్రుం డీనగరంబున లేఁడు. కతిపయవత్సరంబుల
క్రిందట జాలంధరనామయోగీశ్వరుం డేతెంచి ప్రతిదినంబు శిరాగ్రం
బున తృణ్యంబు శిరాధారంబున దెచ్చుచు నగరగోసంచయంబును
దృప్తిపఱచుచు నొకవత్సరం బిచ్చో గడపి యెచ్చటికేగెనో మే
మెఱుంగము. తదాది దశవర్షంబులయ్యె" నన గోరక్షుండు తనమనం
బున తత్పురుషశ్రేష్ఠుండు సద్గురుండగు మత్స్యేంద్రుండు గాబోలు.
లేకున్న నిట్టిసామర్థ్యం బన్యులకు గలదే! తొల్లిటి మత్స్యేంద్రనామం
బు బరిత్యజించి జాలంధరనామంబున దేజరిల్లెనో యని తలంచుచు
శోకభరితహృదయుండై "హా! గురుసమర్థా! నన్నెడబాయుట ధర్మం
బౌనే? సర్వజ్ఞుండవై నా కగుపడని కారణంబేమి? నన్నేలమఱచి
తిరి? నాయందలిప్రేమాతిశయం బంతరించెనో నాకెవరుదిక్కు? నాథా!
నాథా." యని గోవుకై వత్సంబుకైవడి విలపించి నిట్టూర్పులిడుచుచు
పురంబు ప్రవేశించి భిక్షానెపంబున ప్రతిగృహంబుననలక్ భిక్షాప్రశ్నలు
జేయుచు జాలంధరనాథకూపసమీపంబు జేరినంత జాలంధరుండు గోర
క్షుని భిక్షాప్రశ్నచే నాథపంథీమహాపురుషుండని తలంచి యాదేశ నమ
స్కారంబు జేయ గోరక్షుం డచ్చెరువొంది యీశబ్దం బెక్కడిదని
కూపనికటంబున నిలువంబడి "నీ వెవరు? నీనామం బేమి? నీ వెక్కడ
నున్నా" వని యడుగ నతండు "నేను జాలంధరనాథుండను. యీకూ
పంబున నివసించియున్నాను. నీగురు వెవరు? నీనామధేయం బేమి?
తెలుపు" మన నయ్యువతనయుండు "నాపేరు గోరక్షుం డనియెదరు.
సద్గురుమూర్తినామంబు మత్స్యేంద్రనాథుం" డనుచు "తామీకూపం

బున బడియుండుట కారణంబేమి" యని విచారించెను. హలుతాశన సుతుండు గోపీచంద్రనృపాలుని జ్ఞానరహితచరిత్రం బెల్ల దేటపఱచిన గోరక్షుండు రోషతామ్రాక్షుండై "యోగద్రుమా! భవదాజ్ఞానుసారంబున నీక్షితీశుని భస్మంబుజేయుదునే? లేక నీబ్రహ్మాండంబు కొనగోట మీటుదునె యింతనర కుపేక్షించుట కారణంబేమి? సురలోకవందితుండవగు నిన్నిట్టికష్టంబులు పెట్టు నృపాధముని శిక్షించక క్షమియింతురే" యనుచుండ, జాలంధరనాథుండు "గోపీచంద్రభూనాయకునిచే నాథపంథీసాంప్రదాయపరంపరాభివృద్ధి జెందవలసిన భవిష్యతి గలదుగాన క్రోధసమయంబు గాదు. నీవీ వర్తమానంబు వెల్లడిచేయవలదు. నీవు దేశంబులు గ్రుమ్మరుచుండ మచ్ఛిష్యుండగు కానీపుం డగుపడు. వానికీ వృత్తాంతంబంతయు దెలియబఱచిన నక్కానీపుం డేతెంచి యుక్తిప్రయుక్తులచే నృపుని రక్షించి నన్ను దీయు" నని జెప్ప గోరక్షుం డాదేశవందనం బాచరించి యచ్చటచ్చట భిక్షాన్నంబు గ్రహించి శైలీ సింగీ పరికరంబులు ధరియించి నానాదేశంబులు భ్రమ్మరుచు జగన్నాథంబు ప్రవేశించెను.

-ꕥꕥ { కానీపనాథుండు దేశంబులు గ్రుమ్మరుచు స్త్రీరాజ్యంబున కేగు నెడ మారుతాత్మజుం డితనిబలంబడి సఖ్యం బొనర్చుకొనుట. } ꕥꕥ-

ఇట కానీపనాథుండు ప్రతిగ్రామంబు సంచరించుచు నచ్చటచ్చట శిష్యులం జేసి బోధప్రబోధనలు జేయుచుండ కానీపుని వైరాగ్యంబునకు లోలురై శిష్యసమూహం బభివృద్ధినొంది సప్తశతసంఖ్య నచ్ఛిష్యులు వెంటనంటి జనుచుండ స్త్రీరాజ్యంబున నరగమనం బతికష్టంబనియు తద్రాజ్యమహిమాతిశయంబులు నిరీక్షింపం దలంచి తచ్ఛిష్యజనసమేతుండై సర్వభక్షకుండగు వైశ్వానరునివిధంబున సర్వసమర్థత్వంబున కానీపుం డేగుచుండ శిష్యజనులు దమలో తాము అహో! మన మారాజ్యంబు బ్రవేశించి వీతిహోత్రుని పూర్ణాహుతి పగిది గాక బ్రతుకనేర్తుమె? మనచే తద్రాజ్యప్రవేశం బగునే? విషపానంబున ప్రాణంబులు వాయునట్లు దీపజ్వాలపై కేగిన పతంగంబుభంగి జీవించలేమని నిశ్చయించి కొందఱు పలాయనంబు జేయవలయుననియు, కొందఱు తనుమనోధనంబులు గురుచరణార్పితంబులై యుండ మనకెట్టిభ

యంబనియు, నొకకొండ ఱీవెఱ్ఱి వేదాంతంబు లేల? ప్రాణంబులున్న శుభంబులు బడయవచ్చును. మృత్యునిలయంబునకు జనుట వేడబంబుగాదె యనుచు గుంపు గట్టి యన్యోన్యాలోచనపరత్వంబున గూర్చున్న శిష్యజనకదంబంబుజూచి కానీపనాథుండు గ్రహించి భయగ్రస్థమందమతులకు నాచాపుగుపార్థంబున నుత్ప్రతాపంబు దెలిపిన నిష్ప్రయోజకంబగునని తలంచి చిటికెడుభస్మం బభిమంత్రించి స్పర్శాస్త్రయోగంబున శిష్యసంఘంబు పలాయితులు గాకుండ దశదిగ్బంధనం బొనర్చి తత్సమీపస్త్రీరాజ్యనాయకుండగు మారుతాత్మజ భుభుఃకార మహానినదంబు వినరాకుండ నొనర్చి శిష్యులం బిలిచి "నాకు స్త్రీరాజ్యంబున కేగుట ముఖ్యకారణంబు గలదు తద్రాజ్యవల్లభుండగు కపివల్లభుని ఘోరతరభుభుఃకారరవంబున పురుషులు జీవించలేరు. స్త్రీరాజ్యంబున విశేషపుణ్యఫలదంబులగు ముఖ్యతీర్థంబులు గల వయ్యవి సేవించిన భవబంధంబులు దొలంగు. నాయందలి భక్తిదృఢత్వంబున నేతెంచితి రేని సులభంబులై ఘటియించు. లేకున్న బ్రతుకుట కష్టంబు మీమీయభిప్రాయంబులు దేటపఱచి గురుభక్తివిశేషజ్ఞులు తప్ప తక్కినవారలు నిజేచ్ఛ సదనంబుల కేగవలయు" నని పరీక్షార్థంబున నుడువ సప్తశతసంఖ్యశిష్యసముదాయంబున దృఢీకృతమనస్కులగు పురుషసప్తకంబు దప్ప తక్కినవార లొక్కుమ్మడి దిక్కులంబడి గురుండు మనసునోగతం బెఱింగి శిలవోసంగెనని పెక్కుభంగుల గొనియాడుచు నొక్కక్రోశం బేగినంత గురునిర్మిత స్పర్శాస్త్రంబు ముట్టడించి కరపాదంబులు బంధించ వారలు చేతనంబు దప్పి నిర్విణ్ణులై మహింబడియుండిరి. తత్సమయంబున కానీపనాథుండు శిష్యసప్తకంబును బిలిచి యావృత్తాంతంబంతయు దెలియఁజెప్పి "మీరు శీఘ్రగమనంబున నచ్చోటి కేగి వారిపృష్ఠభాగంబున పాషాణంబు లిడుఁ" డని యాజ్ఞాపింప వార లతివేగంబున శిష్యవర్గంబు జేరంజని గురూక్తప్రకారంబున పాషాణంబులెత్తి వారిపృష్ఠభాగంబున నుంచుచుండ వార లత్యంతదుఃఖార్ణవనిమగ్నులై హాహాకారంబులు జేయుచు "నపరాధుల మపరాధులము క్షమియించి రక్షింపుడీ. మాకృత్యంబు లనర్థంబులయ్యె నదయహృదయగురువర్యుండు దప్ప నన్యులు రక్షింతురే? మామ్ము ననుగ్రహించి స్త్రీరాజ్యంబునకు వెంటగొని జను"

మని యాక్రందించుచుండ నాశిష్యసప్తకంబు గురునికటంబు జేరి
పాదంబుల కెఱఁగి మృదువాక్యంబులచే స్పర్శాస్త్రబద్ధ బుద్ధిహీనశి
ష్యుల రోదనం బెల్ల దెల్లంబు జేసి “యోదీనశరణ్యా! శిష్యులకష్టం
బులు కడ తేర్చవే” యని ప్రస్తుతింప పరమదయారసంబున ప్రసన్నుం
డై విభక్తాస్త్రంబు జపియించి యొకశిష్యునికి భస్మంబిచ్చి “యచ్చో
టికేగి వారలకీ వృత్తాంతంబు దెలిపి ముక్తులం జేయు” మని యాజ్ఞా
పింప నతం డరిగి విముక్తులం జేసినంత వారలు పరిమితానందంబున
గురుసమక్షంబున కేతెంచి పదకంజంబులు వ్రాలి క్షమాపణంబు గోర
కానీఫుండు హర్షించి తచ్ఛిష్యజన సహితుండై స్త్రీరాజ్యసీమసమీ
పంబు జేరి నివసించియుండ నారాత్రిసమయంబున వాయుసూనుండు
స్త్రీరాజ్యనారీమణులకై భుభుఃకారశబ్దం బీడలంచి సేతుప్రదేశంబు
నుండి స్త్రీరాజ్యంబున కేతెంచుచుండ మార్గమధ్యంబున స్పర్శా
స్త్రంబు నిరోధించి పాదంబు లంటుచుండ వజ్రశరీరుండగాన నయ్యా
స్త్రంబును సరకుగొనక నిది స్పర్శాస్త్రంబని యెవ్వఁడో మహాప్రతా
పపురుషుం డిచ్చోటి కేతెంచి యుండునో లేక మత్స్యేంద్రయోగివ
ర్యుండు మైనాకినీరాణిం బాసి యిట సంచరించుచుండునో నాప్రయ
త్నంబు విఫలంబై మైనాకినీదేవి పరితపించుచుండెనో యని మనంబున
సంశయించుచు భయంకరాకారంబున పిండీకృత బ్రహ్మాండుండై
లాంగూలంబు మిన్నంది భ్రమణంబు జేయుచుండ ప్రళయకాలరుద్రు
నిమాడ్కి రోషంబున నేతెంచుచున్న మరుత్సూనుం గనుంగొని శిష్య
సమూహంబు భయభ్రాంతహృదయంబై కానీఫనాథుని సమక్షంబు
నకు పరుగెత్తిన ధైర్యధుర్యుండగు నాథుండు భయపడకుఁడని భస్మం
బభిమంత్రించి వజ్రాస్త్రంబు ప్రయోగింప నయ్యస్త్రరాజంబు మహా
తీక్ష్ణ్యంబున నేతెంచుచుండ ననిలతనయుం డుత్తుంగమహీధరం
బులు దానిపైఁ బడవైవ తద్వజ్రహతంబున నయ్యవి చూర్ణంబు
లయ్యె. బలశౌర్యుండగు హనుమంతుం డవ్వజ్రాస్త్రంబును నిజకరం
బుల నొడిసిపట్టి భూమిం బడవైచె. గజకర్ణోద్భవుం డీయపారపరాక్ర
మంబు గని కాళికాస్త్రంబు బఱపి తత్సహాయంబుకై వాసవాస్త్రాగ్నే
యాస్త్రవాతాస్త్రంబు లేకముఖంబున నసరించిన ననలాస్త్రం బనిలాస్త్ర
బలంబున దిశలు ముట్టి కపీశప్రయోగకృత కుధరంబుల భస్మంబు గా

వించిన నంజనీసూనుం డభ్రంకషశరీరుండై విశాలవక్త్రంబు దెఱచి నిఖిలజనసంఘంబును గబళింపఁదలంచ సిద్ధనిర్మిత వాసవాస్త్రంబు తద్వక్త్రప్రకటంబై ముఖాముఖి నిలిచియున్నంత హుతాశనమారుతాస్త్రంబులు మారుతిశరీరంబు బీడించుచుండ పూర్వపశ్చిమభాగంబుల వాసవాస్త్ర కాళికాస్త్రంబులు ముష్టిఘాతంబులు జేయుచుండ మిన్నుచూలి తనయుండు గనలి వాసవకాళికాస్త్రద్వయంబును కరద్వయంబున నొడిసిపట్టి యనలాస్త్రంబు పుచ్ఛంబున బంధించి మారుతాస్త్రంబును సుతుని బాధించుట ధర్మంబే యని బొగడుచు నుపశమింపఁజేయు జాలంధరప్రియశిష్యుం డీ యద్భుతవిక్రమంబు జూచి మోహనాస్త్రంబు వఱపిన నదికపిపుంగవుని హృదయంబు బ్రవేశించి తత్క్షణం బవ్వజ్రకాయంబు భేదించలేకుండెను. గంధవహసుతుం డాగ్నేయాస్త్రంబును పుచ్ఛంబుచే జలధిని ముంచదలంచినసంత సజ్జలచరంబులు నశియించునని సముద్రుండు మూర్తివంతంబున బ్రత్యక్షుండై జనుదెంచి జలదంబులచే ననలాస్త్రంబు జల్లార్చె నీప్రకారంబున వాయుసుత కర్ణసుతు లన్యోన్య జయకాంక్షలచేఁ బోరుచుండ నాథప్రయోగ మోహనాస్త్రంబు సన్నసన్నంబున దేహంబు వ్యాపించుచుండ ననిలనందనుం డొకమల నెత్తదలంచియు చిత్తవిభ్రమనొందెను. తత్సంధిసమయంబున వాసవాస్త్రకాళికాస్త్రంబులు హృదయంబు భేదించి క్వచిన్మూర్ఛం బొందించ ననిలుండు పుత్రవాత్సల్యంబున బ్రసన్నుండై సమీపించె నప్పుడా ప్రభంజనసుతుండు మూర్ఛదేరి రౌద్రావేశంబున యుద్ధసన్నద్ధుండై నిల్చియుండ మిన్నుచూలి దనతనయుని హస్తంబు ధరియించి "పుత్రా! నాథులబలపరాక్రమంబీ వెఱుంగవే? మున్ను మత్స్యేంద్రయోగివర్యుండు శౌర్యధైర్యంబున వాతాకర్షణయోగంబుచే నీకరపాదస్తంభనంబొనర్పఁడే కావున వ్యర్థకలహంబున ననర్థంబు సంభవించు. సఖ్యంబుచే సుఖావహం బౌ"నని పలుకుచుండ సముద్రుం డిదియే నాయభిప్రాయంబని నుడివెను. మరుత్సూనుం డపాంపతి పృషదశ్వసహితుండై కానీపనాథ సమీపంబు జేర నగ్గజకర్ణోద్భవుండు మహాపురుషత్రయంబునకు నమస్కారంబులుసల్పి యంజనీసూనునితో "సమరం బేల నిల్పితి" రని యడుగుచుండ చదలుపుట్టు "పవరకారణం బేమి" యని కానీపు నడుగ నతం "డే నెఱుంగను. భవత్సుతుని విచారించు" మనుచుండ హనుమం

తుండు నమీరానితో "జనకా! మున్ను నే ననేకవిధంబుల యోగిముఖ్యుండగు మత్స్యేంద్రునకు బోధించి స్త్రీరాజ్యాధిపత్యం బొసంగితి నిక్కా నీవుం దచ్చటి కేగనేని యతిశయవైరాగ్యంబుచే మత్స్యేంద్రునిచిత్తం బపహరించి వెంటనిడుకొని జనియెదేని తద్వియోగంబున మైనాకినీదేవి విలపించునని తలంచి దర్పంబు జూపితినిగాని యన్యం బేమియు లేదు గావున కానీపుం డటకేగి వికటోక్తులు బలుక నని వచనం బీకున్న జనపల" దన జాలంధరశిష్యుండు హసన్ముఖుండై "మత్స్యేంద్రుని వియోగంబు నా కనవసరం" బని కరతలభాషణం బొసంగె నప్పుడా త్రిమూర్తులు స్వస్థానంబుల కేగిరి. ఇట కానీపనాథుండు సూర్యోదయానంతరంబున శిష్యజనపరివృతుండై స్త్రీరాజ్యంబు ప్రవేశించి నానా తీర్థంబుల స్నానంబు లాడుచు శృంగమురడీనగరంబు జేరి యఃలక్ భిక్షా ప్రశ్న జేయుచు రాజభవనంబున కేతెంచుచుండ నొకకొందఱు చారులతివేగంబున రాజనగరు ప్రవేశించి సభాస్థానంబున మైనాకినీసమేతుండై రత్నమయసింహాసనాసీనుండగు మత్స్యేంద్రనాథునకు వందనంబు లాచరించి "రాజోత్తమా! కానీపనాథనామంబున నొక తపోధనుండు నాథపంథీచిహ్నంబులచే సప్తశతసంఖ్యశిష్యజనసహితుండై యుష్మద్దర్శనకుతూహలత్వంబువ నేతెంచుచున్నాఁ" డని నుడువ నమత్స్యోదరసంభవుండు గోరక్షుండు తననిజనామంబు గోప్యపఱచి కానీపనాథనామంబున జనుదెంచెంగాబోలు! చంద్రచంద్రికలనేలు మైనాకినీముఖవిలాసంబు బాయుదునో నేనేమి చేయుదు నని దలంచుచు నశ్వారూఢుండై భటకోటి నడుచుచుండ రాజభోగంబులచే కానీపనాథుని జేరం జని యాదేశశబ్దంబుల నన్యోన్యనమస్కారంబు లాచరించుకొని దివ్యాసనంబుల బుడమి నలంకరించిరి. మత్స్యేంద్రుండు కానీపుని గురుసాంప్రదాయ విశేషంబులు విచారింప నంత నతండు జాలంధరనాథజన్మప్రభృతి వృత్తాంతంబంతయు తేటతెల్లంబుగ శ్రుతపఱచెను. మత్స్యేంద్రుండు సంతసించి "యో కానీపనాథా! జాలంధరుండు దత్తశిష్యుండైనకతంబున మద్గురుబంధుండయ్యె. తత్కారణంబున నీవు నాకు ముఖ్యుండ" వని మృదువచనంబులచే తుష్టపఱచి గజారోహణంబు

జేసి నానావైభవంబులతో రాజభవనంబు ప్రవేశం బొనర్చి సరసోక్తులచే నొకమాసంబు గడపెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున కానీపనాథకథావిశేషంబు గల పంచదశాధ్యాయము సంపూర్ణము.

షోడశాధ్యాయము.

{ కానీపనాథుండు శృంగమురుడ్డీనగరంబు ప్రవేశించి మత్స్యేంద్రనాథునిచే నాతిథ్యంబు గొని చనుచు గోరక్షనాథునిచే దనగురుపుజాడ దెఱింగి హేలాపట్టణంబు ప్రవేశించుట. }

మత్స్యేంద్రయోగివర్యుం డత్యంతాదరంబున కానీపున కాతిథ్యం బొసంగుచు తనహృదయంబున నిక్కానీపుండు స్వదేశంబున కేగనేని గోరక్షునకీ వైభవవృత్తాంతంబులు తేటపఱచును. వాఁడా తత్క్షణంబ మత్స్యరూపంబున కరుదెంచి భోగభాగ్యంబుల నన్నిఁ బాపును. గోరక్షనాథుండు మచ్ఛిష్యుం డని కానీపునితో వెల్లడి జేయ తగదు. యుక్తిప్రయుక్తులచే కానీపు నిచ్చో స్థిరపఱచవలయునని నిశ్చయించి యనేకనవయౌవనాంగులం బిలచి "మీకుటిలేక్షణప్రసారంబున కానీపనాథునిచిత్తం బపహరించి దర్పకభల్లంబుల పాలు జేసి విషయలోలత్వంబు గల్పింపు" మని యాజ్ఞాపింప నయ్యకలంకచంద్రముఖులు నిజముఖావలోకనంబున తాపసులనైన పరితపింపఁజేయు లావణ్యంబులచే పరిమళవంతంబులగు చందనాగరుద్రవ్యంబులు శరీరంబుల నలఁది యుత్తుంగపయోధరభారంబున గౌను లల్లాడ మత్తమాతంగ యూథంబుపగిది గమనసోయగంబుచే కానీపనాథునికటంబు జేరి మోహావేశసంభాషణంబులొనర్చుచుండ కానీపనాథుండు నిశ్చలమనంబున విరాజమానుం డయ్యె. మత్స్యేంద్రనాథుం డక్కానీపునిదృఢచిత్తం బెఱింగి యచ్చేడియం బిలచి "శిష్యసంఘంబునైన మోహపరవశత్వంబు బఱుపు" మన వా రనేక హావ భావ విలాసంబులు గనఁబఱుప దచ్ఛిష్యులును చలింపరైరి. ఇబ్భంగి యొక మాసంబు గడపుచుండ కానీపనాథుండు మత్స్యేంద్ర యోగిపుంగవుని సముఖంబు జేరి "శెల వొసంగిన స్వదేశంబున కేగెద" నని విచారింప మత్స్యేంద్రుం "డవశ్యం" బని

సర్వసంపత్సమృద్ధుండు గాన కానీఫనాథునకు రత్నమయభూషణాంబరంబులు గజతురగోష్ట్రంబులు సమర్పించి యొకక్రోశంబు వెంటనంటి జనియు పరమాదరంబున నమస్కరించి స్వస్థానంబుజేరెను. కానీఫనాథుండు నానాతీర్థక్షేత్రంబులదర్శించుచు స్వదేశంబుజేరి స్వేచ్ఛావిహారంబు సలుపుచు గ్రామగ్రామంబున భక్తజనకృతసపర్యలం గైకొనుచు దిగంతవ్యాప్తకీర్తిధనుండై బంగాళదేశంబు ప్రవేశించినంత నాథుని యపారసచ్చరిత్రంబులు హేలాపట్టణంబు నిండియుండెను. అట గోరక్షనాథుండు జగన్నాథాది సమస్తక్షేత్రంబులు సేవించుచు బంగాళదేశంబు జేరి విపినమార్గంబున నేగుచుండ తత్కాననంబున విశాలతరతరుశోభితప్రదేశంబున గజకర్ణోద్భవుం డగుపడిన గోరక్షుం డాలోకించి యన్యోన్య నమస్కారంబు లొనర్చుకొనుచుండ కానీఫనాథుండు స్వర్ణమయదివ్యాంబరాసనంబున గోరక్షుని నివసింపజేసి తత్పార్శ్వంబున తానివసించి యతనితో "తమనాథపంథీగురుమూర్తినామధేయంబు దెలుపు" మనగోరక్షుండు దనజన్మప్రభృతిచరిత్రం బెల్ల వెల్లడిచేసి కానీఫునితో "యుష్మద్గురుసర్వాభిధానం బెఱింగింతు"రనిపలుక నకానీఫుం "డస్మద్గురుశ్రేష్ఠుండు జాలంధరనాథాఖ్యుం" డనుచు జన్మాది వృత్తాంతంబు దెలియపఱచియు దనమనంబున గోరక్షుండు మత్స్యేంద్రనాథప్రియశిష్యుండు మత్స్యేంద్రనాథుండు శ్రీగురుదత్తాత్రేయశిష్యుండు గావున నిగ్గోరక్షుని విద్యానైపుణ్యంబు గనుంగొని యస్మత్ప్రభావంబు వెల్లడిపఱచవలయు నని తలంచి "గోరక్షా. పక్వఫలశాఖాశోభితమాకందవృక్షరాజినిజూచితివె యీమధురరసపూరితఫలంబు లనుభవించవలయు నను కుతూహలంబు గల"దని నుడువ గోరక్షుండు వలదనుచుండ కానీఫనాథుండు తత్ఫలంబులకై శిష్యులం బిలచి యాజ్ఞాపించెను. గోరక్షుండు "కానీఫనాథా! యింతటికై శిష్యుల నంప నవసరంబేల నట్లైన శిష్యులు లేనిసమయంబున మనకు ఫలంబు లెట్లులభియించును. గావున స్వగురుప్రతాపసమర్థత్వంబుచే ఫలంబులు గ్రహించి తృప్తిం బొందవలయు" నన కానీఫనాథుండు హర్షించి చిటికెడుభస్మంబభిమంత్రించి విభక్తాస్త్రంబు జపియించి యాకర్షణయోగంబున ననేకఫలంబులు సంకల్పమాత్రంబున తనసమక్షంబునకు దెప్పించి శిష్య

గోటిసహితులై యుభయానాథులు ఫలంబు లనుభవించుచుండ గోరక్షుండు కానీఫనాథుని ప్రతాపంబు గనుంగొని స్వప్రతాపంబు జూపం దలంచి తద్వద్విభక్తాస్త్రయోగంబున మధురసభరితచూతఫలంబు లాకర్షణశక్తిచే దెప్పించి యత్యంతానందంబున దృప్తులై నిజాసనంబుల నలంకరించి యుండుతరి గోరక్షుండు "గజకర్ణోద్భవా! మహారసపూరితరసాలఫలంబులు శేషించి నిరర్థకంబున పృథివిఁ బడియుండె నియ్యవి తత్తత్తరుశాఖంబుల పూర్వస్థితి ప్రకాశించియుంట విశేషంబని దలంచెద" నన కానీఫుండు "గోరక్షా! పునస్సృష్టి జేయు ద్వితీయపితామహుం డిచ్చో నెవ్వఁడు గలం" డన గోరక్షుండు "కానీపా! సప్తసముద్రంబు లేకముఖంబున గ్రసించు మహాపురుషునకు నదంబులక్ష్మమై నిల్చునే? వసుంధరాభారంబు శిరంబున వహించు యహికులాగ్రగణ్యుండు కుధరంబుల సరకుగొనునే? స్వకటాక్షవీక్షణమహత్వంబున పాషాణపఙ్క్తులు పరుసంబులై దేజరిల్లుచుండ హేమప్రయత్నంబు లక్ష్యంబే? కావున గురుకరుణాకటాక్షపరిపూర్ణమహామహులకు పితామహుండు సముండగునే" యనుచుండ గోరక్షునిజూచి కానీపుండు క్షోభించి "యౌనౌను. నీగురుసమర్థత్వం బే నెఱుంగుదును? నీచకర్మంబులం బడి వాచావేదాంతంబులు బలికిన నేమిలాభంబు? నీగురుండు స్త్రీరాజ్యాధిపత్యంబువహించి మైనాకినీలోలుండై పాపకృత్యంబు లాచరింపుచుండ క్రియాసాక్షిత్వంబులేని నిగ్రహవాక్యంబులు బలుకుట చిత్రంబుగాదే? నీగురువునకు మీననాథపుత్రుండు నివర్తనంబు గలఁడు. నీశూరత్వవాచాలత్వంబులు నీగురుస్వరూపస్త్రీలోలత్వంబులు పరమహేయంబులు గావే చాలు నీపరుషోక్తు" లనుచుండ గోరక్షుండు కానీపునితో "భ్రష్టాత్మా! నీగురుండగు జాలంధరనాథుండు ప్రతాపహీనుండై హేలాపట్టణంబున గోపీచందభూపాలుని దర్పంబునకు నిలువలేక నొకమహాకూపంబున తురంగమలంబుచే గప్పంబడి దీనభావంబున నుండుట కెంతశౌర్యంబో దలంపుము. మూర్ఖా! తద్వన్మద్గురుండొనే యెవ్వనిహస్తకమలంబున నీలకంఠుని త్రిశూలంబు ప్రకాశించునో సమరంబున దేవదానవు లెవ్వనిచే నోటుబడి దాసులైరో రామకార్యధురంధరుండగు మారుతాత్మజుం డెవ్వనిచే స్తంభింపఁబడెనో దుర్జయపరాక్రముండగు వీరభద్రుం

డెవ్వనిచే కంఠగతప్రాణుండై నిల్చెనో త్రిమూర్త్యాత్మకుండగు మార్తాండుం డేమహానుభావునిచే గగనపథంబు బాసి పుడమినిం బడెనో సురాసురనరగరుడగంధర్వాదులే తపోధనుని నిర్వక్రపరాక్రమంబు లుగ్గడించి నమస్కారంబులు సల్పిరో యట్టి పరమయోగీశ్వరుని గుణదోషంబు లెంచ బ్రహ్మాదులకైన దరంబగునే జ్ఞానహీనా! యస్మద్గురుశక్తి గనబఱచెద మూఢ" యని గోరక్షుండు భస్మంబుదీసి సంజీవినీమంత్రప్రభావంబుచే భుక్తశేషఫలంబులు యథాస్థితి వృక్షశాఖంబుల నంటించిన నక్కానీపుం డచ్చెరువొంది "గోరక్షా! ధన్యుండవు. సమర్థుండ" వని బొగడుచు విరుద్ధసల్లాపంబులు మాని పరమానందహృదయుండై "నీకతంబున మద్గురువర్యుని జాడ లెఱుంగనైతి" నని గొనియాడుచుండ గోరక్షుండు "కానీపనాథా! నాచే నీమనోరథం బీడేరె. నీచే నాకష్టంబులు కడతేరె" నని యన్యోన్యాలింగనంబులు సలుపుకొని యుభయసిద్ధులు గమనోన్ముఖులై గోరక్షుండు స్త్రీరాజ్యమార్గంబున నేగెను. కానీపుండు హేలాపట్టణపథంబున జనుచు గోపీచందనృపాధముని క్షణమాత్రంబున భస్మంబు జేయక నుపేక్షింతునే నహాహా! దయాపరమూర్తియగు జాలంధరనాథుని తపింపజేసిన పాపాత్ముని మత్కోపానల శిఖాజ్వాలల నాహుతి గొనియెద నని రౌద్రరసం బుప్పతిల్ల శీఘ్రగమనంబున శిష్యసముదాయసహితుండై హేలాపట్టణంబు సమీపింప గోపీచంద్రమహీధవుండు కానీపనాథసచ్చరిత్రంబు లగాధంబులని తొల్లి వినియుండుటం జేసి యాసమయంబున చారులచే సిద్ధాగమనవృత్తాంతంబు గ్రహించి సపరివారంబుగ నెదుర్కొన నేగుచు సప్తశతసంఖ్యశిష్యసంఘమధ్యంబున మూర్తిమంతంబగు వైరాగ్యంబో యన ప్రకాశించుచున్న కానీపనాథుని దూరంబున గనుంగొని దవనంబున నిస్పృహయోగిపుంగవుండు గజతురగశిష్యపరివారసహితుండై శాంతశమదమాది గుణంబులు గలిగి యతులిత వైభవవిశేషంబులచే కీర్తనీయగుణజాలుండై దేజరిల్లు నిస్పృహానుభావుని పదసరోజంబు లాశ్రయించి యనుగ్రహంబు బడసి యమరత్వంబు నొందవలయు నని వితర్కించుచు మంత్రిపుంగవుని బిలిచి "ప్రధానిశేఖరా! మద్భాగ్యవశంబున సిద్ధపురుషుం డిచ్చోటి కేతెంచె. నితని యోగ్యత్వం బస్మద్భోగభాగ్యంబుల కనుకూలంబై వర్తిల్లు. నే

నీ తపోమూర్తి బోధామృతపానుండనై పరమేశ్వరధ్యానతత్పరత్వం బున మెలంగవలయు నని తలంచెద. మున్ను మజ్జననీవాక్యోల్లంఘనం బ్బుజేయక సురమహీరుహవనంబున బర్బూరవృక్షంబుల జేర్చినట్లు రత్నాకరుండు కాచభూషణంబులు ధరియించినపగిది హీనుండగు జాలంధరనాథుని యనుగ్రహంబు బడయుట రాజ్యవైభవంబులు హేయంబులు గాకుండునే గావున నిక్కానీపనాథుండు యోగ్యా చార్యుం" డనుచు భక్తియుక్తుండై జనుచుండ కానీపుండా పుడమిఱేని జూచి క్రోధపూరితుండై తత్క్షణంబున నృపాధముని భస్మంబు జేయం దలంచి భూపుండు గతించెనేని గురువర్యునిజాడ ఘటియిం చునో లేదో యనుసంశయంబుచే కార్యసాధన పరత్వంబున శ్రీగురు జాలంధరనాథునిజాడ లెఱింగి యాపిదప బుడమిఱేని శిక్షించెద నని కృతనిశ్చయుండై స్తబ్ధించి యుండునంత గోపీచందుండు కానీపనాథుని సమీపించి చరణకమలంబులకు నమస్కరించి బద్ధాంజలుండై "సమర్థా! నేఁడు భవద్దర్శనమాత్రంబున మజ్జన్మంబు పవిత్రంబయ్యె. భవాదృశ మహాపురుషసందర్శనం బస్మదాదులకు ఘటియించుట సామాన్యవిష యంబే? ధన్యాత్మా! అనాథులను సనాథులఁజేయు సమర్థుండవు గాన నాయం దనుగ్రహించి యుష్మద్వాక్సుధారసధారలచే నన్నజరామర మూర్తిని జేయవే" యని నమ్రోక్తులచే సిద్ధుని బొగడుచుండ కానీప నాథుండు పార్థివుని దృఢభక్తియుక్తంబులగు స్తోత్రంబులకు విగతక్రో ధుండై శాంతింబొంది పరమాహ్లాదంబున నృపునిహస్తంబు ధరియించి నిజనికటంబున గూర్చుండ నియమించి కుశలప్రశ్నలు జేయుచు "నో రాజోత్తమా! నీభాగ్యోదయవిశేషం బేమని వచియింతును? నీ మృదుమధురప్రియవచనంబులచే నాచిత్తంబు శాంతిం బొందె. లేకున్న నుత్కోపానలంబున ననర్థంబు వాటిల్లకుండునే? తత్కారణే తిహాసంబు తెల్లంబు జేసెద. వేగంబున సదనంబున కేగవలయు" నన గోపీచందుండు కానీపనాథుని శిబికాసనంబున నలంకరించి శిష్య జనసహితంబుగ నిజనికేతనంబు జేరి మణిఖచితకనకాసనంబున నాథుని షోడశోపచారంబుల బూజ లొనర్చి మహావినయంబున "యోగద్రుమా! భవదనుగ్రహంబుచే బ్రహ్మానందపదవి నొందవలయు నని దలంచి గొనియాడుచుండ 'క్రోధంబు శమియించె' నని వచించిన

కారణం బెయ్యదియో దయజేయుడు" రనుచుండ గజకర్ణోద్భవుండు "రాజపుంగవా! న న్ననుగ్రహించు మని వేడితివి. నిజంబే. నేనే తపోఘనుని కృపాకటాక్షంబున నక్షీణభక్తివైరాగ్యంబుల బ్రకాశించితినో యట్టినిరుపమానగుణజాలుండగు జాలంధరనాథుని నొకకూపంబున బడవైచి తురంగవిష్ఠంబు గప్పుట కెంతని శిక్షింతును? నీపూర్వపుణ్యఫలంబున నింతవర కమ్మహానుభావుం డుపేక్షించె లేకున్న నతండలిగెనేని భువనబ్రహ్మాండంబులు క్షణమాత్రంబున నశించక నిలుచునే? నాకలోకనివాసు లెవనిప్రతాపదర్పంబున కెదురించలేక మతిభ్రష్టులై విహంగంబులకైవడి వృక్షశాఖాగ్రంబుల నంటుకొనిరో యమ్మహాయోగిపుంగవుండు నీయట్టి యకించిత్పురుషుని గణుతించునే" యనుచుండ గోపీచంద మహీపాలుం డత్యంతభయవిహ్వలాంగుండై గడగడవడంకుచు నదరిపడి కానీపుని పదకంజంబుల వ్రాలి "దీనశరణ్యా! నే మహాపాతకుండనై ఘోరతరకృత్యం బాచరించితి. నాయట్టి దుష్కృతిపాపంబునకు పారంబుగలదే? హా! యీదుష్టాత్ముని గడతేర్చు సత్పురుషశిరోమణులగు మీరుదక్క నన్యులు గలరె! సుఖదుఃఖలాభనష్టశత్రుమిత్రసర్వసమత్వబుద్ధిచే ప్రకాశించెడు తపోఘనులు క్షమాశీలురై రక్షింతురుగాక. నితరుల శక్యంబె" యనుచు ననేకవిధంబుల విలపించుచుండ దయాసముద్రుండగు కానీపనాథుండు "నృపోత్తమా! భయపడవల" దని నుడువుచు పుడమిఱేనిసహితుండై విడిదికిం జనెను.

ఇట పరిచారకు లీవృత్తాంతంబు గ్రహించి తీవ్రగమనంబున రాజమాతకడ కరుదెంచి "యోజననీ! త్వద్గురుండగు జాలంధరనాథుండు గోపీచందపృథ్వీరమణుని యాగ్రహంబుచే కూపంబున హయవిష్ఠంబునే గప్పంబడి దశవర్షంబులు గడచెనట! నేఁ డొక కానీపనాథాహ్వయతాపసోత్తముండు జాలంధరనాథప్రియకుమారుండ నని మహావైభవంబులతో రాజసభ కేతెంచి సంభాషించుచుండ నీచరిత్రంబు తేటపడియె. భవత్సుతుం డా కానీపనాథుని సేవ లొనర్చుచు భయభక్తిచే మెలంగుచున్నాఁ" డని విన్నవించ మైనావతీహృదయంబు క్షోభించి పుత్రమోహంబున నిశ్చలత్వంబున నుండె నట

భూనాయకుండు గజకర్ణోద్భవుని సముఖంబున కౌరవులు దుర్వాసుని సేవించినచందంబున ముకుళితకరపుటుండై వినయంబున కైంకర్యంబులు సల్పుచు సూర్యాస్తమయానంతరంబున సిద్ధునిచే ననుజ్ఞ గొని నిజసదనంబున కేతెంచి మైనావతీచరణంబుల కెఱఁగి గతవృత్తాంతం బంతయు సవిస్తరంబుగ దేటపఱచి "తల్లీ! నీవక్కా నీపనాథుని సమీపంబు జేరి మృదువాక్యంబులచే కోపోపశమనం బొనర్చి నిర్విఘ్నంబుగ ప్రసన్నునిం జేయవే" యని పలుక నవశ్యంబని మైనావతీ మహారాణి కడువేగంబున నాథుని శిబిరంబు జేరం జని కానీఫునిపదంబులకు వందనం బాచరించి "యోగిపుంగవా! మీచిహ్నంబులువిచారింప నాథపంథీసాంప్రదాయకం బగుపడు నేను శ్రీగురు జాలంధరనాథప్రియశిష్యురాలనై మెలంగెద" నని గురుబంధుత్వంబు దెలియబలుక నోహో! యనుచు కానీపుండు "నీయట్టి సచ్ఛిష్యురాలు గలిగి పరమదయాకరుండగు జాలంధరనాథుని కూపంబున బడవైచి యశ్వవిష్ఠంబు గప్పించుట కర్జంబగునే" యన రక్షితుం డింత "మత్సుతుండు మందమతిచే నాచరించిన భయంకరకృత్యంబు నవదాగిమన కారణంబున విశదంబయ్యె. దుర్మతుల దుష్కర్మంబులు జ్ఞానఘనులు జక్కంబెట్టుట లోకప్రసిద్ధంబు గాదే? సమర్థా! దయానిధియగు గురువర్యుని బహిర్గతంబు జేయుట కిత్తఱులు సమర్థులగుదురే? మత్సుతునిచే నికార్యంబు జక్కపెట్టందలంచితేని తపోధూర్జటి యగు జాలంధరుని కోపజ్వాలలల కాగునే గాన యుక్తిప్రయుక్తుల భూపుని రక్షించి కీర్తనీయగుణకదంబుండగు జాలంధరనాథుని బహిర్గతంబు జేయ భవత్కీర్తి త్రిలోకవిదితంబై ప్రకాశించు"నన నతండు "క్షితీశుని రక్షించి శ్రీగురుచరణసరోజంబులు ప్రదర్శించెద. సంశయం బుడుగు" మని నుడువ నప్పుడంతిమిన్న జడదారి యడుగుల కెఱఁగి నిజనిలయంబున కేగి పుడమిఱేని కీ వృత్తాంతంబు దెలిపి భయవిముక్తుం జేసెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున గోరక్ష కానీప గోపీచంద సంవర్ధనప్రసంగవిశేషంబులుగల షోడశాధ్యాయము సంపూర్ణము.

సప్తదశాధ్యాయము.

{ గోపీచంద్రుండు కానీఫునాథుని సహాయంబుచే కూపస్థిత జాలంధరనాథుని పైకిదీసి యనుగ్రహంబు వడసి తపంబుకేఁగనుట. }

గోపీచంద్రమహీశుండు సూర్యోదయంబున గృతకృత్యుండై గజకర్ణసంభవుని శిబిరంబున కేగి పదపద్మంబులకు నమస్కరించి సవినయభక్తియుక్తుండై నికటంబున నిలిచియుండ కానీఫుండు "జాలంధరనాథు నెచ్చో బడవైచితివో మచ్ఛిష్యుని కా ప్రదేశంబు గనబఱచు" మని వాక్రుచ్చిన నతం డవశ్యం బని యొకసచ్ఛిష్యుని వెంటఁగొని తత్ప్రదేశంబు జూడనూపి పునః కానీఫుని విడిది కేతెంచియుండ నక్కానీఫనాథుండు "గోపీచందా! నీప్రాణంబులు రక్షించుకొన దలంచెదవేని కనక రజత తామ్ర పిత్తల లోహ ధాతుపంచకంబుచే భవత్స్వరూపపుత్తళులఁ నిర్మించి తెప్పించు" మన నృపుండు తత్క్షణంబున కుశలమతులగు స్వర్ణకార లోహకారులం బిలిపించి యాజ్ఞాపించినంత వార లతినిపుణత్వంబున రాజాకృతి ప్రతిమల నిర్మించి నాథుని చెంగట సమర్పించినం గనుఁగొని యొకసుదినంబున వసుంధరాధిపుని దోడ్కొని శిల్పంబులం గొని గుప్తస్థానంబు జేరి తత్కూపసనికటంబున తా నివసించి యొకత్రపువ్వక్కోలం బార్థివుని కరభాగంబుననుంచి "యో రాజేంద్రా! ఖననంబు జేయు సమయంబున ప్రతాపపరిపూర్ణుండగు వైశ్వానరసుతుండు 'నీవెవరు! నీనామం బేమి' యని విచారించు. నీ వపుడు నీనామంబు దెలియఁబలుకుచు నతివేగంబున నచ్చోటుబాసి దూరంబు జను" మని చిరంజీవత్వమంత్రంబు జపియించి నరనాథుని ఫాలభాగంబున భస్మంబు బూసెను. పృథ్వీశుండును తత్ప్రదేశమధ్యభాగంబున ప్రతిమలనుంచి కుద్దాలంబు కరంబుల ధరియించిఖననంబు జేయుచుండ నాగ్రహంబున 'నీవెవ్వండ' వని జాలంధరనాథుం డడుగ రాజోత్తముండు 'నే గోపీచందుండ' ననుచు దురదురం దొలఁగి యరిగెను. వీతిహోత్రనందనుం డత్యంతక్రోధావేశుండై భస్మంబు గమ్మని శపియించుచుండ తచ్ఛాపాగ్నిజ్వాలలు కనకశిల్పంబు ముట్టడించి భస్మం

బొనర్చె నాపిదప ద్వితీయ ప్రతిమ మధ్యభాగంబున నుంచి పూర్వవిధం
బున సులోచనసుతుండు ఖననంబు జేయుచుండ 'నోరా! నీవెవ్వండ'
వనిసక్రోధంబున ధనంజయతనయుం డడుగుతఱి యవనీశుండు 'నే గోపీ
చందుండ' ననుచు నతివేగంబున దొలంగెను. మఱియు సిద్ధుండు
భస్మంబు గమ్మని శపించినంత నారజితమయపుత్తళి భస్మంబు నొందె
నివ్విధంబున తామ్ర పిత్తల లోహ ప్రతిమల ప్రతిహతశాపానలంబుచే
క్రమంబున భస్మంబై నేలం గూలియుండ కానీపనాథుండు "రాజ
శ్రేష్ఠా! భీతిల్లకు మిక నీనామంబు నే దెలియంబలికెద" నని పలుకమహీ
రమణుండు పునఃఖననంబు జేయుచుండె నప్పు డయ్యగ్నికొడుకు దన
డెందంబున నబ్బురంబొంది "మత్కోపాగ్నిశిఖలచే లోకత్రయంబు
నశించు సులోచననందనుండు బ్రతికియుండుట చిత్రంబుగాదే? తక్షక
విషదంతదంశితుండు రక్షింపఁబడుగాక! ఖగేంద్రునిచేఁ గబళింపఁబడిన
యురగంబు జీవించుగాక! సర్పముఖాంతర్గత మూషకంబు ప్రాణంబులు
వాయకుండుఁగాక! మచ్ఛాపంబున నశించక వీఁ డెట్లు మిగిలె" నని విత
ర్కించుచు ఖననశబ్దంబు కర్ణేంద్రియంబు సోకుచుండ నీవెవ్వం డనియ
డుగ చాతుర్యధుర్యుండగు కానీపుం డిది సమయం బని తలంచి "గురు
సమర్థా! భవత్ప్రియతనయుండగు కానీపుండు యుష్మచ్చరణాంభోరు
హదర్శనాపేక్షచే నిచ్చటికేతెంచి యాభూపాగ్రగణ్యుండగు
గోపీచందునిచే ఖననప్రారంభంబు గావించె" నని పలుక నిగ్రహాను
గ్రహాసమర్థుండగు హుతాశనసుతుండు దయార్ద్రహృదయుండై
"గోపీచందా! జననమరణహరణంబగు చిరంజీవత్వంబు బడయు" మని
యనుగ్రహించి జ్ఞానపుత్రుండగు కానీపుని వేవేగ జూడందలంచి త్వరి
తంబున దప్పించుమని యాజ్ఞాపించెను. అట్టియెడ బుడమిఱేని యను
జ్ఞచే కాయబలసంపన్నులగు ఖాతకులు ఖనిత్రాదిపరికరంబులు గొని
ఖననంబు జేయుచుండ పర్వతతుల్యతురంగవిష్ఠంబు దఱుగ లేకున్న గని
కానీపుండు భటులం దొలంగించి శక్రునుద్దేశించి వజ్రాస్త్రప్రయో
గంబున హయములం బతిసులభోపాయంబున బాయంజేయ నుభయ
నాథు లన్యోన్యముఖావలోకనమాత్రంబున ప్రేమాస్పదబాష్పపూ
రితలోచనులై యుండ జాలంధరనాథుం డుపరిభాగంబున కేతెంచి "కా
నీపా! నీకతంబున నృపుండు రక్షింపఁబడియె" ననుచు దృఢాలింగనం

బౌనర్చునసమయంబున గోపీచందుండు తపోఘనుండగు జాలంధరనాథ చరణసరోజంబులకు దండప్రణామంబు లాచరించెను. దయాసము ద్రుండగు సిద్ధుండు ధరణీధవుని శిరంబున వరదకరంబుంచి "వత్సా! మత్కోపానలతీక్ష్ణజ్వాలలచే దక్కితివి. నీ కపాయం బికమీఁదగలుగ నేర దాచంద్రార్కచిరంజీవుండవైతి" వని యాశీర్వదించుచుండ సులోచనురాణి యగు మైనావతీదేవి గురునాథుని పదంబుల ఫాలంబు మోపి యశ్రుధారలచే నభిషేకించి "క్షమాశీలా! నాఁడీ మూఢమతి యగు మత్సుతుని కృత్యంబుచే వత్సంబుల బాసిన ధేనువుపగిది యస్తమించి నేఁడీ దాసులకై యుదయించుట చంద్రచకోరన్యాయంబు గాదే" యని పలువిధంబుల బలవించుచుండ మైనావతీనేత్రగళితబాష్పంబులు నాథుండు సదయుండై తుడుచుచు ప్రియంబున బుడమీశుని ముఖకమలంబు నివిరి "వత్సా! గోపీచందా! రాజ్యభోగసుఖసంపదల కాశించెదో బ్రహ్మానుభవజ్ఞానంబున నిత్యుండవై వెలుంగఁదలంచెదో నీ కెయ్యది యభీష్టంబో వేఁడుము. కాలాంతరంబున శక్రుండు స్వర్గభోగంబుల దొలంగు. మృగజలంబులకరణి భాసమానంబగు సంసారసుఖంబులు కల్లలుగాకుండునే? తొల్లి సారాసారవిచారధుర్యుండగు గాధిసుతుం డతులితరాజ్యవైభవంబుల దృణీకరించఁడే? ఉత్తమోత్తముండగు నుత్తానపాదుండు సచ్చిదానందస్వరూపుండై ప్రకాశించుట లోకవిదితంబు గాదే? కావున దీర్ఘాలోచనపరుండవై విచారించు" మన నరనాథుండు దనహృదయంబున ప్రభావరహితంబులగు రాజ్యభోగభాగ్యంబులు తపోధనంబున కెనయౌనే? క్షణభంగురంబగు సంసారతాపత్రయకూపంబు యోగిజనసంసేవిత వైరాగ్యజలార్ణవంబునకు హస్తిమశకాంతరభేదంబు గలదనుట నిస్సంశయంబేకదా! ఇమ్మహాఘనుండగు జాలంధరనాథుం డంధకారబంధురంబగు కూపంబునంబడి నిరాయాసంబున దేజరిల్లుట యాశ్చర్యంబు గాదే? లోహంబు పరుసంబుచే హేమంబైన చందంబున సిద్ధుండు నిజకరుణాకటాక్షవీక్షణంబున మర్త్యుల నమర్త్యులం జేయుట శమనుని దర్పంబడంచుటగాక వన్యంబే? బ్రహ్మాండోద్ధారక సిద్ధపురుషవైరాగ్యసత్తాభాగ్యంబు లనూనంబు లని వితర్కించి "యోగిగురువర్యా! అక్షీణవైరాగ్యధనంబే ఘనంబుగాక నిహసుఖంబులు స్థిరంబులౌనే? నాయం

దనుగ్రహించి భ్రమరకీటకన్యాయంబున స్వస్వరూపుని జేయవే” యని గొనియాడుచుండు మనోదృఢవాక్యంబు లాకర్ణించి యప్పావకనందనుండ పార్థివపుంగవుని శిరంబున కనికరంబుచే వరదకరం బుంచి కర్ణపుటంబున గురుమంత్రరాజం బుపదేశించి నాథపంథీరహస్యంబులు దేటపఱచినంత సులోచనతనయుండు బ్రహ్మానందాంబుధి నిమగ్నుండై నిర్మోహ నిరహంకార నిర్మమత్వ నిశ్చలత్వంబున దేజరిల్లుచు నశాశ్వతరాజ్యసంపదల దిరస్కరించి శైలీ సింగీ కంథాది నాథపంథీ చిహ్నంబులు స్వీకరించి కక్షపాలంబున భస్మంబు ధరియించి భిక్షాన్నంబుచే దృప్తుండై సాంద్రవైరాగ్యంబున సంచరించుచుండెను. ఈవృత్తాంతం బంతఃపురస్త్రీసంఘంబు లాలకించి హాహాకారంబులు జేయుచు మైనావతీరాణిని దూషించుచు దుఃఖపరవశత్వంబున బుడమింబడి యాక్రందనంబు జేయుచు “హాప్రాణవల్లభా! నిన్నెడబాసి మాప్రాణంబులు నిమిషంబైన నిల్చునే? నీరాజ్యసుఖసంపదలు విపినంబులపాలు జేసితివే? మ మ్మనాథలను జేయుట ధర్మంబగునే? నీసుందర సుకుమార తనువిలాసంబు మఱవ వశంబగునే? మాకోర్కులీడేర్చుమనుండ వీవుదక్క నన్యు లెవరు గలరు? నీవులేని భాగ్యంబులు రోగంబులుగాక భోగంబులగునే?నిన్నెందు నెమకుదుము. ప్రాణప్రియా! నీ పరిపూర్ణప్రేమాతిశయంబు లెందుబోయె. నవయవ్వనయుండవై మ మ్ముపేక్షించుట కర్జంబగునే” యని మానినీనివహం బేకముఖంబున మహారవంబు జేయుచు చిత్తవిభ్రాంతిచే నొకయువతి ‘గోపీచందా’! యని దనంతట తా వదనంబుచుంబించు; మఱియొకలోలాక్షి ‘నృపాలశేఖరా! రమ్ము ర’మ్మని బలవరించు; నొకమందయాన ‘నామనోహరుండు హాసించె’ నని దనలో తా నవ్వు; నొకచపలాక్షి ‘ప్రియుండు వేణీభరంబులాగె నని యఱరిపడు నివ్విధంబున వియోగశోకాకులితచిత్తలై మాకీ శృంగారంబులేల నని మణిమయహారభూషణంబులు బడవైచి ‘హానాథా! హాప్రియా! హారాజోత్తమా.’ యని నేత్రాంబుధారాశ్రుధారాప్రవాహంబు లురోజకుధరంబులపై గళితంబు లౌచుండ; కీలూడినబొమ్మలచందంబున స్మృతిదొలంగి నేలంబడుచు ప్రియుండిదె వచ్చెనని దిక్కులు రోయుచు “సమ్మక్కలార! మనదిక్కెవ్వ రికమీద దెల్పరే దయారసమొలుక బలుకరే మావిషమశరసమపురుషుజాడ

లెఱుంగింపరే దయానముద్రుండగు నరేంద్రుని గనుంగొని మాహృదయతాపంబు బాపరే జూపరే" యని పల్లవాధరనికరంబులు గుల్లుమని పెల్లేడ్చుచుండెను. తత్సమయంబున జాలంధరనాథుండు "గోపీచందా! నీవు తపం బాచరించుట కర్తవ్యంబు. నీప్రాణప్రియులగు ద్వాదశశతసంఖ్యనారీశిరోమణులు భవనంబులకేగి సింగినాదవినోదంబుచే మాతృభావంబున 'అలక్ నిరంజన' యని భిక్షాప్రశ్న జేయుచు గలియంజూచి పిదప తపం బాచరించెదవా" యన గోపీచందుం డవశ్యంబని యంతఃపురంబుం బ్రవేశించి 'యలక్ భిక్షా' యని ప్రశ్న జేయుచునేగుచుండ నక్కాంతామణులొక్కుమ్మడి యడరిపడి భూపుని దీనదశారూపంబు విలోకించి యాహా యను మహానిర్ఘోషంబు నింగిముట్టి ప్రతిధ్వనులీనుచుండ రోదనంబు జేయుచు నొకర్తు ముఖతాడనం బొనరించుకొనుచు మఱియొకతి శిరోతాడనం బొనరించుకొనుచు నొకతి భూస్థలింబడి హాహాకారంబు జేయుచు ననేకులనేకవిధంబుల నృపుని చెయ్వు లుగ్గడించుచు "ప్రాణనాయకా! నీకీ నిరుపమానరాజ్యసుఖంబులు నింద్యంబులయ్యెనే? నీస్వరూపలావణ్యంబుల కసుగై విలసిల్లు సుగంధపరిమళద్రవ్యంబులు హేయంబులై భస్మలేపనం బమితానందంబు నొందించెనే? నీ నవయౌవనాకారరూపసౌందర్యం బెందుబోయె? యాచకజనాశా పరిపూర్తినొసంగు నీహస్తకుశేశయంబన్నంబుకై పరుల వేడుట కేవిధి గల్పించెనో హానాథా! నాథా!" యని యుద్ఘోషించుచుండ పట్టమహిషియగు లుమావతీరాణి రాజనికటంబు జేరి వారిపూరితనయనంబులచే కాంతునిముఖకాంతి దిలకించుచుండ నప్పుడతిమిన్నులపారశోకరాశి ముసుంగుచు సమక్షంబున కేతెంచి "ప్రాణప్రియా! నీవు మమ్మెడబాసి చనుట ధర్మంబగునే? భవద్వియోగదుఃఖానలపరితప్తహృదయులమై ప్రాణంబులులేని శరీరంబులభంగి మాయున్కి నిష్ఫలంబుగాదే? గావున భగవద్ధ్యానయోగంబులిచ్చో నాచరింపుడు. మావిషయసుఖంబులకై మిమ్మపేక్షింపము. యుష్మన్ముఖకమల నిరీక్షణాసక్తిచే బ్రవర్తించెదము. భవదాశ్రయ బలులమై యుండుట మాకు నిరంతరశుభంబులు గావే? మహీరమణా! మీ కనుకూలప్రదేశంబున నతిశోభాయమానంబగు పర్ణకుటీరం బేర్పఱచెదము. తామక్కుటీరంబున మణిహిరణ్మయ సింగీశైలి హస్తకమలం

ములు ధరియించి దివ్యాంబరనిర్మిత కంథాసహితులై మృగచర్మంబులు బరిత్యజించి యమోఘదుకూలంబులచే నలంకృతులై భిక్షాన్నంబులు వర్జించి షడ్రసోపేతపక్వాన్నంబులు పరిగ్రహించుచు దాసదాసీజనంబులు సుగంధపరిమళద్రవ్యంబులు శరీరంబున నలదుచుండ మృదులతరపర్యంకంబులపై నత్తమిల్లుచు ద్వాదశశతమృగాక్షీసమూహ పరిసేవితపాదపద్ముండవై కాననతరువిపినసంచారకాంక్ష లుడిగి రథగజతురగభటపరివృతుండవై సకలసుఖనివహంబు లనుభవించుచు రాజయోగీశ్వరుండవై నిచ్చ నివసించుట జ్ఞానవైరాగ్యంబులకు గొఱవానే” యని చతురోక్తులు బలుక నృపుం డాగ్రహచిత్తుండై యవ్వనితలధిక్కరించుచుండ నక్కపటశతమయచపలాక్షు లిరుగడల బరివేష్టించి “నాథా! కాననంబున నీతో ముచ్చటించు నెయ్యు లెవరు? శయ్యాసనపరిధానంబు లెట్లు లభించును? నీసహాయులై శయనించువా రెవరు? తరుమారుతజన్యశీతబాధ లెట్లు సహింతువు? నీమాతాపితృభగినీసహోదరు లెవరు గలరు? షడ్రసోపేత భోజనంబు లెట్లుఘటియించు? కౌపీనంబు జీర్ణించెనేని యొండెట్లు ప్రాప్తించు” నన గోపీచందుండు “మందమతులారా! కాంతారంబున సింగీసారంగులతో ముచ్చటింతు. భూమ్యాకాశంబులు శయ్యాసనపరిధానంబులై విలసిల్లు. హంసదండంబు మత్సహాయంబై శయనించు. పంచాగ్నియోగంబున శీతబాధ హరించు. విశ్వస్వరూపంబున ప్రతిగృహస్థులు మాతాపితృభగినీసహోదరులు గాకుందురే? మధురసయుతఫలంబులసరి షడ్రసభోజనంబు లగునే? ఇంద్రియదమనదృఢకౌపీనంబుండ వసనకౌపీనజీర్ణత్వంబున కే వెఱతునె” యని యుచితప్రత్యుత్తరంబు లొసంగుచు నిరస్తమోహుండై యదరిపడ బెడిదంబులు బలుకుచు నిస్పృహత్వంబున ‘నోజననీ! యలక్ భిక్షా’ యనుచుండ తల్లియగు మైనావతీదేవి భిక్షాన్నం బిడినంత నృపుండు తల్లిపాదంబులకు బ్రణమిల్లి శీఘ్రంబున జాలంధరనాథుసమీపంబు జేరి గతవృత్తాంతం బంతయు వినియోగించె ననంతరం బా హుతాశనసుతుండు గోపీచందున కనేకరహస్యంబు లుపదేశించి యుమావతీపట్టమహిషీగర్భశుక్తిముక్తుండగు ముక్తచందాహ్వయునకు రాజ్యపట్టాభిషేకంబు గట్టి “మంత్రిప్రజాసేవకలోకంబు ముక్తచందభూవల్లభుని యాజ్ఞాధారకులై మెలంగవలయు” నని నియ

మించి గోపీచందుని జూచి "వత్సా! బదరికాశ్రమంబున కేగి కేదారేశ్వరుని చరణకంజంబులకు బ్రణమిల్లి తత్ప్రదేశంబున లోహకంటకంబులపై పాదంబులుంచి ద్వాదశవత్సరంబులు తపం బాచరింపవలయుజను" మని రాజోత్తముని వెంబడి కానీపనాథసహితుండై జాలంధరనాథుండు ప్రయాణంబు చేయించుచుండ పురజనసముదాయంబు వెంటనంటి యపారదుఃఖభరితహృదయులై "నృపాలశేఖరా! పితృసూపుండవై దయాఘనుండవై మముబోషించి మహావైభవంబులు విసర్జించి యరణ్యంబుల కేగితివే"యని యాక్రందించుచు నొకక్రోశంబు నడువ యోగద్రుముండగు జాలంధరనాథుం డాపురజనుల నాశ్వాసించి యోదార్చి కానీపసహితుండై నిల్చిన, వారలచో నృపాగ్రణి సుగుణవితానంబు లుగ్గడించి స్తోత్రంబులు చేయుచు పునఃపునర్ముఖావలోకనకుతూహలులై కొందఱు శిరంబులెత్తి జూచుచు నొకకొందఱు బరువెత్తి పునర్దర్శనంబులు గొనుచు మఱికొందఱు యున్నతస్థలంబుల నిల్చి నిరీక్షించుచు దృష్టిగోచరంబు గాకున్నతఱి కానీపజాలంధరసమేతులై నిజనివాసంబుల కేగందలంచి గుమిగూడి బుద్ధిమితేని పునర్దర్శనం బెన్నఁడో యనుచు పురంబు జేరి రాజభవనంబున గతచ్ఛైతన్యశరీరంబులకై వడి నిశ్శబ్దులై నిల్చియున్న ముక్తచందుండు పట్టాభిషేకమహోత్సవానందంబున వారల కనేకవస్త్రభూషణాదులు బహుమతు లొసంగి తమతమనివాసంబులకంపి యంతఃపురంబు ప్రవేశించి నిఖిలస్త్రీజనసమూహంబునకు సమాధానపఱచి మైనావతిరాణి కప్పగించె నమ్మానినీమణి "ముక్తచందా! శీలగుణసంపన్నుండవై భవజ్జననీతుల్యులగు విమాతల యభీష్టంబులు దీర్చుచు సుఖంబున రాజ్యంబేలు" మని యాజ్ఞాపించెను. ముక్తచందుండు సింహాసనాసీనుండై రాజ్యాభిషేకసంతోషంబున యాచకజనాశాపరిపూర్తి జేసి కీర్తియుతుండై దేజరిల్లుచుండె. యోగధూర్జటియగు జాలంధరనాథుండు కానీపనాథ తచ్ఛిష్యసంఘయుతుండై షణ్మాసంబు లప్పురంబున నివసించి యుండెను.

ఇతి భక్తిసారనవనాథచరిత్రంబున కానీప జాలంధర గోపీచంద కథాభాగంబు గల సప్తదశాధ్యాయము సంపూర్ణము.

అష్టాదశాధ్యాయము.

{ గోపీచందనృపుండు పాలపట్టణంబు ప్రవేశించి దనకై గతించిన చంపావతీదేవిని బ్రతికించుట }

గోపీచందుండు నిర్మలవైరాగ్యంబుచే తపంబుకై బదరికాశ్రమంబు జేరందలంచి యనేకారణ్యంబులు గ్రుమ్మరుచు తటస్థగ్రామంబుల బ్రవేశించి యాహారంబుకై భిక్షాన్నంబు గ్రహించుచు గురుమంత్రధ్యానతత్పరుండై స్వేచ్ఛావిహారంబున నేగుచుండ తద్గౌడబంగాళ దేశగ్రామవాసుల కీ వృత్తాంతంబు దెలిసి పుత్రవాత్సల్యంబున మనల బోషించు కరుణాజలధుండగు నృపుం డనూనవైభవాతిశయంబుల నెడబాసి విపినంబుల కేగుట యత్యంతాశ్చర్యకరం బని గుంపులుగట్టి భూజాని కెదురం జని నానావిధఫలపక్వరసాన్నంబులు సముఖంబున నిడి పరితప్తచిత్తులై "రాజోత్తమా! భవద్వియోగశోకఘనభారం బెట్లు సహింతుము? వేగంబున యోగంబు సాధించి పునర్దర్శనం బొసంగరే" యనుచుండ నమ్మహీరమణుం డవశ్యం బని సమాధానపఱచుచు నొకకొన్నిదివసంబులు స్వరాజ్యంబున సంచరించి కోలబంగాళ దేశంబు జేరి చరింపుచుండ నపారచరిత్రుండగు నృపుని ప్రపంచనిస్పృహత్వంబు గ్రామగ్రామంబు విస్తరింప నచ్చటచ్చటి పురజనులు శత్రుకుల సంక్షోభితుండగు సులోచనరాజపుత్రుండు సర్వజనమిత్రుండై నిరుపమాన దాతృత్వప్రముఖ సుగుణగణంబులచే బ్రకాశించి తుదకిక్కాననంబున ద్రిమ్మరుచుండెనే యనుచుండ గోపీచంద భగినీ చంపావతీదేవి శ్వశురుండగు తత్కోలబంగాళదేశాధిపతి త్రిలోకచంద మహీపాలుండు పౌలపట్టణంబున రథగజతురగనివహంబులు గలిగి ప్రత్యక్షయుద్ధదక్షులగు సహస్రలక్ష పృతనంబులచే మహాప్రతాపదర్పుండై ధనధాన్యసుఖసంపత్సమృద్ధత్వంబున దేజరిల్లుచుండి గోపీచందుండు రాజ్యలక్ష్మిం దొలంగి వైరాగ్యధనఘనుండై విహరింపుచుండె నని యాకర్ణించి యహహా! హీనమతిచే గోపీచందుం డపగతసర్వస్వుండై క్షాత్రధర్మం బెఱుంగక షండునిపగిది భిక్షాపాత్రంబు

ధరియించుట జీవన్మృతుండు గాఁడే? మీచుట్టరికం బిట్టిదని పరులు
మము దూషింపరే? క్షత్రియవంశంబున జన్మించి కులంబునకు కళం
కంబు గలిగించుట గర్హితంబుగాదే? స్వధర్మంబునకు నైల్యంబు గల్పిం
చిన జన్మంబు గాల్పనే! దుష్టబుద్ధిచే మైనావతీదేవి దనరాజ్యభోగ
సంపదలు జాలంధరనాథాధీనంబుజేసి సుతునికరంబుల భిక్షాపాత్రం
బొసంగి కాంతారంబున కనుపుట హేయంబు బరిత్యజించి వృత్తికం
గొనినచందంబు గాదే? ప్రపంచభ్రష్టుండగు సన్న్యాసి నాశ్రయించి
స్వసుతుని రాజ్యపదచ్యుతుని జేయు మాత మిత్తిగాదే? వీరిరాజ్యంబు
విమతులచే హరింపఁబడక నిర్వహించునే? ధిగ్ధిగ్జన్మంబులని మైనావతీ
గోపీచందుల దూషింపుచు త్రిలోకచందుండు భార్యాసహితుండై
సంభాషించుచుండు సమయంబున సులోచనదుహిత చంపావతీదేవి
యాలకించి శ్వశురవాక్శరక్షతహృదయయై మనంబున దల్లడిల్లుచు
"హా! మత్సహజన్ముండు దైవోపహతచేతస్కుండై త్రిలోకనింద్యంబు
లగుకృత్యంబులు సల్పుచు రాజ్యపదభ్రష్టుండై హీనదశచే కడుకష్టంబు
లనుభవించుట దుష్టాత్మురాలగు మైనావతీదేవి దుర్నీతులచే గాక
నొండుగలదే? కీర్తిక్షయకరంబులగు దుష్కృతంబులచే ననర్థంబులు
ఘటించె"నని రోదనంబు జేయుచుండె నిట గోపీచందుం డనేకగ్రామం
బులు గడచి పౌలపట్టణసమీపంబు జేరి యొకవాపీనికటంబున సింగీ
నాదవినోదంబుచే వేణుగానలోలుని గుణగాయనంబు జేయుచు మేఘ
చ్ఛన్నదివాకరునికైవడి ప్రచ్ఛన్నవేషంబుచే గూర్చున్నతఱి చంపా
వతిపరిచారిక లాకస్మికంబుగ సచ్చోటి కరుదెంచి రూపలావణ్యసౌంద
ర్యంబుచే దేజరిల్లుచున్న ప్రతాపముఖ్యుండగు గోపీచందుని గుర్తించి
రయంబున రాజభవనంబు జేరంజని సపరివారుండగు త్రిలోకచంద
నరపాలున కెఱుంగించిరి. అతం డత్యంతక్షీణచిత్తుండై దనమనంబున
"గోపీచందుండు కళంకముఖుండై యిచ్చోటి కేలచరుదెంచె? వీఁడీనగ
రంబున భిక్షార్థంబై ప్రతిగృహంబున కేగెనేని మా కపకీర్తి వాటి
ల్లదే? మా క్ష్మాభృత్కులంబు లోకులచే నపహాసింపఁబడదే? స్వదేశం
బున సంచరింపక నిం దేలవిచ్చేసె" నని దలంచుచు నొకసేవకుని బిలచి
"గోపీచందుం డీపట్టణంబున భిక్షాన్నంబు గ్రహించుటచే మా కప
కీర్తి ఘటియించుఁ గావున నీ వతివేగంబున నతనిం దోడ్కొని మదీ

యాశ్వశాలయందుంచి భోజనంబిడి ప్రయాణంబు జేయించు" మని యాజ్ఞాపింప నప్పరిచారకుం డా వైరాగ్యఘనుండగు గోపీచందుని సన్నిధి కేతెంచి "యోనృపోత్తమా! యుష్మద్భగినియగు చంపావతీ దేవితో సంభాషించుటకై దోడితెమ్మని మాపార్థివుం డాజ్ఞాపించె. దయచేయు" మన గోపీచందుండు "మాబోటివిరాగుల కెక్కడిభగిని గల" దనుచు నైనను "చంపావతీదేవిం గలసి యేగెద" నని పరిచారకుని వెంబడి జనుచుండ వాఁడా పశ్చిమమార్గంబున నశ్వశాలం బ్రవేశపెట్టి "మీరీ ప్రదేశంబున నివసించెదరు గాక" యని నియమించి దా నంతఃపురంబు ప్రవేశించి గోపీచందుని రాకం దెల్ప గ్రక్కున నారాజకాంతలు శ్లాఘ్యతరాన్నంబు పాత్రంబుల నుంచి యొకపరిచారికచే ముఱుముందుగా గోపీచందుండు భుజించుటకై తురంగశాలకంపిన నదిచూచి గోపీచందుండు నిజహృదయంబున బంధుమిత్రకళత్రంబులు సంపత్సమృద్ధిచే సంతుష్టు లయ్యెదరు. గాకున్న చంపావతీదేవి తత్క్షణంబ మత్సమక్షంబునకు రాక నిర్లక్ష్యంబు జేయునే చింతించనేల? సమశత్రుమిత్రుండనై సన్యసించి సుఖదుఃఖాశ్రయ మానావమాన ప్రపంచాభిమానము నాకేల నని నిశ్చయనిర్మలుండై చైతన్యబ్రహ్మంబున కన్నబ్రహ్మంబుచే సత్వంబుగలుగు నాచైతన్యబ్రహ్మంబుచే పరబ్రహ్మస్వరూపసంధానంబనుకూలించుగావున నన్నంబు పరిగ్రహించుట ముఖ్యకారణం బని దలంచి ప్రత్యవసానం బొనరుప్పుచుండ నట్టియెడ త్రిలోకచందుని నారీమణులు రాజసౌధగవాక్షద్వారంబుల నిలిచి గోపీచందుని నిరీక్షింపుచు "నాహా! లజ్జాహీనుండగు సులోచనసుతుండు బంధుత్వస్థలంబని దలపోయక నశ్వశాలయందు భుజించుట కాలవిపరీతంబుగాదే" యని యన్యోన్యసంభాషణంబులు జేయుచుండ నొకసఖీమణి చంపావతీదేవి కెఱుంగింపవలయు నని నుడువుచు వేసం జని సులోచనపుత్రిని రమ్మని రయంబున దోడ్తెచ్చి గవాక్షంబున నిలిపి జూడుమని కరంబెత్తి చూపుచు విషాదకరవాక్యంబులచే "నీభ్రష్టాత్ముండు మందభాగ్యుండై నిఖిలవైభవంబుల నెడబాసి తస్కరునిపగిది నానాదేశంబులు భ్రమ్మరుచు మానావమాన జ్ఞానంబులేక నిందేతెంచి లాయంబునం జేరి శ్వానంబుకరణి భుజియించుట హీనంబుగాదే" యనుచుండు పల్లవాధరుల యవహేళన వాక్యభల్లంబు లుల్లంబున నాటు

కొన సులోచనపుత్రి యగు చంపావతీదేవి యపారపశ్చాత్తాపంబుచే రోదనంబు జేయుచు నచ్ఛపలాక్షుల మండలంబు దొలంగి నెవ్వడిని స్వసౌధంబున కరుదెంచి యతిశయదుఃఖభారంబు సహింపలేమి తీక్ష్ణతరశస్త్రఘాతంబున హృదయస్ఫోటం బొనర్చుకొని రుధిరనిర్గతకుక్షియై తక్షణంబున ప్రాణంబులు వాసి పడియుండెను.

ఇట గోపీచందుం డన్నంబు భుజియించి తృప్తుండై చంపావతిని జూడందలంచి పరిచారికతో దెలుప నత్తెఱవ "దనయ త్తమాంగము యుత్తరువులేని పెత్తనంబులు వడి యుత్తరంగశాల కెత్తెఱంగున నేతెంచు నీవెఱుంగవే? నేఁ డిచ్చో నివసించెదేని నిశాసమయంబున నచ్చకో రాక్షిని దోడి తెచ్చెద" నన గోపీచందుం డంమకు హర్షించి నివసించెను. తదుపరి యాపరిచారిక చంపావతి దేవి సదనంబున కీవృత్తాంతం బెఱుంగించ నతివేగంబున నేగి నిర్జీవకళేబరంబు గాంచి పిడుగుపడిన చందంబున నదరిపడి మహానినదంబు జేయుచు "పుడమిాశునిపడంతి మిన్నుల జేరంజనియె" నని నుడువ నజ్జలజాయతాక్షు లేకముఖంబుగ జలధి ఘూర్ణిల్లినకై వడి పెడబొబ్బ లిడుచు నడినేగి యచ్చేడియ కాయంబు గనుంగొని హాహాకారంబులు జేయుచుండ పతిదేవర శ్వశురు లచ్చోటి కేతెంచి "నీచుండగు గోపీచందునికతంబున జీవోత్సర్గం బొనర్చుకొనియె నాయధముండు నిజసదనధనంబున కగ్గివెట్టి లజ్జారహితవదనుండై దనసహోదరిప్రాణంబులు గొనుట కేతెంచె గాబోలు" నని విలపించుచు నప్పాపాత్ముని నెట్టివేయావలయు ననుచు కొందఱు చంపావతీదేవి దనసహజన్మునికై ప్రాణంబులు వాసెనని హృదయతాడనంబు లొనర్చుకొనుచు నొకకొంద ఱాయన్నులమిన్న సుగుణవితానంబు లుగ్గడించుచు మఱికొంద ఱీ మానవతియగు చంపావతీదేవి భ్రష్టాత్ముండగు గోపీచందుని నీచకర్మాచరణంబు సహింపలేక శరీరంబు బాసెనని మహారవంబున రోదనంబు జేయుచుండ గోపీచందుం డాకర్ణించి యచ్చటి హాయరక్షకునితో నిదేటి హాహాకారధ్వానం బని యడుగ నయ్యశ్వరక్షకుం డా దుఃఖకారణం బెఱింగి యితండు గోపీచందుం డని దెలియక "అయ్యా! నే నేమని దెల్పుదు. మహాసుగుణమణియగు చంపావతీరాణి దనసహోదరుండగు సులోచనతనయుండు రాజ్యపదచ్యుతుండై చిత్తవిభ్రాంతిచే నానాకాననంబుల భ్రమింపుచుండె నని

శోకభారాతిశయంబున శరీరంబు బాసె" నని పలుక నమ్మానాతిప్రియ
తనయుండు మత్కారణంబున సహోదరి కాయంబు దొలంగె నని
మోహావేశంబున నాక్రందించుచు నే నిష్ఠురంబున కేల జనుదెంచితి
నతులితపతిభక్తి విశేషగుణసంపత్తిచే నొప్పారు చంపావతీమరణంబు
నా కపకీర్తికరకారణంబుగాదె? యిమ్మహాఘోరకృత్యంబు త్రిలోకవిది
తంబై విలసిల్లదే యని మనంబున వితర్కించుచుండ సమయంబున
నగ్నిసంస్కారంబుకై చంపావతీదేవిం గొనిపోవుచుండ గనుంగొని గోపీ
చందుం డిక నే నుపేక్షించుట నాథపంథీయోగం బత్యంతహీనం
బగును. నన్నీనృపుండు తృణతుల్యంబుగ భావింపుచుండు గావున ఫాలా
క్షుండు దన్ను భిక్షుకుం డని నిర్లక్ష్యంబుచే దూషించిన దక్షుని శిక్షిం
చినచందంబున గుజ్జుండు ముజ్జగంబుల నాక్రమించి బలిగర్వం బడం
చినవిధంబు కపీశుండు దన్ను దిరస్కరించిన దశముఖునిపురంబు హుతా
శనుపాలు జేసినపగిది మద్గురుశక్తి ప్రతాపం బీపుడమీశున కెఱుంగిం
చెద నని శీఘ్రంబున స్మశానవాటిక కేతెంచి ప్రేతనికటంబు జేరి
"యగ్నిసంస్కారంబు జేయవలదు. మద్గురుసమర్థుండగు జాలంధరనాథు
నిచ్చోటికిం దోడితెచ్చి యాస్తికుండు మాతులకులంబు రక్షించినకై
వడి నాకతంబున ప్రాణంబులు విడిచిన చంపావతీదేవిని బ్రతికింతు"
ననుచుండ వా "రీనిష్ప్రయోజకపురుషార్థవాక్యంబు లప్రత్యక్షంబులు
గాక యథార్థంబు లగునే? గతించినజీవంబు పునఃప్రవేశంబొంట హుళ
క్కిగాదే" యని ప్రత్యుత్తరంబులు బలుకుతఱి గోపీచందుండు "మద్గు
రుప్రతాపకృత్యంబులు బొగడ వాగ్దేవికైన తరంబగునే? నిజశిష్యుం
డగు కానీఫనాథునికై నిర్జరబృందంబును భూరుహాగ్రంబుల నంటిం
పడే? దుర్భరంబగు హాయవిష్ఠప్రపూరితకూపంబున నివసించి నిర్భయం
బుచే దశవర్షంబులు సజీవుండై విభ్రాజమానుండు గాఁడే? ప్రాజ్ఞు
లారా! ధైర్యంబు బూని శవంబును రక్షింపుఁడు. జ్ఞానఘనుండగు
జాలంధరయోగీశ్వరుని దోడితెత్తు" నన వారా గోపీచందుని సంభా
షణంబులు సరకుగొనక ప్రేతసంస్కారంబుకై కాష్ఠంబులకు నిప్పం
టించ దలంచినంత సులోచనసుతుండు తత్కాష్ఠంబులపైఁ గూర్చుండి
"యగ్నిసంస్కారంబుచే నన్ను భస్మంబు జేయుఁడు. తదుపరి మద్గురు
వర్యుం డేతెంచి యస్మత్కారణంబున మున్నీటియగ్గిచందం బగ్గలం

బగు కోపానలంబుచే నిప్పురవరంబు భస్మంబు గావింపఁడే" యనుచుండ త్రిలోకచందుండు సక్రోధుండై "గోపీచందా! మద్గురుండు సర్వసమర్థుం డని వృథాప్రలాపంబు లేల జేసెదవు? నిశ్చయం బేని నీ వామహస్తంబు విడదీసి యిం దిడి యేగుము. నిజంబని తలంచి ప్రేతంబును రక్షించెద" నన గోపీచందుండు సంతసించి తత్క్షణంబున దనవామకరంబు దీసి యత్త్రిలోకచందసుతున కొసంగి మహావేగంబున దురంతప్రతాపుండగు జాలంధరనాథునికై జనుచుండ నజ్ఞానాంధులు గోపీచందునివాక్యంబు లాదరించక నగ్నిసంస్కారంబు గావించిరి.

ఇట త్రికాలవేత్తయగు ధనంజయసుతుండు జ్ఞానయోగంబున గోపీచందునిరాకం దలంచి "వాఁ డిచ్చోటి కరుదెంచెనేని బంధుమిత్రకళత్రంబు లత్యంతవిషాదంబుచే విలపించెద" రని యూహించి కృపాసముద్రుండు గాన ప్రయాణోన్ముఖుండై వాతగతి నిమిషమాత్రంబున గోపీచందుని కలియం జేరి "వత్సా! పునరాగమనకారణం బేమి" యని యడుగ నతండు గురుపాదంబులపై ఫాలంబు మోపి గతవృత్తాంతం బంతయు విశదీకరించెను. నాథుం డత్యాదరంబున "పుత్రా! నీమనోరథం బీడేర్చెద. చింతింపవలదు ర" మ్మని యుభయులు గమనంబు జేయుచు పాలపట్టణంబు జేరి బంధుమిత్రాప్తజనపరివేష్టితుండై చంపావతీమరణతాపంబుచే సభామంటపంబున నివసించియున్న భూపుని గనుంగొనుచుండ నత్త్రిలోకచందుండు మహాభయంబుచే నిజసింహాసనంబు డిగ్గి యెదురం జని శిష్యయుత జాలంధరనాథునకు దండప్రణామంబు లాచరించి యభయఘనులం దోడ్తెచ్చి హాటకమయసింహాసనంబుల నలంకరించి యజాగళస్తనంబులభంగి బకధ్యానయోగంబు పగిది పడపుచెలివలపులవిధంబు జ్ఞానంబులేని వినయంబులు బలుకుచుండ జాలంధరనాథుండు గ్రహించి "త్రిలోకచందా! గర్దభంబునకు చందనం బనుకూలించునే? మర్కటంబునకు సంస్కృతంబు ఫలించునే? తద్వత్సకలగుణసంపన్నత్వంబుచే బ్రకాశించు చంపావతీదేవి నీగృహంబున శోభిల్లునే కానిమ్ము. విధికృతకార్యంబునకు చింతింపనేల? గోపీచందుని హస్తంబుదె" మ్మని కృపాకటాక్షంబున నిరీక్షించి దనప్రియశిష్యుని భుజసంపుటి యొనర్చి సంజీవినీమంత్రంబుచే యథావిధి నమర్చి తదుపరి శ్మశానస్థలంబు జేరంజని సంజీవినీప్రయోగయోగంబున చంపా

పతీరాణిని జీవింప నొనర్చి సంబోధించి పిలచుచుండ క్షణమాత్రంబున నప్పొలఁతుక జాజ్వల్యమానదేహంబుచే బ్రకటితయై నాథునిచరణంబులపై శిరంబు మోపి బ్రస్తుతింపుచుండ జూపరు లమ్మహామహుని యద్భుతచరిత్రంబునకు విస్మితులై ప్రత్యక్షశుక్రుండు గాఁడే గాన నిగ్గోపీచందనృపోత్తముండు నిఖిలవైభవంబు లస్థిరంబులని తలంచి పశ్చాత్తాపంబుచే నపూర్వప్రతాపుండగు నీజాలంధరనాథబోధామృతపానమత్తుండై బ్రవర్తిల్లె నని వైరాగ్యత్రయంబుచే జయజయశబ్దంబులు జేయుచుండ నయ్యనలతనయుండు హేలాపట్టణంబున కేగందలంప త్రిలోకచందుండు భయభ్రాంతుండై జాలంధరనాథుపదసరోజంబులపై వ్రాలి "నే నతిపాపుండను. నీచుండను. యుష్మత్ప్రతాపం బెఱుంగక గోపీచందనృపాలుని చులుకం జూచితిని. దయాఘనులై క్షమింతు" రని యనేకవిధంబుల స్తోత్రంబులు జేయుచు "సమర్థా! నాయం దనుగ్రహించి నేఁటిరాత్రి యిచ్చో విందారగించి మద్భవనంబు పవిత్రంబు గావింపరే" యనుచుండ నగ్నికుమారుండు "చంపావతీహస్తపాకంబు భుజింతుముగాక" యన త్రిలోకచందుండు హర్షించి యక్కలువకంటిచే శ్లాఘ్యతరపక్వాన్నంబులు జేయించ ధనంజయతనూభవుండు చంపావతీ గోపీచందుల స్వపఙ్క్తి నిడుకొని యవ్విందారగించుచు కరుణాంతరంగహృదయుండై దనయుచ్ఛిష్టప్రసాదం బాముద్దియ కనుగ్రహించి సంజీవినీప్రతాపంబుచే నమరత్వం బొసంగెను. పిదప త్రిలోకచందునిజూచి "యోభూనాయకా! గోపీచందుండు తపంబుకై బదరికాశ్రమంబున కేగును. ముక్తచందుండు బాల్యంబున పట్టాభిషిక్తుండయ్యె. నీవు ప్రత్యర్థిప్రతాప దర్పదమనుండవు కావున నబ్బాలున కవసరసమయంబున సహాయం బొసఁగుము. నే నచ్చో షణ్మాసంబులు నివసించి యక్కుమారునకు సకలార్థంబు లెఱింగించి తీర్థసేవానిమిత్తంబై జనియెద" నన త్రిలోకచందుం డవశ్యం బనుచుండ జాలంధరనాథుం డాత్రియామంబు గడపి గమనోన్ముఖుండై హేలాపట్టణంబున కేగుచుండ గోపీచందుండు గురువర్యునిచరణకంజంబుల కెఱఁగి యనుజ్ఞగొని తపంబుకై నానాగ్రామంబులు గడచి బదరికాశ్రంబు జేరి కేదారేశ్వరునకు నమస్కరించి లోహకంటకంబులపై పాదంబులు నిలిపి తపం బాచరింపుచుండెను.

ఇట జాలంధరనాథుండు హేలాపట్టణంబు ప్రవేశించి షణ్మాసంబులు నివసించి ముక్తచందున కనేకార్థంబులు బోధించి శిష్యసహిత కానీఫనాథసమేతుండై బయలుదేరి మహాతీర్థంబులు సేవింపుచు ద్వాదశవర్షంబుల కాబదరికాశ్రమంబు జేరి గోపీచందుని తపోధ్యాపనంబు గావించి యనేకమంత్రమంత్రార్థంబు లుపదేశించి తత్తన్మంత్రాధిదేవతలగు బ్రహ్మావిష్ణుమహేశ్వరేంద్రాగ్ని యమ వరుణ ప్రముఖ నిఖిలదేవలోకంబును ప్రసన్నంబు జేసి వరంబు లిప్పించి సకలవిద్యాపారంగతుండై నాథపంథీయోగంబున విలసిల్లం జేసెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున గోపీచందాఖ్యానం బష్టాదశాధ్యాయము సంపూర్ణము.

ఏకోనవింశత్యధ్యాయము.

{ గోరక్షనాథుండు శృంగమురుడీనగరంబున కేగునెడ నాంజనేయుండు కష్టంబులంబడి శ్రీరామచంద్రసహితుండై గోరక్షుని జేరంబోవుట. }

అట బుద్ధిగతుండగు గోరక్షసిద్ధుండు గజకర్ణోద్భవునిచే సచ్చరిత్రుండగు మత్స్యేంద్రనాథునిజాడ లెఱింగి గౌడబంగాళకైలబంగాళాది నానాదేశంబు లతిక్రమించి స్త్రీరాజ్యసీమం జేరంజని నిజహృదయంబున మద్గురుం డీ రాజ్యాధిపత్యంబు వహించి సకలైశ్వర్యసంపన్నత్వంబున నటవిటభటపరివృతుండై మణిమండితమంటపంబున బ్రకాశించుచుండును. భిక్షుకుండనై దీనదశచే నేనచ్చటి కేగిన నమ్మహాపురుషుండు శ్రీమంతుండు దరిద్రునియం దనాదరణ జేసినచందంబున నన్ను లక్షించుట దుస్తరంబుగాదే? ఖద్యోతుని సముఖంబున ఖద్యోతంబులు కాంతిహీనంబులు గావె? జాతరూపంబునకు పిత్తలం బెనయగునే? మేరుమశకాంతరంబగు నే నెక్కడ? వైభవపూర్ణుండగు నాథుం డెక్కడ? ఇంతియగాక నన్నుజూచిన నత్తపోఘనుండు మనస్తాపంబు నొందును. షడ్రసభోజనంబు బరిత్యజించి తిక్తద్రవ్యంబులు భుజించినకరణి ధనధాన్యసం

పత్సమృద్ధుండు వైరాగ్యమార్గం బాశ్రయించునే యస్మదాగతవృత్తాంతం బాయోగిముఖ్యుం డాకర్ణించెనేని దనవిద్యానైపుణ్యంబున నన్నేమిజేయందలంచునో ప్రతిఘటించుట గురుద్వేషంబు సంభవించు నని వితర్కింపుచుండు సమయంబున నొకరథంబుపై దిరస్కృతరంభోర్వసు లన సర్వాంగసుందరీమణులగు వేశ్యభామినులమేళం బొకటి బొడగాంచి సుధాకరవదన భీతహరిణేక్షణ నవపల్లవాధరి యనందగి సకలవిద్యానవద్య కుశలత్వంబుచే గానరసంబున గానరసాభిజ్ఞులయుల్లంబులు పల్లవింపఁజేయు కళింగనామ్నీ మేళనాయకిం జేరంజని "నీనామం బేమి? మీ రెచ్చటి కేకతంబున నేగెద" రన నవ్వేడ్కకత్తె "నానామంబు కళింగ శృంగమురుడీనగరాధిపతియగు మైనాకినీరాణి సభాస్థానంబున కేగి నృత్తగీతవాద్యవిశేషంబులచే నమ్మానినీమణిని సంతుష్టపఱచి యపారద్రవ్యం బాకర్షించెద"మని నుడువుచుండ గోరక్షుండీ నటనకత్తియల నాశ్రయించి గుప్తవేషంబున నరిగిన మేలొనగూడునని దలంచి "మీరు నాయం దనుగ్రహించితిరేని మీవెంబడి నే నేతెంచెద" నన వారు "నీకుశలత్వం బేమి" యని విచారింప నాథుండు "నాకు గీతవాద్యవిద్యావిశారదత్వంబు గలదు. మీనృత్యంబునకు సరియైన మృదంగవాద్యసుశబ్దంబులు గప్పెద" నన నప్పడపుచెలి "నరోత్తమా! గానవాద్యసురసంబు లెఱింగెద నని సెలవొసంగితిరి గావున భవద్విద్యానైపుణ్యంబు మాకెఱింగింపు" మన నవశ్యం బనుచు నయ్యోగతనయుం డా పడఁతిమిన్నచే విపంచిని గొని దనకరాబ్జంబుల ధరియించి గంధర్వవిద్యామంత్రరాజంబు స్మరియించి నలుదిశలం బ్రయోగించి యవ్వీణను స్పృశింప నంత నమ్మంత్రమహిమాతిశయంబుచే తత్కాననాంతరతరుపాషాణంబులు స్వరశాస్త్రోక్తరాగజ్ఞానపరిపూర్ణులై సుస్వరంబుల గాయనంబు జేయుచుండ నవ్వల్లకీతంత్రులు మృదుమధురశబ్దంబు లీనుచు నవరసంబు లొలుక దనంతట తా మ్రోగుచుండె నప్పు డగ్గణికాశిరోమణి విస్మయంబుచే మధ్యమాంగుళంబు గఱచుకొని తనడెందంబున "నితండు హరుండుగాక నరుండే? పరుసంబుచే లోహంబు కర్బురంబగుట సహజంబు. జడతరపాషాణంబులు రాగజ్ఞానోదయంబులగు టొకవింతగాదే? మర్త్యభూజంబులచే కామ్యంబులు చేకూరుచుండ సురభూజమహత్వంబు బొగడ

దరంబే? దత్వోత్తరుపాషాణంబులచే గానంబు జేయించు ఘనుని స్వము ఖనిర్గత రాగాలాప మాధుర్యంబు లానుటకు గంధర్వాదులకైన వశం బగునే? నే నీ రసజ్ఞుని నాశ్రయించుట మద్భాగ్యోదయకారణం” బని యూహించి “యోసర్వకళాదక్షా! యుష్మచ్చరణకమలాశ్రయంబుచే నాయజ్ఞానతిమిరం బెడబాయును గావున తమ జగద్విఖ్యాతంబగు నామధేయంబు దెలియ దయచేయు” మన నాహరిదశ్వతనయుండు నిజనామంబు దెలియఁబలికిన కార్యసాధనానుకూలంబు గాదని దలంచి “నానామంబు పూర్వడాముం డనియెదరు. నేను ద్రవ్యంబున కాశిం పను. సమయంబునకు భోజనంబు లభించెనేని యంతియ నాకు ముఖ్య కారణం” బన నమ్మగువ “పురుషశ్రేష్ఠా! నీకొకవిశేషంబు దెలియపఱ చెద నాకర్ణింపుము. స్త్రీరాజ్యంబున కన్యపురుషగమనంబు లేదు. తద్రాజ్యస్త్రీసమూహంబునకు ప్రభంజనసుతుండు ప్రాణనాయకుం డతం డూర్ధ్వరేతస్కుండుగాన దనభుభుఃకారనినదంబుచే నచ్చటిపడఁ తిమిన్నల గర్భవతులం జేయును. తద్ఘోరతరధ్వానంబు పురుషులకు మృత్యుస్వరూపంబు. నీవెట్లు జనుదెంచెదవో” యనుచుండ నాథుండు “మారుతాత్మజుండు నన్నేమిజేయును? తపఃప్రతాపంబుచే నభోమణిని గబళించెడువానికి నక్షత్రంబు లడ్డమగునే? భూభారంబు శిరంబున వహించెడువాఁడు భూధరంబుల సరకుగొనునే? జలార్ణవఁబు ప్రాశించె డువానికి నదంబులు లక్ష్యంబే? నీవా సంశయం బుడుగు” మని యాక ళింగనామ్ని వేశ్యాభామినిని రథారోహణంబు గావించి తా నారథం బునకు సారథ్యం బవలంబించి కక్షపాలాంతరభస్మంబుగొని దూరా లోచనపరుండై వజ్రాస్త్రం బభిమంత్రించి తత్సహాయంబున స్వర్యాస్త్ర మోహనాస్త్ర నాగాస్త్రంబులు గల్పించి దేశసీమాంతదిగ్బంధనం బొనర్చి రథారూఢుండై తీవ్రగమనంబున నేగుచుండ తద్రథహాయగ మనన్నైపుణ్యంబు విలోకించి యమ్మువ్వేలుపులయిక్క తేరివారువం బులు కసిబూని నటనురించి బడలికచే చేతనంబు దప్పి స్యందనంబు గొని మున్నీటంబడెనో యన నినుండు గ్రుంక నజ్ఞానాంధులబుద్ధికై వడి యంధకారంబు దిశలు గప్పుచుండె నంత నపూర్వదిక్కాంత దనఫా లభాగంబున మృగమదతిలకంబు దిద్దునెడ వామకరాగ్రభాగంబున నిడుకొన్న తిలకప్రతిబింబసంయుత ముకురంబో యన నప్పొడపుఱొం

డప్పై యొప్పెడు ఱేఁడుం జూచి సతు లొక్కుమ్మడి దమయొడయుం డేతెంచె నని సంతసంబుచే జల్లిన సేసలన రిక్కలు దమతమస్థానంబు లలంకరించియుండె నాసమయంబున ధీమంతుఁడగు గోరక్షుండు ఛిన్నాపట్టణంబు జేరెను. పూర్వయామాంతరంబున మారుతాత్మజుండు సేతుస్థలంబు వదలి స్త్రీరాజ్యసీమం బ్రవేశింపుచుండ సిద్ధనిర్మితవజ్రాస్త్రదృఢతాడనంబుచే నదరిపడి బుడమింబడ స్పర్శాస్త్రంబు ముట్టడించి నేలం గఱచిపట్టె. మోహనాస్త్రంబు హృదయంబు దూరి మతి దూలంగించె. నాగాస్త్రప్రయోగమహిమాతిశయంబుచే భోగీంద్రుం డేతెంచి కరపాదంబులు బంధించె. వాయుపుత్రుం డీ యద్భుత చరిత్రంబున కచ్చెరువొంది పైకి లంఘింపఁదలంచియు మోహనాస్త్రవశగతచిత్తుండై మహాజవసత్వయుత శేషబంధంబులకు ముక్తుండుగాక శక్తిదూలంగి వమనంబు జేయుచు దేహాయాసబహుళంబుచే పరితపింపుచు కాలంబు గూడెనని కృతనిశ్చయుండై తాపత్రయ నివారకుండగు శ్రీరామచంద్రపాదకమలార్పితచిత్తుండై "యోఖర దూషణాది పిశితాశనప్రతాపదర్ప దమనా! నుతత్రిణయనా! దృగాయుధకరకమలవిరాజమాన మహేష్వాస ఖండనోద్దండ పరాక్రమాతిశయాప్రమేయా! యోగిజనధ్యేయా! రఘుకులాన్వయార్ణవానందకరకలాధరా! జానకీవరా! నిరంతర నిర్మల పరిపూర్ణ సచ్చిదానందవిగ్రహా! మహాబలవాలినిగ్రహా! దశవదనదుర్వారగర్వనిర్వాపణప్రబలపాండిత్యశూరా! మేరునగధీరా! శుకనారదపరాశరాది నిఖిలమునిసేవితపాదకమలా! జ్ఞానఘనలోలా! సురనరగరుడగంధర్వకిన్నరాది సంస్తూయమానగుణజాలా! లోకత్రయపాలా! దాసజనహృదయ సరసీరుహవిహార మత్తభృంగా! శ్యామాంగా! యుష్మచ్చరణాంభోరుహదాసుండగు గంధవహసుతుండు సంకటంబు లనుభవింపుచుండ నుపేక్షించుట కర్జంబగునే? నీయార్తజనరక్షణపరాయణబిరుదాంకిత దివ్యతరనామంబునకు లోపంబు వాటిల్లదే" యనుచుండ పరమదయాకరమూర్తియగు రఘుపుంగవుండు ప్రసన్నుండై కరువలిపట్టి దురవస్థం జూచి జలబహిర్గతమీనంబుభంగి వత్సంబు బాసిన ధేనువుపగిది దుఃఖపీడితుండగు సుతుం గనుంగొని పరితపించు మాతకరణి కళవళింపుచు తత్క్షణంబ పాకశాసనాస్త్రప్రయోగంబుచే వజ్రాస్త్రంబు నివారించి

విభక్తాస్త్రంబుచే స్పర్శాస్త్రంబు ఖోనడంచి క్షీరాబ్ధిశయనుండగు శ్రీమన్నారాయణ దివ్యవాహనంబగు వైనతేయు నావాహనంబుజేయు నహినాయకుండు నమస్కరించి యంతర్ధానంబునొందె నాపిదప జగన్మోహనంబగు వైష్ణవమాయచే మోహనాస్త్రంబు రూపుమాప సర్వసంకటవిముక్తుండగు హనుమంతుండు స్వస్థచిత్తుండై నలుదిక్కులు నిరీక్షించి దననికటంబున నిల్చియున్న బ్రహ్మాండవల్లభుండగు శ్రీరామమూర్తిం గనుంగొని పాదంబులపై వ్రాలి "లోకాభిరామ రామా! భవత్కరుణాకటాక్షవీక్షణంబున కేవల ప్రళయకాలతుల్యంబులగు మహదస్త్రజ్వాల లడంగె. నీయట్టి దయాసముద్రుండు గలఁడే? నాజన్మప్రభృతి నిప్పగిది నిడుములంబడితినే? నీయనుగ్రహంబు లేకున్న ప్రాణంబులు వాయుట నిక్కం"బని బొగడుచుండ శ్రీరామచంద్రుండు "వత్సా! నీకై మూడుపర్యాయంబు లేతెంచితి. నిత్తఱి నీబొంకవడచిన విమతుండెవఁడు? వేగంబున దెలియంబలుకు" మన భక్తాగ్రేసరుండగు గంధవహసుతుండు "ప్రభో! న న్నెదిరించు క్షత్త్రియదోర్బలు లెవరు గలరు? మహాప్రళయానలస్వరూపులగు నాథపంథీప్రతాపశూరుల కీ దర్పంబు దక్క నన్యుల కిట్టిశౌర్యంబుగలదే? నవనాథులలో నొకఁడు గాఁబోలు" నన రామచంద్రుండు "పుత్త్రా! నవనాథులు నాయంతరంగభక్తులు. వారు నిర్వక్రపరాక్రమాతిశయధైర్యధుర్యులు. వారిచే నీకుపందెంబు వల" దనుచు జానకీరమణుండు నిజదృష్టిచే గోరక్షుని కృత్యంబని దలంచి "యంజనీతనయా! హరినారాయణావతారుండగు గోరక్షుండీ స్త్రీరాజ్యంబున కేగ నరుదెంచి యొకయోజనదూరంబున ఛిన్నాపట్టణసమీపంబున నివసించె" నన హరిసూనుండు "రఘునాయకా! స్త్రీరాజ్యాధిపతియగు మైనాకినీరాణి మనోభీష్టంబు దీర్పఁదలంచి మత్స్యేంద్రయోగివర్యుని జతగూర్చితి నిగ్గోరక్షుం డిపు డా శృంగమురుడీనగరంబున కేగి మత్స్యేంద్రుని చిత్తం బపహరించి మైనాకినీరాణి నెడబాపి మద్వచనభంగంబుజేయు గావున మృదుమధురవచనంబులచే గోరక్షుని సంతుష్టపఱిచి నామనోరథం బీడేర్పు"మని పొగడుచుండ శ్రీరాముండు హర్షించి కపిముఖ్యుని వెంటగొని ఛిన్నాపట్టణనికటంబున దమనిజస్వరూపంబులు వదలి బ్రాహ్మణవేషధారులై గురుధ్యానానందాబ్ధినిమగ్నుండగు గోరక్షుని సమీపంబుజేరి యాదేశశబ్దం

బులచే వందనంబు లాచరించి "యోగిపుంగవా! మేము షట్ఛాస్త్రవేత్త
లము. నీవునిగ్రహానుగ్రహసమర్థుండవై నిరుపమానజలధిగంభీరంబుచే
దుష్టుల శిక్షించి శిష్టుల రక్షింపుచు నింద్రియదమనుండవై సాంద్రవై
రాగ్యపరిపూర్ణత్వంబుచే బ్రకాశించెడు మహామహుండవు. యోగికు
లభూషణుండవై యాచకజనాశాపరిపూర్తిజేయు ఘనుండవు గాన
మామనోభీప్సితంబు లీడేర్పు" మని వేడుచుండ జగచ్ఛతుపుత్రుండు
"మీకామ్యం బెయ్యది దెల్పు" మన వారు "తమవాగ్దత్తానంతరం
బున వెల్లడిపఱతు" మనిరి. గోరక్షుండు దనమనంబున "నేను శైలీ సింగీ
కంథాది చిహ్నంబులచే గ్రుమ్మరుచుండువాఁడను. వీరు నన్నేమి విచా
రించెదరో ? నిశామధ్యంబున నీ రేగుదెంచుట కారణం బెయ్యది
యో? పురుషసంచారరహితంబగు స్త్రీరాజ్యంబున కీ పారు లెట్లరుదెం
చిరో? వీరు మానవులు గారు. ప్రచ్ఛన్నవేషంబుల మెలంగెడు వరుణేం
ద్రప్రముఖ సురలోకవాసులు గాబోలు నని కృతనిశ్చయుండై వీరిమ
నోభీష్టంబు లెయ్యవియో మత్కార్యసాధనభంగకర కామ్యంబుదక్క
నితరకోరిక లీడేర్చెద" నని తలంచి "యోఘనులారా! మీరు వేషధా
రులగు సురోత్తములుగాని భూసురులు గారనుట నిక్కంబు. మత్పరి
కల్పిత మహాదస్త్రచతుష్కం బతిక్రమించి సీమోల్లంఘనంబు జేయ
సామాన్యులకు దరంబే? మారుతాత్మజుని భుభుఃకారరవంబుచే నుర్వ్యు
లకు మృత్యువు ఘటింపదే! ఉరగరాజముఖనిర్గతగరళం బానహయుండు
దక్క నరుండు నిల్చునే! దహనుం డాకసంబు గబళింపుచుండ పతం
గంబులు విహరించుట చిత్రంబు గాదే! తదస్త్రనిర్మితదారుణాస్త్రజా
లంబుచే నరోత్తములు జీవింతురే! మీరు సురలోకపూజితులుగాక నరు
లుగారని పాదంబుల కెఱఁగి దమనిజనామరూపంబులు దయచేయు"
మనుచుండ రామభద్రుండు దరహాసితవదనుండై మరుత్సూనుని ము
ఖం బాలోకించి మనరూపంబులు గోప్యపఱచ నవసరంబు గాదనుచు
దన నిజస్వరూపంబుచే ప్రసన్నుండై గోరక్షు నెద నదుముకొని "వ
త్సా! మద్వచనం బాకర్ణింపుము. తొల్లి మైనాకినీరాణి పంచశరుశరపరం
పరలచే గ్రాగి యుష్మహామహుండగు వృషదశ్వసుతునికై తపం బాచ
రింప నితండు బ్రత్యక్షుండై తద్దేవిమనోతాపంబు దీర్పందలంచి
మత్స్యేంద్రయోగివర్యుని సమకూర్చె. నీవిపు డా శృంగమురుడీనగరం

బున కేగి మీనోదరసంభవుని గొనిపోయెదవేని దనవచనభంగం బౌనని యిక్కపిముఖ్యుండు దలంచెం గాన నీ వా నాథముఖ్యుని గొనిపోవల" దని నుడువ గోరక్షుండు "రఘుకులాబ్ధిచంద్రా! వాయుపుత్త్రుండు చతురవచనరచనుండై ప్రపంచవిరక్తుం డగుమత్స్యేంద్రనాథునిమోసపుచ్చుటధర్మంబగునే? వసుంధరపై నభంబుకూలుంగాక. కులంబురసాతలంబునకు గ్రుంకుంగాక. కులగిరులు వలక్రిందులై పడుంగాక. మత్ప్రాణంబులైన నిచ్చి యస్మద్గురువర్యుని దోడ్కొని జనియెద" నన శ్రీరామచంద్రుండు "వాయుపుత్త్రా! గోరక్షుండు గురుభక్తిపరాయణుండై కదనంబైన జేయందలంచు. గురుమూర్తిని వదలుట కష్టం" బనుచుండ నంజనీసూనుండు రోషతామ్రాక్షుండై యుద్ధంబు జేయందలంచి నిలుచుండ భక్తవత్సలుండగు రామభద్రుం డాంజనేయునితో "లఘుకార్యంబునకై మహాక్రోధం బిదేల? మీననాథుని జననంబుచే మైనాకినీరాణి హృదయతాపంబు బాసె. నీవచనంబునకు భంగం బేలగలుగు? ముం దీనాథుల కనేకకార్యంబులు గల" వని కోపోపశమనంబు జేసి గోరక్షుని దనహృదయంబునకు ధరించి యాపిదప నిజనివాసంబున కేగందలంచినంత మిత్త్రపుత్త్రుండు రాఘవేంద్రునిచరణసరసీరుహంబులపై వ్రాలి యనేకవిధంబుల స్తోత్త్రంబులు జేయ జానకీరమణుండు పరమానందుండై యంతర్ధానంబు నొందె నిట వాయుకుమారుండు మైనాకినీసదనంబున కేగెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్త్రంబున గోరక్షానిలసుతచరిత్త్రం బేకోనవింశత్యధ్యాయము సంపూర్ణము.

వింశత్యధ్యాయము.

శృంగముగుడీనగరాధిపతియగు మైనాకినీరాణి పూర్వచరిత్ర.

వాయుసుతుండు శృంగముగుడీనగరంబున మైనాకినీభవనంబు జేరంజని యంతఃపురంబున ననల్పంబగు హంసతూలికాతల్పంబున నల్పనిద్రను శయనించియుండు తిలోత్తమ మైనాకినీ నైకటికవిష్టరంబుపై యుపవిష్టుండైన సమయంబున నచ్ఛపలాక్షియగు పద్మిని యసంపూర్తినిద్రచే నీక్షణంబులు దెఱచి సముఖంబున నివసించి యున్న విప

క్షుదర్పదమన భుజబలదక్షుండగు పృషదశ్వసుతుం గనుంగొని భయన
యభక్తివిశేషంబులచే నదరిపడి లేచియబ్ధినుతుని పదసరోజంబులపై
వ్రాలి ముకుళితకరయై నిలుచుండెను శ్రోత "లీయువిధ కెత్తెఱంగున
తిలోత్తమమైనాకినీపద్మినీయనునామత్రయంబుగలిగె" నని సూతుని విచా
రింప నతండు "శ్రోతలారా! సావధానచిత్తులై వినుఁ" డని యిట్లనియె.
"మఱి నీ మగువ మేరుమందరసమీపస్థల సింహళద్వీపంబున తేజః
పుంజయై ప్రకాశించు పద్మినీపూబోడుల సముదయంబున నుడుగణం
బున సుధాకరునిభంగిపద్మినియను సార్థకనామధేయంబుచే రూపయౌవ
నలావణ్యంబులుగలిగినిరుపమానయై వెలుంగుచు నొకానొకదివసంబున
నభ్యంగనస్నానం బాచరించి లీలావినోదంబుచే కబరీభరంబు ముడు
చుకొనుచు విష్ణుపథావలోకనంబు జేయుచుండ నత్యంతవైభవసహి
తుండగు యుపరిచరవసువు దివ్యతరమణిఖచితవిమానారూఢుండై చను
చుండ వాతగతిచే దుకూలంబు దొలంగి తద్విమానగవాక్షద్వారం
బున నీచేంద్రియంబు గోచరంబై నంత నక్కలభగామిని హాస్యరసం
బొలుక పక్కుమని నవ్వెను తత్కారణంబున వసుపుంగవుండు క్రుద్ధుం
డై 'నీవు జారిణీవర్తనంబున విషయాపేక్షచే నల్పమతివై హసించితివి.
నే నింద్రియదమనుండనై తపోయోగంబున బ్రవర్తించుట నీ వెఱుం
గవే? దుష్టే! నీవు స్త్రీరాజ్యంబున నన్యపురుషలోలత్వంబుచే నివసిం
చెద' వని శపింప నమ్ముద్దియ భయకంపితహృదయయై 'వసునాథా!
మత్ప్రారబ్ధయోగంబున నాకీదుష్బుద్ధి యావహించెను. నాయపరా
ధంబు క్షమియించి శాపనివారణమార్గంబు దయచేయు' మనుచు
పెక్కుభంగుల నుతింపుచుండ నప్పరమదయాసముద్రుండగు వసుము
ఖ్యుండు కరుణించి 'యోమైనాకినీ! స్త్రీరాజ్యాధినాయకియగుతిలోత్తమ
రాణి యాయుష్యంబు సమీపించినది. నీవా స్థానాధిపత్యంబు వహిం
చెదవు. నీచిత్తంబు నాయందర్పించిన కారణంబుచే మత్స్యేంద్రనాథా
భిధానంబున బ్రసిద్ధిబొందిన మత్సుతుం డచ్చోటికి కరుదెంచి నిన్నపరి
మిత రతిసుఖంబులం దేల్చి మీననాథుండను సుపుత్రసంతానంబు బడ
యు' నని బలుక నక్కమలేక్షణ 'వసునాయకా! పురుషహీనరాజ్య
సుందరీమణులు సంతానవంతులెట్లయ్యెదరు? తద్దేశంబునకు మత్స్యేంద్ర
యోగిముఖ్యుం డేవిధి జనుదెంచు నీసంశయంబు బాపవే' యన నతం

'ఓ మందయాన! తద్రాజ్యవల్లభుండగు కపినాయకుని భుభుఃకారమారుతంబున నచ్చటిచేడియలు సంతానవంతు లయ్యెదరు. నీ వా దేశంబున తపం బాచరించి యంజనీసూను ప్రసన్నత్వంబు బడసి మనోజసుఖంబు గోర నతండు విషయోపద్రవరహితుం డైనకతంబున మహాసుప్రసిద్ధుండగు మత్స్యేంద్రసిద్ధుని నీ కొనగూర్చు' నని వాక్రుచ్చి స్వస్థానంబున కేగెను. తదుపరి సుందరీమణి యగు మైనాకినీదేవి వసుశాపహతబుద్ధిచే స్వదేశంబు బాసి గ్రుమ్మరుచు స్త్రీరాజ్యంబు జేరంజని శృంగమురుడీనగరంబున నొకచర్మకారిణీ సదనసమీపంబున నివసించి యుండ న త్తరలాక్షి రూపలావణ్యంబులు గనుంగొని యచ్చర్మకారిణి 'నీదేశం బెయ్యది? నీనామధేయం బేమి' యని యడుగ మైనాకినీదేవి 'నేను సింహళద్వీపనివాసురాలను. నానామంబు మైనాకినీ యనెదరు. నేనుపరిచరవసుశాపవశంబుచే దేశసదనంబులు బాసి యిచ్చోటి కేతెంచితి న న్నాదరించువా రెవరు గల' రని వినయపూర్వకంబుగ బలుక నచ్చర్మకారిణి ప్రేమాన్వితహృదయయై మైనాకినీదేవిని మిగుల నాదరించి 'మద్గృహంబున నివసించు' మని నుడువనప్పుడతిమిన్న తచ్చర్మకారిణీసదనంబున పాకక్రియలు జేయుచు సుఖంబుచే కాలంబు గడపుచుండ నొకకొన్నిదినంబులకా నగరాధినాయకియగు తిలోత్తమ మహారాణి కాలంబు నమకూరి సంతానంబు లేనికతంబున రాజ్యాధిపత్యయోగ్యంబగుచపలాక్షి నన్వేషించుటకై సచివులు దెలుపనయ్యువిజయొకమహానాగంబును దివ్యభూషణాంబరంబులచే నలంకరించి శుండాగ్రంబున పుష్పహారం బొసంగి యప్పురంబునం గల నిఖిలచంద్రముఖుల రావించి సభదీర్చునంత నమ్మహాగజం బా యన్నువలకూటంబు విలోకించి యొకభాగంబున నొప్పులకుప్పయై వెలుంగుచున్న మైనాకినీగళంబున హారం బర్పించియుండ నవ్వనితలెల్ల సంతసంబున నమ్మైనాకినీదేవినిమహారాణిగ పట్టాభిషేకంబు గావించిరి. పిదప నద్దేవి పూర్వోక్తప్రకారంబున ఘోరతరతపంబుచే ప్రభంజనసుతుని ప్రత్యక్షంబు బడసి మహామహుండగు మత్స్యేంద్రనాథయోగివశ్యన కనుకూలయై ప్రవర్తించెం గాన నిక్కాంతామణి పూర్వనామంబు మైనాకినీదేవి యనంబడి సింహళద్వీపతరళాక్షీకదంబంబున ఘనతవహించుటచే పద్మిని యను నామధేయంబు గలిగి తిలోత్తమమహారాణి సింహాసనాస్థానంబున శోభిల్లు

టచే తిలోత్తమాహ్వయంబుచే విలసిల్లె" నని శ్రోతల సంశయంబు వాపి ముందటికథావిశేషంబు దెల్పం బూని యిట్లనియె. వాయుసూనుండు ముకుళితకరకమలుఁడై పురోభాగంబున నిల్చున్న మైనాకినితో "నీతపంబునకు ముదితాత్ముండనై యోగద్రుముండగు మత్స్యేంద్రునిచే నీమనోభీష్టంబు దీర్చితి నిక నీసుఖంబునకు విఘ్నంబు వాటిల్లె నిప్పుడీ మత్స్యేంద్రుని ప్రియశిష్యుండు సర్వకళాదక్షుండగు గోరక్షుండీనగరంబునకు దనగురుమూర్తిని దోడ్కొని పోవుట కరుదెంచె నతం డత్యంతప్రతాపశౌర్యధైర్యసమృద్ధత్వంబున మహావైరాగ్యంబుచే బ్రహ్మానందాబ్ధినిమగ్నుండై ప్రకాశించు నత్తపోఘనుని గుణజాలంబు బొగడ బ్రహ్మేంద్రాదులకైన తరంబుగాదు. నే నా మహామహుని సమక్షంబునకు నీకతంబున శ్రీరామచంద్రసహితుండనై వెడలి యనేకయుక్తియుక్తంబుల బోధించిన నతండు నిర్లక్ష్యంబుచే మావాక్యంబులు గ్రహింపక దనగురునాథుని దోడ్కొనియరుగుట నిక్కంబని నొక్కి వక్కాణించె నగ్గోరక్షుం డిచ్చోటికేతెంచు నతండు విషయసుఖవిరక్తుండు నీ వత్తపోఘనుని భయభక్తులు గలిగి శయనాసనభోజనాది వివిధోపాయంబులచే గౌరవించి చేలబద్ధమాణిక్యంబు పగిది బహుజాగ్రత గలిగి సంతుష్టపఱచు" మని యాజ్ఞాపించి యంతర్ధానంబు నొందెను.

గోరక్షుండు శృంగమురుడీనగరంబు ప్రవేశించి మత్స్యేంద్రనాథుని హెచ్చరించుట.

ఇట జగత్ప్రతీక్షుండగు గోరక్షుండు ఛిన్నాపట్టణంబు బయలుదేరి గణికాయుతరథసమేతుండై యనేకగ్రామంబులు గడచి శైల్యదేశశృంగమురుడీనగరంబు జేరంజనిపురబాహ్యపథికాశ్రయంబున నివాసంబు జేసియుండ నగ్గణికాశిరోమణి యగు కళింగ దనమేళసంబంధమరాళగామినుల వెంబడిగొని చూపరుల నేత్రోత్సవంబు జేయు రూపంబులచే మందగమనంబున మైనాకినీ సదనంబు, జేరంజని ద్వారరక్షకులతో దనరాక దెలుప వార లతివేగంబున తిలోత్తమకు దెల్పి యనుజ్ఞ బడసి ద్వారంబు దాటింప నానటనకత్తియలు రయంబున సభాస్థానంబునకేగి యుడుగణంబున బ్రకాశించెడు రోహిణీపతిచందంబున నవరత్నఖచితకనకసింహాసనంబుపై మైనాకినీరాణిసహితంబుగ నలంకరించియున్న మీనోదరసంభవుని గనుంగొని జోహారులిడి యప్పద్మినీ

మణి నుద్దేశించి "తల్లీ! భవత్కీర్తి ముల్లోకంబున విస్తరిల్లె నిక్కలి యుగంబున కలావంత బృహద్రథ గోపీచంద ప్రముఖ రాజాధిరాజు లపారకీర్తిఘనులై నీయుదారగుణసంచార్యభర్యస్థైర్యధైర్యంబుల కెన యైరే గావున నృత్తగీతవాద్యంబుల దమయుల్లంబు రంజిల్లఁజేయు నని ర్థిమచే నరుదెంచితి" మన నమ్మహారాణి పరమానందకందళిత హృద యారవిందయై వేశ్యకత్తియల వేడుక జూడందలంచియాజ్ఞాపింప వారు దమకోర్కు లీడేరె నని పిడిదికిం జని వీణా మృదంగాది వాద్యంబులు సరియొనర్చి సావధానత్వంబున నుండిరి. అట మైనాకినీదేవి సూర్యాస్త మయానంతరంబున నానామణిమయ స్తంభ పరిశోభితవిశాలమంటపంబు న శ్రీచందనాగరుమృగమదాది పరిమళ మిళితతోయంబులచే తత్సభాస్థ లం బలంకరించి నిరుపమాన మణిప్రతిఫలిత దీపసముదయ చిత్రతర కాంతిపుంజంబులు దిరస్కృతశుపాకర కరనికరంబై వెలుంగుచుండ యోగిసార్వభౌముండగు మత్స్యేంద్రనాథుని వామభాగంబున సుతుం డగు మీననాథసహితంబుగ నయ్యోల్లోలగంబున నలంకరించి వేశ్య భామినీ మణియగు కళింగ నాహ్వానింప నప్పుడపుడెలి దమసాధనవరి ష్ఠంబులు గొని రాజభవనంబున కేగుచుండ గోరక్షుండు వెంబడి బోదలంచి వేశ్యకాంతతోఁ రహస్యంబున "నీ వా సభాస్థానంబున నాట్యంబు సలుపునెడ నే మృదంగవాద్యంబు మాధుర్యంబుగ సల్పి సభ్యుల యుల్లంబునకు సంతసం బొనగూర్తు. నీ కపారద్రవ్యంబు లభిం చు"నన నక్కలికి "పూర్వడామూరాజసభాస్థలంబు స్త్రీజనపరివృతంబై యుండు. పురుషగమనం బచ్చోటి కెట్లగు నేతద్రాజ్యంబున పురుష సంచారంబు లేదని మీ రెఱుంగరే! మీ రచ్చటి కరుదెంచుటచే నన ర్థంబు సంభవించు" నన నతండు "నేస్త్రీవేషంబుధరించి సభామధ్యం బున నృత్తగీతంబులు సల్పి సభాసదులచిత్తంబు లానందాయత్తంబు నొందించెద. నాకోర్కు లీడేరు. నీ కపరిమితలాభంబు గలుగు" నన నక్కళింగ హర్షించి దివ్యతరాంబరంబు లా గోరక్షనాథునకు గట్టించి జడలచిక్కు వాపి కబరీభరంబు ముడిచి లలాటంబున సారంగమదతిల కంబు దిద్ది మణివిభ్రాజితం బగుతాటంకంబుల శ్రోత్రంబు లలంకరించి బహురత్నఖచిత కనకాభరణంబులు గళభాగంబున శోభిల్లంజేయ

నంగనామణి వేషానుకూలభూషణభూషితసర్వాంగసుందరియై వగజగి బిగి సొగసు వలపు మిటారంబులు గలిగి రంభోర్వసులను దిరస్కరించు రూపంబుచే మృదంగంబు గొని వేశ్యాంగన వెనువెంట వీరమోహి నియై సభాస్థానంబు జేరంజన నప్పాథోరుహదళలోచను లీ స్త్రీవేష ధరగోరక్షుని నవయౌవనాంగంబుల కలిమి గనుంగొని యన్యోన్యభా షణంబులచే "నిత్తరలాక్షి తనువిలాస సోయగం బీ వయారం బీ తళు కీ బెళు కే లోకంబున నే యన్నులకైన గలదే? మున్నిట్టి పడంతిమిన్న నెందైన గంటిమె? రంభోర్వసు లీ కలభగామిని పాదకనులద్యుతి కెన యౌదురె? మహాచాతుర్యధుర్యుండగు చతురాననుం డీచంద్రముఖిని సృజించుట కెంత యోచించెనో" యని యాశ్చర్యంబున గొనియాడు చుండు సమయంబున గోరక్షుండు శృతిమిశ్రమంబుకై మాధుర్యమాణ మృదంగనాదంబు జేయ నక్కళింగ కాలానుకూల రాగాలాపంబు గా వించి గానవిద్యా నైపుణ్యంబుచే వర్ణావర్ణ ప్రకృతి వికృతి స్వరవివేకం బు గలిగి గాయనంబు జేయుచు శాస్త్రోక్తభరతంబుచే సభాసదుల మనః పద్మంబులు వికసింపం జేయుచుండ సకలవిద్యావిశారదుండగు దినేశతన యుం డప్రతిహతచతురత్వంబున మృదంగంబు వాయించుచు విచిత్రత రమణీచిత్రిత హేమసింహాసనోపరివిశ్రమితవసుకుమారచరణసరసీరుహా ర్పితచిత్తుండై దనయుల్లంబున మద్గురుపదపంకజదర్శనంబు ఘటించె క ృతకార్యుండ నైతినని పరమానందంబున డోలాయమానమానసుండై మృదుమధుర మృదంగశబ్ద నినదంబుచే విద్యాకుశలత్వంబు గనుప ఱచ నమ్మత్స్యోదరసంభవుం డమితానందంబున నహో యని మనోజ్ఞప రిధానం బా మందయాన కొసంగుచుండ గోరక్షనాథుం డాయానంద పరవశత్వంబు విలోకించి మృదంగంబున నానావిధశబ్దంబులు తాళ మానగతులచే గల్పించుచు నిజచతురత్వంబున "మత్స్యేంద్రయోగి వర్యా! భవత్పుత్రుండగు గోరక్షుం డేతెంచె నిఁక తడవేల వెడలవల యు" నని శబ్దంబులు మృదంగంబున వ్యక్తపఱచ నవ్వసుకుమారగుం డహస్కరసుతుండగు గోరక్షునినామం బెక్కడి దని దలంచుచుండ పునఃపునర్మృదంగనాదంబున స్వనామ గోరక్షనామంబులు శ్రవణరం ధ్రంబుల సోకుచుండ నత్యంతాశ్చర్యంబుచే దిశలుగనుంగొనుచు భిన్న హృదయుండై గోరక్షుం డెందు గలఁడని చిత్తంబునతత్తరంబుచేకొంద

లంబంది మ్లానవదనుండై గానరసంబు గ్రోలకున్న యోగద్రుముని జూ
చి (మైనాకినీదేవి) "ప్రాణప్రియా! యుష్మన్ముఖకమలంబు కాంతిహీనం
బగుట కారణంబేమి" యన నమ్మహానుభావుండు "తిలోత్తమా! మచ్ఛి
ష్యుండు ప్రతాపవంతుండగు గోరక్షుండు దూరీకృతవిషయానురా
గుండై స్వేచ్ఛావిహారంబుచే నిష్పురవరంబున కేతెంచి నన్నీభాగ్యభో
గంబుల కెడబాపి స్వదేశంబునకు గొనిపోవునను సంశయంబు గలిగె"
నన నత్తరుణీమణి పూర్వోక్తమారుతాత్మజువాక్యంబు నెద స్మరించి
యదరిపడి పరితపించుచుండ గానరసంబు లవణమిశ్రిత దుగ్ధంబుపగిది
విరసంబై దోఁచుచుండ నత్తఱి యత్తిలోత్తమ స్త్రీవేషధర
గోరక్ష మృదంగశబ్ద పరంపర లాకర్ణించి తత్సాధనవరిష్ఠగుణదోషం
బని యూహించి కళింగం బిలచి "యితరమృదంగంబు వాయించు"
మని యొకమృదంగం బిప్పింప నచ్చేడియ వల్లెయని గోరక్షున కొసం
గిన నమ్మృదంగం బెప్పటియట్ల శబ్దంబు లీనుచుండె నంత నియ్యది
మృదంగదోషంబు గాదని వితర్కించి కైతవస్త్రీని దొలంగించి కలా
వంతిని యను నొకపరిచారిక నప్పగింప నందు గోరక్ష మత్స్యేంద్రనామ
శబ్దంబులు వినరామి తత్క్షణం బా మృదంగశిఖామణియగు వేషధర
గోరక్షుని హస్తంబు ధరియించి యేకాంతస్థలంబునకు దోడ్కొని చని
"నీ నిజనామరూపంబు లెఱింగింపుము. నీగురుచరణకమలంబు లాన"
యని పలుకుచున్న మైనాకినీదేవివచనంబు లాలకించి స్వరూపప్రక
టంబున కిది మంచిసమయంబని "తల్లీ! నేను మత్స్యేంద్రనాథ ప్రియ
తనయుండ నానామంబు గోరక్షుం డనియెదరు. నీరాజమందిరంబున
పురుషాగమనంబు లేదని యెఱింగి యువతీవేషంబున నేతెంచితి" నన
నమ్మైనాకినీరాణి సవినయభయభక్తిచే గోరక్షుని పాదంబుల కెఱఁగి
వేగంబున పురుషవస్త్రంబులర్పించి "గోరక్షా! నీవు మత్సుతుండవైతివి.
మున్ను నీనామరూపగుణవిశేషంబులు మత్స్యేంద్రయోగిపుంగవునిచే
విశ్రుతంబయి తదాది నినుగనుంగొను ప్రాప్తం బెన్న డొసఁగూడునో
యని త్రికరణశుద్ధిచే నిరీక్షింపుచు మద్భాగ్యోదయంబుచే నేఁడు గనుఁ
గొంటిని. వత్సా! భవజ్జనకుండగు మత్స్యేంద్రనాథుండు నీయందలి
ప్రేమాతిశయంబుచే నానావిధరత్నఖచితస్వర్ణభూషణంబులు శరచ్చం
ద్రచంద్రికల నేలు సాంద్రప్రకాశ మౌక్తికహారంబులు నపరిమితామూ

ల్యదివ్యాంబరంబులు నీకై సిద్ధపఱచె" నని కరంబు బూని మత్స్యేంద్రునిసముఖంబున కరుదెంచుచుండ యోగద్రుముండు విస్మితుండై గోరక్షుని వీక్షింపుచుండ చతురవచనరచనాధురీణ యగు తిలోత్తమరాణి మునుముందుగా మత్స్యేంద్రసిద్ధునితో "భవచ్చరణాంబురుహదర్శనాపేక్షచే నుత్సుకుండగు గోరక్షుం డరుదెంచె. మననోములు ఫలించె నితండు బాహుదర్పశౌర్యధైర్యంబులచే మీననాథున కగ్రజుండై నిఖిలసంపత్సమృద్ధంబగు రాజ్యభారంబు వహించును. జగద్రక్షకుండగు కమలాక్షుండు మనయం దపారకరుణాకటాక్షంబుచే నిగ్గోరక్షుని సమకూర్చె. మనవృద్ధదశ కష్టంబులు కడతేరె" నని నుడువుచుండ గోరక్షుండు దరహసితవదనుండై నిజహృదయంబున జన్మాంధునకు దర్పణంబేల? గతపతిసతులకు కుంకుమాది సౌభాగ్యద్రవ్యంబులేల? క్షీరాబ్ధిశయనుండు గోదుగ్ధంబుల కాశించునే! పనసంబుపై స్వర్ణమయశృంగారంబు లనవసరంబుగాదే? తద్వత్ మాబోటి విరక్తుల కీయస్థిరవైభవంబులేల? క్రమంబున నుద్ధుకనాథుని సాధించి పిదప తుచ్ఛసంపదల దిరస్కరించెద నని తలపోయుచుండ మత్స్యేంద్రుండు కళింగ కనేక వస్త్రభూషణద్రవ్యంబులు బహుమతు లొసంగి శీఘ్రంబున సింహాసనంబు డిగ్గి ప్రియశిష్యుండగు గోరక్షుని దనహృదయంబున కదుముకొని ప్రేమపూరితమానసుండై యోగక్షేమంబులు విచారింప గోరక్షుండు గురునాథుని చరణపంకేరుహంబులకు ప్రణమిల్లి బదరికాశ్రమంబున తపం బాచరించినవిధంబు నుమారమణుండు ప్రసన్నుండై సర్వదేవతావాహనం బొనర్చ వరంబు లిప్పించిన కథావిశేషంబు తేటపఱచియు "భవద్వియోగాకులితచిత్తుండనై జలనిర్గత ఝషంబుకైవడి దడబడుచు నానాదేశకాననంబులు ద్రిమ్మరుచు తుద కీరాజ్యంబున యుష్మచ్ఛరణాశ్రయుండ నైతి నికమీఁద నొంటి నివసింప లే" నన కరుణామయుండగు మత్స్యేంద్రుండు "వత్సా! నిన్ను బాల్యంబునుండి పోషించి యిప్పుడు నిన్నొంటి బరిత్యజింతునే? పవమానతనయుండు నన్ను మిగుల గౌరవించి రాజ్యసుఖసంపద లొసంగె. నీవులేని భోగంబులు సుఖకరంబు లగునే? భోజనశయ్యాసనసమయంబుల నిన్నుస్మరియించని దినంబు గలదే? మచ్చిత్తంబు నీయం దెల్లప్పుడు దవిలియుండి యప్పుడప్పు డగ్గలంబగు తాపంబుచే 'మత్సుతుని బాసితిని. పరమపా

పిని' యని నిందించుకొందు. పుత్రా ! నీవులేని తీర్థాటనంబు వ్యర్థంబు గాదే? నీవులేని గృహంబు శూన్యాగారంబు గాదే" యన గోరక్షుండు "నాథా! కమలంబు లనేకంబు లుండినను కమలాప్తుం డొక్కండె యనుకరణి జలచరంబు లపరిమితంబులైనను జలం బొక్కటియైన పగిది దేశదేశంబుల నీ కనేకసుతులు గలిగినను జనకుండ వొకండ" వని యశ్రుపూరితలోచనుం డైనంత మత్స్యేంద్రయోగీశ్వరుం డపార మోహంబుచే గోరక్షుని మూర్ధంబు చుంబించి "తనయా! నీయట్టిపుత్రులు గలరే" యని సభాస్థానంబు వదలి గోరక్షుని దోడ్కొని పాకభవనంబున కేగి యేకపాత్రంబున షడ్రసోపేతభోజనంబు సలిపిరి. ఈవిధంబున ప్రతిదినంబు భోజనశయ్యాసనాదుల నెడబాయక జరుపుచు సభామంటపంబున నిరుపార్శ్వంబుల గోరక్ష మీననాథుల నిడుకొని సింహాసనాసీనుండై పార్శ్వద్వయంబున శోభిల్లెడు లంబోదర షడానన సహితశంకరునిభంగి నుభయాంకస్థితరామకృష్ణసమేతుండగు వసుదేవుపగిది భాసమానుం డగుచు రాజ్యపరిపాలనంబు జేయుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున గోరక్ష మత్స్యేంద్ర సందర్శనకథాసహిత వింశత్యధ్యాయము సంపూర్ణము.

ఏకవింశత్యధ్యాయము.

గోరక్షుండు మత్స్యేంద్రనాథుని వెంటగొని చనుట.

ఇవ్విధంబున గోరక్ష మత్స్యేంద్రు లేకాసనంబున ప్రభాసిల్లుచుండ నత్త్రిలోకోత్తమ యసదృశకుశలమతియై గోరక్షున కపార మోహావహనస్నానంబు లొనర్చుచు భక్ష్యభోజ్యలేహ్యచోష్యాదిపదార్థంబులు ప్రేమాన్వితహృదయయై స్వకరకమలంబులచే నిడుచు వినూత్నదివ్యాంబరభూషణప్రముఖాఖిల వస్తుజాలంబులచే లాలింపుచుండ వైరాగ్యఘనుండగు గోరక్షుం డివి యన్నియు నిరవధికసుఖకరజ్ఞానతరుమూలచ్ఛేదనకుఠారంబులు గావే రుగ్పరిపీడితశరీరునకు షడ్రసభోజనంబులు విషతుల్యంబు లనదగవే యని మనంబున వితర్కించి యేకాంతంబున త్రిలోకనుత మత్స్యేంద్రునితో "గురుసత్తమా! మన మీదేశంబున

నివసించుట నిర్దోషనాథపంథంబునకు వైకల్యంబు వాటిల్లు. పిత్తలంబునకు రతనంబులు దాపినట్లు రమాదేవి శ్మశానంబున వసించినవిధంబు మేషగ్రీవంబున చింతామణి దాల్చినచందంబున నభ్రంకషకీర్తిధ్వజసమన్విత భవాదృశు లీ స్త్రీరాజ్యం బాశ్రయించి సురాసురవందిత చరణారవిందులై నిందాస్పదసుందరీనికురుంబసంసేవితు లగుట మహాచిత్రంబు గాదే? నాథా! మనమీ జగదుద్ధారనిమిత్తంబై యవతరించి లీలామానుషవేషంబుల తపంబు సల్పి తాపత్రయాగ్నిపరితప్తచేతస్కులగు నజ్ఞానాంధుల బంధంబులు విముక్తి జేయుట మాని నీచకర్మాచరణం బొనర్చుట కెంతవిచారకరంబు? మన మిప్పగిది మెలంగుచు నితరులకు జ్ఞానమార్గం బుపదేశించుట నృపుండు తస్కరుండై పరుల శిక్షించినకైవడి గాదే? ఘనమండలాచ్ఛాదిత గ్రహరాట్కాంతిపుంజంబు తిమిరంబు బాపునే? భవదాచరిత దుష్కర్మంబులు వీక్షించి చపలమతులగు మానవు లెంతయేని దురాచారంబుల బ్రవర్తింతురు. యుష్మదవతారకార్యకారణంబులకు భంగంబు వాటిల్లు గావున ప్రథమంబున విషయసుఖానుకూలసంసారం బాశ్రయించి క్రమక్రమంబున సంగంబు దొలంగి వైరాగ్యోదకంబున స్నానంబులాడి నిర్మలత్వంబున విషయరహితబుద్ధులై ప్రకాశింపవలయు ననియు రజోగుణక్షితి నిక్షిప్తకామబీజోద్భవవృక్షం బభివృద్ధిబొంది కామక్రోధలోభశాఖాత్రయంబుచే విశాలంబై మత్సరగంధసహిత మదకుసుమంబులు గలిగి మోహరసపూరిత విషయఫలంబులు మనోహరంబులై విలసిల్లి తత్ఫలానుభవంబుచే బ్రహ్మానందాధిరాజ్యపదభ్రష్టుండై యమలోకదుఃఖవారాశిని మునుంగుట తథ్యంబు. హరగళగరళంబైన సహింపవచ్చు సుఖదుఃఖాస్పదంబగు విషయతాపంబు భరింపవచ్చునే? తచ్ఛాంతికై జ్ఞానౌషధంబు సేవింపవలయు నని మీ రెఱుంగించినవిషయంబేకదా. యోగిముఖ్యా! తుచ్ఛసంపదల బరిత్యజించి సావధానచిత్తులై యోగమార్గం బాశ్రయింపు" మని యుక్తియుక్తవాక్యంబులచే విన్నవింప మత్స్యేంద్రనాథుం డానందమయ స్వాంతంబున దూరీకృతమోహుండై "గోరక్షా! నీవాక్యంబు లమృతతుల్యంబులై మచ్చిత్తంబున కాప్యాయనం బొనర్చె నిక మన స్వదేశంబున కేగవలయు" లై దృఢంబుగ బలికి సంతుష్టపఱచి వేగంబున గోరక్షసహితుండై

పాకశాల కరుదెంచి భోజనంబు సలిపి ప్రత్యేకస్థలంబున శయనించిరి. అంత నమ్మైనాకినీరాణి మత్స్యేంద్రుని శయ్యాగృహంబు జేరి సుఖగోష్ఠి జరుపుచుండ నతం డద్దేవితో "నన్ను గోరక్షుండు స్వదేశంబునకు గొనిపోవ నే నందు కంగీకరించితి గాని మచ్చిత్తంబు భవదధీనంబై దోలంగనేర దిందు కెయ్యది యుపాయంబో" యన నక్కాంతామణి "నాథా! మీ రరుగకున్న నతం డెట్లు దోడ్కొని జను" నన మత్స్యేంద్రయోగిశ్రేష్ఠుండు "ప్రియే! గోరక్షుండు విరక్తి మార్గప్రదర్శక వచనంబులచే వైరాగ్యంబు గల్పింప తత్కారణంబున కుతుకంబుచే జనుదెంచెద నని వాక్యం బొసంగితి నిక నేనేమి జేయుదు! నీవా ప్రభాకరపుత్రుని యుల్లం బత్యంతలాలనంబుచే నపహరించితేని కార్యసాధనంబౌ" నన నచ్చేడియ "వసుపుత్రా! గోరక్షుని యసిధారావైరాగ్యంబు నిరుపమాన నిశ్చలబుద్ధిదార్ఢ్యంబు మత్పరికల్పిత వివిధోపాయంబులకు చలింపదు. కానిమ్ము యోచించెద" నని యన్యోన్యసంభాషణంబులచే నారేయి గడపి సదుపాయం బూహించుచుండు సమయంబున గోరక్షనాథుం డేతెంచి "తల్లీ! నేను తీర్థాటనంబు జేయం దలంచితిని. మద్గురువర్యుం డగు మత్స్యేంద్రయోగిపుంగవుని దోడ్కొని యేగెదను. శెల వొసంగవే" యని వేడ నక్కుటిలాలక "పుత్రా! గోరక్షా! నిన్ను జ్యేష్ఠపుత్రుండని మనంబున నిశ్చయించితి. నేతద్రాజ్యభారంబు వహించి బాలుండగు మీననాథుని గాపాడుచు నిర్వక్రవిక్రమంబున తేజోమయుండవై మా కన్నవస్త్రంబు లిడుచు బోషించెడి సమర్థుండవు. వత్సా! యుష్మజ్జనకునకు వృద్ధాప్యంబు ఘటించె. తదవస్థత్కాయం బనుదినంబు వికలంబు నొందు. మావృద్ధుల గాపాడెదు నుండ వీవు దక్క నొరు లెవరుగలరు? మాకోర్కు లెవనిచే నీడేరును? మాగతి మోక్షంబు లెవరు విచారించెదరు? చిఱుతప్రాయము గల మీననాథుం డెవనిచే నభివృద్ధిజెందు? నీయట్టిసుకుమారుండు గలిగి మాతాపితృలకు దుఃఖంబు వాటిల్లజేయుదురే? మమ్మెడబాయ దలంచితేని మమ్మొకకూపంబున బడద్రోచి వెడలు" మని మోహారసం బుప్పతిల్ల దీనవదనంబుచే బలుక గోరక్షుండు వర్షధారలకు చలింపని పర్వతంబుకైవడి ధీరచిత్తుండై "జననీ! చతుస్సముద్రముద్రితంబగు భూవలయంబన నేల? ముల్లోకంబుల కేకమీఁడై దేజరిల్లెడు వాని

కీ స్త్రీరాజ్యసుఖసంపదలు గణుతియె? నీభాగ్యంబుల కాశింపను. త్వరిత గతి తీర్థంబుల కేగవలయును. నీవు నీ నిజస్థానంబున సౌఖ్యంబుగ నుండుము. మే మీ తుచ్ఛసుఖంబుల కపేక్షింపము. మాధనంబులు యోగంబులు గాక నస్థిరరాజ్యభోగంబు లగునే! తడవేల? జనవలయు శలవొసంగు" మన నత్తిలోత్తమరాణి తనడెందంబున నీ గోరక్షుం డింద్రియదమనదక్షుం డీతనిహృదయంబు మాయోపాయంబుల గరంగించి దారాపరిగ్రహం బొనర్చినగాని సాధ్యుండు గాడని దలంచి "గోరక్షా! నీవు తీర్థయాత్రానిమిత్తంబై జనియెదనంటివి. నీ వేతెంచి షణ్మాసంబులయ్యెఁ గావున వత్సరాంతంబువఱకిచ్చో నివసించి తదుపరి నిజగురుసమేతుండవై స్వేచ్ఛావిహారంబున జనవలయు నే నాటంకపఱచను. నావచనంబు నిజంబని నమ్ము" మని యనేకవిధంబుల సమాధానపఱచ నతం డందుకొడంబడి "షణ్మాసాంతంబున మద్గురునాథుని దోడ్కొని చనియెద" నని స్థిరచిత్తుండై నివసించియుండెను ఒకానొకదివసంబున మైనాకినీదేవి గోరక్షుని దననికటంబున గూర్చుండ నియమించి యంతఃకరణచే ముఖకమలంబు నివురుచు "వత్సా! ఉత్తమోత్తమంబగు గృహస్థాశ్రమధర్మం బాశ్రయింపుము. నీవివాహంబుచే నాకు స్నుషాలాభంబు గలుగు నమ్ముద్దియ నాయొద్దనుంచి నీయథేచ్ఛం జని పుణ్యతీర్థంబులు సేవించి పునరాగమనుండవై దారాసహితంబుగ మద్భవనంబున వసించి పట్టాభిషిక్తుండవై రాజ్యపరిపాలనం బొనర్చి నాయపేక్ష పరిపూర్తి జేసెద వని దలంచితిని. శలవొసంగెదేని లగ్నసమారంభంబు ప్రారంభించెద" నన దినకరపుత్రుండు "జననీ! గురుకరుణాకటాక్షంబుచే నే మున్నె యోగనామ్నీయువతిని వరియించి నిత్యభోగుండనై దృప్తిబొందుచు కాముకుండనై యన్యకాంతల నపేక్షించుట జారపురుషలక్షణంబుగాదే? గురుభక్తిపరాయణత్వంబునకు లోపంబు వాటిల్లదే" యని ప్రత్యుత్తరం బొసంగ నప్పద్మినీమణి గోరక్షుని నిర్మోహనిశ్చలత్వంబునకు విస్మయంబుచే స్తబ్ధించియుండి యొకనాఁ డితరగ్రామవాసిని యగు నొకయన్నులమిన్నను బిలచి "గోరక్షుని కుసుమశరువిశిఖంబుల పాలొనర్చి మోహపరవశు జేయు" మని యాజ్ఞాపింప నమ్మృగాక్షి మందగమనంబున గోరక్షుని శయనాలయంబు జేరంజని కడుదరహాసంబుచే పయ్యెద సవరించుచు

కడకంటిప్రసారంబుల రతిసంభ్రమంబు దెల్పుచు "నాథా! వినోదం బుచే నాటలాడం దలంచి యొకబిందుతంత్రంబు గొనితెచ్చితి నాయభీష్టంబు దీర్పవే" యన నతం డనశ్యంబని యాడుచుండ నక్కుటిలమతి యగు చపలాక్షి యిక్షుచాపుని తూపు లనజాలిన చూపు లానిర్ఘాతపాపునిపై బఱపుచు జాణయై తనంతట తా నోటుబడి మోహపూరిత వాక్సుధారసధారలచే సరసుండవు చతురుండవు శూరుండ వని బొగడుచు విరహభారపరవశంబున శాటీముక్తోత్తుంగకుచయై నిట్టూర్పు లిడుచుచు వలపుగుఱుకు సిగ్గుచే దనజఘనంబు గాన్పించె నను నెపంబున పలువ సవరించుకొనుచు భావభవవిశిఖతాపోద్రేకమోహావహ హావభావాన్వితయై నిజభావంబు వెల్లడిసఱచి వైరాగ్యకులిశనిర్భిన్నమోహభూధరుండై రాహుముక్తప్రభాకరునిభంగి బ్రకాశించుచున్న గోరక్షుని గనుంగొని లజ్జాయమాన వదనంబుచే శీఘ్రంబునం జని మైనాకినీదేవికి దెలుప నద్దేవి గోరక్షునకు దనసదనంబునగల వజ్ర వైడూర్య గోమేధిక పుష్యరాగ మరకత మాణిక్యాది ద్రవ్యాగారంబులు గను బఱచి "పుత్రా! యీయనూనధనాగారంబు లన్నియు నీయధీనంబులై యుండు నిందుచే నాచంద్రార్కమహాసుఖం బనుభవింప నగు" నని పలుక నగ్గోరక్షుండు చలింపకున్న నతని నిస్పృహాత్వంబునకు తపించి బాలుండగు మీననాథుని జేరందీసి తోయపూరితనయనయై రోదనంబు జేయుచుండు మైనాకినిం జూచి చెలికత్తియ లనేకవిధంబుల తాపోపశమనంబు చేయుచు "మాచతురత్వంబుచే నిగ్గోరక్షుని నోటంబఱతు" మనుచు దివసంబులు గడుపుచుండ క్రమక్రమంబుచే షణ్మాసపూర్తియై వత్సరాంతప్రతిపదునయకాలసమయంబున నేడు మత్స్యేంద్రయోగి పర్యం డేగునని గ్రామగ్రామంబులా మహామహుని సుగుణసమాజంబు దలంచి దైవమా యని మొఱలిడుచు నాథుని శౌర్యస్థైర్యధైర్యంబు లగ్గడించి యొకమదిరాక్షి నాథుండు దనయపూర్వగుణవితానంబుచే నేతద్రాజ్యంబు పరిపాలింపుచు సమ్మాదరించె ననుచు నొక చక్రస్తని విషమశరునకు వసుపుత్రునికుశలత్వదయాపరత్వంబులు బొగడుచు నిస్పృహాఘనుని వియోగంబున నినుండు లేని నభంబుపగిది మన రాజ్యంబు శోభిల్ల దనుచు మఱియొకకంబుకంఠి మనభాగ్యవశంబుచే

లభించిన మత్స్యేంద్రుని గోరక్షగ్రహంబు గ్రసించె ననుచు నొకయజ్ఞాతి గోరక్షుండు ప్రత్యక్షయముండై మనప్రాణంబులు హరింపదలంచె ననుచు భిక్షాన్నంబుచే దృప్తిని బొందు కక్షపాలధరులగు బికాసులకీ భక్ష్యభోజ్యంబు లెట్లు సహించు? దైవహతబుద్ధులగు దరిద్రులకు ధనధాన్యంబు లిముడునే? కాననంబున దిరుగు ద్రిమ్మరులకు కనకమయసౌధంబుల దనివిదీఱునే యని బహువిధంబుల గోరక్షునిదూఱుచు నాథా! మత్స్యేంద్రయోగిసమర్థా! యని విలపించుచు శృంగమురుడీనగరంబు జేరం జనుచుండ నిట గోరక్షుండు సింగీ శైలీ కంథాది యోగి చిహ్నపరికరంబులుబూని మత్స్యేంద్రుని పాదంబులకు బ్రణమిల్లి పురోభాగంబున నిల్చి "గురునాథా! కాలాతిక్రమణంబు జేయక శీఘ్రంబున జనవలయు తడవేల" ననుచుండ తిలోత్తమరాణి బాష్పపూరితలోచనయై "వత్సా! భోజనం బాచరించి జను" మని వేగంబున మధురసభోజ్యంబులు సిద్ధపఱచి గురుశిష్యులకు భోజనం బిడుచు గద్గదకంఠంబుచే "నాథా! భవత్సుతుండగు మీననాథుం డిచ్చో నెట్లు నివసించు? మీరు లేకున్న మారుతాత్మజుని భుభుఃకారనినదంబుచే నెట్లు జీవించు? యుష్మజ్జనకుండగు యుపరిచరవసుశాపవశంబుచే సింహళద్వీపంబు బాసి గూరారాజ్యంబు జేరి తచ్ఛాపవిముక్తికై భవదంఘ్రియుగళంబాశ్రయించి మీననాథసుతుని బడసి శాపంబుచేకడ తేరితి నిక నుపరిచరవసు వేతెంచి నిజవిమానంబున ననుగొనిపోవును. మీననాథుండు మర్త్యలోకజన్ముండు గాన సశరీరంబుచే దేవలోకంబున కరుదెంచుట కనర్హుండు. పరిత్యజించితేని యిట రక్షించువారలెవరు? గావున నీతనయుని దోడ్కొని చనుట ముఖ్యకారణం" బని విన్నవింప నాథుం డవశ్యంబని భోజనంబు సల్పి ప్రయాణోన్ముఖుండై నిల్చున్నసమయంబున మైనాకినీదేవి మీననాథుని సిద్ధపఱచి పతిసుతవియోగదుఃఖభారం బోర్వలేక నేత్రాంబుధారల నవయవంబులుదడుపుచు మహారవంబుచేరోదనంబు జేయుచుండ నదిచూచి యువతీసమూహం బొక్కమొగి దిక్కులు పిక్కటిల్ల నాక్రందించుచు గోరక్షనాథుని సమీపంబు జేరి "గోరక్షా! నీకీ కఠినతరగుణం బెలగలిగె? మాప్రాణంబు లపహరించుట కిం దేతెంచితివో? రాజ్యసుఖంబుల దిరస్కరించి విపినంబులే మేలని దలంచితివో? చారుతరచంద్రకాంతమణికుడ్యసౌధనిలయంబులు సుమాళంబులు గావో? నానావిధ

సుగంధప్రసూనసమన్వితతరులతావితానపరిశోభితప్రమదావనవిహారం బులానందకరంబులుగావో? రథగజతురగభటప్రతనాపరిసేవిత సింహాసనాధిపత్యంబు మోఘంబుగాదో? విచిత్రతరమణిచిత్రితదివ్యభూషణాంబరభూషితులై ప్రభాసిల్లుచు ననల్పంబగుహంసతూలికాతల్పంబుల ఝషధ్వజసాయకకేళీకుచధరపరిరంభమాణవక్షస్థలులై సురతసుఖాంబుధి నోలలాడుటపూర్వపుణ్యవిశేషంబు గాదో? మిత్రసంతనా. షడ్రసోపేత భోజనంబులుబరిత్యజించి కాననాంతరకందమూలఫలంబుల కాశించుట వేదుఱో? లేక గ్రహచారబలంబో? మణిమయసింహాసనాసీనుండవై సహస్రాక్షునిబోలిభోగంబు లనుభవించక క్రూరమృగంబులవిధంబు నరణ్యంబుల గ్రుమ్మరుట నీజన్మగుణంబో?గాక కాలగతియో? శత్రుభయరహిత శైలదేశాధినాయకుండవై మమ్మేలవే" యనుచుండ కువలయాక్షులవాక్యంబు లాకర్ణించి మోహపాశరహితుండగు గోరక్షుండు "మీతాంత్రికప్రసంగంబు లేనెఱుంగుదు. మావైభవంబులు మీరెఱుంగుదురే? భూమ్యాకాశంబులు శయనాసనపరిధానంబులై నిశ్చలయోగమార్గంబున జరించెడువారు తుచ్ఛసంపదల కాశింతురే? చాలు మీదుర్బోధ"లని బెడిదంబులచే ధిక్కరించుచు గమనోన్ముఖుండై పదచలనంబు జేయుచుండ నప్పద్మినీరాణి బాలుండగు మీననాథుని దన భుజంబులపై నెక్కించుకొని పురబాహ్యంబునకు మత్స్యేంద్రయోగివర్యుని వెంటనంటి జనుచు గోరక్షుం డెఱుంగకుండ నతిగోప్యంబుచే మత్స్యేంద్రనాథుని కక్షపాలంబున హాటకేష్టికంబులుంచి నాథుని పదకమలంబులపై కీలూడిన బొమ్మపగిది వ్రాలి మోహపరవశత్వంబుచే రోదనంబు జేయుచు గోరక్షుని కౌగిటం జేర్చి "వత్సా! మత్ప్రాణనాయకుండగు మత్స్యేంద్రుండు వృద్ధుండు భవదనుజన్ముండగు మీననాథుండు కేవలబాలుండు వీరిరువుర నెప్పగిది భోజనశయనాదుల దృప్తిపఱచెదవో నీవు ప్రాజ్ఞుండవు. సచ్ఛిష్యుండవు. నీకెఱుంగింపవలసిన ధర్మంబు లేనెఱుంగుదునే? వీరిప్రకృతిగుణంబు లతిసూక్ష్మంబులుగాన దెలియఁ బలికితి" ననుచు హాహాకారంబుచే సుగుణజలధుండగు నాథుని ముఖకమలంబు దిలకించుచు మీపునర్దర్శనం బెన్నఁడో యని నేత్రాంబువులు రాల్చుచు నేడ్చుచున్నంత గోరక్షుండు దనమనంబున కాలవ్యాపనంబుచే మత్స్యేంద్రుండు మోహాతిశయపాశబద్ధుం డౌనని వితర్కించి

గురుతరవనజంబుఁగొని వేగంబున నేఁగుచు క్షణమాత్రంబున నదృశ్యుఁడై గోచరంబు గాకున్న పద్మినీమణియగు మైనాకినీరాణి దనహస్తంబులచే వక్షస్థలంబు మొత్తుచు వత్సంబు బాసిన మొదవుచందంబున మహాధ్వని జేయుచు "హా సర్వలక్షణ లక్షణుండగు మత్స్యేంద్రుం డెట్లుగుపడు నుదారగుణసంపన్నుండగు నాథుండు శచీకాంతునికైవడి విరాజమానుండై నన్నేలి యపగతమోహుండై చనుట యాశ్చర్యంబు గాదె? చెలియలారా! దయాసముద్రుండగు నాథుండు దరిద్రునిచేతి ద్రవ్యంబునకరణి బాయుట మందభాగ్యంబుగాదె? జలధిజీవనంబులు మేఘుండు హరించినభంగి తస్కరునిచే నపహరింపఁబడిన యంధునిచేతి దండంబునాఁదిరి మత్స్యేంద్రుండు గోరక్షునిచే గొనిపోఁబడెనే? కద కాననంబున నివసించెడు నాథుండు లేమిం జేసి నాథసనంబు శోభించునే? భామలారా! నాకీ నగరంబు మూర్తిరహిత జీర్ణాలయంబుపగిది భాసమానంబగు నే నీ దుఃఖం బెట్లుసహింతు! నాథుని ప్రేమపూరిత గుణంబు లెంతని బొగడుదు! నతని శాంతశౌచసమాదిచరిత్రంబులు ఘటాంతంబుననైన మఱువ వశంబగునే? నన్ననుదినంబు సంపూర్ణ మోహంబుచే నెంతయేని లాలింపుచుండునే" యని మహింబడి మృత్తికనుగొని మస్తకంబునవైచుకొనుచుండు సమయంబున నుపరిచరవసుపుంగవుండు విమానంబు గొని నికటంబు జేర నత్తిలోత్తమ వసునాయకుని పదసరోజంబులకు నమస్కరించి నిల్చున్నతఱి వసుముఖ్యుండు "మైనాకినీ! నీకదేటితాపంబు? నీవు సురలోకవాసినివై మర్త్యులకై విలపింపఁదగునే" యనుచు కేలూని నిజవిమానంబుపై నెక్కించుకొని యశ్రుపూరితలోచనంబులు దుడుచుచు రాజభవనంబున కరుదెంచి యనేకవిధంబుల సమాధానంబు జేయుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మైనాకినీవియోగ గోరక్ష మత్స్యేంద్రచరిత్రం బేకవింశత్యధ్యాయము సంపూర్ణము.

ద్వావింశత్యధ్యాయము.

మైనాకినీరాణి సింహళద్వీపంబు ప్రవేశించుట.

వసుపుంగవుండు మైనాకినీసహితంబుగ విమానారూఢుండై తద్దేవీసుందిరంబు జేరంజని మత్స్యేంద్రనాథవియోగాకులితచిత్తయై పరిపరివిధంబుల విలపించుచున్న నప్పద్మినీమణిని సమాధానపఱచుచు "పరిదృశ్యమాన మాయాప్రపంచంబు నిత్యంబని దలంచితివే? నీ నిజ నివాసస్థలం బెయ్యది? నీ వెచ్చో జన్మించి యిందు కేకతంబున జను దెంచితివి? సురలోకవాసినివగు నీవెక్కడ? తపోధనుండగు మత్స్యేంద్రుం డెక్కడ? మీసంబంధవియోగంబులకు కారణం బేమి? సుఖదుఃఖాశ్రయ లాభాలాభ జయాజయంబులు ప్రారబ్ధవశంబున లభించు నయ్యవి స్థిరంబులయ్యెనేని ద్వంద్వస్వరూపంబు లెట్లగును? నిర్ద్వంద్వంబయ్యెనేని నీపూర్వపదభ్రష్టత్వం బేలగలిగె? గలిగిన నీరాజ్యం బెట్లు లభించె? లభించిన మత్స్యేంద్రునిసంయోగం బేవిధి ఘటించె? నెంచి చూడ నివి యన్నియు పరమేశ్వరప్రేరితంబు లని దలంపక వృథా శోకంబుచే తాపంబు నొందుట ఫలం బేమి? మత్స్యేంద్రుం డీ విచారంబుచే దనమేలుకై సుఖకరంబగు సింహాసనాధిపత్యంబు విసర్జించి విపినంబుల కేగఁదలంచెగాక నితరంబుగలదే? తద్వస్నీలాభం బీవెఱుంగవే నిది మొదలు ద్వాదశవత్సరంబున సింహళద్వీపంబున వేయికన్నులవేల్పు జన్నంబొనర్చు నాహవనంబుకై హరివిరించి శంకరులు శశిదివాకరప్రభృతి వియచ్చరులే తెంతురు. తత్సమయంబున మేఘవాహనుని యాహ్వానంబుచే గహినీ గోపీచందభర్తరీ కానీప జాలంధర చర్పట రేవణ గోరక్షు మత్స్యేంద్రనాథులు యజ్ఞసమారంభసందర్శన కుతూహలంబుచే నచ్చోటి కరుదెంచెదరు. నీ వప్పాకశాసనుని సభాస్థలంబున నీ ప్రియుండగు మత్స్యేంద్రయోగద్రుముని గనుంగొని యెద వంతకుమున్నె నీపుత్త్రుండగు మీననాథుండు నిను జేరుగావున జింతింపనేల? రయంబున విమానారూఢులమై నిజస్థానంబున కేగవలయు నిదియ శాపమోచనకాలంబు శోకింపవల" దని యోదార్చుచున్న శ్వశురునితో తిలోత్తమాదేవి "వసుచంద్రమా! శచీకాం

తుండు పావనంబు జేయునో నాథు లచ్చోటి కేతెంచెదరో నాకీ సంశయాస్పదవాక్యంబు లేల ? ద్వాదశవర్షంబులకు మత్పతిని జూపెద నని వచనం బొసంగు" మన నతం డందు కంగీకరించి యవశ్యం బనుచుండ మైనాకినీదేవి వసువరుని యనుజ్ఞచే ధైర్యాభమా యను నొక సుందరీలలామంబునకు రాజ్యపట్టాభిషేకం బొనర్చి యనేకధర్మంబులు బోధించి తన వియోగంబునకు పరితపించుచున్న పల్లవాధరల శాంతి బఱచి యాపిదప స్నుషా శ్వశురులు విమానారూఢులై సింహళద్వీపంబు జేరంజన వసుముఖ్యుం డప్పద్మినీమణిని స్వస్థానంబున నిల్పి దననిజ నివాసస్థలంబున కేగెను.

గోరక్షనాథుండు మీననాథునిప్రాణంబు లపహరించి పునరుత్థితుం జేయుట.

ఇట గోరక్షుండు యోగిపుంగవుండగు మత్స్యేంద్రనాథుని దోడ్కొని మీననాథుండు బాలుండని తలంచి భుజాగ్రంబులపై నెత్తుకొని శైల్యదేశారణ్యంబు లధిగమించి గౌడబంగాళదేశంబు సంచరించుచు సమయానుకూలంబుగ ప్రతిగ్రామంబున భిక్షాన్నంబుచే వారెకుపురను దృప్తిపఱచుచు కైలబంగాళ దేశంబు ప్రవేశించి యేగుచు మున్ను కానీఫుం డగుపడిన చూతవనంబు గని గోరక్షుండు దనడెందంబున నీవనప్రదేశం బత్యంతపుణ్యమయస్థానంబు. గోవుకై వత్సంబు విలపించువిధంబున మద్గురుమూర్తి దర్శనంబుకై నే నపరిమితతాపంబుచే శోధించుచు దిరుగుచుండ నిట కానీపనాథునిచే నెఱుంగంబడి శైల్యదేశంబున గనుంగొనన్నైతి నీస్థలంబే నాకోర్కు లీడేర్చె నని తలపోయుచు వారిపూరితలోచనుండై మీననాథుని భూమికిం దించి తత్ప్రదేశంబునకు నమస్కరించుచుండ నది గని మత్స్యేంద్రుండు "వత్సా! గోరక్షా! నీనయనంబుల నీరుగ్రమ్ముట కారణం బేమి? యట్టి విపరీతకరకార్యం బెయ్యదియో చయ్యన నెఱింగింపు" మన గోరక్షుండు గురువుకై తా ననుభవించిన సంకటంబులు స్మృతిదలంచి బాష్పంబులు రాల్చుచు గద్గదకంఠుండై కొంతవడికి శాంతింబొంది తొల్లి బదరికాశ్రమంబున తపంబు ప్రారంభించినది మొదలు శృంగమురుడీనగరప్రవేశంబువఱ కనుభవించిన యిడుములన్నియు సవిస్తరంబుగ నుడువుచు "గురుసమర్థా! నాకీ పుణ్యవనంబున జ్ఞానఘనుండగు

కానీఫనాథునిచే నెఱుంగఁబడి యుష్మద్దర్శనంబు లభించె. సమస్తకామి తార్థ ఫలప్రదాయకంబగు వనంబు సురభూజవనంబు గాదే! భవద్వి యోగదుఃఖపాశంబుల విముక్తపఱచిన పుణ్యస్థలం" బని పులకాంకిత శరీరుండగు గోరక్షుని గురుభక్తి దృఢత్వంబునకు సంతసిల్లి హృద యంబున కదముకొని నేత్రోదకంబులు నిజహస్తంబులచే దుడిచి సమాధానపఱచి ప్రయాణంబుసల్పుచుండ గోరక్షుండు మార్గమధ్యం బున జాలంధరనాథ గోపీచందచరిత్రంబు దెలుపుచు "గురునాథా! యుష్మద్గురుసమర్థుండగు దత్తాత్రేయప్రియశిష్యుండై తపోయోగంబు చే నిష్కళంకంబున విరాజమానుండగు జాలంధరనాథుని హేలాపట్ట ణాధిపతియగు గోపీచందుండు క్రూరమతిచే నొకమహాకూపంబున బడ వైచి యశ్వవిష్ఠంబుచే గప్పె"నని సవిస్తరంబుగ దేటపఱచ మత్స్యేంద్ర నాథుండు క్షోభించి "యాభ్రష్టాత్ముండగు నృపుని తత్క్షణంబున శిక్షిం చెదను. తత్పురంబు భస్మంబొనర్చెద" ననుచు మహాక్రోధంబుచే శీఘ్ర గమనంబున హేలాపట్టణసమీపంబు జేరంజని యొకతెరవరితో నీవృ త్తాంతంబు విచారించిన నతండు "జాలంధరుండు కూపంబున బడియుం డుట నిక్కంబు. పిదప కానీఫనాథునిచే విముక్తుండై బుడమిాశున కను గ్రహం బొసంగ భూనాయకుం డమరుండై గురుమంత్రదీక్షాతత్పరత్వం బున తపంబుకై బదరికాశ్రమంబునకు వెడలె ననంతరంబున తపోధ నుండగు జాలంధరుండు గోపీచందతనూభవుండగు ముక్తచందునకు రాజ్యపట్టాభిషేకం బొనర్చి యచ్చోచ్ఛన్నాసంబులు గడపి పనివినియె" నని గతచరిత్రంబెల్ల వెల్లడిజేసినంత ఘనవృష్టిచే ననలంబు జల్లారినట్లు తాపత్రయపీడితుండు గురుమంత్రౌషధంబుచే ముక్తుండై నచందంబున మత్స్యేంద్రుండు శాంతింబొంది "రాజ్యభారంబు బాలుండగు ముక్తచం దుం డెవ్విధంబున భరించు. విచక్షణమతులై పరిపాలించు ప్రాజ్ఞులెవ" రని యడుగనతండు "అయ్యా! సుధీమణియగు మైనావతీమహారాణియో గద్రుముండగు జాలంధరనాథునిచే దనతనయున కమరత్వం బిప్పించి పరిపూర్ణజ్ఞానోదయంబుచే ముక్తచందుని పురస్సరంబుగ ప్రజాసంరక్ష ణం బొనర్చుచుండు" నని విన్నవింప మత్స్యేంద్రయోగిపుంగవుండు దనచిత్తంబున నయ్యుత్తమగుణ సమన్వితయగు మైనావతీరాణినిజూడఁ దలంచి నగరద్వారనికటంబుజేరి ద్వారికులతో "జాలంధరనాథ

సహోదరుండగు మత్స్యేంద్రనాథుం డేతెంచె నని మహారాణికి దెలియబలుకు” మన వార లతివేగంబున జని యమ్మహారాణితో “తల్లీ! పురద్వారసమీపంబున నొకమహాపురుషుండు నిరుపమాన తేజః పుంజుండై జ్ఞానవైరాగ్యనిపుణుండగు సచ్ఛిష్యుని వెంటగొని తొగ మగని జిగిమగుడించు నగుమొగముగల జిఱుతని నమేతుండై జాలం ధరనాథానుజన్ముండ నని యేతెంచె నత్తపోధూర్జటి శైలీ సింగీ కం థాది నాథ పంథీ చిహ్నంబులు ధరియించి లీలావినోదంబుచే మెలంగు వేల్పుదొర యనందగి దనరాక మీకెఱింగింపు మన నరుదెంచితి” మని పలుక నద్దేవి కుతుకంబుచే మంత్రిపురోహిత సహితయై యమ్మ హామహు నెదుర్కొనదలంచి నగరద్వారంబు జేరంజని మత్స్యేంద్ర గోరక్షుల చరణసరోజంబులకు వందన మాచరించి మహావైభవంబుచే నాందోళికత్రయంబున మూర్తిత్రయంబు నలంకరించి నిజభవనంబు నకు గొనితెచ్చి రత్నమయసింహాసనంబులపై శోభిల్లంజేసి మత్స్యేంద్ర యోగిశ్రేష్ఠుని పురోభాగంబున కరంబులు మోడ్చి “యుష్మదాగమ నంబుచే మద్భవనంబు పవిత్రంబయ్యె. తృషాతురునకు నిర్మలమందాకి నీజలంబులు లభించినట్లు దరిద్రునిపై ధనదుండు కరుణించినవిధంబు చింతాసమేతునకు చింతామణి ప్రాప్తంబైనచందంబు మృత్యుభయ పీడితునకు పీయూషంబు ఘటించినపగిది న న్నుద్ధరించుటకై దయచే సితిరే తమజగత్ప్రకాశనామరూపంబు లనుగ్రహింపుడు” రని కొని యాడుచుండ నత్తాపసోత్తముండు “తల్లీ! నే నుపరిచరవసుకుమారుం డనై త్రిలోకజనవందితుండగు నాత్రేయుని పదకంజంబు లాశ్ర యింప నమ్మహాఘనుండు సదయహృదయుండై మచ్ఛిరంబున దనవరద కరంబుంచి మంత్రమంత్రార్థ రహస్యోపదేశంబుచే నన్ను బ్రకాశింపఁజేసి యాపిదప జాలంధరనాథున కనుగ్రహం బొసఁగె. తత్కారణంబున జాలం ధరనాథుండు మద్గురుబంధుండై తపఃప్రభావంబుచే దేజరిల్లి నానాదే శంబులు గ్రుమ్మరుచు నిం దేతెంచియుండ భవత్సుతునిచే తురంగవిష్ఠం బున గప్పంబడె నని యాలకించి ఆఘోరకృత్యంబునకు భూరమణుని శాసించుటకై క్రోధానలసమన్విత హృదయంబుచే నిం దేతెంచుచు నేతత్పట్టణవాసునిచే మార్గమధ్యంబున జాలంధరుండు ప్రసన్నుండై గోపీచందున కనుగ్రహం బొసంగిన దెఱింగి యపగతకోపుండనైతి

నోమైనావతీ! నీకతంబున భవత్పుత్రుం డమరత్వంబు నొందె. నీవు ధన్యాత్మురాలవైతివి. నీజ్ఞానపరిపూర్ణత్వంబు బొగడఁదరంబే? భగీరథుండు గంగాప్రవాహంబుచే వంశపావనం బొనర్చినక్రైవడి వినతాదాస్యత్వంబు ఖగేంద్రుం డెడబాపినకరణి నీకతంబున నీవంశంబు పావనంబయ్యె" నని శ్లాఘించుచున్న నాథుని చరణంబులపై మైనావతీరాణి ఫాలంబు మోపి "యోగసమర్థా! భవద్దయారసపూరిత దృక్ప్రసారంబుచే పామరజనపాపభూధరంబులు భస్మంబగుట చోద్యంబే? నిమిషంబున లోహంపు రూపుమాపి రుక్మంబొనర్చిన పరుసంబు భవాదృశతపోఘనుల పాదరజంబున కెనయగునె? సంకల్పసిద్ధి యొనర్చెడు కల్పమహీరుహం బకలంకదయాగుణసమన్విత సత్పురుష మనోసంకల్పంబుల బోలునే? పారావార నీరక్షారం బపహరించి స్వచ్ఛతరజీవనంబు లొసంగెడు ధారాధరంబులు యుష్మద్వాక్సుధారసధారల సరియగునే? మీయనుగ్రహంబే బ్రహ్మాండోద్ధారకతారకం" బని పొగడుచు భక్తిరసభరిత భక్ష్యభోజ్యంబులచే దృప్తిపఱచుచుండ నాథుండా సులోచనరాణి సదనంబున దినత్రయంబు గడపి యాశీర్వదించి యచ్చోటుబాసి గోరక్ష మీననాథసమేతుండై ప్రయాణంబు జేయుచుండ నస్స్మహారాణి సచివాది సకలజనపరివృతయై క్రోశంబు వెంటజని యోగిసార్వభౌముని చరణంబులకు ప్రణమిల్లి యనుజ్ఞగొని వసుపుత్రుని సుగుణంబు లుగ్గడించుచు నిజనివాసంబుల కరిగిరి. మత్స్యేంద్ర గోరక్ష మీననాథులు నానాగ్రామంబులు దిరుగుచు జగన్నాథంబుజేరంజని జలధిస్నానంబు లాడి జగదీశ్వరుని మందిరంబున త్రిరాత్రంబులు గడపి యాపై స్వేచ్ఛావిహారంబుచే సంచరించుచు సౌరాష్ట్రనగరంబు ప్రవేశించి నివసించి యుండిరి. గోరక్షుండు నిత్యనియమ ప్రకారంబున భిక్షాన్నంబుకై నగరంబున గ్రుమ్మరి యుట మీననాథుండు శౌచంబు జేయుచుండుసమయంబున కక్షపాలభారంబుచే బడలికజెంది యేతెంచె నప్పుడా మత్స్యేంద్రనాథుండు "గోరక్షా! మీననాథుని శౌచానంతరంబున ప్రక్షాళనం బొనర్చి తోడితె" మ్మని యాజ్ఞాపించెను. గోరక్షుండా భిక్షాన్నకక్షపాల నొకచో నుంచి కరపాండాంగలిప్తమలుండగు జ్ఞానరహిత మీననాథుని నికటంబుజేరి యుపాధికరబాలుని గనుంగొని దనమునంబున గతపతులకు పరిమళద్రవ్యంబులు జన్మాంధునకు భూరక్ష

ణంబు భయగ్రస్తునకు తీక్ష్ణశస్త్రంబులు ఉన్మత్తునకు ధనాగారంబులు వ్యర్థంబులు గావే? తద్వద్విషయభోగరహిత ప్రవ్రజితులకీ మహాబాధకర మాయాలంపటం బనర్థదాయకం బని నిశ్చయించి మీననాథుని దనకరంబులచే నెత్తినంత మత్స్యేంద్రుండు మలమయశరీరుండగు బాలుని విలోకించి "గోరక్షా! కుఱ్ఱని దేహంబు నదీజలంబుల శుభ్రపఱచి తె" మ్మని యాజ్ఞాపించెను గోరక్షుం డవశ్యంబని నదీప్రవాహసమీపంబున కబ్బాలుని గొనిపోయి బహిరంతర్మలపరిశుద్ధికై చిఱుతని పాదంబులు దనకేలంబట్టి నికటస్థఘట్టంబున నుతుకుచు ప్రాణంబులు వాపి రుధిరాస్థిమాంసంబులచే ఝషమకరప్రముఖాఖిలజలచరంబుల దృప్తిపఱచి నిర్మలోదకంబుల త్వఙ్మలినంబు విడజేసి యాంతిత్తిని హస్తంబుల ధరియించి మత్స్యేంద్రఘనుండు శిబిరంబున లేనిసమయంబునం జని యయ్యాది యుష్ణాంశుకిరణరశ్మి కెదురుగా నారవేసె నంత మత్స్యేంద్రమునిపుంగవుం డేతెంచి సుఖాసీనుండై "గోరక్షా! మీననాథుండేల గనుపడం" డని విచారింప గోరక్షుండు "గురుసమర్థా! భవదాజ్ఞాధారకుండనై మీననాథుని బహిరంతర్మలశుద్ధి యొనర్చి దివాకరకిరణరశ్మి నెండుటకై వలీకంబుపై బఱవైచితి" నన మత్స్యేంద్రుండు విస్మయంబుచే "గోరక్షా! విపరీతార్థవాక్యంబు లేల పలికెదవు? నిజంబు దెలుపు" మన భాస్కరనందనుండు "సమర్థా! నే ననృతంబు లాడుదునే? సంశయంబు గలదేని బహిరంగణంబున కేతెంచి విలోకింపు" డన నాథుం డదరిపడి కడువేగంబునం జని రుధిరాస్థిమాంసరహిత నిర్మలచర్మంబు గనుంగొని మూర్ఛాగతశరీరుండై ధరణి గూలి హాహాకారంబు జేయుచు మహాశోకంబుచే వక్షస్థలతాడనం బొనర్చుకొనుచు మృత్తికంగొని వదనంబుపై జల్లుకొనుచు "తనయా! సుందరకాయా!" యని నిర్జీవచర్మంబును హృదయంబున కదుముకొని "నే నత్యంతపాపినై నీజననీవియోగంబొనర్చి యిందుకై దోడితెచ్చితినే? దుష్టుండను. భ్రష్టుండను. హీనభాగ్యుండను. పుత్రఘాతకుండ" నని నిందించుకొనుచు "వత్సా! న న్నెట్లు బాసితివో? నీతల్లియగు మైనాకినీరాణి కేమని దెల్పుదురా? నీమోహనాకారం బేవిధి మఱతురా? మారుతాత్మజ భుభుఃకారనినదంబుచే జీవించ లేవని దలంచి గొనితెచ్చి గోరక్షనామకృతాంతున కొసంగితిరా.

హాపుత్రా! నీబాలక్రీడావినోదంబులు నీమృదుమధుర సంభాషణంబులు దలంచి దుఃఖభారం బెట్లు సహింతురా? నీరూపంబు నీగుణంబు నీతళుకు నీపలుకు విశేషంబులు దలంప వశంబౌనే? కుమారా! భోజనాసనశయనాది సమయంబుల నన్విడనాడకుంటివిరా పుత్రా! మీననాథా! మీననాథా!" యని యపరిమితదుఃఖంబుచే శోకించుచు బాలునిగుణంబులుగ్గడించి యపారమోహావేశంబున బుకమింబడుచు లేచుచుండ గోరక్షుండు దనడెందంబున గురునాథుని చిత్తవిభ్రాంతి దొలంగ లేదని తలంచి పురోభాగంబున కేతెంచి "సమర్థా! మీ రెవరు? మీ కుమారు లెవరు? మీ రెవరికై రోదనంబు జేసెదరు? గతించినవా రెవరు? మృత్యు వెవరికి గలదు? శాశ్వతరహిత శరీరంబు హరించెనో సర్వద్రష్టయగు శుద్ధచైతన్యుండు మృతించెనో? మీననాథనామం బెవరిచే నెవరికి నేవిధంబున గలిగెనో మీననాథాభిధానాధిపతి శాశ్వతుండో కాడో యోచింపుము. శాశ్వతుం డయ్యెనేని నిఖిలశస్త్రాస్త్రఘాతంబులచేనైన నశించునే? వహ్నిజలవాతంబులచే మ్రందునే" యని బోధించువాక్యంబుల కామహోఘునుండు దుఃఖభారాతిశయంబుచే శాంతిం బొందక పుత్రా పుత్రా! యని యాక్రందించుచుండ గోరక్షుండు గురువర్యుని తాపోపశమనంబు జేయుటకై సంజీవినీమంత్రంబు జపియించి భస్మంబు గొని చర్మంబుపై బడవేసి లేలెమ్మని పలుక మీననాథుండు నిద్రితుండు మేల్కాంచినవిధంబున లేచి మత్స్యేంద్రనాథుని గ్రీవాలింగనంబు సల్పుచుండ నయ్యోగీంద్రుం డత్యంతానందంబుచే "వత్సా! నన్నెడబాసి యెందేగితి" వని ముఖచుంబనం బొనర్చి ముదంబున నాదినంబు గడపి పరదినోదయకాలంబున సుశిష్యసహితుండై ప్రయాణంబు జేయుచుండ మార్గమధ్యంబున గోరక్షుండు మత్స్యేంద్రనాథు నుద్దేశించి "గురుఘనా! నిర్జీవకళేబరంబుల సజీవులం జేయు సమర్థుండవై నిరుపమాన ప్రతాపంబు గలిగి పుత్రమరణతాపంబుచే శోకించుట యాశ్చర్యంబు గాదే? సంజీవినీమంత్రయోగంబుచే పునస్సృష్టి యొనర్చు సమర్థుండవై మీననాథుండు గతించెనని రోదనంబు జేయుట తగునే? సకలజన చింతాహరణంబగు చింతామణి నిజచింత బాయనిచందంబు గాదే" యని పలుకుచున్న గోరక్షునితో మత్స్యేంద్రుండు "నీ వేకతం

బున బాలుని బరిమార్చితి” వని యడుగ నద్దినకరతనయుండు “సమర్థా! యుష్మన్మోహభావార్థంబులు బరీక్షించుటకై నాయొనర్చినపని యింతియగాక నొండుగలదే? వైరాగ్యశీలురై మాయారూపంబును లంఘించి సచ్చిదానందస్వరూపంబున బ్రకాశించుచు దారాపుత్త్రాదిమోహభ్రాంతులాట వేడబంబుగాదే” యన మత్స్యేంద్రనాథుండు “వత్సా! నీవు మచ్ఛిష్యుండవై జ్ఞానపూర్ణత్వంబున దేజరిల్లెద వని నిన్ను బరీక్షించుటకు శోకించితిని. కామక్రోధాది షట్కంబు మాయామయప్రపంచంబునకు ముఖ్యస్థానంబులు గావున నీయందట్టి మోహలేశంబు గలదో నిత్యానిత్యవస్తువివేకజ్ఞానంబుచే శుద్ధనిర్గుణపరబ్రహ్మస్వరూపుండవై వెలింగెదవో లేదో యని యూహించి యిక్కార్యంబు దలపెట్టితిని పుత్త్రా! వాయసరూపంబు వదలి బిసభుక్తి రూపంబుచే క్షీరోదకతుల్యంబులగు విద్యావిద్యల మేలెఱింగితివి. ధన్యుండవైతి” వని శ్లాఘించుచున్న గురువరుని పదపద్మంబులకు గోరక్షుండు ప్రణమిల్లి “నాథా! భవదనుగ్రహ మహిమాతిశయకారణంబుగాదే” యని ప్రత్యుత్తరం బొసంగి జ్ఞానమార్గ ప్రదర్శక సంభాషణంబులచే సమయంబు గడపుచు నచ్చటచ్చట నివసించుచు స్వేచ్ఛావిహారంబున జనుచుండిరి.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్ర గోరక్షులు శైల్యదేశంబు బరిత్యజించి యేగుట ద్వావింశాధ్యాయము సంపూర్ణము.

త్రయోవింశాధ్యాయము

{ గోరక్షుండు స్వర్ణేష్టికల పాఱవైచి యొకకొండను స్వర్ణంబుగా నొనర్చి దేవతలను వింద్రొనర్చుట. }

మత్స్యేంద్ర గోరక్ష మీననాథు లనేకదేశంబులు సంచరించుచు త్రిలింగదేశప్రాంతంబున గోదావరీ సముద్ర సంగమ ప్రదేశంబున స్నానంబులాడి తత్తటం బాశ్రయించి పశ్చిమదిశ కేగి వైద్యనాథేశ్వరుని సేవించి దక్షిణమార్గంబున వాల్మీకస్థానంబగు గర్భగిరి జేరంజని యక్కొండలబారు మధ్యప్రదేశంబున హరి ఖడ్గ శల్య భల్లూక

ద్విరద శార్దూలాది క్రూరమృగమయంబై విచిత్రతర ప్రఫుల్ల పుష్ప స్తబక విరాజిత బహువిధ లతానికుంజ వితానంబు లమ్మహీదేవి వినూత్నకంచుకంబన దాల్చి యంబరచుంబితోత్తుంగ శాఖాసమన్విత మాలూర బదరీ వకుళ కపిత్థామ్ర మందార జంబీర బంధూకప్రముఖ తరురాజంబు లన్యపుంసమాలోకనం బప్రశస్తంబని వాసరమణి కిరణ ప్రసారభయంబుచే ధరించిన వస్త్రంబో యననొప్పిన సాంద్రచ్ఛాయాచ్ఛాదిత భయంకరకాంతారంబు బొడగని యేమహామహుని దర్పంబునకు తమోభంజనుండు కంపించునో యేతపోధనుని తపఃప్రభావంబునకు మేరుమందరంబులు కందుకతుల్యంబులై గనుపించునో యట్టి పరిపూర్ణ యోగిశ్రేష్ఠుండగు మత్స్యేంద్రుండు గోరక్షుని బరీక్షించుటకై కక్షపాలాంతర స్వర్ణేష్టికలనిమిత్తంబు మదిం దలంచి "గోరక్షా! ఇమ్మహావిపినంబు ఘోరతర గిరికుహర పరివృతమై హరిదశ్వశతాంగ నిరోధకర మహీరుహజాలంబుచే భయావహంబై గాన్పించు నియ్యది తస్కరులకు ముఖ్యస్థానంబు గాబోలును నాహృదయంబు తస్కరులకై చలించు" నని వచింప నగ్గోరక్షుండు దనహృదయంబున మద్గురునాథున కీ భయంబేలగలిగె? దిగంబరులకు తస్కరులబాధ లెట్లు ఘటించు? విత్తం బేమైన గలదని నిశ్చయించి విచారించుట యుచితంబుగాదు. సమయంబు నిరీక్షించి భ్రాంతి దొలంగించవలె నని దలంచి ప్రత్యుత్తరం బొసంగక మౌనంబుచే గమనంబు జేయుచుండ నంతకంతకయ్యరణ్యం బత్యంతగాఢాంధకారమయంబై గనుబడుచుండ నప్పుడప్పుడాగోరక్షునితో మత్స్యేంద్రుండు 'వత్సా' తస్కరభయంబు గలదా' యని హెచ్చరించినను శిష్యుండు నిరుత్తరుండై జనుచుండ నొకానొక ప్రదేశంబున ప్రశస్తంబగు తటాకంబుగని మత్స్యేంద్రుండు "గోరక్షా! నాకక్షపాలంబు గొని భద్రంబున జనుచుండుము. నే నీ ప్రదేశంబున ముఖప్రక్షాళనం బొనర్చుకొని శీఘ్రంబున నేతెంచెద" నన నవశ్యంబని మీననాథుని భుజాగ్రంబులపై నిడుకొని కక్షపాలం గొని కక్షంబున ధరించి భారంబుచే హిరణ్యంబని లక్షించి కొంతద వ్వరిగి భయదాయకం బీ సువర్ణంబని యయ్యది యొకగర్తంబున బాఱవైచి తత్సమభారపాషాణం బాకక్షపాలంబుననుంచి తీవ్రగమనంబున జనుచుండ నంత మత్స్యేంద్రుండు మహావేగంబుచే వెంట

నంటి యరుదెంచుచుండినను గోరక్షుండు గురువుకై నిలువక జని చని యొకనిర్మలోదకపూరిత సరోవర నికటంబుజేరి తత్తటంబున మీననాథుని డించి కక్షపాల నచ్చటనుంచి యాత్తోయంబుల స్నానంబులాడి దననిత్యకర్మంబులు దీర్చుకొని పిదప మీననాథునకు స్నానంబు లాడించి మహాసనంబున నుపవేశించి యున్నసమయంబున మత్స్యేంద్రయోగివర్యుం డేతెంచి యుభయులను మందలించుచు తజ్జీవనంబుల గ్రుంకులిడి నిత్యనియమంబులు దీర్చుకొని మార్గాయాస బడలికచే విశ్రమించి "గోరక్షా! మహాకర్కశంబగు కాననం బధిగమించితి మికముందెవ్విధంబగు ఘోరాటవిగలదో భయసహితమో రహితమో" యని ప్రశ్నింప నతండు "గురుసమర్థా! మనభయం బెడబాసి పోయె నిక నెట్టియరణ్యంబైననేమి విత్తరహితుల కేటిభయం" బని ప్రతి బలుకుచుండ మత్స్యేంద్రుండు "పుత్రా! మత్కక్షపాలంబున పద్మినీదత్త హాటకేష్టికంబులు గలవు. తత్కారణంబుచే నిక్కాననంబున భయంబుగలదా యని విచారించితి" నన శాశ్వతరహితంబగు కనకంబు సర్వసంగపరిత్యాగుల కేల" నని గోరక్షుండు గురువర్యుని హస్తంబు దనకరంబుచే ధరించి గర్భాద్రిపై కేగి యచ్చట నొక కొంతనడవు విశ్రమించి గమనోన్ముఖులై తమతమ పరిధానంబులు గొనుచుండ మత్స్యేంద్రుండు దనకక్షపాలను ధరించుటకై హస్తంబుల బూని సంశయమనంబుచే గనుంగొని యందు స్వర్ణంబు గానక తత్సమభారంబగు పాషాణంబులు లక్షించి హాహాకారరవంబు జేయుచు "గోరక్షా! నావిత్తం బపహరించుట న్యాయంబగునటె? భారంబని దలంపక మహాకష్టంబుచే నింతవఱ కీడ్చి తెచ్చిన హాటకంబునకు చేటొనగూర్చితివే? నీకింతటితో భారంబై దోచెనటరా? దిట్టతనంబుచే నెందు బడవైచితివో దెలుపవేరా అయ్యో నాభాగ్యం బేమని దలపోయుదు. దైవం బలిగెనో కాలంబు మారెనో" యని రోదనంబు జేయుచు నలుదిశల పరిశోధించుచు నొక్కచో నిలువక మిక్కుటంబగు శోకభారంబుచే బుడమిం బడుచు కరంబులు శిరంబుపై ధరించి కొల్లబోయితి నని పెల్లేడ్చుచు పిశాచంబుభంగి భ్రమణంబు జేయుచు గోరక్షుని సమీపంబున కేతెంచి "యారా! గోరక్షా! నాధనం బీవేని నిను విడతునే" యని దుఃఖంబున నుడువు

ముండ గోరక్షుండు మత్స్యేంద్రయోగిపుంగవుని హస్తకమలంబు
దన కేలంబూని యప్పర్వతాగ్రంబునకు దోడ్కొని చని సిద్ధయోగ
మంత్రాధిదైవతను ధ్యానించి లఘుశంక యొనర్చినంత నమ్మహీధరంబు
కనకమయంబై ప్రకాశించుచుండె నప్పు డయ్యినతనయుండు "గురు
నాథా! భవదీప్సిత చామీకరంబు పర్వతాకారంబై విలసిల్లెను. వల
యునంత గొను" మని మత్స్యేంద్రుని చరణంబులకు బ్రణమిల్లి విన
యపూర్వకంబుగ బలుకుచుండ నత్తాపసోత్తముండు మోదంబుచే
గోరక్షున కాలింగనం బొసంగి "వత్సా! ధన్యుండవు. ప్రాజ్ఞుండవు.
సకలమంత్రసిద్ధుండవై దేజరిల్లితివి. పరుసంబు త్యజించి లోహంబున
కాశించినకైవడి గృహస్థిత సురధేనుం దిరస్కరించి దుగ్ధంబులకై
పరుల యాచించినవిధంబు రాజహంసను బోనాడి వాయసంబును
గోరినట్లు నవనిధిస్వరూపుండగు నీయట్టి సచ్ఛిష్యుండు గలుగ తుచ్ఛ
కాంచనంబున కపేక్షింతునే" యనుచుండ దినేశనందనుండు "సమర్థా!
భవత్కక్షపాలంబున కనకేష్టికంబులు భద్రపఱచి గొని తెచ్చుట
కారణంబేమి దయజేయుదు" రని విచారింప నమ్మహామహుండు
"గోరక్షా! మనస్వదేశంబున కేగి యీసువర్ణంబుచే సాధుసజ్జనులకు
విందొనర్చి తృప్తిపఱచవలయునను బుద్ధిచే గొని తెచ్చితి దప్ప నన్యం
బేమిలే" దన గోరక్షుండు "గురువర్యా! యుష్మదభిలషితకార్యం
బొనర్చెద గనుంగొను" మని మత్స్యేంద్రు నచ్చోట నిలిపి గంధర్వా
స్త్రంబు జపియించి భస్మయోగంబున నాకంబునకు బ్రయోగింప
నయ్యస్త్రమహిమాతిశయంబుచే చిత్రసేనగంధర్వుం డేకశతగంధర్వ
పరివృతుండై చనుదెంచి తపోఘనునకు నమస్కరించి ముకుళితకరపు
టుండై "భవదీప్సితంబులు దెలుపు"మని యడుగ గోరక్షుండు గంధర్వ
పతితో "మర్త్యలోకవాసులగు యతిజపితపస్విప్రముఖ సాధుజనస
మూహంబును సురలోకనివాసులగు గరుడ గంధర్వ కిన్నర కింపురుష
యక్ష రాక్షసాఖిల దేవలోకంబుచే నేకీభవించి యమితోత్సాహం
బున నుత్సవం బొనర్పవలయునను కుతూహలంబు గలదు. సమ
కూర్పు" మని యాజ్ఞాపింప చిత్రసేనుం డవశ్యంబని దనపరివారంబు
నకు సెలవొసంగి దశదిశల కనిపి యనేక జ్ఞానఘనుల తపోఘనుల
సత్పురుషశిఖామణులను గుప్తవేష ప్రకటవేష ధరులగు హంస పరమ

హంసాది నిఖిలయతీంద్రులను శుక శౌనక యాజ్ఞవల్క్య వసిష్ఠ వామదేవ కపిల వాల్మీక వ్యాస పరాశర నారద ప్రముఖ మహాఋషిగణంబును జాలంధర కానీపాది నాథపంథీవర్గంబును సురలోకస్థ గరుడ గంధర్వ కిన్నరాది నిర్జరసంఘంబును రప్పింప నష్టవసుసమన్విత యుపరిచరవసుపుంగవుం డేతెంచి సుతుండగు మత్స్యేంద్రుని కుశలప్రశ్నోత్తరంబుల సంభాషించుచుండు సమయంబున హరిహరబ్రహ్మేంద్రప్రముఖు లేతెంచి యెడనెడ నివసించియుండ గోరక్షుండు మత్స్యేంద్రయోగీంద్రమునితో "నాథా! తిలోత్తమదత్తహేమంబుచే నిమ్మహాలోకంబును దృప్తిపఱచెదవో" యన గురుసమర్థుండు "ప్రతాపయుతముఖ్యశిష్యుండవు గలుగ కనకంబేల" నని దరహాసితవదనుండై నుడువుచుండ నుష్ణాంశుతనూభవుండు గురుచరణాంభోజంబులకు నమస్కరించి యణిమా గరిమా ద్యష్టసిద్ధులను దనమంత్రప్రభావంబుచే నావాహనం బొనర్ప నమ్మానినీమణులు ప్రత్యక్షంబై నాథుని సముఖంబున నిల్చి "యుష్మత్కార్యం బెయ్యది దయచేయు" మని సవినయంబుగ విచారింప మిత్రపుత్రుండు "షడ్రసోపేత భోజనంబులచే సురవరమునిగణంబును దృప్తిపఱచు" మన నమ్మగువ లక్ష్యంబని రయంబున రసభరిత బహువిధ పక్వాన్నంబులు దమకుశలత్వంబుచే పర్వతతుల్యంబులగు రాసులేర్పఱచి క్షణమాత్రంబున మనోజ్ఞతరారామ సప్తకంబు గల్పించి ముఖ్యపరిచారికలచే స్థలశుద్ధి యొనర్చి కుమారీ నందా ధనదా మంగళాది జలదేవత లేకముఖంబున చాతుర్యధుర్యలై భోజనంబు లిడుచుండ గంధర్వసమూహంబు సురనరోత్తముల నాహ్వానం బొనర్చుచుండ భైరవాష్టకంబు దిశాష్టకంబున యుపవేశించి న్యూనాధిక్యంబులు పరిశీలింపుచుండ త్రిలోకపావనియగు వియద్గంగాదేవి నిర్మలోదకంబు లిడుచుండ నుపరిచరవసునాయకుండు దక్షిణలుగొని నిలుచుండ గంధర్వాధిపుండగు చిత్రసేనుండు తాంబూలంబులు బూని సుస్థిరుండై యుండ సుమారమణుండు సర్వదేవతానివహసమేతుండై విందారగింపుచుండ రంభోర్వశీప్రముఖ గణికారత్నంబులు మృదుమధురస్వరంబులతో గాయనం బొనర్చుచు విపంచీనాదంబుల సొంపు జూపుచుండ నతులితవైభవాన్వితంబగు సమారంభంబు గని మత్స్యేంద్రుండు మనోయోగంబున సకలసమూహంబు

నకు ప్రదక్షిణం బొనర్చి యానందాంబుధి నోలలాడుచుండుతఱి గోరక్షుండు సంజీవినీమంత్ర ప్రభావ సంజనిత గహినీనాథుని మదిదలంచి గురుసముఖుండగు మత్స్యేంద్రుని సన్నిధి కేతెంచి "నాథా! మృత్పుత్రికాజనితుండగు గహినీనాథుండు రాడయ్యె. గనుకఁగొనవలయు నను యపేక్ష కల" నన మత్స్యేంద్రుండు హర్షించి చిత్రసేనునిచే నొక శుభపత్రిక మధువిప్రునిపేర వ్రాయించి సులోచనగంధర్వునిచే కనకగిరి నగరంబున కనుప నాసులోచనుం డతివేగంబున తత్పురంబున కేతెంచి మధువిప్రునకు శుభపత్రిక నొసంగి సకలవృత్తాంతంబు దేటపఱుప నతం డా శుభలేఖనంబున సపరివారులై గహినీనాథుని దోడ్కొని రయంబున రమ్మనుట జదువుకొని పరమానందంబుచే త్వరితంబున ప్రయాణంబు గావించి గర్భగిరి జేరంజని బాలుండగు గహినీనాథుని మత్స్యేంద్రయోగిముఖ్యుని చరణకంజంబుల కర్పించెను. యోగద్రుముం డబ్బాలుండగు గహినీనాథుని నిజాంకంబుపై నిడుకొని మూర్ధంబు మునుకుచు ప్రేమపూరిత హృదయుండై లాలనంబు జేయుచుండ గిరిజాధవుం డబ్బాలుండు కరభంజననారాయణుండు గహినీనాథనామంబుచే జగద్విఖ్యాతి బొందు నీ విమ్మహామహున కనుగ్రహం బొసఁగి పరిపూర్ణసచ్చిదానంద స్వరూపంబుచే ప్రకాశింపఁజేయుము. జగదుద్ధారనిమిత్తంబై ముందు నే నవతరించి యాగహినీనాథునిచే ననుగ్రహంబు బడయుదు నని వాక్రుచ్చియుండ నవ్వసుతనయుండు గోరక్షునితో "నీవరదకరం బిబ్బాలుని శిరంబుపై నుంచు" మని యాజ్ఞాపించెను. గోరక్షుండు ముదంబుచే మృజ్జనిత గహినీనాథుని మస్తకంబున జగత్పవిత్రకరహస్తం బుంచి నిశ్చల నిర్గుణ పరబ్రహ్మస్వరూపానుసంధానంబుచే నిరస్తమోహుం జేసెను. పిదప మత్స్యేంద్రనాథుండు హరి విరించి శంకర ప్రభృత్యఖిల సురగణంబుచే నేకమాసం బచ్చోట నుత్సవంబు గడపుచుండ గోరక్షుండు హరసఖుని బిలచి "బృందారకసంఘంబున కీ స్వర్ణమయనగంబుచే నిఖిలభూషణంబు లమర్చి యొసంగు" మన నద్ధనదుం "డీ దేల? మద్భవనంబున గల వస్తుజాలంబులు గొని తెచ్చి యొసంగెద" నని తత్క్షణంబ దివ్యతరమణిచిత్రిత భూషణాంబరంబులు దెప్పించి యోగ్యానుసారంబుగ విబుధలోకంబునకు కానుక లొసంగి యథావిధి దక్షిణలచే యాచకుల దృప్తిపఱచి వార

లమ్మత్స్యోదరసంభవునిచే ననుజ్ఞాతులై నిజనికేతనంబుల కేగుచుండ మత్స్యేంద్రుండు బాలుండగు మీననాథుని సంరక్షించుటకై యుపరిచరవసుపుంగవునిచే సింహళద్వీపవాసిని యగు పద్మినీమణిం జేరంజనంపిన నవ్వసునాయకుం డబ్బాలుని దోడ్కొని సింహళద్వీపంబు జేరి మైనాకినీదేవికి మత్స్యేంద్రయోగిముఖ్యుని చరిత్రం బంతయు దేటపఱచి మీననాథు నొసంగెను. పద్మినీమణి మత్స్యేంద్రనాథ వియోగాకులితచిత్తయై పరితపించుచుండ వసుపుంగవుం డుచితప్రకారంబుల సమాధానం బొనర్చి నిజనివాసంబు జేరంజన మైనాకినీదేవి మీననాథుని ముఖకమలంబు చుంబించుచు "పుత్రా! భవజ్జనకుని విడనాడి యిందే తెంచితివే" యని యానందబాష్పంబులు రాల్చుచుండెను.

మత్స్యేంద్రనాథుండు గహినీనాథునకు మంత్రార్థంబు లుపదేశించుట

ఇట యోగద్రుముండగు మత్స్యేంద్రుం డగ్గిరిపై కపాలభృత్సహితుండై గహినీనాథున కనేకరహస్యోపదేశంబులు జేయుచుండ ధనదుం డదృశ్యాస్త్రయోగంబుచే స్వర్ణమయపర్వతంబును నిజనివాసంబునకు గొనిపోయెను. తదాది గర్భగిరిగ్రామంబున వృషభధ్వజుండు వృద్ధదేవుండని ప్రఖ్యాతి గాంచెను. తద్గిరిపశ్చిమభాగంబున కానీపనాథుండు మఢీ యను జనపదంబున శిష్యజనకదంబసహితుండై నివసించు దక్షిణభాగంబున యోగద్రుముండగు మత్స్యేంద్రుండు ప్రాగ్భాగంబున సర్వగుణశిరోమణి యగు జాలంధరనాథుండు ఉత్తరభాగంబున వైరాగ్యఘనుండగు నాగనాథుండు విటేగ్రామంబున తాపసోత్తముండగు రేవణసిద్ధనాథుండు నివసించియుండ గర్భాద్రి వామతీర్థస్థానంబున గోరక్షుండు గహినీనాథున కనేకవిద్యలు గఱపుచుండ మధుబ్రాహ్మణుండు నిజనగరంబున కేతెంచెను. తదనంతరం బా గోరక్షనాథుం డొకవత్సరం బా వామతీర్థంబున వసించి గహినీనాథుని పూర్ణసనాతనమూర్తిని జేసి పునర్మధువిప్రుని సదనంబున కనిపి తా నచ్చోటు బాసి నానాతీర్థంబులు సేవించుచు దత్తాత్రేయదర్శన కుతూహలుండై చనుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్ర స్వర్ణశైష్టిక కథావిశేష త్రయోవింశాధ్యాయము సంపూర్ణము.

చతుర్వింశాధ్యాయము.

భర్తరీనాథుని జన్మచరిత్రము.

తొల్లి యొకానొకదివసంబున సహస్కరుండు నిత్యనియమప్రకారంబుచే నిజస్యందనారూఢుండై వియన్మార్గంబున వాతగతి నేగుచుండ నమరావతీనగరవాసినియగు నూర్వశీకాంత మనోహరంబగు విమానంబు నలంకరించి శశిబింబరుచిరాస్యయై సౌధామినీసమద్యుతిశరీరకాంతిచే బ్రకాశించుచు ఘటికాక్షణంబున బతంగునిపై జూపు సాచినంత నక్కలకంఠి చురుకుచూపులు చెఱకువిలుకాని కఱకుటమ్ములని యదరిపడి, ప్రభాకరుండు దుర్భరమోహపరవశత్వంబున చలింపనింద్రియంబు గళితంబై నభోమార్గంబున బుడమింబడ నేతెంచుచు వాతహతిచే ద్విభాగంబై యందొకభాగంబు లోమశాశ్రమంబున ఘటంబునంబడి యగస్త్యుం డుద్భవించెను. తదితరభాగంబు కైలికమహర్షి కుటీరసమీపంబున భర్తరీ యను భిక్షాపాత్రంబునం బడియుండెను. కైలికుండు నిత్యకృత్యంబులు దీర్చుకొని భిక్షార్థంబై జనపదంబు కేగందలంచి దివాకరవీర్యపూరిత భర్తరిం గనుంగొని యియ్యది మిత్రవీర్యంబని యూహించి యంతర్దృష్టిచే కలిప్రారంభాది త్రిసహస్రైక శతవత్సరంబులకిమ్మహావీర్యంబున ద్రుమిలనారాయణుండు జన్మంబు బూని లోకోద్ధారం బొనర్చు నని నిశ్చయించి యనేకవర్షంబు లబ్భర్తరిని నిజాశ్రమంబున భద్రపఱచి కలిప్రారంభసమయంబున నయ్యది మందరాచలగుహాంతరంబున నుంచె నందు ద్రుమిలనారాయణుండు ప్రవేశించి నవమాసపూర్తియై దైవయోగంబున మధుమక్షికములు మధుధార లొసంగ క్రమక్రమంబున నవయవంబు లభివృద్ధి జెంది జలింపుచుండ నప్పాత్రంబు డుల్లి యొక పాషాణంబునకు దాకుచు భిన్నంబై తృణసమయంబగు మహింబడి బాలార్కతేజుండగు డింభకుం డుదయించి రోదనంబు జేయుచుండెను. తత్సమీపప్రదేశంబున నొక గర్భిణీకురంగంబు తృణంబుకై జరించుచు నేతెంచి యబ్బాలునిపై కిశోరద్వయంబును బ్రసవించి శిశుత్రయం బుదయించె నని దలపోయుచు ముదంబున దనజిహ్వాచే నాకి స్తన్యంబు లొసంగ

తత్కిశోరంబులు క్షీరంబు లానుచుండె నయ్యర్భకుండు స్తనదుగ్ధపాన విధి యెఱుంగక శోకింపుచుండ నక్కురంగంబు బాలుని శిరోపార్శ్వ ద్వయంబున పాదంబులు మోపి వక్త్రంబున స్తనంబులిడి పయఃపానం బు జేయించి తృప్తిపఱచెను. ప్రతిదినం బివ్విధంబున క్షీరంబు లొసం గుచు జిహ్వచే శరీరక్షాళనంబు జేయుచు నత్యంతగౌరవంబున బాలకుని బోషింపుచుండెను బాలుండు దినదినప్రవర్ధమానుం డగుచు త్ర్యబ్దం బులబాలుండై మృగకిశోరంబుకై వడి కురంగంబు వెంటనంటి యరణ్యంబులు గ్రుమ్మరుచు విపినాంతర వ్యాఘ్రభల్లూకద్విరద జంబుక వృషభాది క్రూరసౌమ్యచతుష్పదద్విపద మృగపక్షిజాలభాషణంబుల కెఱుంగుచు తత్తద్భాషావివేకంబుచే సమయానుకూలంబున మృగపశుసమూహంబులకు ప్రత్యుత్తరంబు లొసంగుచు నిర్భయం బుచే జరించి నిజజననీనికటంబు జేరి విహరించుచు క్రమంబున పం చాబ్దంబులబాలుండై దేజరిల్లి యొకానొకసమయంబున జననీసమే తుండై పెందెరువున జరించుచుండ నమ్మార్గంబున సర్వగుణశీలుం డగు జయసింగనామ పురుషశ్రేష్ఠుండు పరమపావన చరిత్ర యగు రేణుకానామ్నీ జాయాసహితుండై చనుదెంచి మార్గమధ్యంబున లీలావినోదంబుచే శైశవం బొనర్చుచు నగణితకాంతిచే నక్షత్రేశుని బోలి విరాజమానుండై యాడుచున్న బాలుం గని రేణుకతో "నీ బ్బాలుని రూపలావణ్యంబులు జూచితివే. జననీ జనకు లీ బాలమన్న థుం డనఁజాలిన తేజోమయు మతిభ్రష్టులై యరణ్యంబులపా లొనర్చి రి గాబోలు" ననుచు కుఱ్ఱని సమీపంబున కరిగి విలోకించుచుండ న బ్బాలుండు భయభ్రాంతచిత్తుండై మృగశబ్దంబులచే రోదనంబు జేయు చు పరువు లిడుచుండెను. జయసింగభాటుండు వేగంబున వెంట జని బాలుని దనకరంబులచే ధరించి "వత్సా! భయపడకుము. నీజననీ జనకుల నెఱింగింపుము. నిన్నీక్షణంబున గొనిపోయి సమకూర్చెద" నన నబ్భర్తరీజాతుండు కురంగభాషణంబులచే వనతల్లియగు కురంగి ణిని జీరుచు శోకింపుచుండ నక్కురంగంబు దూరంబున నిల్చి దన పుత్త్రుండు మనుష్యునిచే జిక్కుబడె నని భయహృదయయై రోదనంబు జేయుచుండెను. జయసింగభాటుం డిబ్బాలుండు మూకుండో కేవల జ్ఞానరహితుండో యని సంశయించి దనభుజాగ్రంబులపై నెత్తుకొని

దయంబున నేగుచుండ కడుభయంబుచే రోదనం బొనర్చునెడ కురంగం బతిమోహంబుచే నలుదిశలు బరుగెత్తుచు మహానాదంబుచే నాక్రోశించుచు క్షణక్షణంబున పుత్రుని నిరీక్షించుచు పరితపించుచున్న కురంగంబును జయసింగభాటుండు గని యీహరిగణం బేకతంబున నాక్రోశించుచున్నదని మనంబున విచారించుచు గ్రామసమీపంబు జేరంజన నాహరిణంబు భీతిల్లి నిరాశచే విపినంబునకు జనుచుండెను.

—భర్తరీనాథుండు జయసింగభాటునివెంట కాశీక్షేత్రంబు ప్రవేశించుట.—

ఇట జయసింగభాటుం డొక గ్రామంబు ప్రవేశించి బాలుని దన జామానికటంబున నుంచి భిక్షార్థంబై తద్గ్రామంబు సంచరించి విడిదికిం జేరి బాలుని సమాధానంబు జేయుచు నిప్పగిది మాసత్రయం బా జనపదంబున నివసించి యనేకవిధంబుల బాలుని భోజనాదులచే దృప్తిపఱచుచు బోషించుచుండ నచ్చిఱుతడు హరిణీవియోగదుఃఖంబు మాని మనుష్యభాషణంబు నభ్యసించి ముద్దుముద్దుమాటలచే ప్రొద్దు గడపుచుండెను. పిదప జయసింగుం డా గ్రామంబు విడచి బహుగ్రామంబులు ద్రిమ్మరుచు కాశీక్షేత్రంబున కేగి భాగీరథీ జీవనంబుల స్నానంబులాడి విశ్వేశ్వరుని దర్శనం బొనర్చునెడ నమ్మహాలింగంబున "భర్తరీనాథా! రార" యను శబ్దం బుద్భవిల్లిన నబ్బాలుం డుమారమణునకు నమస్కరించె. నీశబ్దం బా జయసింగభాటుం డాలకించి దనహృదయంబున నిబ్బాలుం డీశ్వరునకు వందనంబు లిడుచుండ భర్తరీనాథాయను శబ్దం బాలింగంబున బయలువెడలుట కేమిహేతువో బాలుండు గుప్తవేషధరుండగు సుపర్వుండో దరిద్రునకు ధనాగారంబు లభించినట్లు క్షుధాపీడితునకు వేల్పుగిడ్డి ప్రాప్తించిన చందంబు నిబ్బాలుండు మద్భాగ్యోదయంబుచే ఘటియించె నని సంతసించుచు ధవళాంగుం డీ కుమారుని "భర్తరీనాథా" యని సంబోధించె గావున నిబ్బాలునినామంబు భర్తరీనాథా యని ప్రకాశింపజేయుట విశేషంబని యూహించి విడిదికిం జేరి కులకాంతతో "ప్రియే సర్వలక్షణయుతుండగు నిబ్బాలుం డవతారపురుషుండు. దేవళంబున వందనం బిడుచుండ 'భర్తరీనాథా! రార' యను మృడుండు వచించెను. మనపుణ్యఫలంబుచే ననుకూలించిన సుతునకు భర్తరీనాథ యని నామంబిడి ప్రియంబున బోషిం

పవలయు” నని సవిస్తరంబుగ వాక్రుచ్చి భిక్షార్థం బా పురంబు గ్రుమ్మరి నానాపదార్థంబులు గొనితెచ్చుచుండ పరమసాధ్వియగు రేణుకాయు వతి సుతులు లేనికతంబున నతిముదంబుచే భర్తరీనాథుని నిజాంకం బుపై నిడుకొని యత్యంతప్రేమాన్వితయైముఖకమలంబు చుంబించుచు మహాలాలనంబున భోజనంబులిడుచు నానావిధవస్త్రపరిధానంబులచే దృప్తిపఱచుచుండ బాలుండు శైశవక్రీడావినోదంబున ముద్దులొలుకు నాటపాటలచే జననీజనకుల యుల్లంబులు రంజిల్లం జేయుచుండి యొక నాఁడు తోడిబాలురతో క్రీడ లొనర్చి కడురయంబున పరుగులిడుచు నేతెంచి జననీగళంబున కతిగారవంబుచే నాలింగనం బొసఁగ నమ్మగువ పరమానందకందళితహృదయంబున హసన్ముఖయై చుంబనంబు గొని ప్రాణప్రియుండగు జయసింగభాటునితో “నిక్కుమారుండు పరమేశ్వ రానుగ్రహంబున మనకు లభించెను. సంతానహీనులమైన కారణంబుచే దయాసముద్రుండగు శంకరుండు మనకొసంగెను గాని యిబ్బాలునికై జననీజనకు లెంత శోధించుచున్నారో తుదకీ పుత్రుండు మనల నెడబా యునో” యని సంభాషింపుచు చిత్తంబున నప్పుడప్పు డీ సంశయంబు చే నాలోచింపుచు తనయుని రూపగుణసౌందర్యంబులు శ్లాఘించుచు నమ్మహాక్షేత్రంబున కుక్షింభరత్వంబుకై భిక్షాటనం బొనర్చుచు కాలం బు గడుపుచుండిరి. ప్రతిదినంబు భర్తరీబాలుండు తోడిబాలురచే నాట లాడుచు కాష్ఠనిర్మిత యశ్వంబుపై తానొక మహీపాలుండ నినియు బాలురందఱు భృత్యవర్గంబనియు వీధివీథుల క్రీడయొనర్చుచు నొకా నొకదివసంబున బాలురతో నేకీభవించి దారుతురంగంబుపై నారో హించి మహోత్సాహంబున దక్షిణ క్షేత్రంబు దొలంగి పరుగెత్తుచు సమీ పవిపినంబున కేగి పట్టుదప్పి పుడమింబడి మతిభ్రష్టుండై పిత్తాధిక్యం బుచే నేత్రంబులు ద్రిప్పుచుండ నయ్యర్భకులు వీక్షించి “భర్తరీ ప్రాణం బులు గతంబయ్యె నిక భూతంబై మనల హరించు” నని భీతిల్లి తీవ్రగమ నంబున నటుపరించి భాగీరథీఘట్టంబు జేరి భర్తరీబాలుండు పిశాచంబై వెంటనంటును. మన యాటపాటలు కొనసాగవనియు మనమా యర ణ్యంబున నాభూతంబుచే గ్రసింపఁబడుదుమని యనేకవిధంబుల నల్లరి జేయుచుండ నట భర్తరీనాథుండు మూర్ఛాగతుండై శరీరంబున పాషా ణక్షతంబుచే రుధిరంబు గాఱుచుండ బడియుండెను. జగచ్ఛ్రుతుండు

నిజపుత్త్రుని విలోకించి పుత్త్రమోహంబుచే రయంబున సమీపించి రక్తలిప్తాంగుండగు కొమారు నెత్తుకొని భాగీరథీనదీనికటంబునకేతెంచి తత్తోయంబులచే శరీరప్రక్షాళనం బొనర్చి మూర్ఛం దొలంగించి కృపాదృష్టిచే కాయబాధావిముక్తిఁ పఱచి నిజాంకంబుపై యలంకరించుకొని యతిప్రేమచే దనజగత్పవిత్రకరకరంబున ముఖంబు నివిరి యొకపాలుని వేషంబుచే బాలుని హస్తంబు ధరించి యేగుచుండ చెలికాండ్రా భర్తరిం గనుంగొని యొహో! భూతం బేతెంచెనని పరువులిడుచుండిరి. అంత నవ్వేషధరభానుండు జయసింగభాటుని గృహంబు జేరి రేణుకం బిలచి బాలుని భద్రపఱచుకొమ్మని నుడువుచుండ నవ్వనితామణి విప్రోత్తమునకు వందనంబిడి భయభక్తివిశేషంబులచే నాసనం బొసఁగి "బ్రాహ్మణోత్తమా! మత్పుత్త్రునిపై నత్యంతమోహంబు గలిగి దోడి తెచ్చితిరి. భవన్నామధేయం బెఱింగింపరే" యని సవినయంబుగ నడుగ నక్కమలమిత్త్రుండు "నే నీబాలునకు జనకుండను. దైవయోగంబున మీకు లభించె గావున నామనోవాక్కాయ త్రికరణశుద్ధిచే మీకర్పించితిని. రక్షింపుకొను" మనుచున్న భూసురోత్తముని "నీయర్భకుండు భవత్తనయుం" డెట్లయ్యె నని యడుగ నమ్మహామహుండు "నేను జగత్ప్రకాశకుండనగు సూర్యుండను. విప్రుండను గాను. మద్వీర్యంబున నీచిఱుతఁడు భర్తరీపాత్త్రంబున జన్మించి హరిణంబుచే బోషింపఁబడి నీపూర్వపుణ్యఫలంబుచే లభించె" నని జన్మకథావిస్తరంబంతయు దెలియఁబలుకుచు "నిబ్బాలుం డద్భుతచరిత్త్రుండై దేజరిల్లును. సుఖంబున గాపాడుకొను" మని యనుగ్రహించి యంతర్ధానంబునొందెను. రేణుకా జయసింగభాటులు పరమసంతోషంబున నిర్మలోదకంబులచే శరీరమలక్షాళనం బొనర్చినపగిది పుత్త్రోత్పత్తిచే ప్రసవవేదన బాసిన బిసరుహాక్షిచందంబున మిత్త్రదర్శనంబుచే మనోగత సంశయంబు లుడిగి యతిశయానందంబున బాలునిబోషింపుచు నొకకొన్నిసంవత్సరంబు లాకాశీక్షేత్త్రంబున గడుపుచుండ బాలుండు షోడశవర్షపరిపూర్ణవయస్కుండై నిరుపమానతేజోధనంబున బ్రకాశించుచుండె నప్పుడా రేణుకాదేవి "బాలుండు యుక్తవయస్కుండయ్యెను. లగ్నం బొనర్చుటకు ప్రశస్త సమయంబు గావున మనస్వదేశంబున కరిగి స్వజాతీయకన్యకను శోధింపవలె" నని ప్రియుండగు జయసింగభాటునితో నాలోచించి గమనోన్ముఖులై

క్షేత్రంబు వదలి స్వదేశంబగు మాళవదేశంబున కేగుచు మార్గమధ్య జనపదంబుల స్వధర్మంబుచే భిక్షాటనంబు జేయుచు విపినపథంబున నేగుచుండ నీచాత్ములగు చోరు లేతెంచి జయసింగభాటుని ప్రాణంబు లపహరించి విత్తంబు గొనిపోయిరి. రేణుకాదేవి దుస్సహదుఃఖభారంబుచే విలపించుచు నిజప్రాణనాథుని చరణకంజంబుల శిరంబు మోపి పంచత్వంబు నొందెను. భర్తరీనాథుం డీ మహాద్భుతంబున కచ్చెరువొంది శోకపూరితహృదయుండై రోదనంబు జేయుచు జననీజనకులపై కాష్ఠంబు లమర్చి యగ్నిసంస్కారం బొనర్చుచు హాహాకారంబుచే "నన్నత్యంతమోహాతిశయంబుచే బోషించిన జననీజనకులు పరలోకగతులైరిక నన్నాదరించు పుణ్యాత్ములెవరు? తల్లీ యని నేనెవరిని బిలతును. నన్నతులితగౌరవంబుచే రక్షించిన మాతాపితృలేక కాలంబున నేగిరి. మాతాపితృలారా! నన్నెడబాయుట ధర్మంబగునే? కృపాపాత్రుండగు సుతుని మఱచితిరే? పుణ్యులారా! ఘనులారా!" యని వక్షస్థలతాడనం బొనర్చుకొనుచు నతిదీనవదనంబుచే శోకింపుచు నిజప్రాణంబులు వాయందలంచి యోచింపుచుండ నొక సైరికుండు శిరంబున హాలంబు ధరించి సౌరభేయంబుల వెంటఁగొని చనుచు బాలునిరోదనం బాలకించి పరితప్తహృదయుండై సమీపంబు జేరి గతవృత్తాంతంబంతయు నెఱింగి "భాటసుతా! భగవత్కృతకార్యంబునకు చింతింపనేల? వ్యర్థశోకంబుచే లాభం బేమి? శోకించితి వేని నీజననీజనకులు లభింతురే? ప్రారబ్ధభోగంబు లనుభవింపక తీరునే? బ్రహ్మనిర్మితసూత్రంబు లెవరెఱుంగుదురు? ధైర్యధుర్యుండవై దుఃఖం బుడిగి స్వహితంబుకై సంసారం బాశ్రయించి కీర్తిధ్వజప్రకాశితుండవు గమ్మా! లేలె"మ్మని తోడ్కొని నిజసదనంబున కేతెంచి యనేకబోధప్రబోధంబులచే బాలుని దుఃఖోపశమనంబు జేసి యన్నపానాదులచే దృప్తిపఱచుచుండ బాలుని రూపగుణసౌందర్యంబులు గని నిరాధారపురుషుండని తలంచి తద్గ్రామవాసు లతిప్రేమాన్వితులై స్నిగ్ధభావంబున లాలింపుచుండి రిట్లొకకొన్నిదివసంబులు గడచినంత నొకనాఁడా

వ్యవసాయకుండు వృషభంబులపై ధాన్యంబు గొని విక్రయంబుకై భర్తరీసహితంబుగ నవంతికాపట్టణంబున కేగుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున భర్తరీనాథజన్మకథావిశేషంబు చతుర్వింశాధ్యాయము సంపూర్ణము.

పంచవింశాధ్యాయము.

భర్తరీనాథుం డవంతికాపురంబున కేగుట.

వ్యవసాయకుండు భర్తరీసమేతుండై యవంతికానగరసమీప ప్రదేశంబున సూర్యాస్తమయ కారణంబుచే తెరువరులు నివసించు స్థలంబుగని యచ్చో ధాన్యంబు డించి యారేయి గడుపుటకై నివసించెను. తదుపరి భోజనం బొనర్చి పాంథులతోఁగూడి కాష్ఠంబులు జత జేసి యనలంబంటించి యుష్ణంబుకై బరివేష్టించి సుఖగోష్ఠులు జరుపుచుండు నవసరంబున నొకజంబుకవ్రజం బేతెంచి మహాధ్వానంబు జేయుచు మృగభాషణంబుల హెచ్చరించుచు "పాంథులారా! తస్కరులేతెంచెదరు. జాగ్రత జాగ్రత" యని యఱచుచుండ భర్తరీబాలుండా శబ్దార్థంబులు మృగభాషాపరిజ్ఞానంబుచే గ్రహించి తన్ను బోషించుచున్న వ్యవసాయకున కెఱింగించి కాపాడుట ముఖ్యధర్మంబని దలపోయుచు నప్పాంథులు వినుచుండ దన్నేలెడు వానితో "నయ్యా! బహుజాగ్రత గలిగి నివసించుడీ. తస్కరు లేతెంచి మీమీవిత్తంబులపహరించెద" రని బలుకుచుండ వార లా భర్తరీనాథునితో "నీవెట్లు ఱుంగుదు" వని విచారించిరి. భర్తరీజనితుండు "జంబుకభాషణంబులచే నే నెఱింగితిని. నాకు మృగభాషాజ్ఞానంబు గలదు. నావచనంబు నిక్కంబని దలంపు" మన వారలతిశౌర్యసాహసంబులచే దారుణతరకృపాణంబులు ధరించి యున్నిద్రచే నలుదిశలు నిరీక్షించుచుండుతఱి భయంకరాకారులగు మ్రుచ్చు లరుదెంచి దౌర్జన్యంబు జేయుచుండ వారా చోరులను శస్త్రంబులచే నుగ్గడంచి మొత్తుచు వోదుచు నఱుకుచుండ నత్తైక్కలికాం మ్రుక్కుచెడి యొక్కుమ్మడి పరువులిడిరి. తదు

పరి యీపాంథులు శాంతింబొంది భర్తరిని గొనియాడుచు శిబిరంబుల నిల్పి త్రియామంబు గడపుచుండ తిరిగి జంబుకంబులగుంపు వేతెంచి కేకలిడుచుండెను. వారా భర్తరిని జూచి "యయ్యా! మృగభాష తెఱింగెద నని బలికితిరి. జంబుకంబులు పునరాగతంబులై కూయుచున్న శబ్దార్థంబు లెయ్యవియో దయజేయు" మన నతం "డో వ్యవసాయకులారా! జంబుకనినదాభిప్రాయం బెఱింగించెద వినుం డని 'యొక మహారాక్షసుండు హరదత్త శాపమోచన పరంబుచే నుత్తరదిశనుండి దక్షిణదిశ కేగుటకై జనుదెంచె నతనివద్ద నమోఘంబులగు తీవంచరతనంబులు గలవు. యెవ్వండేని యానిశాచరుని శస్త్రఘాతంబున బరిమార్చునో వాఁ డతిలాభంబు బొందును. వానిశరీరరుధిరంబుచే నే పురుషుండు ఫాలభాగంబున తిలకంబు ధరించునో వాఁ డవంతికానగర సార్వభౌమసంపద ననుభవించు' నని బలికెను. గావున మీరేగి యా నక్తంచరుని శస్త్రఘాతంబుచే హతంబొనర్చి రక్తంబున వస్త్రంబు దడిపి గ్రామద్వారంబుపై తిలకంబుమాదిరి నలంకరించెద రేని మీ కత్యంత జయంబు గలుగు" నన నాసమీపంబున విక్రముండు నివసించి యుండి యీవాక్యంబు లాకర్ణించి యసురుని బరిమార్చుటకై ఖడ్గంబుగొని యేగెను.

సురోచనగంధర్వుని చరిత్రము

శ్రోత లీ యపూర్వచరిత్ర మధురసపానులై "యీపిశితాశనుం డేకతంబున నుద్భవించె. తత్కారణం బెఱింగింపు" మన నక్కథకుండు "తొల్లి యీదానవుండు చిత్రమగంధర్వుండు నాకలోకంబున మహాప్రతాపంబుచే విరాజమానుండై యొకనాఁ డుమారమణుని చరణకమలదర్శనార్థంబున రజతాద్రి కేగి శర్వుండు పర్వతరాట్పుత్రితో వినోదార్థంబుగ ద్యూతంబాడు సమయంబున ననుసరించుచున్న గంధర్వుని నీలకంఠుండు నిరీక్షించి యాహ్వానం బొనఁగి దననికటంబున కూర్చుండ నియమించి సంతుష్టపఱచెను. పిదప యథాప్రకారంబున నంబికతో ద్యూతం బాడుచుండ నయ్యక్షంబు లుభయుల కుభయరూపంబుల భాసమానంబై దక్షపుత్రి ఫాలాక్షుని జయించితి ననియు శంభుం డంబికను జయించితి ననియు

ద్యూతవివరంబులచే వాదించుచు నుభయు లా గంధర్వుని విచారింప నచ్చిత్రముండు 'త్రినేత్రుండు జయించె' నని పక్షపాతంబుచే నుడివెను. రుద్రాణి క్షోభించి 'గంధర్వా! నీ వసత్యంబని భయంబు మాని పాపమతివై పక్షపాతం బొనర్చితివి గాన నీ వీ దోషంబుచే నిశాచర రూపంబుగొని మర్త్యలోకంబున బడియుండెద'వని శాపం బొసంగెను. చిత్రమగంధర్వుండు దాక్షాయణీదత్త కఠినతరశాపంబునకు భయవిహ్వలాంగుండై గరళకంఠుని చరణాంభోరుహంబులపై శిరంబు మోపి 'దయాసముద్రా! కరుణించవే'యని యశ్రుపూరితలోచనుండై విలపించుచున్న గంధర్వుని గని యయ్యంబరకేశుండు దయాన్వితహృదయంబున 'గంధర్వశ్రేష్ఠా! భయపడకుము. శక్రశాపంబుచే సురోచనగంధర్వుండు మనుజలోకంబున నివసించె నతని తనూభవుండగు విక్రముండు స్వపరాక్రమంబున శస్త్రఘాతంబుచే నీప్రాణంబులు గొని భవద్రుధిరతిలకంబు ఫాలంబునధరించి మహాభోగంబు లనుభవించు. తత్క్షణంబ నీదివ్యరూపంబు పరిగ్రహించి నిజనికేతనంబున కేతెంచెద' వని వాక్రుచ్చిన త్రిశూలపాణిని చిత్రముండు 'దేవా! నారక్తంబుచే నేతద్వైభవంబులు సమకూరు నని విక్రముం డెట్లెఱుంగు' నని విచారింప దక్షజామాతృండు 'గంధర్వనాయకా! నీకీ సంశయంబేల? ద్రమిలనారాయణుండు భర్తృరీనాథనామంబున నవతరించి విక్రమునకు దెలియఁజేయు' నని సమాధానపఱచినంతచిత్రమగంధర్వుండు నిజశరీరంబు బరిత్యజించి యసురుండై ప్రవర్తిల్లె" నని శ్రోతలకు సంశయంబు వాపెను. తదనంతరం బా శ్రోతలు "సురోచనగంధర్వుం డేకతంబున నాకేశుని శాపహతుండయ్యెన" నని విచారింప నయ్యుమాచరిత్రుండగు కథకుండు "శ్రోతలారా! యొకానొకదివసంబున పాకశాసనుండు గరుడగంధర్వ కిన్నరకింపురుషాదిసురసంఘసమేతుండై కొలువుకూటంబున రత్నస్థగితసింహాసన నచ్చ మలంకరించి యుండ పురోభాగంబున వశీకృత లోకత్రయ్యు నేని న మేనకా తిలోత్తమలు తటిల్లతా మిశ్రిత తపనీయ తేజఃపుంజ ప్రాణం లు గలిగి శాతకుంభసమ పీనోత్తుంగ పయోదర భారా నిస్సంశ ంపాయమాన తనుమధ్యలై సుస్వరరాగ మూర్ఛ లాపనాది సత్యం రిత హావభావాభినయ నృత్యంబులు సల్పుచుండ చిత్తజం విరహితు శృంగచాపంబుచే వాతాంబుపర్ణభుగ్దుర్బలవిరా

గుల నెదురించి జయంబు గొనె నన తత్సభాంతరస్థిత సురఋషిగణం బులు వివశాత్ములై విలోకింపుచుండ మనోభవనిశితాంబకభిన్నహృదయుండగు సురోచనగంధర్వుండు సభాసదుల దలంపక మేనక నొకహస్తంబుచే నొడిసిపట్టి ద్వితీయహస్తంబున నురోజపీడనం బొనర్చెను. శచీకాంతుండు క్రుద్ధుండై 'సురోచనా ! సభ్యులభయం బించుకైన దలంపక నిర్లజ్జుండవై దుశ్చేష్టలొనర్చితివి గాన స్వర్గపదచ్యుతుండవై మనుజలోకంబున గర్దభజన్మం బెత్తు' మని శాపంబొసంగెను. సురోచనుండు భయగ్రస్తుండై పాకశాసనునకు ప్రణమిల్లి 'సమర్థా! నాయపరాధంబు క్షమింపుము. నేను నీపోష్యంబున నభివృద్ధిజెంది యజ్ఞానంబుచే నొనరించిన కృత్యంబులు సహించు దయాఘనుండవుగాన నీకృపాకటాక్ష పీయూషంబున గాపాడవే' యని స్తోత్రంబులు జేయుచుండ నవ్వృత్రహుండు ప్రీతమనస్కుండై 'గంధర్వా నీవు మర్త్యలోకంబునకేగి మిథిలాధీశుండగు సత్యవర్మనృపోత్తముని సర్వావయవలావణ్యరాశి యనందగు పుత్రికను వరించి కీర్తిమయుండగు విక్రముని గని ద్వాదశవర్షంబులకు నిజపదంబున కేతెంచెదవు. చింతింపవల'దని శాపమోచనవరం బొసంగెను. సురోచనుండు తచ్ఛాపవశంబున భూలోకపతనుండై మిథిలాకాంతారంబున గర్దభరూపంబుచే రాసభసముదయంబున జరించుచుండెను. మిథిలానగరనివాసుండగు కమరనామకకులాలుండు దన ఖరంబులకై కాననంబు శోధించి నొక్కచో మేయుచున్న గర్దభయూథంబును మరల్చుకొని సదనంబున కేతెంచి వాటిని దన రాసభశాలయందుంచె. నొకకొన్నిదినంబులు గడపినంత నక్కులాలుండు లేములనుభవించుచు గంధర్వగర్దభంబుదక్క నితరఖరంబుల విక్రయం బొనర్చెను. పిదప నొక నిశాసమయంబున గర్దభరూపధ[illegible] సురోచనుం 'ఓకమరకులాలా సత్యవర్మపుత్రికం గొని తెచ్చి నావివాహం బొనర్పు' మని శబ్దంబులు వెల్లడి జేయుచుండ నక్కమరుం డీవాక్యంబు లెక్కడివని దిక్కులు విలోకింపుచు నెవ్వరిం గానక దన మతిభ్రమ యని దలపోయుచు నిశ్శబ్దుండై యోచింపుచుండ పూర్వవచ్ఛబ్దంబు లాకర్ణించి విస్మయంబున గర్దభంబును జూచుచుండె నప్పుడా గర్దభంబు మనుష్యభాషణంబులచే కులాలుని జేరంబిలచి 'కులాలా! సత్యవర్మకూతును గొని తెచ్చి నావివాహం బొనర్పు' మనెను. కమరుండా కర్ణకఠోర

సంభాషణంబు లాకర్ణించి దనమనంబున నోహో! గర్దభంబే! యీ నృపో త్తముని దుహితృసంబంధమేమి మశకంబు మేరువుచే బోరం దలంచిన చందం బౌనగూడె. నీవాక్యంబులు వెల్లడియయ్యెనేని నాప్రాణంబులు స్థానంబులు దప్పవే! నే నిప్పురంబున జీవించు టెట్లు? యన్యదేశంబున కేగవలయు. లేకున్న పుడమీశుండు నాశిరచ్ఛేదనంబు జేయుట నిక్కం బని యూహింపుచు దనగృహిణి కీవృత్తాంతంబు దెలియపఱచి మరు నటిదివసంబున మూఢమతులగు భార్యాభర్తలు వాచారహిత గర్దభం బేకతంబున సంభాషించును? తత్ఫలం బెయ్యది గాబోలునని దలంపక శీఘ్రంబున గృహోపకరణంబు లా గర్దభంబుపై నెత్తి యుభయు లుభయపార్శ్వంబుల నడచుచు నగరద్వారనికటంబు జేరంజన ద్వారరక్షకు లీకులాలుండు పలాయనంబు జేయుచున్నాఁడని మనంబున నిశ్చయించి 'కమఠకులాలా! నీ వేకతంబున సంసారోపకరణసమేతుండవై పలాయనంబు జేయుచుండెద' వని విచారింప నక్కులాలుండు ప్రత్యుత్తరమార్గం బెఱుంగక గర్దభచిత్రం బెఱింగించెదనేని యీ దౌవారికులచే సద్యస్సమయంబున శిక్షింపఁబడెద నని భయంబు గలిగి స్తబ్ధించి నిల్చి యుండెను. దౌవారికు లక్కులాలుండు జీవనంబునకై పరదేశంబున కేగునని నిశ్చయించి 'కమఠా! మహానగరంబు త్యజించి యితరగ్రామంబుల కేగుట మేలౌనగూడునే? మామహీధవున కెఱింగించెదము. నిల్వు' మని తజ్జాయాపతుల నిరోధించి వేగంబున రాజభవనంబు జేరంజని 'జననాయకా! కమఠకులాలుం డేతన్నగరంబు విసర్జించి యేగుచున్నాఁ' డన రాజోత్తముండు దూతచే నక్కుంభకారుని బిలిపించి 'కమఠా! నీ వేకారణంబున మత్పురంబు త్యజించం దలంచితివి నీకే కష్టంబులు ఘటిల్లె నవియన్నియు నిర్భయంబుచే సవిస్తరంబుగ దెలియఁజేయు' మన నక్కులాలుండు 'నరపుంగవా! శత్రుకులదమనుండవై మమ్మనిశంబు బోషించెడి సచ్చరిత్రుండవు గావున నామనోదుఃఖం బవాచ్యంబు వెల్లడియొనర్చితినేని నాతల డుల్లుట నిక్కం' బని పలుక భూనాయకుండు 'కమఠా! నీప్రాణంబులు రక్షించెద. నీ వెట్టి పాతకం బొనర్చినను క్షమింతును. నిస్సంశయంబుచే నీమనోగతం బెఱింగింపుము. నావాక్యంబులు కేవల సత్యంబులని దలంపు' మని వాగ్దత్తం బొసంగిన నక్కమఠుండు భయరహితుండై 'నృపాలోత్తమా! నామనోగతం బేకాంతం

బున వెల్లడిజేయుచు ర' మ్మని యొకగోప్యస్థలంబునకుం జని 'దీనశరణ్యా
మత్సదనంబున రాసభం బొకటి రూపగుణశిరోమణియగు యుష్మద్దు
హితయగు సత్యవతీకాంతను దనకు వివాహంబొనర్పు మని నిశాసమ
యంబున నా కెఱింగించె. నేనీ విపర్యాసవాక్యంబులచే భయగ్రస్తుం
డనై నృపుం డెఱింగెనేని శాసించునని తలంచి యతివేగంబున నితర
దేశంబునకు ప్రాణసంరక్షణంబునకై యేగుచుంటి' నని స్పష్టపఱిచెను.
భూరమణుం డీ యాశ్చర్యకర సమాచారంబు డెందంబున నూహించు
చు గర్దభంబునకు మనుష్యభాషణంబు లెట్లు ఘటియించు? నీరా
సభంబు వాచారహితపశువనందగునే? కృత్రిమవేషధరుండగు వియ
చ్చరుండు గాబోలు? పరీక్షించి యెఱుంగవలయు నని వితర్కించి
'కమఠా! నీహృదయగతభయంబు దొలంగుము త్వరితంబున స్వసద
నంబునకేగి స్వస్థచిత్తుండవై నివసించి యాఖరోదితవాక్యంబుల బరి
శీలించి నే నీ వాక్యంబులు రాజున కెఱింగించితి ననియు, యీమిథిలా
నగరంబు తామ్రమయం బయ్యెనేని సత్యవతి లభించునని రాజాభిప్రా
యంబు గలదనియు ప్రత్యుత్తరం బొసంగి తత్ప్రత్యుత్తరోత్తరంబు
నా కెఱుంగింపు' మని నృపుం డాజ్ఞాపింప నక్కులాలుండు గర్దభసమే
తుండై నిజసదనంబునకేగె నా రేయి యాఖరంబు పూర్వవద్వాక్యం
బులు బలుకుచుండుతఱి ఘటకారుండు సమీపించి యగ్గర్దభంబుతో
'ఖరశ్రేష్ఠమా! నేనీ యభీష్టంబు మహీధవున కెఱింగించితిని. నీమా
హాత్మ్యంబుచే నిప్పురంబు తామ్రమయం బయ్యెనేని సత్యవతి నర్పించె
ద నని నృపుండు నుడివెను గావున భవత్ప్రతాపశక్తిచే బుడమిఱేని కా
మ్యం బొనగూర్చి సత్యవతిం బొందు' మన గర్దభరూపసురోచనుండు
హాస్యరసపూరితవదనుండై నృపోత్తముని మందమతి యేమని దలంతు
ను? 'కులాలా! తామ్రమయపురంబేల? స్వర్ణమయంబని గోరకూడదే?
గోరెనేని యమరావతీనగరంబునకు సరియొనర్చి బిడౌజునివైభవంబు
లొనగూర్పనే? సురభూజంబుదలంపక మర్త్యమహీరుహంబు గోరుట
చింతామణిని విచారింపక విపినపాషాణంబు వేడుట కామధేనువున
కాశింపక గ్రామధేనువున కపేక్షించుట చిత్రంబుగాదే' యనుచు 'కమ
ఠకులాలా! నీ వతిరయంబున నేగి యీపురంబు తామ్రమయం బొనర్చు
నీయభీప్సితంబు సమకూర్చునని బలుకు' మన కమఠుండు వేగంబున

నరపుంగవుని జేరంజని 'రాజోత్తమా! గర్దభంబు మీయభీష్టంబు దీర్చునట. సత్యవతిని సిద్ధబఱచు' మని విన్నవించెను. క్ష్మానాయకుం డవశ్యంబని యొప్పుకొనెను.

ఇట సురోచనుండు సర్వకళాసంపన్నుండగు విశ్వకర్మను ధ్యానింప నమ్మహామహుండు ప్రత్యక్షుండై 'గంధర్వనాథా! నీకామ్యం బెయ్యది? నన్నేకతంబున స్మరియించితివి? విచారింపు' మన సురోచనుండు 'సమర్థా! విశ్వరచనాధురీణుండవు జగద్గురుండవు జగత్స్వరూపుండవు క్షణజగన్నిర్మితుండవు నాకష్టంబు లెడబాయుటకై నాయం దనుగ్రహించి యిప్పట్టణంబు తామ్రమయనగరంబు జేయు' మని గోరియాడ నవ్విరాట్పుత్రుం డంగీకరించి తత్క్షణంబున నప్పురవరంబు తామ్రమయం బొనర్చి యదృశ్యుండై నిజధామంబున కేగెను. సూర్యోదయానంతరంబున నగరవాసు లీయద్భుతంబు గనుంగొని విస్మితులై నిజసౌధకుడ్యంబు లేకతంబున తామ్రమయంబులయ్యె నని తలపోయుచుండ సత్యవర్మనరేంద్రుండు నిజహృదయంబున గర్దభరూపధరమహాపురుషునకు మత్పుత్రిక నొసంగితినేని జనులు నిందింపరే? నిందాస్పదజీవనంబు కడుకష్టంబుగాదే? కుంభకారున కతిరహస్యంబున మత్సుత నర్పించి యీదేశం బెడబాపి యన్యదేశంబున నివసింపంజేయవలయు నని కృతనిశ్చయుండై యక్కులాలుని రప్పించి 'కుమతా! నవమోహనాకార సుందరీమణియగు సత్యవతీకన్యను నీకర్పించెద. నీ వీదేశంబు బాసి బహుదూరదేశంబున నివసింపుము లేకున్న గర్దభంబునకు గూతు నొసంగె నని లోకాపవాదము గలుగు' నని తెలియపఱచెను. ఘటకారుం డవశ్యం బని దనగృహంబునకు విచ్చేసి యన్యదేశంబున కేగుటకై గృహోపకరణంబులు సిద్ధపఱచి నిశాసమయంబున భూకాంతుని సమక్షంబు జేరి గమనోన్ముఖుండ నైతి నని సవినయంబుగ నుడివెను. సత్యవర్ముండు లావణ్యమణియగు సత్యవతిం బిలచి 'తల్లీ! నిన్నొక సురశ్రేష్ఠున కర్పించితి నమ్మహాఘనుండు ప్రచ్ఛన్నుండై గర్దభరూపంబున విలసిల్లును. నే నయ్యపారచరిత్రుని బరీక్షించితి మననగరం బేవిధి తామ్రమయంబయ్యెనో గనుంగొంటివే? గర్దభం బని నిందింపకుము భయభక్తివిశేషంబులచే పతియని దలంపుము. తత్కారణంబున నుభయవంశంబులు పవిత్రంబౌను. ఖరం బని యనాదరణ జేసితివేని సపు

ద్ధుండు శాపంబొసంగు నిస్సంశయంబుచే ప్రాణనాయకుండని నిశ్చయింపుము. నీయుక్తిప్రయుక్తులచే నతని నిజస్వరూపంబు బ్రకటింపంజేయుము. నిర్మలమనస్సుచే కమఠకులాలుని సదనంబున కేగుదు వే'యన నప్పుడతి యొడంబడి పితృసహితంబుగ కులాలునిమందిరంబున కేతెంచి 'మత్ప్రాణేశుని జూపు' మన నక్కుమరుండు గాజోత్తమునకు రాసభంబు గనుపఱచెను. తత్క్షణం బా నరపుంగవుండు ఖరచరణోత్తములకు వందనం బాచరించి 'సురోత్తమా! మద్దుహిత సత్యవతిని భవత్పదపంకజంబుల కర్పించితిని. పరిపాలించుకొ' మ్మన నగ్గర్దభరూపధర సురోచనగంధర్వుండు 'నృపాలశేఖరా! నీభాగ్యోదయకారణంబుచే నీజామాతృండనైతిని. శక్రశాపవశంబుచే ఖరరూపంబున మెలంగుదును. నానిజనామంబు సురోచనగంధర్వుండు. నాపూర్వచరిత్రంబు విను' మని శాపకారణమూలం బెఱింగించి మహీనాయకుని మనంబు రంజిల్లఁజేసెను. సత్యవర్ముండు పరమానందంబున గంధర్వుని బొగడి సత్యవతి నర్పించి నిజభవనంబునకు విచ్చేసెను. తదుపరి కుమరుండు గర్దభ సత్యవతీ సమేతుండై యవంతికానగరమార్గం బాశ్రయించి గమనం బొనర్చెను."

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున భర్తరీనాథ కథాంతర్గత విక్రమకథావిశేషంబు పంచవింశత్యధ్యాయము సంపూర్ణము.

షడ్వింశాధ్యాయము

విక్రమార్కుని జన్మవృత్తాంతము.

కమఠకులాలుండు ధనసంసారోపకరణంబులు గర్దభంబుపై నిడుకొని జాయాసహితుండై సత్యవతీదేవిని దోడ్కొని యచ్చటచ్చట జనపదంబులు గడచి యవంతికానగరంబు జేరంబోయి యొకకులాలుని మందిరంబున నివసించి సత్యవతీకాంతను కడుప్రేమచే రక్షింపుచుండె. నంత నొకనాఁడు సత్యవతీదేవి కమఠకులాలునితో "నయ్యా! 'న్నేకతంబున గొనితెచ్చితిరో మఱచితిరే రయంబున నావివాహం

బొనర్చి మత్పతియనుగ్రహంబు గలిగింపవే" యని పలుక నక్కుంభకారుం డవశ్యం బని యారేయి ఖరరూపధర సురోచను నికటంబు జేరి "గర్దభశ్రేష్ఠమా! యుష్మదీప్సిత సత్యవతీసుందరి లగ్నంబుకై నిరీక్షించుచున్నది గావున నక్కాంతామణి కోర్కె లీడేర్పవే" యని విన్నవింప నగ్గర్దభంబు "కమఠా! విధిపూర్వక వివాహంబున కనుకూలసమయంబుగాదు. శాపకారణంబుచే నయ్యది సందర్భింపదు. ఆసురీవివాహంబున నత్తలోదరిని పరిగ్రహించెద" నన కమఠుండు "గంధర్వనాయకా! మీనిజరూపంబు పరిత్యజించి పశురూపంబుచే మెలంగితిరి. పరమసుశీల యగు సత్యవతి కీరూపంబున నాసురీవివాహం బెట్లు ఘటియించు? నాకీ సంశయంబు గలదు. నిగదింపు" మన సురోచనుండు "కులాలా! నారీరత్నంబగు సత్యవతీదేవి ఋతుమతియైన చతుర్థదివసంబున నాకెఱింగింపుము. నే నాదినంబున నిజస్వరూపంబుచే పరిగ్రహించెద" నన కమఠుండు సంతసిల్లి సత్యవతీసమక్షంబున కేతెంచి "తల్లీ! నీవివాహంబునకై పశురూపధర సురోచనునకు దెలియఁబఱచితి. నమ్మహాత్ముండు నీఋతుదినంబున నాసురీయోగంబుచే వివాహంబాడి తన నిజస్వరూపంబుచే నీమనోరథం బీడేర్తు ననియెం గాన సంతుష్టినుండు" మని సమాధానపఱచి సుఖంబున కాలంబు గడపుచుండ నప్పూఁబోఁడి పుష్పవతి యయ్యెను. తచ్చతుర్థదివసంబున నక్కమఠుండు సురోచనునకీ వృత్తాంతంబు వెల్లడియొనర్చి "సురపుంగవా! భవత్కటాక్షాభిలాషిణి యగు సత్యవతీదేవి మనోభీష్టంబు దీర్పు" మని శ్రుతపఱుప నగ్గంధర్వుండు తత్క్షణం బా గర్దభరూపంబు విసర్జించి ద్యుమణినిబోలు శరీరకాంతిచే నవరత్నఖచిత హారకేయూరాది దివ్యభూషణంబులు ధరించి విరాజమానుండై నిల్చున్నం గమఠుండు విస్మయంబంది నిజహృదయంబున "నాకలోకనివాసుండు మత్పూర్వకృతపుణ్యవిశేషంబుచే నాసదనంబున నివసించె. నితనికై పృథ్వీశునిపుత్రిక సన్నాశ్రయించె. సురసంచయంబునకు పీయూషంబు లభించినట్లు కలాధరునకు గంగాధరాశ్రయంబు సమకూరినచందంబున వనితాలలామయగు సత్యవతీదేవి కీస్వర్గవాసుండు సంబంధించెను. తమోభంజనునకు శ్యామకర్ణంబు కమలాక్షునకు కమలవాసిని ప్రాప్తించినకైవడి సురోచనునకు సత్యవతీదేవి యనుకూలించెను. నేనీ యుభయులచే ధన్యాత్ముండనైతి" నని తలంచు

చు సురోచనుని చరణసరసీరుహంబులపై శిరంబు మోపి "మహాపురుషా! భవత్స్వరూపప్రతాపంబు లేనెఱుంగక యనేకపాపకర్మంబు లాచరించితి. మూఢమతిచే సంసారంబుకై నీపృష్ఠభాగంబున మృత్తికం గొని తెచ్చితి ననేకపర్యాయంబులు తాడనం బొనర్చితి నాయట్టిదురాత్ములుగలరే? నాపాపంబునకు పారంబు గలదే! దయాఘనా! నాయపరాధంబులు క్షమించి నన్నుద్ధరింపవే" యని పొగడుచుండ గంధర్వోత్తముండు కుమరకులాలుని శాంతిపఱచి వేగంబున నంతర్గృహంబు ప్రవేశించి సత్యవతీదేవిని జేరంబిలువ నమ్ముద్దియు గులుకుమిటారంబులచే మరాళంబుమాడ్కి మందగమనంబున హాసాననుని బోలు సురోచనగంధర్వుని సన్నిధి కేతెంచి షోడశోపచారంబులచే బూజలొనర్ప గంధర్వోత్తముం డాసురీయోగంబున నక్కాంతామణిని మనోభవసుఖాంబుధిని మగ్నపఱచెను. దైవయోగంబున నవ్వనజగంధి యాకేయి సురోత్తముని వీర్యంబున గర్భంబు ధరియించుట నెఱింగి సురోచనుండు సత్యవతింజూచి "ప్రియే! సత్యవతీ! నీగర్భంబున నపూర్వచరిత్రుండగు పుత్రుం డుదయించు నతం డమితతేజోవంతుండై స్వవిక్రమంబున పృథ్వీచక్రం బేలుచు శౌర్యధైర్యసాహసంబులచే వితరణశీలుండై విక్రమనామంబున జగద్విఖ్యాతిం జెంది శకపురుషుండై ప్రకాశించు. నేనా తనూభవుని వదనావలోకనమాత్రంబున శక్రశాపమోచనుండనై స్వర్గంబున కేగెదను. నీవాపుత్రునిచే ననేకభాగ్యంబు లనుభవించుచు మద్వియోగపరితాపంబు మాని సంతసంబున మెలంగు" మని దనశాపకారణమూలంబు దెలియపఱచి వేగంబున గర్దభరూపంబు ధరించెను. సత్యవతీదేవి గర్భంబు దినదిన ప్రవర్ధమానం బగుచుండ పురజను లీకుమరకులాలునిచే "నీముదిరాక్షి యెవ్వరికూతు" రని విచారింప నతం డిప్పడంతిమిన్న మత్పుత్రిక" యనియు నేనీ చేడియకు ప్రసవనిమిత్తమై దోడితెచ్చితినియు సమాధానపఱచుచుండెను. తదుపరి సత్యవతీదేవి నవమాసపూర్తిజెంది శుభతిథి శుభవాసర శుభనక్షత్ర శుభయోగ శుభకరణంబున నపారతేజోమయుండగు సుతుని బ్రసవించి ద్వాదశదివసంబున డోలికం జేర్చి విక్రముండని నామకరణం బొనర్చె నానాఁడా సురోచనగంధర్వుండు సూర్యాస్తమయానంతరంబున గర్దభస్వరూపంబు విసర్జించి నిజరూ

షంబుచే ప్రకటుండై జాతాపత్యురాలగు సత్యవతీదేవిని సంబోధించి కుమారుని గనబఱచు మన నయ్యువిద తత్క్షణంబున విక్రముని గొని తెచ్చి యొసంగెను. సురోచనుం డమితానందంబుచే తనయుని ముఖకమలంబు విలోకింపుచుండు సమయంబున పాకశాసనుండు శాపవిమోచనకాలంబు దలంచి మాతలిసహితంబుగ విమానంబు ననుప నతండతిశీఘ్రంబున నవంతికానగరంబు ప్రవేశించి కమలకులాలుని సదనంబు జేరి సురోచనగంధర్వునితో "గంధర్వోత్తమా! సహస్రాక్షుండు యుష్మచ్ఛాపమోచనసమయంబు దలంచి దివ్యవిమానంబు బంపె. తడవేల? రయంబున విమానంబుపై యలంకరింపుము స్వర్గంబున కేగవలయు" నన సురోచనుండు సత్యవతీదేవికి డింభకు నర్పించి గమనోన్ముఖుండై నిల్చున్న గంధర్వశ్రేష్ఠుని గనుంగొని యశ్రుపూరితలోచనయై "ప్రాణవల్లభా! భవత్కారణంబున మజ్జననీజనకులు మోహరహితులై నన్ను గనుంగొనలేరైరి. యుష్మద్వియోగం బెట్లు సహింతు? దయాశీలా! నన్నింటి బరిత్యజించుట ధర్మంబగునే" యని శోకింపుచుండ నమ్మహామహుం డత్యంతదయాన్వితుండై సత్యవతీనేత్రబాష్పంబులు దుడుచుచు "మద్వియోగంబుచే దుఃఖింపకుము నీవు నన్ను ధ్యానించినక్షణంబున ప్రత్యక్షంబయ్యెద"నని యనేకవిధంబుల నోదార్చి విమానారోహణంబు జేయుచు కమలకునితో "కులాలోత్తమా! సుతసహిత సత్యవతీదేవిని సంరక్షింపు" మని వాక్రుచ్చి త్వరితంబున నాకలోకంబు జేరంజనెను. పిదప శుక్లపక్షక్షపాకరుభంగి విక్రముండు ప్రవర్ధమానుండగుచు సప్తవర్షంబుల బాలుండై యాటపాటలచే పురోసూచిక రాజచిహ్నశైశవం బొనర్చుచు కాలంబు గడుపుచుండి ద్వాదశవత్సరపరిపూర్తి జెంది తోడిబాలుర సహాయంబుచే ననేకవిద్యలభ్యసించి షోడశవర్షంబులు గలిగి రాజభటసహవాసంబుచే యశ్వారోహణుండై చతురత్వంబున మెలంగుచుండ తత్పురరక్షకసైన్యం బిబ్బాలుని కుశలత్వంబు శ్లాఘించుచు నగరాధిపతి కెఱింగింప నతం డీ విక్రముని నగరరక్షకాధిపత్యపదవిపై నియమించి పురద్వారసమీపంబున నుంచెను. గావున శ్రోతలారా! సురోచనగంధర్వునిచరిత్రం బీప్రకారంబు గలదు. తద్గంధర్వసుతుండగు విక్రముండు నగరద్వారరక్షకుండై పాంథుల నికటంబున కేతెంచుతఱి భర్తరీనాథుండు జంబుక

వ్రజభాషణంబు లెఱింగి "యొకదానవుం డేతెంచును. తత్పిశితాశనుని ఖండించి రుధిరతిలకంబు ఫాలంబున ధరించువారికి యవంతికానగరసామ్రాజ్యంబు లభించు" నని పలుకుచున్న వాక్యంబులు విక్రముండు గ్రహించి వేగంబున కరవాలంబు గొని నలుదిశలు నిరీక్షించుచుండ చిత్రమగంధర్వుం డంబికాశాపహతుండై నక్తంచరరూపంబున నానారణ్యంబులు గ్రుమ్మరుచు జంబుకోక్తప్రకారంబుగ నచ్చోటికరుదెంచి పాంథులసమూహకోలాహలంబు లాకర్ణించి దుర్బలుండగు కతంబున మనుష్యరూపధరుండై కాంతిపూరితరత్నచతుష్కంబు నిజహస్తంబున బూని చనుచుండ విక్రముండు భర్తరీనాథోదిత రత్నచిహ్నంబులు గని యసురుండు వీఁడే యని యూహించి శస్త్రఘాతంబున నయ్యసురుని మస్తకంబు దెగటార్చి తద్రక్తంబుచే ఫాలంబున తిలకంబు దిద్ది ధీరుండై నిల్చుండ చిత్రమగంధర్వుఁడు శాపమోచనుండై నిశాచరకాయంబు బాసి నిజస్వరూపంబుచే ప్రసన్నుండై విక్రముని పదసరోజంబులకు వందనం బాచరించుచుండ నతనికై మనోహరవిమానం బేతెంచెను. విక్రముం "డీ చిత్రంబేమి" యని విచారింప చిత్రమగంధర్వుండు శాంభవీశాపకథనం బెఱింగించి విమానారూఢుండై శీఘ్రంబున దేవలోకంబున కేగె. విక్రముండు భూపతన పిశితాశనశవహస్తామూల్యరత్నంబులు గనుంగొని ముదంబున తద్రత్నంబులు పరిగ్రహించి భర్తరీనాథుని దనహృదయంబున దలంచి పాషాణసమూహంబున పరుసంబుపగిది గ్రాసుధేనువులలో కామధేనువుభంగి మనుష్యజాతిసంఘంబున నవతరించిన పుణ్యఘనుండని పొగడుచు నమ్మహామహుని స్నేహంబున నాకఖండభోగంబులు గలుగునని యూహించుచు త్వరితంబున నగరద్వారసమీపంబు జేరి రుధిరతిలకం బాద్వారంబుపై దిద్ది పాంథుల విడిదికి నేతెంచి వ్యవసాయకుల మధ్యప్రదేశంబున గ్రహమండలంబున బ్రకాశించెడు ప్రభాకరునికరణి ద్యుతిబూని యుపవేశించి యున్న భర్తరీనాథుని గనుంగొనుచుండ వ్యవసాయకులాగతవిక్రముని తామెవరని బ్రశ్నింప నతండు "నేను రాజసేవకుండనై గ్రామరక్షణపరత్వంబున ద్రిమ్మరుచుండెదను. నేనీ యామంబున మీకోలాహల నినదంబుచే తస్కరు లేతెంచిరని తలంచి మీ యోగక్షేమంబులు విచారింపనిం దేతెంచితి గావున తస్కరులజాడ మీ రెఱింగితిరి. స్పష్టప

ఱచు” మన పాంథులా విక్రమునితో “నయ్యా! మే మిచ్చో నిర్భయంబున నివసియుండియుండ నొకజంబుకసముదయం బేతెంచి గూయుచుండ తద్భాషాభిజ్ఞుండగు నీభర్తరీనాముం డెఱింగి మా కావృత్తాంతంబు దేటతెల్లంబుగ దెలియపఱచె నందుచే మును ముందు స్వహస్తంబుల శస్త్రంబులు ధరించి చోరుల పొగురడంచితి”మని విన్నవింప విక్రముండు సప్రేమచే భర్తరీనాథుని దర్శించి కొంతవడి పాంథులతో మధురసంభాషణంబులు సల్పి తిరిగి నిజసదనంబున కేతెంచి యుదయంబున శౌచంబునకై జనుచుండ వ్యవసాయకుల ధాన్యసుంకంబు బుచ్చుకొను పురుషుండు హఠాత్తుగ నెదుర నేతెంచుచుండం గని విక్రముండా పురుషశ్రేష్ఠునితో “నయ్యా! గ్రామబాహ్యంబున బహుధాన్యంబుచే వ్యవసాయకులు నివసించి యున్నారు. మీరా ధాన్యసుంకంబున కపేక్షింపవలదు. నే నా సుంకద్రవ్యంబునకు ముమ్మడిధనం బొసంగెదను. తత్పాంథజనసంఘంబున శోభిల్లెడు భర్తరీనాముని మత్స్వాధీనం బొనర్పుము. తత్కారణం బెయ్యది యన భర్తరీనాముండు మద్బంధుండై దైవయోగంబున నన్నెడబాసి వ్యవసాయకుల వెనువెంట గ్రుమ్మరుచుండుగాన నాయం దనుగ్రహించి యబ్బాలుని సమకూర్చిన నీ కనేకపుణ్యంబు లభించు” నని యనేకవిధంబుల బొగడుచుండ నతండు నిర్జీవశరీరంబు సజీవంబైనచందంబున సుఖదుఃఖ

విక్రమభర్తరీనాథునకు భ్రాతృభావసఖ్యం బొనగూడుట.

కారకంబగు ద్రవ్యలోభత్వంబుచే హర్షించి “యక్కార్యం బీడేర్చెద” నని వాగ్దత్తం బొసంగి స్వస్థానంబున కేగి యొకభృత్యునితో వ్యవసాయకుల గొనితెమ్మని యాజ్ఞాపింప వాం డతివేగంబున పాంథజనకుటీరంబులు జేరంజని ధాన్యసహితంబుగ వారిని దోడ్కొని యేతెంచెను. తత్క్షణం బా వ్యవసాయకులంగని “మీమండలంబున భర్తరీనామ పురుషశ్రేష్ఠుం డెక్కడ” యని విచారింప వార లతివేగంబున భర్తరీబాలుని సుంకరిపురోభాగంబున నిలుప నతం డబ్బాలుని రూపలావణ్యంబుల కచ్చెరువొంది యీనరోత్తముండు కేవలావతారపురుషుండు గానోపు నని మనంబున నిశ్చయించి యితం డీ నగరంబున నివసింపందగియుండు. మూఢమతులగు వ్యవసాయకుల పజ్జ నుండ

దగదని వితర్కించి వ్యవసాయకముఖ్యనాయకుని నేకాంతంబునకు గొనిపోయి "మీధాన్యంబునకు శుల్కంబు విచారింపను. మీధాన్యంబిచ్చో బడవైచి శీఘ్రంబున మీగ్రామంబునకేగి ధాన్యంబు దెచ్చి నిర్భయంబుచే విక్రయించుకొను" మనుచు భర్తరీబాలుని జేరబిలిచి "పురుషముఖ్యా! ఈవ్యవసాయకులేగి ధాన్యంబు గొనితెచ్చువఱకీనగరంబున నివసించి యీధాన్యంబు విక్రయింపుము. నీకై మత్సహాయం బొసంగెద" నన భర్తరీజనితుం డవశ్యం బని ప్రత్యుత్తరం బివ్వ నావ్యవసాయకులు హర్షంబుచే తమతమధాన్యంబు లాసుంకరిగృహంబున నుంచి యందుకై భర్తరీబాలుని నియోగించి "మే మతివేగంబున ధాన్యంబు గొనితెచ్చెదము. మాకార్యంబులు జక్కబెట్టుదు" రని వినయపూర్వకంబుగ మనవిజేసి తమనివాసస్థలంబుల కేగిరి. పిదప నతండు విక్రముని బిలచి యతిరహస్యంబున దనకృత్రిమంబు వెల్లడి యొనర్చి "నాకిచ్చెదనన్న ద్రవ్యం" బిమ్మని విచారింప విక్రముం డొకమహారత్నం బాశౌల్కికునకు బహుమతి యొసంగి దనడెండంబున భర్తరీబాలునకు మీబంధులమని దెలియపఱచి మాయింట విందారగింపుమని యొడంబఱచి నిజసదనంబునకు దోడ్కొని జని భోజనాదులచే సంతుష్టిపఱచితినేని యితని స్వరూపప్రకటనం బగునని తలంచి రహస్యంబున సుంకరి కెఱింగింప నతండు విక్రమునితో "నయ్యా! ప్రతిదినంబు మాగృహంబున పదార్థంబు గొనిపోయి యుష్మజ్జననీహస్తపాకంబుచే యిభ్భర్తరీబాలుని దృప్తిపఱపుచుండు"మని నుడువ విక్రముండు హర్షించి భర్తరిని దనగృహంబునకు దోడ్కొనిపోయి దనతల్లియగు సత్యవతీదేవికి నిశామృగభాషణాది వృత్తాంతంబు దనకు లభించిన రత్నచతుష్కచరిత్రం బిమ్మహాఘనునికతంబుచే నని దెలిపి "తల్లీ! అద్యాది యీభర్తరీపురుషుని మత్తుల్యంబుగ భావించి భోజనాసనాదులచే గాపాడుచు మజ్జ్యేష్ఠపుత్రుండని నిర్భేదంబున ప్రసిద్ధి యొనర్పు మిమ్మహాపురుషుండు ప్రత్యక్షావతారఘనుండు గాబోలు" నని యుక్తియుక్తంబుల నిగదించి యాపై భోజనంబు సల్పి విక్రముండు రాత్రి ప్రథమయామంబున నిత్యనియమప్రకారంబుచే ద్వారరక్షకపదవిపై జనెను.

ఇట భర్తరీజనితుండు భోజనానంతరంబున సుంకరిగృహంబునకేగ నయ్యధికారి గృహిణి భర్తరీనాథునితో "నీవిచ్చో మా

యవసరసమయంబున కార్యసహాయుండవు గ”మ్మన నందు కంగీకరించి పునర్విక్రమసదనంబునకు జేరంజనెను. ఇట్లు భర్తరీనాథుం డుభయ మందిరంబుల సంచరించుచు ననుదినంబు నిజచతురత్వంబున పురజనులచే లాలింపఁబడుచుండెను. తదనంతరం బా సత్యవతీదేవి విక్రమో క్తప్రకారంబుగ జ్యేష్ఠపుత్రుం డని మదిదలంచి యంతకంతకు ప్రేమాతిశయంబు గలిగి వత్సంబుపై ధేనువువిధంబున నంతఃకరణ పరిపూర్ణత్వంబుచే రక్షింపుచు జలంబు బాయని వాలుగంబుపగిది భర్తరీముఖ్యుని నెడబాయక విక్రమునమేతంబుగ సమయంబు గడపుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున విక్రమభర్తరీచరిత్రంబు షడ్వింశాధ్యాయము సంపూర్ణము.

సప్తవింశత్యధ్యాయము.

విక్రమార్కుండు శుభవిక్రమనృపాలుని కూఁతును వివాహంబాడి తద్రాజ్య పట్టాభిషిక్తుండగుటయు, తద్వద్భర్తరీనాథుండు సుమంతీకనామ సచివోత్తముకూఁతును వివాహంబాడి యువరాజ్యపట్టాభిషిక్తుం డగుట.

ఇట్లీ భర్తరీ విక్రము లేకోదరులకై వడి యన్యోన్యస్నేహంబుచే సమయంబు గడుపుచుండ నొకనాఁ డా యవంతికాపురాధిపతియగు శుభవిక్రముం డంతఃపురంబున మణిఖచిత సింహాసనంబుపై యుపవేశించి వివాహానుకూల నిజదుహిత నీక్షించి దనమంతనంబున నిమ్మేధావతి నిష్కళంక ముఖకమలంబు గని కలాధరుండు సిగ్గరి యుప్పరవీధి జరించెనో? ఇమ్ముద్దియనయనంబుల కలిమికై కలువములజవరాలు నలిజంబే నిలయంబుగాఁగొనెనో? చెలిశ్రోత్రంబులు దలంచి శ్రీకారంబు ద్వివిధాకారంబు బూనెనో? లోలాక్షియధరం బే బింబంబని నిక్కి చూచుటకు శుకనికరంబు వృక్షశాఖాగ్రంబులపై వ్రాలెనో? సుందరీమణి మృదుమధురోక్తుల సాధింప నలువరాణి విపంచిని బూనెనో? తరళాక్షిగళసౌందర్యంబున కోటుబడి జలజంబు మ్రొత

లిడెనో? తన్వీమధ్యంబున కెనలేని నిజమధ్యంబు గని సింగం బాగ్రహంబున చెలికుచకుంభంబులబోలు కరికుంభంబులపై కెగిరెనో? యువిదతనుకాంతి కెదిరించు మించు లా చపలాక్షి చూపుతూపుల భయంబుచే చపలంబు లయ్యెనో? సర్వావయవలావణ్యనిధి యగు నీ మేధావతీనారి న్నిరీక్షించుటకు సుర లనిమిషత్వంబు వహించిరో? యని యూహించి సుయోచనపరుండగు సుమంతీకుండను సచివుని బిలిచి "మంత్రిముఖ్యా! మేధావతీదేవి వివాహంబున కనుకూలవతి యయ్యెను గావున సర్వలక్షణయుతుండగు వరుని శోధింపు" మని యాజ్ఞాపింప సుమంతీకుండు "నరేంద్రోత్తమా! మీకు పురుషసంతానంబు లేదయ్యె. మీ శరీరంబు జరామయంబై విషయసుఖంబుల దొలంగె. నికముందు సంతానంబు వడయుట దుర్లభంబు. సకలగుణసంపన్నుండగు వరుని గొని తెచ్చి యిమ్మేధావతీదేవికి వివాహంబొనర్చి జామాతృనకు రాజ్యపట్టాభిషేకంబొనర్పవలయు నతనిచే నుభయకులపవిత్రకరుండగు దౌహిత్రలాభంబు నొందవలయు నని యస్మదభిప్రాయంబు గల" దన శుభవిక్రముండు హర్షించి "ప్రధానశేఖరా! సర్వేశ్వరాయత్తచిత్తులమై యొక వేదండశుండంబున పుష్పహారంబుంచి యనేకవైభవంబులచే నూరేగింపవలయు. భగవత్ప్రేరేపితబుద్ధిచే నయ్యిభరాజం బే పురుషశ్రేష్ఠుని గళంబున హారంబుంచునో యానరోత్తమునకు రాజ్యపట్టాభిషేకం బొనర్పవలయు. పిదప మేధావతీకన్యక నొసంగి వివాహంబు సల్పవలయు" నని స్పష్టపఱచెను. సుమంతీకుం డందు కంగీకరించి యొకసుదివసంబున మహోత్సాహంబుచే యమూల్యవస్త్రభూషణాలంకారంబుల ద్విరదంబును శృంగారించి శుండాగ్రంబున పుష్పమాలిక నొసంగి నరపుంగవుం డమాత్యభటనటపురోహిత పరివృతుండై యూరేగింపఁదలంచి మునుముందు రాజసభ కేతెంచి తత్స్థలంబు బాసి కుంజరంబు స్వేచ్ఛావిహారంబున పురవీథులు గ్రుమ్మరుచు నేతన్మహోత్సవసందర్శనోత్సుకులై యేతెంచిన యన్యపురనివాసుల నిరీక్షించుచు నగరద్వారసమీపంబున కేతెంచి మందగమనంబుచే నలుదిశలు విలోకింపుచుండ నృపుండు సంశయమనస్కుండై ద్వారోపరిభాగంబున నివసించు రక్షకభటుల నాహ్వానం బొనర్ప వార లతివేగంబున నేతెంచి భూరమణుని పురోభాగంబున నిల్చున్నంత నమ్మదవా

రణం బతిశీఘ్రంబున జనుదెంచి పరాక్రమధుర్యుండగు విక్రముని గ్రీవంబున హారం బుంచెను. నృపుం డా రూపలావణ్యవిశేషుండగు విక్రముని గనుంగొని యత్యంతానందంబుచే తక్షణం బా గజేంద్రంబుపై నెక్కించి భేరీభాంకారప్రముఖ నిఖిల నినదంబులతో సభామంటపంబునకు దోడ్కొని యేతెంచి స్వర్ణమయదివ్యసింహాసనంబుపై గూర్చుండ నియమించి మృదుభాషణంబులచే సంభాషించుచు కులగోత్రంబులు వెల్లడి యొనర్చి కులాలుండని గ్రహించెను. మహీధవుండు పరితప్తమానసుండై కుంభకారకులంబునకు కువలయేశ్వరకుల సంబంధం బెట్లు ఘటించు? నెంచిచూడ మహానింద్యంబుగాదే? యగమ్యంబగు పరమేష్ఠి సృష్టినిర్మాణం బెవరెఱుంగుదురు? కులాలవంశంబున నిట్టి సర్వలక్షణోపేతుండు జన్మించుట యరుదుగాదే? యని శంకించి మతిమంతుండగు సుమంతుని బిలచి గోప్యంబున "నిప్పురుషుండు కులాలజాతుండో లేక నితరజాతుండో పరిశీలింపు" మన నతం డవశ్యంబని రయంబున పురద్వారనికటంబు జేరి రక్షకభటులతో "విక్రముం డేజాతిపురుషుం" డని విచారించెను. వార లత్యంతభయభక్తులచే "నయ్యా! మే మా పురుషశ్రేష్ఠుని ఘటకారకులజుండు గానోపునని యూహించెదము. కమఠనామకులాలుని సదనంబున నతండు నివసించు నింతియదప్ప యన్యం బే మెఱుంగ" మని విన్నవించిరి. పిదప కుశలమతియగు మంత్రిపుంగవుం డక్కులాలుని గృహంబున కేతెంచి రహస్యంబున కమఠుని విచారింప విక్రముని జనకుండు సురోచనగంధర్వుం డనియు, మిథిలానగరాధిపుండగు సత్యవర్మ దుహితయగు సత్యవతీదేవి తల్లి యనియు గతచరిత్రం బంతయు విశదీకరించెను సచివోత్తముండు పరమానంద భరితుండై కమఠకులాలుని వెంటగొని రాజభవనంబున కేతెంచి విక్రమజన్మకథావృత్తాంతం బా కమఠునిచే పృథ్వీశున కెఱింగించెను. జననాయకుండు మితిలేని యానందంబుచే "మంత్రిముఖ్యా! నీ వీ కమఠుని గొని పరివారసహితుండవై మిథిలానగరంబున కేగి సత్యవర్మనృపశ్రేష్ఠున కీ వృత్తాంతంబు శ్రుతపఱచి బహువిధ సన్మానంబులచే దోడితె" మ్మని యాజ్ఞాపింప నతం డవశ్యంబని రయంబున పృతనాసహితుండై మిథిలానగరంబు జేరంజన సత్యవర్మనృపుం డా మంత్రిపుంగవుని యాగమనం బెఱింగి సపరివారుండై

యెదుర్కొని నిజభవనంబునకు గొనితెచ్చి యేకాంతంబున మంత్రిసహిత కమఠకులాలునితో కుశలప్రశ్న జేయ నక్కుమరుండు "రాజోత్తమా! భవద్దుహిత యగు సత్యవతీగర్భంబున సురోచనగంధర్వునిచే పుత్త్రుం డుద్భవించె నయ్యతులితతేజోఘనుండగు భవద్దౌహిత్త్రుండు విక్రమాభిధానంబుచే బ్రకాశించి దైవయోగంబున నవంతికా సింహాసనాధిపత్యంబు వహించె" నని నిఖిలవృత్తాంతంబు దేటపఱచెను. సుమంతికమంత్రిపుంగవుండు నృపాలోత్తమునితో "యుష్మద్దౌహిత్త్ర పట్టాభిషేక మహోత్సవంబు వివాహసమారంభంబు విలోకించుటకై యవంతికానగరంబునకు దయచేయు" మన సత్యవర్మ పృథ్వీశుం డతి కుతుకంబుచే ననేకదళసమేతుండై యవంతికానగరంబు ప్రవేశించి మునుముందు సత్యవతిని గనుంగొని యశ్రుపూరితనయనుండై క్షేమ సమాచారంబులు విచారించి యత్యంతగౌరవంబున లాలించి తదుపరి శుభవిక్రమునితో గూడి పరమసంతోషంబుచే స్వదౌహిత్త్రుండగు విక్రమునకు రాజ్యపట్టాభిషేకం బొనర్చెను. విక్రముం డా సమయంబున మహావితరణశీలుండై తత్పట్టాభిషేకమోదంబుచే యాచకజనసంతుష్టి యొనర్చెను. తదనంతరం బా శుభవిక్రముండు దనపుత్త్రికయగు మేధావతీదేవిని విక్రమున కొసంగి యనేకవైభవంబులచే వివాహం బొనర్చెను. సత్యవర్మనృపుం డా విక్రమునిరూపగుణధైర్యంబుల కానందించి దన మిథిలానగర పట్టాభిషేకోత్సవంబు సలిపెను. విక్రముం డుభయ రాజ్యంబులకు సార్వభౌముండై భర్తరీనాథున కవంతికారాజ్యంబునకు యువరాజ్యాభిషేకంబు గావించి నిర్మలచిత్తుండై రాజ్యం బేలుచుండ సుమంతీక మంత్రిపుంగవుండు భర్తరీనాథుని సౌందర్యం బాలోకించి యిమ్మహాఘనునకు దనకూతురై యగు పింగళా యను నారీమణి నర్పింపవలయు ననియు విక్రమనరనాయకునిచే నాలోచించి తిథివారనక్షత్రంబు లేర్పఱచెదననియూహించుతఱి యొకరజకుండేతెంచి "సచివోత్తమా! భర్తరీపురుషుని జాతిభేదంబులు విచారింపు" మనెను. సుమంతీకుం డాక్షణంబున కమఠకులాలుని బిలచి భర్తరీపురుషుని కుల గోత్త్రంబులు విచారింప నక్కుంభకారుం డే నెఱుంగననియె ననంతరం బా సుమంతీకుం డంతఃపురంబున కేగి రాజమాతయగు సత్యవతీదేవిని "నీ కీ భర్తరీపురుషశ్రేష్ఠుండు సుతుం డెట్లయ్యె" నని విచా

రింప నమ్మగువ "మద్గర్భోద్భవుండు గాఁ" డనియె. పిదప నృపుండగు విక్రమునిచే నీసంశయంబు బాయునని దలంచి యేకాంతంబున "నృపాలశేఖరా! భర్తరీనాముండు భవత్సహోదరుం డెప్పగిది యయ్యెనో దయజేయు" మన నమ్మహీవల్లభుండు స్నిగ్ధభావంబున ననుజుం డయ్యెగాక నితని జన్మవృత్తాంతనైజం బే నెఱుంగ" ననియె. నాపై భర్తరిని విచారించిన విశదం బగునని తలపోసి రహస్యంబున "పురుషశ్రేష్ఠా! యుష్మజ్జన్మచరిత్రంబు శ్రుతపఱచు" మన నమ్మహాపురుషుండు హరివీర్యపూరిత భర్తరీపాత్ర ప్రముఖ కురంగపోష్య జయసింగభాటపోష్య కథనంబు సవిస్తరంబుగ దెలియఁబలికెను. సుమంతీకుం డతిగహనంబగు జన్మచరిత్రం బాలకించి దనహృదయంబున భర్తరీవాక్యంబులు నిశ్చయంబు లెట్లౌను? సూర్యవీర్యపతనం బెక్కడ గర్భాధారంబులేక భిక్షాపాత్రంబున జన్మించు టెక్కడ? విచారింప స్వలాభంబుకైరచించిన కల్పితంబులని దలంచి భర్తరితో "వత్సా! యుష్మజ్జనకుండు కమలమిత్రుండే నిక్కంబేని వివాహమంగళ కార్యప్రారంభంబుకై యతనిచే ననుజ్ఞ బొందవలయు గాన నద్దినేశుని యాహ్వానం బొనర్పు"మనెను. భర్తరీనాథుండవశ్యంబని రయంబున బహిరంగణంబున కేతెంచి హస్తంబులెత్తి "జగద్రక్షకా! నే నీ వీర్యంబున నుదయించుట సత్యంబేని నావివాహ శుభకార్యంబున కరుదెంచవలయు" నని దీర్ఘశబ్దంబుచే బలుకుచుండ సర్వవ్యాపకుండగు ప్రభాకరుం డతివేగంబున నవంతికాపురసౌధాగ్ర సమీపంబున వాతచక్రాధారుండై నిల్చి "సుమంతీకా! భర్తరిజనితుండు మత్పుత్రుం డౌట యథార్థంబు నిస్సంశయుండవై యుష్మత్సుత నొసంగి వివాహంబు సల్పుము. వరపక్షంబున విక్రమజనకుండగు సురోచన గంధర్వోత్తముండు సమస్తమంగళద్రవ్యంబులు గొని యేతెంచు. సురసంఘంబు మంగళతూర్యంబు లొనర్చుచు పుష్పవర్షంబు గురిపించును. నానిజరూపంబున మర్త్యభూమి కేతెంచెదనేని మత్కిరణజ్వాలలచే ననర్థంబు వాటిల్లు"నని సెలవొసంగి స్వస్థానంబు జేరెను. సుమంతీకుండు పరమాహ్లాదంబుచే శుభదివస శుభలగ్నం బేరఱచినంత సురోచనగంధర్వుండు మంగళకరవస్తుజాలంబులు గొని రయంబున నేతెంచి సత్యవతీపురోభాగంబున నిల్చుండ నక్కాంతామణి భక్తి వినయంబులచే వల్లభుని పదపల్లవంబులకు ప్రణమిల్లి తన

యుండగు విక్రముని కెఱింగింప నతం డతులితానందంబున జనుదెంచి జనకుని చరణంబులకు వందనంబిడి ప్రధానిశేఖరుండగు సుమంతీకుని సదనంబునకు దోడ్కొని జన సచివోత్తముం డనివారిత ముదంబుచే పులకాంకితశరీరుండై గంధర్వశ్రేష్ఠుని పాదంబులపై ఫాలంబు మోపి సాగిలుచుండ సురోచనుండు "సుమంతీకా! నీభాగ్యవిశేషం బెంతని యూహింతును? ప్రత్యక్షద్రుమిలనారాయణుండు భవజ్జామాతయై వెలయుట సామాన్యంబే" యన సుమంతీకుండు గంధర్వముఖ్యునకు పునఃపునర్వందనంబు లాచరించి యుష్మత్కరుణాకటాక్ష ఫలితంబని గొనియాడుచు సీమంతపూజకై శుభమంటపంబున కేగవలయు దయ జేయు మన సురోచనుం డవశ్యం బని మనుష్యవేషధారియై వరపక్షంబున విధ్యుక్తమంగళకార్యంబులు నెరవేర్చి సుముహూర్తసమయంబున మహీసురోత్తములు మంగళాష్టకంబులు బాడ బృందారకబృందంబులు మంగళవాద్యంబులచే లతాంతంబులు వర్షింపుచు నంబరంబున విమానారూఢులై జయజయశబ్దంబులచే కరతాళంబులు వాయింపుచుండ వధూవరుల మస్తకంబుల విన్యస్త మౌక్తికులై పరమానందంబున దివసపంచకం బచ్చో నివసించి మహావైభవంబులచే యాచకజనహృదయసంతోషం బొనర్చి విక్రమనృపాలుని భవనంబున సురోచనుం డొకమాసంబుండి శుభవిక్రముని యనుజ్ఞ గొని నిజధామంబున కేగెను. పిదప భర్తరీనాథుండు ద్వాదశశత సఖీమణుల వివాహంబులాడి యనన్యశభోగభాగ్యంబులచే సర్వకళావిశారదత్వంబున సుదతీసంఘ మనఃపద్మవిహార మధుకరుండై ఘోరాటవి భ్రమియించు మత్తేభంబుకై వశీ విహరింపుచు ముఖ్యమహిషి యగు పింగళాదేవి నవయౌవనార్పితచిత్తుండై జలంబు బాయని కర్దమంబుభంగి యన్నాల సమూహంబున నవలక్షనక్షత్ర మధ్యప్రదేశంబున ప్రభాసించెడుమృగాంకుని చందంబున దేజరిల్లుచు దినదినం బా పింగళాదేవి స్వరూపలావణ్యంబుల కత్యంతలోలుండై కాలంబు గడుపుచు వయోవృద్ధుండయ్యెను. ఒకానొకదివసంబున భర్తరీనాథుండు మృగయావినోదంబుచే నరణ్యంబున కేగుచుండ నహస్కరుండు సుతుండగు భర్తరీనాథుని బొడగాంచి దనమనంబున మదీయవీర్యభాగంబుచే నగస్త్యుం డుదయించి స్వహితం బొనర్చుకొనియె. భర్తరీజనితుండు రాజ్యసుఖసంపద్బద్ధ

చిత్తుండై నిర్మలజ్ఞానవైరాగ్యమార్గనిష్ఠప్రకంటకుండయ్యె. విషతుల్యవిషయసుఖంబు లెప్పగిది దొలంగునో ద్రుమిలనారాయణావతారఘనుండై నాథముఖ్యుల మార్గం బాశ్రయింపక నిజకార్యంబు దలపెట్టఁడయ్యె నని వితర్కించి శీఘ్రంబున ననసూయాపుత్త్రుండగు దత్తాత్రేయుల సన్నిధికి విచ్చేసి "దయాఘనా! ద్రుమిల నారాయణుండు మదీయవర్యంబున జన్మించి భర్తరీనామంబుచే తుచ్ఛసంసారలంపటుండై స్వహితం బెఱుంగక వైభవంబులచేఁ బ్రకాశించుచుండును. యుష్మత్కృపాకటాక్షంబుచే మత్స్యేంద్రాదులు పరిపూర్ణతపోయోగంబున ప్రతాపధ్వజులై విలసిల్లిరి. మత్సుతుండగు భర్తరి భవదనుగ్రహంబునకు పాత్రుండు గాఁడే" యని సవినయుండై విచారింప నమ్మహామహుండు "కమలమిత్రా! భవిష్యత్పురాణోదిత 'యావన్మహీ తావజ్జతీ' యనువాక్యంబు రిత్తవోవునే? భర్తరిజనితుండు మదనుగ్రహపాత్రుండై మహాతేజంబున చిరంజీవిత్వంబున గీయమాన గుణకదంబుండగుట నిశ్చయంబని దలంపుము. నీ వీ సంశయంబుడుగు" మని యవ్విభాకరుని నిజస్థానంబున కనిపి జగదుద్ధారఘనుండగు దత్తాత్రేయుండు భర్తరికై నేగుచుండెను.

~ { భర్తరీనాథుఁడు వేఁటకై యరణ్యంబున నేగి భ్రమియించునెడ శ్రీగురుదత్తాత్రేయ సందర్శనం బగుట. } ~

ఇట భర్తరీశ్రేష్ఠుండు నవరత్నఖచిత నానావిధభూషణభూషితంబులై సమీరగమనంబులచే విహరించు చతుర్దశలక్షతురంగంబులతో రమణీయమణిమయస్వర్ణచిత్రితఝల్లరీయుతదివ్యాంబరంబులచే నమూల్యముక్తాహారపరిశోభిత సుగ్రీవులగు మత్తశుండాలంబు లోకలక్షగొని కృతాంతభట మదవిదారక దోర్బల భటసమూహాన్విత యగణిత పృతనలచే కాననాంతర హరిశరభకిరికిటిప్రముఖాఖిలక్రూరమృగసంచయంబును నఱుకుచు నుఱుముచు నుగ్గడంచుచు భయంకరగిరిశిఖరంబులపై కేగుచు నుష్ణాంశురశ్మిచే డస్సి యధోభాగంబున కరుదెంచి తృషార్తులై తోయంబుల కొరకతివేగంబున విపినంబు ద్రిమ్మరి జీవనంబులు గానక కొందఱు తమప్రాణంబు లూడుననియు నొకకొందఱీ తృష్ణానలంబుచే శరీరంబు దహించు ననియు మఱికొంద ఱీయర

ణ్యంబున జలంబు లెట్లు ఘటియించు ననుచు కలకలరవంబులచే నఱచుచుండ తద్వ్యక్భర్తర్యుక్భవుండు పిపాసాహతచేతనుండై నీరంబులకై శోధింపుచుండెను. తత్సమయంబున సురవందిత చరణుండగు దత్తుండు గుప్తవేషంబున భర్తరి వెనువెంటం జనుచు నొక్కచో మనోహర సుగంధ ప్రపూరిత మహీరుహచ్ఛాయాచ్ఛాదితంబై శశికాంత మణివేదికలచే నొప్పు స్వచ్ఛతరవారిసహితంబగు కేళాకూళిం గల్పింప నత్యాతురుండగు భర్తరీసంభవుం డక్కమలాకరంబు గనుంగొని పరుగులిడుచు తోయంబు లానుటకు కరంబులచే స్పర్శింపుచుండ తపోధూర్జటి యగు యత్రిసూనుండు నిజహస్తంబులచే నెద జరుచుకొనుచు భర్తరిపై కరుదెంచి "యోరా! నీకులం బెయ్యది? నీస్వరూపం బెట్టిది? మజ్జీవనంబు లేల స్పృశించితివి? దెలుపు" మన నతం డతిచకితుండై మౌనంబున నిల్చుండ దత్తుండు "నీజననీజనకు లెవరు? గురు వెవండు? సవిస్తరంబుగ దెలియంబలికి జలంబులు గ్రహించెదవేని బ్రతుకుగలదు. లేకున్న పానమాత్రంబున పంచత్వంబు నొందెద" వన ననసూయానందనుని పదకంజంబులపై వ్రాలి "మజ్జనకుండు కమలాపుండు. భర్తరీపాత్ర మజ్జనస్థానంబు. గురుస్వరూపం బే నెఱుంగ" నన దత్తుండు "ఔరా! నీ పూర్వజన్మదోషం బెట్టిదని దలంతు. గురుకటాక్షంబునకు పాత్రుండు గాని నరుం డధముండు గాండే? నీచాత్మా! మత్తోయంబులు ప్రాశించుట కనర్హుండవు గావే? నష్టా! నీయట్టి క్రియాభ్రష్టు లీ నిర్మలోదకంబులు స్పర్శించిరేని యయ్యవి యదృశ్యంబగును. తదవసరంబున మత్క్రోధాగ్నిచే నిన్ను భస్మం బొనర్చెద" నన నమ్రుండై "దయాసముద్రా! నీరంబునకై మత్ప్రాణంబులు హరించును. నాకీ సమయంబున ననుగ్రహం బొసంగి ప్రాణంబులు గాపాడు" మని బొగడుచుండ నత్రినందనుండు "మూర్ఖా! హరిహర బ్రహ్మాదుల కలవిగాని యస్మదనుగ్రహంబు యఃకశ్చిత్పురుషాధమున కెట్లులభించును? విచారంబు లేదే" యన భానువీర్యోద్భవుండు "క్షమాశీలా! జగదుద్ధారక పురుషోత్తముల్లై మాయట్టి పాపాత్ముల పవిత్రుల నొనర్పక నుపేక్షింతురే? కరుణాజలధే! కడతేర్చవే" యని యార్తశబ్దంబుల బలుకుచుండ "భర్తరీజనితా! నీశరీరం బనుగ్రహయోగ్యం బెట్లగును? ద్వాదశవర్షంబు లిచ్చో తపం బాచరించితివేని తదుపరి యను

గ్రహింబొసంగెద. నీ విందు కంగీకరించి యుదకంబులు పానంబు జేయుము. త్రికరణశుద్ధిచే జలంబులు బూని తపోనంతరంబున తుచ్ఛ సంసారకూపంబున కాశింపక వైరాగ్యఘనుండనై ప్రకాశించెదననియు వమనతుల్యంబులగు రాజ్యభోగంబులు గోరననియు సంకల్పంబు జేయు"మన దివాకరసుతుండు "దీనశరణ్యా! సంసారసుఖాపేక్ష లుడుగ లేదు. పితృఋణ కాంతాఋణంబులు దీఱవయ్యెను. పుత్రసంతానంబు బడసి స్నుషాలాభంబు బొందిన జాయాఋణంబుదీరు. గయాప్రయాగాది పుణ్యతీర్థంబుల తిలోదకంబు లొసంగ పితృఋణంబు దీరు నేతత్ప్రభృతి ద్వాదశవత్సరంబులు సంసారభోగంబు లనుభవించి యాపై తపం బాచరించెద" నన దత్తాత్రేయుం డాగాక యని కమండలంబుచే నుదకంబు దెచ్చి "వత్సా! తోయంబులు హస్తంబున గొనుము." ద్వాదశవత్సరంబులకు తపప్రారంభం బొనర్తు ననియు తనుమనోధనంబులు గురుచరణార్పితంబులనియు త్రికరణశుద్ధిచే నుడివించి జలంబు ల్విడిపించి మస్తకంబున నిజహస్తం బుంచి గురుమంత్రరహస్యం బుపదేశించి "పుత్రా! నాస్వరూపంబు గనుగొంటివే? నే నత్రిసూనుండ" నని నిజరూపంబు గనుబఱచి సరోవరసహితంబుగ నదృశ్యంబయ్యె. భర్తరీనాథుం డత్యాశ్చర్యంబుచే "తోయపానంబు లభించదయ్యె. గురుసమర్థా! నన్నికష్టంబులపా లొనర్చుట దగునే" యన దత్తుండు పునఃప్రసన్నుండై భోగవతీనదీప్రవాహంబును గల్పింప నయ్యది మహానినదంబుచే ఘూర్ణిల్లుచు గమనించుచుండెను. పిదప సురభి నావాహించి మధురసపక్వాన్నంబులు మహీధరంబుకైవడి నేర్పఱచి "పరిగ్రహింపు" మన భర్తరీనాథుండు చమూసహితుండై తత్తోయంబులు ప్రాశించి సిద్ధాన్నంబుచే దృప్తుండై దత్తాత్రేయ చరణకమలంబులు విలోకింపుచుండ తత్క్షణం బా భోగవతీ కామధేనుసహితుండై దత్తుం డదృశ్యుండయ్యె. భర్తరీనాథుండు దళసమేతుండై నిజనగరంబున కేతెంచెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున విక్రమభర్తరీ రాజ్యాభిషేకాది కథావిశేషంబు సప్తవింశాధ్యాయము సంపూర్ణము.

అష్టావింశత్యధ్యాయము.

భర్తరీనాథుండు పురంబు ప్రవేశించి పింగళాదేవితో పణంబొనర్చి యరణ్యంబునఁగి భర్తరీనాథుండు మృతుండయ్యెనని వార్తనంప నప్పింగళాదేవి ప్రాణంబులఁ బాయుట. తదుపరి భర్తరీనాథుండు పింగళా వియోగదుఃఖంబుచే శ్మశానంబున నివసించి దుఃఖించుట.

భర్తరీనాథుండు పృతనాసహితుండై నిజపురంబున కేతెంచి సభా మంటపంబున గొంతవడి మార్గాయాసంబు దీర్చుకొని రయంబున పాకశాల జేరంజని భోజనం బొనర్చి స్వర్ణమయసోపానసహితేంద్ర నీలమణిఖచితకుడ్యనిర్మితంబై కర్పూరాగరుసుగంధధూపపరిమళవం తంబగు పింగళాదేవి కేళీగృహంబు బ్రవేశించి చంద్రచంద్రికాధవ ళంబగు మృదుపర్యంకంబుపై యుపవిష్టుండై నతత్క్షణం బా వినూత్న విద్యుల్లతాతన్వియగు పింగళాదేవి మోహాభవసల్లాపంబుచే నర్ఘ్య పాద్యాదివిధుల పతిచిత్తం బిగురొత్త బూజలొనర్చుచుండ చంచకరసు తుండత్యాదరంబున కాంతామణిని కౌఁగిటం జేర్చి మూర్ధంబు నివురు చు చుబుకంబు చుంబించి "కలహంసగామినీ! నీయసదృశ రసభరిత మృదువచన నైపుణ్యంబున కే ననిశంబు వశుండనైతి గాక నీయట్టి గుణంబులదొంతి పూర్ణేందుని హసించు ముఖకాంతి యస్మదాశ్రిత ముదవతీ సముదయంబున గంటినే? మచ్చిత్తంబు ఘృతమిశ్రిత మధు రంబుపగిది నకూపారోద్యత్తరంగంబుభంగి నీయం దైక్యంబయ్యె. పింగళే! భీతకురంగదృగ్యుగళే! నీహొయలు నీనడలు కలభంబులకైన గలదే?" యని శ్లాఘించుచు నంతకంతకు శంబరాంతకాకర్ణాంతపూరిత శతాంత విశిఖహతహృజ్జలజాతుండై నాగకమురప్రముఖ బంధంబుల సురతసుఖార్ణవంబున నోలలాడి సుఖాసీనుండై యుండ నమ్మత్తచకో రాక్షి "నాథా! నా యనేక జన్మసంస్కారఫలంబుచే జగదీశ్వరుండు నీయట్టి రసికోత్తముని పాలొనర్చి క్షీరనీరంబులచందంబున నైక్యంబు గల్పించెం గావున మద్భాగ్యంబు పొగడ ద్విసహస్రజిహ్వునికైన వశంబౌనె? ఐనను నిర్దయహృదయుండగు కృతాంతుండు ననుమున్ముందు హరించునో యను సంకల్పంబు జనించె. మత్సంకల్పితకామ్యంబు

పరమేశ్వరుండు నెరవేర్చెనేని నాయట్టి కీర్తనీయ పరమసాధ్వీమణి గలదే" యన భర్తరీనాథుండు "శుభాననే! భగవచ్చిత్రం బెవరెఱుంగుదురు? నీవు మత్సమక్షంబున మృత్యుపదంబు నొందెదవో లేక నీసమక్షంబున నే పంచత్వంబు నొందెదనో హరిపుత్త్రుండగు శమనుండు విధినిర్మితంబు దొలంగించునే" యని యుత్తరం బొసంగ నక్కలకంఠి "ప్రాణప్రియా! ఫాలలిఖితం బెట్లుగల దట్లౌను. మద్వాంఛితంబు సఫలంబు గాకుండెనేని యుష్మద్దివ్యశరీరం బెడబాసి మత్కాయంబు జీవించునే? నిమిషంబున హుతాశనజ్వాలార్పిత శరీరనై భవదంఘ్రిసరోజంబుల నాశ్రయింపనే" యని మనోహరభాషణంబులచే ప్రత్యుత్తరం బివ్వ భర్తరీనాథుండు "కాంతే! వాక్ప్రాగల్భ్యంబు లేలపలికెదవు? ప్రాణంబునకంటె ప్రియుం డధికుండే? నామనస్సంతోషంబుకై మోహాతిశయోక్తులు వెల్లడిపఱచెదవేగాక ఫలితం బేతద్విపరీతంబై యుండు. నాకీ యనుభవజ్ఞానంబు లేదే? భటులు శత్రువులచే నెదురించునెడ స్వప్రాణరక్షణోపాయంబులు బన్ని పిదప నుల్లంఘింతురు. విరుద్ధసమయంబు ఘటియించెనేని పలాయితులవుదురు. గావున నీసాహసంబులు నిక్కంబని నలంతునే! బహువేషధరులు తత్తద్రూపానుకూల పురుషార్థంబులు ప్రకటించినంత నిశ్చయ సమరకోవిదు లనవచ్చునే? పెక్కేల? ననుభవంబుచే దెలియనగు" నన నత్తలోదరి "ప్రాణవల్లభా! మద్వచనంబులు త్రికరణశుద్ధిచే నిశ్చయింపఁబడినవో కావో పరమేశ్వరకల్పితం బెవిధంబై యుండునో దెలియనగు. మచ్చిత్తంబు భవత్పాదార్పితంబగుట నిక్కంబేని సర్వాంతర్యామి యగు భగవంతుండు మచ్ఛరీరంబునకు విధవత్వంబు గల్పించఁడనుట నిస్సంశయంబు గాదే? 'యథాబీజ స్తథాంకురః' యను సుప్రసిద్ధవచనం బబద్ధంబగునే?" యనుచు స్తబ్ధించెను. భర్తరీనాథుం డా సుందరీమణి వాక్యంబులు డెందంబున నిడుకొని సప్రేముండై యొకకొన్నిదివసంబులు గడపి యొకానొకసమయంబున మృగయావినోదంబుచే భటజనసహితుండై యరణ్యంబున కేగి పింగళాదేవి సంభాషణంబులు హృదయంబున దలంచి నేఁడు పరీక్షించి తీరవలయునని కృతనిశ్చయుండై క్రూరమృగంబుల ఖండింపుచు నొక్కచో నత్యుగ్రపంచాననంబు గనుంగొని వెంటనంటి జనుచుండ నక్కేసరియు కడువేగంబున పరుగులిడు

చుండెను. ధైర్యధుర్యుండగు సూర్యవీరోద్భవుం డా మృగరాట్ఛిరం
బును కరవాలంబుచే చెండాడి తద్రుధిరంబున స్వాంగవస్త్రభూషణం
బుల దడపి యొకభృత్యుని గొంసంగి "నీవతిరయంబున పురంబునకేగి
పింగళాదేవి సముఖంబున నీరక్తమయవస్త్రభూషణంబు లుంచి
యక్కాంతామణితో 'యుష్మత్ప్రాణకాంతుండు సింగంబుచే బట్టువడి
పరలోకగతుండయ్యె' ననుచు యుక్తిప్రయుక్తులచే దెలియఁబఱచు"
మని సెలవొసంగి తానొక విశాలమహీరుహచ్ఛాయాశ్రితుండై యత్త
మిల్లెను. భృత్యుం డా వస్త్రంబులుగొని శీఘ్రంబుగ పురంబునకేగి
పింగళాదేవి యంతఃపురంబు ప్రవేశించి తద్వస్త్రంబు లద్దేవి పురో
భాగంబున నిడి "తల్లీ! భర్తరీసమర్థుండు మృగయా వినోదార్థంబై
వనంబున సంచరింపు చుండ పర్వతగుహాంతస్థిత మహాసింహం
బొకటి యాగ్రహంబుచే పైబడి భర్తరీప్రాణంబులు హరించె.
చమూసమూహంబు దహనంబొనర్చ నేతెంచు. నిదిగో రుధి
రమయ వస్త్రంబు" లని నుడివి త్వరితంబున దళసమూహంబు జేరం
జనెను. పింగళాదేవి యదరిపడి మూర్ఛాపరవశత్వంబున వాతహత
పక్వపర్ణంబుభంగి బుడమిని వ్రాలి క్షణమాత్రంబున స్మృతిదలంచి
"హానాథా! హాప్రాణవల్లభా! న న్నెడబాసి పరలోకంబున కేగుట
ధర్మంబగునే" యనుచు హాహాకారంబుచే శిరంబు బుడమిని జరు
చుచు మృత్తికంగొని ముఖంబుపై వైచికొనుచు "కృపాఘనా! న
న్ననిశం బెడబాయనిచిత్తం బెవ్విధి దొలంగించితివో" యని దీర్ఘస్వ
రంబుచే నాక్రందించుచుండ తచ్ఛబ్దం బా ద్వాదశశతసుందరీమణుల
కర్ణరంధ్రంబుల సోక జివ్వున నవ్వనజగంధు లేకముఖంబున రోదనం
బులు జేయుచు నేతెంచి కొందఱు మూర్ఛాగతులై మహింబడుచు
నొకకొంద ఱిక మన కేటిబ్రదుకని వక్షస్థలతాడనంబు లొనర్చుకొనుచు
మఱికొంద ఱన్యోన్యగ్రీవంబులలంబడి మహాధ్వానంబుచే శోకింపుచుండ
పింగళాదేవి దుఃఖతాపం బంతకంతకు నగ్గలంబై "ప్రాణనాథా! నీరూ
పంబు నీమోహంబు నీప్రేమాతిశయ సంభాషణంబు బొఁగడతరంబే? న
న్నీదుఃఖవారాశిం బడద్రోయుట కెట్లుసహించితివో? పాపుండగు య
ముండు మాశోకంబులకు సంతసిల్లెనో? చతురాస్యుండు మూఢమ
తిచే మమ్మేల గల్పించెనో? గల్పించెనేని దుర్భరవైధవ్యతాపంబు నిర్మిం

చుట సచ్చరిత్రుల ధర్మంబగునో" యని దైవంబును దూఱుచు "హా ప్రాణనాయకా! యుష్మత్సహాసావలోకనంబులేని మద్రూపంబు గాల్పనే? నే నజగరంబుపగిది జీవించిన లాభం బేమి" యని పింగళాదేవి దనప్రాణంబులు వీతిహోత్రుని పా లొనర్పం దలంచి త్వరితంబుగ పురోభాగంబునగల పతిరక్తమయ వస్త్రంబులు ధరించి సఖీజనపరివృతయై శ్మశానవాటిక కరుదెంచి కాష్ఠచితి నిర్మించి పావకజ్వాలలచే వెలుంగుచున్న చితిం గని శిష్టులచే నాశీర్వాదంబులు బొంది భర్తరీనాథ చరణార్పితచిత్తంబుచే సుకుమారశరీరం బా వైశ్వానరుని పా లొనర్చి ప్రాణంబులు బాసెను. దైవయోగంబున విక్రమనృపుండు సుమంతికాది పరివారసహితుండై మిథిలానగరంబున కేగి యానాండు మాతులగృహంబున సుఖగోష్ఠిచే నివసించి యుండెం గావున చూపరు లప్పరమపావనచరిత్ర యగు పింగళాదేవి పతిభక్తి సాహసంబుల కచ్చెరువొంది యాహాకారంబులు జేయుచు నమ్ముద్దియగుణంబులు గొనియాడుచు తమతమ గృహంబుల కేతెంచి పరితప్తమానసులై భర్తరీనాథుని చరిత్రంబులు దలంచుచు నిట్టూర్పు లిడుచుచుండిరి. అట నుష్ణాంశువీర్యజాతుండు ప్రభాకరుండు పశ్చిమాంబుధి గ్రుంకునెడ పయనంబై దళసహితంబుగ పురంబున కేతెంచుచు నగరనికటంబున జాజ్వల్యంబుచే దహించుచున్న కాష్ఠనిర్మితచితి నీక్షించి దనమనంబున "నే నతికఠినంబగు నిమిత్తంబు కల్పించితిగాని పిదప నెట్టి యనర్థంబు సంభవించెనో గనుంగొనలేనైతి" నని వితర్కింపుచు నగరద్వారసమీపంబున కరుదెంచినంత ద్వారరక్షకు లత్యంతాశ్చర్యంబుతో సమక్షంబున కేతెంచి వందనంబు లిడి శోకపూరితవదనులై "సమర్థా! హఠాత్తుగ నొకదూతచే యుష్మత్ప్రాణంబులు సంచానసంబుచే హరింపఁబడి పరలోకంబున కేగెనని యంతఃపురసుందరీమణు లెఱింగి ఘోరతరదుఃఖాంబుధి నిమగ్నులై శోకింపుచుండ దుస్సహ దుఃఖతాపంబుచే పింగళాదేవి స్వశరీరంబు హుతాశను పా లొనర్చె. పురజను లపరిమిత శోకవారాశిని మునుంగుచు నిప్పుడిప్పుడు దమతమ సదనంబులు జేరంజని" రని విన్నవింప భర్తరీశ్రేష్ఠుం డదరిపడి లంఘించి శ్మశానవాటికకు పరుగెత్తుచుండ పరివారులు వెంటనంటి పరుగులిడుచుండిరి. తత్క్షణం బా భర్తరీజనితుండు శ్మశా

నంబు జేరి దాహకునిచే దహింపఁబడుచున్న పింగళాదేవికాయంబు గనుంగొని హాహాకారంబు జేయుచు నిజశరీరం బప్పావకుని కర్పింపందలంచునెడ పరివారులా మహామహుని నిరోధించి సమాధానంబులు పలుకుచుండ నతులితశోకపూరితుండగు భర్తరీఘుండు పింగళాదేవి గుణవితానంబు లుగ్గడించి యూర్ధ్వముఖుండై వక్షస్థలంబు జరుచుకొనుచు "నాహాపింగళా! నీమంగళకరగుణాన్విత తనువిలాసంబునకు ప్రత్యక్షమృత్యుస్వరూపుండనై మూఢమతిచే బరీక్షింపఁదలంచి నీప్రాణంబులు గొంటినే? దుష్టుండను. నష్టుండను. నాయట్టి పాపమతి కాయంబు గాల్పనే? సన్ననిశం బెడబాయని చిత్తం బెవ్విధి వీతిహోత్రుని కర్పించితివో" యని బుడమింబడి రోదనంబు జేయుచు పింగళా! పింగళా! యని నలుదిశలు నిరీక్షించుచు నీవులేని భువనంబు వనంబనఁదగదే? నీయునికి లేని భోగంబులు రోగంబులు గావే? నిన్నెడబాసిన శరీరంబు శుష్కకాష్ఠంబు గాదే! నీప్రేమాతిశయ సంభాషణంబు లమృతోపమంబులై వీనుల విందుసేయ నీ నవయౌవనాకారంబు మచ్చిత్తంబున కాప్యాయనం బొసంగ సుఖంబుచే కాలంబు గడుపుచు నేఁడీ విపరీతకల్పితంబులు నాకేల గలిగెనో? నాయట్టి దౌర్భాగ్యులు గలరే? పింగళా. దినేశుని కిరణప్రసారంబుచే కమలాకరంబు విభూతి గాంచిన చందంబున నీ నలినేక్షణ దృక్ప్రసారంబులచే మన్మనఃపద్మంబు వికసించియుండుట నీవెఱుంగవే? నన్నీ దుఃఖగహనంబున బడవైచుట ధర్మంబౌనే? నీపలుకు నీకులుకు నీమిటారంబులే యున్నవక్తైన గలవే? నీస్వరూపంబునకు రంభోర్వసులు లజ్జాయమానులు గారే? నీసుగుణంబులకు శాస్త్రంబులు సరిపోవునే? నీలక్షణంబులకు లక్ష్మీదేవి యెనయగునే? మచ్చిత్తంబున నీరూపం బెడబాయునే? హా పింగళా! నీ పతిభక్తి విశేషంబులు లోకత్రయపావనంబులు గావే? నీయట్టి పరమసుశీల ప్రాణంబులు హరించిన పాతకంబునకు మితిగలదే? నీరూపం బెట్లు గనుఁగొందు? నేనీదుఃఖం బెవ్విధి సహింతు" నని మహాధ్వానంబుచే రోదనంబు జేయుచు కొంతవడి మూర్ఛాగతుండై రయంబున స్మృతిగలిగి "హా పింగళా! హా ప్రాణప్రియే! హా మనోహరీ! హా బాలేందుముఖీ!" యని శోకింపుచుండ నేతద్వృత్తాంతంబు గ్రామవాసు లెఱింగి యత్యంతాశ్చర్యంబుచే

పరుగులిడుచు నేతెంచి పింగళాదేవి సుగుణసాహసంబులు దలపోయు చు నేకముఖంబున ఘనఘూర్జితంబు పగిది రోదనంబులు జేయుచుండ నొకకొంద ఱా భర్తరిఘనుని శోకోపశమనంబు జేయుచు "ధైర్యఘ నా! దైవనిర్మిత కార్యంబునకు చింతింపనేల? దుఃఖించినంత పింగళా దేవి జీవంబులు ధరించునే? వ్యర్థశోకంబుచే లాభం బేమైనను గలదే? 'జాతస్య మరణం ధ్రువం' బను న్యాయంబు మీరెఱుం గరే? మన పూర్వజులు కాలగతి నొందరే? శాశ్వతులై విలసిల్లుట మర్త్యజన్మంబుల కెట్లు ఘటించు? మృత్యుదేవత మనల నుపేక్షించునే? మన మొకప్పుడు మృతిబొందమే? మనకీ యశాశ్వతశరీరంబుకై దుఃఖం బేల? సిద్ధసాధు ప్రముఖాఖిల తపోమూర్తులు శరీరంబులు వాయరే? సర్వసమర్థులై సకలశాస్త్రార్థజ్ఞానపూర్ణులై మాయామయశరీరంబుకై విలపింపనేల" యని యనేకవిధంబుల బోధించినను భర్తరీ హృదయగత శోకం బుడుగదయ్యె. పురజను లనేక యుక్తి ప్రయుక్తులచే బోధించి యూసటం గొని దమతమ సదనంబుల కేగిరి. తదనంతరం బా భర్తరీవా ముండు శ్మశానంబు బాయక పింగళార్పితచిత్తుండై శోకింపుచు నారా త్రి గడపుచుండ ననలుండు పింగళాదేవిని భస్మం బొనర్చి యంతర్ధా నంబు నొందె. సూర్యోదయానంతరంబున పింగళాదేవి బంధుమిత్ర పురోహితు లుత్తరకర్మ జేయించదలంచి శ్మశానంబున కేతెంచి యస్థి సంచయం బొనర్పవలయు నను హాళాహాళిచే స్పృశింప నుద్యుక్తు లౌచుండ నద్దివాకరతనయుండు నిరోధించి బహునాదంబుచే రోదనం బు జేయుచుండ వారలాస్థలంబు బాసి తమనిలయంబుల కేతెంచిరి. భర్తరీనాథుం డహర్నిశం బా శ్మశానప్రదేశం బెడబాయక నన్నపా నాదులు వర్జించి పింగళాదేవి గుణసంచయం బభివర్ణించుచు "పింగ ళా! హా పింగళా!" యని కేకలిడుచుండె నంత నొకదూతచే మిథిలా నగరంబున విక్రమనృపుం డాలకించి మహాక్షోభంబున సత్యవర్మ శుభవిక్రమ సుమంతీకాది సహితుండై రయంబున నవంతికానగరం బున కేతెంచి శ్మశానవాటికం జేరి దుర్భరదుఃఖతాపంబుచే నాక్రో శించుచు సర్వాంగసుందరీమణి యగు పింగళాదేవి గుణసౌందర్యంబు లెద దలంచి సుమంతీకుం డహా! మత్సుకుమార తనువిలాసిని యగు పింగళాదేవి దనశరీరంబు ధనంజయున కొసంగెననియు విక్రముండు

మద్గృహరత్నంబు కాలతస్కరునిచే నపహరింపఁబడె ననియు సుమంతీ
కుండు హా పింగళా! హా సర్వగుణమంగళా ! నీరూపు నీచూపు నీసు
గుణంబు నీచతురత్వంబు నీజ్ఞానపరిపూర్ణత్వం బే లోకంబున నే య
న్నులమిన్నకైన గలదే? యని శోకింపుచుండ విక్రమనృపుండు భర్త
రీనికటంబు జేరి యెన్నివిధంబుల నోదార్చిన నతం డపార శోకాంబుధి
నిమగ్నుండై యుపశమింపకున్నంత విక్రముండు మంత్రిపురోహితసహి
తుండై యుత్తరక్రియ లొనర్చి పరితప్తమానసంబున పురంబున వసి
యించెను. రవిపుత్రుండు శ్మశానంబు వర్జింపక బృందకై గోవిందుండు
విలపించినచందంబున హా పింగళా! యనుచు శోకింపుచుండ విక్రముం
డనుదినం బాశ్మశానవాటిక కేతెంచి యనేకయుక్తిప్రయుక్తులచే భర్త
రిని బోధింపుచుండ నతండు వాతాంబుపర్ణాశనుండై నిజహృదయంబు
న పింగళాదేవిని గొనియాడుచు శ్మశానస్థలంబున పిశాచంబు కరణి నివ
సించి “హా దైవమా! హా జగద్రక్షకా! హా యనాథనాథా! హా దీనశర
ణ్యా! త్రిలోకసుందరీ యనందగు పింగళం గల్పించితి వేల? గల్పించితి వేని
యస్మద్బుద్ధియను నాకొనగూర్చితి వేల ? గూర్చితి వేని యత్యంత మోహం
జేల గలిగించితివి? గలిగించితివో వియోగంబు జేయుట ధర్మంబగునే”
యనుచు రోదనంబు జేయుచు ననుదినంబు గృశించి కంఠగతప్రా
ణుండై యొకపరి దైవంబును దూఱుచు నొకప్పుడు పింగళా యని విల
పించుచు ద్వాదశవత్సరంబులు గడపె నంత నభోమణి నిజసుతుని పరి
తాపంబు ద్వాదశాబ్దపరిపూర్ణత్వంబు మనంబున విచారించి వేగంబున
సమర్థుండగు దత్తాత్రేయసమక్షంబు జేరం జన నమ్మహామహుండు జగ
చ్చక్షుని సన్మానించి “భవదాగమన కారణంబు దెలుపు” మన నినుండు
“జ్ఞానఘనా! సర్వమయుండవై ప్రకాశించెడు సమర్థుండవై నీవెఱుం
గని కారణంబు గలదే? భవచ్ఛిష్యుండగు భర్తరీయోగక్షేమంబు గనుఁ
గొంటిరే” యన నత్రిసూనుం డంతరంగదృష్టిచే భర్తరీనాథుని విప
త్కాలంబు విచారించి కరుణామయ హృదయుండై “ప్రభాకరా! నీకు
మారునికై చింతింపవలదు నే నహర్నిశంబులు భర్తరీకథిత ద్వాదశ
వత్సరంబులు గణియింపుచుంటి. సమయంబు ఘటియించెను. మచ్ఛి
ష్యుండగు మత్స్యేంద్రుని ప్రియశిష్యుండు గోరక్షనాముండు నానాతీ
ర్థంబులు సేవింపుచు మత్సమక్షంబున కేతెంచు గోరక్షుం డతిసమర్థుండు

గావున నే నా తాపసోత్తముని భర్తరీనాథునికై బంపెద నతం డమల జ్ఞానాన్వితమతిచే యుష్మత్సుతుని మోహపాశంబు దెగటార్చి మత్సన్నిధికి దోడ్కొని తెచ్చు నిక్కంబని నమ్ము" మన నహస్కరుండు హర్షించి యనసూయాతనూభవునిచే ననుజ్ఞ గొని నిజస్థానంబున కేగెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున పింగళావియోగ భర్తరీనాథ దుఃఖకథావిశేషం బష్టావింశాధ్యాయము సంపూర్ణము.

ఏకోనత్రింశత్యధ్యాయము.

{ గోరక్షనాథుండు శ్రీగురుదత్తాత్రేయానుమతిచే భర్తరీనాథునకు వైరాగ్యంబు గల్పించి వెంటగొని చనుట. }

గోరక్షనాథుండు గర్భాద్రిసమీపస్థ వామతీర్థస్థానం బెడబాసి నానాతీర్థంబులు సేవించుచు గిరినారక్షేత్రంబున కేతెంచి జగదుద్ధారకుండగు దత్తాత్రేయ పదసరోజంబులకు వందనంబు లాచరింప దత్తుండు పరమాహ్లాదంబుచే గోరక్షుని దనహృదయంబున కదుముకొని మూర్ధంబు బునుకుచు దననికటంబున నుపవేశింప నియమించి "గోరక్షా! మత్స్యేంద్రయోగిముఖ్యుం డెచ్చోఁగలఁడు? నీ వా తపోఘనుని త్యజించి యొంటిజరించుట కేమికతం బయ్యె మహాత్మునకు క్షేమంబే" యని విచారింప గోరక్షుండు "దయాఘనా! భవదనుగ్రహపాత్రులగు జ్ఞానుల కనిశంబు క్షేమంబు దక్క నితరంబు గలదే? తపోఘనుండగు మత్స్యేంద్రుండు గర్భగిరినికటంబున బ్రహ్మానందమయుండై నివసించియుండ నే నామహానుభావుని యనుజ్ఞచే తీర్థయాత్రోద్దేశంబున జనుదెంచితి" నన నత్రిసూనుండు సంతసించి "వత్సా! నీకొక కార్యంబు దెలిపెద నవంతికానగరంబున మదనుగ్రహపాత్రుండగు భర్తరీనాథుండు రాజ్యభోగలోలుండై విలసిల్లి గతజాయుండై మోహపాశబద్ధమానసంబుచే శ్మశానంబున నివసించి 'కాంతా కాంతా' యని మంతనంబున చింతింపుచు నన్నోదకంబులు త్యజించి శోకింపుచుండి ద్వాదశవత్సరంబు లయ్యెం గావున నీ వా భర్తరీనాథుని జేరంజని యాత్మానాత్మ విచారంబుచే వైరాగ్యంబు గల్పించి

నీచాతుర్యంబున సమాధానబఱచుము. నే నా పురుషశ్రేష్ఠున కను గ్రహం బొనంగుతఱి ద్వాదశాబ్దంబులకు తుచ్ఛసంసారసుఖంబు త్యజించెద నని సప్రమాణవాగ్దత్తం బా నరోత్తమునిచే జేయించితి. నీకుశలత్వంబుచే నతనిపరితాపంబుమాన్పి నాథపంథీమార్గంబు దెలియఁ జేసి యస్మత్సమక్షంబునకు దోడితె"మ్మనిభర్తరీనాథజన్మకథాదిచరిత్రం బంతయు దేటపఱచెను. గోరక్షుం డీయద్భుతచరిత్రం బాలకించి "కృపానిధే! భవదాజ్ఞాధారకుండనై భర్తరీలోహంబును కనకరూపంబున గొనితెచ్చెద. యుష్మదనుగ్రహపాత్రుల కిక్కార్యం బొకవింతయె? దుర్ఘటంబగు కార్యంబైన భవత్కటాక్షవీక్షణంబుచే సులభంబు గాదే? కల్పతరుచ్ఛాయాశ్రితులకు కామ్యంబులు జేకూరుట ఘనంబే" యని బొగడుచు ననసూయానందనుని పదకంజంబులకు ప్రణమిల్లి వేగంబున వ్యానాస్త్రంబు జపియించి తన్మంత్రమాహాత్మ్యంబుచే నేబదియోజనంబులమార్గంబు క్షణమాత్రంబున గడచి యవంతీకానగరసమీపంబున కేతెంచి దూరస్థశ్మశానప్రదేశంబున క్షీణశరీరంబుచేకంఠగతప్రాణుండై "హారామా! పింగళా! వియోగం బొనర్చితివే" యని దలపోయుచున్న భర్తరీనాథుని విలోకించి దయాన్వితహృదయుండై తనమనంబున నోహో! భర్తరీనాథుం డసాధ్యకరవ్రతంబు బూని యస్థిచర్మగతప్రాణుం డయ్యె నిట్టి దృఢతరచిత్తంబు మఱల్చుట సాధారణం బగునే? పరుసంబు లోహంబును కనకం బొనర్చుగాక! పాషాణంబును సువర్ణంబు జేయునే? ఇక్షువనస్థ నింబవృక్షంబు మధురపూరితం బగునే? బ్రహ్మనిర్మితదరిద్రంబు కృషిచే నశించునే? తద్వత్భర్తరీనాథాచరిత మోహబంధంబు శబ్దబోధంబులచే వశంబగుట దుస్తరంబు గాదే? భర్తరీనాథునిచిత్తంబు శునకపుచ్ఛంబుభంగి వక్రంబై విలసిల్లె. నేను కార్యసాధనపరత్వంబుచే కొంతవడి తద్రూపంబున విలపించి భర్తరీనాథుని సంతుష్టపఱచితినేని మదీప్సితంబు సఫలం బగును. విభీషణుండు విచక్షణమతిచే శత్రుండగు రాముని సఖ్యంబు బూని వైభవంబు లనుభవించిన చందంబున భగవంతుండు ప్రచ్ఛన్నవామనవేషంబుచే బలిని సాధించినట్లు మాయోపాయంబుల భర్తరీనాథుని సాధించి నాథపంథకీర్తిధ్వజంబు ప్రకాశింపవలయు నని గృతనిశ్చయుండై పురంబు జొచ్చి కుంభకారగృహంబున కేగి యొకఘటంబు

గొని దానిపై దనప్రాజ్ఞత్వంబున చిత్రవిచిత్రపటంబులు దీర్చి దానికి 'బా టలీ' యను నామంబిడి శుష్కవేదాంతుల హృదయుంబుమాడ్కి ఘట రూపం బాచ్ఛాదించి హస్తంబున ధరించి శ్మశానస్థలంబున విలపిం చుచున్న భర్తరీనాథుని సమీపంబున కరుదెంచుచు కాపట్యంబుచే బుడమిం బడి మూర్ఛితుండై పరవశత్వంబున ఘటంబును భిన్నపఱచి స్మృతిబూని యుత్థితుండై భిన్నఘటంబును గనుంగొని యాహాకారం బు జేయుచు "హా నాబాటలీ! హా నాసుందరరూపిణీ! నన్నెడబాసి భి న్నంబైతివే? నే నీదుఃఖం బెట్లు సహింతు? నీవియోగంబుచే మత్ప్రా ణంబులు నిల్చునే? నీస్వరూపంబు నీసుకుమారంబు వర్ణింపతరంబగునే" యని మహారవంబుచే శోకింపుచు వక్షస్థలంబు జరుచుకొనుచు పుడమిం బడిపొర్లుచు "హాబాటలీ! నీవులేనిజీవనంబు శవభూషణంబులుగావే? నీ వులేనినివాసంబు శ్మశానంబుగాదే? నీరూపభిన్నంబుచే నామది ప్రపం చంబు బాయదే? నీవు నాపితృమాతృస్వరూపం బని దలంచితి నన్నెడ నాడి భిన్నవగుట ధర్మంబగునే? నాకెవరుదిక్కు? నిన్నెక్కడ గనుఁ గొందు. హాదైవమా! హారామా! నాయం దింత నిర్దయత్వం బేలగ లిగె? నాయట్టి దోషాత్ములు లోకంబునలేరే? నాదుఃఖం బెవ్విధి కడ తేఱు? నన్నాదరించుపుణ్యాత్ము లెవరుగలరు? నాముద్దుబాటలీ! నాసు వర్ణబాటలీ! నీసుందరస్వరూపంబు గనుబఱచవే? నీకి కఠినంబేల గలి గెనే? నన్నిశంబు బాయకుందువుగదే" యని ఘోరనినదంబుచే రోద నంబు జేయుచుండ భర్తరీనాథుండు శోకంబాలకించి మితిలేని యాశ్చ ర్యంబుచే హాసించుచు దనమనంబున తుచ్ఛంబగు ఘటం బొకకొంత వెలజేయును. దీనికై యాక్రోశించుట కెంత వేడబం బని వితర్కించి సన్ముఖుండై "యోగిపురుషా! కించిన్మాల్యకుంభంబుకై మూఢమతిచే శోకింపనేల నేతద్ఘటతుల్యఘటంబులు లభింపవే? మూర్ఖా! విచారం బులేదే" యన గోరక్షుండు "జ్ఞానపురుషా! నీ వేకతంబున దుఃఖాం బుధి నిమగ్నుండవై తివి. నీయట్టిదుఃఖం బితరులది కాదే? నీకు నీవస్తు వధికంబయ్యెండు. నాకు నాఘటం బధికంబుగాదే? ఏదుఃఖంబు నీవె ఱుంగుదువు. నాదుఃఖం బే నెఱుంగుదును. ప్రత్యక్షానుభవజ్ఞానంబు గలిగి నన్నిప్పుగిది విచారింప ధర్మంబగునే" యన భర్తరీనాథుండు "విచారహీనా! ఘటభిన్నంబుచే నస్మద్దుఃఖసమం బని బలికితివి. నాదుః

ఖంబు నిశ్చయంబు గాదే? స్వరూపలావణ్యంబులచే నొప్పారు పింగళా దేవి హాతంబయ్యె నయ్యది పునఃప్రాప్తంబగుట దుర్లభంబుగాదే? యుష్మద్ఘటతుల్యఘటంబులు శతానుశతంబులు క్షణమాత్రంబున లభించు. వలయునేని సమకూర్చెద. నాపింగళాదేవి లభించునే" యన గోరక్షుండు "నీపింగళాస్వరూపంబులు సహస్రానుసహస్రంబులుగల్పించెదను. నామనోజ్ఞతర పాటలి ఘటించునే" యని ప్రత్యుత్తరం బొసంగ భర్తరీనాథుండు "పింగళాసమరూప యౌవనగుణసహిత నారీరత్నంబులు గల్పించెదవేని భవద్పాటలీశతం బీక్షణంబ సిద్ధపఱచెదను. వృథాపురుషార్థప్రగల్భంబులచే లాభంబేమి? కపటవేదాంత ప్రసంగంబులచే ఫలంబుచేకూఱునే? వర్షంబులేని ఘనగర్జితంబుభంగి జలంబులులేని యెండమావులచందంబున ప్రత్యక్షానుభవరహితంబగు వాచాశూరత్వంబు వ్యర్థంబుగాదే" యన గోరక్షుండు "పురుషఘనా! పింగళాసమ పల్లవాధరుల గల్పించెదనేని కానుకలేమి యర్పించెదవో దెలుపు" మన భర్తరీనాథుండు మోహపరవశచిత్తుండై "యోగిపురుషా! పింగళాసమ మృగయానల గల్పించెదవేని సూర్యేంద్రాగ్నియమవరుణకుబేరాది దేవతానివహంబు సాక్షి జలదేవతా స్థలదేవతలసాక్షి గొని మద్రాజ్యభోగసంపదలు భవచ్చరణంబుల కర్పించెద. నేనీ వచనంబు దొలంగితినేని మత్పూర్వజులు స్వర్గపతనులై నరకం బనుభవించెదరు. నేనీ జన్మంబు బాసి మహానరకం బనుభవించుచు ననేకజన్మంబు లెత్తుచు రౌరవాదినరకంబు లనుభవించుచుండెదను. నీవచనంబు లనృతంబు లయ్యేనేని నీ వనేకజన్మంబులు నరకం బనుభవించుట తథ్యం" బని శపథంబులు జేయ గోరక్షుండు హర్షించి సత్యంబు సత్యం బని నుడువుచు భస్మంబు గొని కామినీయస్త్రంబు ధ్యానించి పింగళానామంబుచే బ్రయోగింప నయ్యస్త్రమహిమాతిశయంబుచే భస్మీకృత పింగళాంశంబున ననేకలతాంగులు నవయౌవనాకారంబులచే విరాజమానలై భర్తరీనాథుని సముఖంబున నిల్చుండిరి. భర్తరీనాథుండు ప్రేమాన్వితహృదయుండై మహామోహంబున నాయన్నుల నుపవేశింప నియమించి దనగృహసంసారోపయోగవాక్యంబులు విచారింపుచుండ నాసుందరీమణియగు పింగళాదేవి భర్తగీకృత ప్రశ్నంబుల కుత్తరంబు లొసంగుచు "ప్రాణవల్లభా!

మద్వియోగతాపంబుచే గుందనేల? యశాశ్వతశరీరంబు స్థిరంబై
యుండునే? ప్రాణప్రియా! మర్త్యులకు మృత్యు వొకప్పుడైన గలదనుట
నిక్కంబుగాదే? తత్కారణంబుచే జన్మసార్థకంబుకై యోచింపుట
ముఖ్యధర్మంబై యుండు. నే ననిశంబు పరమపాతివ్రత్యధర్మం బాశ్ర
యించి నయభక్తివిశేషంబులచే భవదధీనంబున మెలంగితి గాన జగ
దీశ్వరుండు నాకుత్తమలోకంబు లొసంగె. మీరు మీయోగక్షేమం
బుకై జ్ఞానమార్గం బాశ్రయింపక మద్వియోగదుఃఖంబుచే రాజ్య
భోగంబు లనుభవించిన నేమిఫలం" బని పలుకుచుండ భర్తరీనా
థుండు విస్మయుండై గోరక్షుని పాదకమలంబుల వ్రాలినంత గోరక్షుండు
స్వహస్తంబులచే లేవనెత్తి "నరపుంగవా! మద్గురుండగు మత్స్యేం
ద్రనాథుండు శ్రీగురుదత్తాత్రేయ ఘనునకు ప్రియశిష్యుండయ్యె.
తొల్లి మీకాయంబు శ్రీగురుదత్తానుగ్రహంబునకు పాత్రంబైనక
తంబున మత్స్యేంద్రుని సహోదరుండవైతివి. తస్మాద్వందనీయుండ"
వని పాదంబులకు ప్రణమిల్లి "భర్తరీనాథా! యుష్మదభీష్టంబు పింగ
ళాదేవి సహితుండవై రాజ్యభోగంబు లనుభవించుటకై గలదో?
లేక తుచ్ఛసంసారంబు బరిత్యజించి సుస్థిరవైరాగ్యం బాశ్రయించె
దో? శ్రుతపఱతువేని యొనగూర్తు" నన భర్తరీనాథుండు "జ్ఞాన
ఘనా! పింగళావియోగదుస్సహ దుఃఖభారంబున ద్వాదశవర్షంబులు
మందమతిచే కాలంబు గడిపినను కోమలాంగి గాన్పించదయ్యె భవ
దపార తపఃప్రభావంబున శతానుశత పింగళారూపంబు లీక్షించనైతి
ని. జ్ఞానహీనంబుచే తొల్లి శ్రీగురుదత్తాత్రేయ సుబోధంబులు లక్షింపక
మాయాపూరిత సంసారకూపంబున మునింగి యత్యంతకష్టంబు ల
నుభవించితి. నేనీయంధకారబంధురంబగు సంసారసుఖాపేక్ష లెదవలం
పను. రాజ్యసంపత్సుఖంబులు ప్రతాపరహిత నీచస్వరూపంబులుగాక
శ్రేష్ఠంబు లగునో? నీతపోమహత్వంబుచే శతానుశత పింగళాదేవిరూపం
బులు నిర్మించనదెటులుంగనో! సమర్థా! భ్రమమయావర్తంబగు సంసా
రంబు విడనాడి యతులితవైరాగ్యయోగంబుచే పరమపదపట్టాభిషి
క్తుండనై ప్రకాశింపం దలంచెద. కరుణామయుండవై శీఘ్రంబున దీన
శరణ్యుండగు దత్తాత్రేయుని దర్శనం బొనగూర్పవే" యన గోర
క్షుండు "భర్తరీనాథా! నీకతంబున ననేకపింగళాసుందరు లుదయిం

చిరి. వీరిచే సుఖంబు లనుభవించి పిదప వైరాగ్యమార్గంబు ధరిం
చుట యుచితంబుగాదే" యన భర్తరీనాథుండు "యొకపింగళాదే
వికై ద్వాదశాబ్దంబు లిడుము లనుభవించితి నిక యనేకపింగళాదు
లలచే ననుభవించెడి దుఃఖం బాచంద్రార్కస్థిరంబుగాదే? పునః పింగ
ళాసంసర్గంబు గోరుట వృశ్చికదంశుండనేకవిషపుచ్ఛసముదయంబున
సుఖించినపగిది యనదగదే? గోరక్షనాథా! పరమార్థభంగులగుశుభాం
గుల నదృశ్యపఱచి మద్రాజ్యభోగసంపదలు పరిగ్రహించి రయంబున
ననసూయానుతుని దర్శింపఁజేయవే" యని వేఁడుకొన గోరక్షుండు హ
ర్షించి యదృశ్యాస్త్రంబున సుందరీమణుల నంతర్ధానం బొనర్చి
భర్తరీనాథుని హస్తంబు ధరించి దోడ్కొని పురంబు ప్రవేశిం
చెను. పురజనులీ గోరక్షుని కుశలత్వంబున కచ్చెరువొంది యానందం
బుచే బొగడుచుండ విక్రమనృపుండు గోరక్షనాథునిపదపద్మంబులకు వం
దనంబు లిడి రత్నమయసింహాసనంబుపై యలంకరింప నియమించి
భక్తిభావంబులచే షోడశోపచారపూజ లొనర్చి పురోభాగంబున ముకు
ళితకరపుటుండై "దయాసముద్రా! మత్సహోదరుండగు భర్తరీథు
నుండు పింగళావియోగ పరితప్తచిత్తుండై చిత్తవిభ్రాంతిచే విలపించు
చుండ నెప్పుగిది భవద్బోధామృత రసపానుండై శాంతిం బొందెనో
యెఱుంగింపవే" యన గోరక్షుండు దనమాయోపాయంబుల తెఱం
గెఱుంగించి నృపోత్తముని చిత్తంబు సంతుష్టపఱచెను. సకలధర్మవి
దుండగు విక్రమనృపుండు గోరక్షునితో "సమర్థా! మత్పురంబున
షణ్మాసంబులు నివసించి క్షీణకాయుండగు భర్తరీబడలిక రసపూరిత
పక్వాన్నంబులచే దీర్చి నాయుల్లంబు రంజిల్లదయజేయవే" యన గోర
క్షుండు "భూనాయకా! నీవాక్యంబులు యథార్థంబులై విలసిల్లు.
మనోవికారంబులు స్థిరంబులగునే? దినంబులు గడచెనేని చిత్తంబు
మాఱదో? గావున కాలంబుగడుపుట యోగ్యంబుగా"దని యుత్తరం
బొసంగుచుండ నేతద్గోప్యవాక్యంబు లంతఃపురస్త్రీసమూహం బాల
కించి మహారోదనంబు జేయుచు మాభాగ్యం బపహరించెడి చెనటుం
డేతెంచె. యాకుటిలాత్ముని ముఖంబు గాల" నని గోరక్షుని దూషిం
చుచు బహువిధంబుల ఘోషింపుచుండిరి. గోరక్షుండు విక్రముని
భవనంబున త్రిరాత్రంబులు వసించి పిదప భర్తరీసమేతుండై ప్రయా

ణంబు దలంప మహీశుండు ప్రీతమనస్కుండై గోరక్షుని చరణకమలం బులకు ప్రణమిల్లి సెలవొసంగి ప్రయాణంబు గావింపుచుండ గోరక్షనాథుండు భర్తరీనాథునితో "పురుషపుంగవా! నీ మనంబున ప్రపంచభోగంబులు దలంచెదేని తత్క్షణంబ సమకూర్తు" ననభర్తరీనాథుండు "తాపసోత్తమా! శ్రీగురుదత్తాత్రేయ బోధానుసారుండనై ధనకనకవస్తువాహనాదిసంపద్విభూతి వమనతుల్యంబుగ భావించి తిరిగి యపేక్షించుట నీచంబు గాదే? నిర్మలనాథ పంథీమార్గం బాశ్రయించెద" నన గోరక్షుండు శైలీ సింగీ కంథాది విరాగచిహ్నపరికరంబు లొసంగి "భర్తరీనాథా! మత్కృపాపాలంబు ధరించి యంతఃపురమందిర ప్రవేశుండవై యలక్షశబ్దంబులచే భిక్షాన్నంబు గొని తెచ్చెదవే" యన నతం డవశ్యంబని వేగం బునంతఃపురంబు ప్రవేశించి సారంగినాదంబు జేయుచు "నలక్షనిరంజన భిక్షా" యని శబ్దోచ్చారణంబుచే దిరుగుచుండ నత్యంతదుఃఖార్ణవ నిమగ్నంబగు నారీజనకదంబం బేకముఖంబున శోకింపుచు "హా దయాఘనా! హా సుందరాకారా! హా మనోవల్లభా" యని బహువిధంబుల విలపించుచు కొందఱు శిరోతాడనంబు లొనర్చుకొనుచు నొకకొందఱు నేలం బడి పొర్లుచు మఱికొందఱు హస్తంబులు బుడమిజరుచుచు కొందఱు తమభూషణంబులు బారవైచుచు కొందఱు మూర్ఛాగతులై దండంబులకై వడి వ్రాలుచు "హా మా భాగ్యహీనం బేమని దలపోయుదుము. మాప్రాణేశ్వరుండు సహస్రాక్షునిబోలి వైభవవినోదంబులచే నమ్ము లాలింపుచుండి భిక్షుకుండై జరించెనే? మాసౌభాగ్యంబునకు చేటొనగూడెనో? మాపూర్వ జన్మదోషంబులెట్టివో? మనోహరాకారుండగు ప్రాణప్రియుండు వైరాగ్యం బేలబూనెనో? మ మ్మాదరించు పుణ్యాత్ము లెవరొకో? కాంతుండులేని కనకమయ సౌధంబులు గాల్పనే? ప్రియుండు లేని శృంగారంబులు రాల్పనే? నాథుండులేని జీవనంబు జీవనంబుల గల్పనే? ప్రాణనాయకుండులేని పర్యంకంబులు బడవేయనే? హా ప్రాణవల్లభుని కాయం బెంత కృశించెనే దుర్భరవిరాగవేషం బెట్లు ధరించెనే" యనిజలధిఘూర్ణిల్లినచందంబున రోదనంబు జేయుచు హాహాకారంబుచే భర్తరీనాథుని బరివేష్టించి "నాథా! మమ్మీ కష్టంబులపాలుజేసి మా సౌభాగ్యసుఖభోగంబు లపహరించి దూరదేశంబున కేగుట ధర్మంబగునే? ప్రపంచనిస్పృహత్వంబుచే మమ్మాదరించక నరణ్యంబుల కేగుట

యుచితమార్గంబగునే? యుష్మన్ముఖచంద్రావలోకనంబు లేని మామనో చాతకంబులు జీవించునే" యని యాక్రోశింపుచుండ భర్తరీనాథుండు సక్రోధుండై హంసదండంబుచే విదిలించుచు కఠినహృదయుండై జనుచుండ నాతలోదరులు వెంటనంటి "మనోనాయకా! జనదగదు జనదగ" దనుచు "నాథా! ద్వాదశాబ్దంబులు శ్మశానంబున నివసించి తుదకీ రాజ్యంబు బరిత్యజించి జనుట న్యాయంబుగా" దన భర్తరీనాథుండు ప్రత్యుత్తరంబు లొసంగక శీఘ్రగమనుండై పురంబు వెలువడి గోరక్షుని సమీపంబు జేరెను. గోరక్షనాథుండు విక్రమనృపాలునిచే ననుజ్ఞగొని భర్తరీసమేతుండై పదచలనంబు జేయుచుండ క్షితీశుం డా గోరక్ష భర్తరీనాథుల బుత్తెంచి నిజభవనంబు జేరంజని యంతఃపుర హాహాకార నినదం బాలకించి త్వరితంబున నేగి పరితప్తహృదయలగు నారీమణుల ననేక మృదువాక్యంబులచే శోకోపశమనం బొనర్చెను. ఇట గోరక్ష భర్తరీనాథులు వేగంబున జనుచుండ కృశీభూతశరీరుండగు భర్తరీనాథుండు శ్రమజెందుట గనుంగొని గోరక్షుండు వ్యానాస్త్రంబు జపియించి భర్తరీఫాలభాగంబున లేపనంబు జేయ తద్వ్యానాస్త్రమహిమాతిశయంబుచే తత్క్షణం బా గిరినారపర్వతశ్రేష్ఠనికటంబు జేరంజని యుష్ణాంశుతనూభవులు సర్వభూతదయాపరుండగు దత్తాత్రేయ పదసరోజంబులపై వ్రాలినంత దత్తుండు కరుణాంతరంగహృదయుండై దనవరదహస్తంబులచే నుభయనాథుల ముఖకమలంబులు బునుకుచు "గోరక్షా! నీవత్యంతశ్రమ జెందితి" వని ప్రేమించుచు భర్తరీనాథునితో "వత్సా! బహుకష్టంబు లనుభవించితి" వని లాలింపుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున భర్తరీనాథ పింగళా వియోగ దుఃఖోపశమన గోరక్ష సందర్శనాది కథావిశేషం బేకోనత్రింశత్యధ్యాయము సంపూర్ణము.

త్రింశత్యధ్యాయము.

భర్తరీనాథుండు దత్తానుగ్రహంబుచే బదరికాశ్రమంబున తపం బొనరించుట.

శ్రీగురుదత్తాత్రేయుం డత్యాదరంబున గోరక్ష భర్తరీనాథుల దీవించి యానందంబుచే నిజాశ్రమంబున నివసించియుండ గోరక్షుండు

త్రిరాత్రంబు లచ్చో గడపి గమనోన్ముఖుండై యత్రిసూనునితో విన్న వింప నమ్మహామహుండు "గోరక్షా! సచ్చరిత్రుండగు మత్స్యేంద్రుం డగుపడక బహుదినంబులయ్యె. మచ్చిత్తం బా యుత్తమోత్తముని వీక్షింపఁదలంచె. రయంబున దోడి తెచ్చి మన్మనఃపద్మంబు వికసింపం జేయు" మన గోరక్షుం డవశ్యంబని యనసూయానందనుని పదకంజంబులకు ప్రణమిల్లి ప్రయాణం బొనర్చెను. ఇట శ్రీగురుదత్తాత్రేయుండు దయాపూరితహృదయుండై భర్తరీనాథునిశిరంబున తనజగత్పవిత్రకర హస్తంబు మోపి యాచంద్రార్కామరత్వం బొసంగి చరాచరప్రముఖాఖిల సర్వభూత సాక్షిస్వరూపుండవై వెలుంగుమని యజ్ఞానాంధకార బంధురంబగు మాయామయప్రపంచ 'మోహపాశంబులు దెగటార్చి స్వరశాస్త్ర రసాయనశాస్త్ర జ్యోతిశ్శాస్త్ర కోకశాస్త్ర వైద్యశాస్త్ర ధర్మశాస్త్రాది నానాశాస్త్రంబులు బోధించి వాతాస్త్ర జలదాస్త్ర నాగాస్త్ర స్పర్శాస్త్ర విభక్తాస్త్రాగ్నేయాస్త్రైంద్రాస్త్ర కార్తికాస్త్ర కామాస్త్ర ప్రముఖదివ్యాస్త్ర ప్రయోగోపసంహారంబుల కీలెఱింగించి ఖడ్గ త్రిశూలపరశు గదాంకుశాది బహువిధ సాధనంబులజాడల దెలపి యమోఘమంత్ర మంత్రార్థ రహస్యంబు లుపదేశించినంత మున్ను నరాధిపత్యంబుచే సర్వ విద్యాపారంగతుఁడై నకతంబున రత్నస్థగిత చామీకరంబుకరణి విభ్రాజమానుండై వెలుంగుచున్న భర్తరీనాథుని గనుంగొని త్రిమూర్త్యుండు శాబరీవిద్యారచనంబుకై నాగాశ్వత్థ వృక్షరాజ నికటంబునకేగ విధి విధానంబులు శ్రుతపఱచి సాధింపుమని శలవొసంగ భర్తరీనాథుండు శీఘ్రంబున జేరంజని తొల్లి మత్స్యేంద్రయోగివర్యుం డాచరించిన చందంబున మార్తాండకుండోదకంబులచే వృక్షస్థనిఖిల దేవతాప్రత్యక్షంబుబడసి త్వరితంబున శ్రీగురుదత్తాత్రేయుచరణసన్నిధి కేతెంచెను. గురువర్యుండు భర్తరీనాథుని వెంటగొని బదరికాశ్రమంబున కేగి తత్పవిత్రకరనిర్మలస్థలంబున తపంబుకై భర్తరి న్నియోగించి స్వస్థానంబుజేరి మత్స్యేంద్రనాథాగమన మార్గావలోకనుండై నివసించె నట

గోరక్షుండు మత్స్యేంద్రనాథుని దోడ్కొని శ్రీదత్తాత్రేయసన్నిధి కేగుచుండుట.

గోరక్షనాథుండు నానాజనపదంబులు గడచి గర్భగిరి చేరంజని తాపసోత్తముండగు మత్స్యేంద్రుని చరణకంజంబులకు నమస్కరించి "దయాఘనా! నే ననేకతీర్థంబులు గ్రుమ్మరుచు శ్రీగురుదత్తాత్రేయాశ్రమంబున

కేగియుండ నమ్మహామహుండు యుష్మత్సందర్శన తృషార్తుండై మీ కె
ఱింగింపు మని పలికె" నన మత్స్యేంద్రనాథుండు పరమాహ్లాదంబుచే
డోలాయమానమానసుండై "వత్సా! మచ్చిత్తం బా పరమదయాకర
గుణాళుండగు దత్తాత్రేయుని పదపద్మసందర్శనకుతూహలంబుచే
మెలంగుచుండు. వేగంబున నేగవలయు" నని నుడువుచు నొకకొన్నిదినం
బులు గడపి గోరక్షసహితుండై ప్రయాణం బొనర్చి వైదర్భదేశమార్గం
బాశ్రయించి జనుచు కౌండిన్యనగరంబున భిక్షార్థంబై సంచరింపు
చుండ నానాఁ డా నగరాధిపుండగు శశాంగనృపాలుండు కోపావే
శుండై స్వసుతుని కరపాదఖండనం బొనర్చియుండె నన శ్రోత లత్యం
తసంశయమనస్కులై శశాంగనృపుం డేకతంబున నిజసుతుని హస్త
పాదంబులు ఖండించెనని విచారింప నక్కథకుండు శశాంగమహీశుండు

శశాంగనృపపుత్రుండగు కృష్ణాగర (సారంగధర) చరిత్రము.

బహువిధ సంపదైశ్వర్యస్థైర్యధైర్యసాహసంబులచే రాజ్యం బేలుచు నన
పత్యుండై ప్రపంచనిస్పృహత్వంబుచే రాజ్యభోగసుఖసంపదల విసుకు
గొని యహర్నిశంబులు సంతానంబుకై చింతింపుచు మనఃఖేదంబుచే
కాలంబు గడుపుచుండ నొకానొకదివసంబున మందాకిని యను పట్ట
మహిషి వల్లభునియుల్లంబు గనుంగొని "నాథా! సంతానంబుకై
సంతాపంబు నొందనేల? చింతించినంత సంతానంబు ఘటియించునే?
ఫాలలిఖిత దోషంబు పరితాపంబుచే దొలంగునే? చింతానలంబుచే
శరీరంబు క్షీణించుగాక! కామ్యసఫలత్వంబు వాటిల్లునే." యని తా
పోపశమనవాక్యంబులు బలుకుచుండ ననుదినం బా శశాంగనరపుంగ
వుని హృదయంబున వ్యాకులం బధికంబై నిగ్రహంబుచే నుమాధవుని
ధ్యానింపవలయునని తలపోసి సచివోత్తమునికి రాజ్యభారం బొసంగి
జాయాసహితుండై రామేశ్వర మహాతీర్థంబున కేగుచు మార్గమధ్యం
బున కృష్ణా తుంగభద్ర సంగమస్థలంబున నివసించి త్రియామంబు
గడుపుచుండ పంచాననుండు స్వప్నంబున ప్రసన్నుండై "వత్సా!
మత్కారణంబున నతిప్రయాసంబుచే రామేశ్వరం బరుగనేల నేత
త్కృష్ణా తుంగభద్రా సంగమ తటస్థానంబున నపర్ణాసహిత మహాలిం
గంబు గలదు. నీవా లింగంబునకు భక్తియుక్తుండవై యర్చించితివేని

నీకామ్యంబు జేకూరును సంశయం బుడుగు" మని వరంబొసంగి యంతర్ధానంబైనంత క్షితీశుండు సంతుష్టుండై సూర్యోదయానంతరంబున సంగమప్రదేశంబు జేరంజని తత్థ్సలంబున బ్రతిష్ఠాభిన్న మహాలింగంబు బొడగాంచి సప్రేముండై విధిపూర్వకంబుగ నమ్మహాలింగంబును స్థాపించి యఖండోత్సవం బొనర్చి సంగమేశ్వరనామంబుచే జగద్విఖ్యాతి గావించెను. తత్పూర్వం బా సమీపస్థ భద్రసంగమగ్రామంబున నొకవిప్రోత్తముండు మిత్రాచార్యనామంబుచే వేదవిద్యాపారంగతుండై ప్రసిద్ధిగాంచి పతిభక్తి విశేషంబులచే బెంపెక్కిన సరయూనామ జాయాసహితుండై యపత్యంబు లేనికతంబున నిత్యం బా మృత్యుంజయుని సన్నిధానంబున ధ్యానింపుచుండె. నంత నొకనాఁ డింద్రలోకంబున నవరత్నస్థగిత దివ్యపీఠంబున చంద్రశేఖరు నలంకరించి బృందారకు లత్యంతమోదంబుచే నర్చించి సవినయభయభక్తులచే బరివేష్టించి కూర్చుండుతఱి యగణితరూపగుణ సౌందర్యవతి యగు సురోచనీనామ్నియప్సరస దనముఖనఖద్యుతిప్రకరంబులచే సీతమయూఖుని సర్వస్వం బపహరించి తనుదృక్కాంతులచే మించులకు మించు లొసంగి సుస్వరవాఙ్మాధుర్యంబుచే రాగాలాపంబులు జేయుచు కరపల్లవాభినయంబున సుపర్వాణుల యుల్లంబులు కొల్లగొని ముల్లోకరాజ్యలక్ష్మి కెనయై నిత్యుండగు కాత్యాయనీప్రియుని జగన్మోహనాకారంబు నిరీక్షించి యిక్షుధన్వుని తీక్ష్ణతరాంబక క్షతహృదయయై మనంబున నతేశుని రతిసుఖంబు గోరి నృత్యంబు సల్పుచుండ చంద్రచూడుం డవ్వీరహోత్కంఠిత కాంతామణి మనోగతం బెఱింగి యాగ్రహంబుచే "సురోచనీ! నీదివ్యశరీరంబు బరిత్యజించి మనుజలోకంబున కేగి కృష్ణాభద్రా సంగమస్థానంబున మిత్రాచార్యకాంతామణి యగు సరయూదేవి గర్భంబున జన్మింపు" మని శాపం బొసంగ సురోచనీనారి భయజనిత హృదయంబుచే "నహాహా! నే నొండు దలంప దైవం బొండు దలంచె. రత్నంబులకై ప్రయత్నింప* కాచంబులు లభించుట భాగ్యహీనంబుగాదె" యని విషాదంబుచే మేరుకార్ముకునిచరణంబుల కెఱఁగి ముకుళిత కరకమలయై "హరా! త్రిపురహరా! ఆశ్రితజనవరదాయక శుభకరా!

---

* కాచంబులు=గాజుపూసలు.

విబుధజనవినుత పదకమల హైమవతీవరా! గజదనుజ మదదమనఘన బలత్రిశూలధరా! వననిధిజనిత భయంకర విషధరా! గంగాధరా! శంకరా" యని స్తోత్రంబులు జేయుచు "దయాంతరంగా! నేనీ మనోహర నాకలోకం బెడబాసి మనుజలోకంబున జన్మించుట మహాకష్టంబు గాదే? కృపామతివై శాపమోచనవరం బొసంగవే" యని విలపించుచుండ నప్పరమేశ్వరుండు సంతసించి "సురోచనీ! నీవా విప్రకాంతగర్భంబున జన్మించి నవయౌవనాంగివై మెలంగుచుండ మత్కరస్పర్శన మాత్రంబున నీదివ్యరూపంబు ధరియించి యీయమరలోకంబున కేతెంచెద" వని శాపమోచనకారణంబు దెలిపినంత తత్క్షణం బా యప్సరాంగనామణి నిజపదంబు దొలంగి కృష్ణాతటంబున శివధ్యానతత్పరుండగు మిత్రాచార్యవిప్రోత్తముని కాంతామణిగర్భంబున బ్రవేశించి దినదిన ప్రవర్ధమానయై నవమాసంబుల కుదయించి శుక్లపక్షేందుబింబంబుపగిది వృద్ధిబొందుచు ననుదినంబు మాతాపితృలతో నీలకంఠుని యాలయంబున కరుదెంచి నయభయభక్తులచే దండంబులిడుచుండె నిట్లా మత్తచకోరాక్షి కదంబయను నామంబుచే బ్రకాశించుచు ద్వాదశాబ్దంబుల పరిపూర్తి వహించి ఘనశశి వనరుహ పల్లవ హరిపద కమఠభంబుల గెలిసేయు కచ ముఖ గళ కర కటి పద నఖంబుల కలిమిగలిగి విద్యుత్పుంజమిళిత చామీకరంబో యన విరాజమానంబగు తనుకాంతిచే భ్రూచాపవినిర్ముక్త దృక్శరనైపుణ్యంబున చిత్తజుని చిత్తం బపహరించుచు లీలావినోదంబుతో మెలంగుచుండ మిత్రాచార్యుం డీముద్దియ స్వరూపానుకూలవరుని వీక్షింపవలయు నని తలంచి మనంబున నూహించుచుండ నొకనాఁ డక్కాంబుకంఠి ముక్కంటిమందిరంబున కేకాంతంబున నేతెంచి వందనంబు లిడుచుండెను. వినుతగుణాకదంబుండగు హరుండు కదంబాస్వరూపంబు గని మన్మథోద్రేకంబుచే మదిరాక్షిం గూడదలంచి ప్రసన్నుండై విచారింప భయంబుచే బరువులిడుచుండ నుమావరుండు రయంబున వెనువెంటం బరుగెత్తి యంగస్పర్శనంబుజేయ తత్క్షణం బాకదం బా దేవి దివ్యతరదేవగణికాశరీరంబు దాల్చి దేవలోకంబున కేగెను. తదుపరి సర్వభూమణుండు దేవళంబున కరుదెంచునెడ కదంబార్పితచిత్తుం డైనకతంబున వీర్యంబు గళితంబై కృష్ణాతటంబున బడియుండె. నయ్యది వర్షయోగంబుచే

తన్నదీప్రవాహంబునఁ బ్రవహించుతఱి శశాంగనృపుండుతత్తోయంబుల మునింగి దివాకరునికై యర్ఘ్యంబు లొసంగఁదలంచి యంజలీపుటంబున వీర్యయుత నీరంబులు గ్రహింప మనుష్యదేహసంయోగంబుచే నంజలీభాగంబున నర్భకుం డుద్భవించి మహాకాంతిచే బ్రకాశించుచుండెను. మహీధవుం డత్యంతాశ్చర్యంబుతో నిప్పుత్రుండు హరివిరించిప్రముఖాఖిల సురసంఘంబున నొకండు గానోపును. లేకున్న నయోనిజన్ముఁ డగుట దుర్లభంబు గాదే! మత్పురాకృతవిశేషంబున నుమేశుం డొసంగె నని నిశ్చయించి పరమానందంబుచే శిబిరంబున కరుదెంచి మందాకినీదేవి కర్పింప నక్కోమలాంగి ముదాన్వితహృదయయై "నాథా! తేజోధనుండగు డింభకుం డెవరిసుతుం"డని విచారింప క్షితీశుండు సతీతిలకంబుతో "ప్రియే! కృష్ణాప్రవాహతోయంబులచే ప్రభాకరున కర్ఘ్యంబు లొసంగునెడ కరుణాంతరంగుండగు గరళకంఠుం డొసంగె"నన నమ్మృగాక్షి మితిలేని యానందంబుచే నర్భకుని కౌఁగిటం జేర్చుకొనునంత దైవయోగంబున నురోజంబుల క్షీరంబులుదయించె. పిదప ద్వాదశదివసంబు లచ్చో నివసించి శాబకునకు 'కృష్ణాగరుం' డని నామకరణం బొనర్చి మదనారిచరణంబులకు వందనంబులిడి నిజపురంబున కేతెంచిన దినదినం బా కృష్ణాగరుండు వర్ధిల్లుచు ద్వాదశాబ్దంబుల బాలుండై బహుగుణవిశేషంబులచే మెలంగుచుండె శశాంగుండు తనూభవుని వివాహం బొనర్పఁదలంచి కర్దముండను మంత్రిపుంగవునితో "బాలుండగు కృష్ణాగరురూపగుణలక్షణంబుల కెనయగు సుదతీరత్నంబును శోధింపు" మన నతం డవశ్యంబని పురోహితాది శిష్టజనపరివృతుండై నానాదేశంబులు గ్రుమ్మరుచు బహుప్రయాసంబుచే ప్రతిపట్టణంబున పల్లవాధరిని శోధించి కృష్ణాగరానురూపముద్దియను గానక తిరిగి కౌండిన్యనగరంబున కేతెంచి నృపాలోత్తమునితో "రాజశ్రేష్ఠా! కృష్ణాగరునకై యనేకనగరంబులు దిరిగి వరానుకూల సారసాక్షిని గానక తిరిగి యేతెంచితి" మని విన్నవించి నిజపదంబున విలసిల్లెను. తదనంతరం బా మహీనాయకుం డొకకొన్నిదివసంబులు గడపుచుండ మందాకినీదేవి ప్రాణంబులు పరలోకగతంబులయ్యె. నృపుండు గతజాయుండై శోకార్ణవంబున మునుంగుచు ఖేదమానసంబుచే నిస్పృహత్వంబున వైభవం

బులు దలంపక నింద్రియనిగ్రహుండై రాజ్యం బేలుచుండి యొకనాఁ
డమాత్యునితో "మంత్రిముఖ్యా! కృష్ణాగరునికై యనేకరాజ్యంబులు
సంచరించితి వందు నాకనుకూలంబగు పడఁతిమున్న గలదేని దెలుపు"
మన సచివుండు యోచించి "స్వా నాయకా. చిత్రకూటనగరాధిపుం
డగు భుజధ్వజనామభూవల్లభునకు సకలగుణలక్షణోపేత పుత్రికార
త్నంబు గలదు. నేనత్తలోదరి యుత్తమోత్తమగుణంబు లాలకించి
కృష్ణాగరునికై విచారింప నమ్మగువ గ్రహశత్రుత్వాది కూటవిరుద్ధం
బుచే ఘటియింపదయ్యె. యుష్మన్నామధేయంబుపై యనుకూలవం
తంబో కాదో? పురోహితునిచే నాలోచింపవలయు" నని రయంబున
భుజధ్వజదుహితృజాతకంబు దీసి చతురుండగు పురోహితుని బిలచి
బరీక్షింపు మన నవ్విప్రోత్తముండు "శశాంగనరపుంగవునకు సర్వ
కూటప్రశస్తంబై ప్రకాశించు" నన తక్షణంబున సచివుండు మహీ
ధవునిచే ననుజ్ఞగొని చిత్రకూటపురంబున కేతెంచి భుజధ్వజునితో
శుభసంభాషణంబులు వెల్లడి యొనర్చి శశాంగనృపాలునికై లగ్నస
మారంభ ఘటికానిశ్చయశుభపత్రిక లిఖియించి యొకదూతచే కొండి
న్యనగరాధిపుని కనుప శశాంగుండు హర్షమానసుండై సపరివారబంధు
మిత్రసహితంబుగ చిత్రకూటనగరంబున కరుదెంచి శుభముహూర్తం
బున భుజావంతిని వివాహంబాడి శ్వశురునిచే ననుజ్ఞ వడసి జాయాసమే
తంబుగ నిజపురంబున కేతెంచి ముదాన్వితమనంబున కాలంబు గడుపు
చుండ నక్కాంతామణి షోడశాబ్దపరిపూర్ణుండగు కృష్ణాగరుని నవయా
వనాంగంబులు విలోకించి దుర్మతిచే కృష్ణాగరునితో నేకాంతంబున
సంభాషింపవలయునని యూహించి శశాంగుండు మృగయావినోదం
బుగ నరణ్యంబున కేగినతఱి నిజకేళీగృహంబున నివసించి యొకపనికత్తె
యతో కృష్ణాగరుని దోడితెమ్మనివాక్రుచ్చిన నచ్చెలి శీఘ్రంబున రాకొమ
రుని జేరంజని "నృపాలతనయా! యుష్మత్సాపత్నిమాత మిము దోడితె
మ్మని యనుజ్ఞ యొసంగె" నన కృష్ణాగరుండు బహుదినంబుల కస్మత్సా
పత్నిజనన్యనుగ్రహపాత్రుండనైతినని సంతోషస్వాంతుండై త్వరితంబున
నంతఃపురంబు ప్రవేశించి భక్తిభావంబులచే నమస్కరింప నయ్యమలా
త్మని నవమోహనాకారంబు గని మన్మథోద్రేకంబుచే హస్తంబు ధరి

యించి "పురుషశ్రేష్ఠా! మచ్చిత్తంబు చిత్తజునితాపంబుచే భవదర్పితం బయ్యె. నీదయారసపూరితహృదయంబుచే సురతసుఖార్ణవంబున గడ తేర్పవే" యని నుడువ కృష్ణాగరుండు క్రుద్ధుండై "భ్రష్టే! మహీశునకు మహిషివై మజ్జననీతుల్యంబుగ సాపత్నిమాతవై నీచమతిచే సుతుండని దలపోయక పొందుగోరుట కర్జంబగునే! నీపాపంబునకు కృతాంతుండు శిక్షించ సరిపోవునే" యని తిరస్కరించి యాహా! స్త్రీజనకపటమానసం బు లెంతవిగీతంబు లనుచు వేగంబున నిజస్థానంబు జేరంజనెను. తదనం తరం బాచపలాక్షి పరిచారికంబిలిచి "సఖీ! నాప్రయత్నంబు విఘ్నం బయ్యె. దృఢతరహృదయుండగు కృష్ణాగరుండు క్షోభించె నికముందు నే నెట్టి యాపదలపాలౌదునో? కృష్ణాగరుండు జనకుని కెఱింగించెనేని నాప్రాణంబు లపహరింపఁబడునో? మునుముందు విషపానంబుచే శరీ రంబు త్యజించుట మేలౌనగూడదే? నిందాస్పదజీవనంబు గాల్పనే? జీవింతునేని నృపోత్తమునిచే కడుకష్టంబు లనుభవించక దీరునే? మ త్కృత్యంబులు పరమహేయంబులు గావే? ప్రాణంబులు విడుచుట ము ఖ్యంబై గాన్పించు" నని బహువిధంబుల విలపించుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున శశాంగ కృష్ణాగరచరి త్రంబు త్రింశత్యధ్యాయము సంపూర్ణము.

ఏకత్రింశత్యధ్యాయము.

{ కరపాద ఖండితుండగు కృష్ణాగరుని మత్స్యేంద్రగోరక్షనాథులు గొనిపోయి తపంబుకై నియమించుట. }

ఇప్పగిది బుద్ధిరహిత భుజావంతి దనసుద్దు లోకముద్దియతో దెలుపుచు పంచత్వంబు నొందెద నని నిశ్చయమనంబుచే నుడువుచుండ నక్కపటమయ జక్కవచంటి పెక్కుభంగుల నోదార్చుచు "నోహో! నీకింతభయంబేల? మద్బుద్ధినై పుణ్యంబుచే నీకొక సదుపాయంబు దెలి పెద. భోజనంబు బరిత్యజించి భూషణంబులు బఱద్రోసి శోకాకులిత చిత్తంబుచే పడకటింటిపాన్పుపై నత్తమిల్లుము. నృపుం డేతెంచి 'యేక తంబున శయనించితి'వని విచారించు. నీవపు 'డికేటి బ్రతుకు? మత్ప్రా

ణంబులు బరిత్యజించెద' నని యతనితో 'భవత్సుతుండు కామోద్రేకంబుచే నన్నొడిసిపట్టి బాధింపుచుండ నే నతిసాహసంబున విదలించి యంతఃపురంబు బ్రవేశించినంత పరుగెత్తెను. నాయట్టి నీచశరీరి లోకంబున గలదే'? యని క్రోధావేశవాక్యంబులచే రోదనం బొనర్చెదేని క్షితీశుండాగ్రహచిత్తుండై కృష్ణాగరుని జీవంబు లపహరించు. వహ్నిస్పర్శభవనంబు శంబరంబుచే శాంతింబొందినక్రియ దుఃఖప్రవాహంబును మాయోపాయకూలంబుచే బంధించెద వేని నీయనులత్వం బేర్పడు. నీసుఖంబులు స్థిరంబులై యుండు. నీమనోగత తాపం బెడబాయు" నని యనర్థంబులగు దుర్బోధంబులు బోధించి దనగృహంబున కేగెను. పిదప నక్కుటిలమతియగు భుజావంతి మలినవస్త్రంబులు ధరించి మణిచిత్రిత భూషణంబులు బుడమినివైచి కుంకుమాది సౌభాగ్యద్రవ్యంబు లపేక్షింపక శిథిలీకృతపర్యంకంబుపై బవళించియుండ శశాంగనరోత్తముండు నానావనమృగంబుల జెండాడి రయంబున భటజనపరివృతుండై పురంబుజేరి మనోల్లాసంబుచే నంతఃపురంబు ప్రవేశించునంత ద్విజరాజగమని యగు భుజావంతి సంతసంబున నెదురేతెంచలేదని మనంబున చింతింపుచు నొకదాసీకాంతను విచారింప నయ్యింతి భూకాంతునితో "భుజావంతి యేకతంబుననో ఘోరతరచింతాభరత్వంబున నేకాంతంబున శయనించె" నని విన్నవించెను. శశాంగుం డతివేగంబున తచ్ఛయ్యాగృహంబు బ్రవేశించి "ప్రియే! శరచ్చంద్రచంద్రికలనేలు నీముఖకమలం బేల ముకుళించె" నని విచారింప నత్తన్వి ప్రత్యుత్తరం బొసంగక బాష్పంబులురాల్చుచు నాక్రందించుచుండెను. బుడమిఱేఁడు కడు మోహంబున నప్పడఁతిపజ్జం గూర్చుండి ముఖంబు నివిరి బాష్పంబులు దుడిచి లాలింపుచు "సఖీ! నాయట్టి దోర్బలప్రతాపయుత ప్రియుండు గలుగ నీకీ దుఃఖం బేల? దాసీజనంబులు నీయాజ్ఞోల్లంఘనంబు జేసిరో? మద్దర్పంబుఁ దలంపక నెవ్వరేని నీచమతిచే దూషించిరో? తత్క్షణం బా నరాధముల మత్కృపాణజ్వాలలచే రవిపుత్రుని నిలయంబున కంపక నుపేక్షింతునే? నీమనోవ్యథకారకులగు పురుషుల మశకప్రాయులుగా గణుతించనే? వ్యాఘ్రంబు జంబుకంబుల సరకుగొనునే! దుష్టులను శిక్షింపని నృపుండు శిష్టుండగునే? మత్పట్టమహిషివై దుఃఖంబుల పాలగుట నాకపకీర్తివాటిల్లదే? నీశోకంబు బాపని శౌర్యంబు గాల్పనే? నిస్సం

శయమనంబుచే నేమనుజాధముండు నిను దిరస్కరించెనో యెఱింగింపుము. తత్క్షణంబా దుష్టాత్ముని కష్టంబుల పాలొనర్చి ప్రాణంబులపహరించెద" నన భుజావంతి ముదంబుచే "నాథా! మీరు మృగయానిమిత్తంబై విపినంబున కేగుటంగని కృష్ణాగరుండు దుష్టభావంబుచే నేకాంతంబున కరుదెంచి జ్ఞానశూన్యుండై పాపంబని దలంపక మరుకేళికై మత్కరంబు ధరించి సరసంబులాడుచు శయ్యాగృహంబున కీడ్చుచుండ సాహసంబుచే విదిలించి సౌధాగ్రంబుపై బరుగెత్తితిని. కృష్ణాగరుండు దుర్భాషలాడుచు దననివాసస్థలంబున కేగెను. ప్రాణప్రియా! తత్క్షణంబ గరళంబు ప్రాశించి ప్రాణంబులు బాయందలంచియు యుష్మత్పదకమలసందర్శనోత్సుకంబుచే మార్గంబు నిరీక్షింపుచు మోహపాశబద్ధమానసనై నివసించితిని. నామనోభీష్టంబు చేకూరె. మత్ప్రాణంబులు త్యజించుట నిక్కంబు నిక్కం" బని నొక్కి వక్కాణించి దిక్కులు పిక్కటిల్ల శోకింపుచుండ నక్కువలయేశ్వరుండు కోలనేసిన వ్యాఘ్రంబుపగిది యాగ్రహించి ఘనకోపాలన మూర్తిస్వరూపుండై నిమిషంబున కృష్ణాగరుని భస్మంబొనర్చెద నని పౌరుషంబులు బలుకుచు నేత్రంబుల విస్ఫులింగంబులు రాల్చుచు శీఘ్రంబున సభామంటపంబున కేతెంచి యొకభటునితో "దుష్టుండగు కృష్ణాగరుని కరపాదంబులు ఖండిపు" మని యాజ్ఞాపింప వాఁ డతిరోషంబుచే నృపసుతుని దోడ్కొని మృత్యుభూమిం జేరి కృష్ణాగరు నచ్చోనుంచి భూమీశుని సన్నిధి కేతెంచి "ప్రభో! భవదాజ్ఞానుసారుండనై కృష్ణాగరుని ప్రేతభూమికిఁ గొనిపోయితి" నని విన్నవించుచుండ నరపుంగవుండు గోపించి "తడవేల కరపాదంబులు ఖండింపు" మని వాక్రుచ్చెను. భటుం డతిరయంబున భూపనందనుని సమీపంబున కేతెంచి దయాంతఃకరుణహృదయుండై ముమ్మారు విచారించుట ధర్మంబని దలపోసి పునశ్శశాంగుని సమక్షంబున కరుదెంచి "దేవా! సెలవా" యని మంగళింపుచుండ నృపుండు "తడవేల! శాసింపు" మని యాజ్ఞాపించెను. భటుండు దనడెందంబున విమలజ్ఞానయశోధనుండగు కృష్ణాగరుని హస్తపాదంబులు ఖండింపఁబడుటచే మహాదనర్థంబు ఘటియించు" ననుచు ఖేదమతిచే జని యొకరత్నమయపీఠంబుపై రాసుతు నలంకరించి ఖండించుటకై కరచరణంబులు బంధింప నంత పురజను లీభయంకర

వృత్తాంతం బాలకించి గుంపులు గట్టి భూపుని సముఖంబున కేతెంచి కోపపూరితలోచనుం డగుట బొడగాంచి యసమర్థులై యొండుబలుకక వేగంబున హరవీరేశ్వరుని విలోకింప జేరంజనిరి. తత్సమయంబున నృపోక్తప్రకారంబుగ భటుండు కరపాదంబులు ఖండించె. నంత నయ్యా మలాత్ముండు మూర్ఛాగతుండై బుడమింబడ భూదేవి దనఫాలభాగంబున ధరించిన కుంకుమతిలకంబో యన కరపాదనిర్గత రుధిరధారానుయంబై శోభిల్లుచుండ కృష్ణాగరుండు హాహాకారంబు జేయుచుండెను. చూపఱు లీయద్భుతంబుగని యాహా! భూధవుండు వృద్ధుండై బుద్ధిహీనంబుచే స్వసుతుని శిక్షించె ననుచు నొకకొంద ఱీ యమలాత్ముండు నిర్దోషుండనుచు మఱికొంద ఱీ కృష్ణాగరుం డధర్మంబుచే సవతితల్లిని జెనకి శిక్షార్హుం డగుట ధర్మవిరుద్ధం బనదగునే? దుర్గోచరవృశ్చికంబుల నుపేక్షింతురే? పక్షపాతరహితులగు క్షితీశులు న్యాయమార్గం బాశ్రయించుట ముఖ్యకారణంబు గాదె? యనుచు కొందఱీ దుష్టజనాచరిత దుష్కార్యంబు దృఢమానసుండగు కృష్ణాగరునిచే నాచరింపఁబడెననుట కల్లగాదే? నిజానిజం బెఱుంగని భూపుండు పాపమతిచే నేకపుత్త్రుం డని దలంపక కఠినతరశిక్ష లొనర్చె ననుచు ననేకు లనేకవిధ సంభాషణంబులు సల్పుచు విషాదవదనులై చని పురంబున గుజగుజలాడుచుండఁ దఱి గోరక్ష మత్స్యేంద్రు లలక్ష్యనిరంజన భిక్షాప్రశ్నంబులు జేయుచుండ బుద్ధిదక్షుండగు గోరక్షుం డీ దుస్సహ దురోక్తు లాలకించి త్వరితగతి ప్రేతభూమి కరుదెంచి వికలాంగుండగు మృత్యుంజయ వీరేశ్వరుని గనుంగొని తపోఘనుండగు మత్స్యేంద్ర యోగివర్యుని కెఱింగింప నమ్మహామహుండు కరుణామయుండై దనయంతరంగదృష్టిచే కృష్ణాగరుని నిర్దోషచరిత్రంబు భుజావంతి కుత్సితంబులు దలంచి సక్రోధుండై "భ్రష్టాత్ముండగు భూపుండు కపటమయకాంతార్పితచిత్తుండై న్యాయాన్యాయంబులు శోధింపక మూఢమతిచే గంగాధరవీరేశ్వరుని యంగంబులు శస్త్రఘాతంబులచే భంగపఱిచెను. నీచాధముండగు నృపుండు భూభారుండు గాఁడే? విషయలోలుండై దోషం బెఱుంగక నిర్దోషజనాళిని శిక్షించెడు పాపుండు శిక్షార్హుండు గాఁడే" యని "గోరక్షా! తత్క్షణంబున నృపాధముని సముఖంబున కేగవలయు ర" మ్మని తత్ప్రదేశంబు బాసి పదచలనంబు

జేయుచుండ గోరక్షుం డంతరంగదృష్టిచే కృష్ణాగరుండు శివవీర్యోద్భవుం డగుట యెఱింగి "గురుసమర్థా! మనమీ కృష్ణాగరునికై క్షితీశుని శిక్షింపనేల? నిబ్బాలుని నాథపంథీమార్గంబున బ్రకాశింపఁ జేయవలయు. చతురంగపీఠంబుపై కరచరణంబులు ఖండించినకతంబున చౌరంగనాథనామంబిడి యనేకమంత్రసూత్రార్థరహస్యంబు లుపదేశించి సర్వవిద్యావిశారదత్వంబుచే బ్రఖ్యాతి యొనర్చి పిదప నీచౌరంగనాథునిచే దుష్టజాయాసహిత భూరమణుని గర్వనిర్వాపణం బొనర్పవలయు. మనమిపు డీనృపాధమునితో కృష్ణాగరుని గొనిపోయెదమని దెలియబఱచుట యుచితం" బని విన్నవింప జ్ఞానసంపూర్ణుండగు మత్స్యేంద్రుం డవశ్యం బని రాజభవనంబు జేరంజని ద్వారికునితో దమరాక నెఱింగింప వాఁ డతివేగంబున నేగి నరాధిపునితో "తాపసోత్తములగు గోరక్ష మత్స్యేంద్రు లేతెంచి" రని వచియించెను. శశాంగుం డమ్మహామహుల తపఃప్రభావచరిత్రంబు లెఱుంగుకతంబున ప్రీతమానసుండై పీఠంబు దొలంగి మంత్రిపురోహితసహితంబుగ తాపసోత్తముల కెదురేగి బహువిధభయభక్తియుక్తుండై యోగిముఖ్యుండగు మత్స్యేంద్రసిద్ధుని పదకమలంబులపై ఫాలంబుమోపి స్తోత్రంబులు జేయుచు తదుపరి గోరక్షనాథచరణంబులకు ప్రణమిల్లి "దయాఘనులారా! మత్పూర్వకృత పుణ్యఫలంబుచే మీయుభయనాథుల దర్శనంబు ఘటించె. మద్వంశంబు జన్మంబు భవనంబు పావనం బయ్యె. నస్మదజ్ఞానపాపభంగంబుకై యరుదెంచిన గంగాప్రవాహంబన సురనరాది వందితచరణారవిందులై దయారసభరిత హృదయంబులచే నేతెంచితిరి గాబోలు. లేకున్న భవాదృశయోగిముఖ్యుల దర్శనంబు లభియించునే" యని పొగడుచు దోడ్కొని సభామంటపంబున కేతెంచి రత్నఖచిత కనకసింహాసనంబులపై యుభయసిద్ధుల నలంకరించి షోడశోపచారంబులచే బూజలొనర్చి ముకుళితకరపల్లవుండై నికటంబున నిల్చి మత్స్యేంద్రనాథునితో "సమర్థా! భవదాగమనకారణం బెయ్యదియో కృపామతిచే నెఱింగించి నన్నుద్ధరింపవే" యని వేఁడుచుండ మత్స్యేంద్రుండు నరేంద్రుని వాక్చాతుర్యంబుల కానందించి "రాజోత్తమా! మేమీ నగరంబున కరుదెంచునెడ నొకబాలుండు గ్రామబాహ్యప్రేతభూమిసమీపంబున

చతురంగిపీఠంబుపై ఖండీకృతకరపాదుండై విలపిల్లుట గాంచి భవన్నో ధానల శిక్షితుండని యెఱింగి యిందే తెంచితిమి. న్యాయవిరుద్ధబా లుండు గావున మాకర్పించెదవేని గొనిపోయెద" మన బుడమిఱేఁడు హాస్యరసపూరితవదనుండై "యోగిపుంగవా! కరపాదరహితుండగు మనుజుండు మిమ్మెట్లు సేవించు? తా మూ వికలాంగునికై కష్టంబు లను భవించరే? తమభుజాగ్రంబులపై వహించి చనుట యుచితంబగునే" యని నమ్రుండై విన్నవింప యోగిధూర్జటి యగు మత్స్యేంద్రుండు "రాజశ్రేష్ఠా! నీకుశత్రుస్వరూపుండు గావున నశక్తుని నశక్తుం డనియె దవు. నీకీ సంశయంబేల" నన శశాంగుండు "దయామయా! బాలుం డు భవచ్ఛరణార్పితుండయ్యె నవశ్యంబున దోడ్కొని జనుం" డన శీఘ్రంబున మత్స్యేంద్రగోరక్షులు ప్రేతభూమి కరుదెంచి రా కుమారుని దోడ్కొని దమవిడిది కేతెంచి హస్తపాదప్రక్షాళనం బొనర్చి యొకరాత్రి యచ్చో గడపిరి. శ్రోత లోకసంశయంబు గలిగి పునస్సృష్టి యొనర్చు సమర్థులగు మత్స్యేంద్రగోరక్షులు సంజీవినీ మంత్రయోగంబుచే మృత్పుత్రికను సజీవంబొనర్చి గహినీనాథనా మంబుచే బ్రకాశింపఁజేసిన ఘనులై కృష్ణాగరుని కరపాదంబు లేల గల్పించలేరైరని విచారింప నవ్వారాణికుండు శ్రోతలారా! ఏతత్సంశ యంబు జెప్పఁబోవు కథావిశేషంబులచే స్పష్టంబగు పురోసూచకకార ణంబుచే నిమ్మహామహులు గల్పింపలేరైరి. తపంబుకై నియమించు నెడ కరపాదంబు లుద్భవిల్లునని బలుకుచు గోరక్షుండు స్వభుజాగ్రం బులపై చౌరంగుని నెక్కించుకొని మత్స్యేంద్రనాథసహితుండై బద రికాశ్రమంబునకు జేరంజని శివాలయంబున చౌరంగుని డించి యుభ యనాథులు బదరికేశ్వరునికి వందనంబు లాచరించి కాననంబు గ్రుమ్మ రుచు మందరాచలప్రదేశంబున నొకగహ్వరంబు గని యాస్థలంబున చౌరంగునితపంబుకై నియమించవలయునని నిశ్చయించి యేతత్ప్రదేశం బతిగోప్యంబై బ్రకాశించును చౌరంగు నిందుంచి యేగితిమేని పునస్సం దర్శనంబగుట కష్టంబగునని యోచించి యచ్చోనొకచిహ్నం బేర్పఱచ దలంచి గోరక్షుం డొకవిస్తీర్ణపాషాణంబు గొని తెచ్చి గుహోపరిభాగం బున నస్త్రవిద్యానైపుణ్యంబుచే నిరాధారంబుగ నిలిపి యుమానా థుని నిలయంబున కేతెంచి చౌరంగుని దోడ్కొని యచ్చోటి కరు

డెంచి గుహాసికటవిశాలతరుచ్ఛాయాశ్రితులై నివసించియుండ మత్స్యేంద్రయోగివర్యుండు "గోరక్షా! నీవీ చౌరంగుని కనుగ్రహం బొసంగు" మని పలికెను. గోరక్షుండు "గురుసమర్థా! చౌరంగుండు తపఃపూర్ణత్వంబుచే బ్రకాశించు నెడ సకలమంత్రార్థంబు లుపదేశించెద" నన మత్స్యేంద్రయోగివర్యుం డవశ్యంబనియె. గోరక్షుండు చౌరంగునితో "వత్సా! నీ వేతత్ప్రదేశంబున తపం బాచరించెదవా" యన చౌరంగుండు "సమర్థా! తమవాక్యానుసారుండనై తామేస్థలంబు నిర్దేశించెదరో తత్స్థలంబున తపం బాచరించెద. నన్నిచ్చో బరిత్యజించి తా మనేకదేశంబులు సంచరించెదరు. ఐనను భవత్కృపాకటాక్షవీక్షణం బీదాసునిపై యనిశం బెడబాయక నుంచితిరేని మత్తపంబు సఫలంబగు. మత్ప్రాణంబులు రక్షింపఁబడు" నని సవినయంబుగ బల్కక నుభయనాథులు సంతసించి చౌరంగుని గుహాంతరంబున నివసింప నియమించి "వత్సా! నీశిరోపరిభాగంబున నిరాధారపాషాణంబుగనుంగొనుము. తపాంతంబువర కీపాషాణంబుపై దృష్టి నిలిపి సుస్థిరుండవై జపంబొనర్పుము. ప్రమాదంబుచే నేత్రదృష్టి దొలంగించితివేని యీపాషాణంబు భవచ్ఛిరంబుపై పతనంబగు. నందుచే నీశరీరంబు చూర్ణీకృతంబై గతప్రాణుండవయ్యెద" వనుచు గోరక్షుండు చౌరంగుని కర్ణేంద్రియంబున మహామంత్రం బుపదేశించి యొకఫలంబు గొనితెచ్చి "చౌరంగా! నీవీ ఫలంబు భక్షింపు మిందుచే నీక్షుద్బాధకై ప్రతిదినం బొకఫలంబు లభియించు గావున నిశ్చలమానసుండవై తపం బాచరించెదవు. మే మొకకొన్నితీర్థంబులు సేవించి నీకై యరుదెంచెద" మని వాక్రుచ్చి గుహాద్వారంబు వెలుపడి యొకపాషాణంబుచే ద్వారముఖం బాచ్ఛాదించి గోరక్షుండు దన మంత్రయోగంబుచే తక్షణంబ చాముండామహాశక్తిని నాహ్వానింప నద్దేవి ప్రత్యక్షంబై "సమర్థా! భవదీప్సితంబులు దెలుపు" మని వేఁడ నమ్మహామహుండు "హేశుభాననీ! మత్ప్రాణసముండగు చౌరంగు డేతద్గుహాంతరంబున తపం బాచరింపుచుండు ప్రతిదినం బిత్తాపసుని క్షున్నివారణంబుకై గుప్తవేషంబుచే ముఖపాషాణంబు దొలగించి నొకఫలంబుసమక్షంబున నుంచి యెప్పటియట్ల పాషాణంబుచే ద్వారాచ్ఛాదనంబొనర్పు" మని సెలవొసంగి మత్స్యేంద్రగోరక్షులు నానారణ్యంబు

లధిగమించి గిరినారపర్వతశ్రేష్ఠంబు బ్రవేశించిరి. ఇట చాముండాదేవి గోరక్షోక్తప్రకారంబున మధురసపూరితఫలం బొకటి గుప్తవేషంబుచే ప్రతిదినం బర్పించుచుండ చౌరంగుండు శిరోపరిభాగంబున విలసిల్లెడు పాషాణభయంబుచే *నుత్ప్రశ్యుండై దృష్టితప్పింపక తత్ఫలభక్షణకాంక్ష యుడిగి యేకాగ్రమానసంబున గురువచనానుసారుండై తపం బాచరించుచు నిశ్చలత్వంబుచే ధ్యానయోగంబున దేజరిల్లుచుండ నంతకంతకు తపఃప్రభవానలోష్ణంబుచే శరీరంబు క్షీణించి శుష్కపటంబుపగిది మాంసరహిత సిరాస్థియుతంబై చలన వలన ప్రసరణాది శక్తులు దొలంగి కాష్ఠంబుకైవడి నిశ్చేష్టితంబై యుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున శశాంక కృష్ణాగరకథావిశేషం బేకత్రింశత్యధ్యాయము సంపూర్ణము.

ద్వాత్రింశత్యధ్యాయము.

మత్స్యేంద్ర గోరక్షనాథులు దత్తానుమతిచే నానాతీర్థంబులు గ్రుమ్మరుచుండ మత్స్యేంద్రనాథుండు త్రివిక్రమనృపక శేబరంబున పరకాయయోగం బున ప్రవేశించి రాజ్యం బేలునెడ నమ్మత్స్యేంద్రకళేబరంబు రేవతీదేవిచే శిథిలంబొనర్పఁబడుట.

మత్స్యేంద్ర గోరక్షనాథులు గిరినార మహీధరంబు జేరి ప్రత్యక్ష త్రిమూర్తిస్వరూపుండగు దత్తాత్రేయుని పాదాంభోరుహంబులకు వందనంబు లిడుచుండ దత్తుం డమితానందంబుచే నుభయనాథులకు దృఢాలింగనం బొసంగి "మత్స్యేంద్రా! నాయుల్లంబు భవదాగమనంబుచే చంద్రోదయంబున జలధి యుప్పొంగెడుచందంబున రంజిల్లె. వత్సా! నామనంబు నిను బొడగాంచుటకై నిరీక్షింపుచుండ నేడేతెంచితివి. నాయభీష్టంబు జేకూరె. నీవిక నిచ్చో నివసించి సుఖగోష్ఠిచే కాలంబు గడుపు" మని యన్యోన్యస్నేహంబుతో భోజనాసనాదిసమయంబుల నెడబాయక నానాదేశ నానాతీర్థ మాహాత్మ్యంబులు సుఖదుఃఖాది కథనంబులు సంభాషింపుచు దివసంబులు గడుపుచుండ

---

*ఉత్ప్రశ్యుండై=మీఁదు చూచువాఁడై

పశ్చాసానంతరంబున గోరక్షుండు తీర్థయాత్రాగమనోన్ముఖుండై యత్రి సూనునితో "దయాఘనా! జగదుద్ధారనిమిత్తంబున నవతరించి యొక్కచో నివసించుట యవతారకారణంబునకు భంగంబు వాటి ల్లదే? తీర్థసేవాపరత్వంబున ననేకదేశంబులు గ్రుమ్మరుచు సాధుసజ్జనులచే సుఖగోష్ఠులు జరుపుచు ముముక్షులకు మోక్షమార్గంబులు ప్రదర్శింపుట ముఖ్యంబుగావున కరుణించి సెలవొసంగెదరేని పయనం బొనర్తు" మని విన్నవింప ననసూయానందనుండు భవిష్యార్థం బెఱింగి యవశ్యంబని సెలవొసంగెను. మత్స్యేంద్రగోరక్షనాథులు ప్రేమపూరిత భక్తిభావంబులచే దత్తాత్రేయుని పదకంజంబులకు ప్రణమిల్లి కాశీపురమార్గంబున ననేకగ్రామంబు లధిగమించి ప్రయాగస్థానంబు ప్రవేశించిరి. తత్పురాధినాయకుండగు త్రివిక్రమనామ నృపోత్తముండు ధనధాన్యసంపత్సమృద్ధిచే పెంపెక్కి రథగజతురగభటముఖనిఖిల పృతనంబులు మహార్ణవంబుబోలి ఘూర్ణిల్లుచుండ శౌర్యధైర్యస్థైర్యంబులు గలిగి యతులిత శాంతశమదమాదిగుణంబులచే కామాదిషట్కంబును జయించి యీషణత్రయంబులకు బద్ధుండుగాక తాపత్రయంబుల జాలిం జెందక క్లేశయుత ప్రపంచమోహపాశంబుల దెగటార్చి భూతపంచకమయంబగు శరీరం బస్థిరం బనియు స్థూలశరీరాశ్రయ వైభవంబులు క్షణభంగురంబను మనోనిశ్చయంబుచే సంతానంబు లేకున్నను నిరస్తఖేదుండై యమోఘపరతత్వజ్ఞానపరిపూర్ణత్వంబుచే సర్వభూతహితంబు గోరుచు భక్తివైరాగ్యంబుల నుదారశీలుండై సర్వవిద్యావిశారదత్వంబున ప్రజాపాలనం బొనర్చుచు జరామయశరీరుండై విరాజిల్లుచుండ నయ్యకలంకగుణగరిష్ఠుండగు త్రివిక్రముని ముఖ్యమహిషియగు రేవతీదేవి శచీప్రముఖ పతివ్రతారత్నంబుల శిరోమణియై శీలగుణ విశేషంబులచే పొగడొంది నిజకాంతుని శరీరాంతజరామయత్వంబు గని యిమ్మహీశుని యవసానసమయంబు ఘటియించె నని మనంబున చింతింపుచు దనబుద్ధినైపుణ్యంబుచే గృహకృత్యంబులు నిర్వహించుచుండ నరపుంగవుండు జీవబ్రహ్మైక్య యోగంబుచే పాంచభౌతిక స్థూలశరీరంబు బరిత్యజించెను. పుణ్యాంగనామణియగు భూవల్లభి బుగమీశుని మరణంబుకై హాహాకారంబు

జేయుచు వల్లభుని గుణవితానంబు లుగ్గడించి యాక్రందించుచుండ తద్వత్పురజనసముదయం బేకముఖంబున క్షితీశుని వితరణాది సద్గుణంబులు దలంచి దుఃఖప్రవాహంబున మునింగి బహునాదంబుచే ప్రతి గృహంబున బాలవృద్ధాదులు రోదనంబులు జేయుచుండు సమయంబున మత్స్యేంద్రగోరక్షనాథులు భిక్షార్థంబై తత్పురంబున సంచరింపుచు శోకాకులిత నరలోక సల్లాపంబులచే నృపాలుని సుగుణజాలంబులాలకించి మత్స్యేంద్రుండు కరుణాంతరంగహృదయుండై దనమనంబున రాజోత్తముం డాత్మానాత్మవిచారసమర్థుం డనియు లోకోపకార పురుషశ్రేష్ఠుండై దివికేగె ననియు నిట్టికీర్తనీయ గుణధుర్యుని పంచ ప్రాణంబులు విముక్తస్థూలశరీరంబున స్థాపించిన మేలౌననితలంచి యంతర్దృష్టిచే త్రివిక్రముండు ప్రకృతికి పరుండై బ్రహ్మైక్యానుభవ జ్ఞానంబుచే కాయంబు బరిత్యజించుట యెఱింగి యగ్నితప్తబీజం బంకురించునె యని తనంతట దా స్తబ్ధించెను. దయాఘనుండగు గోరక్షుండు పురజన బహువిధ విలాపంబులచే నృపకులాగ్రగణ్యుండగు త్రివిక్రముని సాహసవిక్రమాది గుణంబులు యోచించి యశ్రుపూరితలోచనుండై గురుసమేతంబుగ నగరంబు వెలువడి యొకశివాలయంబున నివసించి యుండుతఱి దహనసంస్కారంబుకై పౌరులు నృపశరీరంబు గొని రోదనధ్వానంబులచే శ్మశానంబున కేతెంచుచుండ తదితరగ్రామనివాసులకీ వృత్తాంతంబు శ్రుతంబై బహురవంబుచే భూపోత్తముని సుగుణంబులు బొగడుచు తండోపతండంబులు జనుదెంచుటం గని గోరక్షనాథుండు భ్రాంతచిత్తుండై మత్స్యేంద్రసిద్ధునితో "యోగిముఖ్యా! నిఖిలజన జేగీయమాన గుణకదంబుండగు త్రివిక్రముని ప్రాణంబులు స్థాపింపవలయు" నన మత్స్యేంద్రుండు ప్రత్యుత్తరం బొసంగకున్నంత గోరక్షుండు "గురుసమర్థా! మచ్చిత్తం బీ నృపోత్తముని జీవిత్వంబుకై మత్తిల్లె. భవదనుగ్రహంబుచే నీక్షణంబున బ్రతికింతు" నన వసుపుత్రుండు "వత్సా! నీసామర్థ్యంబుగా" దని నిరోధించిన గోరక్షుండు తత్కారణంబు దలంపక మత్ప్రాణంబులైన బరిత్యజించి త్రివిక్రముని జీవింపఁజేయుట నిక్కంబుగాదే! లేకున్న మచ్ఛరీరంబు దాహకునిపాలొనర్చుట సత్యంబనదగదే? వాచాభ్రష్టుండు రౌరవాది మహానరకంబులనుభవింపఁడే" యని శపథంబులు జేయుచుండ మత్స్యేంద్రుం

డాశ్చర్యంబుతో "గోరక్షా! విచక్షణహీనుండవై వాక్షోభం బొన ర్చుటవ్యర్థంబుగాదే? వాసనారహితుండగు పురుషుండు ముక్తిత్రయం బుదలంపక తత్వమస్యాది మహావాక్యానుసంధానుండై సాయుజ్యయో గంబున జలార్ణవగత ప్రవాహంబుకరణి రూపభేదవర్జితుండై నిర్గుణ నిష్కళంక పరబ్రహ్మ స్వరూపంబున దేజరిల్లెడు ఘనుండు పునః ప్రకృతిశరీరం బాశ్రయించునే" యని నిగదించెను. గోరక్షుండు దన యంతరదృష్టిచే లక్షించి గురువాక్యంబులు నిజంబని యెంచి మ్లాన వదనుండై దనప్రాణంబులుహుతాశనుని కర్పింపందలంచి శుష్కకాష్ఠం బులు జతజేయుచుండ మత్స్యేంద్రుండు విలోకించి భీతచిత్తుండై దన డెందంబున మున్ను వడలకై విప్రకాంతకు నేత్రంబు లొసంగిన సాహ సుండగు గోరక్షుండు వచనభ్రష్టత్వంబుకై పంచత్వంబు నొందుట నిక్కంబనియూహించి "గోరక్షా! జగదుపకారబుద్ధిచే యుక్తాయుక్తం బులెఱుంగక వాక్పథంబులు జేసి శరీరంబు బాయనేల? నొకసదుపా యంబుచే నీమనోతాపంబు బాపెద. నేనీ రాజోత్తముని శరీరంబున పరకాయప్రవేశయోగంబుచే లోకోపకారనిమిత్తంబై జేరియు ద్వాద శాబ్దంబులు రాజ్యంబేలి పునరాగతుండ నయ్యెద నంతవఱకీ ప్రదేశం బునమచ్ఛరీరంబు భద్రపఱచు" మన నతం డవశ్యంబనునంత మత్స్యేం ద్రుండు పక్షికులం బొకవృక్షంబు విడచి మరియొకవృక్షంబుపై కెగ సినచందంబున స్వశరీరంబు బరిత్యజించి విక్రమనృపుని నిర్జీవకళేబరం బున బ్రవేశించి శ్మశానస్థలంబున సుప్తోత్థితునిచందంబున లేచి నలుది శలు నిరీక్షింపుచుండ బంధుమిత్రకళత్రాదులు పరమానందభరితులై "మనదుర్భర దుఃఖతాపంబులు విలోకించి హరిహరాదులు పునఃప్రా ణంబు లొసంగిరో కాలుం డాయుష్యం బెఱుంగక నపహరించిన ప్రాణంబులు పునఃస్థాపనం బొనర్చెనో" యని బహువిధ సల్లాపంబులు జేయుచు కాష్ఠనిర్మితచితిని విధ్యుక్తప్రకారంబున శాంతిపఱచి క్షితీ శుని సహితులై దమతమ స్థానంబులు బ్రవేశించిరి. ఇట గోరక్షనా థుం డుమాపతీమందిరంబున గురుకళేబరం బొకగోప్యప్రదేశంబున నుంచుటకై యోచించుసమయంబున నొకయర్చకస్త్రీ పూజాద్రవ్యం బులు గొని యమ్మందిరంబున కేతెంచెను. మిత్రమంత్రోద్భవుం డమ్మ గువంజూచి "తల్లీ! సకలజనదుఃఖప్రశాంతికై మద్గురుండు స్వశరీరంబు

త్యజించి బుడమితేనికాయంబున బ్రవేశించె. నాకీ యపూర్వచరిత్రుని దేహంబు గాపాడుట ముఖ్యధర్మంబు. ద్వాదశాబ్దంబుల కమ్మహామహుం డీశరీరంబున కేతెంచు గాన నెందైన రహస్యస్థలంబు గలదేని శ్రుతపఱచి యీగోప్యంబు వెల్లడి యొనర్పవల" దని విన్నవింపనమ్మానినీమణి యత్యాశ్చర్యంబని దలంచి యమ్మహాశాలయ మధ్యప్రదేశంబున విలసిల్లెడు మహాబిలం బొకటి గనుపఱచె నంత గోరక్షుండు శ్రీగురుమత్స్యేంద్రయోగిపుంగవుని కాయం బా బిలంబున గోప్యంబుచేనిడి బిలముఖం బాచ్ఛాదించి స్వస్థచిత్తుండై నివసించి యుండ నయ్యర్చకాంగనామణి గోరక్షునితో "సమర్థా! నిర్జీవశరీరంబు ద్వాదశవర్షంబులు భద్రంబై యుండుట దురూహావాక్యంబుగాదే? దివసత్రయంబు గడచెనేని యస్థిచర్మాదులు శిథిలంబులు గావే" యని విచారింప "తల్లీ! సామాన్యమానవశరీరంబునకిట్టి దురవస్థఘటియించు గాక! ఘనయోగమహిమాతిశయంబుచే చిరంజీవుండగు మత్స్యేంద్రనాథ దేహంబుక్షీణించునే" యని ప్రత్యుత్తరంబులొసంగెనట. మత్స్యేంద్రనాథుండు సర్వవిద్యానైపుణ్యంబుచే భూతభవిష్యద్వర్తమానజ్ఞానఘనుండై త్రివిక్రమునియట్ల యంతఃపురంబు ప్రవేశించి స్నానభోజనాది కృత్యంబులచే దనివిదీరి దివ్యతరపర్యంకంబుపై నుపవేశించి మృదుమధుర సంభాషణంబులచే రేవతీకాంతను లాలింపుచు కుశలమతిచే నమ్మదిరాక్షి వాక్యంబులకు ప్రత్యుత్తరంబు లొసంగి యాదినంబు గడపి ద్వితీయదినోదయసమయంబున స్నానసంధ్యాది నిత్యకర్మంబులు దీర్చుకొని సభామంటపంబున సింహాసనాసీనుండై రాజకీయకార్యంబులు విచారింపుచు సచివాది శిష్టజనులతో నిర్భేదంబున బ్రసంగంబులొనర్చి త్రివిక్రమునికైవడి న్యాయాన్యాయంబులు పరిశీలింపుచుండి తచ్చతుర్థదివససాయంకాలసమయంబున దర్శనార్థంబై ఫాలాక్షుని నిలయంబున కేతెంచి గోరక్షునితో "మీ దేశం బెయ్యది? భవన్నామధేయం బేమి? మీ రేకతంబున నిం దేతెంచితి" రని హెచ్చరింపుచు వెంటఁగొని గర్భాలయంబుజేరి యేకాంతంబున హస్తసంకేతంబుచే "మచ్ఛరీరం బెచ్చో భద్రపఱచితి" వని విచారింప బుద్ధిదక్షుండగు గోరక్షుండు బర్బరభాషావాక్యంబులచే కాయనిక్షిప్తబిలం బతిరహస్యంబుచే గనుబఱచెను. నృపశరీరధారకుండగు మత్స్యేం

ద్రుండు కొంతవడి యచ్చో నివసించి రాజభవనంబున కేతెంచె. నిప్ప
గిది ప్రతిదినంబున దర్శనార్థంబై నీలకంఠుని యాలయంబున కరుదెంచి
బిలప్రదేశంబు నిరీక్షించి భక్తిభావంబులచే గోరక్షునితో సంభా
షించి జనుచు మాసత్రయంబు గడుపుతఱి యొకనాఁ డా రవితన
యుండు మత్స్యేంద్రునితో "సమర్థా! నేనొక కొన్నితీర్థంబులు సేవించి
యేతెంచెదను. తాము విముక్తశరీరంబును గాపాడుకొను" మని
బలుక భూపుం డవశ్యం బని సెలవొసంగి నిజస్థానంబున కేతెంచె.
ఈనృపకాయధరమత్స్యేంద్రుండు రేవతీదేవితో నత్యంతానంద
మయుండై కాలంబు బుచ్చుచుండ నయ్యకలంకముఖి గర్భంబు ధరి
యించి యనుదినప్రవర్ధమానంబై నవమాసంబులకు ప్రసవించి ద్వా
దశదివసంబున నయ్యపారతేజోఘనుండగు డింభకునికి ధర్మనాథుం
డని నామకరణంబొనర్చెను. శాబకుండు పంచాబ్దంబుల బాలుండై గ్రీడిం
చు సమయంబున రేవతీత్రివిక్రములు బాలుంగొని పంచశతపరిచారి
కానమేతులై గరళగళనిలయంబున కరుదెంచి భక్తివైరాగ్యంబులచే
నమ్మహేశుని బూజలొనర్చి రేవతీదేవి ముకుళితకరకమలయై "గి
రిజాధవా! గిరిభిత్ప్రముఖాఖిల పరిసేవిత పదయుగళా! గిరినిలయా!
గిరికార్ముకధరకరకుశేశయా! శంభో! మద్భర్తయగు త్రివిక్రముని
సముఖంబున సౌభాగ్యమరణంబు నాకొసంగవే" యని బ్రస్తుతించు
చుండ నయ్యర్భకయువతి నృపగోప్యం బెఱింగినకతంబున పక్కుమని
నవ్వెను. రేవతీదేవి యమ్మానినీమణితో "నీవేకతంబున హసియించి
తివో దెలుపు" మన నక్కాంత రాజకాంతతో "తల్లీ! నే హసించి
నమూలం బెఱింగించెదనేని విపరీతంబు ఘటియించు ప్రళయాన
లంబును మార్కొను పతంగంబులకైవడి వ్యాఘ్రంబును నెదురించు
జంబుకంబుకరణి మత్ప్రాణంబులు క్షణమాత్రంబునఁ బాయవే" యని
భయవిహ్వలాంగియై బలుకుచుండ నృపరాణి యాదరంబుతో రహస్యం
బెయ్యదియో నిర్భయంబుచే నెఱిఁగింపుము. నాభయం బించుకైన
వలంపకు" మని దనకరతలం బమ్మగువ కరతలంబున నిడి యభయం
బొసంగ నిస్సంశయంబుచే నప్పడఁతి యొక యేకాంతప్రదేశంబునకు
భూకాంతామణిం గొనిపోయి "యవ్వా! యుష్మత్ప్రాణనాథుండు
పంచత్వం బొందినదెఱింగి నిఖిలజనదుఃఖోపశమనార్థంబై యోగిము

ఖ్యుండగు మత్స్యేంద్రనాథుండు నిజశరీరం బీమందిరంబున నుంచి నృపముక్తకాయంబున బ్రవేశించె. తచ్ఛిష్యుండగు గోరక్షుండు గురుశరీరం బీ గర్భాలయ మధ్యప్రదేశబిలంబున రహస్యపఱచి తీర్థసేవాపరతంత్రుండై పయనం బొర్చెను. తదాది ద్వాదశాబ్దంబులకు క్షితీశుని శరీరంబు బరిత్యజించి నిజశరీరంబు ధరియించి నీసౌభాగ్యపదచ్యుతి యొనర్చు నని యెఱింగి యాశ్చర్యంబుచే హసించితి నిదుగో బిలప్రదేశం బాచ్ఛాదింపఁబడిన" దని స్పష్టపఱచెను. తత్క్షణంబ రేవతీదేవి పతిసహితంబుగ నిజనివాసంబున కేగి దనమనంబున పాతివ్రత్యభంగంబు గలిగెను. విధినిర్మితకార్యం బలంఘనీయంబు. గతకార్యంబునకు విలపింపనేల? వ్యాసవీర్యంబుచే భరతాన్వయం బభివృద్ధి జెందిన క్రియతపోఘనుండగు మత్స్యేంద్రయోగిపుంగవునిచే వంశంబు వర్ధిల్లె. ద్వాదశాబ్దపూర్ణంబున నిమ్మహామహుం డీ శరీరంబు త్యజించి నిజదేహంబు ధరించెనేని నామాంగల్యంబు నశించుటయె గాక సుతుండగు ధర్మనాథుం డయుక్తవయస్కుండై రాజ్యభారంబు వహించుట దుస్తరంబుగాదే? మత్స్యేంద్రశరీరంబు ప్రచ్ఛన్నంబున విచ్ఛిన్నం బొనర్చి రూపడంచితినేని చైతన్యోపాధియగు శరీరంబు లేకుండినచో నిమ్మహాఘనుండు త్రివిక్రమకాయం బెడబాయలేఁడని చింతించి యతిగోప్యంబుచే నిశాసమయంబున కుద్దాలాది పరికరంబులతో నుభయపరిచారికుల వెంటగొని దేవళంబు జేరి బిలముఖ ఖననం బొనర్చి యం దసదృశ బ్రకాశమయ నిర్జీవకళేబరంబు గాంచి తీక్ష్ణతరశస్త్రంబులచే నస్థిచర్మమాంసంబులు తిలతుల్యంబులుగ ఖండించి తత్సమీపకాననాంతరప్రదేశంబున బాఱవైచి యథావిధి బిలముఖం బాచ్ఛాదించి దననివాసభవనంబున కేతెంచెను. ఈవిపరీతకృత్యంబు నగరాట్టనయవిలోకించి నాగభూషణునితో "భవత్ప్రియుండగు మత్స్యేంద్రుని దేహంబు విధ్వంసం బయ్యె" నని దెలుప కృపాళుండగు ఫాలాక్షుండు మనోయోగంబున బరిశీలించి "ప్రియే! యక్షిణీశక్తిచే చూర్ణీకృత త్వఙ్మాంసాస్థిసంచయం బొనగూర్చి యథాప్రకారంబున కాయంబు సిద్ధపఱచి కైలాసంబున నుంచు" మని యాజ్ఞాపించెను. తత్క్షణంబ దాక్షాయణీదేవి యక్షిణీదేవతాసంఘంబును బిలచి కళాదక్షుండగు మత్స్యేంద్రుని శిథిలీకృతదేహంబు జతగూర్చి కైలాసంబున కేగి

మ త్తనూజుండగు వీరభద్రున కొసంగి భద్రపఱచు మని దెలుపు" మన నయ్యక్షిణీ సముదయం బేకముఖంబున విపినంబు గ్రుమ్మరి తచ్చూర్ణం బుచే శరీరం బేర్పఱచి రయంబున కైలాసంబు జేరి రుద్రపుత్త్రుండగు భద్రునకు భద్రపఱచుమని యొసంగి "హేవీరముఖ్యా! ప్రతాపము ఖ్యుండగు మత్స్యేంద్రుండు దైవయోగంబున పంచత్వంబు నొందె. తొల్లి మా కత్యంత శత్రుస్వరూపుండై మహాకాళిచే మోహరించి భైరవాదుల గీటడంచి యాలంబున మమ్మెంచక మంత్రనైపుణ్యంబుచే మావస్త్రంబు లపహరించి నగ్నత్వంబున నటింపఁజేసిన చెనటుండు గాఁడే? నిర్లక్ష్యంబుచే మిమ్మెదిరించి స్వప్రతాపంబున భంగంబొనర్చిన విమతుండై కపిపుంగవునితో మార్కొని కడుకష్టంబుల పాలొనర్చిన యోగిపుంగవుని దేహంబు గనుఁగొంటివే? యిత్తాపసోత్తమునకు ప్రియశిష్యుండు ప్రతాపదర్ప సమగ్రుండగు గోరక్షుండు గలఁడు. వాఁ డీ శరీరంబు గొనిపోవ నోపు" నని బలుకుచుండ శివాజ్ఞాధారకు లగు బహులక్ష రుద్రగణసహితుండగు భద్రుండు తపోధూర్జటి శరీ రంబు రక్షింపుచుండెను. త్రివిక్రమ శరీరస్థ మత్స్యేంద్రుండు నిత్యనియ మప్రకారంబున శివాలయంబున కేతెంచి యంబరకేశుని దర్శనంబు గొని నిర్భిన్న బిలముఖంబు గని యాంతర్యం బుపలక్షింపక స్వస్థానం బున కేగుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున మత్స్యేంద్రసిద్ధుండు పరకాయప్రవేశయోగంబుచే త్రివిక్రమకళేబరంబున బ్రవేశించి రాజ్యంబేలుట మొదలుగాఁగల చరిత్రంబు ద్వాత్రింశాధ్యాయము సంపూర్ణము

త్రయస్త్రింశాధ్యాయము.

గోరక్షుండు సేద్యకారునకు వైరాగ్యంబు గల్పించి చని చౌరంగనాథునివెంట గొని వీరభద్రునితో మహాయుద్ధం బొనర్చి ప్రాణంబు లపహరించుట.

అట గోరక్షనాథుండు నృపశరీరధర మత్స్యేంద్రునితో ననుజ్ఞ గొని యనేకతీర్థంబులు సేవించుచు గోదావరీతటం బాశ్రయించి

ఘోరాటవీమార్గంబున గమనంబు జేయుచు క్షుధాతురుండై సమీపంబున జనపదంబులు గానక నలుదిశలు నిరీక్షింపుచు నొక్కచో కృషికర్మసమర్థుండగు మాణికనాముండు దినయౌవనసమయంబున భోజనోద్యుక్తుండై పాత్రంబున పదార్థంబు లుంచుకొనునంత సిద్ధుండు బోడ గాంచి యాదేశశబ్దంబులచే నమస్కారం బొనర్చినికటంబు జేరుచుండ మాణికుండు వందనంబు లాచరించి "సమర్థా! తామెవరు? ఇమ్మహాకాననంబున నొంటి జరించుట కతంబెయ్యది" యని విచారింప గోరక్షుండు "నే నొక తాపసుండను. విహారార్థంబున విపినంబు గ్రుమ్మరుచు క్షుధాపీడితుండనై యేతెంచితి. ప్రసాదం బిడుదువే" యన నమ్మాణికుండు పదార్థపూరిత పాత్రంబు గొనుమని యొసంగెను. గోరక్షుండు లబ్ధధనదరిద్రునిచందంబున హర్షించి కరపాదప్రక్షాళనం బొనర్చుకొని సిద్ధాన్నంబుచే దృప్తుండై కృషికారునితో "కరుణామయా! భవన్నామధేయం బెఱుంగింపు" మన మాణికుండు "తాపసోత్తమా, నానామంబుచే కార్యసాధనంబు గలదే? భవదీప్సిత పదార్థంబు లభియించె" నన గోరక్షుండు "పురుషశ్రేష్ఠా! నీవాక్యంబు సత్యంబుగా కన్యంబుగాదు. నీచే దృప్తుండనై నీమనోభీష్టకామ్యంబు దీర్పందలంచితి" నన నతండు "తాపసోత్తమా! భిక్షోపజీవివై నానాగ్రామంబులు ద్రిమ్మరుచు నాయభీష్టంబులు దీర్చెదనుట చిత్రంబుగాదే?నీయం దేభాగ్యంబు గలదు!ని న్నేమిగోరుదు. భైరవాకారవిరాగులు పరులకోర్కులీడేర్చెదరెట్లు? నిను విచారింపుట వేషబంబుగాదే" యన నాథుండు "పురుషఘనా! మచ్చిత్తంబు యుష్మద్దత్తపదార్థంబుచే ప్రసన్నత్వంబు నొందె. నిస్సంశయుండనై వేఁడు" మన మాణికుండు"చాలు నీదాతృత్వంబు నే నిన్విచారింపలేను. నీవు నాకొసంగలేవు. నీ కెద్దానిపై భ్రాంతి గలదో నేనే యొసంగెద వేఁడు" మనెను. గోరక్షుండు దనడెందంబున కృషికారులు కఠినతరవిపినంబుల నివసించి యుక్తాయుక్తంబు లెఱుంగకనైన స్పృహ్యంబున ప్రసంగించెదరు. స్వహితంబెఱుంగనిజనమతుల కుపకారం బొనర్పవలయు నని దలంచి "పురుషముఖ్యా! నీమనోనిశ్చయంబుచే నే నింకెద్ది వేఁడిన నొసంగెదవే" యన కృషికారుండు గోరక్షునితో "నీయట్టి మూర్ఖుండు గలఁడే? శీతకరుం డన్యులకు శీతలం బొసంగుట దొడ్డయగునే? ప్రభాకరుండు తమంబు బాపు

టొక వింతయగునే! బలిమహీశుండు రసాతలంబున కేగి వితరణంబు మానెనే? నామనోనిశ్చయంబు బరికించెదేని విచారింపు” మన గోరక్షుండు “నీచిత్తంబున దలంచినకార్యం బొనర్పవలదు. ఇంతియ నాయభీష్టం”బని విచారించెను. మాణిక్యుం డవశ్యంబని సెలవొసంగ గోరక్షుండు నిజేచ్ఛం జనెను. పిదప నక్కృషీకుండు కృషిపరికరంబుల నొకమూటగట్టి శిరంబున ధరియించి వృషభంబులగొని పురంబున కేగుచు గృహంబున కేగి భుజింపవలయునని దలంచియు గోరక్షునివాక్యంబులు స్మరించి జనదగదని వితర్కింపుచు చింతాక్రాంతుండై నేత్రంబులు ముకుళించి హరినామంబు ధ్యానింపుచు దృఢనిశ్చయుండై మనోసంకల్పిత కార్యంబు లొనర్పవలదని చలనవలనాదులు మాని వాతాశనుండై మాంసరహిత క్షీణశరీరంబుచే శుష్కకాష్ఠంబుభంగి నిశ్చేష్టిత యోగధారణ పరత్వంబున బ్రకాశించుచుండెను గోరక్షుండు నానారణ్యంబు లతిక్రమించి బదరికాశ్రమంబు జేరంజని నిరామిషశరీరుండై గురుమంత్రధ్యానయోగంబున విరాజమానుండగు చౌరంగనాథుని జూచి దలంచి గుహాముఖాచ్ఛాదిత పాషాణంబు దొలంగించి దూరీకృత భవబంధుండగు చౌరంగుని క్షీణశరీరంబు బొడగాంచి దయారసభరితహృదయుండై దేహాయాసంబు బాపి నిజప్రతాపంబుచే కరపాదంబు లొసంగి తక్షణంబ బహిఃప్రదేశంబునకు గొనితెచ్చినంత చౌరంగుండు గురుకృపాకటాక్ష వీక్షణంబుచే సబలుండై గోరక్షనాథుని పాదకమలంబులకు బ్రణమిల్లెను కరుణాంతరంగుండగు గోరక్షుండు “వత్సా! కాలం బెవ్విధిగడచెనో దెలుపు” మన కృష్ణాగరుండు “నేనెఱుంగను! చాముండాదేవిని విచారింపు” మనెను. రవిపుత్రుండు చాముండాదేవితో “శశాంగసుతుం డెప్పగిది తపం బొనర్చెనో శ్రుతపఱచు” మన నద్దేవి “సద్గురూ! చౌరంగుండు భవదాజ్ఞానుసారమతిచే శిరోపరిభాగస్థిత శిలావిన్యస్త దృగ్యుగళుండై మదర్పిత ఫలాశనుండుగాక ఘనయోగంబున మెలంగె. ఫలంబులు పర్వతాకారంబై విలసిల్లె గనుంగొను” మన గోరక్షుండు చౌరంగనాథు నిగ్రహతపంబు బ్రహ్మాదుల కతర్క్యం బని విస్మితుండై దనవరదకరం బా నిర్మలాత్ముని శిరంబున మోపి యనేకమంత్రార్థరహస్యంబు లుపదేశించి కేదారేశ్వరమందిరంబునకు దోడి తెచ్చి దక్షాధ్వరధ్వంసి ప్రత్యక్షదర్శ

నంబు గావించి యచ్చో షణ్న్యాసంబులు నివసించి నిఖిలమంత్రాదిదేవత లచే మంత్రసిద్ధికై వరంబు లిప్పించి కేదారీశ్వరునిచే ననుజ్ఞాతుండై పరతత్త్వజ్ఞాన పరిపూర్ణుండగు చౌరంగనాథసహితుండై కౌండిన్యనగ రంబు జేరంజని "చౌరంగా! భవజ్జననీజనకుల దర్శనంబు గొనియెదవే? శశాంగుండు నిన్ను సుతుండని దలంపక కఠినచిత్తుండై నీకరపాదంబులు ఖండించె. న్యాయాన్యాయం బెఱుంగక దుష్టమతిచే శిక్షించిన నృపా ధముండని నాకాగ్రహంబు గలదు. నీతపః ప్రభావంబు గనుబఱచు" మన చౌరంగుండు వాతాస్త్రంబు జపియించి భస్మంబు గొని పుర బాహ్యవనరక్షకులపై బ్రయోగించినంత తన్మంత్రవిద్యానైపుణ్యం బుచే నవ్వనరక్షకు లంతరిక్షంబున గ్రుమ్మరుచుండ నుపసంహారం బొన ర్చెను. వా రత్యంతమూర్ఛాగతులై బుడమింబడి స్మృతి దొలంగి యుండ నొకకొందఱు శీఘ్రంబున మూర్ఛందేరి రాజమందిరంబున కేతెంచి గతవిపరీతంబు శ్రుతపఱచుచుండ భూపుం డొకచారునితో "గ్రామబాహ్యంబున నెవ్వరేని సమర్థు లరుదెంచిరిగాబోలు కనుం గొని ర" మ్మన వాం డతివేగంబున నరిగి యొకకూపనికటంబున నివసిం చియున్న సిద్ధముఖ్యుల బొడగాంచి రాజసదనంబు జేరి బుడమీశునితో "నొక్కచో తాపసోత్తములు గల" రని విన్నవింప నతడు దనమనం బున మత్స్యేంద్ర గోరక్షనాథు లేతెంచిరని భయభ్రాంతుండై రథగ జతురగపదాతులతో నెదుర్కొనదలంచి పురబాహ్యంబున కేతెంచు చుండ గోరక్షుండు "చౌరంగా! నీతపః ప్రతాపం బీ సమయంబున గన పఱచు" మన చౌరంగుండు పునర్వాతాస్త్రప్రయోగ మహిమాతిశ యంబుచే శశాంగసహిత చమూసమూహం బంతరిక్షంబున కులాల చక్రంబుపగిది భ్రమణం బొనర్చుచు గొంతవడి తచ్చిత్రంబు నిరీక్షిం చుచుండ భూపాలాదులు "దయాంఘనా! దీనశరణ్యా! రక్షింపు రక్షింపు" మని కలకలధ్వానంబు లొనర్చుచుండ. చౌరంగుండు నగా స్త్రంబుచే నొకమహామహీధరంబు గల్పించి యందుపై నృపసమేత పృతనంబుల నివసింప నొనర్చి రమ్ము ర మ్మని యాహ్వానం బొనంగెను. నరపుంగవుండు దళసమేతుండై నాథముఖ్యుల సమీపంబున కేతెంచు చుండ గోరక్షుని యనుజ్ఞచే చౌరంగనాథుండు నిజజనకుండగుశశాంగ మహీపాలుని పదంబులకు నమస్కరించుచు కృష్ణాగరుండ ననిదెలియం

బలికెను. శశాంగుండు పరమానందకందళిత హృదయారవిందుండై దృఢాలింగనం బొసంగి పిదప గోరక్షనాథుని చరణకమలంబులకు బ్రణమిల్లి పొగడుచుండ గోరక్షుండు "రాజోత్తమా! భవత్తనూభవుని పరాక్రమం బెఱింగితివే" యననతండు "దయామయా! త్రిలోకవందితుండగు నీయట్టి తపోమూర్తి గురుండై విలసిల్ల నూనంబు గలదే" యనుచుండ చౌరంగుండు వజ్రాస్త్రప్రయోగంబుచే స్వనిర్మిత నగరూపం బడంచి స్వస్థచిత్తుండై గురుసముఖంబున నిల్చుండెను. శశాంగుండు గోరక్షనాథునితో "సమర్థా! మద్భవనంబు పవిత్రంబొనర్పుటకై శిబికారోహణులు గ" మ్మన చౌరంగుండు శశాంగునితో "జనకా! గృహంబున కేతెంచితి నేని యనర్థంబు వాటిల్లదే? మత్సాపత్నీజననిదుర్బోధంబులు విమర్శింపక నాకరచరణంబులు ఖండించిన దే నెఱుంగనే? నిజానిజం బూహింప లేరైతి" రని భుజావంతిదుర్గుణంబులు విశదీకరింప నృపుం డాగ్రహచిత్తుండై "నీచాత్మురాలగు భుజావంతిని తాడనం బొనర్చుచు గొనితె" మ్మని యొకభటున కాజ్ఞాపింప చౌరంగుండు "జనకా! భవత్కీర్తిధ్వజంబునకు భంగంబు చేకూరు. సదనంబున శిక్షించుట మే" లని కోపోపశమనం బొనర్చి గురుసహితంబుగ శిబికారోహణుండై రాజభవనంబున కేతెంచెను. నరాధిపుండు రోషతామ్రాక్షుండై యంతఃపురంబు బ్రవేశించి భుజావంతిని తాడనం బొనర్చుచు వెడలిపొమ్మని శాసించుచు "దుష్టే! ద్వాదశాబ్దంబులుమాకాంతుని ధ్యానంబు సల్పి పుత్రలాభంబు వడసితి. నీచమతిచే నయ్యమలాత్ముని వియోగం బొనర్చితి" వని దుర్భాషలాడుచున్న శశాంగుని గోరక్షుం డనేక యుక్తియుక్తవాక్యంబులచే శాంతపఱచి యొక మాసం బచ్చో నివసించి ప్రయాణోన్ముఖుండై నృపోత్తముని భక్తిభావంబులకు సంతసిల్లి "వేఱొండు పడంతిమిన్నను వివాహంబాడి పుత్రలాభంబు బొందు" మని ప్రసాదం బొసంగి చౌరంగసహితుండై గమనం బొనర్చి ప్రయాగక్షేత్రంబు జేరంబోయి గురుశిష్యులు తత్తోయంబుల స్నానంబులాడి నీలకంఠుని మందిరంబు బ్రవేశించి యర్చకనారిని విలోకించి "మద్గురుకళేబరంబునకు భద్రంబే" యని విచారింప నమ్మగువ భయభ్రాంతచిత్తంబుచే కంపాయమాన శరీరయై గోరక్షుని పదంబుల వ్రాలి "సమర్థా! ప్రమాదంబుచే రాజమహి

షియగు రేవతీకాంత కీ రహస్యంబు వెల్లడి యొనర్చితి? కళేబ రంబు యథాస్థానంబున నుండునో లేదో యను సంశయంబు భవన్ముఖావ లోకనమాత్రంబుచే గలిగెను. నారీహృదయం బతిగహనంబుగాన నిజ దృష్టిచే విలోకింపు" మన గోరక్షుండు డెందం బదరి మందిరాంత ర్బిలముఖపాషాణంబు దొలంగించి గురుశరీరంబు గానక వారిపూరిత లోచనుండై "గురునాథా! దయారహితహృదయంబుచే నన్నెడబాసి తివే" యని బుడమింబడి గురువర్యా! గురువర్యా! యని యాక్రందించు చుండ నర్చకాంగనామణి గనుంగొని దనమనంబున జింతింపుచు "తపోధనా! నృపకాంతను విచారించి యేతెంచెద" నని త్వరితంబున రాజభవనంబు బ్రవేశించి రేవతీకాంతకు నమస్కరించి యంతరార్థం బుతో "తల్లీ! నాఁడు నీకెఱింగించిన విషయంబుకై సదుపాయం బేమి దలంచితివో దెలుపు" మన నత్తలోదరి యర్చకాంగన నేకాంతంబు నకు దోడ్కొని జని "మత్స్యేంద్రుని కాయంబు మాయంబొనర్చుటకై శస్త్రఘాతంబులచే చూర్ణంబొనర్చి యరణ్యంబున బాఱవైచితి. తచ్ఛరీర నిర్మూలంబుచే మన్మనోగతసంశయం బెడబాసె. బీజంబులేని యంకురం బుదయించునే యని నిశ్చయమనంబుచే నుంటి" నన నప్పుడంతి దన మనంబున ననర్థంబు వాటిల్లె. దీనిచే నాకెట్టివిపత్తు సంభవించునో? దైవానుగ్రహం బెప్పుగిది గలదో యని చింతింపుచు గోరక్షుని జేరం జని రాజకాంతోదితవాక్యంబులు వెల్లడి యొనర్చెను. గోరక్షుండు ప్రళయకాల కృతాంతునిభంగి క్రుద్ధుండై నృపురాణిని శిక్షించెద నని దలంచియు మత్స్యేంద్రకారణంబున నద్దేవి యస్మజ్జననిగాదే యని యూహించి శాంతుండై చూర్ణీకృతశరీరంబు వనమృగంబులచే భక్షింపఁబడెనో ఇలాజలాది మహాభూతంబు లపహరించెనో శోధింప వలెనని దలంచి చౌరంగనాథునితో "వత్సా! మత్కాయం బిచ్చో బరి త్యజించి సచ్చరిత్రుండగు మత్స్యేంద్రనాథుశరీరంబు శోధించుటకై సూక్ష్మరూపంబున నానాభూత నానాదేశంబులు సంచరించి యేతెం చెద. ధీరమతివై మచ్ఛరీరంబు గాపాడుము. లేకున్న గురుదేహంబు కైవడి యనర్థంబు ఘటియించు" నని బోధించి త్వరితంబున స్థూల శరీంబు విసర్జించి వాయుస్వరూపంబున ననేకారణ్యభూధరంబులు జంబూద్వీప ప్రముఖాఖిలద్వీపంబు లతల వితల రసాతలా ద్యధోలోకం

బులు పశుపక్షి మృగకీటకాఖిలభూత సంచయంబులు సువర్లోక భువర్లోక తపోలోక ప్రభృతి యూర్ధ్వలోకంబులు యక్ష రాక్షస గరుడ గంధర్వాది సురలోకనివాసంబులు స్వర్గ వైకుంఠ సత్యలోకంబులు శోధించి యా ప్రదేశంబుల గానక కైలాసంబు జేరి యొక్కచో హరకుమారుండగు వీరుం డపారశివగణకదంబ పరివృతుండై చాముండాది మహాశక్తిసముదయంబుతో "ద్వాదశాబ్దంబులకు మత్స్యేంద్రునికళేబరంబుకై గోరక్షుం డేతెంచు ననుట మును మీ రెఱింగిన విషయంబే గదా! తత్సమయంబు సమీపించెను గాన కుశలమతులై శరీరంబు రక్షింపుఁ" డని యాజ్ఞాపించుతఱి గోరక్షుండు సూక్ష్మరూపంబున బ్రవేశించి గురుశరీరంబు బొడగాంచి రయంబున స్వస్థానంబున కరుదెంచి చౌరంగనాథ పరికల్పిత మహాదస్త్ర మధ్యప్రదేశ పరిశోభిత స్వశరీరంబు బ్రవేశించి సుషుమ్నాంతర్గతుండు స్థూలశరీరవివేకంబు బూనినక్రియ మేల్కాంచి చౌరంగనాథసమేతుండై నిజపరికరంబులు ధరించి పదడుఁగొని పర్వతాస్త్రంబు జపియించి ప్రభాకరునిపైఁ బ్రయోగింప నయ్యస్త్రమాహాత్మ్యంబుచే నొకమహానగంబు కల్పితంబై ఖగమండలం బాక్రమించి యహస్కరుస్యందనంబు నిరోధించె. దినేశుండు మార్గంబు గానక కోపోద్దీపితుండై వజ్రాస్త్రంబుచే భూధరంబు బగిల్చి దనహృదయంబున నిమ్మహాపర్వతాస్త్రం బే మహామహునిచే బ్రయోగింపఁబడెనని యోచించి స్వమంత్రప్రతాపసంజనితుండగు గోరక్షసిద్ధుం డని దలంచి శీఘ్రంబున రథసహితుండై వసుంధర కేతెంచినంత గోరక్షుండు చంద్రాస్త్ర వరుణాస్త్రంబులచే నుష్ణాంశుకిరణ జ్వాల లడంచి నికటంబున కరిగి చౌరంగయుతుండై వందనంబు లాచరించెను. సహస్రకరుండు స్వసుతునితో "వత్సా! నన్నేకతంబున నిరోధించితివో చయ్యన నెఱింగింపు" మన గోరక్షుండు "నిఖిలలోకవంద్యా! మద్గురుండగు మత్స్యేంద్రయోగిపుంగవుండు లోకోపకారనిమిత్తంబై నిజశరీరంబు బరిత్యజింప తద్దేహంబు శివగణంబుచే నపహరింపఁబడి కైలాసంబున వీరభద్రుని స్వాధీనంబయ్యె గావున తామారుద్రాత్మజునకు మద్గురుకళేబరంబు మాకొసంగు మని హితోపదేశం బొనర్చి నాయభీష్టంబు దీర్చెదరని కోరెదను. యుష్మద్వాక్యంబులు సరకుగొనఁడేని యుద్ధంబుకైనను డెమ్మని తెలియఁజేయు" మని

విన్నవింప నభోమణి యవశ్యంబని కైలాసంబున కేగి రుద్రగణసంఘంబు జేరంజన వార లమ్మహామహులకు వందనంబు లాచరించి "భవదాగమనకారణం బెయ్యదియో దయజేయు" మన కమలాప్తుండు రుద్రగణముఖ్యుండగు వీరభద్రునితో "శివాత్మజా! గోరక్షుండు మత్స్యేంద్రనాథశరీరంబుకై సక్రోధుండయ్యె గావున మద్వచనంబు లాకర్ణించి యీనిర్జీవకళేబరం బయ్యమలాత్మున కొసంగదవేని నాథపంథం బభివృద్ధిజెందు" నన మృత్యుంజయనందనుండు "ఛాయాకుమారా! తొల్లి మత్స్యేంద్రునిచే కడుకష్టంబు లనుభవించితి నేఁ డీకాయంబు గోరక్షున కొసంగుదునే? నతం డెదిరించెనేని మత్పరాక్రమదర్పంబుచే గోరక్షునిప్రాణంబులు కృతాంతుని పాలొనర్చి గురుకళేబరంబుమాడ్కి శిష్యశరీరంబు నిర్జీవంబు జేయనే" యన భానుండు "వీరముఖ్యా! నాఁడు నీప్రతాపంబు లేదయ్యెనే? సమయంబెఱింగి వాక్పౌరుషంబు గనఁబఱచెదవే? గోరక్షుండు మత్స్యేంద్రసముండుగాక నసమర్థుండని దలంచితివే? నేఁడు చౌరంగనాథసహితుండై శత్రుకులమర్దనుండగు గోరక్షుండు మార్కొనెనేని కృతాంతుల ప్రళయం బొనర్పఁడే? సమరంబె దలంతువేని సత్వరంబున భూలోకంబున కేగి యొనర్పుము. లేకున్న వా రిం దేతెంచిరేని స్వబలపరాక్రమంబుచే నేతద్రజతగిరి పిష్టం బొనర్పరే? శివలోకం బల్లకల్లోలం బయ్యెనేని శంకరుండు నిన్ను శాసింపఁడే? మత్స్యేంద్ర గోరక్షులు భవభవానీప్రియులని యెఱుంగవే? గానిచో చూర్ణీకృత శరీరంబు మహాశక్తికోటిచే నొనగూర్చి కైలాసంబున కంపునే? కదనంబె ముఖ్యంబని దలంచెదేని గిరిరాడ్జామాతున కెఱింగింపక నొనర్పు" మన వల్లెయని వీరభద్రుం డనేకరుద్రగణకోటిని రవిపుత్రునితో సమరం బొనర్పు మనియు మీరోటుబడుసమయంబు నిరీక్షించి నే నేతెంచెద నని సెలవొసంగెను. తత్క్షణం బా మహావీరు లేకముఖంబున బాణబాణాసనాద్యాయుధంబులు బూని భయంకర శస్త్రాస్త్రధరులగు భైరవాదులతో జనుదెంచి శరత్కాలమేఘంబు పగిది శరవర్షంబు గుఱిపించుచుండ విపక్షదర్పదమనదక్షుండగు గోరక్షుండు బొడగాంచి చౌరంగునితో యుద్ధసన్నద్ధుండవు గమ్మని స్వరక్షణార్థంబై దశదిశల వజ్రకవచంబు నిర్మించెను. తత్కాలంబున హరగణకరవిముక్త శరజాలంబు భంగంబై సిద్ధముఖ్యాంగంబుల స్పర్శింపకుండ ఫాలాక్ష

గణసమూహంబు రోషతామ్రాక్షుయై గోరక్షునిపై యనలాస్త్ర
ధూమ్రాస్త్ర వాతాస్త్ర నాగాస్త్ర కాలాస్త్ర వజ్రాస్త్ర స్పర్శాస్త్రంబులు
ప్రయోగించి తత్సహాయుండై లోకభీకరంబగు దానవాస్త్రం బడరించిన
రవితనయుండు జలదాస్త్ర పర్వతాస్త్ర ఖగేంద్రాస్త్ర సంజీవిన్యస్త్రైంద్రాస్త్ర
విభక్తాస్త్ర దేవాస్త్రంబులచే ప్రతిహతం బొనర్చుచుండ చౌరంగనా
థుండు మోహనాస్త్రంబు గల్పించి ప్రయోగింప నయ్యస్త్రరాజంబు
రుద్రగణహృదయంబులం బ్రవేశించి చిత్తవిభ్రాంతి గల్పింప నమ్మహా
బలులు మతిభ్రష్టులై స్వకార్యం బెఱుంగక పిశాచంబులభంగి నిశ్చే
ష్టితులై యుండ చౌరంగనాథుం డమ్మోహనాస్త్రంబుపై మహావాతా
స్త్రంబు బ్రయోగించె నయ్యస్త్రభయసంపీడితులై హరగణం బంతరి
క్షంబున భ్రమ్మరుచుండ రౌద్రరసోద్రేకముద్రితుండగు వీరభద్రుండు
చాముండాద్యనేకశక్తికోటిసమేతుండై సమరంబున కేతెంచి మతి
భ్రాంతరుద్రగణంబుల వీక్షించి క్రుద్ధుండై జ్యానాదంబు సల్పి మిత్ర
మంత్రోద్భవునిపై కామాస్త్ర బ్రహ్మాస్త్ర కార్తికాస్త్రంబు లడరించి ప్రళ
యకాలరుద్రునిచందంబున బ్రహ్మాండస్ఫోటకంబగు సింహనాదంబు
సల్పుచుండ చౌరంగనాథుండు రత్యస్త్రంబుచే కామాస్త్రరూపం బడంచి
కామిన్యస్త్రంబుచే కార్తికాస్త్ర ప్రతాపంబు హరించి దశాసురీమహా
స్త్రంబుచే శంఖాసురాది నిశాచరుల గల్పింప తొల్లి వేదంబు లపహరిం
చిన పిశితాశులను భయంబుచే బ్రహ్మాస్త్రం బదృశ్యంబయ్యె. తదుపరి
శశాంకసుతుండు స్వతపఃప్రభావంబుచే సంజీవినీమంత్రయోగంబున
త్రిపురాసుగ క్షుమల మురమాన్య మహిషాసుర జాలంధర కాలయ
వన హిరణ్యాక్ష హిరణ్యకశ్యప ముచికుంద వక్రదంత దశముఖ ఇం
ద్రజి త్కుంభకర్ణ ప్రముఖ నక్తంచరులం గల్పింప నయ్యసురముఖ్యు
లేకీభవించి పిండీకృత బ్రహ్మాండులై నింగిముట్టి రోషభ్రూయుగ్మ
విజృంభణంబుచే యట్టహాసం బొనర్చుచుండ దేవతానివహంబు
వియన్మార్గంబున విమానారూఢులై త్రిలోకభయంకరంబగు రణరం
గంబు నిరీక్షింపుచుండి సిద్ధపరికల్పిత దోర్బలయుత దైత్యసముదయం
బునకు విభ్రాంతులై "యోహో! మహాప్రళయంబు ఘటియించెను.
స్వర్గాదిలోకంబులు క్షణమాత్రంబున భస్మంబొనర్తురో తొల్లి
యీనక్తంచరులకై కష్టంబు లనుభవించిన దెఱుంగమో" యని

విలపించుచు వైకుంఠంబు జేరంజని నిఖిలేశ్వరుండగు రమాకాంతున కీ వైచిత్ర్యంబు విన్నవింప భక్తరక్షణపరాయణుండగు నారాయణుండు విస్మితుండై నాఁడు నశించిన సురారు లెప్పగిది యుద్భవించిరో వీరికై పునరవతారంబులు బూననౌనో యని వితర్కించి యమ్మురాంతకుండు త్రిపురాంతకుని యాహ్వానం బొనర్చి రత్నమయసింహాసనంబుపై యలంకరించి "యోగద్రుముండగు గోరక్షుండు దనతపఃప్రభావంబుచే త్రిలోకకంటకులగు దైతేయులం గల్పించె. వా రత్యంతసాహసాత్ములై భువనబ్రహ్మాండంబుల కనర్థంబులు ఘటియించెదరు. మన ముపేక్షించెదమేని విపత్కాలంబు సంభవించు. మూఢమతిచే వీరభద్రుండు కలహంబు బూనె" నని సంభాషింపుచు రయంబున నుమారమాకాంతులు రవిపుత్రుని నికటంబు జేరి "గోరక్షా! జగత్ప్రళయంబగు విపరీతకార్యం బొనర్చుట తగునే? తొల్లి యీ దనుజేంద్రులకై మే మనేక ప్రయాసంబులచే సమరం బొనర్చిన దెఱుంగవే? శీఘ్రంబున నదృశ్యం బొనర్పు" మన గోరక్షుండు "దయాఘనులారా! మద్గురుకళేబరం బొసంగి క్షమియింపు" డన హరుండు ఘనకరుణాన్వితుండై మత్స్యేంద్రశరీరంబు దెప్పించి గోరక్షున కొసంగి "వత్సా! రాక్షసాధిపుల నంతర్ధానం బొనర్పు" మన ప్రతాపదక్షుండగు గోరక్షుండు ఫాలాక్షునితో "సమర్థా! సంజీవినీమంత్రవ్యక్తదానవుల బరిమార్చుటకై శ్రమదలంచెదరేని వీరభద్రుని ప్రాణంబుల కాశింపవల" దన మృడుండు "గోరక్షా! మున్ను మధుదైత్యపుంగవునిచే బహుకష్టంబులనుభవించి తుద కత్యంతప్రయత్నంబున వినాశం బొనర్చిన దెఱుంగమే? త్రిపురాసురరావణాదుల దౌర్జన్యంబు వర్ణింప వశంబగునే? హిరణ్యాక్షాది బలదక్షులకై యచ్యుతుం డనేకావతారంబులు ధరియింపఁడే? వత్సా! జగద్రక్షణార్థంబై వేగంబున నిశాచరుల మాయం బొనర్పుము. వీరభద్రునికై మోహంబు ధరియింప" ననుచుండ సమయంబున నద్దానవేంద్రులు భద్రుని ముట్టడించి శస్త్రాస్త్రంబులచే బెనంగుచుండ శౌర్యధైర్యధుర్యుండగు రుద్రాత్మజుండు రాత్రించరుల నెదురింపుచుండెను హరిహరులు గోరక్షనాథ శూరత్వ కుశలత్వంబులు బొగడుచు రాక్షసుల రూపంబులు మాపుచునుండ తాపసోత్తముండు వీరభద్రుని బలదర్పంబు లుగ్గడించి కక్షపాలాంతర భస్మంబు

గొని వాతాకర్షణ మహాస్త్రంబు బ్రయోగింప భద్రుండు సిద్ధనిర్మిత దైత్యజనసహితుండై బుషమినిర్వాలి శ్వాసోచ్ఛ్వాసరహితుండై పంచత్వంబునొందె. తదనంతరం బగ్గోరక్షుం డనలాస్త్రప్రయోగంబుచే కాయంబులు శిథిలం బొనర్చె. హరుండు వీరభద్రునికై విలపించుచుండెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున చౌరంగ గోరక్షనాథ శశాంగసందర్శనాది వీరభద్రసమరసంఘటిత కథావిశేషంబు త్రయస్త్రింశాధ్యాయము సంపూర్ణము.

చతుస్త్రింశాధ్యాయము.

గోరక్షనాథుఁడు వీరభద్రుని పునరుత్థితుం జేసి గురుకళేబరంబు గొని ధర్మనాథునకు పట్టాభిషేకం బొనర్చి యేగుచు మాణిభద్రున కనుగ్రహం బొసఁగి వెంటఁగొని పునః ప్రయాగానగరంబున కేతెంచి ధర్మనాథున కనుగ్రహం బొసంగుట.

హరుండు బవరరంగంబున వీరముఖ్యుని పతనంబు బొడగాంచి విషాదవదనుండై నేత్రాంబువులు రాల్చుచు "పుత్రా! ధీరగుణలావణ్యగాత్రా! నిఖిల శస్త్రాస్త్రవేత్తా! సురాసురప్రముఖాఖిల మహావీరగర్వనిర్వాపణం బొనర్చు ఘనుండవై గోరక్షసిద్ధునిచే గూలితివే? శశిహీన నక్షత్రంబులక్రియ దృగ్గ్రహిత మయూరపింఛనేత్రంబులమాడ్కి గ్రహణేంద్రియహీన సర్వాంగ సౌందర్యంబు క్రైవడి నీయున్కి లేని మద్గణంబులు కళారహితంబులు గాక శోభిల్లునే" యని మనంబున జింతింపుచుండ గోరక్షుండు విలోకించి తనడెందంబున "మందాకినీధరుండు బదరికాశ్రమంబున తన్ననిశంబు రక్షించిన దయాంతరంగుండు గాఁడే? ప్రత్యుపకారంబు దలంపక మందమతిచే లోకేశుని చిత్తంబునకు తాపం బొనంగుట ధర్మవిరుద్ధం బనదగదే" యని వితర్కించి దయాసముద్రుండగు శంకరుని చరణకమలంబులకు బ్రణమిల్లి "శంభో! మద్గురుప్రతాపంబుచే వీరభద్రుని జీవింపఁజేయుదు. మత్కల్పిత వాతాశనాస్త్రంబుచే భద్రునికాయంబు దైత్యజనశరీరంబుల భంగి శిథిలంబయ్యె. తత్సమూహంబుపై సంజీవినియోగంబున ప్రాణం

బులు గల్పించెదనేని లోకత్రయనాశకులగు పిశితాశనులు పునరుత్థితులై బాధింతురని సంశయించెద” నన నీలగ్రీవుండు “గోరక్షా! తచ్ఛిథిలీకృతశరీరంబు శోధించుట కొక సదుపాయంబు గలదు. వీరభద్రుండు జాగ్రత్స్వప్నసుషుప్తుల న న్ననిశంబు ధ్యానింపుచుండు. తద్దేహమాంసాస్థిచర్మంబులు మన్నామంబు జపియించు గావున తత్కాయంబు గనుంగొనవలయు ర” మ్మని గోరక్షసమేతుండై చూర్ణీకృత దనుజశరీరసముదయ మధ్యప్రదేశంబున భిన్నరూప వీరభద్రకళేబరంబు పూర్వోక్తప్రకారంబుగ బరీక్షించి గోరక్షునకు దెలియఁబఱచినంత నత్తాపసోత్తముండు సంజీవినీమంత్రంబు జపియించి వీరముఖ్యునిపై భస్మంబు బడవైవ శివనందనుండు ప్రాణంబులు ధరించి నిద్ర మేల్కాంచినక్రియ జాగ్రత వహించి బహుదర్పంబుచే శస్త్రాస్త్రకోదండాది సాధనంబులు గొని “దానవుల బరిమార్చెదను. గోరక్షుని శిక్షించెద” నని మహాధ్వానంబు జేయుచుండ ధవళాంగుండు సప్రేముండై పుత్త్రుని దన హృదయంబున కదుముకొని “వత్సా! నీకీ పౌరుషంబు లేల? గురుకరుణాకటాక్షపాత్రులగు సిద్ధముఖ్యులతో వైరంబు గూడునే” యని గత వృత్తాంతంబు శ్రుతపఱచి “పుత్రా! నాథోత్తములతో స్నేహంబు ధరియింపు” మని గోరక్ష వీరభద్రులకు సఖ్యం బొనగూర్చెను. తదుపరి మత్స్యేంద్రశిష్యుండు భవాజ్ఞాధారకుండై వియన్మార్గంబున మతిభ్రాంతులై వాతగతి పరుగులిడుచున్న హరగణంబును వీక్షించి యస్త్రోపసంహారంబుచే సుస్థిరత్వంబు గల్పింప నారుద్రగణసంఘంబు విముక్తమోహంబై హరిహరవీరభద్రసహిత గోరక్షునకు వందనంబు లాచరించి తనుతమ నిజనికేతనంబుల జేరంజనెను. పిదప నారాయణ వీరభద్రులంతర్ధానంబు నొందిరి. గోరక్షుండు గురుకళేబరంబు గొని తచ్ఛివాలయంబున చౌరంగసమేతుండై నివసించి యుండునెడ త్రివిక్రముండు త్రిపురారి దర్శనంబునకై యేతెంచి గోరక్షుని గనుంగొని యత్యంత ప్రియంబుచే హృదయాలింగనం బొసంగి నికటంబున నుపవేశించి క్షేమలాభంబులు విచారింప నయ్యమలాత్ముండు కళేబరవిషయచరిత్రంబు స్పష్టీకరించెను. నృపకాయధర మత్స్యేంద్రుం డచ్చెరువొంది “సచ్చరిత్రా! శీఘ్రకాలంబున ధర్మనాథునకు పట్టాభిషేకంబొనర్చి యురుదెంచెద” నని రయంబున గృహంబు జేరంబోయి సుమంత్రులతో

నాలోచించి యొక యుత్తమదివసంబున సుతుండగు ధర్మనాథునకు పట్టాభిషేకం బొనర్చి విప్రోత్తములకు గోభూహిరణ్యాదానంబులొసంగి యేకమాసానంతరంబున త్రివిక్రమశరీరంబు త్యజించి హరిమందిరస్థిత నిజశరీరంబు బ్రవేశించెను. రేవతీదేవి రమణుండు నిద్రదేఱడని దలంచి "నాథా! నాథా" యని కేకలిడుచు గతజీవకళేబరంబు బొడగాంచి మహాద్రవంబుచే రోదనంబు జేయుచుండ ధర్మనాథుండు భీతచిత్తుండై మంత్రిపురోహిత సమేతంబుగ బరుగెత్తుచు నంతఃపురంబు జేరంజని యాక్రందించుచుండెను. తదుపరి మత్స్యేంద్ర గోరక్ష చౌరంగనాథులు వీక్షించుచుండ తత్పేతంబును గొని శ్మశానంబున కరుదెంచి దహన సంస్కారం బొనర్చుచుండ ధర్మనాథుండు శోకపరవశుండై నిజభవనంబున కేతెంచి చింతాక్రాంతుండై భోజనాదులు వర్జించి స్వప్రాణరక్షణంబు దలంపక విలపించుచుండ రేవతీదేవి చారులచే శివమందిరంబున మత్స్యేంద్రుండు నివసించి యుండుట యెఱింగి పుత్రమోహంబుచే ధర్మనాథు నేకాంతంబునకు గొనిపోయి "వత్సా! జనకుండు నశించెనని శోకింపనేల? యుష్మజ్జనకునకు మరణంబు గలదే! త్రిలోకవందితుండగు మత్స్యేంద్రయోగివర్యుండు భవజ్జనకుండుగాక నీత్రివిక్రముం డగునే? యమ్మహామహుండు పురబాహ్యత్రిపురారిమందిరంబున నివసించియుండు" నని గతచరిత్రంబంతయు శ్రుతపఱచి దుఃఖోపశమనం బొనర్చెను. ధర్మనాథుండు సంతుష్టాంతరంగుండై సపరివార సహితంబుగ నీలకంఠుని నిలయంబుజేరి భక్తిభావంబులచే మత్స్యేంద్రయోగివర్యుని పదపంకేరుహంబులకు బ్రణమిల్లి యత్యంతవైభవంబుచే నాథత్రయంబును శిబికారోహణం బొనర్చి రాజమందిరంబునకు గొనితెచ్చి బహువిధోపచారంబులచే సేవలొనర్చుచు నొకసంవత్సరంబు గడపినంత యోగిముఖ్యుండు ప్రయాణోన్ముఖుండై శిష్యసహితంబుగ బయలుదేఱుచుండ ధర్మనాథుండు "జనకా! తీర్థసేవానిమిత్తంబై నే నేతెంచెద" నని దుఃఖింపుచుండ తాపసోత్తముండు "వత్సా! చింతింపవలదు. ద్వాదశాబ్దంబులు భవజ్జననీసేవాపరతంత్రుండవై రాజ్యభోగంబు లనుభవింపుము. తదనంతరంబె నేతెంచి గోరక్షనాథునిచే ననుగ్రహం బొసంగించి గొనిపోయెద" నని శాంతపఱచి గమనంబొనర్చి గోదావరీతటనికటధామనగరకాంతారంబు జేరంజనిరి.

గోరక్షుండు తద్గ్రామవాసుండగు మాణికనామసేద్యకారుని స్మృతి దలంచి మత్స్యేంద్రయోగిపుంగవునితో "సమర్థా! ధామనగరసమీపారణ్యప్రదేశంబున మాణికనామపురుషముఖ్యునిచేఁ దృప్తుండనై ప్రసన్నహృదయంబున నీయభీష్టంబు వేఁడుమన నక్కాఠినుండు విచారింపఁడయ్యె" నని తచ్చరిత్రంబు వెల్లడి యొనర్చెను. మత్స్యేంద్రనాథుండు "గోరక్షా! తత్పురుషశ్రేష్ఠుని విలోకింప జనవలయు" నని ప్రత్యుత్తరం బొసంగుచు విపినంబు గడచి యేగుచుండ నొక్కచో శుష్కకాష్ఠంబుభంగి భాసమానుండై సేద్యపరికరభారంబు శిరంబున వహించి నిశ్చేష్టితుండై హరినామంబు ధ్యానింపుచు మహాయోగి చందంబున విరాజమానుండగు మాణికునిగనుంగొని వీఁడేయని విన్నవింప మత్స్యేంద్రనాథుండు సమీపించి "యోరా! సంపూర్ణతపం బొనరించెదవా" యని విచారింప నమ్మూర్ఖుండు "మత్తపంబుచే నీకేటిసంకటంబు జనుజను" మని వికటప్రసంగంబులు సల్పుచుండ గోరక్షుండు "గురుసమర్థా! యుక్తాయుక్తం బెఱుంగని మూఢాత్మునిచే తామేల సంభాషించెదరు? తామీ తరుచ్ఛాయాశ్రితులై నివసించుడీ. మా యోపాయంబులచే నిప్పురుషునకు హితం బొనర్పవలయు" నని మాణికుని పురోభాగంబున నిల్చి "యోహోహో! చతుస్సముద్రముద్రితంబగు భూవలయంబు గ్రుమ్మరి తాపసోత్తముల బృందం బనేక ప్రదేశంబులఁబొడగాంచితి. నీయట్టిధైర్యధుర్యుండగు యోగమూర్తిని గనుంగొనలేనైతిని. పురుషశ్రేష్ఠా! భవత్కరుణాకటాక్షంబున నాకనుగ్రహం బొసంగెదవే" యని హెచ్చరింప మాణికుండు గోరక్షునితో "వయోవృద్ధుండవై శూన్యజ్ఞానంబుచే నన్ననుగ్రహం బొసంగుమని వేఁడుట చిత్రంబుగాదే! నా కనుగ్రహం బొసంగఁదలంచెదవేని నీవే యొసంగు" మని స్వముఖంబు జాచినంత గోరక్షుండు దయామతిచే మాణికుని కర్ణేంద్రియంబున బ్రహ్మజ్ఞానమంత్రోపదేశం బొసంగి స్వస్వరూపానుసంధానంబు దెలుప నమ్మాణికుండు తత్క్షణంబ నిరస్తమోహజాలభ్రాంతుండై చరాచరాత్మక ప్రపంచంబు పరమేశ్వరమయంబనియు దృశ్యమానవస్తుసంచయం బీశ్వరస్వరూపంబనియు బహిరంతర్భావంబులచే నిశ్చయమానసుండై సర్వభూతసాక్షిస్వరూపుండనని వితర్కించి జ్ఞానపూర్ణుండై తపంబు త్యజించి గోరక్షనాథుని పద

కంజంబుల వ్రాలెను. సిద్ధముఖ్యుండగు గోరక్షుండు భస్మం బభిమం త్రించి యప్పురుషముఖ్యుని ఫాలంబున దిద్ది కాయబలంబు గల్పించి హస్తంబుగొని మత్స్యోదరసంభవుని సమీపంబునకు దోడ్కొని జని వికటుండు వీఁడేనని నిగదించెను. మత్స్యేంద్రుండు "మాణిక్యుం డత్యంత శఠుండుగాన వీనినామంబు హఠభంగనాథుండని నిశ్చయించి నాథపథంబున జేర్పు" మన గోరక్షుం డవశ్యంబని నాథపంథచిహ్నంబులొసంగి హఠభంగనాథ మత్స్యేంద్ర చౌరంగ సమేతుండై తీర్థసేవాపరతంత్రులై యేగుచు మార్గమధ్యంబున ననేక మంత్రరహస్యంబులా హఠభంగనాథునకు దెల్పుచు నస్త్రశస్త్రాది ప్రయోగోపసంహారంబుల కీ లెఱింగించి ద్వాదశవర్షంబు లనేక మహాస్థలంబులు సేవించి ప్రయాగనగరంబున కేతెంచిరి. తత్పురంబున మత్స్యేంద్రనందనుండగు ధర్మనాథుండు బహువిధవైభవంబులచే రాజ్యంబేలుచు పుత్రసంతానంబు వడసి త్రివిక్రముండని నామకరణం బొనర్చి ప్రజాపాలనం బొనర్చునెడ యోగిశ్రేష్ఠులగు మత్స్యేంద్రాదినాథ చతుష్కాగతం బెఱింగి ముదితాత్ముండై మంత్రిపురోహిత ప్రముఖపరివారంబుచే నెదుర్కొని యాందోళికంబుల నాథశ్రేష్ఠుల నలంకరించి నిజభవనంబునకు దోడ్కొని యేతెంచి నయభయభక్తిభావంబులచే సంతుష్టపఱచి నిజసుతుండగు త్రివిక్రమునకు రాజ్యపట్టాభిషేకం బొనర్చి వైరాగ్యఘనుండై దేజరిల్లుచున్న ధర్మనాథుని మస్తకంబున గోరక్షనాథుండు మాఘమాస శుక్లపక్ష ద్వితీయాదివస శుభముహూర్తంబునఁ దనవరదహస్తంబు మోపి యజ్ఞానావృతమోహపాశంబు దెగటార్చి నిష్కళంకపరంజ్యోతిస్వరూపుండవని పరిపూర్ణతోపదేశం బొసంగి గురుమంత్రరహస్యంబు బ్రకటించెను. పిదప బృందారకాది బృందంబుల నాహ్వానించి మహోత్సాహంబుచే పఙ్క్తిభోజనం బొనర్చునెడ గోరక్షుండు కనికరంబుచే చౌరంగహఠభంగధర్మనాథులకు దనయుచ్ఛిష్టప్రసాదం బొసంగుచుండ సురలోకోత్తములు వైరాగ్యఘనుండగు గోరక్షుని ప్రసాదంబు వేడుకొని గ్రహించి యతులిత బ్రహ్మానందమయులై "దయామయా! సర్వజనధ్యేయా! భవత్ప్రసాదంబు ప్రతివత్సరంబున నిప్పగిది లభియింప ననుగ్రహం బొసంగు" మన గోరక్షుండు సుపర్వాణసంఘంబుతో "ప్రతివర్షంబున నేతన్మాస

తిథి దివసంబునందు ధర్మనాథానుగ్రహమూలదివసంబని యుత్సవం బొనర్చి మన్నామంబు ధ్యానించి భోజనంబు సల్పెదరేని సుత్ప్రసాద ఫలంబు ఘటియించు" నన నయ్యమరవరులు గోరక్షోక్తప్రకారం బున ప్రతివత్సరంబున నుత్సవంబు ధర్మనాథునికై గడుపుచుండిరి. గోరక్షుం డేతద్ధర్మనాథమహోత్సవఫలవిషయంబై "కిమ్యాగరగ్రంథ రాజంబున నెవ్వండేని ధర్మనాథనామంబుచే ప్రతివర్షంబున మహోత్స వంబు జరుపునో దూరీకృతదరిద్రదుఃఖతాపుండై భోగభాగ్యసంపత్సు ఖంబుల నోలలాడుటయేగాక తత్పురుషశ్రేష్ఠుని సదనంబున నిర్జరోత్త ములు నివసింతు" రని విశదీకరించెను. అస్తు. గోరక్షుండు ధర్మనాథు నకు నాథదీక్షాచిహ్నంబు లొసంగి మత్స్యేంద్రనాథ చౌరంగ హాల భంగ ధర్మనాథసహితుండై గమనం బొనర్చి యనేకతీర్థంబుల గ్రుంకు లిడుచు నచ్చటచ్చట పుణ్యస్థలవిశేషంబులు గొనియాడుచు ధర్మనా థున కఖిలమంత్రార్థరహస్యంబు లుపదేశించి సర్వకళాపరిపూర్ణత్వం బొసంగి బదరికాశ్రమంబు జేరంజని కాత్యాయనీప్రియున కెఱింగించి తత్పుణ్యప్రదేశంబున ద్వాదశాబ్దంబులు తపంబునల్ప నియమించి నాథచతుష్కం బపారతీర్థంబులు సేవించి పునర్బదరికాశ్రమంబు ప్రవే శించి నిఖిలమంత్రాధిదేవతానివహప్రత్యక్షంబు గావించి సకలమంత్రా ర్థసిద్ధికై ధర్మనాథునకు వరంబు లిప్పించి యమ్మహాసిద్ధపంచకంబు నానాదేశపర్యటనం బొనర్చుచుండెను.

రేవణసిద్ధనాథకథాప్రారంభము.

తొల్లి కటివేల్పు తొలిచూలివీర్యంబుచే నెనుబదెనిమిదివేలజ డదారు లుదయింప తద్వీర్యభాగశేషంబు రేవానదీతటంబునం బడి ప్రకాశించుచుండ చమసనారాయణుండు ప్రవేశించి బాలార్కకరనిక రతేజోమయ సర్వావయవ సంపూర్ణుండగు డింభకుండై రోదనంబుజే యుచుండ నొకసహానాసాగుండను సేద్యకారుండు తోయంబులకై ఘటంబుగొని తీరంబు జేరంజని శోకింపుచున్న శాబకుని సుందరతర సుకుమార రూపలావణ్య విశేషంబులు విలోకించి యత్యంతాశ్చర్యం బుచే నర్భకుని గొని ముఖకమలంబు చుంబించి ఘటంబున బాలుని గోప్యపఱచి సత్వరంబుగ సదనంబుజేరి నిజకాంతామణి కొసంగి

"సర్వేశ్వరుండు ప్రసన్నుండై రేవాతీరంబున సుసంతానం బొసంగె" నని దెలియబలుక నయ్యుత్తమపరమసాధ్వీమణి లబ్ధనిక్షేపధనదరిద్రుని చందంబున నుప్పొంగి శశిముఖావలోకనానందోత్తుంగతరంగయుత క్షీరార్ణవంబుపగిది డోలాయమానమానసయై శిశువునుం గొని యుష్ణోదకంబులచే స్నానంబు లాడించి డోలికారోహణంబు గావించి రేవాతీరలబ్ధుండని రేవణుండని నామకరణం బొనర్చి స్తన్యపానం బొసంగుచు బోషించుచుండె నబ్బాలుం డనుదినం బభివృద్ధిజెంది ద్వాదశాబ్దంబులవయస్కుండై కృషికర్మచాతుర్యంబున స్వకార్యంబులు నెరవేర్చుచు నొకానొక ప్రభాతసమయంబున వృషభంబుల గొని కాననంబున కేగుచుండె. నట్టియెడ లోకత్రయ పవిత్రకర పద కంజంబుల పాదుకలు ధరించి యుజ్వలతామ్రవర్ణజటాజూటభూషిత శిరోభాగుండై శుభ్రకౌపీనవిరాజమానస్వర్ణవర్ణశరీరకాంతిచే హరి హరబ్రహ్మస్వరూపుండగు దత్తాత్రేయుండు వినోదార్థంబు విపినంబున సంచరించి గిరినాగపర్వతశ్రేష్ఠంబున కేగుచు తన్మార్గమధ్యంబున వృషభంబుల గని రేవణుని నిరీక్షింపక శీఘ్రగమనంబున హఠాత్తుగ రేవణుని శరీరంబు స్పర్శించెను. తత్క్షణంబ రేవణుం డజ్ఞానతమోవిముక్తుండై పూర్వజన్మజ్ఞానంబు గలిగి దనహృదయంబున "నహో! చమసనారాయణావతారుండనై యహర్నిశంబులు కృషికర్మ నిరతుండ నగుచు దుస్సహప్రపంచపాశంబులంబడి మూఢునిక్రియ విలసిల్లితి" నని యోచింపుచుండ నత్రినందనుండు "నీవెవ్వండ" వని విచారించెను. రేవణుండు జ్ఞానపూర్ణుండై దత్తుండని దలంచి "సమర్థా! యుష్మత్సత్వగుణాంశసంభూతుండనై మనుజదేహంబుచే కడుకష్టంబు లనుభవించితి" నని ప్రత్యుత్తరం బొసంగుచు నమ్మహాఘనుని పాదకమలంబుల వ్రాలి "దీనశరణ్యా! భవత్కృపాకటాక్ష సూర్యోదయంబుచే మాయాంతిమిరంబు బాపి నిష్కళంకపరిపూర్ణపరబ్రహ్మస్వరూపుం జేయవేని నిన్విడుతునే" యని దృఢంబుగ చరణంబులు ధరించెను. కరుణాంతరంగహృదయుండగు దత్తుండు యత్యాదరంబుచే ముఖకమలంబు నివురుచు మస్తకంబున నభయహస్తంబుంచి దనమనంబున నిబ్బాలుండు చమసనారాయణుండనియు మర్త్యశరీరధరుండై యరణ్యంబుల నివసించి భక్తివైరాగ్యమార్గంబుల తెఱం గెఱుంగఁడనియు

కాయప్రాయశ్చిత్తంబుకై యొకకొన్నిదివసంబులు తపం బాచరించెనేని ప్రపంచనిస్పృహత్వంబు గలిగి నిర్మలజ్ఞానయోగమార్గధరుండై రాహుముక్త ప్రభాకరునిభంగి దేజరిల్లెడు సమయంబున బ్రహ్మజ్ఞానానుసంధానమహావాక్యరహస్యోపదేశానుకూలుం డగునని యోచించి సంపూర్ణానుగ్రహం బొసంగక ధనికుండు నిజతనయుని గుణకుశలత్వంబు బరీక్షించుటకై వాణిజ్యం బొనర్పుమని కించిద్విత్తం బొసంగినకైవడి యొకసిద్ధిమంత్రం బుపదేశింప రేవణుం డమితానందంబుచే దయామయుండగు దత్తాత్రేయుని బుత్తెంచి సురంగోని సుధారసంబు త్యజించినక్రియ పాషాణంబుకై పరుసంబు బోనాడినపగిది మహిమాసిద్ధిమంత్రయోగంబుచే తుష్టుండై సర్వభూతమయుండు గాకుండినను ప్రపంచమోహంబు త్యజించెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున హఠభంగనాథచరిత్రంబున రేవణనాథ జన్మకథావిశేషంబు చతుస్త్రింశత్యధ్యాయము సంపూర్ణము.

పంచత్రింశాధ్యాయము.

రేవణసిద్ధుఁడు దత్తానుగ్రహంబుచే మహిమాసిద్ధికౌతుకంబులు జూపి పిదప సిద్ధుండై తీర్థంబులఁ గ్రుమ్మఱుచు సారస్వతనామవిప్రునికై కైలాసంబున కేగుట.

శ్రీగురుదత్తాత్రేయుండు రేవణునకు మహిమాసిద్ధిమంత్రం బనుగ్రహించి తత్ఫలంబు దెల్పి తక్షణంబ స్వస్థానంబు జేరంజనె ననంతరంబ రేవణసిద్ధనాథుండు తన్మహిమాసిద్ధిమంత్రంబు ధ్యానింపుచు హలంబునకు వృషభంబులం బంధించి క్షేత్రంబు దున్నుచుండ శ్రీగురుమహిమాతిశయంబుచే మహిమాసిద్ధి బ్రత్యక్షంబై నికటంబున నిల్చి "యుష్మత్కార్యం బెయ్యదియో గోరు" మని రేవణసిద్ధనాథుని విచారింప నబ్బాలుండు "భవదాహ్వయంబు దెలుపు" మన నమ్మహాశక్తి "మన్నామంబు మహిమాసిద్ధి" యని బ్రత్యుత్తరం బొసంగెను. రేవణుం డనుగ్రహంబు బడయునెడ నేతన్మంత్రప్రతాపంబుచే మహిమాసిద్ధి బ్రత్యక్షం బగుననియు తత్సమయంబున నీయభీప్సితంబు లద్దేవిత'° విచారింపు మనియు మహిమాసిద్ధిప్రతాపం బతర్క్యంబు

గాన క్షణమాత్రంబున త్రిలోకభోగంబు లొసంగుననియు కాననాంతరతరుపాషాణంబు లద్దేవి కరుణాకటాక్షంబుచే కల్పవృక్షచింతామణులై విలసిల్లుననియు ధనధాన్యవస్త్రభూషణాలంకారంబు లపారంబుగ గల్పింపుననియు శ్రీగురుమూర్తిచే నెఱింగినకతంబున మహిమాసిద్ధి ప్రసన్నత్వంబుచే కడుసంతసించి హాలంబు విసర్జించి యొకభూరుహచ్ఛాయాశ్రితుండై యద్దేవితో "నేతత్తరునికటపాషాణసముదయంబును చామీకరం బొనర్తువేని మన్మనోభీష్టంబులు వేఁడెద" నని క్షీరనీరంబులచే మరాళంబును గుర్తెఱింగినక్రియ లోహస్పర్శనంబుచే పాషాణసమూహస్థపరుసంబు బరీక్షించినభంగి విచారింప నద్దేవి దరహసితవదనారవిందయై "రేవణసిద్ధా! మహిమాశక్తిప్రతాపం బీవెఱుంగవో" యని రయంబున నిజదృక్ప్రసారంబుచే తత్క్షేత్రస్థితపాషాణంబులు జాతరూపం బొనర్చెను. రేవణుండు విస్మయుండై జగద్వంద్యుండగు యత్రినందనునివాక్యంబులు నిక్కంబని దలంచి "యోదేవీ! భవత్ప్రతాపశక్తి బరిశీలించితి. మత్సన్నిధానంబున నివసించి మత్కోరిక లీడేర్చెదవే" యన నమ్మహాశక్తి హసించి "యనఘాత్మా! భవన్నికటంబున గోప్యరూపంబుచే నివసించి యుష్మత్సంకల్పితకార్యంబులు నెరవేర్చెద. ప్రత్యక్షస్వరూపంబుచే బ్రకటంబగుట సరిగా" దన రేవణుం డవశ్యం బని సెలవొసంగి కృషికార్యంబులు దీర్చి సూర్యాస్తమయసమయంబున వృషభంబుల గొని నిజధామంబున కేతెంచి యాత్రియామంబు గడపి ద్వితీయదినోదయంబున క్షేత్రంబున కేగం దలంచి దనడెందంబున ధనపూర్ణుండు నుందమతిచే దైన్యం బనుభవించుట నింద్యంబుగాదే! లబ్ధస్పర్శవేదియగు మర్త్యుండు విత్తంబుకై ప్రయత్నించుట చిత్రంబుగాదే యని వితర్కించి క్షేత్రంబున కేగకున్న సహనాసారుండు జూడగాంచి పుత్రునితో "వత్సా! సేద్యకార్యంబులు బరిత్యజించి నిస్పృహత్వంబుచే గృహంబున నివసించుట గూడునే? క్షేత్రంబు ఫలించనేని ధాన్యసమృద్ధిగలిగి భక్ష్యభోజ్యంబులచే దృప్తులమై బహువిధవస్త్రభూషణాద్యనేక సంపద్విభవసుఖంబులనుభవింతు" మన నయ్యలఘుచరిత్రుండు "జనకా! ధనకనకవస్తుజాలంబులకై యనిశంబు శ్రమింపనేల? సదనంబున సకలసుఖావహకనకేష్టికలు గలుగ కష్టతరకృషికార్యంబు లొనర్చుట దుశ్చేష్టితం

బులుగావే? యస్మత్సదనంబు ధనపరిపూర్ణంబని యెఱుంగవే? వలయు
నేని గనుంగొను" మన సహానాసారుండు పుత్రునివచనంబులకు ప్రహ
సించుచు నంతర్మందిరంబున కేగ నచ్చో స్వర్ణశ్రేష్ఠికలరాసిం గని
యాశ్చర్యంబుచే నిబ్బాలుని వాక్స్థానంబున నవనిధులు గలవో లేక
నిర్మాణవకుండు సిద్ధపురుషావతారుండో యని నిశ్చయించి యయ్యా
మలాత్మునిచరిత్రంబు వెల్లడి యొసర్పక నంతరంగంబున భక్తిభావం
బులు గలిగి మెలంగుచుండెను. రేవణుం డనుదినంబున తత్బంధల
గ్రామరాజమార్గంబున సంచరింపుచు బాటసారులం గని మాయింట
విందారగింపుదుగు రమ్మని రయంబున గృహంబునకు దోడి తెచ్చి షడ్ర
సోపేత భోజనంబులిడుచుండ క్రమక్రమంబున విధివీర్యోద్భవుండగు
రేవణసిద్ధుని యుదారసాహసంబు లభివృద్ధిజెంది కీర్తిధ్వజంబు నింగి
ముట్టి యనేకదేశంబులకు బ్రకటంబయ్యె. తత్కారణంబుచే యాచ
కానీకంబు దమయిష్టార్థభోగంబు లనుభవించుటకై యరుదెంచి వస్త్ర
భూషణాద్యపారవస్తుజాలంబులచే దనివిదీఱి నిజేచ్ఛం జనుచుండెను.
తద్వద్భోగులు దమతను శరీరసంపీడిత భూతప్రేతపిశాచప్రముఖాఖిల
బాధలకై నేతెంచి రేవణసిద్ధవాక్ప్రసాదంబుచే విముక్తతాపులై
శాంతింబొంది నిజనికేతనంబుల కేగుచుండిరి. ఇట్లొక కొన్నిదివసం
బులు గడువ నొకానొకసమయంబున మత్స్యేంద్రయోగిపుంగవుండు
దేశాటనం బొనర్చుచు బంధలనగరంబు బ్రవేశించి యొకసత్రంబున
గురుమంత్రధ్యానయోగధారణ పరాయణుండై నివసింప పురజనులు
నిత్యనియమప్రకారంబున తత్సత్రంబున కేతెంచి తాపసోత్తముండగు
మత్స్యేంద్రుని బొడగాంచి "సమర్థా! రేవణుని దర్శనం బొనర్చితిరే"
యన నవ్విమలాత్ముండు పురజనులతో "రేవణునిచరిత్రవిశేషం
బెయ్యది" యని విచారింప వారా బ్రహ్మపుత్రుని యపూర్వచరి
త్రంబు విన్నవించిరి. మత్స్యేంద్రుండు రహస్యంబున రేవణసిద్ధుని
గాంచి యిప్పురుషశ్రేష్ఠుండు చమసనారాయణావతారుండని నిశ్చ
యించి యీరేవణుం డేమహామహుని యనుగ్రహంబునకు పాత్రుం
డయ్యెనో యని శోధింపుచు తన్నగరవాసుల విచారింప వారీమూలం
బే మెఱుంగ మని ప్రత్యుత్తరం బొసంగిరి. మత్స్యోదరసంభవుం
డొకకౌతుకంబు జేయందలంచి తత్సత్రంబున వసించి నానావిధ ఖగ

సమూహంబునకు ప్రసాదంబు లొసంగి బుత్తెంచుచు ఘోరతరవ్యాఘ్రభల్లూకాద్యనేకవనమృగంబుల నిజశక్తిప్రతాపంబుచే నాహ్వానం బొనరించి స్వహస్తంబుల యథోచితగ్రాసంబు లిడుచుండ పురజనులత్యంతాశ్చర్యంబుచే నిమ్మహాసిద్ధుండు ప్రత్యక్షరుద్రుండు గానోపునని వితర్కించి యొకనాఁడీ సర్వభూతమయుండగు మత్స్యేంద్రయోగిముఖ్యుని ఘనచరిత్రంబు రేవణసిద్ధునితో నెఱింగింపుచు "పురుషశ్రేష్ఠా! మననగరంబున కొక మహాపురుషుం డేతెంచె నయ్యకలంకుని యద్భుతకృత్యంబులు బ్రహ్మాదులకతర్క్యంబులై విలసిల్లు. దన తపఃప్రభావంబుచే ప్రతిదినంబున పశుపక్షిమృగజాలంబుల నాహ్వానం బొనరించి యాహారంబు లొసంగుచు సంతుష్టిపఱచును. నిర్భయుండై తత్సమువయంబున స్వేచ్ఛావిహారంబుచే సంచరించును. వాక్ప్రసంగంబులేల నిజదృష్టిచే విలోకించెదవేని తత్ప్రదేశంబున ననేక క్రూరమృగకోటి దృగ్గోచరం బగు" నన రేవణసిద్ధుండు తక్షణంబ బయలుదేరి ఖగమృగనికరపరివృతుండగు మత్స్యేంద్రనాథుని నిరీక్షించి దన హృదయంబున నెప్పగిది ఖేచరవనచరంబులు నిర్భయంబుచే నిమ్మహాత్ముని సేవించును. శోధింపవలయు నని నిజసదనంబున కేతెంచి యేకాంతస్థలంబున నివసించి మహిమాసిద్ధి ప్రత్యక్షంబుకై ధ్యానింప నద్దేవి బ్రసన్నంబై రేవణునికామ్యం బెయ్యది యని విచారించెను. రేవణుండు "తల్లీ! భూచర ఖేచర వనచరాది సర్వభూత సంతుష్టి యొనర్పవలయు నని కుతూహలంబు గలదు. ధ్యానమాత్రంబున భయరహితహృదయులై మృగకులసంఘంబు విహంగకులసముదయం బరుదెంచి మదర్పితపదార్థంబులచే దృప్తు లొసటుల వరం బొసంగు" మన నమ్మహిమాసిద్ధి "రేవణసిద్ధా! సర్వభూతమయత్వంబున నిర్ద్వంద్వ నిర్గుణ నిశ్చల సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపుండై జలచర భూచర వనచరాద్యఖిల స్థావరజంగమాంతర్బహిర్వ్యాపకుండగు యోగిపుంగవునకు లభియించు ఘనకార్యంబులు నీకెట్లు సిద్ధించు" నన రేవణసిద్ధుం డమ్మహాసిద్ధితో "నోజననీ! భవత్కృపాకటాక్షంబుచే బ్రత్యక్షపరబ్రహ్మస్వరూపుని జేయవే" యని వేఁడుచుండ నద్దేవి "రేవణసిద్ధా! నీవిందుకై చింతింపనేల? జగత్త్రయవందితుండగు మూర్తిత్రయుండు యుష్మద్గురుండు గాఁడే? యవ్విమలజ్ఞానానంద స్వరూపుం డనుగ్రహిం

చెనేని యఃకశ్చిత్పశుపక్షిమృగంబు లననేల నతలవితలాది యధోలోకంబులు భూర్భువర్లోకాది యూర్ధ్వలోకంబులు కరతలంబులు గావే? గరుడగంధర్వాద్యమరగణంబులు భవచ్చరణకమలాశ్రితులు గారే" యన నప్పరమేష్ఠిసుతుండు సిద్ధివాక్యంబులు నిక్కంబని యెదదలంచి గ్రక్కున తొల్లి దన కనసూయానందనుండు ప్రసన్నుండైన కాననంబున కేగి "దయామయా! దీనశరణ్యా" యని పెక్కుభంగుల శ్రీగురుదత్తాత్రేయుని ధ్యానింపుచు నిద్రాహారంబులు వర్జించి వాతాంబుపర్ణాశనుండై శుష్కీభూతశరీరుం డగుచు దత్తా! గురుసమర్థా!యని యేకాగ్రమానసంబుచే నత్యుగ్రతపం బొనర్చుచుండెను. మత్స్యేంద్రుండు రేవణునికృత్యంబులు పురజనులచే నెఱింగి దనచిత్తంబున నిప్పురుషుని యాచార్యుం డెట్టిసమర్థుండు గానోపునో కామ్యసిద్ధి మంత్రం బుపదేశించి దృగ్దృశ్యమాన మాయామయప్రపంచాతీత పరతత్త్వం బనుగ్రహింపక మోసపుచ్చెనో యని వితర్కించి యణిమా గరిమా లఘిమా ద్యష్టసిద్ధుల నాహ్వానింప నమ్మహాశక్తులేతెంచి మత్స్యేంద్రయోగిశేఖరుని చరణంబులకు వందనంబులాచరించి పురోభాగంబున నిల్చుండనవ్వసునందనుండు "భవద్వర్గాష్టకంబున నే మహాసిద్ధి రేవణసిద్ధుని సాధ్యంబయ్యెనో యెఱింగింపు" మన మహిమాసిద్ధి "యోగద్రుమా! శ్రీగురుదత్తాత్రేయ వరప్రసాదంబుచే రేవణుని స్వాధీనంబై సర్వసంపత్సమృద్ధి యొనర్చితి" నని యుత్తరంబొసంగ మత్స్యేంద్రుండు దనడెందంబున రేవణుండు గురుబంధుండని దలంచి రామసఖులగు వానరోత్తములు గోపాలురై బూర్వస్నేహంబుచే యదుకులాధిపునికి సహాయం బొసంగినకైవడి నుత్పూర్వజన్మస్నేహచమసనారాయణుండే రేవణుం డయ్యెగాన మేలొనర్పవలయు నని యూహించి జెచ్చెరం గిరినారపర్వతంబున కేగి యత్రిసూనుని పదకంజంబులకు బ్రణతుండై "దయాంతరంగా! శ్రితజనభవభయభంగా! దాసజనహృదయ సరసీరుహామత్తభృంగా" యని స్తోత్రంబొనర్చి "గురునాథా! లోకోద్ధారనిమిత్తంబై చమసనారాయణుండు విధివీర్యంబుచే నుద్భవించి భవదనుగ్రహంబుచే మహిమాసిద్ధి ప్రతాపవైభవంబులు గలిగి రేవణసిద్ధనామంబున ప్రసిద్ధిగాంచి వైరాగ్యశక్తిస్ఫుటజ్ఞానంబుచే కార్యకారణంబులకు సాక్షిస్వరూపుండు గాక క్షుత్పీడితుం డశనంబు గోరు

చందంబున బ్రహ్మానుభవజ్ఞానంబుకై యహర్నిశంబులు భవదాగమన మార్గంబు నిరీక్షించుచు శయ్యాసనపానభోజనంబులు వర్జించి యొకమహారణ్యంబున మాంసరహిత శరీరంబుచే కంఠగతప్రాణుండై ద్రవహీననయనంబులు కార్పాసంబుభంగి గాన్పింప యుష్మత్పాదపం కేరుహార్పితచిత్తుండై పరితపించు యుత్తమశ్లోకునిపై గరుణించ గూడదే? లోహంబు పరుసంబుచే సువర్ణంబై భూషణంబులుగాక బూర్వవన్నీచకార్యంబుల వినియోగింపఁబడుట ధర్మవిరుద్ధంబుగాదే? తద్వత్త్వత్కరస్పర్శితమూర్ధుండగు రేవణసిద్ధుండు మోక్షజ్ఞానగామిగాక మాయాబద్ధుండగుట న్యాయంబగునే? పీయూషంబుచే యమరత్వం బొసంగి పునర్మర్త్యుండవు గమ్మనుట చిత్రంబనదగదే? దయామయా! నీకీ కఠినంబేల గలిగె" నని బలుకుచుండ దత్తుండు ప్రసన్నహృదయుండై "వత్సా! రార" మ్మని రయంబున మత్స్యేంద్రసహితుండై రమారమణ యుమారమణులచందంబున ద్రోణమందరాచలంబుల మాడ్కి రేవణుని జేరంజని కృశీభూతశరీరుండై సకలేంద్రియవ్యాపారంబు లుడిగి దత్తద్దర్శనోత్సుకంబుచే పరితపింపుచున్న రేవణసిద్ధుని బొడగాంచి యనసూయాతనూభవుండు వత్సంబుకై ధేనువు పరుగెత్తుచందంబున డగ్గరం జేరి సప్రేముండై వక్షస్థలంబున కదుముకొన రేవణుండు దుర్వాసానుజుని పదపంకేరుహంబుల నిజఫాలంబు మోపి "ఘనలీలా! నతజనపరిపాలా! భవభయహరకృపాళో" యని దీనవదనుండై బాష్పంబులు రాల్చుచు గద్గదకంఠంబుచే నన్నేల మఱచితి వని విలపించుచుండ దత్తుండు సుపుత్రుని హితంబుగోరు తండ్రికైవడి రేవణుని లాలింపుచు శ్రోత్రంబున తాపత్రయలతాలవిత్రంబగు మంత్రరాజం బుపదేశించి తత్వమస్యాది మహావాక్యంబులచే సంశయక్లేశంబు బాప పరిశుద్ధాంతరంగంబుచే చరాచరాత్మక సర్వభూతంబులు దనయంద గలవనియు తా సర్వభూతంబుల వెలిం గెదననియు నిశ్చల నిర్మల జ్ఞానపరిపూర్ణత్వంబున నద్వితీయపరబ్రహ్మస్వరూపుండై బ్రకాశించుచున్న పితామహవీర్యజాతుండగు రేవణుని శరీరంబు దత్తుండు కృపామతిచే దృఢపఱచి గిరినారమహీధరంబునకు దోడ్కొని చని నిఖిలమంత్రార్థరహస్యంబు లుపదేశించి స్వరశాస్త్ర జ్యోతిశ్శాస్త్రాది చతుర్దశవిద్యాభ్యాసం బొనరించి మత్స్యేంద్రున కెఱిం

పింపుచుండ జాతాపత్యురాలగు జాహ్నవీదేవి కేకలిడుచు "ప్రాణప్రియా! డింభకుండు తన్మయావస్థచే శోషింపుచున్నాఁ" డని రోదనంబు జేయుచుండ విప్రోత్తముండు కులకాంతతో "శోకింపనేల? దైవోపహతప్రాపుల ముని మున్నెఱుంగమే? రోదనంబుచే లాభంబుగలదే? తొలిజన్మపాపఫలంబు లనుభవింపక దీరునే? ధ్యానం బొనర్చెదవేని సిద్ధుండు మేల్కాంచు. సాధుజననిద్రాభంగదోషంబునకు పారంబు గలదే? స్తబ్ధించుము. శాంతిం బొందు" మని బలుకుచు నిర్ధార్యుండై నాథుని పదకంజంబుల సేవించుచుండ కృతాంతభటులు శిశుప్రాణంబు లపహరించిరి. జాహ్నవీదేవి దుస్సహదుఃఖంబుచే మందనినదంబున శోకింపుచుండ సూర్యోదయసమయంబయ్యె రేవణసిద్ధుండు నిద్రదేరి శోకరవం బాలకించి "యెవ్వ రీ రోదనంబు జేయువా" రన విప్రుండు "మత్తనయుండు తన్మయావస్థచే తపింపుచుండ మూఢమతిచే మజ్జాయ రోదనంబు జేయుచున్న" దన రేవణుండు "సుతుం గొనితె" మ్మనెను. వేగంబున విప్రుండు లోగృహంబుజేరి డింభకుని బరీక్షించి కాలగతి జెందియుండుట యెఱింగి "యోగిపూర్ణా! శాబకుండు పంచత్వం బొందె" నని నుడువ రేవణసిద్ధుండు క్రుద్ధుండై "నే నిచ్చో నివసించి యుండ బుద్ధిశూన్యుండగు కృతాంతుండు నిర్భయంబుచే ప్రాణంబులు హరించెనే? మత్పరాక్రమదర్పంబు గనబఱచెద" ననుచు "విప్రోత్తమా! శిశువుం గొనితె" మ్మన బ్రాహ్మణుండు నిర్జీవకళేబరంబు గొని సిద్ధునిసమక్షంబున కరుదెంచెను. రేవణుండు "సారస్వతా! యుష్మత్ప్రథమతనయుం డీ యర్భకుండానే" యన విప్రముఖ్యుండు "సిద్ధముఖ్యా! మద్భాగ్యఫలితం బెంతని యభివర్ణింతు పుత్రషట్కంబు జన్మించి నామకరణాత్పూర్వంబె రవిపుత్రునిచే నపహరింపఁబడె" ననియు నేతచ్ఛాబకుండు సప్తమపుత్రుండని దెలుపుచు "తపోధనా! మత్పురాకృత పాపఫలం బనుభవింపక దీఱునే" యనుచుండ రేవణుండు "విప్రశ్రేష్ఠా! నే నీక్షణంబ శమనునిపురంబు జెచ్చెరం జని యుష్మత్పుత్రులం దోడ్కొని యేతెంచెద. నిర్భయంబుచే శాబకుని కాయంబు దివసత్రయంబు రక్షింపు" మని యమరమంత్రంబు జపియించి ఫాలంబున భస్మంబు దిద్ది యీయర్భకుండు నశించఁడని వాగ్దత్తం బొసంగి శీఘ్రంబున వ్యానాస్త్రంబు జపియించి తద్బలంబుచే జనుచుండి

హిమాచలంబు జేరి సీతలంబుకై యాగ్నేయాస్త్రంబు జపియించి యుష్ణంబు గాంచి జగచ్ఛృతుపుత్రునగరంబున సభామంటపంబు బ్రవేశింప నయ్యమునాభ్రాత బ్రహ్మావీర్యోద్భవుండగు రేవణసిద్ధుని బొడగాంచి చయ్యన సింహాసనంబు డిగ్గి యెదుర్కొని రత్నమయసుఖాసనంబుపై యలంకరించి యర్ఘ్యపాద్యాదివిధులఁ బూజలుసలిపి మధురోక్తులచే మోదపఱచుచు "సిద్ధపురుషా! భవదాగమనకారణం బెయ్యదియో దయజేయు" మన రేవణుం డప్పరేతరాట్సుభాషితంబు లాకర్ణించి "కృతాంతా! మర్త్యలోకంబున సారస్వతనామవిప్రోత్తముని గృహంబున నే నివసించి యుండుతఱి భవద్దూత లేతెంచి నిర్భయంబుచే తద్విప్రపుత్రుని ప్రాణంబు లపహరింపఁదగునే? తత్పూర్వం బప్పారుని పుత్రషట్కంబును హరించితివి గావున నా రెందుగలరో రయంబున గొని తెమ్ము. లేకున్న మత్కోపానలంబుచే శ్రమఁజెందెద" నన యముండు దనమనంబున వితర్కించి మధురోక్తులచే సిద్ధుని శాంతపఱచి యుమాకాంతుని సముఖంబున కంపి ప్రతాపంబు గనవలయు నని దలంచి "సిద్ధశ్రేష్ఠా! హరిహరబ్రహ్మలీ ప్రపంచసృష్టిస్థితిలయంబులకు గర్తలౌట మీ రెఱుంగరే? పద్మజునిచే ప్రభవింపంబడి కమలాక్షు కటాక్షంబున రక్షింపఁబడి హరునిచే సంహరింపంబడుట సర్వలోకవిదితంబుగాదే? నే నమ్మహేశ్వరాజ్ఞానువర్తియై మెలంగెదగాక నన్యంబుగలదే? తాపసోత్తమా! విప్రసుతసప్తకంబు విరూపాక్షునిపజ్జ న్నివసించు. తా మక్కపాలభృత్సముఖంబున కేగి బాలురం బరిగ్రహింపుఁడు. చరాచరప్రపంచక్షయకారుండు రుద్రుండని సర్వశాస్త్రంబులు బలుకుచుండ నాయం దాగ్రహింపఁదగునే? మత్కృతాపరాధలేశంబు భవచ్చిత్తగోచరంబు గాదే" యన రేవణసిద్ధుండు సిక్కంబని దలంచి గ్రక్కున నక్కైలాసంబు జేరంజనెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున రేవణసిద్ధచరిత్రంబు పంచత్రింశాధ్యాయము సంపూర్ణము.

షట్త్రింశాధ్యాయము.

రేవణసిద్ధుఁడు శివునిచేఁ బోరి సారస్వతవిప్రుని పుత్రషట్కంబును గొనితెచ్చుట.

సర్వకళాప్రసిద్ధుండగు రేవణసిద్ధుండు రయంబున రజతాద్రిం జేరి హరనగర మహాద్వారంబు జొరుచుండ దౌవారికరుద్రగణంబులు సిద్ధుని నిరోధించి "భవన్నామం బెయ్యది యేకతంబున నేతెంచితి"వని విచారింప సిద్ధుండు "మన్నామంబు రేవణుండు. సచ్చరిత్రుండగు సారస్వతవిప్రోత్తముని సుతుల హరుండు హరించెనని తెలిసి విచారించుటకేతెంచితి. విజయంబు బడసి బాలురం గొనిపోయెద" నన రుద్రభటులత్యుగ్రమానసులై "పురుషఘనా! నీ వొక గంధర్వుని శిష్యుండవై సిద్ధవేషంబున మెలంగందలంచితివి గాబోలు నుచ్చనీచంబు లెఱుంగక సంభాషించెదవే? జనుజను" మన రేవణుండు దండతాడితమృగరాజంబుకరణి క్రుద్ధుండై "మద్గురుండు గంధర్వుండని నిందించినఫలంబు గొను"మని స్పర్శాస్త్రంబు జపియించి భస్మంబుచే బ్రయోగింప తన్మంత్రప్రతాపంబుచే త్రయోదశశతరుద్రభటపాదంబులు బుడమింగఱచుకొన వారలతిబలసాహసంబులచే లంఘింపందలంచియు జలింపలేక ధరపై కరంబులు మోపి విముక్తికై వివిధోపాయంబులుచేయ కరచరణయుగళంబులు మహీతలం బంటుకొని నిశ్చేష్టితులై చతుష్పాదంబులకైవడి గోచరంబగుచున్న శివగణసమూహంబుతో సిద్ధుండు "మద్గురుశక్తిప్రతాపంబు గనుంగొంటిరే"యనుచుండ నేతద్విపరీతచరిత్రావిర్భూతకోలాహలనినదంబు భర్గుం డాలకించి యాగ్రహంబుచే కల్పాంతకాది భైరవాష్టకంబును బవరంబున కనుప నయ్యసమాన బాహుబల దర్పోద్ధతులగు భైరవులు గదాత్రిశూల ఖడ్గముసల ముద్గరాది సాధనవరిష్ఠంబుల బూని యనేకలక్షరుద్రగణంబులతో సమరంబునకేతెంచి దౌవారిక దురూహ చతుష్పదాకార విపరీతం బువలక్షించి యాగ్రహంబున భయంకరాట్టహాసం బొనర్చి మహోద్దండకోదండంబుచే తీక్ష్ణతర శిలీముఖవ్రాతంబులు సిద్ధునిపైం బ్రయోగింపుచుండ యోగిపుంగవుండు రోషతామ్రాక్షుండై వజ్రాస్త్రంబుచేతచ్ఛరసంఘంబును భంగపఱచి పునః స్పర్శాస్త్రప్రయోగంబున శివగణానీకంబుల చలనవలనాదులు బంధింప నయ్యంతకాంతకాకారులగు భైరవులు స్పర్శాస్త్రంబునకు బద్ధులుగాక

కోపోద్దీపితులై దిగ్గజంబుల నుగ్గడంచు జ్యాఘోషంబు సల్పి యేకము హూర్తంబున వాతాస్త్ర ప్రళయానలాస్త్ర నాగాస్త్ర ధూమ్రాస్త్ర వాసవాస్త్ర బ్రహ్మాస్త్ర వజ్రాస్త్ర విముక్తాస్త్రంబులు బ్రయోగింప నయ్యస్త్రరాజంబులు దిగంతవ్యాపకమై యంబరంబు చుంబించుచు జాజ్వల్యమానంబుచే నజాండంబు గబళించునో యనున ట్లరుదెంచు చుండ ధారాధరజలధారలకు జలింపని మహానగంబుభంగి ధైర్యధుర్యుండగు సిద్ధుండు భస్మంబు గొని గురుప్రతాపంబుచే పర్వతాస్త్ర జలదాస్త్ర ఖగేంద్రాస్త్ర దిత్యాస్త్ర కాళికాస్త్ర స్తవనాస్త్ర శక్రాస్త్ర సంమోహనాస్త్రంబులు గల్పించి బ్రయోగింప నేతన్మహాస్త్రంబులు భైరవాస్త్రంబుల రూపడంచి భైరవుల ముట్టడించి మర్మంబులు దూఱుచుండ బెండువడి విషణ్ణవదనులై విలపించుచున్న భైరవాష్టకసంకటంబులు విలోకించి యొకకొందఱు మేరుచాపుని చేరంజని "శంభో! భైరవులు కంఠగతప్రాణులైరి. సర్వగణసంఘంబులు నిశ్చేష్టితంబులై" రన గోపధ్వజుం డనిల ప్రేరిత దవానలంబుచందంబున కోపపూరితుండై పరశు త్రిశూలాది దివ్యసాధనంబులం గొని రయంబున వృషభవాహనారూఢుండై రణరంగంబునకరుదెంచినంత రేవణుండు కామారిని బొడగాంచి యిమ్మహామహుండు సాధారణకదనంబున కసాధ్యుండని తలంచి వాతాకర్షణ మహాస్త్రంబు జపియించి ప్రయోగించెను. తత్క్షణంబ గిరిజాధవుం డయ్యస్త్రంబుచే శ్వాసోచ్ఛ్వాసంబులు స్తంభింపఁబడి వివశాత్ముండై వృషభపృష్ఠంబు దొలంగి కీలూడినబొమ్మచందంబున బుడమిని వ్రాలి శ్రమజెందుచుండ నీయద్భుతకృత్యంబులు గంధర్వాదులు గనుంగొని త్వరితంబున వైకుంఠంబు జేరంజని శ్రీమన్నారాయణునితో భైరవాదులగర్వనిర్వాపణంబు శివగణదేహశోషణంబు త్రిపురారిశరీరతాపంబువిన్నవింప శీఘ్రంబున రమారమణుం డుమారమణుని నికటంబున కరుదెంచి భయంకరకార్యంబు గనుంగొని రేవణుని డగ్గరంజేరి సప్రేముండై హృదయాలింగనం బొసంగి "సిద్ధముఖ్యా! నీ వేకతంబున క్షోభించి యివ్విపరీతకార్యం బొనర్చితి"వని విచారింప రేవణసిద్ధుండు "భోగిశయనా! సారస్వతనామవిప్రోత్తముని మందిరంబున నే నివసించియుండ హరుండు తద్బ్రాహ్మణకుమారుని ప్రాణంబు హరించె. తత్పూర్వం బయ్యనఘాత్ముని పుత్త్రషట్కం బపహరింపఁబడె గావున మద్గురుశక్తిప్రతాపంబుచే

నీలగ్రీవుని ప్రాణంబులు గొని సంజీవినీమంత్రయోగమహిమాతిశయం బుచే బాలుర న్నిర్మించి తోడ్కొని చనియెద. లేక విప్రపుత్రుల నొసంగెద రేని యుపేక్షింతు" నన లక్ష్మీధవుండు "తపోఘనా! బాలసప్తకజీవంబులు మత్సాన్నిధ్యంబున బ్రకాశించుచున్నవి. యుష్మత్తపోబలంబున శరీరంబులు గల్పించి గొనిపోయెద వేని యొసంగెద. వేగంబున భోగిరాడ్భూషణుని శ్రమ దొలంగింపు" మన నాథుం డవశ్యం బని మంత్రోపసంహారంబుచే వాతాకర్షణ మహాదస్త్రంబును శాంతపఱచి విభక్తాస్త్రంబుచే భైరవాది ప్రమథగణంబుల విముక్తంబుల గావించి గరుడధ్వజునిచే జీవకళాసప్తకంబు గ్రహించి జెచ్చెర విటాగ్రామంబు జేరి విప్రోత్తమునితో "పినూలాత్మా! భవన్నందనుని నిర్జీవకాయంబు పిష్టంబుకైవడి పిండం బొనర్చి పుత్రికాసప్తకంబును గావింపు" మన నతం డట్లగాక యని కడుసంతసంబుచే శిశుశరీరంబు కులాలునిభంగి పిండం బొనర్చి పుత్రికాసప్తకంబును నిర్మింప రేవణసిద్ధుండు సంజీవినీమంత్రయోగంబున తదంగంబుల జీవకళల న్నిలుప కళాపూర్ణులగు డింభకులు రోదనంబులు జేయుచుండిరి. సారస్వతుండు జాహ్నవీదేవిని బిలచి శాబకుల నొసంగ నక్కాంతామణి మితిలేని సంతసంబుచే పుత్రులం బడసి ద్వాదశదివసంబున తొడిచేడియలతో సారంగనాథ జోగీబానాథ నిజానందనాథ నయననాథ యదునాథ నిరంజననాథ గహినీనాథులని నామకరణం బొనర్ప నబ్బాలురు క్రమక్రమంబున వృద్ధిజెంది ద్వాదశాబ్దంబుల వయస్కులై సకలవిద్యానైపుణ్యంబుచే దేజరిల్లుచుండ రేవణసిద్ధనాథుం డనేక తీర్థంబులు సంచరించి యచ్చోటు కరుదెంచి యయ్యుత్తమోత్తమగుణంబగు బాలసప్తకంబున కనుగ్రహం బొసంగి పరిపూర్ణసనాతనమూర్తులంజేయ వార లత్యంతవైరాగ్యమార్గంబుల మెలంగుచుండ రేవణసిద్ధుండు తద్గ్రామంబున వసించి చతురశీతిశిష్యసముదాయంబును యేర్పఱచి నాథపంథీయోగంబున విరాజిల్లంజేయుచు నానందమయుండై కాలంబు గడుపుచుండెను. "శ్రోతలారా! సారస్వత విప్రోత్తముని చరిత్రం బెవ్వండేని భక్తియుక్తుండై నిత్యనియమంబుగ శ్రవణపఠనాదులు సల్పునో యప్పురుషశ్రేష్ఠునకు సుసంతానంబుగలుగుటనిక్కంబు. గతశిశుసుందరీమణి యిక్కథావిశేషంబు ప్రతిదినంబున సుస్నాతయై శ్రద్ధాసహితచిత్తంబుచే నాలకించె

నేని యప్పుడతిమిన్న దోషవిముక్తయై యాయుఃపూర్ణసంతానంబుబడ యుట నిశ్చయం బని గోరక్షసిద్ధుండు నిజహస్తంబుచే లిఖియించెను."

వటసిద్ధనాగనాథజన్మకథాప్రారంభము.

తొల్లి లోకోత్పత్తికారణభూతుండగు నాళీకభవుం డొకనాఁడు నిజకళత్రముఖప్రముఖాద్యవయవలావణ్యయుతశుభగాత్రంబు డెందంబున ధ్యానింపుచు నౌరా! చెలివదనంబు విలోకించి విధుండు సిగ్గుజెడి నక్తంచరుండయ్యెనో! పదంతిపదంబుల పసదలంచి కూర్మంబు భువిని దూఱెనో? సుదతిగ్రీవంబున కోటుబడి వనజం బరభయంకరరవంబు సలిపెనో? తన్విమధ్యంబున కెనలేక మృగరాజు గిరిగహ్వరంబుల జేరెనో? మగువకుచయుగళసౌరభంబు గని చక్రంబులు దివి భ్రాకెనో? రామనూగారు బొడగాంచి యహికులంబు వల్మీకంబుల డాగెనో యన నవాగ్రేవి జగన్మోహనాకారకాంతారభ్రాంతచిత్తంబున పుష్పశరశిఖీముఖనిర్భిన్నహృదయుండై జలింప నింద్రియంబు గళితంబై యొకమహాపన్నగసమక్షంబున బడ నయ్యురగంబు తద్వీర్యశ్రేష్ఠంబును గ్రసించెను. తత్క్షణం బవ్వీర్యంబు పన్నగోదరంబున నండంబై యభివృద్ధిజెందుచుండ యాస్తికమునిపుంగవుండు భవిష్యచ్చరిత్రం బెఱింగి రయంబున నత్తక్షకదుహితయగుపద్మినీనామనాగవధూసమక్షంబున కేతెంచి "నాగకన్యాశ్రేష్ఠమా! నీయుదరంబున వనజోద్భవుని వీర్యంబు గల దందు యవిర్హోత్రనారాయణుండు ప్రవేశించి యవతరించు. ముందొక ఘనవిఘ్నంబు గలదు. జనమేజయుం డహికులనాశనార్థంబై సర్పయాగం బొనర్పుచు తాపసోత్తములచే నాహుతు లర్పించుచు నానానాగంబుల భస్మం బొనర్చును. గర్భరక్షణార్థంబై తరుకోటరంబున భద్రంబుగ నుండు" మని సమీపస్థవటవృక్షంబొకటి గనఁబఱచినంత నత్తక్షకనందిని వృక్షనిష్కుహంబున నివసించెను. ఆ స్తికుండు నిజతపఃప్రతాపంబుచే భూజంబుపై వజ్రకవచంబు నిర్మించి యథేచ్ఛంజనెను. తదుపరి జనమేజయకృతసర్పయాగంబున నయ్యాస్తికుండు ఋతిక్సమూహంబుతో నేతద్రహస్యంబు దెలుపుచు "మునిముఖ్యులారా! తక్షకదుహితృగర్భంబున కమలగర్భుని వీర్యంబు గలదు. జగదుద్ధారనిమిత్తంబై యవిర్హోత్రనారాయణుం డం దుద్భవించి వట

సిద్ధనాగనాథనామంబున విరాజిల్లును గావున మనమా నాగకాంతా మణిని రక్షింపవలయు" నన నవ్విమలాత్ములు తక్షకాత్మజం ద్యజించి యఖిలపన్నగానీకం బవ్విటిహోత్రునిపా లొనర్చుచుండిరి. అట న ప్పద్మినీనాగంబు వృక్షకోటరంబున నండంబుంచ నయ్యండంబు బహు కాలంబు ప్రకాశించుచుండె నం దవిర్హోత్రనారాయణుండు ప్రవేశించి యనుదినం బభివృద్ధి జెందుచుండె నయ్యండంబు భిన్నంబై బాలార్క తేజుండగు బాలుం డుదయించి బహునాదంబుచే రోదనంబు జేయుచుండు సమయంబున నొకకోశధర్ముండను గౌడబ్రాహ్మణుండు వేద వేదాంగవిద్యాభ్యాసనిపుణుండై లేము లనుభవించుచు దీనదశచే నొకనాఁడు వటపత్రంబులకై తన్మహీరుహంబు జేరంజని శిశురోదన రవం బాలకించి బాలుం గానక నలుదిశలు నిరీక్షింపుచుండ సురోత్తములు "కోశధర్మా! వటభూజకోటరంబున నర్భకుండు గలఁడు. భవత్సదనంబునకు గొనిపోయి శాబకుని బోషించితివేని రవిరశ్మిచే దొలంగు తిమిరంబుభంగి యవిర్హోత్రనారాయణస్వరూపుండగు బాలునిచే దూరీకృత దరిద్రదుఃఖతాపుండవై యష్టైశ్వర్యంబు లనుభవించెద" వని బలుకుచు నొకశరప్రయోగంబుచే తరుకోటరముఖచ్ఛేదనం బొనర్ప తత్క్షణంబ మూఢజనహృదయాచ్ఛాదక మాయాతమోభంజన నిర్మల జ్ఞాన సూర్యోదయంబుభంగి ప్రకాశించెడు డింభకుండు గోచరుం డగుచుండ నంతరిక్షస్థిత దేవతానీకం బయ్యపార తేజోమయుండగు బాలునిపై పుష్పవర్షంబు గురిపించుచు కోశధర్మా! బాలుండు లోకోద్ధారనిమిత్తంబై యుదయించెను. వటవృక్షకోటరంబున తక్షకాత్మజా గర్భసంభూతుండై విలసిల్లెంగాన వటసిద్ధనాగనాథుం డని నామకరణం బొనర్పు" మని యంతర్ధానంబు నొందెను. పిదప కోశధర్ముం డతిసంతోషంబుచే బాలుని గొని సదనంబు జేరి నిజకాంతామణియగు సురాదేవిని బిలచినంత సర్వలక్షణసాక్షిస్వరూపవిగ్రహం బనజాలు నత్తోయజాక్షి బాలుని వీక్షించి యాశ్చర్యంబుచే ప్రచ్ఛన్నంబున విచ్చేసిన జగచ్ఛతుండో లేక నాగ్రహంబుచే రుద్రుండు గల్పించిన వేరొండు చంద్రుండో యన నొప్పారు శిశువును ముదంబుచే గైకొని ముద్దులిడుచుండ కోశధర్ముండు శిశులాభాద్భుతచరిత్రంబు సవిస్తరంబుగ దెలియఁ

బఱచెను. సురాదేవి యత్యానందంబుచే బాలుని డోలికనుంచి వటసిద్ధనాగనాథనామకరణం బొనర్చి లాలింపుచుండ దైవికంబుగ స్తనంబుల క్షీరంబు లుదయింప తత్పయః పానంబుచే డింభకుని దృప్తిపఱచుచు నభ్యంగనాద్యశేషోపచారంబులచే దొలంగని మోహంబున బోషింపుచుండ బాలుండు క్రమక్రమంబున సప్తహాయనంబుల వయస్కుండై దేజరిల్లుచుండ నుపనయనాదిసంస్కారంబు లొనర్పంబడి యొకానొకదివసంబున శైశవక్రీడాతురుండై తత్కాశీక్షేత్ర భాగీరథీ తీరంబున గ్రుమ్మరుచు మధ్యాహ్నసమయంబున మారారిమందిరసమీపంబున కేతెంచి స్వసమవయస్కులగు బాలురతో బాడుచు నాడుచు వినోదార్థంబుగ భోజనంబు లిడుచు గొందఱను భుజియింపుడనుచు నొకకొందఱిని బ్రేమచే లాలింపుచు మఱికొందఱిని స్నానంబు లాడుమనుచు ననేకవిధ సంభాషణంబులచే జరించుచుండుతఱి దీనశరణ్యుండగు దత్తాత్రేయుం డకల్పితంబుగ నరుదెంచి బాలకులమిథ్యాభోజనవాక్యంబు లాకర్ణించి హాస్యవదనుండై తనమనంబున నిజభోజనంబులచే బడుచువారల దృప్తిబఱచవలయునని దలంచి శీఘ్రంబున తానొకబాలుండై తత్సమూహంబున బ్రవేశించి "నేనొక యతిథుండనై యేతెంచితి" ననుచుండ జ్ఞానహీనబాలురు "మాశైశవంబులకొక నూతనబాలుం డరుదెంచె" నని యల్లరి జేయుచు జనుజను మని కోపంబున కఠినోక్తులు బలుకుచుండ నాగనాథుండు బాలుర న్విచారించి "యాతిథ్యం బొసంగెద రార" మ్మని నవీనబాలుని డగ్గరం జీరి యొక్కచో గూర్చుండనియమించి రిక్తహస్తంబులచే శాస్త్రోక్తపూజలు సలుపుచు ధూపదీపంబులు భక్తియుక్తుండై యొసంగి నిజభావంబుచే నీరాజనంబు లిడుచు సముఖంబున నైవేద్యంబు మనంబుచే గల్పించి నమస్కారంబులిడుచు బాలచేష్టలచే "స్వామీ! యింకను పదార్థంబు లిడుదునా" యని మృదువాక్యంబు లాడుచుండ దత్తుండు దనచిత్తంబున బాలుని శాంతశమదమాదిగుణంబులు దలంచి యియ్యది పురాకృతఫలవిశేషంబుచే లభియించు ననియు శౌర్యస్థైర్యధైర్యసాహసంబులు విశేషజ్ఞులకు సహజగుణంబులనియు దాతృత్వభోక్తృత్వ వక్తృత్వాది విశేషంబులు ధీరమతుల ముఖ్యలక్షణంబు లనియు వితర్కించి

యిప్పురుషుని పూర్వజన్మం బెట్టిదనుచు నవిర్హోత్రనారాయణుండని యూహించి కరుణాంతరంగుండై యియ్యుత్తమశ్లోకుని ముఖోదితవాక్యంబులు సుప్రసిద్ధంబులై విలసిల్ల నొనర్పవలయు నని రయంబున వటసిద్ధనాగనాథుని నేకాంతంబునకు దోడ్కొనిచని "వత్సా! నీవాక్యంబులచే నేపదార్థంబులు గోరెదవో నయ్యవి తక్షణంబ సిద్ధించు నాసిద్ధాన్నపదార్థంబు లెందరేని భుజియించినను లోపంబులు గానేరవు. నీ వా పదార్థంబులు భుజియింపకు" మని వరం బొసంగి "నేను దత్తాత్రేయుండ" నని దనస్వరూపంబు దెలిపి యంతర్ధానంబు నొందెను. తదుపరి నాగనాథుండు సర్వబాలురకు షడ్రసాన్నంబులు గల్పించి పఙ్క్తిభోజనంబులిడ దృప్తింజెంది దమతమనిజధామంబులు జేరంజని యిప్పగిది ప్రతిదినంబున శైశవక్రీడావినోదంబులచే బాలుర దృప్తిపఱచుచుండ వారా యపూర్వమధురసాన్నంబుల దనివితీర పిదప నిజసదనంబుల కేతెంచి భోజనాపేక్ష లుడిగి బ్రహ్మానుభవ జ్ఞానపూర్ణుండు మాయాజాలప్రపంచభోగంబుల నాశింపనిచందంబున మణిఖచి తసువర్ణభూషణాలంకృతుండు కాచంబుల లక్షింపనివిధంబున నింద్రనీలమణిచిత్రిత కుడ్యయుత సౌధాంతర్నివాసులు తృణనిర్మితగృహంబుల నరకుగోననిక్కై వడి గృహభోజనంబులు దుచ్ఛంబులని దలంపుచుండ దత్తద్బాలుర జననీజనకులు "భోజనాపేక్షలే యుడిగితి" రని విచారింపుచుండిరి. వారి చరిత్రంబు వెల్లడి యొనర్పుచు "మాకత్యంతమధురతర భోజనంబులు గంగాతటంబున నాగనాథునిచే ప్రతిదినంబు లభియించు" నని ప్రత్యుత్తరంబు లొసంగ నియ్యవి మృషావాక్యంబులని తలంచుచు గుప్తరూపంబున భాగీరథీతీరంబు జేరి నిజలోచనంబులచే సన్నగోద్భవుని యద్భుతచరిత్రంబు విలోకించి యొకరిలో నొకరు నాగనాథుగుణంబు లుగ్గడించుచు నొకకొందఱు కోశధర్ముని తో "పురుషముఖ్యా! యుష్మత్తనయుండు లోకత్రయపావనియగు గంగాతటంబున షడ్రసోపేతభోజనంబులచే మాబాలురం బ్రతిదినంబున దృప్తిపఱచుట నీవెఱింగితివే! సంకల్పమాత్రంబున నఖిలపదార్థంబులు సిద్ధపఱచి పఙ్క్తిభోజనంబు లిడుచుండు" నన కోశధర్ముండు దనహృదయంబున నిర్జరానీకవాక్యంబులు దలపోసియు "మీబాలు రనృతంబు లాడెద" రని ప్రత్యుత్తరంబు లొసంగుచు

నొకనాఁడయ్యపారచరిత్రుండగు వటసిద్ధనాగనాథుని తనయంకంబుపై నుంచుకొని మూర్ధంబు నివురుచు "కుమారా! తోడిబాలుర కెప్పుగిది ప్రతిదినంబున భోజనంబు లిడుచుండెద" వన నాగనాథుండు త్వరితంబున నంకంబు డిగ్గి గనుంగొను మని రిక్తహస్తంబులు బుడమిపై మోపి సంకల్పమాత్రంబున ననేకభోజనపదార్థంబులు సిద్ధపఱచెను. కోశధర్ముం డాశ్చర్యంబున "వత్సా! నీకీ కౌతుకం బే మహాపురుషునిచే లభియించెనో యెఱుంగింపు" మన వటసిద్ధుండు "జనకా! నే నొకనాఁడు గరళకంఠుని మందిరసమీపంబున బాలురతో నాడుచుండ నొకనూతనబాలుం డాతిథ్యం బొసంగు మని యేతెంచినంత భవదాచరిత యతిథిసత్కారంబులు మదిదలంచియబ్బాలునకు మృషావాక్యంబులచే నర్ఘ్యపాద్యాది బూజలసల్పి తద్వదోభ్భజనంబిడ నవ్విమలాత్ముండు న న్నేకాంతంబున కీడ్చుకొనిజని యెద్దియో మత్కర్ణపుటంబున నూది నిజభోజనంబులు సిద్ధించు ననియు తా దత్తాత్రేయుండ ననిబలికి యంతర్ధానంబు నొందె. తదాది మద్వాగుదితప్రకారంబుగ భోజనంబులు లభియించుచుండె" నని సవిస్తరంబుగ దేటపఱచెను. కోశధర్ముం డతిసంతసంబుచే స్వగృహాగతుల కాతిథ్యం బొసంగందలంచి ప్రతిదినంబున నానా దేశబ్రాహ్మణోత్తములకు బాలునిచే భోజనాది సత్కారంబు లొనర్పించుచుండ క్రమక్రమంబున నేతత్కీర్తి దిక్కులు పిక్కటిల్ల వ్యాపించిన నొక్కొక్కదివసంబున లెక్కకందని బ్రాహ్మణాదు లొక్కుమ్మడి నేతెంచి దమతమ యక్కఱలు దీర్చుకొని చొక్కనుగు నాగనాథసిద్ధునిగుణంబు కొనియాడుచు నేగుచుండ నొకకొన్నివత్సరంబులు గడచినంత పద్మభవపీఠోద్భవుండగు నాగనాథుండు యుక్తవయస్కుండై యొకనాఁడు కోశధర్మునితో "నాయనా! మద్బాల్యంబున దత్తాత్రేయనాముండు దర్శనం బొసంగి యమితోపకారం బొనర్చె. తత్ప్రభృతి పునర్దర్శనంబు ఘటియింపదయ్యె. మచ్చిత్తం బమ్మహాముని దర్శనార్థంబై యపేక్షించుచున్న" దన కోశధర్ముండు "పుత్రా! ప్రత్యక్ష త్రిమూర్తిస్వరూపుండగు దత్తాత్రేయదర్శనంబుపరమయోగీంద్రులకైన లభ్యంబగునే? నిఖిలలోక జేగీయమాన గుణకదంబుండగు దత్తుం డొక్కచో నివసించునే? యయ్యఖిలేశ్వరుండు ప్రచ్ఛన్నంబున నానాపుణ్యక్షేత్రంబులు ద్రిమ్మరుచుండు. బహుజన్మసంస్కారపుణ్యవిశే

మఫలలబ్ధసురభూజ సురధేనువులచందంబున లభియించుంగాక నప్పరా
త్పరస్వరూపునిదర్శనంబు ఘటియించుట దుర్లభంబుగాదే? ప్రయత్నం
బులు వ్యర్థంబు" లని బలుకుచు సంసారకార్యార్థియై సదనంబు వెడలి

నాగనాథుండు శ్రీగురుదత్తదర్శనార్థంబై కొల్హాపురంబున కౌతుకంబులు చేయుట.

జనుచుండెను. వటసిద్ధుండు దనహృదయంబున దత్తదర్శనాపేక్షాబద్ధుం
డై కోశధర్మున కెఱుంగింపక బయలు దేరి మాతాపురపాంచాలేశ్వరాది
మహాక్షేత్రంబులు శోధింపుచు కొల్హాపురనగరంబు జేరి తత్క్షేత్రవాసుల
తో "నత్రిసూనుం డెందు గలం" డని విచారింపుచుండ వార లత్యంతాశ్చ
ర్యరసపూరితవదనులై "యారా! దత్తుండు ప్రకటుండై పరిభ్రమించు
ననుట వేదుఱుగాదే? త్రిజగద్వంద్యుండగు దత్తావధూతుండు భిక్షా
ర్థంబై యేవేషంబున నేతెంచునో గనుంగొన శక్యంబగునే" యన
నాగనాథుండు "దయాఘనులారా! దత్తుండు భిక్షాన్నంబుకై యన్య
క్షేత్రంబుల కేగడో" యన నయ్యనఘాత్ములు "పురుషముఖ్యా! త్రిమూ
ర్ధనుం డేతత్ క్షేత్రాన్నంబు బరిత్యజించి యితరక్షేత్రపదార్థంబులు స్వీక
రించునే! యేకపత్నీవ్రతుం డితరభామినీమణి జగన్మోహనాకారంబున
కాశింపనికరణి విప్రుండు బ్రాహ్మణాన్నంబు వర్జించి రసభరితశూద్రా
న్నంబు గోరనిచందంబున నగణితపుణ్యమయక్షేత్రంబు లనేకంబు
లుండినను దత్తుండు తత్ప్రదేశప్రసోపేత పక్వాన్నంబులు దలంపక
నేతత్తీర్థవృక్షశాఖాపర్ణంబులైనం భుజియించి దృప్తిం జెందు" నని
ప్రత్యుత్తరంబు లొసంగ నాగనాథుండు దనచిత్తంబున నిచ్చో నివ
సించి నిఖిలజనాళికి బహువిధరసపూరిత భోజనంబు లిడుచుండెదనేని
యిప్పురజనులు దమసదనంబుల పాకక్రియలు మాని యిందే తెంతురు.
దత్తాత్రేయుం డన్యగృహంబుల నాహారంబు లభింపమిం జేసి భిక్షాన్నం
బుకై మత్సన్నిధానంబున కరుదెంచును. తొల్లి వాక్సిద్ధినిర్మితపదార్థం
బులనను భుజియింపవలదని యాజ్ఞాపించిన ఘనుండై తానేలమత్కల్పి
తాహారంబులు భుజియించు నక్షణంబున యోగిజనవందితాంఘ్రియు
గళుండగు దత్తును బరిశీలించి గనుంగొనియెద నని సదుపాయంబు
దలంచి శ్రీమహాలక్ష్మీదేవళంబున నివసించి యొకకొన్నిదినంబు లయ్యా
ర్చకోత్తమునకు భోజనంబు లిడుచుండి యొకానొకదివసంబున నయ్యా

నఘూత్మునితో "దయామయా! ఏతద్గ్రామస్థిత బాల వృద్ధ స్త్రీ పురుష నిఖిల జనానీకంబునకు విందొనర్పవలయు నని కుతూహలంబు గలదు. భవత్సహాయంబుచే నిక్కార్యంబు సఫలంబగు" నని వేడుచుండ నయ్యర్పకశ్రేష్ఠుండు దరహాసితవదనుండై "సకలజన తృప్తికరపదార్థంబు లెందుగల" వని యుత్తరంబు లొసంగియు "పురుషఘనా! యుష్మత్సంకల్పిత పుణ్యకార్యసహాయం బొనర్చుట ముఖ్యధర్మంబు గాదే" యని నుడువుచు నిజభవనంబు జేరంజనిన పిదప వటసిద్ధనాగ నాథుం డొక యుగ్రాణంబులో భక్ష్యభోజ్యలేహ్యచోష్యానుకూల నానావిధపదార్థంబులు సిద్ధపఱచి యయ్యర్పకుని సదనంబున కరిగి రయంబున దోడ్కొని దేవళంబున కేతెంచి స్వనిర్మిత పాకానుకూల పదార్థంబులు గనబఱచెను.

ఇతి భక్తిసార నవనాథచరిత్రంబున రేవణసిద్ధనాథచరిత్రంబును వటసిద్ధ నాగనాథ జన్మాది కథనంబు షట్త్రింశత్యధ్యాయము సంపూర్ణము.

సప్తత్రింశాధ్యాయము.

నాగనాథుఁడు మత్స్యేంద్రనాథునితో యుద్ధంబొనర్చుట

వటసిద్ధనాగనాథుండు సిద్ధికల్పిత బహువిధపదార్థంబు లర్పకోత్తమునకు జూపి యేతత్కొల్హాపురనివాసి బ్రహ్మక్షత్రియ వైశ్యశూద్రాంత్యజాది సర్వవర్ణ బాలవృద్ధస్త్రీపురుషులకు నీచోచ్చభేదంబులు దలంపక వలయువేళల వాంఛిత భోజనంబులను దినం బిడవలయు నన నతం డత్యంతహర్షమానసుండై శీఘ్రంబున నొకకొందఱ పరిచారికులం బిలచి తద్దేవాలయసమీపవిశాలప్రదేశంబున నొకకొన్నిమంటపంబులు నిర్మింప నియమించి కుశలమతులగు విప్రోత్తములచే పాకంబు లొనర్పించుచు రయంబున బ్రాహ్మణోత్తముల సదనంబులకేగి యామంత్రణంబు లొసంగి సకలవర్ణసర్వజనభోజనంబులకై వీథివీథులం జాటుచు వెల్లడియొనర్చి మతాంతర్భేదంబులకై ప్రత్యేకప్రత్యేకస్థలంబున పాకంబు లొనర్పింప పంచద్రావిడ పంచగౌడ కరాడ చిత్పావన ఘూర్జరాది నానావిధభేదబ్రాహ్మణోత్తములు శైవ వైష్ణవ శాక్తేయ

సౌర గాణాపత్య కాపాలికాది బహువిధమతజాతుల బాలవృద్ధస్త్రీపు రుషసముదయంబు లేతెంచి దమతమ యథేష్టమధురతరపాయసాది పదార్థంబులు భుజియించుచు నేకద్విత్రివారంబులనక క్షుత్సమయంబుల యాహారంబులు గైకొని దృప్తులై నిజధామంబుల కరుదెంచుచుండ నిట్లొకమాసంబు గడచెను. త్రిలోకవంద్యుండగు దత్తాత్రేయుండు తత్ప్రథమదివసంబున కుతూహలుండై ప్రతిగృహంబున కేతెంచి భిక్షాన్నంబు విచారింప నాగృహస్థు "లయ్యా! నీవెట్టిదార్భాగ్యుండవు సురభూజాశ్రితుండు పరాన్నంబుకై యాచించినక్రియ లబ్ధస్పర్శవేది పురుషుండు సువర్ణంబుకై విలపించినవిధంబు దేవళంబున రసభరిత మధురాన్నంబులు బరిత్యజించి యిం దేతెంచుట చిత్రంబుగాదే? మేమా సమారంభభోజనంబులచే దృప్తులమై స్వగృహంబుల పాకంబులేల నొనర్చెదమో నీవెఱుంగవే? తక్షణంబ దేవాలయంబు జేరం జని నీయథేష్టంబుగ దృప్తిం బొందు" మని బలుక దత్తుండు ప్రతిగృహంబున నిప్పగిది ప్రత్యుత్తరంబులు బొంది యన్నంబు గానక దన మనంబున సకలజనసంఘంబునకు భోజనంబులిడు ఘనుం డెట్టివాఁడో నిరీక్షింపవలయు నని దలంచి దేవళంబున కరుదెంచి పాకకౌతుకంబు ల్విలోకింపుచు పాకసమయంబున గోచరంబగు పదార్థలేశంబు తదుపరి పర్వతాకారంబులై విలసిల్లుట బొడగాంచి యియ్యది క్రియాసిద్ధిప్రతాపంబని యూహించి తత్సమీపస్థితమనుజులతో నిమ్మహాకార్యాధిపతి యెవ్వండని విచారింప వారలు వటసిద్ధనాగనాథుండని దెలియఁబఱచిరి. దత్తాత్రేయుండు దనడెందంబున వింశతివత్సరంబులకు మున్ను వటసిద్ధనాగనాథుండు. కాశీక్షేత్రంబున బాలుండై యాడుచుండ నయ్యమలాత్ముని సుగుణంబులు గాంచి వాక్సిద్ధికై వరం బొసంగితి ననియు వటసిద్ధుండు పూర్ణవయస్కుండై మద్దర్శనార్థం బిం దేతెంచి యికార్యంబు దలపెట్టి భిక్షాన్నదుర్లభం బొనర్చె ననియు నిశ్చయించి యచ్చోటుబాసి జనుచుండ నొకకొంద "ఱిక్లేల భోజనం బొనర్పక జనియెద" వని నిరోధించిన లక్షింపక యథేచ్ఛం బురంబున సంచరించి యాయవారంబు గొని కాశీక్షేత్రంబున కరిగి తద్ధాన్యాహారం బొనర్చి యిట్లొకమాసంబు గడపినంత నిట నాగనాథుండు మత్సంకల్పితకార్యంబు ఘటియింపదయ్యెనని వితర్కించి పురజనులతో "గ్రా

మంబున నెవ్వండేని భిక్షాన్నంబుకై సంచరించునే” యని విచారింప వా రయ్యకలంకవటసిద్ధునితో “పురుషముఖ్యా! యొకభిక్షుకుం డేతన్న గరంబున కనుదినం బేతెంచి భవత్సమారంభ పరిపక్వాన్నం బపేక్షింపక తా నొకవ్రతస్థుండనని గ్రామంబున ధాన్యభిక్షుం బరిగ్రహించి యేగుచుండు” నన నాగనాథుండు వారితో “శిష్యులారా! తమతమసదనంబులకే తదన్నంబు గొనిజని యబ్భిక్షుకుం డేతెంచినంత నీయన్నంబు నాగనాథ సమారబ్ధ ప్రయోజన పక్వాన్నం బనుచు నొసంగుఁ డయ్యమలాత్ముండు పరిగ్రహింపఁడేని తత్క్షణంబున మత్సన్నిధానంబున కేతెంచి దెలుపు” మని యాజ్ఞాపించి యన్నం బొసంగెను. తదవ్వ త్పౌరు లా యన్నంబు గొని నిజధామంబులఁ జేరి మధ్యాహ్నసమయంబున ప్రచ్ఛన్నస్వరూపుండగు భిక్షుకుం బొడగాంచి “సమర్థా! వటసిద్ధనాగనాథునిచే నన్నంబు బరిగ్రహింపరేని యస్మత్కరంబులచే నేతదన్నంబు గ్రహింపుఁ” డని విన్నవించిన స్వీకరింపకుండిన వేగంబున నప్పౌరులు సిద్ధుని జేరంజని విశదం బొనర్చిరి. వటసిద్ధుండు జెచ్చెర వియచ్చరవందితుని సముఖంబున కేతెంచి యడుగులపై నొసలు మోపి “యోగిజనధ్యేయా! మద్బాల్యంబున దర్శనం బొసంగితివి. తదాది వింశద్వత్సరంబులు గడచినను పునర్దర్శనం బనుగ్రహింపకుండుట దగునే! జనకుండు మహారణ్యంబున నిజతనూభవుని త్యజించిన చందంబున నిర్దయుండవై న న్నుపేక్షించుట కెట్లు దలంచితివో దయామయా! నీకీ కఠినం బేల గలిగెనో నన్నేల మఱచితివో భవద్దర్శనార్థంబై చంద్రచకోరంబుకై పడి నిరీక్షించెడుసుతుం బరీక్షింపఁదలంచుట పాడియగునే? నిఖిలేశా!” పాపభయనాశా! నిగమనుతపదములచిత్ప్రకాశా! సురేశా! యని నేత్రాంబువులచే పాదాంబుజంబులయభిషేకం బొనర్చుచు రోదనంబు జేయుచుండ దయాంతరంగహృదయుండగు దత్తుండు నాగనాథుని చిత్తంబు దిలకించి దనహస్తంబులచే సిద్ధుని మస్తకంబు లేవనెత్తి రారమ్మని రయంబున నేకాంతప్రదేశంబునకు దోడ్కొని జని మూర్ధంబు బునుకుచు నశ్రులు దుడిచి “వత్సా! జింతింపవల” దనుచు ఘనకరుణాకటాక్షంబుచే బ్రహ్మసాక్షాత్కారం బొనర్ప నిష్కళంక పరతత్వజ్ఞానపరిపూర్ణుండై రాహుముక్త ప్రభాకరునిభంగి సర్వమయత్వంబున బ్రకాశించుచుండ నయ్యపారచ

రిత్థుండగు దత్తాత్రేయుండు "నాగనాథా! నీవు యవిర్హోత్రనారాయణుండవై జగదుద్ధారనిమిత్తంబున విధివీర్యంబుచే సర్పగర్భంబున నుద్భవించిన దెఱింగి నిన్ను బాల్యంబున సిద్ధకళాపూర్ణుండవగున ట్లనుగ్రహించితిని. తదుపరి భవస్స్వరూప ప్రకటంబునకై పునర్దర్శనం బొసంగవలయునని సుచ్ఛిత్తంబున నెంచి యుచితసమయంబు నిరీక్షింపుచుండ నయ్యది నేఁడు సంఘటించె" ననుచు హృదయాలింగనం బొసంగి శీఘ్రంబున వ్యానసుంత్రంబు జపియించి వటసిద్ధుని నిటలభాగంబున భస్మంబు దిద్ది కాశీక్షేత్రంబునకు గొనిపోయి కొంతవడి నచ్చో విశ్రమించి రయంబున బదరికాశ్రమంబు జేరంజని నిటలాక్షుని నిలయంబున కేగ నుమారమణుం డనసూయాతనయుని కుశలప్రశ్నంబులు విచారించి "ద్వితీయపుణ్యపురుషుం డేల నరుదెంచె" నని విచారించెను. దత్తుండు చంద్రచూడునితో "నియ్యకలంకుం డవిర్హోత్రనారాయణావతారుండగు నాగనాథుం" డని సవిస్తరంబుగ విన్నవింప నవ్విషగళుండు సంతుష్టుండై "నాగనాథుని నాథపంథంబున విరాజిల్ల నొనర్పవేల" నన నత్రిసూనుం డవశ్యం బని యచ్చో షణ్మాసంబులు నివసించి వటసిద్ధనాగనాథున కనేకమంత్రార్థరహస్యంబు లుపదేశించి సకలవిధవిద్యాభ్యాసంబు లొనర్పించి యాపిదప నాగాశ్వత్థవృక్షరాజనికటంబునకు దోడ్కొని జని సర్వదేవతాప్రత్యక్షంబులు గావించి పునర్బదరికాశ్రమంబున కేతెంచి శైలీసింగీత్యాది నాథపంథీదీక్షాచిహ్నంబు లొసంగి తపంబుకై నియమించెను. వటసిద్ధనాగనాథుండు ద్వాదశాబ్దంబులు ఘోరతరతపం బాచరించినంత నత్రినందనుండు తపస్సిద్ధికై ముల్లోకవేల్పుల నావాహనం బొనర్చి నాగనాథునకు వరంబు లిప్పించి నిఖిలపుణ్యతీర్థంబులు సేవింపు మని యాజ్ఞాపించి తా గిరినారపర్వతంబు ప్రవేశించెను. నాగనాథుండాచార్యోక్తప్రకారంబున ననేకతీర్థంబులు సంచరించుచు వడవాళగ్రామంబున కేగి నివసించియుండ తత్ప్రదేశంబున సిద్ధుని మాహాత్మ్యంబులు ప్రకటంబౌచుండ నానాజనపద జనసమూహంబులు నాథుని దర్శనార్థం బరుదెంచి సవినయభక్తిభావంబులచే ప్రస్తుతుల్ జేయుచు "యోగప్రభూ! మహాఘనుండవై యిచ్చో నివసింపు" మని గొనియాడుచు కాలంబు గడుపుచుండి రిట్లొక కొన్నిదివసంబులు గడచి

నంత నొక్కానొకసమయంబున తాపసోత్తముండగు మత్స్యేంద్రనాథుం డచ్చోటికి కరుదెంచి వటసిద్ధనాగనాథుని కీర్తనీయగుణజాలంబు లాలకించి దర్శనార్థంబై మఠద్వారసమీపంబున కేతెంచియుండ దౌవారికుం డంతర్గమనంబు నివారించి "పురుషముఖ్యా! నాగనాథున కెఱింగించి దోడ్కొని జనియెద" నన మత్స్యోదరసంభవుం డాగ్రహచిత్తుండై దనడెందంబున నౌరా! దేవద్వార సాధుద్వారంబులు సర్వకాలంబుల నఖిలజన నిరాటంకంబులుగాక నిరోధింపఁబడుట విపరీతంబుగాదే? కపటవేషంబులచే సత్పురుషవ్యవహారంబులు గనబఱచు డాంబికుండు గానోపును? లేకున్న నిట్టి దుశ్చరితంబు లేలసగుపడు? మత్ప్రతాపంబుచే శిక్షించి యజ్ఞానంబు బాపెద" నని నిశ్చయించి దౌవారికుని కపోలంబుపై తాడనం బొనర్ప తత్క్షణంబ సప్తశతశిష్యసంఘంబు కోపోద్దీపితమానసులై బరుగెత్తుచు నేతెంచి మత్స్యేంద్రయోగివర్యుని జుట్టుముట్టిన వసుపుత్రుండు స్పర్శాస్త్రయోగంబుచే తచ్ఛిష్యజనపాదంబులు బంధించి సర్వజనముఖతాడనం బొనర్ప వారత్యంతఖేదమానసులై మహాధ్వానంబుచే రోదనంబులు జేయుచుండిరి. నాగనాథుండు ధ్యానయోగసమాధినిష్ఠాగరిష్ఠుండై దేజరిల్లుచు నేతత్కోలాహలనినదం బాలకించి తపోభంగం బొనర్చిరని కోపావేశుండగుచు స్వాంతంబున బహిర్ద్వారంబున కేతెంచి స్తంభమానశిష్యజనసముదయముఖతాడనం బొనర్చుచున్న సిద్ధుని బొడగాంచి నాథపంథీమహాపురుషుండని దలంచియు దనహృదయంబున నేతత్తాపసుండు శాంతశమదమాది గుణవర్జితుండై దుస్సహాకఠినత్వంబుచే తాడనం బొనర్చుట నాథపంథంబునకు నింద్యంబు వాటిల్లదే? నీచాత్ముని దుష్ప్రవర్తనంబులు శిక్షించినగాని దొలంగనని దలంచి భస్మంబుగొని విభక్తాస్త్రంబుచే శిష్యులను విముక్తిబఱప వారతివేగంబున బరుగు లిడుచు నాగనాథుని పృష్ఠభాగంబు జేరుచుండ మత్స్యేంద్రుం డత్యుగ్రుండై పిష్టం బొనర్తునని పర్వతాస్త్రప్రయోగం బొనర్చిన నొకమహానగంబు భయంకరాకారంబుచే నేతెంచుచుండ నహిగర్భోద్భవుండు వజ్రాస్త్రంబుచే భూధరంబు బొడిసేసిన నమ్మత్స్యోదరజనితుండు వజ్రాస్త్రంబుపై గోపించి తద్వజ్రాస్త్రాధిపుం డగు బిడౌజుని గీటడంపం దలంచి వాతాకర్షణ మహాదస్త్రంబుచే

నయ్యమరేశుని బుడమిం బడవైచి వజ్రకాళీవిద్యానైపుణ్యంబుచే నాగనాథప్రయోగకృత దివ్యాస్త్రస్వరూపంబు మాపిన కమలజవీర్య జాతుండు వాతప్రేరకాస్త్రంబుచే వాసవుని శ్రమ దొలంగించి తత్సహాయంబై జలదాస్త్రంబు బ్రయోగింప నమ్మఘవంతుం డిడుములం బాసి తత్క్షణంబ మేఘవాహనారూఢుండై యుభయనాథుల యద్భుత విక్రమంబునకు కడుభయంబొంది నిజస్థానంబు జేరంజనెను. కళాకుశలుండగు మత్స్యేంద్రుండు వాసవశక్తినిర్జించి నాగనాథునిపై బ్రయోగింప నమ్మహాశక్తి నింగిముట్టి యశనిపాతంబులభంగి పెడబొబ్బలిడుచు పక్వపర్ణంబులక్రియ భూజంబులు వ్రాల కందుకంబులకైవడి భూధరంబులు దూల్ల గిరిగహ్వరంబుల ప్రతిధ్వనులు చెలరేగి దిశలునిండ దిగ్గజంబులు వడంక శేషుండు చలింప బృథ్వి గంపింప క్షణమాత్రంబున నజాండంబు గబళించునోయన నరుదెంచుచుండ వటసిద్ధనాగనాథుం డతిసాహసుండై గురుప్రతాపమంత్రశక్తిచే సకలాస్త్రసర్వదేవతాస్తంభనంబొనర్చి యత్యంతదారుణంబగు కనకాద్రిని గల్పించి వాసవశక్తిపై బడవేసిననమ్మత్స్యేంద్రుం డమ్మహీధరభంగంబుకై వజ్రాస్త్రనిర్మాణంబు జేయందలంచి తన్మంత్రరాజంబును ధ్యానింప నయ్యస్త్రాధిదైవతనాగనాథునిచే బంధింపఁబడినకతంబున ప్రసన్నంబు గాకుండిన నాశ్చర్యంబుచే ననేకదివ్యాస్త్రమంత్రాధిదేవతలం బ్రార్థించిన నయ్యవి సిద్ధింపకున్న ఖేదమానసుండై నలుదిశలు నిరీక్షింపుచుండు సమయంబున వటసిద్ధనాగనాథుండు సర్పాస్త్రంబు బ్రయోగింప మత్స్యేంద్రుండు గారుడాస్త్రంబు జపియించి విఫలమనోరథుండై యత్నంబు గానకున్నంత నప్పన్నగాస్త్రప్రయోగమహిమాతిశయంబుచే యోగద్రుముండగుమత్స్యేంద్రుం డనేకనాగకులదంశుండై తద్విషజన్యతాపంబుచే మహింబడి విలపించుచు నూర్ధ్వముఖుండై దయాసముద్రుండగు దత్తాత్రేయుని పదంజంబులు దనమనంబున గుదురుపఱచి "దాసజనపోషా! దోషహరగుణవిశేషా! సర్వసాక్షిస్వరూపుండవై నన్నేల నిరీక్షింపవో! దత్తా! దిగంబరా! ప్రత్యక్షహరిహరా! మత్ప్రాణంబులు హరియింపుచుండ నీకేల లక్ష్యంబు లేదయ్యెనో? నాపాలిదైవమా! నాపైనకోపమా? ననుగడతేర్చ ననుమానమా" యని స్తోత్రంబులు జేయుచుండ వటసిద్ధుండు శ్రీగురుదత్తాత్రేయుని నామధ్యానధ్వానం బాలకించి మద్గురునామసం

కీర్తనం బేలనొనర్చునో విచారించి గనుంగొనవలయునని యూహించి నికటంబు జేరి "పురుషఘనా! యుష్మద్గురుసమర్థుని నామధేయం బెయ్యదియో దెలుపు" మని స్నేహభావంబుచే విచారింప మత్స్యేంద్రుండు నే శ్రీగురుదత్తాత్రేయప్రథమశిష్యుండ ననియు నాయనంతరం బయ్యేకలంకునకు జాలంధర భర్తరీనాథాదులు శిష్యులై చిరంజీవిత్వంబుచే విరాజిల్లుచుండి" రన నాగనాథుండు ఖేదమానసుండై తత్క్షణంబున తార్క్ష్యుని బంధవిముక్తి యొనర్చి యాహ్వానం బొనర్ప నవైనతేయుండు రయంబున నేతెంచె నంత నయ్యురగంబులు బహుభయంబుచే నదృశ్యంబులై దమతమనిజనివాసంబులు జేరంజనెను. పిదప యానాగాంతకుం డుభయనాథులకు వందనంబు లాచరించి స్వస్థానంబు ప్రవేశించెను. వటసిద్ధుండు దనచిత్తంబున జ్యేష్ఠభ్రాతృండు పితృసముండని నిశ్చయించి మత్స్యేంద్రయోగివర్యుని పదంబులకు వందనంబు లాచరించి యత్యంతభక్తియుక్తుండై మఠాంతర్గృహంబునకు దోడ్కొని జని క్షమాపణంబు గోరుచు బహుగౌరవంబుచే నొకమాసంబు గడుప నొకానొకదినంబున మత్స్యేంద్రుండు నాగనాథునితో "తాపసశ్రేష్ఠా! మఠద్వారంబున దౌవారికుల నేల నేర్పఱచితివి? దర్శనోత్సుకుల నిర్బంధింపఁనగునే? యస్మదన్యోన్య కలహకారణం బియ్యదిగాక నితరంబు గలదే" యన నాగనాథసిద్ధుండు "వసుపుత్రా! నే నహర్నిశంబులు ధ్యానయోగసంధానంబుచే నేకాంతంబున నివసించి యుండుదు నన్యజనాగతంబుచే మత్తపోభంగంబునకు మూలంబగునని ద్వారరక్షకులు నియమింపఁబడి" రన మత్స్యగర్భోద్భవుండు "పన్నగోద్భవా! జగదుద్ధారనిమిత్తం బవతరించి భవలతాబద్ధంబగు పురుషాళిఁ గడతేర్చకుండుట విరుద్ధంబుగాదే? భక్తిభావంబులచే నేతెంచు ముముక్షుల యభీష్టంబు లొనగూర్చుట ముఖ్యధర్మంబుగాన నీకమీఁద దౌవారికుల దొలంగింపు" మని వాక్రుచ్చి తీర్థయాత్రోద్దేశంబుచే మత్స్యేంద్రుండు పనివినియెను. తదుపరి నాగనాథుండు ద్వారపాలకుల దొలంగించి దర్శనోత్సుకులు నిరాటంకంబుగ ప్రవేశింపవచ్చునని యాజ్ఞాపింప ప్రతిదినం బనేకజనసంఘంబు లేతెంచి సవినయభక్తివిశేషంబులచే సిద్ధుని సేవింపుచు మహోత్సాహంబున కాలంబు గడుపుచుండ నొకానొకదినంబున ప్రియశి

ష్యుండగు చాంగుణుని కాంతామణి తన్మరప్రదేశంబున పంచత్వంబు నొందెను. వటసిద్ధనాగనాథుండు నిజశిష్యుని పరితాపంబు మాన్పం దలంచి యమ్ముద్దియం బ్రతికింప నీయద్భుతకృత్యంబు సర్వలోకవిదితంబై తదాది వడవాళగ్రామంబున మృతిజెందిన స్త్రీపురుషకళేబరంబులు మఠంబున బాఱవైచుచుండిన నన్నాథుండు దయాంతరంగహృదయుండై నిర్జీవకాయంబుల సజీవంబు లొనర్పుచు జగద్విఖ్యాతి గాంచుచుండ కృతాంతుండు భీతిల్లి సత్యలోకంబున కేగి పద్మగర్భుని తో సహిగర్భేశ్వరుని యద్భుతచరిత్రంబు విన్నవించిన చతురాననుండు తత్క్షణంబున వడవాళగ్రామంబు బ్రవేశించి యనేకవిధంబుల నాగనాథునకు బోధించి తత్కార్యంబు నిరోధించి స్వస్థానంబు జేరంజనెను. తదనంతరంబ వటసిద్ధనాగనాథుండు చాంగులసిద్ధ ధర్మసిద్ధ దేవసిద్ధ భానుసిద్ధ భోజనసిద్ధ సుందరసిద్ధ సచ్ఛిష్యషట్కంబునకు సకలమంత్రార్థరహస్యంబు లుపదేశించి నాగాశ్వత్థ మహీరుహాశ్రిత నిఖిలదేవతాప్రసన్నంబు గావించి శాబరీవిద్యాకవిత్వరచనావివేకంబనుగ్రహింప నయ్యనులాత్ములగు నూతనసిద్ధులు నిఖిలజనదుఃఖకారకులగు భూత ప్రేత పిశాచ సర్పవిష వృశ్చికవిష ప్రముఖాఖిల బాధ నివారకంబులగు యసంఖ్యాకమంత్రరాజంబులు గల్పించి ప్రకాశించుచుండిరి.

ఇతి భక్తిసార నవనాథగ్రంథరాజంబున వటసిద్ధ నాగనాథచరిత్రంబు సప్తత్రింశాధ్యాయము సంపూర్ణము

అష్టత్రింశాధ్యాయము.

చర్పటనాథుని జన్మచరిత్రము.

తొల్లి నిటలాక్షు దాక్షాయణీ వివాహమహోత్సవంబునకై బ్రహ్మేంద్రాగ్నియమవరుణకుబేరాది త్రయస్త్రింశత్కోటి సురలోకంబు దక్షమందిరంబు జేరంజని బహువిధరత్నఖచిత స్తంభపరిశోభిత కల్యాణమంటపంబున స్వర్ణమయ దివ్యసింహాసనంబులపై యలంకరించి

తన్మధ్యమండపనికట ప్రదేశంబున మనోజ్ఞతరవేదికాసీనయగు భవసహిత భవానిం బొడగాంచి కమలజుండు దనమనంబున భళిర యిక్కాంతా లోకచూడామణి త్రిభువనమోహనాకారవిగ్రహం బనంగి రమణీ యోజ్వలరూపలావణ్య కళావిభవంబులచే నతనుని సామ్రాజ్య లక్ష్మియె నిజలీలావినోదంబున హరుం జయించజాలునని చింతింపుచు భావభవభల్లభగ్నహృదయుండై జలించినంత నింద్రియంబు గళితంబై మహిం బడియుండ నత్తామఱిచూలి సిగ్గుగొని దనపాదాంగుష్ఠంబుచే నలుపుచుండ తత్పాదసంపుటీయోగంబున నవ్వీర్యభాగం బఱువది వేల రేణువులై మహాతేజంబున బ్రకాశింప తత్క్షణంబ వాలఖిల్యాది యఱువదివేల మహాఋషు లుదయించిరి. తదుపరి యవ్వీర్యభాగశేషం బచ్చోటి కసువునం గలసియుండ నొకపరిచారిక లాజాహోమభస్మ సహితంబుగ నక్కసువుం గొని సురనదీప్రవాహంబున బడవైవ నయ్యమరవనితా వక్షోజమిళిత ఘనసార సుగంధ పరిమళ పూరిత మహోత్తుంగ తరంగయుత ఘనప్రవాహంబుచే నవ్వీర్యం బొకప్రదేశంబున కుశమూలం బాశ్రయించి బహుకాలంబు విరాజిల్లుచుండె నం దొకానొక సమయంబున శశిజాయాఋతురక్తంబు పతనంబైన కతంబున నయ్యది యండజాదులకై వడి యభివృద్ధి జెందుచుండుతఱి పిప్పలాయననారాయణుండు బ్రవేశించి యర్భకుండై రోదనంబు జేయునెడ పవిత్రచరిత్రుండగు సత్యశ్రవనామవిప్రోత్తముండు దర్భలకై యచ్చోటి కరుదెంచి ముజ్జగంబుల వెలుంగఁజేయు మనోహర శరీర కాంతిచే బాలార్కుం డనజాలిన డింభకుని వీక్షించి దనహృదయంబున నిబ్బాలుండు మూర్తివంతుండగు వసంతుండో రోహిణీధవుండగు కళాధరుండో లేక నీయసదృశతేజఃపుంజపిండం బే యప్సరాంగనామణి యిందువైచెనో జలదేవతయో స్థలదేవతయో గాక వనదేవతయో యని వితర్కింపుచు నియ్యర్భకుం గొనిపోయెదనేని నన్నే దేవతయో బాధించునని దలంచియు నత్యంతమోహావేశుండై సమీపంబు జేరి హస్తంబులచే స్పృశించుసమయంబున వేల్పుమూకలొక్కుమ్మడి యుప్పరవీధి నిల్చి యప్పిప్పలాయన నారాయణునకు కరంబులెత్తి నమస్కారంబు లొనర్చి విరులు గుఱిపించినంత నవ్విప్రోత్తముండు పుష్పాచ్ఛాదిత శాబకుని త్యజించి చకితుండై యిది యొకపిశాచంబని యూ

హించి కడువేగంబున బరుగులిడుచుండ నత్తెఱఁగంట్లు విచ్చలవిడి బరుగెత్తుచున్న వారుం గని పరిహసించుచు "భూసురోత్తమా! భూసురోత్తమా! నిలునిలు" మని శబ్దంబు వినవచ్చినంత నవ్విప్రుం డా నినదం బాలకించి యపరిమితభయగ్రస్తుండై బుడమింబడి పిశాచంబుచే గ్రసింపఁబడియెదనని యాశలుడిగియు పునరుత్థితుండై దృగ్గోచరంబు గాని సురాళివాక్యంబుల దలంచి నేనేల నిందే తెంచితి నే తెంచితినేని మందమతిచే బాలునికడ కేల నరిగితి నిక నాకెట్టి బ్రతుకు గలదని కృతనిశ్చయుండై జనుచుండ నిర్జరానీకంబు నారదు న్వీలోకించి "తపోఘనా! రయంబున భూదేవుం జేరంజని మనోభయం బెడబాపి బాలుం బోషింప నొడంబఱచు" మని వీడ్కొలుప నయ్యమరమునిముఖ్యుం డొకమహీసురుని వేషంబుచే వేణుగానలోలుని గుణగాయనం బొనర్చుచు మార్గమధ్యంబున నిల్చి కడువడి నటమరించుచు నిట్టూర్పు లిడుచున్న బ్రాహ్మణుం బొడగాంచి "విప్రశ్రేష్ఠా! కంపాయమాన శరీరుండవై పలాయనం బొనర్చుట కేమిహేతు" వని విచారింప నతండు "అయ్యా! దుర్భాగ్యుండనై దర్భలకై నేనీ తీరంబున కరుదెంచి యొక్కచో రోదనంబు జేయుచున్న శిశువుంగాంచి పిశాచంబని శంకింపక నికటంబున కేగ నా నిర్మానుష ప్రదేశంబున కుసుమంబులు దనంతట తా పైబడుటచే నయ్యవి భూతకృత్యంబులని యోచించి బహుభయంబున పలాయనంబు జేయుచుండ నయ్యగోచరపిశాచంబులు మత్ప్రాణంబులు హరించుటకై నిలునిలు మని యుచ్చరించుచు నావెనువెంట నంటి యేతెంచుచున్నవి. నే నేమిజేయుదు" నన నమ్మునిపుంగవుం డప్పుడమివేల్పు కేలుగొని యొకతరుచ్ఛాయంజని భయంబు బాపుటకై "పురుషవర్యా! దర్భలకై నీ వరుదెంచి బాలుని వీక్షింపుచుండు తఱి యుష్మత్పృష్ఠభాగంబున నే నిను విలోకించుచుండి పిదప నూర్ధ్వముఖుండనై నభంబు గనుంగొనునంత నవ్విబుధసంఘంబు నీనామంబు విచారించుటకై నీపై పుష్పవర్షంబు గురిపించిరి నీవింతటికై బరుగెత్తనేల? నీనామం బెద్ది" యని విచారింప నయ్యనఘాత్ముండు "మన్నామంబు సత్యశ్రవుం డనియెద" రని ప్రత్యుత్తరం బొసంగెను. నలువపట్టి "సత్యశ్రవా! భూతంబని భ్రమజెందనేల? నయ్యర్భకుండు పిప్పలాయన నారాయణావతారుండు. జగదుద్ధారనిమిత్తంబై కమలో

ద్భవుని వీర్యంబుచే నుదయించెను. తత్కాలంబున సురలు సంతోషించి కుసుమంబులు వైచుచు డింభకుం బోషింపు మని యఱచుచుండ నే నా దేవసంభాషణంబులు వింటిని గాన నీమనోగతభయం బుడుగుము. ప్రతాపముఖ్యుండగు శాబకుని భవత్సదనంబునకు గొనిపోయి నిస్సంశయుండవై సంరక్షింపుము నీ కనంతసుఖంబులు వాటిల్లును. మద్వచనంబులు సత్యంబని దలంపు” మన సత్యశ్రవుండు దనచిత్తంబున నే నెక్కడ సురలోకం బెక్కడ నపారచరిత్రుండగు డింభకుం డెక్కడ నని యోచింపుచు నభంబు నిరీక్షింపుచుండ నవ్విధిపుత్రుని కృపాకటాక్షంబుచే నయ్యమరబృందంబు దృగ్గోచరం బౌచున్నంత విప్రుండు సంతసించి ప్రచ్ఛన్నబ్రాహ్మణునితో “నయ్యా! భవత్కరకమలంబులచే శిశువు న్నాకొసంగెద వేని పరిగ్రహించెద” నన నారదుం డవశ్యంబని భాగీరథీతీరంబునకు సత్యశ్రవసమేతంబుగ నరుదెంచి విచిత్రతరపుష్పాచ్ఛాదిత నవమోహనాకారుం బాలుని దనకరంబులచే సత్యశ్రవున కొసంగి “యియ్యపారతేజోమయ విగ్రహుండగు శాబకునకు చర్పటుండని నామకరణం బొనర్పుమని విబుధాళి యనుజ్ఞ గలదు గావున నప్పగిది యాచరింపు” మని వాక్రుచ్చి నిజస్థానంబున కేగెను. శీలగుణసంపన్నుండగు సత్యశ్రవుండు పరమానందభరితుండై నిజనివాసంబగు పునీతగ్రామంబున కబ్బాలుం గొనిపోయి శీఘ్రంబున గృహంబు ప్రవేశించి పవిత్రచరిత్రయగు చంద్రానామవల్లభిం బొడగాంచి “ప్రియే! నేడు దర్భలకై హరిపాదోద్భవనదీతటంబున కేగ నచ్చో దివౌకససమూహం బాకసంబున బ్రసన్నులై బాలార్కభాసమానుం డగు యిబ్బాలుం బోషింపుమని యొసంగిరి గావున నేతచ్ఛాబకునికై యమరోత్తములదర్శనంబు ఘటియించె” ననుచు గతవృత్తాంతంబు దేటపఱిచి యీశరవణోద్భవునకు చర్పటుండని నామం బిడుమని ముదంబుచే సుదతీమణి కొసంగ నయ్యువిద యపత్యంబులేని కతంబున నిత్యంబు గుందుచుండి సత్యశ్రవానీతపుత్రుని పరమాహ్లాదంబుచే పరిగ్రహించి మర్కటంబుకై శోధింపుచుండు మరుత్కుమారుండు లభించినవిధంబు దరిద్రుండు ద్రవ్యంబుకై ప్రయత్నించ ధనదుండు ఘటియించినచందంబున దర్భలకై జనుచుండ నర్భకుండు ప్రాప్తించెనని యబ్బురంబున పెల్లుబ్బి యబ్బాలున కుష్ణోదకంబులచే

స్నానంబు లాడించి డోలికారోహణం బొనర్చి తోడిచేడియలతో చర్పటుండని యబ్బుడుతని నామకరణంబు గావించి మితిలేని సంతసంబుచే బోషింపుచు కాలంబు గడుపుచుండ క్రమక్రమంబున చర్పటుం డభివృద్ధిజెంది సప్తవర్షంబుల బాలుండై శోభిల్లుచుండె సత్యశ్రవుండు చర్పటున కుపనయనాది సంస్కారంబులు గావించి వేదశాస్త్రాభ్యాసంబు లొనర్చుచుండ నొకానొకదివసంబున బ్రహ్మమానసపుత్త్రుం డగు నారదుం డనేకలోకంబులు గ్రుమ్మరుచు పునీతగ్రామసమీపంబున కేతెంచి చర్పటుని స్మృతిదలంచి యొకభూసురుని వేషంబుచే సత్యశ్రవుని సదనంబుజేరి ద్వాదశాబ్దంబుల బాలుండై దేజరిల్లుచున్న విధివిరోధ్యక్భవుండగు చర్పటుని బుద్ధినై పుణ్యంబు భ్రాతృమోహంబుచే బొడగాంచి తక్షణంబ బదరికాశ్రమంబు బ్రవేశించియాత్రేయు మత్స్యేంద్రులం గనుంగొని బహుమోదంబుచే నన్యోన్య హృదయాలింగనంబు లొనర్చుకొని హరమందిరంబున నృహరిసహితంబుగ చింతామణి సురభూజ సురధేను స్పర్శవేదు లేకప్రదేశంబున నివసించినకైవడి యుపవేశించి సుఖగోష్ఠులు గడుపుచుండి ప్రసంగానుసారంబున నారదుండు చర్పటునివృత్తాంతంబు వెల్లడియొనర్చ పంచవదనుండు త్రిముఖునితో “సర్వతంత్రస్వతంత్రుండగు నవనారాయణావతారఘనులను కీర్తనీయ నాథపంథంబున విరాజిల్ల నొనర్పం దలంచి పిప్పలాయన నారాయణావతారుండగు చర్పటుని యుపేక్షించుట కారణంబేమి” యన నత్రిసూనుండు సర్వేశ్వరునితో “పశ్చాత్తాపంబు లేనివైరాగ్యంబు నిల్చునే? వైరాగ్యంబులేమి నిశ్చలనిర్గుణపరబ్రహ్మస్వరూపుండై ప్రకాశించునే? ముముక్షువునకనుగ్రహంబొసంగుట ముఖ్యధర్మం” బన నయ్యమరముని శేఖరుం “డనసూయానందనునివాక్యంబులు నిక్కంబు నిక్కం”బనుచు దత్తునితో “దయాఘనా! యుష్మత్కృపాకటాక్షంబు గలదేని చర్పటుని హృదయంబున వైరాగ్యంబు గల్పింతు”నని యనుజ్ఞగొని రయంబున పునీతగ్రామంబు బ్రవేశించి యొకవిద్యార్థిస్వరూపంబుచే సత్యశ్రవుని మందిరంబున కేగి యయ్యుత్తమశ్లోకునితో “పుణ్యపురుషా! నే నొక కులుంబనామ విద్యార్థుండను. నాయందనుగ్రహించి వేదాభ్యాసం బొనర్పు” మని విచారింప నవ్విప్రోత్తముం డంగీకరించి నిజతనాభవుని సహితంబుగ వేదశాస్త్రంబు లుపదేశించుచుండె నిట్లొక కొన్ని

దివసంబులు గడుపుచుండ నొకానొకసమయంబున నొకగృహస్థుండు దనభవనంబున గర్భాధాన కార్యంబు గలదని పౌరోహితుండగు సత్యశ్రవుని గృహంబున కరుదెంచి "మద్గృహంబునకు దయజేయు" మన నవ్విప్రోత్తముండు చర్పట కులుంబులను జనుమని వీడ్కొలుప నయ్యిరువురు తత్క్షణంబ గృహస్థుని సదనంబుజేరి విధ్యుక్తయాజ్ఞికంబులు దీర్ప యజమానుండు "దక్షిణలం బరిగ్రహింపు" మను సమయంబున నారదుండు దనమనంబున నే నెన్నియుక్తులు బన్నినను చర్పటుండు శాంతశమదమాది గుణంబులచే ప్రపంచకలహంబు లెఱుంగక మాయామయసంసారనిస్పృహత్వంబు చిత్తంబున దలంపడయ్యె నిది యొకసమయంబు ఘటియించె నని యూహించి "చర్పటా! యజమానుం డొసంగు దక్షిణలు మనమే పరిగ్రహింపవలయు. విద్యాస్థులమై న్యూనాధిక్యంబు లెఱుంగక గ్రహించుట యోగ్యంబగునే సత్యశ్రవుం డేతెంచి దనయిష్టానుసారంబున గొనిపోవు" నన చర్పటుండు "మనమేల రిక్తహస్తంబుల వెడలవలయును. బహువిధోపాయంబులచే విశేషద్రవ్యంబు సాధించి జనకున కర్పించెదనేని సంతుష్టుండు గాడే" యని యుత్తరం బొసంగ నారదుండు "లాభనష్టంబుల కీలెఱుంగని విద్యార్థులమై పెక్కుప్రసంగంబులు మనకేల" నని వాదించుతఱి యజమానుండు "కించిద్ద్రవ్యంబు హస్తకమలంబున గొని బరిగ్రహింపు" మని చర్పటున కొసంగినంత నవ్విధివీర్యజాతుండు నారదుని సంవాదతాపపూరితహృదయుండై ద్రవ్యలేశంబు బొడగాంచి యజమానునితో "పురుషముఖ్యా! కార్యాకార్య విచక్షణుండవై యాచకుల యోగ్యత్వంబు బరిశీలించి యొసంగవలెంగాక నిప్పగిది దగునే" యన యజమానుండు "చర్పటా! యాచకులు సమర్థులైనం దాతల యధికారానుసారంబుగ ప్రాప్తింబొందుట సుప్రసిద్ధంబనదగదె" యని ప్రత్యుత్తరం బొసంగ సత్యశ్రవసుతుండు కోపించి "యధికారంబులేని కార్యంబులేల నొసర్పవలయు" నని కఠినోక్తులచే నన్యోన్యకలహసంభాషణంబులు జరుపుచుండుట విలోకించి కులుంబనాముండు కడువేగంబున సత్యశ్రవుని సన్నిధికేతెంచి "గురువర్యా! చర్పటుండు వృథాకలహంబుచే యజమానుని మనస్తాపంబు గలిగించె 'నసంతుష్టా ద్విజానష్టా' యను ప్రమాణంబుండ మన మత్యంతదురాశాపీడితులమై

దుర్భాషలాడుట విపరీతంబుగాదే? దాతలమనస్సంతోషపఱచి ద్రవ్యం బార్జించుట యుచితం బౌగాక. నిష్ప్రయోజకకఠినోక్తులచే నష్టంబు వాటిల్లదే? క్రమక్రమంబున చర్పటుని కలహం బతిశయించుట బొడగాంచి యిందే తెంచితి" నన సత్యశ్రవుం డాగ్రహమానసుండై తత్క్షణంబ యజమానుని సదనంబు జేరి దార్జన్యప్రసంగయుత వాక్కలహంబు నిజచక్షువులచే బరీక్షించి తీక్ష్ణతరకోపావేశుండై కరపుటంబున చర్పటుని కపోలతాడనం బొనర్చెను. హిరణ్యగర్భ వీర్యోద్భవుం డగు చర్పటునకు కలహక్రోధానలంబున కనిలంబు దోడ్పడినచందంబున ముఖతాడనంబు ఘటియింప పాదాహతభుజంగంబుకైవడి రౌద్రుండై యచ్చోటు బాసి పురబాహ్యదుర్గాలయంబు జేరి ఖేదమానసంబున నుపవిష్టుం డయ్యెను. కలహాశనుండు విద్యార్థివేషంబు త్యజించి యొక వేదవిద్బ్రాహ్మణవేషంబుచే దుర్గాలయంబు బ్రవేశించి యద్దేవిదర్శనం బాచరించి చర్పటునిచెంగట నుపవేశించి "యయ్యా! మీ రేకతంబున విషాదంబుచే నిందుంటి" రని విచారింప చర్పటుండు తత్కారణంబు సవిస్తరంబుగ వెల్లడియొనర్చెను. వేషధరనారదుండు "విప్రసుతా! భవజ్జనకుం డెట్టి విచారహీనుండో? ధర్మసూక్ష్మంబు లెఱుంగ లేడో? పుత్రాభిమానిగాని పితృండు ప్రత్యక్షశత్రుం డనగూడదే? పితృచరణపాదుకలు పుత్త్రుపాదంబులకు సమంబయ్యెనేని మిత్రభావంబున మెలంగవలయు ననుట లోకప్రసిద్ధంబు గలదు. తద్విరుద్ధులు ధర్మభ్రష్టు లన బడరో? సద్ధర్మవిరుద్ధుండగు జనకుండు వర్జనీయుండుగాక వందనీయుం డెట్లగును? దుఃఖదాయక సంసారసుఖంబులు స్థిరంబులగునే? విచక్షణుండవై కాననంబున కేగి ముల్లోకపూజ్యంబగు వైరాగ్యంబు బూను" మన చర్పటుండు పితృకృత్యంబు లత్యంతనింద్యంబులని యుగ్రుండై "బ్రాహ్మణోత్తమా! నాయం దనుగ్రహించి మధ్యవనంబున కేగి మత్సఖుండగుకులుంబనామవిద్యార్థిని గోప్యంబున దోడితెచ్చెదవేని మే మిరువుర మితరదేశంబుల జేరి సంపూర్ణవిద్యాభ్యాసం బొనర్చెద" మన నారదుం డవశ్యం బని తత్ప్రదేశంబు బాసి కులుంబవేషధారకుండై త్వరితంబుగ దేవ్యాలయంబు బ్రవేశించి విషణ్ణుండగు చర్పటు నవ్వలోకించి "సఖా! సత్యశ్రవుం డున్మత్తుండు జ్ఞానశూన్యుండు ధర్మదూరుండు నే నా విచారహీనుండగు భూసురుని సేవింపలేను. వేరొండు ప్రదే

శంబున నుత్తమోత్తముండగు యుపాధ్యాయునిచెంత నివసించి శాస్త్రాభ్యాసం బొనర్చెదగాక నిందుండలే" నని యప్పరమేష్ఠిసుత సంకల్పసహాయ సంభాషణంబు లాడుచుండ చర్పటుండు సంతసంబుచే యథార్థంబనుచు కులంబసహితుండై ప్రయాణంబొనర్చి యొకకొన్నిక్రోశంబు లతిక్రమింప కులంబుండు "చర్పటా! కాశీక్షేత్రంబున నఖండపాండిత్యవిశేషజ్ఞుల సమూహంబుగలదు. తన్మార్గమధ్యంబున బదరికేశ్వరుని దర్శనంబు గొని జనియెదమేని శుభంబు వాటిల్లు" నని నుడువుచు నచ్చటచ్చట భిక్షాన్నంబుచే దృప్తులగుచు బదరికాశ్రమంబు జేరంజని కేదారేశ్వరుని దర్శనంబు గొని రంత నయ్యాత్రేయమత్స్యేంద్రు లొకముని వేషంబులచే దృగ్గోచరం బగుచుండ కులంబుండు శీఘ్రంబున నమ్మహామహుల చరణకంజంబులకు నమస్కరింప తదవ్వ చ్చర్పటుండు వందనంబు లాచరించి 'కులంబా! వందనీయ యతిపుంగవు లెవ్వ' రనివిచారించెను. కులంబుండు "చర్పటా! నిఖిలలోక జేగీయమాన గుణకదంబులగు దత్తాత్రేయమత్స్యేంద్రు లీ యోగిముఖ్యులనియు నేను నారదుండను భవత్కారణంబున కులంబవేషధారకుండనైతి" నని శ్రుతపఱచుచుండ చర్పటుండు భయభక్తియుక్తుండై కులంబుని పాదంబుల వ్రాలి "నీ నిజస్వరూపంబు ప్రకటింపు"మని వేఁడుచుండ నారదుండు "పురుషవర్యా! గురుమంత్రోపదేశలబ్ధుండుగాని మనుజునకు దివ్యస్వరూపంబు లెట్లు గోచరంబులగు? సర్వసాక్షిస్వరూపుండ వయ్యెదవేని యస్మత్స్వరూపసందర్శనంబు లభియించు" నన చర్పటుండు పశ్చాత్తాపహృదయుండై "కరుణామయా! నే నీ ప్రదేశంబున నే మహాపురుషుని వెదకుదును. నాకెట్లు గురుప్రసాదంబు లభియించును. న న్నుద్ధరించుఘనులు నీకంటె ముఖ్యులెవరుగలరు? యుష్మదనుగ్రహంబుచే నను గడతేర్చు" మని వేఁడుచుండ నారదుండు "చర్పటా! త్రిదశాద్యాశ్రితచరణసరసీరుహుండగు దత్తాత్రేయునాశ్రయింపు" మనునంత నత్రిసూనుండు ఘనకరుణాన్వితుండై చర్పటుని మస్తకంబున నభయహస్తంబు మోపి దుర్భరప్రపంచమాయాభ్రాంతచిత్తమోహంబుబాపి "వత్సా! త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణవాక్పాదాదిదశేంద్రియంబులు పృథివ్యప్తేజోవాయ్వాకాశగుణజన్యంబులై స్థూలరూపంబున విలసిల్లి శబ్దస్పర్శరూపరసగంధచలనవలనాది గుణంబులుగలిగి

నిరుపాధిక పరబ్రహ్మస్వరూపంబగు నాత్మకు నుపాధియై మనోబుద్ధి చిత్తాహంకార వికారంబులచే తుచ్ఛతరసంసారసుఖంబుల నుపేక్షించునుగాక నెంచిచూడ నిర్మలపరతత్వజ్ఞానంబునకుసంబంధంబులగునే” యనుచు తత్త్వోపదేశంబుచే మంత్రార్థరహస్యంబులు దేటదెల్లంబుగ బోధించిన పితామహతనూభవుండగు చర్పటుండు నిరస్తమోహుండై సర్వభూతసాక్షిస్వరూపంబుచే నభోమణిచందంబున బ్రకాశించుచు నత్రిసుత మత్స్యేంద్ర నారద నిజస్వరూపులం బొడగాంచి పాదంబుల వ్రాలి బొగడుచుండ మృడుండు బ్రత్యక్షుండై విలోకింపుచుండెను. తత్క్షణంబ చర్పటుం డా శంకరుని చరణాంభోరుహంబులకు బ్రణమిల్లిన హరుండు కరుణాంతరంగహృదయుండై దనకరంబులచే హిరణ్యగర్భాత్మజుని గౌఁగిటంజేర్చి యాత్రేయునితో “నిఖిలమంత్ర తంత్రప్రముఖాఖిల ప్రయోగోపసంహారాది విద్యలీ చర్పటునకొసంగి వినులంబగు నాథపంథీయోగంబున విరాజిల్లం జేయు” మన దత్తుం డవశ్యం బని యనేకశస్త్రాస్త్రమంత్రప్రయోగోపసంహారరహస్యార్థంబులు బోధించి నాగాశ్వత్థవృక్షాశ్రిత సర్వదేవతాప్రసన్నంబు లొనర్పించి తదుపరి ద్వాదశాబ్దంబులు ఘోరతరతపంబు జేయించి తపాంతంబున సకలమంత్రాధిదేవతలచే తపస్సిద్ధికై వరంబు లిప్పించి ప్రపంచోపకారనిమిత్తంబై శాబరీవిద్యాకవిత్వరచనానసమర్థత్వం బనుగ్రహింప నయ్యనఘాత్ముండు నవకోటిసప్తలక్షమంత్రరాజంబులు నిర్మించి శ్రీగురుదత్తాత్రేయానుమతిచే తీర్థయాత్రాపరతంత్రుఁడై నిజేచ్ఛం జనుచు రామేశ్వర గోకర్ణ మహాబలేశ్వర జగన్నాథ హరిహరేశ్వర కాశి క్షేత్రంబులు సేవించుచు నచ్చట ననేకజనసముదయంబులకు మోక్షప్రదర్శకమార్గంబులు దెలుపుచునందు వైరాగ్యపూర్ణులగు రాఘవసిద్ధ బాలసిద్ధ గోకాటసిద్ధ జాంబుసిద్ధ నైమిత్యకసిద్ధ సారేంద్రకసిద్ధ హుత్క్షప్రసిద్ధ ద్వారభైరవసిద్ధ రణసిద్ధులకు శాబరీవిద్యానైపుణ్యంబులు దేటబఱచె నిప్పగిదినాథోత్తములు దమతమ తపఃప్రతాపంబులచే బుద్ధిదక్షులగుశిష్యుల కనేక మంత్రార్థంబులు బోధించి జగద్విఖ్యాతి నొనర్చిరి. ధైర్యధుర్యుండగు రేవణనాథుండు జోగిసిద్ధ సారంగసిద్ధ నిజానందసిద్ధ నైనసిద్ధ నిరంజనసిద్ధ యదుప్రసిద్ధ గైబనసిద్ధ క్షుద్రసిద్ధ కాన్తసిద్ధులకు మంత్రార్థంబు లుపదేశించెను. రవిపుత్రుండగు భర్తరీనాథుండు ఉరేశ

సిద్ధ నరేశసిద్ధ ధురేశసిద్ధ కుహారసిద్ధ కేశమర్దనసిద్ధ శుద్ధకపూరసిద్ధ ఖేటేంద్రసిద్ధ కటభ్రావసిద్ధ సాబరసిద్ధులకు సకలవిద్యాభ్యాసంబు లొనర్చెను. సచ్చరిత్రుండగు మత్స్యేంద్రనాథుండు దక్షేంద్రసిద్ధ అనిర్వారణసిద్ధ అపరోక్షసిద్ధ కాముకార్ణవసిద్ధ సహానసిద్ధ దక్షలాయనసిద్ధ దేవసిద్ధ పాక్షేంద్రసిద్ధ సాక్షిసిద్ధులం బ్రకాశింప నొనర్చెను. నిఖిలకళాదక్షుండగు గోరక్షనాథుండు నిర్ణయసిద్ధ ఆర్ణవసిద్ధ హారదంతసిద్ధ భోమాసిద్ధ నహుక్షసిద్ధ కృష్ణాసిద్ధ పలాయనసిద్ధ హేమాసిద్ధ క్షేత్రాంతసిద్ధ రత్నాకరసిద్ధుల కపారరహస్యార్థంబు లనుగ్రహించెను. వినుతగుణజాలుండగు జాలంధరనాథుండు వినయసిద్ధ భాస్కరసిద్ధ దత్తసిద్ధ ధాతసిద్ధ పావనసిద్ధ భార్గవసిద్ధ సుపౌర్ణవసిద్ధ యథార్థసిద్ధ కవిటసిద్ధ శర్వాసిద్ధ వదమసిద్ధ ప్రోక్షితసిద్ధుల నత్యంతజ్ఞానపూర్ణుల నొనర్చెను. మౌనిజనశేఖరుండగు కానీపనాథుండు శాలుకసిద్ధ వాలుకసిద్ధ శరభసిద్ధ సహానసిద్ధ ప్రోక్షితసిద్ధ శైర్భసిద్ధ కోకిలసిద్ధ కాస్మితసిద్ధ వాచసపతిసిద్ధులను పరమోత్కృష్టరాజయోగంబున ప్రభాసిల్లజేసెను. తద్వద్ధరవీరోద్భవుండగు చౌరంగనాథుండు లోమసిద్ధ భ్రాతరసిద్ధ కచిరసిద్ధ కాలవృందనసిద్ధ నారాయణసిద్ధ కాళికాసిద్ధ సావ్రజీసిద్ధుల ప్రసిద్ధియొనర్చెను. మీననాథ హరభంగనాథులు సులక్షసిద్ధ క్షమాసిద్ధ పౌర్ణవసిద్ధ ద్వారభద్రసిద్ధ అక్షసిద్ధ ఆహావసిద్ధులను ప్రకటం బొనర్చిరి.

ఇతి భక్తిసార నవనాథగ్రంథరాజంబున చర్పటనాథ జన్మకథాదివర్ణనము అష్టత్రింశాధ్యాయము సంపూర్ణము.

ఏకోనచత్వారింశత్యధ్యాయము.

చర్పటనాథుని యుద్ధము.

యోగపూర్ణుండగు చర్పటనాథుండు కాశీమహాతీర్థంబు సేవించి గయా ప్రయాగ ఫణిపర్వత మల్లికార్జున కుమారీదైవత ద్వాదశమల్హార హింగళాదేవి ద్వాదశమహాలింగాది మోక్షదాయక క్షేత్రంబులం గ్రుమ్మరుచు గుప్తప్రకట పుణ్యప్రదేశంబుల మాహాత్మ్యంబు

ల్వలోకించి దనహృదయంబున స్వర్గవాసినియగు మణికర్ణికాస్నానంబు లాడి యయ్యమరలోకవైభవవినోదంబులు నిరీక్షించి తదుపరి పాతాళ భోగవతీపుణ్యనదీతీర్థంబుల గ్రుంకులిడవలయునని నిశ్చయించి బదరి కాశ్రమంబు జేరి చంద్రచూడుని చరణంబులకు వందనంబు లిడి గమ నోన్ముఖుండై వ్యానాస్త్రంబు జపియించి తన్మంత్రప్రతాపంబుచే వాత గతి జనుచుండి మహేంద్రపర్వతంబు లంఘించి హిమాచలనికటంబున కేగి దుస్తరమిహికావృత మహానగమార్గంబు బొడగాంచి నిజవిద్యా నైపుణ్యంబుచే నమస్కరు నావాహనం బొనర్చి ప్రభాకరకరనిక రోష్ణంబుచే మార్గాచ్ఛాదిత హిమంబు దొలంగించి తత్క్షణంబున సత్య లోకంబు బ్రవేశించి నానాదేవఋషిగణపరిసేవిత పాదపద్ముండగుచతు రాస్యుని చరణకంజంబులకు బ్రణమిల్లి ముకుళితకరకమలుండై పురో భాగంబున బ్రకాశించుచుండ నత్తామరసగర్భుం డిత్తాపసోత్తముం డే మహామహుండని యోచింపుచుండు సమయంబున తత్సభాస్థిత యమర మునిశేఖరుండగు నారదుండు పరమేష్ఠితో చర్పటుని జన్మచరిత్రంబు విశదీకరించెను. పితామహుం డత్యంతప్రీతమానసుండై స్వహస్తంబు లచే పుత్రు న్నిజాంకంబుపై నిడుకొని మూర్ధంబు బునుకుచు "వత్సా ! నీ వెప్పగిది యూర్ధ్వలోకంబుల కేతెంచితి" వని విచారింపుచుండ చర్పటనాథుండు "జనకా ! త్రిలోకపూజ్యుండగు నారదుని కటాక్షం బుచే విబుధజనశిరోమకుట పరిశోభిత దివ్యతరమణి విభూషితాంఘ్రి యుగళుండగు దత్తాత్రేయుని వరదహస్తంబు మచ్ఛిరంబున విరాజిల్లిన కతంబున సకలమంత్రార్థరహస్యంబు లెఱింగి గురుప్రతాపంబుచే యనేకపుణ్యతీర్థంబులు సేవించి మణికర్ణికాభోగవతీ స్నానాపేక్షచే భవద్దర్శనంబున కరుదెంచితి" నన నక్కమలాసనుండు కడుసంతసం బుచే "పుత్రా ! ఒకవత్సరం బిచ్చో కాలంబు గడుపుచుండెదవేని యొక మహాపర్వసమయంబున సకలసురసముదయ సమేతులమై జని యెద" మన నాథుండు హర్షించి నివసించెను. నారదుండు తద్బ్రహ్మ లోకంబున దనయనుజన్ముండగు చర్పటనాథునిసహితుండై యత్యంత స్నేహంబుచే దినంబులుగడుపుచుండి యొకానొకసమయంబున పాకశా సనుని సభామంటపంబున కేగ నయ్యమరేశుండు వినోదంబుచే "కల హప్రియా ! రా ర" మ్మని యాహ్వానింప మునిపుంగవుండు దనమనం

బున క్షోభించి మత్కులహాప్రియత్వప్రతాపంబు బొడసూపెద నని నిశ్చయించి కుటిలోక్తులచే ప్రసంగించి శీఘ్రంబున. నిజస్థానంబున కేగి యొకకొన్నిదివసంబులు గడపి చర్పటనాథుని ధైర్యస్థైర్యప్రతాప దర్పంబులు బరీక్షించి యిమ్మహాపురుషుని క్రోధానలంబున కయ్యమ రేశుని నాహుతి యొనర్పవలయు నని యుక్తిదలంచి శరజన్ముండగు చర్పటునితో "తపోఘనా! అమరావతీనగరంబున కేగి దేవేంద్రోద్యా నవనవిహారం బొనర్చి యరుదెంచెదము ర" మ్మన నయ్యమలాత్ముండు రయంబున బ్రయాణంబు సల్పి యగ్రజుండగు నారదునిసహితంబుగ జనుచుండ మునిముఖ్యుండగు నారదుండు "చర్పటా! మందగమనం బుచే తత్ప్రదేశంబున కేగనగునే? పునస్సత్యలోకంబున కెట్లరుదెం చెద" మన నాథోత్తముండగు చర్పటుండు నారదునితో "నే మనుజ శరీరుండనై నీయట్టి దేవమునిసరి గమనం బొనర్పగలనే" యన నార దుండు కార్యార్థుండుగాన తొల్లి విరించి యనుగ్రహంబుచే సంకల్ప మాత్రంబున ముజ్జగంబులు భ్రమియించి తత్తల్లోకభూతభవిష్యద్వర్త మానచరిత్రంబులు గుర్తెఱుంగు మహావిద్య కీలెఱుంగింప చర్పటుండు పరమాహ్లాదంబుచే మనోవేగంబున నమరావతీ నగరసమీపంబున కేగి బక శుక శారికా మయూరాది పక్షిజాల సమాకీర్ణ తాల సాల రసాల హింతాల తమాల తక్కోల మందార కోవిదార పారిజాతా ద్యనేక వృక్షరాజంబు లంబరంబు చుంబించుచుండ మనోజ్ఞతర లతా ప్రసవ సౌరభంబులు వెదజల్లు చల్లని కొలంకులు గలిగి విచిత్రతరపుష్పపరి పూరిత నికుంజపుంజంబులచే ననేకయోజనవిస్తీర్ణంబగు యుద్యాన వనంబు బొడగాంచి బహుమోదంబుచే తద్వనవిహారంబు సల్పుచు నొక్కచో ఫలభరిత మాకంద మహీరుహరాజిని గని చర్పటుండు "మునివర్యా! మచ్చిత్తంబు ఫలాసక్తిజెందె" నన నారదుండు "చర్ప టా! నిన్నీప్రదేశంబున నెవరు నిర్బంధించిరి. నీయిచ్ఛానుసారుండవై ఫలంబులు బరిగ్రహింపు" మన చర్పటనాథుండు రయంబున తత్తరు శాఖాగ్రంబులపై నారోహించి మధురతరరసభరితఫలంబులు గైకొని యద్దేవమునిసముఖంబున కరుదెంచి యుభయఘనులు ఫలహారంబు లొనర్చి తద్బీజంబు లచ్చోటే బడవైచి యథేచ్ఛంద్రిమ్మరుచు సచ్ఛ

టచ్చట నమోఘఫలతాంతంబులు బరిగ్రహించి నిజాంగంబుల ధరించు
కొనుచు నొకకొన్నిసుగంధయుత పుష్పంబులు గొని శీఘ్రగమనం
బునం జని పితామహున కర్పించి సంతుష్టిబఱచి రిట్లొక కొన్నిదివ
సంబు లయ్యమరేశుని యుద్యానవనంబున కరుదెంచి స్వేచ్ఛావిహా
రంబు లొనర్చి మనోభీష్టఫలంబులు భక్షించుచు మనోహరదివ్యపు
ష్పంబులుగొని చనుచుండ తదుద్యానవనరక్షకులు ఫలబీజంబులు బరీ
క్షించి యిం దెట్టి తెక్కలికాం డ్రరుదెంచిరో గనుంగొనవలయు నని
మనంబున యోచించి యొకగోప్యస్థలంబున నివసించి చర్పటుండు
నారదునిసహితంబుగ వనిం గ్రుమ్మరి యొక్కచో వృక్షాగ్రంబుపై
నెక్కుచుండుట బొడగాంచి తత్క్షణంబ తచ్చర్పటనాథు నొడిసిపట్టి
ముఖంబుపై తాడనం బొనర్చుతఱి కలహాశనుండు కడుసంభ్రమం
బుచే మత్కార్యంబు చేకూరు ననుచు పలాయితుం డయ్యెను. తపో
దర్పుండగు చర్పటుండు రౌద్రరసభరితుండై క్రోధాగ్నియుత నేత్రం
బులచే నిరీక్షించి వాతాకర్షణ మహామంత్రంబు జపియించి ప్రయో
గించిన తద్వనరక్షకభటసమూహంబు లద్దివ్యాస్త్రప్రయోగంబుచే పంచ
ప్రాణవాయువుల తావులు దప్ప కుంఠీభూతశరీరులై నిర్గతరుధిర ముఖ
నాసికు లగుచు మహింబడి మొఱలిడుచుండ తచ్ఛబ్దంబు లన్యభటు
లాలకించి త్వరితంబుగ నేతెంచి కంఠగతప్రాణంబగు భటసముదయం
బును రోషతామ్రాక్షుండగు సిద్ధముఖ్యుని గనుంగొని భయభ్రాంత
చిత్తులై శీఘ్రంబున నబ్బిడౌజుని సమక్షంబున కరిగి "లోకనాయకా!
బాలార్కతేజుండగు నొకయతీంద్రుండు నిర్భయంబున వనంబు
గ్రుమ్మరుచు సక్రోధుండై కాపరులం బరిమార్చె. మే మవ్విపరీతంబు
గనుంగొని కడుభయంబుచే జనుదెంచితి" మన నప్పాకశాసనుం
డుగ్రుండై నిఖిలసురానీకంబునకు "రయంబున జని యప్పురుషాధముని
కరపాదంబులు బంధించి గొనితె" మ్మనియు "సాధ్యుండు గాఁడయ్యె
నేని యుష్మద్ఘనవిశిఖానలంబున కాహుతి యొనర్పు" మని యాజ్ఞా
పింప తత్క్షణంబ నిర్జరసంఘంబు బహువిధశస్త్రాస్త్రపరికర వరిష్ఠంబులు
ధరించి మహాజలధిచందంబున ఘూర్ణిల్లుచు వనసమీపంబున కరుదెం
చుచుండ మేరునగధీరుండగు హిరణ్యగర్భవీర్యోద్భవుండు భస్మంబు
గొని యన్యాస్త్రప్రయోగంబు లేల నని మనంబున యోచించి సర్వాస్త్ర

శిరోభూషణంబగు వాతాకర్షణదివ్యాస్త్రంబు జపియించి తద్దేవతాద
ళంబుపై బ్రయోగింప నన్నిలింపసముదయంబు విగతచేతనంబై కీలూ
డినజంత్రంబులకైవడి ధరంబడి పరితప్తమానసులగుచు మారీపీడితుల
చందంబున స్మృతిదొలంగి నిర్జీవకళేబరంబులభంగి బడియుండు నవస
రంబున సహస్రాక్షుండు కదనరంగసమాచారంబు బరికించి రమ్మని
యొకదూతం బంప వాఁడతివేగంబున రణభూమి కరుదెంచి కంఠగత
ప్రాణులగు సుపర్వుల వీక్షించి యాశ్చర్యంబుచే ప్రాక్దిశాధిపుని నిక
టంబున కాగతుండై "సురాధిపా! తాపసోత్తముని యుదగ్రపరాక్ర
మాతిశయంబులు బొగడ బ్రహ్మాదులకు తరంబగునే? ప్రళయకాల
రుద్రుండైన నయ్యద్భుతచరిత్రుని సమక్షంబున నిల్చునే? కృతాం
తుం డయ్యపూర్వప్రతాపున కెదురించునే? అట్లుగాకున్న వేల్పు
మూఁక లొక్కుమ్మడి యిలంబడుదురే" యని బలుకుచుండ నవ్వే
గన్నులసామి డెందం బదరి కొంతవడి యోచించి యుగ్రుండై సాహ
సంబుచే "శీఘ్రంబుగ నైరావతంబును సిద్ధపఱచు" మని యుద్ధసన్న
ద్ధుండై యాజ్ఞాపింప తత్సమయంబున నచ్చారుండు "అమరేంద్రా!
ప్రతాపపూర్ణుండగు సిద్ధునిచరితం బపారంబు గలదు. విలుబూని ములి
కిసంధించునంతలో నమ్మహాఘనుని ప్రయోగనైపుణ్యంబుచే ప్రతి
వీరుండు వాతాకర్షితశరీరుండై తక్షణంబ ధరం గూలును. భవ
ద్వజాస్త్రం బప్పురుషశ్రేష్ఠునకు తృణసమానంబై గాన్పించును.
తా మేకతంబ రణరంగంబున కరిగెద రేని యుష్మత్ప్రాణంబు
లపహరింపఁబడుట నిక్కంబై దోఁచు. మహాప్రళయకారణుండగు
త్రిలోచనుని సహాయంబుగొని కదనంబున కేగెద వేని జయంబు
వాటిల్లుటయె గాక భూపతిత విబుధజనసంఘంబులు పునరుత్థి
తంబులౌట నిక్కంబు గావున శర్వునిసహాయంబు ముఖ్యకారణం"
బని వచింప నప్పాకశాసనుండు నిజంబని దలంచి యైరావతారూఢుం
డై కైలాసంబు జేరి యనేకమహాగణపరివృతుండగుహరున్గాంచిగజంబు
డిగ్గి చరణంబులకుఁ బ్రణమిల్లి ముకుళితకరకమలుండై "నిఖిలేశా!
త్రిపురాసురాద్యఖిలదనుజనాశా! భవదనుగ్రహంబుచే నాకలోకాధి
పత్యం బొసంగి నాకై దుర్జయులగు నిర్జరారాతుల గీటడంచి మద్భో
గంబులు శాశ్వతం బొనర్చి రక్షించితిరి. ఇత్తఱి దేవతానీకంబు భవ

రంబున బంచత్వంబునొందె. తత్కృతంబున నిరాధారుండనై భవత్స మక్షంబున కరుదెంచితి" నన శంభుండు విస్మితుండై "పరాక్రమ ధుర్యుండగు వీరముఖ్యుం డెవ్వం" డని విచారించెను. సురాధిపుండు నీలగ్రీవునితో "ప్రభో! నే నా పురుషపుంగవుని స్వరూపంబు విలోకింపలేదు. వనంబు హతంబొనర్చి నని చారులతో నెఱింగి సమరంబు నకై సకలసురలోకంబును బంప నయ్యపారతేజుండు దివ్యాస్త్రనైపుణ్యంబున దివౌకసుల నుగ్గడంచె" నని విన్నవింప నవ్విషగళుండు రయంబున యుద్ధంబున కేగవలయునని మహాయోధగణంబుల కాజ్ఞాపించి "జగద్రక్షకుండగు కమలాక్షున కీ వృత్తాంతం బెఱింగింపు" మని యొకదూతం బంపి భైరవాది శతకోటి గణసముదయసమేతుండై వేగంబున నమరావతీనగరనికటస్థవనంబు జేరం జనుచుండ నవ్విశ్వసృట్పుత్రుండగు చర్పటుండు మహార్ణవంబుపగిది భాసమానంబగు రుద్రగణంబు బొడగాంచి భస్మంబుగొని దనచిత్తంబున నీయపారదళ సమూహంబుచే శ్రమజెందనేల నని దలంచి వాతాకర్షణ మహామంత్రరాజంబు జపియించి ప్రయోగింప తత్ప్రయోగ మహిమాతిశయంబుచే భూతేశుండు గోత్రభిత్సహిత నిఖిలగణసమేతంబుగ కుంఠీభూత శరీరుండై శ్వాసోచ్ఛ్వాసరహితుండగుచు మూర్ఛాగతుండై గతజీవ కళేబరంబుభంగి మూలచ్ఛేదితమహీరుహంబుకైవడి బృథ్విం బడియుండెను. సురగణంబులచందంబున శివగణంబులు స్మృతిదొలంగి కంఠగతప్రాణంబులై సర్వేంద్రియవ్యాపారంబు లుడింగి నిశ్చేష్టితులై బడియుండ దూరస్థుండగు నారదుం డాఖండలు న్నిరీక్షించి పరమానందంబుచే దనడెందంబున బలారాతిగర్వనిర్వాపణం బయ్యెనని దలంచి గంతులిడుచు సంతప్తమానసులగు గీర్వాణాదుల దురవస్థలు విలోకింపుచు బుద్ధిదక్షుండగు సిద్ధుని యద్భుతచరిత్రంబు లుగ్గడించుచుండె నంత శివాజ్ఞాధారకుండగు చారుండు జెచ్చెర వైకుంఠంబు జేరంజని సర్వసాక్షిస్వరూపుండగు సారసాక్షుని సమక్షంబున నిల్చి "జగద్రక్షకా! అసదృశవిక్రమోపేతుండగు నొకపురుషుం డేతెంచి యమరవనంబు జెరచి గీర్వాణాదుల గీటడంచె నని శతమన్యుండు శూలింజేరి విన్నవింప శంకరుండు వీరభద్రాది శతకోటిగణసమేతుండై శక్రుంగొని సమరంబున కేగుచు భవత్సన్నిధానంబునకు నన్నంపె.

తడవేల త్వరితంబుగ తత్సహాయుండవై జయంబు గొను" మని దెలుప నమ్మధుసూదనుండు తత్కారణంబు యోచింపక శీఘ్రంబున ననేక కోటి విష్ణుగణసమేతుండై భేరీభాంకారాది నినదంబులచే గరుడవాహనారూఢుండై యసురపురిసమీపంబున కేతెంచి సర్వామరకోటి సన్నిహితకాలంబును హైమవతీధవ శచీధవుల విపరీతసంకటంబు లవ్వలోకించి యుగ్రక్రోధదీప్తాస్యుండై యట్టహాసం బొనర్ప నవ్విష్ణువాహినీసముదయం బేకముఖంబుగ రోషపూరితహృదయంబై సింహనాదంబులు జేయుచు ధనురాదిసాధనంబులు ధరించి యుద్ధసన్నద్ధులై సిద్ధుని బరీక్షింపుచుండ హిరణ్యగర్భవీర్యోద్భవుండగు చర్పటుండు నిఖిలభువనభయదంబగు హరిచేతిచక్రంబు గాంచి దనమనంబున నియ్యది యప్రతిహతసాధనం బనియు ముష్కుం డీ సుదర్శనాస్త్రస్మృతి దొలంగింపవలెనని యూహించి యమ్మోహాస్త్రంబుపై భస్మయోగంబున సంమోహనాస్త్రంబు బ్రయోగించి తద్దివ్యాస్త్రచిత్తవిభ్రమంబు గావించి యుక్కుమిగిలి యవ్విష్ణుగణంబుపై వాతాకర్షణ మహాస్త్రంబు బ్రయోగింప వారలయ్యస్త్రరాజమహోజ్వల మహిమాతిశయంబుచే వాతగతిదప్పి వివశాత్ములగుచు పక్షపర్ణంబులక్రియ నేలంబడి రుధిరవక్త్రులై బహుప్రయాసంబులచే విలపించుచుండ దామోదరుండు కలుషించి నిర్వక్రవిక్రమోపేతచక్రంబుం బ్రయోగింప నద్దివ్యసాధనవరిష్ఠంబు సిద్ధుని సమీపించి సమ్మోహనాస్త్రయోగంబుచే స్వాగతకార్యం బెఱుంగక చర్పటుం గాంచి పిప్పలాయన నారాయణుండు దనస్వామియనియు తా వినోదార్థంబుగ బ్రయోగింపంబడితి ననియు దలంచి తాపసోత్తమునిచరణంబుల కెఱఁగి దక్షిణహస్తంబున బ్రకాశించుచుండెను. మురాంతకుండు నిరీక్షించి నిఖిలలోకాంతకుండై మహోగ్రగదాదండంబు బూని హుంకారప్రఘోషంబుచే బెబ్బులిచందంబున బరుగెత్తుచు నేతెంచుచున్న హరిని వీక్షించి తపోదర్పుండగు చర్పటుండు ధైర్యంబుచే భస్మంబుగొని దుర్ఘటంబగు వాతాకర్షణ దివ్యాస్త్రచూడామణిని బ్రయోగింప గోవిందుం డయ్యస్త్రంబుచే స్మృతిదొలంగి విగతగదాహస్తుండై క్షితింబడి మూర్ఛిల్లినంత మహాద్భుతపరాక్రమదక్షుండగు చర్పటుండు హరిసన్నిధి కేతెంచి జగన్మోహనాకారంబగు కౌస్తుభమణిసహిత వైజయంతీ

మాలం బరిగ్రహించి యతులితదివ్యమణిఖచిత స్వర్ణమయకిరీటంబు గొని తనమస్తకంబున ధరించుకొని యుదధిజాతంబగు శంఖంబు బూని తదుపరి ఫాలాక్షుని సమీపంబు జేరి యుప్పరహార కరకముల విరాజిత కపాలపాత్రంబును గ్రహించి కక్షపాలం బడగైచుకొని నిజ తపోబలయోగంబుచే త్వరితంబుగ సత్యలోకంబున కరిగి పితామహుని పురోభాగంబున శంఖచక్రాద్యాయుధంబులచే బహువిధరత్నస్థగిత దివ్యతరకిరీటయుత మస్తకంబుచే సహస్రార్క తేజంబగు కౌస్తుభమణి విరాజిత వక్షస్థలంబుచే ప్రకాశించుచున్న పుత్రుంగని యయ్యబ్జజుండు విస్మితుండై తనయంకంబుపై నిడుకొని "పుత్రా! నీకీ చిహ్నంబు లెట్లు గలిగె" నని విచారింప నయ్యమలాత్ముండు వాగ్వధూవల్లభునితో "జనకా! నే వినోదార్థంబుగ శచీపతి యుద్యానవనంబున జరించు చుండ నవ్వనరక్షకులు దుర్మతిచే నన్ను శిక్షించినకతంబున మచ్చిత్తంబున కినుకంబూని యద్దురాత్ముల ప్రాణంబు లపహరించితి. తదుపరి నను శాసించుటకై హరిహరేంద్రులు దమతమచమూసముదయంబులచే నేతెంచినంత క్రుద్ధుండనై మద్గురుశక్తిప్రతాపంబుచే నయ్యమరేంద్రాదుల నుక్కడంచి ముక్కంటిని స్రుక్కించి పెక్కుభంగుల రక్కసులగొంగం భంగపఱచి యయ్యనఘాత్ముల భూషణంబులు గొని యరుదెంచితి" నని పలుక నవ్వేల్పుపెద్ద తనడెందంబున తత్తఱంబుజెందియు బుత్రుని యఘటితపరాక్రమంబునకు సంతసించి "వత్సా! మజ్జనకుండగు వెన్నుండు వెతలంజెందెనేని క్షణమాత్రంబున ముజ్జగంబులు మడియవే? మజ్జీవనంబు వ్యర్థంబుగాదే? రయంబున జని యుపసంహారం బొనర్పవలయు ర" మ్మన నయ్యుత్తమశ్లోకుండగు చర్పటుండు గతకోపుండై "సకలజనసంకటంబులు నివారించెద" నని పితృసహితంబుగ నమరపురిం జేరి వివశాత్ములై పడియున్న కఱివేల్పు తోలుదాల్పులం బొడగాంచ నజుండు వారిపూరిత లోచనుండై "చర్పటా! తడవేల నొనర్చెదవు? భవద్దివ్యాస్త్రోపసంహారం బొనర్చు" మన సిద్ధముఖ్యుండు మహాదస్త్రోపసంహారంబు గావించి హరిహరుల దురవస్థలందొలంగించి యమరేంద్రాది సురాధిపతుల శ్రమలుబాపి మ్రియమాన బృందారకబృందంబును సంజీవినీమంత్రంబుచే ప్రాణంబులునిలుప నమ్మహౌఘనులు సచేతనులై దశదిశలు నిరీక్షించుచుండుతఱి

పితామహుండు చర్పటునిచే భవాచ్యుతుల పదపంకజంబులకు నమస్కారంబు లొనర్పించి సుతసహితంబుగ నంజలీబద్ధుండై పురోభాగంబున విలసిల్లుచుండ కేశవుండు శంఖచక్రాదిచిహ్నంబులచే ప్రభాకరునిభంగి భాసమానుండగు యోగిపుంగవుని గాంచి "యిప్పురుషశ్రేష్ఠుం డెవ్వం" డని విచారింప నత్తమ్మిచూలి సవినయంబుగ చర్పటుని జన్మకథావృత్తాంతంబు దేటపఱచెను. లక్ష్మీశుండు పరమానందభరితుండై "మదంశజాతుండుగాన నిట్టియద్భుతంబొనర్చె. లేకున్న మచ్ఛరీరభూషణంబు లన్యులకు లభ్యంబు లగునే" యని సిద్ధుని దనహృదయంబున కదుముకొని లాలింపుచుండ చతురాస్యుండు చర్పటనాథశరీరపరిశోభిత దివ్యతరభూషణంబులు నిజహస్తంబులచే బరిగ్రహించి రమానాథున కర్పించి పునశ్చర్పటుని హరిపాదంబుల కెఱఁగించి పిదప గరళకంఠునకు కపాలపాత్ర నొసంగి యడుగులపై నొసలుమోపింప నయ్యఖిలేశులు ముదాన్వితహృదయులై దమతమదళసమేతంబుగ నిజస్థానంబులు ప్రవేశించిరి. అమరేంద్రాది సర్వదేవతానీకంబు సిద్ధుండు పిప్పలాయననారాయణావతారుండని ముదంబుచే వందనంబు లిడి దమతమనిజనికేతనంబుల కరిగెను. కమలోద్భవుండు కడుసంభ్రమంబుచే నిజసుతుని దోడ్కొని సత్యలోకంబు జేర నావిరప మునిశేఖరుండగు నారదుండు పరమాహ్లాదంబుచే సురరాట్సమక్షంబున కరుదెంచి "శచీనాథా! మున్ను కలహప్రియా! రారమ్మని నన్నుహూయబఱచిన ఘనుండవై తుచ్ఛంబగు కలహంబునం దెట్లు మునింగితివో" యని యెగతాళిజేయుచుండ సహస్రాక్షుండు దీనవదనుండై దనమనంబున నిస్సహామహుని నిందించినఫలం బనుభవించితినని గుందుచు నేత్రక్షాలహామూలపురుషముఖ్యుం డీ ఋషివర్యుం డని దలంచి భయభక్తియుక్తుండై గౌరవించెను. తదనంతరంబ నారదుండు సత్యలోకంబు జేరి చర్పటనాథునితో సుఖగోష్ఠులు జరుపుచు కాలంబు గడుపుచుండ నొకానొకమహాపర్వసమయంబున నేకవింశత్స్వర్గవాసులు మణికర్ణికాస్నానంబున కేతెంచి యుండుఁతఱి నాళీకభవుండు చర్పటనాథసహితంబుగ తత్తీర్థంబున స్నానంబులాడి పునస్స్వస్థానంబున కేతెంచెను. వత్సరాంతంబున చర్పటుండు బ్రహ్మచే ననుజ్ఞాతుండై నిజతపోబలంబుచే సప్తపాతాళంబులు గ్రుమ్మరి భోగవతీనదిని గ్రుంకులిడి కీర్తిధ్వజుండగు

బలిగృహంబున కేగి వామనుని దర్శించి బలిచే నాతిథ్యంబు గొని బయలుదేరి స్వేచ్ఛావిహారంబున నానాతీర్థంబులు సంచరించుచుండెను.

ఇతి భక్తిసార నవనాథగ్రంథరాజంబున చర్పటనాథుండు హరిహరేంద్రాద్యఖిలసురసంఘంబుచే కదనం బొనర్చుట ఏకోన చత్వారింశత్యధ్యాయము సంపూర్ణము.

చత్వారింశత్యధ్యాయము.

దేవేంద్రుఁడు హవనం బొనర్చి నాథులచే శాపంబు నొందుట.

అట నప్పాకశాసనుండు ప్రతాపదర్పుండగు చర్పటనాథునిచే పరాభవం బొంది ఖేదపూరితమానసంబున వేల్పులం గొని కొలువుకూటంబున సభదీర్చి సురపూజ్యుండగు బృహస్పతితో నిర్వక్రవిక్రముండగు చర్పటునివృత్తాంతంబు దెలపఱచి "గురువర్యా! ఉత్పత్తిస్థితిలయాది కారణులగు హరిహరాదులు సరకుగొనక సర్వాస్త్రవేత్తలగు గరుడగంధర్వాది నిర్జరానీకంబును భంజించి మదావళసమూహంబుపై మార్కొను మృగేంద్రంబుకై వడి యుగ్రుండై సమరరంగంబున ప్రత్యక్షభానుంబోలి విభ్రాజమానుండగు సిద్ధుని యపారచరిత్రంబు గొనియాడ వశంబగునే? మే మనేకమహాదస్త్రప్రయోగోపసంహారంబుల కీలెఱింగియు సర్వాస్త్రశిరోభూషణంబగు నాతాకర్షణ దివ్యాస్త్రమహిమాతిశయం బెఱుంగకుండుట సురాధిపత్యంబు నింద్యంబుగాదే? త్రిలోకపూజ్యంబగు నాథపంథీసిద్ధజనమాహాత్మ్యంబున కెనలేని యమరత్వంబు నిరర్థకం బనదగదే? భక్తివైరాగ్యంబులచే నయ్యుత్తమశ్లోకుల నాశ్రయించి యద్దివ్యాస్త్రప్రయోగోపసంహారరహస్యార్థంబులు పరిగ్రహించి యప్రతిహతపరాక్రమంబుచే త్రిదశాలయం బేలవలయునని యూహించియు నాథోత్తములు ప్రపంచనిస్పృహత్వంబున నొక్కచో నిల్వక తైర్థికులై పరిక్రమించెద రయ్యద్భుతచరిత్రుల యనుగ్రహంబున కేనెట్లు స్థానభ్రష్టుండనై వెనువెంటం జనవలయునో యను సంశయంబుచే విన్నవించితి" నన నయ్యమరగురుం డొక్కసదుపాయంబు దలంచి "సురాధిపా! సర్వతంత్రస్వతంత్రులగు నాథముఖ్యుల సందర్శనార్థంబై యొక

మహాయజ్ఞంబు ప్రారంభించి తన్నిమిత్తంబున నాథులకై యుపరిచరవసు
పుంగవు ననుపవలయు నతండు దివ్యవిమానారూఢుండై బుడమికిం
జని దనసుతుండగు మత్స్యేంద్రుం దోడ్కొని యయ్యుపలాత్ముని పుర
స్సరంబున నిఖిలనాథుల నాహ్వానం బొనర్చి గొనితెచ్చు నట్టియెడ
నయభయభక్తివిశేషంబులచే సిద్ధులయుల్లంబు పల్లవింపం జేయవలయు
దాన నాథోత్తములు ప్రీతమానసులై జన్నంబు నెరవేర్చి యమోఘ
దివ్యాస్త్రంబుల కీలెఱుంగించి నీకోర్కు లీడేర్చెదరు. నీవు సఫలమనో
రథుండ వయ్యెద" వన సహస్రాక్షుండు సంతసిల్లి రయంబున వసునాయ
కుం దోడితెమ్మని మాతలి కాజ్ఞాపింప నతండు వెసంజని యుపరిచరవ
సువుం దోడ్తెచ్చె నంత నమ్మఘవంతుండు సంతుష్టుండై వసుశ్రేష్ఠునితో
"ఆర్యవరా! నేనొక మహాహవనం బొనర్పవలయు నని దలంచితి
నందుకై కీర్తిధ్వజులగు సిద్ధుల నాహ్వానింపవలయు గావున తా మతివే
గంబున మనోహరంబగు విమానంబున జని భవత్పుత్రుండగు మత్స్యేం
ద్రనాథుని దోడ్కొని తత్పురస్సరంబుగ సిద్ధజనసముదయంబు న్వెంట
గొనిర" మ్మన వసునాయకుం డవశ్యంబని విమానారూఢుండై శీఘ్రంబు
న బదరికాశ్రమంబున కేగి తత్పుణ్యప్రదేశంబున గోరక్ష ధర్మనాథ
చౌరంగ కానీప గోపీచంద జాలంధర హాడభంగనాథసమేతుండై తీర్థ
స్నానంబు లాచరించెడి మత్స్యేంద్రు నాలోకింప నమ్మత్స్యేంద్రసంభ
వుండు వసుపుంగవుం గనుంగొని తక్షణంబ పాదంబులవ్రాలి "భవదా
గమనకారణం బెయ్యదియో దయజేయు" మని వినయోక్తుల విచా
రింప వసుశ్రేష్ఠుండు నాథజనమధ్యభాగంబున నుపవిష్టుండై వేల్పుదొ
రయొనర్చు జన్నంబు తెఱంగెఱుంగించి "యయ్యది మీచే పరిపూర్తి
జెందవలయునని కుతూహలంబు గలదు. కృపామతులై పయనం
బొనర్తురుగాక" యని పలువిధంబుల బోధించి యందఱ నొడంబఱచి
నిజవిమానంబుపై గైకొని యచ్చోటుబాసి హేలాపట్టణంబున కరిగి
గోపీచందు జననియగు మైనావతీరాణిని దోడ్కొని వడవాళగ్రామంబు
ప్రవేశించి యచ్చట వటసిద్ధనాగనాథు న్వెంటగొని గౌతమీతీరం
బుజేరి భర్తరీనాథు నాహ్వానం బొనర్చికొని తామ్రపర్ణికిం జని మహా
సిద్ధుండగు చర్పటనాథు న్విమానంబున జేర్చుకొని విటాగ్రామంబున
కేగి రేవణసిద్ధనాథు న్వెంబడిగొని తదుపరి చతురశీతి యుపసిద్ధుల

దోడ్కొని ముదంబున నమరపురి జేరంజన నబ్బిడౌజుండు సపరివారం బుగ నెదురేగి సిద్ధజనసంఘంబునకు వందనంబు లాచరించి మృదువాక్యంబులచే కైవారం బొనర్చుచు ననేకవైభవంబులచే నిజభవనంబునకు గొనిపోయి మనోజ్ఞతరసింహాసనంబుల నలంకరించి వేల్పుమూక లచ్చెరువొంది నిగ్రహానుగ్రహసమర్థులగు సిద్ధజనసముదయంబుల గనుంగొనుచుండ షోడశోపచారంబుల బూజలు సల్పి ముకుళితకరకమలుండై "తపోధనులారా! హవనానుకూలస్థలం బెద్దియో సెలవొసంగరే" యన మత్స్యేంద్రవాచస్పతులు "మనోహరతరులతాపుష్పాచ్ఛాదితంబై స్వచ్ఛతరపానీయంబులచే నొప్పారు కేళాకూళులు గలిగి యనూనవైభవంబులచే దృగ్గోచరంబగు సింహళద్వీపంబున జన్నం బొనర్పవలయు" నని వాక్రుచ్చిన శచీకాంతుండు హర్షించి "తత్ప్రదేశంబున సర్వసాహిత్యం బొనగూర్పు" మని యుపరిచరవసుముఖ్యున కాజ్ఞాపింప నతండు గంధర్వసహితుండై సింహళద్వీపంబునకేగి యాటవవనంబున యజ్ఞవేదిక నిర్మించి హవనోపయోగపదార్థంబులు సిద్ధపఱచినంత మరుత్వంతుండు శచీసమేతుండై తపోమూర్తులగు సిద్ధులను వెంటగొని సపరివారంబుగ నాటవవనంబు బ్రవేశించి దంపతియుక్తుండై క్రతుప్రారంభంబు గావించి సిద్ధముఖ్యులగు నవనాథులచే హుతవహునకాహుతుల నొసంగింపుచుండ మత్స్యేంద్రనాథుండు దనమనంబున తిలోత్తమ మీననాథులం దలంచి యుపరిచరవసుశ్రేష్ఠునితో "జనకా! మీననాథుం డేతత్సింహళద్వీపంబున నెచ్చోగలం" డని విచారింప నతం డేతత్ప్రదేశంబు తిలోత్తమగ్రామసీమాంతర్గతస్థలంబె ననియు తిలోత్తమ మీననాథుల దోడితెచ్చెద నని కడువడిం జని నిజవిమానంబుపై తత్సతిసుతులం గైకొని పునరాగమతుండై మత్స్యేంద్రనాథ సమీపంబున డించిన నయ్యిరువు రన్యోన్యముఖావలోకనానందపరవశులై కొంతవడి సంభాషింప నూహించి దనబుత్త్వక్కారణంబుచౌరంగనాథ హాడభంగనాథుల కొసంగి యొకప్రదేశంబున సతిసుతులతో కుశలప్రశ్నలు విచారింపుచు మీననాథునకు నిఖిలవిద్యాభ్యాసం బొనర్పవలయునని దనహృదయంబున పుత్రమోహంబుచే జింతించి బోధింపుచుండ సురగురుండు గనుంగొని యమరాధిపునితో "నీవు దీక్షాబద్ధుండవై యుండ నేల నికార్యంబున కుపరిచరవసువు న్నియమింపు" మని

నిగదించిన నతం డయ్యర్థంబు గ్రహించి తత్క్షణంబ నిజహస్తబద్ధదీక్షా కంకణంబా వసునాయకు హస్తంబున బంధించి తానా హోమద్రవ్యంబుల కొఱకెల్ల విచారింపుచు స్వహస్తంబులచే నాథోత్తములకు షడ్రసోపేతభోజనంబు లిడుచు నతులిత భయభక్తియుక్తుండై సేవలొనరించుచుండ నయ్యమలాత్ములు పరమానందభరితులై విలసిల్లుచుండిరి. ఇట మత్స్యేంద్రనాథుం డొక వృక్షసమీపంబున నిజతనూభవునకు నిఖిలమంత్రార్థరహస్యంబులు బోధించుచుండ తత్సమయం బెఱింగి యప్పురందరుం డొక మయూరవేషంబుచే వృక్షాగ్రంబున బ్రవేశించి యయ్యమోఘరహస్యంబులం గ్రహించుచు క్రమక్రమంబున వాతాకర్షణ వాతప్రేరక దివ్యాస్త్ర ప్రయోగోపసంహారంబుల కీలెఱింగి యభ్యసించుచు నొకవత్సరం బస్సుఖంబుచే గడపి యొకసుదివసంబున వైశ్వానరునకు పూర్ణాహుతులొసంగి యాగసమాప్తి గావించి యమితానందంబున నాథముఖ్యుండగు మత్స్యేంద్రున కగ్రపూజ సల్పి తదుపరి దశమనాథుండగు మీననాథున కనేక మణిమయ దివ్యభూషణాంబరంబులు కానుక లొసంగి నవరత్నఖచిత సింహాసనాసీనులగు సిద్ధపురుషుల మధ్యప్రదేశంబున బద్ధాంజలియై వినయోక్తులచే "దయాఘనులారా! నాచే నొకన్యాయవిరుద్ధకార్యం బాచరింపఁబడియె. మత్స్యేంద్రనాథునిచే మీననాథునకు బోధింపఁబడు మంత్రార్థరహస్యంబులు మయూరరూపధరుండనై గ్రహించితి నయ్యపరాధంబు క్షమించి తన్మంత్రంబులు మూర్తివంతంబులై సిద్ధించునట్లు వరంబొసంగి కాపాడరే" యన నాథోత్తము లయ్యమరేశుని తస్కరకృత్యంబునకు క్షోభించి "యింద్రా! కృత్రిమవేషంబుచే నపహరించిన మంత్రంబులు నిష్ఫలంబులై విలసిల్లు" నని శాపం బొసంగిన నుపరిచరవసుపుంగవుండు సమోక్తులచే సిద్ధజనసమస్తాపంబు శాంతపఱచి "శాపమోచనవిధం బెఱుంగించరే" యని వేడ "నీయమరేంద్రుండు ద్వాదశాబ్దంబులు తపం బాచరించెనేని యయ్యవి సిద్ధించుం గాని నాథపంథీసిద్ధులపై తత్ప్రయోగంబులు సిద్ధించ" వని శ్రుతపఱచి విమానారూఢులై భూమికింజని నానాతీర్థంబులు సేవింపుచు విహరించుచుండిరి మత్స్యేంద్రయోగిపుంగవుండును తిలోత్తమాదేవిచే ననుజ్ఞగొని మీననాథు మైనావతీరాణి నెంటఁగొని విమానారూఢుం

డై హేలాపట్టణంబున కేతెంచి మైనావతీదేవి నచ్చో విడచి యనేక తీర్థంబులు మీననాథసహితుండై సేవించుచుండె నట నవ్వేగన్నుల సామి సహ్యాపర్వతస్థానంబున ద్వాదశవర్షంబు లఖండతపం బొనర్చుచు తత్తన్మంత్రాధిదేవతాప్రీత్యర్థంబై కమండలస్థిత మణికర్ణికాజీవనంబు ల్విడుచుచుండ నయ్యవి యింద్రాయణి నదీనామంబున ప్రవహించుచు భీమరథీ తీర్థంబున సంగమంబయ్యె నిప్పగిది శచీధవుండు తపం బాచరించి పిదప స్వస్థానంబు ప్రవేశించె నాథోత్తములు ౧౭౧౦ విక్రమశకపర్యంతం బనేకతీర్థంబులు ప్రకటరూపంబున గ్రుమ్మరుచు తదనంతరంబ గుప్తరూపంబులచే నివసించిరి. కానీపనాథుండు నిజమఠంబున నివసించెను. గర్భాద్రిపై మత్స్యేంద్రజాలంధరులు గుప్తరూపంబున సమాధియోగంబుచే నివసింప జాలంధరుండు జాన్‌పీర్‌నామంబున మత్స్యేంద్రుండు మాయబాపను యభిధానంబుచే విఖ్యాతిజెందుచుండ నప్పర్వతపార్శ్వంబున గహినీనాథుండు గైబీపీరను నామంబుచే ప్రసిద్ధినొందె. నాగనాథుండు వడవాళగ్రామంబున రేవణనాథుండు విటాగ్రామంబున గుప్తరూపంబులచే నివసించియుండ భర్తరీనాథుండు పాతాళంబున కరిగె. మీననాథుండు స్వర్గంబున కేగె. గోరక్షనాథుండు గిరనారపర్వతంబుపై దత్తాశ్రమంబున వసించె. గోపీచంద్రధర్మనాథులు స్వసామర్థ్యంబుచే వైకుంఠంబు ప్రవేశించిన శ్రీమన్నారాయణుండు మైనావతీరాణిని విమానంబుపై దోడ్కొనిజనియె. చర్పటనాథ చౌరంగనాథ హడభంగనాథులు ప్రచ్ఛన్నరూపంబులచే నింతవర కనేకమహాతీర్థంబులు సేవించుచు గ్రిమ్మరుచుండెదరు. తచ్ఛిష్యులగు చతురశీతి యుపసిద్ధులచే నాథపంథీసాంప్రదాయం బభివృద్ధిజెందుచుండెంగావున నవనాథాద్భుతచరిత్రంబు ముగియింపనయ్యె.

చత్వారింశత్యధ్యాయంబుల ఫలశ్రుతి.

ప్రథమాధ్యాయంబున మత్స్యేంద్రనాథుండు జన్మించి బదరికాశ్రమంబున తపం బొనరించుట వర్ణింపంబడియె. తత్కథాపఠనంబు సర్వరోగనివారకంబు. ద్వితీయాధ్యాయంబున శ్రీగురుదత్తాత్రేయుండు మత్స్యేంద్రనాథున కనుగ్రహం బొనఁగి సకలవిద్యాభ్యాసంబు గావింప నయ్యుత్తమశ్లోకుండు నిఖిలమంత్రసిద్ధ్యర్థంబై నాగాశ్వత్థ వృక్షస్థసర్వదేవతాప్రత్యక్షంబు వడసె గాన తదధ్యాయపారాయణంబుచే దారి

ద్రవ్యంబు దొలంగి సర్వసంపత్సమృద్ధి గలుగు తృతీయాధ్యాయంబున మత్స్యేంద్రమారుతుల యుద్ధవిశారదత్వంబు పునస్స్నేహభావకథా విశేషంబు లిఖియింపనయ్యె. తత్పఠనఫలంబుచే మారుతాత్మజుండు గృహంబున నివసించి శత్రుక్షయం బొనర్చి రక్షించు. చతుర్థాధ్యాయంబున నవ్వసుసుతుండు భైరవవర్గంబును జయించి జ్వాలాముఖీదర్శనంబు గొనియె తత్కథాపారాయణంబుచే కపటజనకృత్యంబులకు బద్ధుండు గాక విమతుల పరిభవించి కీర్తింజెందు పంచమాధ్యాయంబున మత్స్యేంద్రుండు భేతాళాష్టక దర్పంబణంచి భూతకోటిని భంజించిన చరిత్రం బభివర్ణింపంబడియె నయ్యది యనుదినంబు పఠియించు గృహంబున భూతబాధలు దొలంగు. షష్ఠాధ్యాయంబున నమ్మత్స్యేంద్రసంభవుండు మహాకాళిచే యుద్ధంబొనర్చి యద్దేవిని స్వాధీనపఱచుకొన్న విశేషంబు లిఖియింపంబడియె తత్పఠనఫలంబుచే శత్రువులు స్వవశులై మిత్రులయ్యెదరు. సప్తమాధ్యాయంబున మత్స్యేంద్రుండు ప్రతాపధుర్యుండగు వీరభద్రునిచే బవరంబొనర్చి విజయంబుగొన్న విశేషంబు దెలుపనయ్యె నయ్యది యనుదినంబు పఠియించు ధన్యాత్ములు భవబంధ విముక్తులయ్యెదరు. అష్టమాధ్యాయంబున మత్స్యేంద్రుం డహస్కరు నోటుబఱచి పాశుపతనామపృథ్వీశునకు దాశరథిదర్శనం బొసంగించిన దివ్యాఖ్యానంబు దేటపఱచనయ్యె. తత్పఠనఫలంబుచే దూరస్థమిత్రుం డరుదెంచి మనోవ్యథ బాపి కోరికల నెరవేర్చు. నవమాధ్యాయంబున గోరక్షనాథుండు జన్మించి మత్స్యేంద్రునిచే ననుగ్రహంబు బడసి గురుభక్తిపరాయణత్వంబున చక్షురింద్రియంబులు విడదీసి వడల్గొని తెచ్చిన కథావిశేషంబు బ్రకటించనయ్యె. తత్పారాయణంబుచే నఖిల విద్యాభ్యాసంబు ఘటియించి బ్రహ్మజ్ఞానంబు గలుగు దశమాధ్యాయంబున గోరక్షుండు సంజీవినీమంత్రజపధ్యానయోగంబుచే మృత్పుత్రిక నొనర్చుటయు, తన్మంత్రమహాత్వంబుచే గహినీనాథుండు జన్మించుటయు, పిదప నగ్గోరక్షుండు గురుసమేతుండై బదరికాశ్రమంబున కేగి యచ్చట తపం బొనరించుటయు, మత్స్యేంద్రనాథుండు స్త్రీరాజ్యంబు ప్రవేశించుటయు వర్ణింపఁబడియె తదధ్యాయపఠనంబుచే స్త్రీలు సుసంతానవంతులై దేహారోగ్యమును బొందియుండెదరు. ఏకాదశాధ్యాయంబున బృహద్రథకృతహోమకుండంబున జాలంధరనాథుండు జన్మించి

వర్ధిల్లుచుండు చరిత్రంబు వ్రాయనయ్యె. తత్పారాయణం బగ్నిభయ నివారకంబు. ద్వాదశాధ్యాయంబున జాలంధరనాథుం డనసూయాత్మజాతు నాథవునిచే ననుగ్రహంబు బడసి తపం బొనర్చుటయు, దిగ్గజకర్ణ రంధ్రంబున కానీపుండు జన్మించుటయు, స్పష్టపఱచనయ్యె తత్పఠనం బున సర్వదేవతాసంతుష్టియగును. త్రయోదశాధ్యాయంబున జాలంధర నాథుండు మైనావతీరాణిపై ననుగ్రహించి యమరత్వం బొసంగుట యభివర్ణింపఁబడియె. తత్పఠనంబుచే పరిపూర్ణజ్ఞానోదయం బగుట యెగాక దమపూర్వజు లుద్ధరింపఁబడియెదరు. చతుర్దశాధ్యాయంబున కపటమయ స్త్రీసమూహకృత్యంబుచే జాలంధరనాథుం డొకకూపం బునం బడి హయవిష్ఠంబుచే గప్పంబడుట విశదీకరించనయ్యె. తత్కథాపఠనంబుచే సంప్రాప్తకారాగృహులు విముక్తులయ్యెదరు. పంచద శాధ్యాయంబున కానీపుం డనిలాత్మజు నోటుబఱచి శృంగమురుడీనగ రంబున కేగి మత్స్యేంద్రనాథునిచే నాతిథ్యంబు గొనుట స్పష్టపఱచ నయ్యె. తదధ్యాయ పఠనంబున గృహంబు కలహరహితంబై యభివృద్ధినొందు షోడశాధ్యాయంబున కానీప గోపీచంద సందర్శన కథావిశే షంబు గల దయ్యది పఠియించిన దుస్స్వప్నదోషంబు హరించు. సప్త దశాధ్యాయంబున జాలంధరనాథుండు తురంగ మలపూరితకూపబ హిర్గతుండై గోపీచందున ననుగ్రహించి నాథపంథీదీక్ష యొసంగి రక్షించిన చరిత్రంబు గలదు. తత్పఠనంబుచే యోగాభ్యాసానుకూల నిర్మలచిత్తుండై ప్రఖ్యాతిగాంచు. అష్టదశాధ్యాయంబున గోపీచంద నృపాలుండు స్వనిమిత్తమృతచంపావతి దేవి శరీరంబున గురుసమర్థుం డగు జాలంధరునిచే ప్రాణంబులు నిలిపి తదుపరి బదరికాశ్రమంబున కరిగి తపం బాచరించుట దెలుపనయ్యె. తత్పఠనంబుచే బ్రహ్మహత్యా ద్యనేకపాతకంబులు దొలంగుటయెగాక పూర్వజులు నరకోద్ధారు లయ్యెదరు. ఏకోనవింశత్యధ్యాయంబున శ్రీరాముండు గోరక్షనిర్మిత దారుణాస్త్రబద్ధుండగు మరుత్సూనుసంకటంబు లెడబాపి యయ్యని లాత్మసహితుండై గోరక్షునకు దర్శనం బొసంగిన పవిత్రచరిత్రంబు గల దయ్యధ్యాయపఠనంబుచే మోక్షంబు సిద్ధించు. వింశత్యధ్యాయం బున గోరక్షుండు కళింగనామ్నీ వేశ్యకాంతాసహితుండై మత్స్యేం ద్రనాథునికై స్త్రీరాజ్యంబు ప్రవేశించిన కథాభాగంబు గల దయ్యది

పఠియించిన యున్మత్తుండు ప్రపంచజ్ఞానపరిపూర్ణుండై దేజరిల్లు. ఏక
వింశత్యధ్యాయంబున గోరక్షుం డనేక యుక్తిప్రయుక్తులచే మత్స్యేం
ద్రనాథు నచ్చోటుబాపి గొని జనియె. తదధ్యాయపఠనంబుచే బహు
జన్మార్జిత పాతకంబుల దొలంగి దివ్యలోకంబుల నివసించు. ద్వావింశత్య
ధ్యాయంబున గోరక్షుండు మీననాథుని ప్రాణంబు లపహరించి శరీ
రాంతర్భూత సిరాస్థిమాంసంబు లెడబాపి చర్మకోశనం బొనర్చి పున
రుత్థితుం జేసి మత్స్యేంద్రనాథుని సంతుష్టపఱచిన యద్భుతంబు లిఖింప
నయ్యె. తత్పఠనంబుచే నపుత్రుండు జగన్మిత్రుండగు సుపుత్రుం
బడయు. త్రయోవింశత్యధ్యాయంబున గోరక్షుండు మత్స్యేంద్రమీ
ననాథసమేతుండై గర్భాద్రి కేగి యాకొండను సువర్ణం బొనర్చి మహో
యుత్సవంబు సలిపిన చరిత్రంబు ప్రకటింపనయ్యె. తత్పారాయణం
బుచే ననేకస్వర్ణంబు లభియింతు. చతుర్వింశత్యధ్యాయంబున భర్తరీ
నాథుండు జన్మించి యవంతికానగరంబు ప్రవేశించుట యభివర్ణింపఁ
బడియె. తత్కథాపఠనంబుచే బాలహత్యాది దోషంబులు దొలంగి
పుత్రవంతుండై విలసిల్లును. పంచవింశత్యధ్యాయంబున సురోచనగం
ధర్వుండు శక్రశాపంబుచే రాసభంబై రాజుత వివాహం బాడిన
విశేషంబు దేటపఱచనయ్యె. తత్పఠనంబుచే మానవేతరజన్మంబు
లభింపదు. శాపవాక్యంబుల బాధలు దొలంగు. షడ్వింశత్యధ్యాయం
బున విక్రమభర్తరీనాథు లన్యోన్యస్నేహంబుచే మెలంగుట దెలుపన
య్యె. తత్పఠనంబుచే గోత్రహత్యాద్యనేకపాతకంబులు దొలంగు.
సప్తవింశత్యధ్యాయంబున విక్రముండు రాజ్యపట్టాభిషిక్తుం డౌట భర్త
రీనాథుండు పింగళాదేవిని వివాహం బాడి దత్తానుగ్రహపాత్రుం డౌట
వర్ణింపఁబడియె తత్పఠనంబుచే పదచ్యుతుండు పునస్స్వస్థానంబు జేరు
నష్టవస్తులాభంబు గలుగు. అష్టవింశత్యధ్యాయంబున భర్తరీనాథుండు
పింగళావియోగాకులితచిత్తుండై తపం బొనర్చుట యెఱుంగింపనయ్యె.
తచ్చరిత్రపఠనంబుచే నవివాహితుండు సుదారాలాభంబు నొందు.
ఏకోనత్రింశత్యధ్యాయంబున భర్తరీనాథుండు గోరక్షుకారుణంబున
వైరాగ్యపూర్ణుండై ప్రభాసిల్లుట విశదం బొనర్పనయ్యె. తత్పఠనం
బుచే తాపత్రయాది రోగంబులు నశించి భక్తివైరాగ్యంబులు
సిద్ధించు. త్రింశత్యధ్యాయంబున చౌరంగనాథు జన్మకథావిశేషంబు

వెల్లడియొనర్చనయ్యె. తత్పఠనంబుచే తస్కరులదృష్టి దొలఁగు. ఏకత్రింశత్యధ్యాయంబున చౌరంగనాథుండు తపంబు సల్పుట లిఖియించనయ్యె. తత్పఠనంబుచే మాంత్రికదుష్ప్రయోగంబులు నిష్ఫలంబులగును. ద్వాత్రింశత్యధ్యాయంబున మత్స్యేంద్రుండు త్రివిక్రమశరీరంబున పరకాయప్రవేశయోగంబున ప్రవేశించి రేవతీదేవికి పుత్రసంతానం బొసంగినచరిత్రం బభివర్ణింపంబడియె. తత్పఠనఫలంబుచే నపమృత్యుదోషంబులు దొలంగు. త్రయస్త్రింశత్యధ్యాయంబున గోరక్షుండు వీరభద్రుని ప్రాణంబు లపహరించి మత్స్యేంద్రుకళేబరంబు గొని తెచ్చుట విస్పష్టంబయ్యె. తత్కథాపారాయణంబుచే ధనుర్వాతాది మహారోగంబులు నశించు. చతుస్త్రింశత్యధ్యాయంబున రేవణసిద్ధుం డుదయించి దత్తానుగ్రహపాత్రుండై యొకమహాసిద్ధిం బడసిన విశేషంబు దెలుపనయ్యె. తత్కథాపఠనంబుచే నఘటితకార్యంబు సఫలంబై కీర్తినొసంగు. పంచత్రింశత్యధ్యాయంబున రేవణసిద్ధుండు దత్తానుగ్రహపరిపూర్ణుండై కైలాసంబున కేగివిప్రపుత్రులంగొని తెచ్చుట విశదీకరించనయ్యె తత్పఠనఫలంబుచే మహాపురుషసంతానంబు గలిగి పూర్వజుల నుద్ధరించు షట్త్రింశత్యధ్యాయంబున వటసిద్ధ నాగనాథజన్మకథావిశేషంబు వర్ణింపంబడియె. తత్పఠనఫలంబుచే సర్పవృశ్చికాదివిషబాధలు నశించు. సప్తత్రింశత్యధ్యాయంబున నాగనాథుండు దత్తానుగ్రహపూర్ణుండై నిఖిలవిద్యావిశారదత్వంబున మత్స్యేంద్రయోగిపుంగవుని జయించిన చరిత్రంబు గల దయ్యది పఠియింతురేని కులచ్యుతిదోషం బణంగు. అష్టత్రింశత్యధ్యాయంబున చర్పటనాథుం డుదయించి దత్తానుగ్రహంబుచే సర్వకళాసమగ్రుండై నానాతీర్థంబులు సేవించుట యెఱింగింపనయ్యె. తత్పఠనంబుచే నవజ్వరాది సర్వరోగంబులు హరించు. ఏకోనచత్వారింశత్యధ్యాయంబున చర్పటనాథుండు హరిహరేంద్రాది దేవలోకంబును నిర్జించిన యద్భుతాఖ్యానంబు వ్రాయనయ్యె. తదధ్యాయపఠనంబుచే నాలంబున జయంబు నొందెదరు. చత్వారింశత్యధ్యాయంబున సహస్రాక్షుండు మహావిద్యార్థియై నాథసంఘంబుచే హననం బొనర్చుట జగద్విఖ్యాతి యొనర్చనయ్యె. తత్పఠనశ్రవణంబులచే పుత్రపౌత్రధనధాన్యసంపత్సమృద్ధి గలిగి సర్వాభీష్టపరిపూర్ణు లయ్యెదరు. ఏకోనచత్వారింశత్యధ్యాయంబు చత్వారింశత్య

ధ్యాయంబును కల్పతరు కామధేనువులచందంబున సకలార్థంబు లొసంగును. గోరక్షుండు స్వవిరచిత కీమ్యాగర గ్రంథరాజంబున నెవ్వండేని యిమ్మహాసిద్ధపురుషచరిత్రంబును నిందించునో యుభయలోకభ్రష్టుం డగునట్లు నొక్కి వక్కాణించె నని నరహరివంశభూషణుండగు మాలూపండితుండు మహారాష్ట్రంబున లిఖయించె. సుధీమణులారా! ఈనవనాథచరిత్రంబున గల చత్వారింశత్యధ్యాయంబులు మహామంత్రంబులబోలి ఫలంబుల నొసంగు నేయధ్యాయంబు షణ్మాసంబులు పఠియింతురో పూర్వోక్తప్రకారంబుగ తదధ్యాయపారాయణఫలప్రాప్తినొందుట నిక్కంబు. ఎవ్వరేని పఠియింపకుండినను భక్తిభావంబుచే నేతద్గ్రంథరాజంబును బూజించి నవనాథాభిధానంబులు ధ్యానింపుచు నేకార్యంబు దలంచెదరో అయ్యది సిద్ధించుట నిశ్చయంబని గోరక్షసిద్ధుని వరంబు గలదు గావున నాంధ్రభాషాభిజ్ఞులకై శ్రీసీతారామచంద్రచరణకమలార్పితంబుగ వైశ్యకుల బచ్చువంశసంజాత క్రిష్టయాహ్వయపుత్రుండగు రామనాఖ్యనిచే రచియింపంబడి శాలివాహనశక (౧౮౪౦) కాళయుక్తినామసంవత్సర ఆశ్వయుజమాస శుక్లపక్ష దశమీదివసంబున ముగియింపనయ్యె.

ఇది భక్తిసార నవనాథగ్రంథరాజంబున సహస్రాక్షుండు నవసిద్ధులచే హవనం బొనర్పించి నిఖిలమంత్రార్థంబులు పరిగ్రహించిన కథావిశేషంబు చత్వారింశత్యధ్యాయము సంపూర్ణము.

శ్రీసీతారామచంద్ర చరణారవిందార్పణమస్తు.

'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము. చెన్నపురి:—1923

ఆంధ్రవచనగ్రంథములు.

	ప్రతి 1-కి రూ.	అ.
ద్వాదశోపనిషత్తులు, సంస్కృతమునకు సరియైన తెలుగు వచనము	3	0
ఆంధ్రవచనభాగవతము, ద్వాదశస్కంధములు, శ్రీశతఘంటము, వేంకటరంగశాస్త్రికృతము	6	0
డిటో 3 వాల్యములు	7	0
తిలకుగారి సెక్యూరిటీకేసు, ఉపన్యాసములు	0	14
మదనమోహన మాళవ్యగారి జీవితము, పంజాబుఅల్లరి	0	8
పంజాబుఅల్లరి, సహాయనిరాకరణోద్యమము, దేశీయమహాసభవారిచే నిర్మింపబడిన కమిటీవారి రిపోర్టుననుసరించి ఆంధ్రప్రజాసంఘమువారిచే చిత్రపటములతో ప్రకటింపబడినది.	0	8
యజుర్వేదకథాసంగ్రహము	0	8
కామధేనువుకథ	0	2
శ్రీవివేకానందవిజయము	1	12
ప్రాచీనదేశ చరిత్రలు	1	12
భారతరమణీమణులు, ప్రథమభాగము	0	12
భారతరమణీమణులు, రెండవభాగము	0	8
శ్రీవసుహాభక్తవిజయము	4	0
నీతిచంద్రిక, చిన్నయసూరిగారిది	0	8
పంచతంత్రము, వచనము, సులభశైలి	0	8
హితోపదేశము, సులభశైలి	0	12
సంగ్రహరామాయణము, శ్రీశేషాద్రిశర్మకృతము	0	10
సంగ్రహభారతము ,,	1	8
సంగ్రహభాగవతము ,,	(అచ్చగుచున్నది)	
తెనాలిరామలింగనికథలు, జీవితము	0	4
సంస్కృతనాటకకథలు, శ్రీసీతారామశాస్త్రికృతము	1	4
దశకుమారచరిత్రము, ఎనమచింతల సంజీవరాయశాస్త్రిది	1	8
మదనకామరాజుకథలు, చక్కనికూర్పు	0	14
భోజకాళిదాసకథలు, 1-వ భాగము	0	12
దక్కనుపూర్వకథలు, శ్రీసీతారామశాస్త్రికృతము	1	8
భోజునికథలు	0	8

		ప్రతి 1-కి రూ.	అ.
విక్రమార్కునికథలు		0	8
బేతాళునికథలు		0	8
పరమానంద శిష్యులకథలు		0	3
వైద్యులకథలు		0	4
తాతాచార్యులకథలు		0	6
నలుగురుమంత్రులకథలు		0	4
అయిదుగురుదొంగలకథలు		0	6
శ్రీగైక్వారుగారి ఉపన్యాసము		0	2
సూరతుకాంగ్రెస్సు ఉపన్యాసములు		0	2
శ్రీరామానుజాచార్యచరిత్ర		0	2
స్వామిరామతీర్థజీవితము		0	2
శాలివాహనచరిత్ర		0	3
శ్రీలాలాలాజ్ పతిరాయి జీవితము		0	2
రామకృష్ణపరమహంసచరిత్రము, ప్రతిమతో		0	3
బాలగంగాధరతిలకుమహారాజుగారిచరిత్రము, ప్రతిమతో		0	4
శ్రీగోపాలకృష్ణగోక్లే జీవితము, ప్రతిమతో		0	2
శ్రీమహాదేవగోవిందరానడేజీవితము	,,	0	2
శివాజీచరిత్ర,	ప్రతిమతో	0	8
శ్రీశంకరాచార్యచరిత్ర	,,	0	3
శ్రీవేమనయోగిజీవితము	,,	0	2
దాదాభాయినౌరోజీచరిత్ర	,,	0	2
శ్రీకరంచంద్ గంధిజీవితము	,,	0	4
శ్రీబుద్ధచరిత్రము	,,	0	4
నెపోలియన్ చరిత్రము	,,	0	4
సోదరినివేదితజీవితము	,,	0	2
శ్రీగైక్వారుగారిజీవితము	,,	0	2
వివేకానందస్వామిజీవితము	,,	0	2
శ్రీకృష్ణదేవరాయచరిత్ర	,,	0	3
అనిబిసెంటుచరిత్ర	,,	0	4
లార్డుక్లైవు జీవితము	,,	0	8

	ప్రతి 1-కి రూ.	అ.
మైరావణచరిత్ర, చక్కనికూర్పు	0	2
రామదాసుచరిత్ర, చక్కనికూర్పు, మంచికాగితములు, ఇందు శ్రీ రామదాసుగారి ప్రతిమకూడ కలదు.	0	12
ఈసపునీతికథలు, క్రొత్తకూర్పు 1-వ భాగము	0	6
డిటో 2-వ భాగము	0	8
అరేబియన్‌నైట్సుకథలు	1	4
రేచుక్కపగటిచుక్కకథలు	0	3
మర్యాదరామన్నకథలు	0	2
షేక్స్పియర్ నాటకకథలు	1	8
పరిహాస్యవినోదకథలు	0	12
సీతారామము, తల్లాప్రగడ, సూర్యనారాయణరావు	1	4
సత్యసేనవిజయము, శ్రీ కో. అనంతాచార్యకృతము	0	4
దుర్గేశనందని, నవల	0	8
ఐవన్హో, నవల క్రొత్తకూర్పు	0	8
మదాలస ,,	0	10
సుజనరంజని ,,	0	8
రోషినార, చరిత్రవిషయకమగు నవల	0	12
ఉన్మాదిని ,,	0	4
రాధారాణి ,,	0	4
లీల ,,	0	4
టిప్పుసుల్తాన్ ,,	1	4
అస్తమయము, నవల	1	8
రాజర్షి, రవీంద్రనాథఠాకూరుబంగాలీ నవలకు తెనుగు	0	14
తారాభాయి, చక్కనినవల	0	12
దిలారామ ,,	1	4
సాంఘికదౌర్జన్యము	0	12
ఆనందమఠ, నవల	0	12
మనోహరి, నవల, టి. యస్. రామశాస్త్రిగారిది	0	14

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,
292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ.